వాల్మీకి రామాయణము

పుల్లెల శ్రీరామచంద్రుడు

అయోధ్యా కాండము



వాల్మీకి రామాయణము

యథామూలానువాదము

అయోధ్యాకాండము

పద్మశ్రీ పురస్కృత, మహామహోపాధ్యాయ
ఆచార్య డా. పుల్లెల శ్రీరామచంద్రుడు

వాల్మీకి రామాయణము

యథామూలానువాదము

ప్రథమముద్రణ 2013

ప్రతులు 10,000

మూల్యం

(ఏడు కాండల సెట్)రూ. 495/- (US $ 15)

రచన : **ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు**

చిత్రకారుడు : బాపు

9788192771519

ప్రకాశకులు:

T.L.P Publishers
A Division of Excellent Enterprises
క్వీన్‌హౌస్, సాగర్‌సొసైటీ రోడ్,
బంజారాహిల్స్, రోడ్ నెం. 2, హైదరాబాదు - **500034.**
ఫోన్: +91 040 23542515

ముద్రణ:
కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్.

అయోధ్యాకాండ విషయసూచిక

శ్రీః

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః

శ్రీమద్రామాయణము

అయోధ్యాకాండము

మొదటి సర్గము

శ్రీరామసద్గుణవర్ణనము, దశరథుడు రాముని యువరాజును చేయవలెనని ఆలోచించుట, వివిధరాజన్యులను, పౌరులను, జానపదులను ఆలోచనమునకై రాజసభ కాహ్వానించుట.

భరతుడు మేనమామ యింటికి వెళ్ళుచు శత్రుఘ్నుని కూడ ప్రీతిపురస్సరముగా తన వెంట తీసికొనివెళ్ళెను. మేనమామ యుధాజిత్తు ఆ సోదరులను పుత్రప్రేమతో లాలించుచుండెను. మాతులగృహమునందు నివసించుచు సకలసౌఖ్యములను అనుభవించుచుండినను భరతశత్రుఘ్నులు వృద్ధుడైన తమ తండ్రిని ఎల్లప్పుడూ స్మరించుకొనుచునే ఉండిరి.(1-3)

దశరథుడు కూడ మహేంద్రవరుణులతో సమానులైన తన కుమారులు భరతశత్రుఘ్నులను సదా స్మరించుచుండెను.(4)

దశరథుడు పురుషశ్రేష్ఠులైన నలుగురు కుమారులను తన శరీరమునుండి ఆవిర్భవించిన నాలుగు బాహువులను వలె సమముగనే ప్రేమించెను. అయినను, ప్రాణులలో బ్రహ్మదేవుడు వలె సోదరులలో అధికగుణవంతుడూ, మహాతేజఃశాలీ అయిన రామునిపై తండ్రికి ప్రేమ అధికముగా ఉండెను.(5,6)

రాముడు, దృప్తుడైన రావణుని సంహరించుటకై దేవతలు ప్రార్థింపగా భూలోకములో పుట్టిన శాశ్వతుడైన విష్ణుమూర్తి కదా! అనంతతేజశ్శాలియైన కుమారుడు రామునిచేత కౌసల్య, దేవతలలో శ్రేష్ఠుడైన ఇంద్రునిచేత అదితివలె ప్రకాశించెను. రాముడు సౌందర్యశాలి. పరాక్రమవంతుడు. అసూయ లేనివాడు. గుణములచే దశరథునివంటివాడు. ఈవిధముగా అతడు భూమిపై సాటిలేని కుమారుడు కదా!(7-9)

ఎల్లపుడును ప్రశాంతచిత్తుడైన రాముడు మృదువుగానే మాటలాడును. ఎవరైన పరుషవాక్యములు పలికినను దానికి ప్రత్యుత్తరము చెప్పడు. ఎవరైననూ, ఏవిధముగానైననూ ఏ ఒక్క ఉపకారమైన చేసినచో దానికే నిండుమనస్సుతో సంతోషించును. ఎవరు ఎన్ని అపకారములు చేసినను వాటిని స్మరింపడు.(10,11)

అస్త్రాభ్యాసము చేయు సమయములందు అవకాశము లభించినపుడు రాముడు శీలవృద్ధులవద్దకును, జ్ఞానవృద్ధులవద్దకును, వయోవృద్ధులవద్దకును, సత్పురుషుల వద్దకును వెళ్ళి వారితో సంభాషించుచుండెడివాడు.(12)

రాముడు మహాబుద్ధిశాలి. మధురముగా మాటలాడువాడు. పరాక్రమవంతుడు. అయినను, తనకున్న పరాక్రమాతిశయమును చూచుకొని గర్వించనివాడు. అతడెన్నడును అసత్యమాడి ఎరుగడు. అన్ని(విషయములు) తెలిసినవాడు. పెద్దలను సగౌరవముగా ఎదురేగి పూజించువాడు. ప్రజలకు అతనిపై ఎంత ప్రేమ ఉండెడిదో అతనికి కూడ ప్రజలపై అంత ప్రేమ ఉండెడిది.(13,14)

ఆతడు దయాళువు. కోపమును జయించినవాడు. బ్రాహ్మణులకు ఎదురేగి సన్మానించువాడు. దీనులను చూచి జాలిచెందువాడు. ధర్మములన్నియు తెలిసినవాడు. ఎల్లప్పుడును తనను తన అదుపులో ఉంచుకొనువాడు. పరిశుద్ధవర్తనుడు.(15)

తన వంశమునకు తగిన బుద్ధి గల ఆ రాముడు తన క్షత్రియధర్మమును ఆచరించుటవలన కలుగు గొప్ప కీర్తిచే స్వర్గ మను ఫలము గలుగునని విశ్వసించి ఆ ధర్మము పట్ల అత్యంత ఆదరమును చూపెడివాడు.(16)

రాముడు శ్రేయస్కరములు కాని అకార్యములయందు ఆసక్తిలేనివాడు. పండితుడు. ధర్మవిరుద్ధములైన కథలయందు అభిరుచి లేనివాడు. వరుసగా యుక్తులను చూపుచు మాటలాడుటయందు బృహస్పతివంటివాడు. ఎట్టి అనారోగ్యము లేని యువకుడు. మంచి వాక్చాతుర్యము కలవాడు. అందమైన దేహము కలవాడు. ఏ దేశమునందు, ఏ కాలమునందు, ఏ పని చేయవలెనో తెలిసినవాడు. పురుషులలో ఉన్న సారమును గుర్తించగలవాడు. లోకములో జనించిన ఏకైకసత్పురుషుడు.(17,18)

ఇట్టి శ్రేష్ఠగుణములు గల రాజకుమారుడైన ఆ రామునిపై ప్రజలందరును చాల ప్రేమగలవారై, అతనిని తమ బహిఃప్రాణమునుగా భావించిరి. విద్యాభ్యాసనియమమును చక్కగా పూర్తిచేసికొని సాంగవేదనిష్ణాతుడైన రాముడు

ధనుర్వేదమునందు తండ్రిని మించి యుండెను.(19,20)

సద్వంశసంజాతుడైన ఆ రాముడు సాధుస్వభావుడు. దైన్యము లేనివాడు. సత్యమునే పలుకువాడు. ఋజుప్రవర్తనకలవాడు. ధర్మార్థజ్ఞులైన వృద్ధులగు బ్రాహ్మణులనుండి చక్కగా విద్యాబుద్ధులు నేర్చినవాడు. ధర్మార్థకామముల యథార్థస్వరూపము తెలిసినవాడు. మఱపులేనివాడు. సమయస్ఫూర్తికలవాడు. ఆ యా సమయములలో ఉపయోగించు లోకవ్యవహారోపయుక్తములైన ఆచారములందు, విశారదుడై వాటిని ఏర్పరచువాడు.(21,22)

అతడు అణకువకలవాడు. లోపలనున్న భావమును ముఖవికారాదులచే పైకి తెలియనీయనివాడు. ఆలోచనలను రహస్యముగా ఉంచువాడు. సహాయవంతుడు. అతనికి కోపము వచ్చినను, సంతోషము కలిగినను వ్యర్థము కావు. ఎప్పుడు దానము చేయవలెనో ఎప్పుడు చేయగూడదో తెలిసినవాడు.(23)

ఆ రాముడు పెద్దల విషయమున దృఢమైన భక్తికలవాడు. చపలత్వము లేని బుద్ధికలవాడు. మొండిపట్టుదల లేనివాడు. చెడ్డమాటలు పలుకనివాడు. సోమరితనముగాని, ఏమరిపాటు గాని లేనివాడు. ఇతరులలో ఉన్న దోషములనే కాక తనలో ఉన్న దోషములను కూడ గుర్తింపగలవాడు. శాస్త్రములు తెలిసినవాడు. చేసిన మేలు మరువనివాడు. పురుషుల తారతమ్యమును గ్రహింపగలవాడు. న్యాయానుసారముగా దుష్టులను నిగ్రహించుట యందును, శిష్టులను అనుగ్రహించుటయందును నేర్పుగలవాడు. సత్పురుషులను చేరదీసి రక్షించుటలో నిపుణుడు. ఎవరిని నిగ్రహించవలెనో తెలిసినవాడు. ధనము సంపాదించు ఉపాయములు తెలిసినవాడు. శాస్త్రోక్తప్రకారము వ్యయము చేయు పద్ధతి నెరిగినవాడు. (24-26)

రాముడు శాస్త్రముల సముదాయములందును, ఒకదానితో ఒకటి సంబంధించి ఉన్న(లేదా చిన్న చిన్న) విద్యలందును గొప్ప ప్రావీణ్యము సంపాదించినవాడు. అర్థధర్మముల విషయమున సరియైన జాగరూకత వహించిన పిమ్మటనే భోగములను అనుభవించెడివాడు. ఎన్నడును అలసత్వము లేనివాడు. వినోదమునకై ఉపయోగించు సంగీతనృత్యాదులలో ప్రవేశమున్నవాడు. ధనము నెట్లు వ్యయము చేయవలెనో తెలిసినవాడు. ఏనుగులను, గుఱ్ఱములను లొంగదీసుకుని వాటిని అధిరోహించుటకు సమర్థుడు.(27,28)

ప్రపంచమునందలి ధనుర్వేదవేత్తలలో శ్రేష్ఠుడైన ఆ రాముని అతిరథు

లందరును మెచ్చుకొనెడివారు. సేనను నడుపుటలో మంచి నైపుణ్యముగల ఆ రాముడు శత్రువులపై దండెత్తి వాళ్ళను సంహరించెడివాడు. కోపించిన సురాసురులు కూడ రాముని యుద్ధమునందు ఎదిరింపజాలరు. అతడు అసూయ లేనివాడు. క్రోధమును జయించినవాడు. గర్వము, మత్సరము లేనివాడు. ఏ ప్రాణినీ గూడ అవమానించడు. కాలమును బట్టి మారిపోవువాడు కాడు.(29,30)

ఇట్టి శ్రేష్ఠగుణములతో కూడిన ఆ రాజకుమారుడు ప్రజలకు తగినవాడుగా ఉండెను. మూడులోకములందును పూజ్యుడయ్యెను. ఓర్పుచేతను దానికి సంబంధించిన ఇతరసద్గుణములచేతను భూమితోను, బుద్ధిచే బృహస్పతితోను, పరాక్రమముచే దేవేంద్రునితోను సమానుడై ఉండెను. రాము డీవిధముగా ప్రజలందరికీ ఆనందమును కలిగించునవీ, తండ్రికి సంతోషము కలిగించునవీ అగు గుణములచేత, కిరణములచేత ప్రజ్వలించుచున్న సూర్యుడు వలె ప్రకాశించెను. ఆశ్రితరక్షణాది నియమసంపన్నుడును, ఎదిరింపశక్యముకాని పరాక్రమము కలవాడును, ఇంద్రాదిదిక్పాలులతో సమానుడును అగు రాముడు తనకు ప్రభువు కావలెనని భూమి కోరెను.(31-33)

సాటిలేని ఇట్టి అనేకగుణములతో కూడిన కుమారుని చూచి దశరథమహారాజు ఇట్లాలోచించెను. "నేను జీవించియుండగా రాముడు రాజగునా? నే నీ ఆనందమును అనుభవింతునా?"(34, 35)

"నా ప్రియపుత్రు డగు రాముడు రాజ్యాభిషిక్తుడు కాగా నేనెప్పుడు చూడగలనో కదా!" అను గొప్ప ప్రేమపూర్వకమగు చింత అతని మనస్సులో మెదలుచుండెను.(36)

"ప్రజల అభివృద్ధిని కోరువాడు, సకలప్రాణులను దయతో చూచువాడు అయిన రాముడు వర్షించు మేఘమువలె ప్రజలందరికి నాకంటె గూడ ఎక్కువ ప్రియుడు కదా. రాముడు పరాక్రమమునందు యమునితోను దేవేంద్రునితోను, బుద్ధియందు బృహస్పతితోను, ధైర్యమునందు పర్వతముతోను సమానుడు. నాకంటె కూడ చాల మంచి గుణములు కలవాడు. నా కుమారుడు ఈ భూమినంతను పరిపాలించుచుండగా ఈ వయస్సులో చూచి, నేను స్వర్గమును పొందెదనా?" అని ఆ మహారాజు చింతించుచుండెను.(37-39)

రామునియందు ఇంతవరకు చెప్పిన ఇతరరాజదుర్లభములైన ఈ వివిధగుణములే కాక ఇంకను ఎన్నియో శుభగుణములు చేరియున్నవి. అవి లెక్కింపరానివి. లోకములో శ్రేష్ఠమైనవి. అట్టి రాముని చూచి దశరథమహారాజు

మంత్రులతో ఆలోచించి అతనిని యువరాజును చేయవలెనని నిర్ణయించెను. స్వర్గాకాశభూములపై కనబడుచున్న ఉత్పాతములచే ఘోరమైన భయము రానున్నదని సూచింపబడుచున్న దనియు, తన శరీరము జరాజీర్ణమైపోయిన దనియు అతడు మంత్రులతో చెప్పెను. పూర్ణచంద్రుని వంటి ముఖము కలవాడును, మహాబుద్ధిశాలియు అగు రాముడు లోకప్రియు డగుటచే అతనికి పట్టాభిషేకము చేసినచో తనకెట్టి విచారము ఉండదను విషయమును గూడ గుర్తించెను.(40-43)

ధర్మాత్ముడైన ఆ దశరథమహారాజు, తనకును ప్రజలకును శ్రేయస్సుకొరకును, తనకు ఆ కార్యములు ఇష్టమగుటచేతను, సమయము వచ్చుటచేతను ఆసక్తిపూర్వకముగా రామాభిషేకార్థమై తొందరపడెను. రాజులను, నగరములలో నివసించు అధికారులను, గ్రామములలో నివసించు అధికారులను వేరు వేరుగా పిలిపించెను. తొందరలో భరతుని మాతామహుడైన కేకయరాజును గాని, జనకమహారాజును గాని పిలిపింపలేదు. వారీ శుభవార్తను తరువాత వినెదరు లెమ్మని భావించెను.(44-46)

దశరథమహారాజు, వారి నందరిని నివాసాభరణాదులతో తగు రీతిని సత్కరించి, మహారాజోచితముగా చక్కగా అలంకరించుకొని, ప్రజాపతి ప్రజలను చూచినట్లు వారిని చూచెను(కలిసెను). ఆ దశరథుడు కూర్చున్న పిమ్మట, జనులకు ప్రియులైన ఆహూతులైన ఇతరరాజు లందరు ప్రవేశించిరి. లోనికి ప్రవేశించిన ఆ రాజులు, రాజు ఒసగిన ఆసనములపై రాజాభిముఖులై, రాజాస్థాననియమములను పాటించుచు కూర్చుండిరి.(47-49)

తగు విధములగు సత్కారముల నందుకొని వినయాన్వితుడై, తన చుట్టును కూర్చొనియున్న ఆ రాజులతోడను, పురగ్రామప్రముఖులతోడను దశరథుడు దేవతాసమేతుడైన మహేంద్రుడు వలె ప్రకాశించెను.(50)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని మొదటి సర్గము సమాప్తము.

రెండవ సర్గము

దశరథుడు సభాముఖమున రాముని పట్టాభిషేకమును గూర్చి ప్రస్తావించుట, సభాసదులు హర్షముతో ఆమోదించుట.

దశరథుడు సభనంతను ఉద్దేశించి హితము, సంతోషజనకము, స్పష్టార్థము అయిన వాక్కును పలికెను. (1)

అతడు దుందుభిధ్వనివలె గంభీరమై, ప్రతిధ్వనించుచున్న గొప్ప కంఠధ్వనితో మేఘమువలె(సభామండపమును) ధ్వనింపచేయుచు, రాజలక్షణములతో కూడినదీ, మనోహరమైనదీ, సాటిలేనిదీ, మధురమైనదీ అయిన కంఠస్వరముతో రాజులతో ఇట్లనెను. (2,3)

"ఈ ఉత్తమరాజ్యములోని ప్రజలను మా పూర్వులైన రాజశ్రేష్ఠులు పుత్రులనువలె పరిపాలించి రను విషయము మీకు తెలిసినదే. నేను ఇక్ష్వాకువంశీయులైన రాజు లందరును పరిపాలించిన, సుఖమునకు తగిన ఈ జగత్తున కంతకును శ్రేయస్సు సమకూర్చ గోరుచున్నాను. (4, 5)

నేను కూడ నిత్యము జాగరూకుడనై, పూర్వులు అనుసరించిన మార్గమునే అనుసరించుచు, యథాశక్తిగా ప్రజలను రక్షించితిని. సకల ప్రజలకు హితము నాచరించుచు రాజ్యము చేయుచుండగా, నా శరీరము తెల్లని గొడుగు క్రిందనే జీర్ణమైపోయినది. ఈ శరీరము ఎన్నియో వేల సంవత్సరముల ఆయుర్దాయము పొంది, జీవించి ఇపుడు జరాజీర్ణ మైనది. అందుచే దీనికి విశ్రాంతిని కోరుచున్నాను. (6-8)

లోకమునకు సంబంధించిన ఈ ధర్మభారము చాల బరువైనది. శౌర్యధైర్యాదిరూపమగు రాజప్రభావముచేతనే నిలుపుకొనదగినది. జితేంద్రియులు కానివారు దీనిని మోయజాలరు. అట్టి ధర్మభారమును మోసి మోసి అలసిపోయితిని. అట్టి నేను, నా కాంతరంగికులైన వసిష్ఠాదిబ్రాహ్మణోత్తముల అంగీకారము పొంది, ప్రజాపాలనమునందు కుమారుని నియమించి, విశ్రాంతి తీసికొనదలచుచున్నాను. నా జ్యేష్ఠకుమారుడైన రాముడు పరాక్రమమునందు దేవేంద్రునితో సమానుడు. శత్రుపురములను జయించువాడు. అన్ని గుణములచేతను, అతడు నన్ను పోలినవాడు. (9-11)

పుష్యనక్షత్రముతో కూడిన చంద్రునివలె ప్రకాశించువాడూ, ధర్మసంరక్షకులలో



అగ్రేసరుడూ, పురుషశ్రేష్ఠుడూ అయిన రాముని, సంతోషపూర్వకముగా యౌవరాజ్యమునందు అభిషేకించగలను. రాముడు ప్రభువైనచో మూడులోకములు గూడ ఉత్తమప్రభువుకల వగును. ఇతడు గొప్ప శోభకలవాడు. అట్టి రాముడే ఈ రాజ్యమునకు తగిన ప్రభువు. నే నీ రాజ్యభారమును రామునకు అప్పగించుట ద్వారా లోకాభ్యుదయకరమగు కార్యమును వెంటనే చేసి విశ్రాంతి గైకొనెదను.(12-14)

నే నీ విషయమును గూర్చి బాగుగా ఆలోచించియే చెప్పుచున్నాను. ఇది మంచి ప్రయోజనమును సమకూర్చును అని మీకు కూడ తోచినచో అనుమతించి, నేనెట్లు చేయవలెనో చెప్పుడు. నాకోరిక ఈ విధముగా ఉన్నది. అయినను, మరొక హితకరమైన మార్గమున్నదా అని ఆలోచింపుడు. పక్షపాతము లేని మధ్యస్థులు చేసిన ఆలోచన విశిష్టముగా నుండి, తరచి తరచి చేసినదగుటచే ఎక్కువ అభ్యుదయమును కలిగించును కదా?"(15, 16)

ఈ విధముగా పలుకుచున్న దశరథమహారాజును, ఆ రాజులు సంతోషముగా అభినందించిరి. ఆ సభలోని వారు సంతోషముతో "బాగున్నది బాగున్నది" అని చేసిన మధురమైనదీ, ప్రతిధ్వనించునదీ అయిన ధ్వనిచే ఆ భవనము కంపించినట్లైనది. బ్రాహ్మణులును, జనులలో ప్రధానులుగా ఉన్న రాజులును, నగరనివాసులును, గ్రామనివాసులును ధర్మార్థములను ఎరిగిన ఆ దశరథమహారాజు అభిప్రాయమును సర్వవిధముల గ్రహించి, పిమ్మట అందరును కలసి ఆలోచించి,



మనస్సు చేతకూడ చక్కగ గ్రహించి, ఏకాభిప్రాయమునకు వచ్చి, వృద్ధుడైన ఆ రాజుతో ఇట్లనిరి.(17-20)

"మహారాజా! నీవు ఎన్నియో వేల సంవత్సరముల వయస్సుగల వృద్ధుడవు. అందుచే రాజ్యమును పాలించు యువరాజునుగా రాముని అభిషిక్తుని చేయుము. గొప్పబాహువులు గలవాడూ, రఘువంశసంజాతులలో మహావీరుడూ, మహాబలశాలీ అయిన రాముడు పట్టాభిషిక్తుడై, శ్వేతచ్ఛత్రధారియై, మహాగజము నధిష్ఠించి వెళ్ళుచుండగా చూడవలెనని మేమందరము కోరుచున్నాము."(21,22)

వారి వాక్యము విన్న దశరథుడు వారి మనస్సులోని అభీష్టము పూర్వము తెలియక ఇప్పుడు తెలియగోరుచున్నవాడు వలె,(23)

"రాజులారా! నా మాట వినగానే, మీరు, రాముడు ప్రభువు కావలెనని చెప్పుట చూచి నాకు ఎదురు చెప్పజాలక అట్లు అనుచున్నారేమో అని సంశయము కలుగుచున్నది. ఈ విషయమున యథార్థముగా మీ అభిప్రాయము తెలుపుడు. నేను ధర్మానుసారముగా భూమిని పరిపాలించుచుండగా మీ రందరును నా కుమారుడగు రాముడు యువరాజు కావలెనని ఎందుకు కోరుచున్నారు? ఇదే నా సంశయము." అని అడిగెను.(24, 25)

రాజులును, పౌరులను, జానపదులును ఆ మాటలు విని, ఆ మహాత్మునితో ఇట్లు పలికిరి. "రాజా! నీ కుమారుడైన రామునియందు అనంతములైన కల్యాణగుణము లున్నవి. సద్గుణవంతుడూ, దేవతలతో సమానుడూ, బుద్ధిమంతుడూ అయిన నీ కుమారుడైన రాముని గుణములు అందరికిని ఇష్టమైనవి; ఆనందకరమైనవి. వాటినన్నింటిని వర్ణించి చెప్పెదము; వినుము. రాజా! రాముడు దివ్యమైన గుణములచే దేవేంద్రునితో సమానుడు. సత్యమైన పరాక్రమము గలవాడు. ఇక్ష్వాకువంశములో పుట్టిన అందరు రాజులకంటె గొప్పవాడు. రాముడు లోకప్రసిద్ధుడైన సత్పురుషుడు. సత్యధర్మములందు ఆసక్తి కలవాడు. ధర్మము, లక్ష్మియు ఎన్నడును ఎడబాయకుండునట్లు చేయగలవాడు రాముడొక్కడే.(26-29)

ప్రజలకు ఆనందము కలిగించుటలో చంద్రునితోడను, క్షమాదిగుణములచే భూమితోడను, బుద్ధిచే బృహస్పతితోడను, పరాక్రమమునందు దేవేంద్రునితోడను,

అన్ని విధముల సమానుడు. రాముడు అన్ని ధర్మములు తెలిసినవాడు. సత్యసంధుడు, ఉత్తమశీలవంతుడు. అసూయ లేనివాడు. ఓర్పుగలవాడు. దుఃఖితులను ఓదార్చువాడు. మృదువైనవాడు. కృతజ్ఞుడు. ఇంద్రియములను అదుపులో ఉంచుకొన్నవాడు. సుకుమార స్వభావము కలవాడు. స్థిరమైన ఆలోచనలు కలవాడు. సర్వదా మంగళప్రదుడు. అసూయ లేనివాడు. ప్రాణులకు ప్రియములైన మాటలను పలుకువాడు. సత్యమునే చెప్పువాడు. వివిధశాస్త్రపారంగతులైన వృద్ధులైన బ్రాహ్మణుల ఉపాసన చేయువాడు. అట్లు ఉపాసన చేయుటచేతనే ఈ లోకమునందు ఈతని కీర్తి, యశస్సు, తేజస్సు వృద్ధి పొందుచున్నవి. (30-33)

దేవతలకును, అసురులకును, మానవులకును తెలిసిన అన్ని అస్త్రములందును ఇతనికి ప్రావీణ్యమున్నది. చక్కగా విద్యాభ్యాసమును పూర్తిచేసికొన్నవాడు. యథావిధిగా సాంగోపాగములైన వేదముల అధ్యయనము చేసినవాడు. సంగీతవిద్యలో రాముని మించినవా రీ లోకములో లేరు. ఇతని బంధువర్గ మంతయు అత్యుత్తమమైనది. ఇతడు సత్పురుషుడు. దైన్యము నెరుగనివాడు. గొప్ప బుద్ధికలవాడు. రాముడు ధర్మార్థములందు నైపుణ్యములు గల శ్రేష్ఠులైన బ్రాహ్మణులవద్ద అన్ని విషయములయందును శిక్షణము పొందినవాడు. గ్రామములకొరకు గాని, నగరములకొరకు గాని యుద్ధము చేయవలసి వచ్చినప్పుడు రాముడు లక్ష్మణునితో కలసి వెళ్ళి జయము లభించిన పిమ్మట తిరిగి వచ్చును. యుద్ధమునుండి తిరిగి వచ్చి, ఏనుగును గాని రథమును గాని ఎక్కి పౌరులవద్దకు వెళ్ళి వారినందరిని, బంధుజనులు అడిగినట్లును, తండ్రి పుత్రులను అడిగినట్లును, పూర్తిగా, పుత్రులు, భార్యలు, అగ్నిహోత్రాద్యనుష్ఠానములు, భృత్యులు, శిష్యగణములు మొదలగువారి విషయమున, వరుస తప్పకుండగా, కుశలప్రశ్న చేయుచుండును. (34-38)

పురుషశ్రేష్ఠుడైన రాముడు- "మీ చెప్పుచేతలలో నుండి భృత్యాదులు తమ తమ పనులు పూనికతో నిర్వర్తించుచు మీకు సేవచేయుచున్నారా?" అని కనబడినపు డెల్ల మమ్ములను ప్రశ్నించుచుండును. ఎవరికైన ఆపద వచ్చినపుడు రాముడు చాల దుఃఖించును. ఎవరికి అభివృద్ధి కలిగినను అది చూచి, పుత్రునకు కలిగిన అభివృద్ధిని చూచి తండ్రి సంతోషించినట్లు సంతోషించును. రాముడు సత్యమునే పలుకును. మహావీరుడు. పెద్దలను సేవించువాడు. ఇంద్రియములను వశమునం దుంచుకొన్నవాడు. చిరునవ్వు నవ్వుచు మాటలాడు రాముడు సర్వవిధముల ధర్మమును పరిరక్షించును. అతడు ఆశ్రితులకు మేలు సమకూర్చువాడు. కలహము పెంచుకొనుచు మాటలాడుటలో అభిరుచి లేనివాడు. యుక్తికి పైయుక్తి చూపుచు మాటలాడుటలో బృహస్పతివంటివాడు. (39-42)

లోకాభిరాముడైన ఈ రాముడు అందమైన కనుబొమ్మలు కలవాడు. విశాలమైన ఎఱ్ఱని నేత్రములు కలవాడు. శౌర్యవీర్యపరాక్రమములచేత సాక్షాత్తు విష్ణువే అన్నట్లున్నవాడు. ప్రజలను పాలించుటలోని మెలకువలు తెలిసినవాడు. ఈతని ఇంద్రియములు రాగముచే(అత్యాసక్తిచే) చెడుమార్గమును పట్టునవి కావు. ఈత డొక్కడే మూడు లోకములను కూడ పాలింప సమర్థు డన్నచో ఇంక భూలోకము మాట చెప్పవలెనా? రామునకు కోపము వచ్చినను, అనుగ్రహము కలిగినను అవి, ఎన్నడును, నిష్ఫలములు కావు. ఎవరైన నియమానుసారముగా వధ్యులైనచో వారిని చంపియే తీరును. అవధ్యుల విషయమున కోపము వహింపడు. రాముడెవ్వని విషయములో సంతోషించునో అతనికి సకలైశ్వర్యములను సమకూర్చును. కిరణములతో ప్రకాశించు సూర్యుడువలె, రాముడు శాంతములూ, సర్వప్రజలకును మనోహరములూ, మానవులకు ప్రీతిని కలిగించునవీ అయిన గుణములతో ప్రకాశించుచున్నాడు. అట్టి కల్యాణగుణములు కలవాడూ, సత్యమైన పరాక్రమము గలవాడూ, ఇంద్రాదిదిక్పాలకులతో సమానుడూ అయిన రాముడు ప్రభువు కావలె నని ప్రజలందరు కోరుచున్నారు. దశరథమహారాజా! నీ పూర్వపుణ్యవశముచే ఈ రాముడు లోకకల్యాణార్థమై నీ కుమారుడుగా జన్మించినాడు. మరీచిప్రజాపతి కుమారుడైన కాశ్యపునికి వలె ఈతనికి పుత్రున కుండవలసిన సద్గుణములన్నియు ఉన్నవి. అదికూడ నీ భాగ్యమే.(43–49)

దేవాసురమనుష్యగంధర్వోరగులలో ప్రసిద్ధమైన స్వభావము గల రామునకు ఆయురారోగ్యబలములు కలుగవలె నని రాష్ట్రములోని జనులూ, రాజధానిలోని జనులూ, దూరమునందూ, సమీపమునందూ ఉన్న జనులూ,(అంతరంగికులూ తదితరులూ కూడ) కోరుచున్నారు. వృద్ధమహిళలు, యువతులు గూడ, సమాహితచిత్తముతో, యశఃశాలియైన రాముని అభివృద్ధిని కోరుచు, సాయంప్రాతఃకాలములందు సకలదేవతలకూ నమస్కరించుచున్నారు. నీ అనుగ్రహముచే ఆ ప్రజల కోరిక తీరుగాక. ఇందీవరశ్యాముడూ, సర్వశత్రుసంహారకుడూ అయిన నీ కుమారుడు రాముడు యౌవరాజ్యాభిషిక్తుడై యుండగా చూచెదముగాక. ప్రజల కోర్కెలను దీర్చు ఓ దశరథమహారాజా! విష్ణుసమానుడూ, సర్వలోకహితాసక్తుడూ, ఉత్తమగుణసంపన్నుడూ అయిన నీ కుమారుడైన రాముని, మా హితముకొరకై, సంతోషపూర్వకముగా, శీఘ్రముగా రాజ్యాభిషిక్తుని చేయుము."(50–54)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని రెండవ సర్గము సమాప్తము.

మూడవ సర్గము

సుమంత్రుడు రాముని రాజసభకు తీసికొని వచ్చుట. దశరథుడు రామునకు హితోపదేశము చేయుట.

ఈ విధముగా పలికి ఆ పౌరజనపదశ్రేష్ఠులు పద్మముల వంటి దోసిళ్ళు కట్టి దశరథునకు నమస్కరించగా, అతడు ఆ నమస్కారములను అభినందించి వారికి ప్రియము, హితము అయిన వాక్యము పలికెను.(1)

"నా కిష్టుడైన నా జ్యేష్ఠపుత్రుడు యౌవరాజ్యాభిషిక్తుడు కావలెనని మీరందరు కోరుచుండుటచే చాలా సంతోషించుచున్నాను. నా ప్రభావము(భాగ్యము) సాటి లేని దని భావించుచున్నాను."(2)

దశరథమహారాజు ఆ సభికులందరిని ఈ విధముగా గౌరవించి, వారు వినుచుండగానే వసిష్ఠవామదేవాదిబ్రాహ్మణులతో "శోభాయుక్తమూ, పుష్పించిన అడవులు కలదీ అయిన చైత్రమాసము పుణ్యమైనది. రాముని యౌవరాజ్యముకొరకు ఏర్పాట్లు అన్నియు చేయబడుగాక." అని పలకగా జనులందరు చాల పెద్దగా సంతోషధ్వానములు చేసిరి.(3,4)

జనఘోషము మెల్లగా శాంతించినది. అపుడు దశరథుడు మునిశ్రేష్ఠుడైన వసిష్ఠునితో "పూజ్యుడా! రామాభిషేకమునకై కావలసిన పనులను, ఉపకరణములను సిద్ధముచేయుటకై తగువారిని ఆజ్ఞాపించుము." అనెను.(5, 6)

రాజు మాటలు విని, ద్విజశ్రేష్ఠుడు, దోసిళ్ళు కట్టి రాజు ఎదుట నిలచిఉన్న అధికారులను "బంగారము మొదలైనవి, పూజాద్రవ్యములు, సమస్తమైన ఓషధులు, తెల్లని పుష్పమాలలు, పేలాలు, వేరు వేరుగా తేనె-నెయ్యి, నూతనవస్త్రములు, రథము, సమస్తమైన ఆయుధములు, చతురంగసైన్యము, శుభలక్షణములు గల గజము, తెల్లని చామరము, ధ్వజము, శ్వేతచ్ఛత్రము, అగ్నివలె ప్రకాశించు నూరు బంగారు కుంభములు, బంగారు కొమ్ముల వృషభము, పూర్తిగా ఉన్న వ్యాఘ్రచర్మము వీటినన్నింటిని తెల్లవారుసరికి రాజుగారి అగ్నిహోత్రగృహములో చేర్పవలెను.(7-11)

ఇంకను ఏ చిన్న వస్తువులైనను అపేక్షితము లైనచో వాటినన్నింటిని సమకూర్చుడు. అంతఃపురద్వారములను సమస్త మైన నగరద్వారములను చందనముతో కడిగి, పుష్పమాలలచేత అలంకరించి ఘ్రాణేంద్రియమును ఆకర్షించు

ధూపములచేత సువాసన కలవాటినిగా చేయించుడు(12,13)

వేలకొలది బ్రాహ్మణులకు సమృద్ధిగా సరిపోవునదీ, మంచి గుణములు గలదీ, పెరుగు, పాలు మొదలైన నంజులతో కూడినదీ, ప్రశస్తమూ అయిన అన్నము ఏర్పరచుడు. ఆ అన్నమును రేపు ప్రాతఃకాలమునందు ద్విజముఖ్యులకు సత్కారపూర్వకముగా ఇవ్వవలెను. నెయ్యి, పెరుగు, పేలాలు, పుష్కలమైన దక్షిణలు కూడ వారికి ఇవ్వవలెను.(14, 15)

రేపు సూర్యోదయమైన వెంటనే స్వస్తివాచనము జరుగును. బ్రాహ్మణులను ఆహ్వానించి వారికి తగు ఆసనములు ఏర్పాటుచేయుడు. పురమునందు పతాకలు కట్టించి రాజవీథులను తడిపించుడు. తాళములను వేయు నటులును, బాగుగా అలంకరించుకొన్న వేశ్యాస్త్రీలును రాజప్రాసాదమునందలి రెండవ కక్ష్యకు వచ్చి యుండునట్లు చేయుడు.(16, 17)

దేవాలయములందును, చైత్యములందును పూజలు చేయవలెను గాన అచట వేరువేరుగా అన్నములు, భక్ష్యములు, దక్షిణలు, పుష్పమాలలు తీసికొని పురుషులు సిద్ధముగా నుండునట్లు చేయుడు. యోధులందరును కవచాదులు ధరించి, పరిశుభ్రమైన వస్త్రములు కట్టుకొని, దీర్ఘమైన ఖడ్గములతో, గొప్ప ఉత్సవము గల మహారాజప్రాసాదము ముంగిలిలోనికి వచ్చి యుండవలెను." అని ఆజ్ఞాపించెను. (18,19)

ఆ వసిష్ఠవామదేవులు సావధానచిత్తములతో అచట చేయవలసిన కార్యములన్నింటిని ఆజ్ఞాపించి, ఆ విషయమును దశరథునకు తెలిపి, మిగిలిన పనులు కూడ నిర్వర్తించిరి. తమ ఆజ్ఞ ప్రకారము అన్నియు జరుగుచున్నందుకు సంతృప్తి చెంది ఆనందించిన ఆ వసిష్ఠవామదేవులు రాజు దగ్గరకు వెళ్ళి– "నీవు చెప్పినట్లు అన్నియు చేయబడినవి" అని చెప్పిరి.(20, 21)

పిమ్మట దశరథుడు సుమంత్రునితో "రాముని శీఘ్రముగా తీసికొని రమ్ము" అని పలికెను.(22)

సుమంత్రుడు, రాజాజ్ఞానుసారము, మహారథికుడైన రాముని రథముపై నెక్కించుకొని అచటికి తీసికొని వచ్చుటకు వెళ్ళెను.(23)

సుమంత్రుడు రాముని తీసుకొని వచ్చుటకై వెళ్ళిన పిమ్మట, తూర్పుదేశాల రాజులూ, పడమటిదేశాల రాజులూ, ఉత్తరదేశాల రాజులూ, దక్షిణదేశాల రాజులూ,

మ్లేచ్ఛదేశాల రాజులూ, ఆర్యావర్తదేశానికి చెందిన రాజులూ, వనపర్వత ప్రాంతపాలకులైన రాజులూ, అచట కూర్చుండి దేవేంద్రుని సేవించినట్లు దశరథుని సేవించిరి. (24, 25)

దేవతామధ్యమునందున్న దేవేంద్రుడు వలె ఆ రాజుల మధ్య ప్రకాశించుచున్న రాజర్షి అయిన ఆ దశరథుడు, రథమెక్కి వచ్చుచున్న తన కుమారుని ప్రాసాదమునుండియే చూచెను. (26)

రాముడు రూపవేషాదులచే గంధర్వరాజు వలె ఉన్నాడు. అతని పౌరుషము జగద్విదితమైనది. మహాబలశాలియైన మదించిన ఏనుగువలె నడుచు అతని చేతులు చాల దీర్ఘమైనవి. చంద్రునివలె మనోహరమైన ముఖముతో చూచుటకు ముచ్చటగా ఉన్నాడు. రూపముచేతను, ఔదార్యముచేతను, ఇతరగుణములచేతను పురుషుల మనస్సులను ఆకర్షించుచున్నాడు. అట్టి రాముడు వచ్చుచుండగా చూచుచున్న దశరథమహారాజునకు ఎంత చూచినను తృప్తి కలుగలేదు. (27-29)

సుమంత్రు డా రాముని రథమునుండి దింపి, అతడు తండ్రి దగ్గరకు వెళ్ళుచుండగా, అంజలి బంధించి, అతని వెనుకనే వెళ్ళెను. (30)

నరశ్రేష్ఠుడైన రాముడు, సుమంత్రసహితుడై, తండ్రిదర్శనమునకై కైలాసశిఖరతుల్యమైన ఆ మేడను ఎక్కెను. రాముడు అంజలి ఘటించి, నమ్రుడై తండ్రిని సమీపించి, 'రామవర్మాఽ హం భో అభివాదయే' అని తన పేరు వినిపింప చేయుచు తండ్రి పాదములకు నమస్కరించెను. (31, 32)

దశరథమహారాజు, తన ప్రక్కన అంజలి ఘటించి నమ్రుడై నిలచియున్న ఆ ప్రియపుత్రుని అంజలి పట్టి దగ్గరకు లాగికొని కౌగిలించుకొని, ఉన్నతమూ, శ్రేష్ఠమూ, సువర్ణరత్నాలంకృతమూ, సుందరమూ అయిన ఉత్తమమైన ఆసనముపై కూర్చుండబెట్టెను. (33, 34)

రాముడు ఆ ఆసనశ్రేష్ఠముపై ఉపవిష్టుడై ఉదయసమయమున నిర్మలకాంతి గల సూర్యుడు మేరుపర్వతమును ప్రకాశింపచేసినట్లు ఆ ఆసనమును తన కాంతిచేత ప్రకాశింపచేసెను. నిర్మలమైన గ్రహనక్షత్రములు గల ఆకాశమును శరత్కాలమున చంద్రుడు ప్రకాశింపచేసినట్లు ఆ రాముడు తన ప్రకాశముచే ఆ సభను ప్రకాశింపచేసెను. (35, 36)

ప్రేమపాత్రుడైన తన పుత్రుని చూచుచు దశరథమహారాజు, తనను



అలంకరించుకొని, అద్దములో చూచుకొనుచు మురిసిపోయినట్లు మురిసిపోయెను.(37)

రామునివంటి ఉత్తమపుత్రు డుండుటచే పుత్రుడు కలవారిలో శ్రేష్ఠుడైన ఆ దశరథుడు చిరునవ్వుతో కుమారుని పలకరించి కాశ్యపుడు దేవేంద్రునితో పలికినట్లు ఈ వాక్యములు పలికెను.(38)

"రామా! నీవు యోగ్యురాలైన నా జ్యేష్ఠభార్యయందు పుట్టిన యోగ్యుడవైన కుమారుడవు. శ్రేష్ఠములైన గుణము లున్నవాడ వగుటచే నాకు చాలా ప్రియుడవు. నీవు నీ సద్గుణములచేత ఈ ప్రజలను రంజింపచేసితివి. అందుచే పుష్యమీనక్షత్రయుక్తమైన దివసమునందు నిన్ను యౌవరాజ్యాభిషిక్తుని చేసెదను. సహజముగనే నీవు మిక్కిలి వినయశాలివి. సద్గుణవంతుడవు. అయినను నీపై నున్న స్నేహముచే నీకు హితము బోధించుచున్నాను. ఇంకను వినయము పెంచుకొని ఎల్లపుడును ఇంద్రియములను అదుపులో పెట్టుకొనుము. కామమువలన కలుగు వ్యసనములకును, క్రోధమువలన కలుగు వ్యసనములకును దూరముగా నుండుము. పరోక్షప్రత్యక్షవృత్తులతో వ్యవహరించుచు అమాత్యులు మొదలు ప్రకృతుల నందరినీ సంతోషపెట్టుము.(39-43)

కోష్ఠాగారాయుధాగారములను చక్కగా నింపి ప్రకృతులకు ఆనందము కలిగించుచు, తనపై అనురక్తులను చేయుచు భూమిని పాలించువాని మిత్రులు అమృతము నందిన దేవతలవలె, ఆనందింతురు. అందుచే నీవు కూడ ఆత్మనిగ్రహవంతుడవై ఆ విధముగా ఆచరింపుము."(44, 45)

ఆ మాటలు విని రాముని మిత్రులు, కౌసల్యకు ప్రియము చేయవలె నను అభిప్రాయముతో శీఘ్రముగా వెళ్ళి ఆమె కీ విషయము తెలిపిరి. స్త్రీలలో ఉత్తమురాలైన ఆ కౌసల్య, ప్రియమైన వార్త తీసుకొని వచ్చిన వారందరికి బంగారము, గోవులు, వివిధరత్నములు ఇచ్చి బహూకరించెను.(46, 47)

రాముడు దశరథమహారాజుకు నమస్కరించి, రథ మధిరోహించి, జను లందరు పూజించుచుండగా, సుందరమైన తన గృహమునకు వెళ్ళెను. అపుడా

పౌరు లందరు రాజు మాటలను, తమ కత్యంతాభీష్టమైన విషయమును విని నట్లు విని, సంతసించినవారై, అతని వద్ద సెలవు గైకొని, తమ గృహములు చేరి, దేవతలను పూజించిరి.(48, 49)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని మూడవసర్గము సమాప్తము.

నాలుగవ సర్గము

రాముడు కౌసల్య భవనమునకు వెళ్లి ఆమె ఆశీస్సులు పొందుట. లక్ష్మణునితో స్నేహపూర్వకసంభాషణము చేసి స్వగృహమునకు వెళ్ళుట.

పౌరు లందరును వెళ్ళిన పిమ్మట, దశరథుడు మరల మంత్రులతో ఆలోచించి, "రేపే పుష్యమీనక్షత్రము. అందుచే నా కుమారుడైన రాముని యౌవరాజ్యమున అభిషిక్తుని చేయవలెను." అని నిశ్చయించెను.(1, 2)

అటు పిమ్మట దశరథుడు అంతఃపురమునకు వెళ్ళి, "మరల ఒకమారు రాముని ఇచటికి తీసికొని రమ్ము." అని సుమంత్రు నాజ్ఞాపించెను.(3)

సుమంత్రుడు రాజాజ్ఞానుసారముగా రాముని మరల తీసికొనివచ్చుటకై రాముని భవనమునకు వెళ్ళెను. సుమంత్రుడు మరల వచ్చినట్లుగా ద్వారపాలకులు రామునకు తెలిపిరి. అతడు వచ్చినట్లు వినగానే, రాముని మనస్సులో శంక కలిగెను. రాముడు ఆ సుమంత్రుని వెంటనే లోనికి రప్పించి, "మరల నీ వెందుకు వచ్చితివో పూర్తిగా తెలుపుము." అని పలికెను.(4-6)

సుమంత్రుడు- "దశరథమహారాజు నిన్ను చూడగోరుచున్నాడు. వెళ్ళవలెనా లేదా అను విషయమును నీవే నిర్ణయించుకొనవలెను." అని పలికెను.(7)

సుమంత్రుని మాటలు విన్న రాముడు వెంటనే బయలుదేరి, మరల దశరథమహారాజును చూచుటకై రాజప్రాసాదమునకు వెళ్ళెను.(8)

రాముడు వచ్చినట్లు విని, దశరథమహారాజు, అతని కొక ప్రియమైన విషయమును చెప్పుటకై గృహములోనికి రప్పించుకొనెను. రాముడు తండ్రి గారి భవనములోనికి ప్రవేశించి, దూరమునుండియే దోసిలికట్టి నమస్కరించి తండ్రిని చూచెను. దశరథుడు నమస్కరించుచున్న ఆ రాముని లేవదీసి కౌగిలించుకొనెను.

పిమ్మట అతనికొక అందమైన ఆసనము నిచ్చి ఇట్లనెను.(9-11)



"రామా! దీర్ఘాయుర్దాయవంతుడనైన నేనిపుడు వృద్ధుడ నైనాను. నే నింతవరకును ఇష్టమైన భోగము లనుభవించితిని. అన్నదానము, భూరిదక్షిణలు గల వందలాది యజ్ఞములు చేసితిని. ఇప్పుడు నేను నిన్ను భూలోకములో సాటిలేని సంతానముగా పొందియున్నాను. క్షత్రియధర్మములైన అధ్యయన-యజన-దానములను చేసినాను. నాకిష్టమైన సుఖములన్నియు అనుభవించితిని. యజ్ఞములు చేయుటచే దేవతాఋణమును, స్వాధ్యాయాధ్యయనముచే ఋషిఋణమును, సంతానమును కనుటచే పితృదేవతాఋణమును, దానాదులచే బ్రాహ్మణ ఋణమును తీర్చివేసితిని. ఈ విధముగా ఈ శరీరము దాల్చినందులకు చెల్లించవలసిన ఋణము లన్నింటిని చెల్లించితిని.(12-14)

నీకు రాజ్యాభిషేకము చేయుట తప్ప నేను చేయవలసినది మరేమియు లేదు. అందుచే నీవు నేను చెప్పినట్లు చేయుము. ఇపుడు నీవు రాజు కావలెనని ప్రజలందరు కోరుచున్నారు. అందుచే నిన్ను యౌవరాజ్యాభిషిక్తుని చేసెదను.(15, 16)

నే నీ దివసములలో భయంకరములైన, అమంగళకరములైన స్వప్నములు చూచుచున్నాను. పిడుగులతో కూడి, గొప్పధ్వనితో ఉల్కలు పగటియందే పడుచున్నవి. క్రూరగ్రహములైన రవి-కుజ-రాహువులు నా జన్మనక్షత్రమునాక్రమించి యున్నట్లు దైవజ్ఞులు చెప్పుచున్నారు. ఇట్టి అపశకునములు కనబడినప్పుడు, సాధారణముగా, రాజునకు మృత్యువైన వచ్చును లేదా అతనికి ఘోరమైన ఆపద సంభవించును. నా మనస్సులో మరియొక ఆలోచన కలుగుటకు పూర్వమే అభిషిక్తుడ వగుము. మానవుల మనస్సు చంచలమైనది కదా!(17-20)

నేడు చంద్రుడు పుష్యమీనక్షత్రమునకు వెనుకనున్న పునర్వసునక్షత్రముతో సంబంధించియున్నాడు. రేపు చంద్రుడు పుష్యమీనక్షత్రముతో కలిసినప్పుడు పట్టాభిషేకము చేయ నిశ్చయించిన సమయమని దైవజ్ఞులు చెప్పుచున్నారు. అందువలన నీవు పుష్యమీనక్షత్రమునందు అభిషిక్తుడ వగుము. నా మనస్సు నన్ను తొందరపెట్టుచున్నది. నిన్ను రేపు యౌవరాజ్యాభిషిక్తుని చేసెదను. అందుచే, భార్యాసమేతుడవైన నీవు ఆత్మనిగ్రహవంతుడవై, ఇది మొదలు రాత్రి అంతయు,

దర్భాసనముపై శయనించి ఉపవాసము చేయవలెను. (21-23)

ఇట్టి కార్యములకు సాధారణముగా అనేకవిఘ్నములు కలుగుచుండును. అందుచే నీ మిత్రు లందరును అప్రమత్తులై అన్ని విధముల నిన్ను రక్షింపవలెను. భరతుడు ఈ నగరమునుండి దూరముగా నుండగానే నీకు అభిషేకము జరుగవలె నని నా అభిప్రాయము. నీ సోదరుడైన భరతుడు అన్నగారిని అనుసరించియే ఉండువాడు. ధర్మబుద్ధి గలవాడు. దయాశీలుడు. ఇంద్రియనిగ్రహము గలవాడు. సత్పురుషుల మార్గమున చరించువాడు. ఇదంతయు వాస్తవమే. కాని, ధర్మనిరతులై, సన్మార్గమున వర్తించు మనుష్యుల చిత్తము కూడ చంచలము కావచ్చు నని నా అభిప్రాయము."(24-27)

దశరథుడు రేపు జరుగనున్న అభిషేకమును గూర్చి ఈ విధముగా చెప్పి నీవు వెళ్లుమని అనుజ్ఞ నీయగా రాముడు తండ్రికి నమస్కరించి తన భవనమునకు వెళ్ళెను. (28)

ఈ విధముగా దశరథమహారాజు అభిషేకమును గూర్చి చేసిన నిర్ణయమును విని రాముడు, తన గృహమునకు వెళ్ళి, వెంటనే బయలుదేరి తన తల్లి అంతఃపురమునకు వెళ్ళెను. (29)

అంతఃపురములో కౌసల్య దేవతాగృహమునందు పట్టువస్త్రములు ధరించి, ధ్యానాసక్తయై, మౌనము వహించి లక్ష్మీదేవిని ప్రార్థించుచుండగా రాముడామెను చూచెను. (30)

ప్రియమైన రామాభిషేకవార్త విని, సుమిత్రయు లక్ష్మణుడును అంతకుముందుగనే, అచటకు వచ్చి యుండిరి. సీతను కూడ రప్పించిరి. ఆ సమయమున కౌసల్య కండ్లు మూసుకొని ధ్యాననిమగ్నయై యుండెను. సుమిత్రయు, లక్ష్మణుడును, సీతయు సమీపముననే ఆమెతో పాటు కూర్చొనియుండిరి. పుష్యనక్షత్రమున పుత్రునకు యౌవరాజ్యాభిషేకము జరుగు నని విని, కౌసల్య ప్రాణాయామము చేసి, పురుషోత్తముడైన శ్రీమహావిష్ణువును ధ్యానించుచు కూర్చుండెను. (31-33)

ఆ విధముగా నియమము వహించుచున్న తల్లిని సమీపించి, నమస్కరించి, రాముడు ఆమె కానందము కలిగించునట్లు, "అమ్మా! తండ్రిగారు నన్ను ప్రజాపాలనము చేయు మని నియమించినారు. వారి ఆజ్ఞప్రకారము నాకు రేపు



రాజ్యాభిషేకము కాగలదు. సీత కూడ నాతో పాటు ఈ రాత్రియంతయు ఉపవాస ముండవలెను అని ఋత్విగుపాధ్యాయులును, తండ్రి గారును చెప్పినారు. రేపు జరగనున్న అభిషేకమునకు తగిన మంగళకృత్యము లన్నియు నాకును, సీతకును ఇపుడు చేయించుము." అని పలికెను. (34-37)

కౌసల్య చిరకాలమునుండియు కోరబడుచున్న అభిషేకవార్త విని, ఆనందబాష్పములను కార్చుచు, రామునితో మధురమైన వాక్యము పలికెను. (38)

"నాయనా! రామా! చిరకాలము జీవించుము. నీ శత్రువులు నశింతురుగాక. ఐశ్వర్యముతో కూడినవాడవై నా జ్ఞాతులను, సుమిత్ర జ్ఞాతులను ఆనందింపజేయుము. నీవు నా కుమారుడవుగా పుట్టిన నక్షత్రము చాలా మంగళకరమైనది. కావుననే సద్గుణములచేత తండ్రియైన దశరథమహారాజును ఆనందింపచేసితివి. పుండరీకాక్షుడైన శ్రీమహావిష్ణువు నారాధించుచు నేను చేసిన వ్రతోపవాసాదిక్లేశము సఫలమైనది. కావుననే ఈ ఇక్ష్వాకువంశీయుల రాజ్యలక్ష్మి నిన్నాశ్రయింపనున్నది." (39-41)

రాముడు, ఈవిధముగా పలికిన తల్లి మాటలు విని, తన ప్రక్కనే అంజలి ఘటించి నమ్రుడై కూర్చొని ఉన్న లక్ష్మణుని చూచి, చిరునవ్వుతో, "లక్ష్మణా! నాతో నీవు ఈ భూమిని పాలింపుము. నీవు నా రెండవ ప్రాణము. అట్టి నిన్ను కూడ ఈ రాజ్యలక్ష్మి వరించినది. నీకిష్టమైన భోగములను, ఇతరరాజ్యఫలములను గూడ అనుభవింపుము. నే నీ జీవితమును గాని, రాజ్యమును గాని కోరుకొనుట నీకొరకు మాత్రమే." అనెను. (42-44)

రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికి, ఇరువురు తల్లులకును నమస్కరించి, సీతకు కూడ వారి అనుమతి ఇప్పించి, సీతాసమేతుడై తన గృహమునకు వెళ్ళెను. (45)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నాలుగవ సర్గము సమాప్తము.

ఐదవ సర్గము

దశరథుడు అంతఃపురము ప్రవేశించుట.

దశరథుడు రాముని పంపివేసిన తరువాత పురోహితుడైన వసిష్ఠుని పిలిపించి, మరునాడు జరుగనున్న అభిషేకము విషయమున, "ఓ వసిష్ఠమహామునీ! నీవు వెళ్ళి, వ్రతము నవలంబించిన రామునిచేతను, సీతచేతను లక్ష్మి, కీర్తి, రాజ్యము లభించుటకై ఈనాడు ఉపవాసము చేయించుము." అని చెప్పెను.(1, 2)

పూజ్యుడైన వసిష్ఠుడు "అటులనే చేసెదను." అని రాజుతో పలికి, సిద్ధముగా ఉన్న, బ్రాహ్మణయోగ్యమైన రథము నెక్కి, రాముని గృహమునకు వెళ్ళెను.(3, 4)

ఆ మహాముని తెల్లని మేఘమువలె దట్టమైన కాంతిగల రాముని భవనమును చేరి, మూడు వాకిళ్లను రథముచేతనే ప్రవేశించెను. రాముడు తన ఇంటికి వచ్చిన, ఆ ఋషీశ్వరుని పూజించుటకై తొందరపాటుచే తొట్రుపడుచు ఇంటినుండి బైటకు వచ్చి వసిష్ఠుని రథము దగ్గరకు వెళ్ళి, స్వయముగా ఆయనను పట్టుకొని రథమునుండి క్రిందికి దింపెను.(5-7)

వసిష్ఠుడు కూడ, వినయవంతుడూ, ప్రియవచనములకు తగినవాడూ అయిన ఆ రాముని కుశలప్రశ్నలచే ప్రసన్నుని చేసికొని, అతనిని ఆనందింపజేయుచు, "రామా! నీ తండ్రి నీ విషయమున ప్రసన్నుడైనాడు. రేపు యౌవరాజ్యాభిషేకమును పొందగలవు. అందుచే నీవును, సీతయు ఈనాడు ఉపవాసము చేయవలెను. నీ తండ్రి నిన్ను ప్రేమపూర్వకముగా రేపు ప్రాతఃకాలముననే యౌవరాజ్యమునందు అభిషేకింపనున్నాడు." అని పలికెను.(8-10)

వసిష్ఠుడు రామునితో ఇట్లు పలికి, వైదేహీసహితుడైన అతనిచే అప్పుడు మంత్రపూర్వకముగా ఉపవాసము చేయించెను. పిమ్మట రాముడు రాజగురువైన ఆ వసిష్ఠుని యథోచితరీతిని పూజించెను. వసిష్ఠుడు కూడ రాముని అనుజ్ఞపొంది అతని గృహమునుండి వెళ్ళిపోయెను.(11, 12)

రాముడు కొంత సమయము ప్రియసంభాషణము చేయు మిత్రులతో గడిపి, వారిచే గౌరవింపబడినవాడై, సర్వవిధముల వారి అనుజ్ఞ పొంది అంతఃపురములోనికి వెళ్ళెను.(13)

రాముని భవనము సంతోషించిన స్త్రీపురుషులతో, మదించిన పక్షులుగలదీ,



వికసించిన పద్మములు గలదీ అయిన సరస్సువలె ప్రకాశించెను.(14)

వసిష్ఠుడు రాజభవనమువలె ఉన్న రాముని భవనమునుండి బయలుదేరి జనులతో నిండి యున్న మార్గమును చూచెను. అయోధ్యానగరమునందలి రాజమార్గము లన్నియు, కుతూహలముచే గుంపులు గుంపులుగా ఏర్పడిన జనులతో నిండి ఇరుకుగా అయినవి. అప్పుడు, తరంగములవలె ఉన్న జనసమూహముల సంఘర్షమువలన కలిగిన ధ్వనియు, హర్షధ్వనియు కలియుటచే రాజమార్గమునందలి ధ్వని సముద్రఘోషవలె ఉండెను.(15-17)

ఆ దివసమున అయోధ్యానగరమునందు అన్ని వీధులను తుడిచి నీళ్ళు చల్లిరి. వృక్షముల పంక్తులు ఏర్పరచిరి. ఇండ్లపై ధ్వజములను ఎగురవేసిరి. స్త్రీబాలవృద్ధసహితముగా అయోధ్యావాసిజనులందరును రామాభిషేకము జరుగవలెనని కోరుచు సూర్యోదయము ఎప్పుడగునా అని వేచియుండిరి. అయోధ్యానగరములో జరుగుచున్న మహోత్సవము చూచుటకై జనులందరూ ఉవ్విళ్ళూరుచుండిరి.(18-20)

వసిష్ఠు డీ విధముగా జనులతో కిక్కిరిసి యున్న రాజమార్గమును చూచుచు, ఆ జనసముదాయమును రెండు పాయలుగా విభజించుచున్నవాడు వలె రథముపై ప్రయాణము చేయుచు మెల్లగా రాజప్రాసాదమును చేరుకొనెను. అతడు, తెల్లని మేఘముచే కప్పబడిన పర్వతశిఖరమువలె నున్న ప్రాసాదమునెక్కి, బృహస్పతి దేవేంద్రుని కలిసినట్లు, ఆ దశరథుని కలిసెను.(21, 22)

వచ్చిన వసిష్ఠుని చూచి దశరథుడు సింహాసనమునుండి దిగి గౌరవపూర్వకముగా, "నేను చెప్పినట్లు చేసితివా?" అని ప్రశ్నించెను. "చేయదగినదంతయు చేసితిని." అని అతడు సమాధాన మిచ్చెను. అంతవరకును రాజుతో పాటు కూర్చొనియున్న సభాసదు లందరును, పురోహితుడైన ఆ వసిష్ఠుని గౌరవించుచు, రాజుతో పాటు తామును ఆసనములనుండి లేచిరి.(23, 24)

దశరథుడు వసిష్ఠుని అనుజ్ఞ పొంది, ఆ సభాసదులందరిని పంపివేసి, సింహము పర్వతగుహలోనికి వెళ్ళినట్లు అంతఃపురములోనికి వెళ్ళెను. అత్యుత్తమమైన

వేషము ధరించిన స్త్రీలతో ఆ అంతఃపురము దేవేంద్రుని భవనమువలె ఉండెను. అట్టి అంతఃపురమును ఇంకను ప్రకాశించునట్లు చేయుచు దశరథుడు ప్రవేశింపగానే అది తారాగణముతో నిండిన ఆకాశము పైకి చంద్రుడు వచ్చినట్లుండెను. (25,26)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఐదవ సర్గము సమాప్తము.

ఆరవ సర్గము

అయోధ్యాపౌరు లానందపరవశులై నగరమును అలంకరించుట.

వసిష్ఠుడు వెడలిపోయిన పిమ్మట రాముడు స్నానము చేసి, ఏకాగ్రమైన చిత్తము కలవాడై, విశాలమైన నేత్రములు గల సీతతో కూడ శ్రీమన్నారాయణుని ఉపాసించెను. హవిస్సు ఉన్న పాత్రను యథాశాస్త్రముగ శిరస్సుపై ధరించి, ప్రజ్వలించుచున్న అగ్నిలో, శ్రీమహావిష్ణువు నుద్దేశించి ఆజ్యము హోమము చేసెను. (1,2)

రాముడు హోమము చేయగా మిలిగిన హవిస్సు భక్షించి, నారాయణుని ధ్యానించుచు, మౌనవ్రత మవలంబించి, మనోనిగ్రహముతో, శోభాయుక్తమైన విష్ణువు ఆలయమునందు, చక్కగా పరచిన దర్భసంస్తరముపై, సీతతో కూడ శయనించెను. (3, 4)

రాముడు జామురాత్రి ఉన్న దనగా మేల్కొని, ఇంటికి పూర్తిగా అలంకరణము చేయించెను. (5)

ఆ నాల్గవ జామున సుఖకరములైన సూతమాగధవందుల మాటలు వినుచు, ప్రాతఃకాలసంధ్య నుపాసించి, నిశ్చలమైన మనస్సుతో గాయత్రీజపము చేసెను. శిరస్సు వంచి నమస్కరించి శ్రీమహావిష్ణువును స్తుతించెను. తెల్లని పట్టుబట్టలు ధరించి బ్రాహ్మణులచేత పుణ్యాహవాచనము చేయించెను. అపుడు గంభీరము, మధురము అయిన ఆ బ్రాహ్మణుల పుణ్యాహవాచనఘోష తూర్యధ్వనులతో కలసి అయోధ్యానగరమును నింపెను. (6-8)

రాముడును, సీతయు అభిషేకముకొరకై ఉపవాసముండిరని విని అయోధ్యావాసు లందరును సంతసించిరి. రామాభిషేకము జరుగనున్న దని పౌరులందరును సూర్యోదయము అయిన వెంటనే పట్టణమును అలంకరించిరి.

తెల్లని మేఘములచే కప్పబడిన శిఖరములవలె నున్న దేవాలయములమీదను, చతుష్పథములందును, వీథులలోను, దేవాలయాదులలో ఉన్న చెట్లమీదను, కోటబురుజులపైనను, అనేకవస్తువులు సమృద్ధిగా ఉన్న వర్తకుల ఆపణములందును, సంపత్సమృద్ధములై ఉన్న గృహస్థుల భవనముల మీదను, సభాభవనములపైనను, ఎత్తైన వృక్షములపైనను, ధ్వజములను, చిత్రవర్ణములైన పతాకలను ఎగురవేసిరి. (9-13)

అక్కడక్కడ నటులు అభినయములు చేయుచుండిరి. నర్తకులు నృత్యము చేయుచుండిరి. గాయకులు గానము చేయుచుండిరి. మనస్సులకును, చెవులకును సుఖకరములైన వాక్కులు వినవచ్చుచుండెను. రామాభిషేకము సమీపించుచుండగా, జనులు చతుష్పథములందును, గృహములలోను, పరస్పరము రామాభిషేకమునకు సంబంధించిన మాటలు చెప్పుకొనిరి. గుమిగూడి ముంగిళ్ళలో ఆడుకొనుచున్న బాలులుకూడ, పరస్పరము రామాభిషేకమునకు సంబంధించిన మాటలు చెప్పుకొనిరి. (14-16)

రామాభిషేకము సందర్భమున, పౌరులందరును, పుష్పములు చల్లి, ధూపముల సుగంధమును వ్యాపింపచేసి, రాజమార్గమును శోభాయుక్తము చేసిరి. రామాభిషేకాదులు పూర్తియగుసరికి రాత్రి యగునేమో అను శంకచే, ప్రకాశమును కల్పించుటకై వీథులలో అంతటను దీపవృక్షములను, అనగా వృక్షాకారములో అమర్చిన దీపములను, ఏర్పాటుచేసిరి. (17, 18)

అయోధ్యాపురములో నివసించు పౌరు లందరును పురము నీవిధముగా అలంకరించి, రాముని యౌవరాజ్యాభిషేకమును కోరుచు చతుష్పథములందును, సభాభవనములందును గుంపులు గుంపులుగా కలసి పరస్పరము ఆ విషయమును గూర్చి మాటలాడుకొనుచు, దశరథుని ప్రశంసించిరి. (19, 20)

"ఆహా! ఇక్ష్వాకువంశమును ఆనందింపచేయు ఈ దశరథుడు, తాను వృద్ధుడైన విషయమును గ్రహించి, రాముని రాజ్యమునందు అభిషేకింపనున్నాడు. ఇతడు గొప్ప మనస్సుకలవాడు. జనులలోని తారతమ్యములు తెలిసిన రాముడు రాజై చాలకాలము మనలను రక్షింపగలడు. మన మందరము ధన్యులము. మనస్సులో ఏ మాత్రము గర్వములేనివాడూ, పండితుడూ, ధర్మాత్ముడూ, సోదరులయందు ప్రేమకలవాడూ అయిన రామునకు సోదరులపై ఎంత ప్రేమయో మనపై కూడా అంత ప్రేమయే. దశరథుడు చిరకాలము జీవించుగాక! అతని అనుగ్రహముచే

యౌవరాజ్యాభిషిక్తుడైన రాముని చూడనున్నాము."(21-24)

రామునకు యౌవరాజ్యాభిషేకము జరుగగలదని విని నానాదిక్కులనుండి వచ్చిన జానపదులు, ఈవిధముగా పౌరు లందరు మాటలాడుచుండగా వినిరి.(25)

రామాభిషేకమును చూచుటకై అన్ని దిక్కులనుండీ వచ్చిన గ్రామనివాసిజనులతో అయోధ్యానగరము నిండిపోయెను. అక్కడ జనప్రవాహముల సంచారముచే కలిగిన ధ్వని, పర్వమునందు అత్యధికమైన వేగము గల సముద్రము ధ్వని వలె వినబడెను. రాముని యౌవరాజ్యాభిషేకము చూడవలెనను కోరికతో వచ్చిన జానపదులతో అంతటను నిండి యుండి, ధ్వనితో కూడిన అమరావతీసదృశమైన ఆ అయోధ్యానగరము, జలజంతువులతో నిండి ఘోషించుచున్న సముద్రమువలె ఉండెను.(26-28)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఆరవసర్గము సమాప్తము.

ఏడవ సర్గము

రామాభిషేకవార్త విని కైకేయి సంతోషముతో మంథరకు బహుమానముగా తన ఆభరణ మిచ్చుట.

పుట్టినది మొదలు కైకేయి దగ్గర నివసించుచున్న జ్ఞాతిదాసియైన మంథర, దైవవశముచే, చంద్రునితో సమానమైన తెల్లని ప్రాసాదము నెక్కెను. ఆ మంథర ప్రాసాదము పైకెక్కి అచటనుండి, రాజమార్గము లన్నియు తడిపి పూవులు చల్లి ఉన్న అయోధ్యానగరము నంతను చూచెను.(1, 2)

మంథర ప్రాసాదమెక్కి అయోధ్యను చూచుసరికి ఆ నగరమును శ్రేష్ఠమైన పతాకలతోనూ, ధ్వజములతోనూ అలంకరించిరి. జనులు నిరాటంకముగా సంచరించుటకై ప్రాకారాదులను తొలగించి, క్రొత్త మార్గములు వేయబడినవి. జను లందరును శిరఃస్నానము చేసి ఉండిరి. బ్రాహ్మణులు పుష్పమాలలను, మధురభక్ష్యములను చేత గ్రహించి మంత్రపాఠాదులు చేయుచుండిరి. దేవాలయద్వారములు వెల్లవేయుటచే తెల్లగా ప్రకాశించుచుండెను. అనేక విధములైన వాద్యములు మ్రోగుచుండెను. ఆ నగరము అత్యంతహృష్టాంతరంగులైన జనులతో నిండి వేదఘోషతో మారుమ్రోగుచుండెను. గజములూ, అశ్వములూ కూడా ఉత్సాహముతో ఉండెను. ఆబోతులు రంకెలు వేయుచుండెను. ఆనందభరితులై

పౌరు లందరును తమ తమ గృహములపై ధ్వజముల నెగురవేసిరి. (3-6)



ఒక దాది సంతోషముతో నయనములు వికసింప, తెల్లని పట్టువస్త్రమును ధరించి, సమీపముననే నిలచి యుండగా మంథర, (7)

"కౌసల్య ఎక్కువ ధనాభిలాష కల దగుటచే లుబ్ధురాలైనను, ఈనాడు అత్యంతానందముతో జనులకు ధనము దానము చేయుచున్నదేమి? జనులందరును ఇంత ఆనందముగా నుండుటకు కారణమేమి? రాజు సంతోషించి ఏమైన ఘనకార్యము చేయనున్నాడా? నాకు చెప్పుము." అని ఆమెను అడిగెను. (8, 9)

అపుడా దాది సంతోషముతో తబ్బిబ్బులగుచు, రామునకు కలుగనున్న అత్యధికమైన అభివృద్ధిని గూర్చి పరమానందముతో మంథరకు ఇట్లు చెప్పెను. (10)

"దశరథుడు, రేపు పుష్యమీనక్షత్రమునందు, దోషరహితుడైన రాముని యౌవరాజ్యాభిషిక్తుని చేయనున్నాడు."(11)

దాది మాటలు విన్న ఆ మంథర కోపావిష్టురాలై కైలాసశిఖరమువంటి ఆ ప్రాసాదమునుండి శీఘ్రముగా దిగెను. పాపాలోచన గల ఆ మంథర కోపముతో మండిపడుచు, శయనించియున్న కైకేయివద్ద కేగి, "ఓ! తెలివితక్కువదానా! పరుండి ఉన్నావేమి? లెమ్ము. నీపైకి ఆపదలు ముంచెత్తికొని వచ్చుచున్నవి. నీవు తెలిసికొనజాలకున్నావు. ఓ కైకేయీ! నీవు భర్తకు ప్రియురాల వని పైకి కనబడుటయే కాని వాస్తవమున నీ వాతనికి ఇష్టురాలవు కాదు. సౌభాగ్యవంతురాల నని(భర్త ప్రేమకు పాత్రురాలనని) బడాయి చెప్పుకొనుచున్నావు! కాని నీ సౌభాగ్యము గ్రీష్మమునందు నదీప్రవాహము వలె చంచలమైపోయినది." అని పలికెను. (12-15)

పాపపు ఆలోచనలు గల ఆ మంథర కోపముతో పలికిన పరుషవాక్యములు విని కైకేయి చాలా దిగులు చెందెను. (16)

కైకేయి మంథరతో, "ఓ మంథరా! మన క్షేమమునకు భంగము వాటిల్లినదా యేమి? నీవు దిగులుచెందిన ముఖముతో చాల దుఃఖితురాలుగా కనబడుచున్నావు." అని ప్రశ్నించెను. (17)



మాటలలో నేర్పరియైన మంథర కైకేయి పలికిన మధురాక్షరములు గల మాటలు విని, కోపించెను. ఆమె ఇంకను ఎక్కువగా విషణ్ణురాలై, కైకేయికి దుఃఖమును కలిగించుచు, రామునిపై ఆమెకు వైమనస్యమును పుట్టించుచు ఇట్లు పలికెను. (18,19)

"రాణీ! నీకు అంతులేని మహాదుఃఖము వచ్చి పడినది. దశరథుడు రాముని యౌవరాజ్యాభిషిక్తుని చేయనున్నాడు. నేను అనంతమైన దుఃఖములో మునిగిపోయినాను. నన్ను అగ్నిచే కాల్చివేయుచున్నట్లున్నది. ఈ విధముగా దుఃఖశోకములతో నిండినదాననై, నీకు హితము చేయగోరి ఇచటికి వచ్చితిని. నీకు దుఃఖము కలిగినచో నాకు గొప్ప దుఃఖము కలుగును. నీకు అభివృద్ధి కలిగినచో నాకు అభివృద్ధి లభించును. ఈ విషయమున సంశయము లేదు. (20-22)

కైకేయీ! రాజవంశములో జనించి, రాజభార్యలలో ప్రధానురాలవైనను నీవు రాజధర్మమునందలి క్రౌర్యమును తెలియజాలకున్నావేమి? నీ భర్త ధర్మాలు చెప్పుచుండును. కాని రహస్యముగా అపకారము చేయును. తియ్యగా మాటలాడుచు క్రూరముగా ప్రవర్తించును. నీవు పరిశుద్ధమైన హృదయము కలదానవగుటచే అత డీవిధముగా మోసగించుచున్నను తెలిసికొనజాలకున్నావు. నీ భర్త నీవద్దకు వచ్చి నిష్ప్రయోజనములైన మంచి మాటలు పలుకుచుండును. కాని లాభమును మాత్రము కౌసల్యకే సమకూర్చనున్నాడు. (23-25)

తల్లివలె హితము కోరుచూ, దుష్టబుద్ధిగల నీ భర్త భరతుని నీ బంధువుల

ఇంటికి పంపివేసి, రేపు ప్రాతఃకాలమున, ఏ అడ్డులును లేని రాజ్యమును రామున కివ్వనున్నాడు. నీవు సర్పమును ఒడిలో ధరించినట్లు, శత్రువును భర్త యను పేరుతో గ్రహించి యున్నావు. ఉపేక్షించిన సర్పముగాని, శత్రువుగాని ఏమి చేయునో, దశరథుడు నీ విషయమునను, నీ కుమారుని విషయమునను అదియే చేసినాడు. ఓ తెలివితక్కువదానా! నిత్యము సుఖములకు అలవాటుపడిన నిన్ను బూటకపు మాటలతో బుజ్జగించుచు ఆ పాపాత్ముడు రామునకు రాజ్యాభిషేకము చేసి నిన్ను సంతానసహితముగా నశింపచేయుచున్నాడు కదా! సమయోచితముగా నీకు హితమైన కార్యము చేయుము. చూపరులకు ఆశ్చర్యము కలిగించు సౌందర్యము కలదానా! నీ పుత్రుని, నిన్ను, నన్ను కూడ రక్షించుము."(26-30)

అంతవరకు శయనించియున్న ఆ సుందరముఖి, మంథరమాటలు విని, ఆనందభరితయై, శరత్కాలమునందలి చంద్రలేఖ వలె లేచెను. ఆమె చాలా సంతోషించి, మంథర మాటల తీరుకు ఆశ్చర్యపడుచు, ఆమెకు ఒక మంచి ఆభరణమును పారితోషికముగా ఇచ్చెను.(31, 32)

స్త్రీలలో ఉత్తమురాలైన ఆ కైకేయి మంథరకు అభరణ మిచ్చి ఆమెతో ఇట్లనెను.(33)

"మంథరా! నీవు చెప్పినది నా కత్యంతప్రియమైన విషయము. ఇది నేను ప్రియమైన వార్త చెప్పినవారి కిచ్చు పారితోషికము. అతిప్రియవార్తను తెచ్చిన నీ కింకను ఏమి ఇవ్వవలెనో చెప్పుము. నాకు రాము దన్నను, భరతు దన్నను భేదబుద్ధి లేదు. అందుచే రాజు రాముని రాజ్యాభిషిక్తుని చేయనున్నా డను విషయమున సంతోషించుచున్నాను. నీవు సంతోషమునకు తగినదానవు. నా కింతకంటె ప్రియమైనది మరొకటి లేదు. అందుచే నీవు ఇంతకంటె ప్రియమైన దానిని మరల ఎన్నడును చెప్పజాలవు. నీకు మంచి వరము ఇచ్చెదను; కోరుకొనుము."(34-36)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏడవసర్గము సమాప్తము.

ఎనిమిదవ సర్గము

రామాభిషేకము కైకేయికి కీడు కలిగించు నని మంథర కైకను భయపెట్టుట.

మంథర కైకేయిపై విసుగు చూపుచు, కోపదుఃఖములతో కూడినదై, ఆ ఆభరణమును పరిత్యజించి, ఇట్లు పలికెను.(1)

"మూఢురాలా! నీవు శోకసాగరమధ్యలో నున్నా వను విషయము తెలియక ఏమిటిది విషాదహేతువైన విషయమున సంతోషించుచున్నావు? ఇంతటి మహావ్యసనము కలిగి దుఃఖించదగిన సమయమున నీవు ఆనందించుచున్నావు. ఇది చూచి దుఃఖపీడితురాలనైన నేను నాలో నేనే నవ్వుకొనుచున్నాను. నీ తెలివితక్కువదనమును గూర్చి చాలా విచారించుచున్నాను. తెలివి గల ఏ ఆడదైనా శత్రువైన సవతికుమారునికి అభివృద్ధి కలుగుచుండగా చూచి, సంతోషించునా? ఇది మృత్యువును అభినందించుటవంటిది.(2-4)

భరతునకు కూడా తనతో సమానముగా రాజ్యాధికారమున్నది గాన రామునకు భరతుని చూచిన భయము. ఈ విషయము నాలోచించినకొలది నాకు దుఃఖము కలుగుచున్నది. మనలను చూచి భయపడినవానినుండియే మన కాపదలు వచ్చును కదా? మహాధనుర్ధరుడైన లక్ష్మణుడు సర్వవిధములచేతను రాముని ఆశ్రయించినట్లు, శత్రుఘ్నుడు భరతుని ఆశ్రయించి యున్నాడు. పుట్టుకలో దగ్గరగా నుండుటను బట్టి ఏర్పడు క్రమముచేత గూడ రాముని తరువాత రాజ్యము పొందవలసినవాడు భరతుడే. లక్ష్మణశత్రుఘ్నులు చిన్నవారు గాన వారికి రాజ్యాధికారావకాశము దూరమైనది.(5-7)

రాముడు విద్వాంసుడు. రాజనీతిదక్షుడు. కాలము మించి పోకుండగా కార్యములను సాధించువాడు. అట్టి రామునివలన నీ కుమారునకు కలుగనున్న ఆపదనుగూర్చి ఆలోచించగా నాకు వణుకు పుట్టుచున్నది. కౌసల్య చాలా అదృష్టవంతురాలు. ఆమె కుమారునకు ద్విజోత్తములు రేపు పుష్యమీనక్షత్రమునందు గొప్ప యౌవరాజ్యాభిషేకము చేయనున్నారు.(8,9)

గొప్ప అభివృద్ధిని పొంది, శత్రువులను అణచి, ప్రసిద్ధి పొందు ఆ కౌసల్యను నీవు దాసి వలె చేతులు కట్టుకొని సేవించవలసియుండును. నీ వీ విధముగా మాతో కలసి కౌసల్యకు దాసివైనచో, నీ కుమారుడు రాముని సేవకు డగును. రాముని భార్యలందరును సంతోషింపగలరు. భరతునకు క్షీణదశ కలుగుటచే నీ కోడళ్ళు

సంతోషవిహీన లయ్యెదరు."(10-12)

(ఇక్కడ "నీ కోడళ్లు" అని చెప్పి భరతునకు చాలామంది భార్యలున్నట్లు చెప్పబడినది గాన "రామస్య పరమాః స్త్రియః" అను దానికి కూడ "రాముని భార్యలు" అనియే అర్థము చెప్పవలెను. ఇది రాముడు ఏకపత్నీవ్రతుడు అను ప్రసిద్ధికి విరుద్ధముగా ఉన్నది కదా అని ఆశంక కలుగవచ్చును. దీనికి సమాధాన మేమనగా రాజులు బహుభార్యావంతులు గాన రామభరతాదులు ఇతర క్షత్రియవంశీయులవలెనే అనేక భార్యలను వివాహమాడగల రను ఉద్దేశ్యముతో (భవిష్యత్తులో) మంథర అట్లు పలికినది.)

మిక్కిలి దుఃఖితురాలై ఆవిధముగా మాటలాడుచున్న మంథరను చూచి కైకేయి రాముని గుణగణములనే స్తుతింప మొదలిడెను.(13)

"రాముడు ధర్మము లన్నియు తెలిసినవాడు. పెద్దలవలన విద్యాబుద్ధులు నేర్చినవాడు. కృతజ్ఞుడు. సత్యవచనుడు. నిర్మలమైన చరిత్ర కలవాడు. దశరథమహారాజునకు జ్యేష్ఠకుమారుడు. అందువలన అతడే యౌవరాజ్యము పొందుటకు అర్హత ఉన్నవాడు. చిరంజీవి యైన రాముడు సోదరులను, పోష్యవర్గమునకు చెందిన వారినందరినీ, తండ్రి పాలించునట్లు పాలింపగలడు. రామాభిషేకమును వినగా నీ మనస్సుకు బాధ ఎట్లు కలుగుచున్నది?(14,15)

నూరు సంవత్సరములపాటు రాముడు పాలించిన తరువాత పితృపితామహక్రమమున వచ్చుచున్న రాజ్యమును, పురుషశ్రేష్ఠుడైన భరతుడు కూడ పాలింపగలడు. మంథరా! మనకు అభ్యుదయము ప్రాప్తించినది. ఇంకను కొనసాగుచున్నది. భవిష్యత్తులో కూడ కల్యాణము జరుగనున్నది. ఇట్టి పరిస్థితిలో నీవు దుఃఖించుచున్నా వెందులకు?(16, 17)

నాకు భరతుడు ఎంత ప్రేమపాత్రుడో రాముడు కూడ అంతయే. వాస్తవమున రాముడు అధికప్రేమపాత్రుడు. అతడు కౌసల్యకంటె ఎక్కువ నన్ను సేవించుచుండును కదా? రామునకు రాజ్య మున్నచో అది భరతునికి కూడ ఉన్నట్లే. రామునకు తాను, తన సోదరులు అను భేదబుద్ధియే లేదు కదా?"(18, 19)

కైకేయి మాటలు విని మంథర చాలా దుఃఖించుచు, దీర్ఘముగాను, వేడిగాను నిట్టూర్చి, కైకేయితో ఇట్లనెను.(20)

"ఒక ప్రక్క నీవు శోకముతోనూ, ఆపదలతోను నిండిన దుఃఖసముద్రములో మునిగి పోవుచున్నావు కాని మూర్ఖత్వముచేత స్వప్రయోజనమును గుర్తింపజాలక



నిన్ను నీవే తెలిసికొనలేకున్నావు. (21)

కైకేయీ! ఇపుడు రాముడు రాజైనచో, అతని తరువాత అతని కుమారుడు రాజగును. ఈ విధముగా రాజవంశములో భరతుని పేరే లేకుండా పోవును. ఒక రాజుకున్న కుమారు లందరును రాజ్యాభిషిక్తులు కారు. అందరినీ రాజులుగా చేసినచో నీతి చెడి, గొప్ప ఉపద్రవ మేర్పడును. ఆ కారణముచేతనే రాజులు రాజ్యభారమును జ్యేష్ఠపుత్రునకు గాని, గుణవంతులైన ఇతరపుత్రులకు గాని అప్పచెప్పుచుందురు. నీ కుమారుడు, అనాథుడు వలె సుఖములనుండీ, రాజవంశమునుండీ, పూర్తిగా దూరమైపోవును. (22-25)

నేను నీ మేలు కోరి వచ్చి యుండగా నీవు నన్నర్థము చేసికొనక సవతికి అభివృద్ధి కలిగిన సందర్భమున నాకు కానుక నీయగోరుచున్నావు! నిష్కంటకమైన రాజ్యము లభించిన రాముడు భరతుని దేశాంతరమున కైన పంపివేయును, లేదా చంపివేయును. (26, 27)

నీవు భరతుని చిన్నతనమునందే మేనమామ యింటికి పంపివేసితివి. దగ్గరగా ఉన్నచో స్థావరములపై గూడ ప్రేమ కలుగును. భరతుని దూరము పంపివేసి దశరథున కాతనిపై ప్రేమ లేకుండా చేసితివి. భరతుని అనుసరించి అతని వశములో ఉండు శత్రుఘ్నుడు కూడ భరతునితో కలిసి వెళ్ళిపోయినాడు. లక్ష్మణుడు రామునాశ్రయించి, శత్రుఘ్నుడు భరతునాశ్రయించి యుండువారు కదా?

శత్రుఘ్నుడైనను ఇక్కడ ఉన్నచో భరతుని అభివృద్ధికై ప్రయత్నించెడివాడు. వనేచరులు ఖండింపవలసిన ఒక వృక్షమును, సామీప్యముచేత ఇషీక మొదలగు ముళ్ళపొదలు కప్పివేసి దానిని రక్షించిన వని వినుచున్నాము కదా. అట్లే భరతుడు ఇచటనే ఉన్నచో సామీప్యమున కలిగిన స్నేహముచే దశరథుడే అతనిని రక్షించెడివాడు. (28-30)

లక్ష్మణుడు రాముని రక్షించుచుండును; రాముడు లక్ష్మణుని రక్షించుచుండును. అశ్వినీదేవతల కున్న భ్రాతృస్నేహమువంటి వారి భ్రాతృప్రేమ లోకప్రసిద్ధమైనది. అందుచే రాముడు లక్ష్మణుని విషయమున చంపుట వంటి పాపకార్యమేమియు చేయడు. భరతుని విషయమున చేయు ననుటలో సందేహము లేదు. అందుచే నీ కుమారుడు అటు మేనమామ ఇంటినుండియే అరణ్యమునకు పోవుట మంచి దని నాకు తోచుచున్నది. ఇది నీకును హితకరమగును.(31-33)

భరతునకు ధర్మానుసారము తండ్రిగారి రాజ్యము లభించినచో నీకును, నీ వైపు బంధువులకు శ్రేయస్సు కలుగును.(34)

సుఖము లనుభవించుటకు అలవాటుపడినవాడూ, బాలుడూ అయిన నీ కుమారుడు, దాయాదుడగుటచే, రామునకు సహజశత్రువు. తన ప్రయోజనమును సాధించుకొనుటలో విఫలుడైన ఆ భరతుడు, ప్రయోజనమును సాధించుకొని అభివృద్ధిలో నున్న రాముని వశములో ఎట్లుండగలడు?(35)

అరణ్యములో సింహము గజరాజును తరిమి ఆక్రమించినట్లు రాముడు భరతుని ఆక్రమించనున్నాడు. అతనిని రక్షించుకొనుము.(36)

నేనే సౌభాగ్యవంతురాల నను గర్వముచే పూర్వము నీవు కౌసల్యను అనాదరము చేసితివి. నీ సవతియైన అట్టి కౌసల్య తన పగ తీర్చుకొనకుండునా? కైకేయీ! రాము డేనాడు, విశాలములైన సముద్రములు, పర్వతములు, పట్టణములు గల భూమికి అధిపతి యగునో ఆనాడే నీవూ, భరతుడునూ, దైన్యమునొంది అశుభమైన అవమానమునకు గురి యగుదురు. రామునకు రాజ్యాధిపత్యము లభించినతోడనే భరతునికి వినాశము తప్పదు. అందుచే నీ కుమారుడైన భరతునకు రాజ్యము లభించుటకు, శత్రువైన రాముని ఇప్పుడే పురమునుండి వెడలగొట్టుటకు ఉపాయ మాలోచింపుము."(37-39)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనిమిదవ సర్గము సమాప్తము.

తొమ్మిదవ సర్గము

మంథర దుర్బోధ తల కెక్కగా కైకేయి కోపగృహమున ప్రవేశించుట.

ఆ మాటలు వినగానే కైకేయి కోపముచే మండిపడుచున్న ముఖముతో దీర్ఘముగను, వేడిగను నిట్టూర్చి మంథరతో,(1)

"నే నిప్పుడే రాముని శీఘ్రముగా వనమునకు పంపివేసెదను. భరతునికి గూడ శీఘ్రముగా యౌవరాజ్యమునందు అభిషేకము చేయించెదను. మంథరా! భరతునకు రాజ్యము లభించుటకూ, రామునకు ఎట్టి పరిస్థితులందును లభింపకుండుటకూ ఉపాయమేది? అది ఇపు దాలోచించుము." అనెను.(2, 3)

ఆమె మాటలు విని పాపపు ఆలోచనలు గల మంథర రాముని రాజ్యలాభమును చెడగొట్టుటకై, కైకేయితో ఇట్లు పలికెను.(4)

"కైకేయీ! చాల సంతోషము. రాజ్యము నీ కుమారుడైన భరతునకు మాత్రమే లభించు ఉపాయమును చెప్పెదను. వినుము.(5)

నీకు ప్రయోజనకరమైన ఉపాయమును నానుండి వినుటకు కోరుచున్నావే? దానిని గూర్చి మరచితివా, మరవకున్నను అట్లు అభినయించుచున్నావా? నానోటినుండి వినవలెనని నీ అభిలాష అయినచో చెప్పెదను, వినుము; విని ఆలోచించుము." అని పలికెను.(6,7)

కైకేయి మంథర మాటలు వినగానే, చక్కగా పక్కవేసియున్న శయనమునుండి కొంచెము లేచి, "మంథరా! ఏ ఉపాయముచేత భరతునకే రాజ్యము లభించునో, రామున కెట్టి పరిస్థితులలోనైనను లభింపదో ఆ ఉపాయము చెప్పుము." అని అడిగెను.(8, 9)

కైకేయి ఇట్లు ప్రశ్నింపగా, పాపపు ఆలోచనలు గల, కుబ్జయైన ఆ మంథర రాముని ప్రయోజనమునకు విఘాతము కలిగించుచు, "కైకేయీ! నీ భర్తయైన దశరథుడు, పూర్వము దేవాసురయుద్ధము జరిగినప్పుడు ఇంద్రునకు సాహాయ్యము చేయుటకై, ఇతరరాజర్షులతో కలిసి, నిన్ను కూడ తీసికొని, దక్షిణమున, దండకారణ్యప్రాంతమునందు తిమిధ్వజు డను అసురునకు నివాసమైన వైజయంతీపురమునకు వెళ్ళినాడు.(10-12)

బహువిధములైన మాయలు గల, శంబరుడని ప్రసిద్ధిచెందిన ఆ మహాసురుడు

దేవతల నందరిని జయించి ఇంద్రునితో యుద్ధము చేసెను. ఆ మహాయుద్ధమునందు, బాణములచే గాయములు తగిలినవారిని, రాత్రియందు నిద్రపోవుచున్నవారిని బలముచే ఆక్రమించి రాక్షసులు చంపిరి.(13, 14)

అపుడు దశరథుడు గొప్ప యుద్ధముచేయగా ఆ మహాబాహువును, అసురులు ఆయుధములతో దేహమంతయు ముక్కముక్కలుగా అగునట్లు కొట్టిరి. స్మృతి తప్పిన నీ భర్తను,(సారథ్యము చేయుచున్న) నీవు యుద్ధరంగమునుండి తప్పించి కాపాడితివి. అక్కడ కూడా అసురులు వచ్చి ఆయుధములచే అతనిని కొట్టగా మరల రక్షించితివి.(15,16)

సంతసించిన అతడు(రెండు పర్యాయములు ప్రాణరక్షణ చేసినందుకు) నీకు రెండు వరముల నిచ్చెను. అపుడు నీవు, 'నా కెప్పుడు కావలెనో అప్పుడు కోరుకొనెదను.' అని చెప్పితివి. ఆ మహాత్ముడు సరే అనెను.(17)

దేవీ! అచట ఏమి జరిగినదో నాకేమియు తెలియదు గదా! నీవే పూర్వ మీ కథను నాకు చెప్పితివి. నీపై ఉన్న ప్రేమచే నేను మరువకుండ స్మరించుచున్నాను. అందుచే నీవు బలాత్కారముచేసి, రాముని అభిషేకమునకై చేసిన సంభారములను నిలిపివేయుము.(18,19)

భరతునికై యౌవరాజ్యపట్టాభిషేకమును, పదునాలుగు సంవత్సరములపాటు రామునకు సుదూరదేశవాసమును, రెండు వరములుగా భర్తను అడుగుము. రాముని పదునాలుగు సంవత్సరములపాటు వనమునకు పంపివేసినచో నీ కుమారుడైన భరతుడు ప్రజల హృదయములలో ప్రేమభావమును సంపాదించుకొని రాజ్యమునందు స్థిరుడైపోవును. (20,21)

కైకేయీ! ఇప్పుడు, కోపించినదానవు వలె మలినవస్త్రములు ధరించి, కోపగృహమును ప్రవేశించి, కటికనేలపై పండుకొనుము. దశరథుని చూడగనే దుఃఖించుచు, నేలపై బడి ఏడ్చుచు, అతని వైపు చూడకుము. అతనితో మాట్లాడకుము. నీవు ఎల్లప్పుడును భర్తకు ప్రియురాలవే. ఈ విషయమున నాకు సందేహము లేదు. నీకొరకై అతడు అగ్నిలో కూడ దూకగలడు.(22-24)

రాజు నీకు ఎక్కడ కోపము కలుగునో యని భయపడుచుండును. కోపించినచో నిన్ను చూడజాలడు. నీకు ప్రియమాచరించుటకై ప్రాణములను కూడ పరిత్యజించును. రాజు ఎన్నడును నీమాట జవదాటజాలడు. తెలివితక్కువదానా! నీ సౌభాగ్యబల

మెంతటిదో తెలిసికొనుము.(25, 26)

దశరథుడు నీకు మణులు, ముత్యాలు, బంగారము, వివిధరత్నాలు ఇవ్వవచ్చును. వాటిపై మాత్రము మనస్సు నుంచకుము. వాటిని తీసికొని సంతృప్తి చెందకుము. దశరథుడు దేవాసురయుద్ధమునందు నీ కే వరముల నిచ్చెనో వాటిని అతనికి గుర్తుచేయుము. దశరథుడు స్వయముగా నిన్ను నేలపైనుండి లేవదీసి నీకు కావలసినది కోరుకొమ్మని చెప్పును. అప్పుడు అతనిని కుదుటపరచి,(27-29)

'మహారాజా! పదునాలుగు సంవత్సరములు రాముని అరణ్యమునకు పంపివేయుము; భరతుని భూమికి రాజునుగా చేయుము.' అని కోరుము.(30)

రాముని పదునాలుగు సంవత్సరములు అరణ్యమునకు పంపివేయగా నీకుమారుడు వ్రేళ్ళు నిలద్రొక్కుకుని, మిగిలిన కాలము కూడ రాజ్యములో స్థిరముగా ఉండగలడు. రాముని వనమునకు పంపుటను గూడ ఒక వరముగా దశరథుని కోరుము. ఈ విధముగా నీ పుత్రుని కార్యము లన్నీ సఫలమగును. ఈ విధముగా రాముని అరణ్యవాసమునకు పంపివేసినచో అతనిలో ఉన్న ప్రజలను ఆనందింపచేయుట అనే గుణము నశించి, ప్రజలకు ఇష్టుడు కాకుండాపోవును. నీ భరతుడు రాజై, శత్రువులు నశింప సుఖముగా నుండును. రాముడు వనమునుండి తిరిగి వచ్చుసరికి బుద్ధిమంతుడైన నీ కుమారుడు మిత్రులను సంపాదించుకొని, ప్రజల నందరినీ వశములో నుంచుకొని వ్రేళ్ళుదన్ని స్థిరముగా నిలువగలడు.(31-34)

రామునకు అవసానకాలము ఆసన్నమైనది అని నే నూహించుచున్నాను. నీ వేమాత్రము భయపడక, పట్టుబట్టి, రామాభిషేకము చేయవలెనను సంకల్పమును తొలగించుము." అని ఉపదేశించెను.(35)

ఆ మంథరచే, అనర్థకరమగు విషయమును లాభకరమగునట్లు బోధింపబడిన కైకేయి, విషయమును గ్రహించి, సంతసించెను. ఆ కైకేయి స్వభావముచే మంచి ఆలోచనలు కలదే యైనను, మంథరవాక్యములకు ఆశ్చర్యము చెంది, ఒక చిన్న బాలికవలె చెడు త్రోవ తొక్కి ఆమెతో ఇట్లనెను.(36, 37)

"మంథరా! నీ వింత మంచి విషయములను చెప్పుచున్నావు. నీ వింతటి శ్రేష్ఠురాల వని నేనింతవరకును గుర్తింపజాలకపోతిని. బుద్ధిబలముచే కార్యములను నిశ్చయించుటలో నీవు ఈ భూమిపై నున్న కుబ్జలందరిలోను శ్రేష్ఠురాలవు. మంథరా!

నీవు నిత్యము నా కార్యములందు ఆసక్తి చూపు నా హితైషిణివి. నీవు చెప్పకున్నచో నాకు రాజు చేయదలచిన వంచన తెలిసి యుండెడిది కాదు.(38,39)

లోకములో ఎందరో కుబ్జలున్నారు. వారందరి అవయవనిర్మాణము చాల చెడ్డగా ఉండును. వాళ్ళు వంకరగా భయంకరముగా ఉందురు కాని నీవు గాలికి వంగిన పద్మమువలె వంగినను చూపరులకు సొగసుగా అగపడుదువు. మంచి బిగితో ఉన్న నీ వక్షఃస్థలము మూపువరకు ఎత్తుగా నున్నది. దాని క్రింద నున్న, మంచి నాభిగల ఉదరము, వక్షఃస్థలమున కున్న బిగువును చూచి, అది తనకు లేనందులకు సిగ్గపడుచున్నదా అన్నట్లు సన్నగా ఉన్నది. నిండుగా నున్న జఘనముతో చక్కగా బలిసిన స్తనములతో, నిర్మలమైన చంద్రునితో సమానమైన ముఖముతో, ఆహా! మంథరా! ఎంత గొప్పగా ప్రకాశించుచున్నావు! మంథరా! వడ్డాణముతో అలంకరించిన నీ మొల ధ్వని చేయుచున్నది. పిక్కలు వాటము తీరి ఉన్నవి. పాదములు కూడ పొడవుగా ఉన్నవి.(40-43)

మంథరా! పొడవైన తొడలు గల నీవు పట్టువస్త్రము ధరించి నా ముందు నడచుచుండగా రాజహంసవలె ప్రకాశించుచున్నావు. అసురుల ప్రభువైన శంబరునిలో ఉన్న వేయి మాయలే కాక, ఇంకను వేలకొలది మాయలు నీలో ఉన్నవి. పొడవైన రథాగ్రభాగమువలె దీర్ఘమైన నీ గూనులో, నీ ఆలోచనలు, క్షత్రియవిద్యలు, మాయలు నిక్షిప్తములై ఉన్నవి. మంథరా! రాము దరణ్యమునకు వెళ్ళి, భరతుడు రాజ్యమును పొందిన పిదప నీ గూనుకు బంగారు మాల తొడిగి అలంకరించెదను.(44-47)

నే ననుకొనిన కార్యము సిద్ధించిన పిదప, సంతుష్టురాలనై మంచి జాతికి చెందిన, బాగా పుటములు వేసిన బంగారముతో నీ గూనుకు పూత పెట్టించెదను.(48)

నీ నొసటపై శుభమైన, విచిత్రమైన బంగారు తిలకమును, అందమైన అలంకారములను చేయించెదను. మంగళకరములైన వస్త్రములు ధరించి దేవతవలె సంచరించగలవు. చంద్రునితో పోటీ పడే, సాటి లేని ముఖము గల నీవు, గర్వవంతురాలవై నీ శత్రువుల మధ్య అత్యున్నత స్థానమును పొందగలవు. నీవు నాకు చేయుచున్నట్లే, సకలాలంకారభూషిత లగు కుబ్జలు నీకు కూడ సర్వదా పాదసేవ చేసెదరు." అని ఆమెను ప్రశంసించెను.(49-52)

ఈ విధముగా ప్రశంసింపబడుచున్న మంథర, వేదిలో ఉన్న అగ్నిశిఖవలె, శుభ్రమైన శయనముపై శయనించి యున్న కైకేయితో, కైకేయీ! నీరు పోయిన తరువాత గట్టు కట్టి ప్రయోజనము లేదు. వెంటనే లేచి లాభకరమైన కార్యము

చేయుటకు పూనుకొని రాజునకు తెలియజెప్పుము; రాజుకు నీ ప్రభావము చూపుము." అనెను. (53, 54)

విశాలమైన నేత్రములు కలదీ, సౌందర్యమదముతో గర్వించినదీ, దేవీ అయిన కైకేయి, మంథర ఆ విధముగా ప్రోత్సహించగా ఆమె మాటలకు లొంగిపోయి, కొన్ని లక్షల విలువ గల ముత్యాలహారమును, అత్యధికమూల్యము గల, శుభము లైన ఇతరాలంకారములను వంటినుండి తీసివేసి, మంథరతో కూడ కోపగృహములోనికి ప్రవేశించి, బంగారు తీగవలె అచట నేలపై పరుండి మంథరతో,(55-57)

"రాముడు వనమునకు వెళ్ళిన పిదప భరతుడు రాజ్యమును పొందుట యైన జరుగవలెను; లేదా నే నిచటనే మరణించినట్లు నీవు రాజునకు చెప్పవలెను. నాకు బంగారముతో గాని, రత్నములతో గాని అలంకారములతో గాని పని లేదు. రాముడు ఏనాడు అభిషేకింపబడునో ఆనాడే నా జీవితమునకు అంతము" అనెను. (58, 59)

పిమ్మట ఆ మంథర అతితీవ్రముగా మాటలాడుచున్న ఆ కైకేయితో, ఆమెకు హితకరమూ, రామునకు సంబంధించినంతవరకు అహితము అయిన వచనమును పలుకుచు, "రాముడు రాజైనచో నీవు, నీ కుమారుడూ చాల కష్టములపా లగుదురు. అందుచే, ఓ కళ్యాణగుణవంతురాలా! నీ కుమారుడైన భరతుడు రాజ్యాభిషిక్తుడగునట్లు ప్రయత్నింపుము." అని హెచ్చరించెను. (60, 61)

ఆ కుబ్జ మాటిమాటికి వాగ్బాణములను ప్రయోగించి కొట్టగా మిక్కిలి దుఃఖించిన కైకేయి రాజుపై కోపించి, గుండెపై చేతులు వేసికొని ఆ కుబ్జ తెలివికి ఆశ్చర్యము ప్రకటించుచు, ఆమెను అనేకవిధముల ప్రశంసించెను. (62)

"మంథరా! నే నిచటనుండి యమలోకమునకు పోయినట్లు చూచి నీవు ఆ విషయమును రాజునకు తెలపనైన తెలుపవలెను, లేదా రాముడు అరణ్యమునకు వెళ్ళిన పిదప భరతుని మనోరథము సఫలము కావలెను. రాము డిచటినుండి అరణ్యమునకు వెళ్ళనిచో నాకు ఆస్తరణములతో గాని, మాలికలతోగాని, చందనముతోగాని, అంజన-పాన-భోజనాదులతో గాని, మరి దేనితోగాని, చివరకు జీవితముతోగాని పనిలేదు" అనెను. (63, 64)

కైకేయి ఈ విధముగా అతిదారుణమైన వాక్యము పలికి, ఆభరణము లన్నియు తీసివేసి, ఆస్తరణము లేని నేలపై శయనించి, క్రిందపడిన కింనరస్త్రీవలె, ఉండెను.

అత్యధికమైన కోపమనెడు చీకటి ముఖమును కప్పివేయగా, అలంకారములన్నీ తీసివేసి విమనస్కురాలై యున్న ఆ కైకేయి, చీకటి ఆవరించి, నక్షత్రములు కనబడని ఆకాశమువలె నుండెను.(65, 66)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొమ్మిదవ సర్గము సమాప్తము.

పదవ సర్గము

దశరథమహారాజు కైకేయి కోపగృహమును ప్రవేశించుట చూచి దుఃఖితుడగుట.

పాపాత్మురాలైన ఆ కుబ్జ ఈ విధముగా విపరీతబోధలు చేయగా ఆ కైకేయి, విషము పూసిన బాణముతో కొట్టిన కిన్నరస్త్రీ వలె నేలపై పరుండెను.(1)

కైకేయి, తాను చేయవలసిన పనిని చక్కగా మనస్సులో నిర్ణయించుకొని, దానినంతను మంథరకు మెల్లగా చెప్పెను. మంథర మాటలు విని మోసపోయిన ఆ కైకేయి దీనురాలై, నిశ్చయము చేసుకొన్నదై, నాగకన్య వలె దీర్ఘముగను, వేడిగను నిట్టూర్చి, తనకు సుఖము కలిగించు మార్గమును గూర్చి క్షణకాల మాలోచించెను.(2,3)

కైకేయి దృఢనిర్ణయమును విని మంథర, కార్యము సఫలమైపోయినట్లు, సంతసించెను.(4)

కైకేయి కుపితురాలై, దృఢనిశ్చయము చేసికొని, కనుబొమ్మలు ముడిపెట్టి భూమిపై పండుకొనెను. ఆమె చిత్రములైన పుష్పమాలికలను, శ్రేష్ఠములైన ఆభరణములను నేలపై విసిరివేసెను. ఆమె విసిరివేసిన మాలికలూ, ఆభరణములూ నక్షత్రములు ఆకాశమును ప్రకాశింపచేసినట్లు భూమిని ప్రకాశింపచేసినవి. ఒకటిగా ఉన్న వేణిని గట్టిగా ముడివేసి, మలినవస్త్రములను ధరించి కోపగృహములో పడి యున్న ఆ కైకేయి మరణించిన కిన్నరి వలె ఉండెను.(5-8)

దశరథుడు రాముని పట్టాభిషేకము జరుపుటకై తగు ఏర్పాట్లు చేయవలెనని ఆజ్ఞాపించి, తనకు అతిసన్నిహితులుగా ఉండు అమాత్యపురోహితాదుల అనుజ్ఞ గైకొని గృహములోనికి ప్రవేశించెను.(9)

రాజ్యపాలనకు సంబంధించిన అన్ని విషయములను చేతిలో ఉంచుకొనగలిగిన

ఆ దశరథుడు "రామాభిషేకమును గూర్చి ఇపుడు అందరికిని తెలిసిపోయినది; ఇంక ఈమెకు చెప్పకున్న బాగుండదు" అను ఉద్దేశ్యముతో లేదా "ఈ విషయము ఇప్పుడే బయటకు వచ్చినది. అందుచే ఈమె కింకను తెలిసియుండదు." అను అభిప్రాయముతో, ప్రియవార్త చెప్పదగిన కైకేయికి ఈ ప్రియవార్త చెప్పుటకై అంతఃపురమును ప్రవేశించెను.(10)

ఆ దశరథుడు కైకేయీగృహమును, చంద్రుడు తెల్లని మేఘములు గల ఆకాశములోనికి ప్రవేశించినట్లు.(11)

సకలైశ్వర్యసమృద్ధమైన తన అంతఃపురములోనికి ప్రవేశించెను గాని అచట ఉత్తమమైన శయనముపై కైకేయి మాత్రము అతనికి కనబడలేదు. ఆ అంతఃపురమునందు చిలుకలు, నెమళ్ళు పెంచబడుచుండెను. క్రౌంచహంసాదుల కూతలు వినవచ్చుచుండెను. ఆ ప్రదేశము వాద్యముల ధ్వనులతో మారుమ్రోగుచుండెను. గూనివాళ్ళు, పొట్టివాళ్ళు అయిన దాసీజనులు అచటచట సంచరించుచుండిరి. ఒక ప్రక్క చంపకాశోకాదివృక్షముల మీదుగా లతలతో అల్లబడిన చక్కని పొదరిండ్లుండెను. ఒకచోట చిత్రములు చిత్రించిన గృహము లుండెను. అక్కడక్కడ దంతములతోనూ, వెండితోనూ, బంగారముతోనూ నిర్మించిన చిన్న చిన్న అరుగులు ఒప్పుచుండెను. అన్ని ఋతువులందును పుష్పఫలముల నిచ్చు వృక్షములూ, వాటిమధ్య దిగుడుబావులు ఉండెను. అక్కడక్కడ దంత, రజత, సువర్ణ నిర్మితములైన అందమైన ఆసనములు అమర్చబడి ఉండెను. అనేకవిధములైన అన్నములు, మద్యాదిపానీయములు, పిండివంటలు సిద్ధముచేయబడి యుండెను. చక్కగా అలంకరించుకొని యున్న ఉత్తమమైన స్త్రీలతో ఆ అంతఃపురము స్వర్గలోకమువలె ప్రకాశించుచుండెను.(12-16)

కామబలముతో రతికై వచ్చిన ఆ దశరథుడు అచట ప్రియురాలైన భార్య కానరాకపోవుటచే విషణ్ణుడై అచట నున్న వారిని అడిగెను. పూర్వ మెన్నడూ కైకేయి అతడు వచ్చు అట్టి సమయమున అచట లేకుండ పోలేదు. ఆ రాజు ఎన్నడును కైకేయి లేని గృహములోనికి ప్రవేశించలేదు. ఆ రాజు, మూర్ఖురాలైన కైకేయి స్వార్థమును సాధింప కృతనిశ్చయురాలై ఉన్న దను విషయమును తెలియక, ఆమెను గూర్చి పూర్వమునందు వలెనే అచట నున్న పరిచారికల నడిగెను.(17-19)

పిమ్మట ద్వారపాలకురాలు భయపడుచు నమస్కరించి, "మహారాజా! రాణి చాల కోపముతో కోపాగారములోనికి పరుగెత్తినది." అని చెప్పెను. కైకేయి

యథాపూర్వముగా కనబడనందులకే విచారగ్రస్తుడై యున్న ఆ దశరథుడు, ప్రతీహారి మాటలు వినగనే ఇంకను విషాదగ్రస్తు డయ్యెను.(20, 21)

అతడు కోపగృహమునందు నేలపై పడియున్న ఆ కైకేయిని చూచి దుఃఖముచే దహింపబడిన ట్లాయెను. ఎట్టి పాపములు లేని అతడు పాపసంకల్పముతో నేలపై పడియున్నదీ, ప్రాణములకంటె కూడ ప్రియురాలూ అయిన యువతియైన ఆ భార్యను చూచెను. ఆ సమయమునందు ఆమె, పెరికి పారవేసిన లతవలె, పడిపోయిన దేవతవలె, క్రిందికి విసిరివేసిన కిన్నెరస్త్రీవలె, స్వర్గమునుండి జారిపడిన అప్సరసవలె, క్రిందపడిన మాయవలె, బంధించిన ఆడులేడివలె ఉండెను.(22-25)

అట్టి స్థితిలో ఉన్న కైకేయిని దశరథుడు, అరణ్యములో వేటగాడు విషము పూసిన బాణముతో కొట్టగా పడియున్న ఆడ ఏనుగును మహాగజము స్పృశించినట్లు స్నేహపూర్వకముగా స్పృశించెను.(26)

కామోద్రేకములో ఉన్న ఆ దశరథుడు, భయపడిన మనస్సుతో, కమలపత్రాక్షియైన ఆ యువతిని హస్తములచే స్పృశించి, "ఓ దేవీ! నీకు నాపై కోపము వచ్చిన విషయము నాకు తెలియదు. నిన్ను ఎవరు దూషించినారు లేదా అవమానించినారు? నీ వీ విధముగా పరాగములో శయనించుట నాకు దుఃఖకరముగా నున్నది. నీకు అన్ని శుభములను చేకూర్చు నేనుండగా, భూతావిష్టురాలవు వలె, నేలపై పరుండి ఎందుచేత నా మనస్సు కష్టపెట్టుచున్నావు?(27-29)

మంచినేర్పు గల పేరుమోసిన రాజ్యవైద్యు లెందరో ఉన్నారు. వారు నీకు ఆరోగ్యము చేకూర్చగలరు. నీ రోగ మేదియో చెప్పుము. నీవు ఎవరికి ప్రియమైన కార్యము చేయవలెనని కోరుచున్నావు? నీకు ఎవరు అపకారము చేసినారు? ఇపుడు నేనెవరికి ప్రియమును చేకూర్చవలెనో, ఎవనికి గొప్ప అప్రియము చేయవలెనో చెప్పుము.(30, 31)

కైకేయీ! ఈవిధముగా ఏడ్చి శరీరమును శుష్కింపచేసికొనకుము. నీవు చెప్పినచో చంపదగనివానిని చంపించెదను; చంపదగినవానిని విడిపించెదను. దరిద్రుని ఐశ్వర్యవంతుని చేసెదను, ఐశ్వర్యవంతుని ఏమీ లేని దరిద్రుని చేసెదను. అట్టివా రెవరో చెప్పుము.(32,33)

నేను, నాకు సంబంధించిన అందరును నీకు వశులమే. నీ అభిప్రాయమున

కే మాత్రమును వ్యతిరేకముగా ప్రవర్తించుటకు నే నంగీకరింపను. నా ప్రాణముల నిచ్చి సాధించవలసినదైనను నీవేమి కోరుచున్నావో చెప్పుము. నీకు నాపై ఎంత అధికార మున్నదో తెలిసిన నీవు ఏమాత్రము శంకింపరాదు. నేను చేసిన పుణ్యముపై ఒట్టు పెట్టుచున్నాను. నీకేది ఇష్టమో అది తప్పక చేసెదను. (34,35)

రథచక్ర మెంతవరకు తిరుగునో అంతవరకును భూమిపై నాకు అధికారమున్నది. తూర్పున ఉన్న దేశములు, సింధు-సౌవీర-సౌరాష్ట్రదేశములు దక్షిణాపథమున నున్న దేశములు, వంగ-అంగ-మగధ-మత్స్యదేశములు, కాశీ, కోసలదేశములు -ఇవన్నీ సర్వసంపదలతో నిండియున్నవి. ధనధాన్యములూ, మేకలు, గొఱ్ఱెలు మొదలగునవీ, ఇంకను అత్యధికమైన ద్రవ్యములు ఆ దేశములలో పుట్టును. ఈ ద్రవ్యములలో నీకేమీ కావలెనో కోరుకొనుము. (36-38)

ఓ శోభనాంగీ! ఎందు కిట్లు శ్రమపడెదవు? లెమ్ము, లెమ్ము. నీకు భయము కలుగుటకు కారణ మేమియో తెలుపుము. సూర్యుడు పొగమంచును తొలగించినట్లు ఆ భయహేతువును తొలగించెదను." అని పలికెను. (39)

దశరథుని మాటలు విని కైకేయి ఊరడిల్లి, అప్రియమైన రామవనవాసాదికమును చెప్పదలచి, అతనిని ఇంకను మాటలచే వేధించుటకు ఉపక్రమించెను. (40)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని పదవ సర్గము సమాప్తము.

పదకొండవ సర్గము

కైక రాజును ప్రతిజ్ఞాబద్ధుని చేసి, భరతునకు పట్టాభిషేకము, రామునకు పదునాలుగేండ్లు అరణ్యవాసము కోరుట.

మన్మథుని శరములచే కొట్టబడినవాడై కామవేగమునకు లొంగిపోయిన ఆ రాజుతో కైకేయి, (1)

"మహారాజా! నన్నెవరును పీడించలేదు. అవమానించలేదు. కాని నాకొక అభిప్రాయ మున్నది. దానిని నీవు సఫలము చేయవలెనని కోరుచున్నాను. నీవు నా అభిలాషను నెరవేర్చుటకు అంగీకరించినచో, నెరవేర్చెద నని ప్రతిజ్ఞ చేయుము. నీవు ప్రతిజ్ఞ చేసిన పిమ్మట నా కోరిక యేదియో తెలిపెదను." అని పలికెను. (2,3)

కామావిష్టుడైన దశరథుడు కొంచెము నవ్వి తెల్లని చిరునవ్వు గల ఆ కైకేయి కేశపాశమును హస్తముతో గ్రహించి, "గర్వితురాలా! ఈ లోకములో నాకు నీకంటె ఎక్కువ ప్రియమైనవారు, మనుష్యులలో శ్రేష్ఠుడైన రాముడు తప్ప మరెవ్వరును లేరని నీకు తెలియదా? రాముడు శత్రువులచే జయింప శక్యముకానివాడు, సర్వలోకప్రధానుడు, విశాలహృదయుడు, అందరికిని జీవనాధారభూతుడు. అట్టి రామునిపై ఒట్టు పెట్టుచున్నాను. నీకేమి కావలెనో చెప్పుము.(4-6)

రాముని చూడనిదే నేను క్షణకాలమైనను జీవింపజాలను. ఇది నిశ్చితము. అట్టి రామునిపై ఒట్టు పెట్టి, చెప్పిన పని చేసెదనని చెప్పుచున్నాను. నా ప్రాణములనైనను, నా ఇతరకుమారుల ప్రాణములనైనను ఒడ్డి పురుషశ్రేష్ఠుడైన రాముని క్షేమము సంపాదింప కోరుచుందును. అట్టి రామునిపై ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. నీ వచనము ప్రకారము చేసెదను.(7, 8)

మంగళప్రదురాలా! నా హృదయము క్రుంగిపోవుచున్నది. దీనిని స్పృశించి ఉద్ధరింపుము. దీని నంతను పరిశీలించి నీ వేది మంచిదని భావించుచున్నావో అది చెప్పుము. నీకు నాపై ఎంత అధికారమున్నదో తెలిసిన నీవు ఏమాత్రము శంకింపరాదు. నేను చేసిన పుణ్యముపై ఒట్టు పెట్టుచున్నాను. నీకేది ఇష్టమో అది తప్పక చేసెదను." అని ప్రతిజ్ఞచేసెను. (9,10)

భరతుని రాజ్యాభిషేకము, రామవనవాసము అను విషయములపై తీవ్రమైన ఇచ్ఛగల కైకేయి తన మనస్సులో ఉన్న ఆ అభిప్రాయమును తెలుపుచు పక్షపాతబుద్ధితోను, ఆనందముతోను కూడినదై, ఉచ్చరించుటకు కూడ తగని వచనము పలికెను. దశరథుని మాటలకు సంతోషించి, కైకేయి హటాత్తుగా వచ్చి పడిన మృత్యువువలె అతిభయంకరమైన మనస్సులోని అభిప్రాయమును అతనికి తెలిపెను.(11, 12)

"నీవు వరుసగా ఒట్టులు పెట్టుచు నాకు వరముల నిచ్చుచు పలికిన ఈ మాటలను, అగ్నిదేవునితో సహా ముప్పది ముగ్గురు దేవతలు వినెదరుగాక. సూర్యచంద్రులు, ఆకాశము, గ్రహములు, రాత్రి, పగలు, దిక్కులు, జగత్తు, ఈ భూమి, గంధర్వులు, రాక్షసులు, రాత్రి సంచరించు భూతములు, గృహదేవతలు, ఇంకను ఇతరమైన భూతములు నీ మాటలను వినెదరుగాక. సత్యసంధుడూ, మహాతేజశ్శాలి, ధర్మముల నెరిగినవాడూ, సావధానచిత్తుడూ అయిన ఈ దశరథమహారాజు నాకు వర మిచ్చుచున్నాడు. నా నిమిత్తమై (అనగా నాకు



సాక్షులుగా ఉండుటకై) దేవత లందరును, ఈ వరప్రదానవచనమును విందురుగాక." (13-16)

కైకేయి ఇట్లు దశరథుడు తన మాట వినునట్లు చేసికొని, అతనిని ఉబ్బవేసి, అటు పిమ్మట, వరము లిచ్చుటకు సిద్ధముగా నున్న, కామమోహితుడైన అతనితో, "రాజా! పూర్వము దేవాసురయుద్ధమునందు ఏమయినదో జ్ఞప్తికి తెచ్చుకొనుము. అచట శత్రువు నీ ప్రాణములు తప్ప రథతురగాయుధాదుల నన్నింటిని నశింపచేసెను. మహారాజా! అచట నేను నిన్ను రక్షించితిని. అందువలన నీవు నిన్ను రక్షించుటకై అతిజాగరూకతతో ప్రయత్నించిన నాకు వరము ఇచ్చియున్నావు. సత్యప్రతిజ్ఞుడవైన మహారాజా! నీ దగ్గరనే దాచుటకై ఉంచిన నీ విచ్చిన ఆ వరములనే ఇపుడు కోరుచున్నాను. నీవు ప్రతిజ్ఞ చేసిన ఆ వరదానము ధర్మానుసారముగా ఇవ్వవలెను. అట్లు ఇవ్వక నన్నవమానించినచో ఇప్పుడే ప్రాణములు విడిచెదను." అని పలికెను. (17-21)

ఈ విధముగా కైకేయి మాటల మాత్రమునకే లొంగిపోయిన దశరథుడు, లేడి పాశములో దూరినట్లు, అమె పన్నిన మాయాపాశములో, ఆత్మవినాశమునకై దూరెను. అనగా అట్లే ఇచ్చెద నని చెప్పెను. (22)

పిమ్మట కామమోహితుడై వరముల నిచ్చుటకు అంగీకరించిన ఆ దశరథునితో

కైకేయి– "పృథ్వీపతి వైన మహారాజా! ఆనాడు నీవు నాకిచ్చిన వరములను ఇప్పుడే కోరెదను. వినుము. రాముని రాజ్యాభిషిక్తుని చేయుటకై సంభారము లన్నియు సమకూర్చబడినవి కదా! ఈ అభిషేకసంభారములతోనే నా కుమారుడైన భరతుని రాజ్యాభిషిక్తుని చేయవలెను.(23, 24)

ఆనాడు దేవాసురయుద్ధమునందు సంతోషించిన నీవు నాకిచ్చిన రెండవ వరమునకు తగు సమయ మిపుడు వచ్చినది. రాముడు పదునాలుగు సంవత్సరములపాటు దండకారణ్యములో నివసించుచు, నారచీరలు, మృగాజినము, జటలు ధరించి, మునివృత్తి నవలంబించుగాక. భరతునకు ఇపుడే శత్రుబాధ లేవియు లేని యౌవరాజ్యము లభింపవలెను. ఇదే నా గొప్ప దైన కోరిక. పూర్వము నీవిచ్చిన వరమునే ఇప్పుడు కోరుచున్నాను. రాము డీనాడే వనవాసమునకు వెళ్ళుచుండగా నేను చూడవలెను. రాజులకు రాజు వైన దశరథమహారాజా! ఈ ప్రతిజ్ఞ నిలబెట్టుకొని, కులమును, శీలమును, జన్మను రక్షించుకొనుము. సత్యవాక్యమే మానవులకు పరలోకవాసమునందు సౌఖ్యము కలిగించునది అని తపోధనులు చెప్పుదురు కదా." అని పలికెను.(25–29)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని పదకొండవ సర్గము సమాప్తము.

పన్నెండవ సర్గము

దశరథుడు చింతించుట. అట్టి వరములు కోరవలదని కైకేయిని ప్రార్థించుట.

అతిదారుణమైన కైకేయి మాటలు విని దశరథమహారాజు చింతాక్రాంతుడై, క్షణకాలము పాటు తపించిపోయెను.(1)

"ఇది ఏమి! స్వప్నమా! నాకు చిత్తమోహము కలిగినదా? నాకున్న జ్ఞానము నశించినదా? లేక నా మనస్సున కేదియో వ్యాధి వచ్చినదా?" అనుకొనెను.(2)

దశరథుడు ఈవిధముగా ఆలోచించి అప్పుడు సుఖమును పొందజాలకపోయెను. కైకేయి మాటలచే కొట్టబడిన ఆ రాజు చాలసేపటికి స్పృహ వచ్చి, ఆడపులిని చూచిన లేడి వలె వ్యథ చెంది, వ్యాకులుడై, ఆచ్ఛాదనములేని నేలపై కూర్చుండి, రేఖలతో గీసిన మండలమునందు మంత్రములచే బంధింపబడిన మహాసర్పమువలె దీర్ఘముగా నిట్టూర్చెను. "అయ్యో! ఛీ ఛీ" అని కోపముతో పలికి,

శోకముచే మరల స్పృహ తప్పగా మూర్ఛపడెను. (3-5)

మిక్కిలి దుఃఖితుడైన దశరథుడు చాల సేపటికి సంజ్ఞ పొంది, కోపించినవాడై, నేత్రములతో కాల్చివేయుచున్నాడా అన్నట్లు చూచుచు, కైకేయితో ఇట్లు పలికెను. (6)

"క్రూరురాలా! దుష్టచరిత్ర గలదానా! ఈ కులమును నశింపచేయుచున్న పాపాత్మురాలా! రాముడు గాని, నేను గాని నీకేమి అపకారము చేసినాము? రాముడు నిన్ను తల్లినివలె చూచుకొనుచున్నాడు కదా; అట్టి రామునికే నీ విపుడు అనర్థము తలపెట్టితి వేమి? (7, 8)

రాజకుమారివి కదా యని తలచి, నీ దుష్టస్వభావము తెలియక నేను నిన్ను తీవ్రవిషముగల ఆడసర్పమును తీసికొనివచ్చినట్లు నా గృహమునకు తీసికొని వచ్చుటతో నా వినాశమును నేనే కోరి చేసికొనినట్లయినది. (9)

ప్రపంచములోని జీవకోటి యంతయు రాముని గుణగణములను స్తుతించుచుండగా అతనిలో ఏమి దోషమున్న దని నే నాతనిని వనమునకు పంపుదును? కౌసల్య నైనను, సుమిత్ర నైనను, రాజ్యలక్ష్మి నైనను, చివరకు నా ప్రాణముల నైనను విడువగలను గాని పితృభక్తుడైన రాముని మాత్రము విడువజాలను. (10, 11)

జ్యేష్ఠకుమారుడైన రాముని చూడగానే నాకు పరమానందము కలుగును. అతనిని చూడకున్నచో నా చైతన్యమే నశించును. సూర్యుడు లేకుండా ఈ లోకము ఉండవచ్చును; నీరు లేకుండా సస్యము ఉండవచ్చును. కాని రాముడు లేకుండా నా దేహములో ప్రాణ ముండజాలదు. (12, 13)

పాపనిశ్చయముగల ఓ కైకేయీ! ఇంతటితో చాలింపుము. ఈ నిశ్చయమును వదలిపెట్టుము. శిరస్సు నీ పాదములపై ఉంచి నమస్కరించుటకు కూడ సిద్ధముగా ఉన్నాను. నన్ను అనుగ్రహింపుము. (14)

పాపాత్మురాలా! ఇంత దారుణమైన ఆలోచన నీ కెందుకు వచ్చినది? లేదా నాకు భరతునిపై ప్రేమ ఉన్నదో లేదో పరీక్షింపదలచి ఇట్లు మాట్లాడుచున్నావా? ఈ మాటలన్నియు పరీక్షించుటకై పలికినవే అగుగాక. కాని పూర్వము నీవు రాముని విషయమున మాటలాడుచు - "శ్రీమంతుడైన రాముడే నా జ్యేష్ఠపుత్రుడు. రాజ్యప్రాప్తి మొదలైన ధర్మసంమతవిషయములను పొందు అధికారము జ్యేష్ఠుడుగా అతనికే యున్నది." అని చెప్పుచుండెడిదానవు. ఇది అందరికి తెలిసిన విషయము. అట్టి

నీవు ఈనాడు నన్ను పరీక్షించుటకైనను ఇట్లు మాటలాడుచున్నావన్నవో దీనిని పట్టి నీవు కేవలము మంచి మాటలతో నన్ను సంతోషపెట్టుటకే అట్లు పలికితివని అర్థమగుచున్నది.(15-17)

అందువలననే నీవు, రామాభిషేకవార్త విని(లేదా చెప్పుడు మాటలు విని) పరులకు(చాడీలు చెప్పినవారికి) లొంగిపోయి, శోకసంతప్తురాలవై శూన్యమైన కోపగృహములో ప్రవేశించి, నన్ను చాలా బాధించుచున్నావు. ఇంతవరకును, నీవు నీతిసంపన్నురాలవై యుండెడిదానవు. కాని ఇప్పుడు నీ బుద్ధిలో ఈ వికారము పుట్టుటచే, ఇక్ష్వాకువంశమునందు గొప్ప అనర్థకరమైన నీతి వచ్చిపడినది. పూర్వము నీవెన్నడును నా విషయమున కొంచెమైనను అయుక్తమైన పనిగాని, అప్రియమైన కార్యము గాని చేయలేదు. అందుచేతనే ఇపుడు నీవు చెప్పుచున్న మాటలు నమ్మజాలకున్నాను.(18-20)

కైకేయీ! "నాకు రాముడు మహాత్ముడైన భరతునితో సమానుడే." అని నీవు అనేకపర్యాయములు ఎన్నియో కథలు చెప్పుచుండెడిదానవు కదా? అట్టి ధర్మాత్ముడూ, కీర్తిమంతుడూ అయిన రాముడు పదునాలుగు సంవత్సరములు వనములో నివసించవలె నని నీవు ఎట్లు కోరుచున్నావు? అత్యంతము సుకుమారుడూ, ధర్మమునందు స్థిరమైన బుద్ధికలవాడూ అయిన రాముడు, అతిభయంకరమైన అరణ్యములో నివసింపవలెనని ఏల కోరుచున్నావు? నీయందు భక్తితో సేవలు చేయు, మనోహరుడైన రాముని దూరముగా పంపివేయవలె నని ఎందుకు కోరుచున్నావు?(21-24)

భరతునికంటె అధికముగా రాముడే నీకు శుశ్రూష చేయుచున్నాడు కదా? అందుచేత కూడ నీకు రామునికంటే భరతునిపై ఎక్కువ ప్రేమ ఉండుటకు కారణ మేదియు నా కగపడుటలేదు. అంతఃపురములో, వేలకొలది స్త్రీలున్నారు. చాలామంది సేవకులున్నారు. కాని, నీకు సేవలు చేయుచు, నీపై గౌరవభావముతో పూజలు చేయుచు, నీవు చెప్పిన పనులు చేయువాడు రాముడు తక్క మరెవ్వరున్నారు?(25,26)

మనుజశ్రేష్ఠుడైన రాముడు, పరిశుద్ధమైన చిత్తముతో సర్వప్రాణులతో మంచి చేసికొనుచు, దేశములోని ప్రజలనందరినీ ప్రియకార్యములచే అనుకూలురను చేసికొనుచున్నాడు. అందుచే రాముని విషయమున పరివాదముగాని, అపవాదముగాని, ఉండుటకు అవకాశము లేదు.(27, 28)

రాముడు మహావీరుడు. ధర్మవీరత్వము, దయావీరత్వము, దానవీరత్వము,

యుద్ధవీరత్వము అను నాలుగు విధములైన వీరత్వము కలవాడు. సత్యవ్రతముచే అతడు ప్రజల విశ్వాసము చూరగొని, వారి నందరినీ వశమునం దుంచుకొనుచున్నాడు. దానము చేసి దీనులను తన యధీనములో ఉంచుకొనుచున్నాడు. శుశ్రూష చేసి గురువుల మన్ననలు పొందుచున్నాడు. యుద్ధమునందు పరాక్రమముచే శత్రువులను జయించుచున్నాడు. సత్యము, దానము, తపస్సు, పరులకొరకై స్వీయసుఖాదిత్యాగము, త్రికరణపరిశుద్ధి, నిష్కాపట్యము, విద్య, గురుశుశ్రూష ఇవి రామునియందు స్థిరమైన గుణములు. రాముడు కపటము ఎరుగనివాడు. దేవతలతో సమానుడు. మహర్షుల తేజస్సువంటి తేజస్సు కలవాడు. అట్టి రాముని విషయమునందు కూడ నీకు ఈ పాపపు బుద్ధి ఎట్లు కలిగినది?(29-31)

రాముడు జనులందరితోడను ప్రియముగానే మాటలాడు స్వభావము గలవాడు. అట్టి రాముడు ఎన్నడును అప్రియమైన వాక్యము పలికినట్లు నా స్మృతిపథములో లేదు. ప్రేమపాత్రుడైన అట్టి రామునితో, నీకొరకై అప్రియవాక్య మెట్లు చెప్పగలను? ఓర్పు, ఇంద్రియనిగ్రహము, త్యాగము, సత్యము, ధర్మము, కృతజ్ఞత్వము, సకలభూతాహింస అను గుణములు రామునియం దున్నవి. అట్టి రాముడు తప్ప నాకు వేరెవ్వరు గతి ఉన్నారు?(32, 33)

కైకేయీ! నేను ఆయువు చివరి భాగమున నున్న ముసలివాడను. దీనుడను. దైన్యముతో విలపించుచున్నాను. నాపై కరుణ చూపుము. సముద్రమువరకు వ్యాపించియున్న ఈ పృథివిలో ఉన్నదంతయు నీకు ఇచ్చెదను. నీవు కోపము చెందకుము.(34, 35)

కైకేయీ! చేతులు జోడించి నమస్కరించుచున్నాను. నీ పాదములు కూడ పట్టుకొనెదను. రాముని రక్షింపుము. ఈ విషయమున నాకు అధర్మము కలుగకుండ చూడుము."(36)

పిమ్మట, క్రూరురాలైన కైకేయి, దుఃఖముతో తపించుచున్నవాడూ, విలపించుచున్నవాడూ, చైతన్యము కోల్పోయి అల్లాడుచున్నవాడూ, శోకముతో నిండినవాడూ, శీఘ్రముగా ఆ శోకసముద్రము దాటవలె నని మాటిమాటికి కోరుచున్నవాడు అయిన ఆ దశరథునితో ఇంకను క్రూర మైన మాట పలికెను. (37,38)

"వీరుడ వైన మహారాజా! రెండు వరముల నిచ్చి ఇపు డీ విధముగా పశ్చాత్తాపముతో దుఃఖించుచున్నచో, నేను ధార్మికుడనని లోకములో ఎట్లు



చాటుకొనగలవు? సర్వధర్మముల నెరిగినవాడా! అనేక రాజర్షులు నిన్ను కలిసి నీతో ఈ విషయము ముచ్చటించినపుడు నీ వేమి సమాధానము చెప్పెదవు?(39, 40)

"ఏ కైకేయి అనుగ్రహముచేత నేనింకను జీవించుచున్నానో, ఏ కైకేయి నన్ను రక్షించినదో అట్టి కైకేయికి మాట యిచ్చి వెనుకాడితిని." అని చెప్పెదవా?(41)

మహారాజా! వర మిచ్చెద నని ఇప్పుడే చెప్పి, మరల ఏవేవో మాటలాడుచున్న నీవు భూపతులకే కళంకము తెచ్చుచున్నావు. డేగకును పావురమునకు మధ్య విరోధము కలిగినపుడు శైబ్యుడు, డేగకు తన మాంసము నిచ్చెను. అలర్కుడను రాజు తన నేత్రములు దానము చేసి ఉత్తమగతి పొందెను. సముద్రము తాను పూర్వము దేవతల కిచ్చిన మాటపై నిలబడి చెలియలికట్టను దాటుటలేదు. ఇట్టి పూర్వపురుషుల చరిత్రను మనస్సులో నుంచుకొని చేసిన ప్రతిజ్ఞను అసత్యము చేయకుము.(42-44)

ఓ దుష్టబుద్ధీ! నీవు ధర్మమును విడచి, రాముని రాజ్యాభిషిక్తుని చేసి, నిత్యము కౌసల్యతో క్రీడింపవలె నని కోరుచున్నావు. నేను కోరినది అధర్మము కానిమ్ము, ధర్మము కానిమ్ము. సత్యము కానిమ్ము, అసత్యము కానిమ్ము. నీవు నాకిచ్చిన వరమును కాదనుటకు వీలులేదు.(45, 46)

రాముడు పట్టాభిషిక్తు డైనచో నేను నీ ఎదుటనే విషము త్రాగి ఇపుడే నీవు చూచుచుండగనే మరణించెదను. రాముని తల్లి యైన కౌసల్యకు ఒక్కనాడైనను నమస్కరింపవలసి యుండుటకంటె మరణమే నాకు శ్రేయస్కరము కదా! రాజా! భరతునిపైనను, నాపైనను ఒట్టుపెట్టి చెప్పుచున్నాను. రాముని ప్రవాసమునకు పంపుట తప్ప మరి దేనివలనను నేను సంతసించను."(47-49)

కైకేయి ఈ విధముగా పలికి ఊరకుండెను. దశరథుడు ఎంత విలపించినను మారు మాటలాడలేదు.(50)

కైకేయి కోరిన చాల చెడ్డవైన రామవనవాసమునూ, భరతుని రాజ్యాభిషేకమునూ వినగానే దశరథుడు క్షణకాలముపాటు నిశ్చేష్టుడైపోయెను. కైకేయితో ఏమీ మాట్లాడలేదు.(51)

అతడు అప్రియముగా మాటలాడుచున్న కైకవైపు రెప్పపాటు వేయకుండా చూచెను. పిడుగుపాటువలె ఉన్నదీ, హృదయానికి అనిష్టమైనదీ, దుఃఖశోకాలను కలిగించేదీ, ఘోరము అయిన ఆ మాట విన్న రాజుకు ఏ మాత్రము సుఖము కలుగలేదు. కైక నిర్ణయమూ, ఆమె చేసిన శపథము తలచుకొనుచు అతడు నిట్టూర్చి, తెగగొట్టిన చెట్టువలె నేలమీద వ్రాలిపోయెను.(52-54)

అప్పుడా రాజు మతి చలించిన పిచ్చివాడువలె, విపరీతముగా ప్రవర్తించుచున్న రోగి వలె, మంత్రాదులచేత శక్తి తొలగించిన సర్పమువలె అయిపోయెను. అతడు కైకేయితో దీనముగా ఇట్లు అనెను- "పైకి లాభకరము వలె కనబడే ఈ అనర్థకరమైన ఆలోచన నీకు ఎవరు చెప్పినారు? పిశాచము ఆవహించి చెడిన మనస్సు కలదానవు వలె నాతో మాటలాడుచున్నావు! సిగ్గు లేదా?(55, 56)

పూర్వము నీ చిన్నతనములో ఇలాంటి బుద్ధివైపరీత్యము ఉన్నట్లు నేనెన్నడూ చూడలేదు. అయితే ఇపు డట్టి వైపరీత్యము కనబడుచున్నది. భరతుడు రాజ్యము పొంది రాష్ట్రములో ఉండవలె ననీ, రాముడు అడవులకు వెళ్ళవలెననీ - ఇట్టి వరాలు కోరుతున్నావు. నీకు ఎవరివల్ల భయము కలిగినది? నీ భర్తకూ, లోకానికీ, భరతునికీ, ప్రియము చేయవలెనని అనుకున్నచో, "భరతునికి రాజ్యము ఇవ్వవలెను, రాముడు అడవులకు వెళ్ళవలెను" అనే ఈ భావాలను విడిచిపెట్టుము.(57-59)

క్రూరురాలా! పాపసంకల్పురాలా! నీచురాలా! పాపకృత్యాలు ఆచరించేదానా! నాలోనూ, రామునిలోనూ, నీకు ఏమి దుఃఖకరవిషయాలుగాని, అపరాధాలుగాని కనబడినవి?(60)

రాముని కాదని భరతుడు ఏ విధంగానూ కూడా రాజ్యము అంగీకరించడు. ఎందుచేత ననగా ధర్మము విషయములో రామునికంటె కూడ భరతుడు ఎక్కువ పట్టుదలకలవా డని నా అభిప్రాయము.(61)

"అడవికి వెళ్ళుము." అని చెప్పగానే వివర్ణమైపోయి, గ్రహణము పట్టిన చంద్రునివలె ఉన్న రాముని ముఖము ఎలా చూడగలను?(62)

నేను స్నేహితులతో ఆలోచించి ఒక చక్కని నిర్ణయము తీసుకున్నాను. అట్టి

నిర్ణయమును, శత్రువులు సేనను త్రిప్పికొట్టినట్లు నీవు విఫలము చేయుచుండగా నేనెట్లు చూడగలను? అనేక ప్రాంతాలనుండి వచ్చిన రాజు లందరును నన్నేమందురు? "ఈ మూర్ఖుడైన దశరథుడు ఇంతకాలము ఎలా రాజ్యం చేసినాడో!" అని అనరా?(63, 64)

గుణవంతులూ విద్యావంతులూ అయిన పెద్దలు వచ్చి రాము డేమైనాడని అడిగినచో నేనేమి చెప్పవలెను? "కైకేయి నిర్బంధించటంచేత రాముని అరణ్యానికి పంపినాను." అని నిజమే చెప్పినను దానిని ఎవ్వరూ నమ్మరు. అసత్యము అనుకొందురు.(65, 66)

రాముడు అరణ్యానికి వెళ్ళినచో కౌసల్య నన్నేమనును? ఇంతటి అప్రియము చేసి నే నామెకు ఏమి బదులు చెప్పగలను? కౌసల్య సర్వదా నా ప్రియమునే కోరును. పుత్రప్రేమ గలది. ప్రియమైన మాటలే మాటలాడును. అట్టి కౌసల్య ఒక దాసివలె, సఖురాలువలె, భార్యవలె, సోదరివలె, తల్లివలె, నా సంతోషముకొరకై నా వద్దకు వచ్చినపుడు కూడా, నీకు కోపము కలుగుననే భయంచేత, ఆమె సత్కారానికి అర్హురాలైనా, నేను ఆమెను సత్కరించలేదు.(67-69)

నీకు ఎన్నో మంచి ఉపకారాదులు చేసియున్నాను. అది ఈనాడు, అపథ్యమైన వ్యంజనాలు (కూరలు మొ.) కలిపి తిన్న అన్నము రోగిని పీడించినట్లుగా, నన్ను పీడించుచున్నది. రాముడు నేను చేసిన అపకారముచే అడవికి వెళ్ళిపోవుచుండగా చూచి భయపడిన సుమిత్రకు నా మీద విశ్వాసము ఏమి ఉండును?(70, 71)

నేను మరణించినట్లు, రాముడు అరణ్యానికి వెళ్ళినట్లు రెండు చెడు వార్తలను సీత, దైన్యముతో వినవలసివచ్చును. ఎంత కష్టము! హిమవత్పర్వతప్రాంతాన, కిన్నరుని పోగొట్టుకొన్న కిన్నరివలె సీత నాప్రక్కనే ఉండి దుఃఖించుచుండగా నా ప్రాణాలు పోవును.(72, 73)

రాముడు అరణ్యానికి ప్రవాసానికి వెళ్ళుచుండగాను, సీత విలపించుచుండగానూ చూచిన తరువాత నేను జీవించవలె నని ఏమాత్రము కోరుకొనను గదా? నీవు తప్పక విధవవై, పుత్రునితో కలసి రాజ్యము ఏలెదవు లెమ్ము. రాముడు ప్రవాసము వెళ్ళిన తరువాత నేను జీవించుట కల్ల.(74, 75)

నరుడు విషము కలిసిన మద్యము మంచిదనుకొని త్రాగినట్లు రూపవంతురాలవూ, కాని చాల చెడ్డదానవూ అయిన నువ్వు మంచిదాన వని

ఇంతవరకు అనుకొన్నాను. పూర్వము అసత్యమైన మంచిమాటలాడుచు నన్ను చాలా బుజ్జగించుచు, మాటలాడేదానవు. ఇపుడు వేటగాడు గీతము పాడి లేడిని కట్టి చంపి నట్లు చంపుచున్నావు. (76, 77)

పెద్దలందరూ వీధులలో గుమిగూడి, పుత్రుని అమ్ముకొన్న నన్ను, ఇతడు చాల చెడ్డవాడు అని అనుచు, మద్యపానము చేసిన బ్రాహ్మణుని నిందించినట్లు నిందించెదరు; తప్పదు. (78)

నీ మాటలు విని సహించవలసిన పరిస్థితు లేర్పడినవి! ఏమి దుఃఖము వచ్చిపడినది! ఎంత కష్టము వచ్చిపడినది! పూర్వజన్మలో చేసిన పాపమువలె ఈ దుఃఖము వచ్చిపడినది కదా! పాపాత్మురాలా! పూర్వము ఏదో పాపము చేసిన నేను, నీ స్వభావము తెలియక చాలాకాలము పోషించినాను. చివరికి నువ్వు నా మెడకు ఉరిత్రాడైనావు. ఇంతకాలము నీతో విహరించుచు నువ్వు మృత్యుదేవత వనే విషయము గుర్తించజాలకపోయితిని. ఎవ్వరూ లేనిచోట, చిన్నపిల్లవాడు త్రాచుపాము మీద చెయ్యివేసినట్లు నిన్ను దగ్గరకు చేరదీసినాను. (79-81)

మహాత్ముడైన ఆ రామునికి దురాత్ముడైన నేను తండ్రిని అని చెప్పుటకూడ తప్పే. ఈ ప్రపంచము అంతా నన్ను తప్పక దూషించును. దూషించినను తప్పులేదు. "కామానికి లొంగిపోయి, స్త్రీ మాట విని, ప్రియపుత్రుని అరణ్యానికి పంపుచున్నాడు. ఈ దశరథుడు ఎంత మూర్ఖుడు!" అని లోకులు నిందించెదరు. (82, 83)

చిన్నతనమునుండి ఇంతవరకు రాముడు వ్రతాలతోనూ, బ్రహ్మచర్యధర్మాలతోను, గురువులు విధించిన నియమాలతోనూ, చాలా శ్రమపడినాడు. ఇప్పు డింక భోగాలు అనుభవించవలసిన కాలము వచ్చిన తరువాత కూడా మరల చాలా కష్టాలు పడవలసి వచ్చినది. నా కుమారుడైన రాముడు నా మాటకు ఎదురు చెప్పజాలడు. వనానికి వెళ్లుమని నేను చెప్పగానే తప్పక అట్లే చేసెదనని అనగలడు. నేను వనమునకు పొమ్మని రాము నాజ్ఞాపించగానే, అతడు "నేను పోజాలను.' అని చెప్పి, నా ఆజ్ఞ నతిక్రమించు నేని నా కది ప్రియముగా నుండును. రాముడు మాత్రము అట్లు ఎన్నటికిని నా ఆజ్ఞను అతిక్రమింపడు. (84-86)

రాముడెంతమాత్రము కపటము లేని పరిశుద్ధమగు హృదయము కలవాడు. కావున నే దతడు నా యాజ్ఞ నతిక్రమించుట నాకిష్టమే అను విషయమును తెలిసికొనజాలడు. కావున రాముని చూచి నేను 'నీవు అడవికి పొమ్ము.' అని ఆజ్ఞాపింపగానే అందు కతడు 'మంచిది' అని చెప్పునే కాని వేరు మాట పలుకడు.

రాముడు అరణ్యానికి వెళ్ళగానే, సర్వలోకనింద్యుడనూ, క్షమింప తగనివాడనూ అయిన నన్ను మృత్యువు యమలోకానికి తీసికొనిపోవును. మానవశ్రేష్ఠుడైన రాముడు అరణ్యానికి వెళ్ళగానే నేను మరణించెదను. ఇంక మిగిలిన నా స్వజనం విషయంలో ఏమి ఘోరకృత్యము చేయనున్నావో!(87–89)

నన్నూ, రామునీ, లక్ష్మణశత్రుఘ్నులనూ కోల్పోయిన కౌసల్య దుఃఖము సహించజాలక నన్ను అనుసరించి మరణించును. ఈ విధంగా కౌసల్యనూ, సుమిత్రనూ, నన్నూ, రామలక్ష్మణశత్రుఘ్నులనూ నరకముతో సమానమైన కష్టాలలో పడవేసి నీవు సుఖముగా ఉండుము!(90, 91)

శాశ్వతమూ, గుణాలచే పూజితము అయిన ఇక్ష్వాకువంశము నేటివరకు క్షోభింపచేయ శక్యము కాకుండా ఉన్నది. అలాంటి వంశమును నేనూ, రాముడూ విడచివేసిన తరువాత వ్యాకులము చేసి నీవు పాలించెదవు లెమ్ము! ఈ రామవనవాసము భరతునికి కూడ ఇష్టమైనట్లయితే, నా మరణానంతరము అతడు నాకు ప్రేతకార్యాలు చేయవద్దు. ఓసీ అనార్యురాలా! నీ కోరిక తీరును. మనుష్యశ్రేష్ఠుడైన రాముడు అరణ్యానికి వెళ్ళగా నేను మరణించిన పిమ్మట, విధవవై పుత్రునితో కలసి అపుడు రాజ్యము చేసెదవు!(92–95)

ఇంతకాలమూ, నీవు రాజపుత్రి అనే పేరుతో నా యింటిలో నివసించినావు. నీ మూలాన నాకు గొప్ప అపకీర్తి, అవమానము తప్పవు. సకలప్రాణులూ కూడ నన్ను ఏదో పాపం చేసినవానిని వలె అనాదరముతో చూడగలవు.(96)

ఇంతవరకు ఒక ప్రభువుగా రథాలమీదను, గజాశ్వాలమీదను ఎక్కి ప్రయాణము చేయుటకు అలవాటు పడిన నా ముద్దుల కుమారుడు రాముడు, మహారణ్యములో పాదాలతో ఎట్లు సంచరించును? రాముని భోజనసమయం కాగానే, చక్కగా అలంకరించుకొన్న వంటవాళ్ళు, "నేను ముందు; నేను ముందు" అని పోటీ పడుచు శ్రేష్ఠమైన పేయములూ, ఆహారమూ వండి పెట్టువారు. అట్టి నా కుమారుడు, అరణ్యములో వగరుగాను, చేదుగాను, కారంగాను ఉండే ఆహారము తినుచు ఎట్లు జీవించునో గదా! అమూల్యమైన వస్త్రాలు ధరించి చాలకాలము సుఖముగా ఉన్న రాముడు ఇటుపై కాషాయవస్త్రాలు ధరించి నేలమీద ఎట్లు ఉండగలడు?(97–100)

"రాముడు అరణ్యానికి వెళ్ళవలెను; భరతునికి రాజ్యాభిషేకము చేయవలెను." అనే ఈ ఆలోచనలేని, దారుణమైన వాక్యము ఎవరు నీకు చెప్పినారు? ఛీ! ఈ ఆడవాళ్ళందరూ రహస్యముగా అపకారము చేసేవాళ్ళే! సర్వదా స్వలాభముకొరకే

చూచుకొందురు. ఐతే నేను అందరు స్త్రీలను గూర్చి అనుటలేదు. కేవలము భరతుని తల్లిని గూర్చియే అనుచున్నాను. (101, 102)

స్వార్థపరురాలా! నీకు నావలన గాని, ఎప్పుడూ హితమే కోరే రామునివలన గాని ఏమి అప్రియము జరగబోవును అని అనుకొనుచున్నావు?(103)

రాముడు కష్టాలలో చిక్కుకొనుట చూచి, ఈ ప్రపంచము అంతా ఎదురు తిరుగును. తండ్రులు కుమారులనూ, ఇంతవరకు ప్రేమగా ఉన్న స్త్రీలు భర్తలనూ విడచివేయుదురు. (104)

చక్కగా అలంకరించుకొని దేవతాకుమారుడువలె వచ్చుచున్న నా కుమారుని చూచినంతమాత్రముచేతనే నాకు చాలా ఆనందము కలుగును. మరల యౌవనము లభించినట్లు అనిపించును. సూర్యుడు లేకపోయినను, ఇంద్రుడు వర్షం కురిపించకపోయినను, లోకవ్యవహారము నడిచిపోవచ్చును కాని రాముడు ఇక్కడినుండి వెళ్ళిపోవుచుండగా చూచినవా డెవ్వడూ జీవించడని నా అభిప్రాయము. (105, 106)

నా వినాశమును కోరేదానవూ, అహితము ఆచరించేదానవూ, శత్రువూ అయిన నిన్ను మృత్యువును దగ్గర ఉంచుకొన్నట్లు ఇంతకాలము దగ్గర ఉంచుకొన్నాను. మహావిషముగల ఆడసర్పమును ఒడిలో చాలాకాలము ఉంచుకొంటిని. అందుచేత చేసిన పొరబాటుకి ఈనాడు చంపబడుచున్నాను. నాకు, రామలక్ష్మణులకూ దూరుడైన భరతుడు నీతో చేరి బంధువుల నందరినీ చంపి నగరునూ, రాష్ట్రమునూ, పాలించుగాక! నీవు నా శత్రువులకు ఆనందము కలుగచేసేదానవు అయ్యెదవుగాక! ఇప్పుడు నీవు ఈవిధంగా మాటలాడినందుకు నీ దంతాలన్నీ వేయిముక్కలుగా విరిగి ఎందుకు రాలటంలేదో కదా! (107-109)

రాముడు ఏమాత్రము అహితముగాను, అప్రియముగాను మాటలాడడు. పరుషముగా మాటలాడుట అనేది అతనికి తెలియనే తెలియదు. ఈ విధముగా మనోహరముగా మాటలాడేవాడు, సద్గుణాలను బట్టి అందరి మన్ననలు పొందేవాడూ అయిన రాముని విషయములో దోషాలు ఎలా చెప్పకలుగుతున్నావు? నీవు ఏడ్చినా, మండిపడినా, నశించినా, వేయి ముక్కలై నేలమీద పడినా, అతిదారుణమూ, నాకు అహితము అయిన నీ కోరిక తీర్చను.(110, 111)

నువ్వు మంగలికత్తివంటిదానవు. నిత్యము అసత్యమైన ప్రియవాక్యాలు మాటలాడేదానవు. దుష్టస్వభావురాలవు. నీ కులానికే చిచ్చుపెట్టుదానవు. మనస్సుకు

క్లేశము కలిగించేదానవు. సమూలముగా నా హృదయమును కాల్చివేయడానికి పూనుకున్నావు. అలాంటి నీవు జీవించి ఉండుట నాకు ఇష్టములేదు.(112)

రాముడు లేనిచో నాకు జీవితము లేదు. ఇంక సుఖము మాట చెప్పవలెనా! బ్రతికి ఉండగా నా కింక ఆనందము ఎక్కడిది? ఓ దేవీ! నాకు అహితమైన ఈ కార్యము చేయవద్దు. నీ కాళ్ళుకూడా పట్టుకొనెదను. నన్ను అనుగ్రహించుము."(113)

మర్యాదను అతిక్రమించిన భార్య ఈ విధముగా హృదయానికి అఘాతము కలిగించగా, దశరథుడు అనాథుడు వలె విలపించుచుండగా, అతడు తన పాదాలు ఎక్కడ స్పృశించునో అని కైకేయి తన పాదములు దూరముగా జరిపెను. ఆమె పాదములు చేరకుండగనే రాజు రోగగ్రస్తుని వలె నేలమీద పడిపోయెను.(114)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని పన్నెండవసర్గము సమాప్తము.

పదమూడవ సర్గము

రాజు విలపించుట, కైకేయిని అనునయించుట.

దశరథుడు అట్టి దీనస్థితికి తగినవాడు గాని, అలవాటుపడ్డవాడు గాని కాడు. పుణ్యము అంతా వ్యయము అయిపోయిన తరువాత స్వర్గలోకమునుండి భూమిపై పడిన యయాతిచక్రవర్తి వలె అతడు నేలపై పడిఉన్నాడు. అటువంటి మహారాజుకు సాక్షాత్తు మూర్తీభవించిన అనర్థమా అన్నట్లు ఉన్నదీ, తన పని సాధించుకున్నదీ అయిన కైకేయి, ఏ మాత్రము జంకు కొంకు లేక, భయపెట్టుచూ మరల ఆ వరములనే కోరినది.(1,2)

"మహారాజా! నేను సత్యవంతుడను. చేసిన ప్రతిజ్ఞ విడవను. అని అనుచు బడాయి చెప్పుకొనుచు ఉందువు కదా! ఇప్పుడు నా వరమును ఎందుకు కాదనుచున్నావు?" అన్నది.(3)

కైకేయి ఇట్లు అనగానే దశరథుడు చాలా కోపించి కొంత సేపు స్మృతి తప్పినట్లయి, ఇట్లనెను.(4)

"దుష్టురాలా! నాకు శత్రువువు. మనుజశ్రేష్ఠుడైన రాముడు అరణ్యానికి వెళ్లిన పిదప, నేను మరణించగానే, కోరిక తీరి సుఖముగా ఉండెదవు లెమ్ము. అయ్యో

ఎంత కష్టము వచ్చినది! నేను స్వర్గానికి వెళ్లినపుడు "రాముడు కుశలముగా ఉన్నాడా?" అని దేవతలు అడిగినపుడు, అసలు విషయము కప్పిపుచ్చి, క్షేమముగానే ఉన్నాడు అని చెప్పి వారిని ఎట్లు నమ్మింపచేయగలను? అసలు విషయము దాచకుండా కైకేయికి ప్రియము చేయుటకోసం నేను రాముని అరణ్యానికి పంపినాను అని చెప్పినా అది ఎవ్వరూ నమ్మరు.(5-7)

పుత్రుడు లేని నేను ఎంతో శ్రమపడి, గొప్పవాడూ మహాపరాక్రమశాలీ అయిన రాముని పుత్రునిగా పొందితిని. అట్టి రాముని ఎట్లు విడవగలను? శూరుడూ, విద్య లన్నీ అభ్యసించినవాడూ, కోపము జయించినవాడూ, ఓర్పుకలవాడూ, తామరరేకులవంటి నేత్రాలు కలవాడూ అయిన రాముని నేను అరణ్యానికి ఎట్లు పంపగలను? నల్లకలువవలె శ్యామవర్ణము కలవాడూ, దీర్ఘబాహువూ, మహాబలశాలీ, మనోహరుడూ అయిన రాముని నేను దండకారణ్యానికి ఎట్లు పంపగలను? రాముడు సుఖాలకు అలవాటు పడ్డవాడు. కష్టపడి ఎరుగడు. అట్టి బుద్ధిమంతుడైన రాముడు కష్టపడుచుండగా నేనెట్లు ఊహించగలను? (8-11)

దుఃఖాలకు తగని రామునికి దుఃఖము కలిగించకుండగా నేను ఇప్పుడే మరణించినట్లయితే నాకు సుఖము కలుగును.(12)

క్రూరురాలా! సత్యపరాక్రమవంతుడూ, నాకు చాలా ఇష్టుడూ అయిన రామునికి ఎందుచేత కీడు కలిగించుచున్నావు? నా కీ లోకములో గొప్ప అపకీర్తి, పరాభవము తప్పవు"(13)

మనస్సు చెదిరిపోయిన దశరథుడు ఈ విధముగా విలపించు చుండగా సూర్యుడస్తమించి రాత్రి వచ్చెను. ఆర్తుడై ఆ విధముగా విలపించుచున్న దశరథునికి, రాత్రి చంద్రమండలముతో ప్రకాశించుచున్నను, చీకటిగానే ఉండెను. ఆ వృద్ధుడు వేడి నిట్టూర్పులు విడచుచు, రోగపీడితుడువలె ఆకాశము వైపే చూచుచు అతిదీనముగా విలపించెను.(14-16)

"నక్షత్రా లనే అలంకారాలు ధరించిన మంగళకరివైన ఓ రాత్రీ! నువ్వు తెల్లవారవద్దు. నా మీద దయఉంచుము. ఇదిగో అంజలి ఘటించుచున్నాను. లేదా ఓ రాత్రీ! శీఘ్రముగా తొలగిపొమ్ము. ఇంత అపదకు కారణభూతురాలూ, దయావిహీనురాలూ, క్రూరురాలూ అయిన కైకేయిని చూచుట నా కేమాత్రము ఇష్టములేదు."(17, 18)

ఆ రాజు ఈవిధముగా పలికి, పిదప నమస్కరించుచు కైకేయిని బ్రతిమిలాడెను.



మరల ఆమెతో ఇట్లు పలికెను.(19)

"శుభప్రదురాల వైన ఓ రాణీ! నేను మంచి నడవడిక కలవాడను. దీనుడను. నిన్ను ఆశ్రయించుచున్నాను. ముసలివాడను. విశేషించి రాజును. అలాంటి నన్ను అనుగ్రహించుము. ఓ! సుశ్రోణీ! నేను చెప్పునదంతా ఆకాశములో కలిసిపోవుటలేదు కదా! ఓ బాలా! నా విషయములో అనుగ్రహించుము. నీవు మంచి హృదయము కలదానవు కదా! నల్లని నేత్రాంతాలు గల ఓ దేవీ! అనుగ్రహించుము. నా రాజ్యము రామునికి నీవే ఇమ్ము. ఈ విధముగా కీర్తి సంపాదించుకొనుము. ఓ విశాలశ్రోణీ! సుందరముఖీ! చారునేత్రీ! ఈ పని చేయుము. ఇది నాకూ, రామునికీ, లోకానికీ, గురువులకూ, భరతునికీ కూడ ప్రియమైనది."(20-23)

విశుద్ధమైన హృదయముగల రాజైన ఆ భర్త దీనుడై, ఎఱ్ఱటి కన్నీటి బిందువులు కార్చుచు అనేకవిధాల దీనముగా విలపించుచుండగా విని, దుష్టభావము గల ఆ క్రూరురాలు అతని మాట ప్రకారము చెయ్యలేదు.(24)

ఎంత చెప్పినా సంతోషించక, రాముని అరణ్యానికి పంపవలె నని ప్రతికూలముగా మాటలాడుచున్న భార్యను చూచిన ఆ రాజు దుఃఖితుడై మరల మూర్ఛితుడై, నేలమీద పడిపోయెను. ఆత్మాభిమానవంతుడైన దశరథుడు ఈ విధముగా దుఃఖించుచు, తీవ్రమైన నిట్టూర్పులు విడచుచు ఉండగానే రాత్రి గడచిపోయినది. ప్రాతఃకాలమున వందిమాగధాదులు వచ్చి మేల్కొల్పుటకు ప్రారంభించిరి. అయితే ఆ రాజశ్రేష్ఠుడు వాళ్ళను నివారించెను.(25,26)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని పదమూడవ సర్గము సమాప్తము.

పదునాలుగవ సర్గము

రాజాజ్ఞచే సుమంత్రుడు రాముని కొనివచ్చుటకై వెడలుట.



పుత్రశోకముతో బాధపడుచు సంజ్ఞ లేక, నేలపై పడి, దొర్లుచున్న ఆ దశరథునితో ఆ పాపాత్మురాలు ఇట్లు పలికినది.(1)

"ఏమిటిది, నాకిచ్చిన ప్రతిజ్ఞ వినగానే ఏదో మహాపాపం చేసినవాడు వలె దుఃఖించుచు నేలమీద పడి ఉన్నావు! నీవు మర్యాద పాటించుము. ధర్మవేత్తలైన జనులు సత్యమే ధర్మమని అందురు కదా? నేను కూడా ఆ సత్యాన్ని ఆశ్రయించి నిన్ను ధర్మమును గూర్చి ప్రేరేపించుచున్నాను.(2,3)

రాజా! శైబ్యమహారాజు, తన దేహమును డేగకు ఇచ్చెద నని ప్రతిజ్ఞ చేసి ఆ ప్రతిజ్ఞ నెరవేర్చి ఉత్తమలోకాలు పొందినాడు. తేజఃశాలి యైన అలర్కుడు, వేదపారంగతుడైన బ్రాహ్మణుడు వచ్చి కోరగా నిస్సంకోచముగా తన నేత్రాలు పెకిలించి ఇచ్చివేసినాడు. సముద్రుడు కూడ సత్యమును అనుసరించుచు, వృద్ధిసమయాలలో కూడా తన అతిస్వల్పమైన సరిహద్దుగా ఉన్న చెలియలికట్ట దాటుట లేదు.(4-6)

'సత్యమ్' అనే ఒక్క పదము బ్రహ్మరూపము. ధర్మము సత్యముమీదనే ఆధారపడి ఉన్నది. సత్యమే అక్షయవేదాలు. సత్యము ద్వారానే పరమపదమును చేర కలుగుతారు. ఓ పురుషశ్రేష్ఠా! నీ బుద్ధి ధర్మముమీదనే స్థిరముగా నిలచి ఉన్న పక్షంలో సత్యము పాటించుము. నా వరాలు సఫలము లయ్యేటట్లు చేయుము. ఆ వరా లిచ్చినవాడవు నీవే కదా!(7, 8)

నీవు నీ ధర్మమును నిలుపుకొనవలెను. నేను కూడా ప్రేరేపించుచున్నాను.

ఈ రెండు కారణాలచేత రాముని అడవులకు పంపుము. మూడుసార్లు చెప్పుతున్నాను. (పంపుము; పంపుము; పంపుము). ఆర్యా! నీవు మన ఒప్పందము ప్రకారము చేయకపోయినచో నన్ను విడిచినట్లే. అందుచేత నీ ఎదుటనే ప్రాణాలు విడచెదను." (9,10)

ఏ మాత్రమూ జంకూ గొంకూ లేక కైకేయి ఈ విధముగా నిర్బంధించుటతో దశరథుడు, ఇంద్రుడు వామనుని ద్వారా ప్రయోగించిన ధర్మపాశమును బలిచక్రవర్తి విడిపించుకొనలేకపోయినట్లే విడిపించుకొనలేకపోయెను. కాడికీ, చక్రానికీ మధ్య పడి నలిగిపోతూన్న ఎద్దుకువలె దశరథునికి హృదయము తిరిగిపోయినది. ముఖము పాలిపోయినది. దశరథుడు వ్యాకులముగా ఉన్న నేత్రాలతో ఏమీ చూడలేకపోయెను. అట్టి స్థితిలో అతికష్టముగా ధైర్యముతో నిల్రదొక్కుకొని కైకేయితో ఇట్లు అనెను. (11-13)

"ఓ పాపాత్మురాలా! అగ్నిసాక్షిగా మంత్రసంస్కృతమైన నీ హస్తము గ్రహించితిని. ఆ హస్తమునూ, నీకు నావలన పుట్టిన కుమారునీ, నిన్నూ కూడా విడచివేసెదను. రాత్రి గడచిపోయి సూర్యోదయము కానున్నది. ఇంతకు పూర్వమే సిద్ధము చేసిన అభిషేకసంభారాలతో రామునికి అభిషేకము చేయుమని వసిష్ఠాదిగురువులు నన్ను తప్పక తొందరపెట్టెదరు. నీవు రామాభిషేకానికి విఘ్నము కలిగించే పక్షమున నీవు గాని, నీ కుమారుడు గాని నాకు ఉదకక్రియలు చేయవద్దు. నేను మరణించిన పిమ్మట రాముడే నాకు ఉదకక్రియలు చేయవలెను. (14-17)

పూర్వము అంత ఆనందముతో ఉన్న జనమును చూచిన నేను, ఇపుడు ఆ జనమే సంతోషము లేక, ఆనందము నశించి, తలలు వంచి, దుఃఖించుచుండగా చూడలేను". (18)

ఆ మహాత్ముడైన దశరథుడు ఆమెతో ఇట్లు మాటలాడుచుండగానే చంద్రనక్షత్రాలతో ప్రకాశిస్తూ పవిత్రమైన రాత్రి తెల్లవారినది. (19)

పాపమైన ప్రవృత్తికలదీ, మాటలు నేర్చినదీ అయిన కైకేయి, కోపావిష్టురాలై రాజుతో మరల పరుషముగా, "రాజా! విషమువలె తీవ్రబాధాకరమైన మాటలు మాట్లాడుతున్నావు. ఏమిటిది? ఇంక ఆలస్యము చేయకుండా నీ పుత్రుడైన రాముని ఇచటికి రప్పించుము. నా కుమారునికి రాజ్యము ఇచ్చి, రాముని వనానికి పంపి, నాకు శత్రువు లెవ్వరూ లేకుండా చేసినట్లయితే కృతకృత్యుడవు అయ్యెదవు." అని అన్నది. (20-22)

కొరడాతో గట్టిగా కొట్టిన ఉత్తమజాత్యశ్వము వలె ఆ రాజు ఆ విధముగా మాటలచే పొడవబడ్డవాడై కైకేయితో, "ధర్మపాశానికి కట్టుబడిపోయినాను. నా బుద్ధికూడా పనిచేయుట లేదు. ధర్మాత్ముడూ, నా ప్రియజ్యేష్ఠకుమారుడు అయిన, రాముని చూడగోరుతున్నాను." అనెను.(23, 24)

తెల్లవారి సూర్యు దుదయించెను. పుణ్యనక్షత్రముతో కూడిన శుభముహూర్తము సమీపించుచుండెను. అపుడు సద్గుణసంపన్నుడైన వసిష్ఠుడు శిష్యపరివృతుడై, అభిషేకసంభారాలతో అయోధ్యలో ప్రవేశించెను.(25, 26)

అయోధ్యలోని వీథులన్నీ తుడిచి నీళ్ళు చల్లి ఉండెను. దానిని అందమైన పతాకలచే అలంకరించిరి. అనేక మైన రంగుల పువ్వులు చల్లిరి. అనేక విధాలైన మాలికలు కట్టిరి. అక్కడ మనుష్యులందరూ ఆనందోత్సాహాలతో ఉండిరి. దుకాణాలు, బజారులూ కూడా వివిధవస్తువులతో సమృద్ధములుగా ఉండెను. ఎక్కడచూచినా మహోత్సవాలు జరుగుచుండెను. ప్రజలందరూ రాముని కోసం ఉత్కంఠతో ఎదురు చూచుచుండిరి. నలుమూలలా చందనసువాసనలూ, అగురుధూపాలూ వ్యాపించుచుండెను. సాక్షాత్తు దేవేంద్రుని నగరమైన అమరావతి వలె ఉండెను. అట్టి నగరములో ప్రవేశించిన వసిష్ఠుడు కొంత దూరంలో శ్రేష్ఠమైన రాజాంతఃపురము చూచెను. అక్కడ ఎందరో ద్విజులు గుంపులు గుంపులుగా చేరి ఉండిరి. పట్టణాల జనులు, గ్రామాలనుండి వచ్చిన జనులూ కిక్కిరిసి ఉండిరి. యజ్ఞవేత్తలు, సభార్హులు అయిన ఉత్తమద్విజులు వచ్చి ఉండిరి.(27-30)

మహర్షియైన ఆ వసిష్ఠుడు ఆ అంతఃపురము చూచి చాల సంతోషించి అక్కడ ఉన్న జనమును దాటి వెళ్ళి లోపల ప్రవేశించెను. అంతలో రాజద్వారమునుండి బైటకు వచ్చుచున్న, రాజసచివుడూ, చూడగానే ఆనందము కలిగించేవాడు అయిన సుమంత్రు డనే సారథి వసిష్ఠమునికి కనబడెను.(31, 32)

వసిష్ఠుడు పండితుడైన సుమంత్రునితో, "నేను వచ్చినట్లుగా రాజుతో శీఘ్రముగా వెళ్ళి చెప్పుము.(33)

గంగాజలము నింపిన కలశలూ, సముద్రజలాలతో బంగారు కలశలు, ఉదుంబరదారువుతో చేసిన భద్రపీఠమూ, అభిషేకముకొరకు వచ్చి ఉన్నాయి. అన్ని ధాన్యాలూ, గంధాలూ, వివిధరత్నాలూ, తేనె, పెరుగు, నెయ్యి, పేలాలు, దర్భలు, పువ్వులూ, పాలు, అందమైన ఎనమండుగురు కన్యలు, మదించిన ఏనుగు, నాలుగు గుఱ్ఱాలు కట్టి అందముగా ఉన్న రథము, ఖడ్గము, ఉత్తమమైన ధనుస్సు, పల్లకీ, చంద్రసదృశమైన ఛత్రమూ, తెల్లని వింజామరలూ, బంగారు పాత్ర, బంగారు

పగ్గాలతో కట్టబడినదీ, పెద్ద మూపురము కలదీ అయిన తెల్లని ఎద్దు, అందమైన జూలు గలదీ, నాలుగు పెద్ద దంతాలు కలదీ, మంచి బలం గలదీ అయిన శ్రేష్ఠమైన గుఱ్ఱమూ, సింహాసనమూ, వ్యాఘ్రచర్మమూ, ప్రజ్వలించుచున్న అగ్నీ, సకలవాద్యసమూహాలు, వేశ్యలు, అలంకరించుకున్న స్త్రీలు, ఆచార్యులూ, బ్రాహ్మణులూ, గోవులూ, పవిత్రమైన మృగాలూ, పక్షులూ, శ్రేష్ఠులైన నాగరికులూ, గ్రామీణులు, వివిధశిల్పిగణాలూ, వర్తకులూ, ఇంకను ఎంతోమంది ప్రియముగా మాటలాడే జనులూ, రాజులూ, రామాభిషేకముకొరకై వచ్చియున్నారు. (34-41)

సూర్యోదయము అయిన వెంటనే పుణ్యమైన నక్షత్రమునందు రామునికి పట్టాభిషేకము చేయుటకై మహారాజును తొందరపెట్టుము." అని ఆదేశించెను. (42)

వసిష్ఠుని మాటలు విని, సుమంత్రుడు ఆ రాజశ్రేష్ఠుని స్తుతించుచు అంతఃపురములో ప్రవేశించెను. అందరికంటె ముందుగా వచ్చినవాడూ, వృద్ధుడూ, రాజప్రియుడూ అయిన సుమంత్రుని ద్వారపాలకులు అడ్డుపెట్టలేదు. (43,44)

రాజు దగ్గరకు వెళ్ళిన సుమంత్రుడు అతడున్న పరిస్థితి తెలియక ఆనందకరములైన మాటలతో స్తుతించుట ప్రారంభించెను. సారథియైన సుమంత్రుడు రాజాంతఃపురములో, రాజుకు నమస్కరించుచు కాలానుగుణముగా ఈ విధముగా స్తుతించెను. (45, 46)

"సహజముగా ఆనందముతో నిండిన నీవు సూర్యోదయసమయములో తేజఃశాలియైన సముద్రుడు ఆనందించినట్లు, సంతోషభరితమైన మనస్సుతో ఆనందించుము. ఇట్టి ప్రాతఃకాలమునందే మాతలి దేవేంద్రుని స్తుతించెను. ఇంద్రుడు సకలదానవులను జయించెను. నేను కూడ నిన్ను అట్లే మేల్కొలుపుచున్నాను. వేదాలు, వాటి అంగవిద్యలూ - తనంతటతానే పుట్టినవాడూ, ప్రభువూ అయిన బ్రహ్మదేవుని మేల్కొల్పినట్లు నేను నిన్ను మేల్కొల్పుచున్నాను. సూర్యచంద్రులు సమస్తప్రాణులను ధరించేదీ, మంగళకరమైనదీ అయిన పృథ్విని మేల్కొల్పినట్లు నిన్ను మేల్కొలుపుచున్నాను. (47-50)

మహారాజా! ఉత్సవానుగుణమై మంగళవేషము ధరించి, ప్రకాశించుచున్న శరీరముతో మేరుపర్వతమునుంచి సూర్యుడు లేచినట్లు వెంటనే లెమ్ము. సోమసూర్యులూ, శివకుబేరులూ, వరుణుడూ, అగ్నీ, ఇంద్రుడూ నీకు సర్వోన్నతిని ఇచ్చెదరు గాక. (51, 52)

పూజ్యమైన రాత్రి గడిచిపోయినది. ఇంతవరకు జరిగిన పనులు తెలిసికొని, ఇటుపై చేయదగిన పనులు చేయుము. రామాభిషేకానికి కావలసిన దంతయు

సిద్ధము చేయబడినది. పూజ్యుడైన వసిష్ఠుడు బ్రాహ్మణసమేతుడై పౌరులూ, జానపదులూ, వర్తకులూ నమస్కరించుచుండగా ద్వారము వద్ద వేచియున్నాడు. రామాభిషేకమును గూర్చి శీఘ్రముగా ఆజ్ఞ ఇమ్ము. రాజు లేని రాజ్యము - పాలకుడు లేని పశువువలె, నాయకుడు లేని సేనవలె, చంద్రుడు లేని రాత్రివలె, వృషభము లేని గోవులవలె అయిపోవును గదా!"(53-57)

మంచి అర్థముకలది, బ్రతిమాలుతూన్నట్లు ఉన్నది అయిన సుమంత్రుని మాటను విని దశరథుడు ఇంకను శోకాక్రాంతు డైనాడు. దశరథుడు కుమారుని గూర్చి ఆలోచనతో సంతోషము సన్నగిలి, దుఃఖంచేత ఎఱ్ఱనైన నేత్రాలతో ఆ సూతుని వైపు చూచి, "నీ మాటలతో ఇంకను నా మర్మాలు ఛేదించుచున్నావు." అని పలికెను.(58, 59)

దీనుడైన ఆ దశరథుని చూచి, కరుణాభరితమైన అతని మాటలు వినగానే సుమంత్రుడు అంజలి ఘటించి ఆ ప్రదేశమునుండి కొంచెము దూరముగా జరిగెను.(60)

దైన్యవశముచేత దశరథుడు స్వయముగా ఏమీ ప్రత్యుత్తరము చెప్పలేకపోయెను. అప్పుడు ఆలోచనలలో సమర్థురాలైన కైకేయి సుమంత్రునితో, "సుమంత్రా! రామునికి రాజ్యాభిషేకము జరుగుననే ఆనందావేశముతో రాజు రాత్రి అంతా నిద్రలేక అలసిపోయి ఇపుడు నిద్రపోవుచున్నాడు. అందుచేత నీవు శీఘ్రంగా వెళ్ళి రాముని తీసికొనిరమ్ము. నీకు మంగళమగుగాక. ఈవిషయములో ఏమీ ఆలోచించవలసిన పనిలేదు." అనెను.(61-63)

అతడు ఇంక మంగళకార్యము జరగనున్న దని మనస్సులో అనుకొనుచు, ఆనందించి, సంతోషించుచు, "ధర్మాత్ముడైన రాముడు అభిషేకార్థము ఇచ్చటికి తప్పక రానున్నాడు." అని అనుకొనుచు, మహాబాహువైన రాముని చూడవలెననే కోరికతో బయలుదేరెను.(64-66)

సాగరములోని లోతైన ప్రదేశముతో సమానమైన అంతఃపురమునుండి బైటకు వచ్చిన సుమంత్రుడు, ఎదుట జనముతో కిక్కిరిసి ఉన్న ద్వారము చూచెను. అతడు ద్వారము సమీపించి, అప్పటికే వచ్చి వేచియున్న రాజులను, మహాధనవంతులైన వివిధశ్రేణులకు చెందిన పౌరులను చూచెను.(67, 68)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని పదునాలుగవ సర్గము సమాప్తము.

పదిహేనవ సర్గము

సుమంత్రుడు రాముని పిలుచుకొని వచ్చుటకు అతడి గృహమున కేగుట.

సకలవేదపారంగతులైన బ్రాహ్మణులు ఆ రాత్రి అంతా అక్కడనే ఉండి తెల్లవారగానే వసిష్ఠసహితులై (అభిషేకమండపానికి) దగ్గరగా ఉన్న ప్రదేశము చేరిరి. మంత్రులూ, సేనాధిపతులూ, నగరముఖ్యులూ (వర్తకులలో ప్రముఖులూ), రామాభిషేకము విషయములో అత్యానందభరితులై అక్కడ చేరిరి.(1, 2)

స్వచ్ఛముగా సూర్యోదయము అయిన పిమ్మట పగటి భాగమున పుష్యమీనక్షత్రమునందు, రాముని జన్మలగ్నమైన కర్కటలగ్నము వచ్చిన తరువాత రామునికి రాజ్యాభిషేకము చేయవలె నని బ్రాహ్మణశ్రేష్ఠులు నిర్ణయించిరి.(3)

సువర్ణమయములైన పూర్ణకుంభములూ, బాగా అలంకరించిన మంగళపీఠమూ, అందమైన వ్యాఘ్రచర్మము, చక్కగా పరచిన రథము ప్రకాశించుచున్నవి. పవిత్రమైన గంగాయమునాసంగమమునుండి, పుణ్యమైన ఇతరనదులనుండి, హ్రదాల (పెద్దచెరువుల) నుండి, కూపాలనుండి, సరస్సులనుండి, తూర్పుగాను, పడమటగానూ, అడ్డంగానూ ప్రవహించే నదులనుండి, ఒకదానితో ఒకటి కలిసిన నదులనుండి, నాలుగు సముద్రాలనుండి, తీసికొని వచ్చిన ఉదకము ప్రకాశించుచున్నది. పేలాలు పోసి, పాలచెట్ల ఆకులూ, పద్మాలు, కలువలు కప్పి పవిత్రమైన జలాలతో నింపిన బంగారు కలశములు, వెండి కలశములు, అక్కడ ప్రకాశించుచున్నవి. తేనె, పెరుగు, నెయ్యి, లాజలు, దర్భలు, పుష్పాలు, పాలు-ఇవన్నీ, సిద్ధముచేయబడి ప్రకాశించుచున్నవి. శుభాచారవతులైన, చక్కగా అన్ని అలంకారాలు అలంకరించుకొన్న వేశ్యాస్త్రీలు కూడా అక్కడ ప్రకాశించుచున్నారు. (4-8)

వికసించిన చంద్రకిరణపుంజమువలె ఉన్నదీ, బంగారముతో నిర్మించబడినదీ, రత్నాలచేత అలంకరించబడినదీ అయిన, ఉత్తమమైన వింజామర రామునికొరకై సిద్ధము చేయబడి ఉన్నది. చంద్రమండలము వలె ఉన్నదీ, శోభాకరమైనదీ, శోభతో కూడినదీ, అభిషేకసమయమునందు ముందుగా అమర్చబడినదీ అయిన శ్వేతచ్ఛత్రము కూడ సిద్ధముగా ఉన్నది. తెల్లని వృషభమూ, తెల్లని అశ్వమూ, మదోదకము స్రవించుచున్నదీ, రాజులు ఎక్కుటకు తగినదీ అయిన శోభాయుక్తమైన గజమూ సిద్ధముగా వేచి ఉన్నవి.(9-11)

సమస్తమైన ఆభరణములు అలంకరించుకొన్న, మంగళప్రదలైన ఎనమండుగురు కన్యలు, అన్ని విధాలైన వాద్యములూ, స్తోత్రపాఠకులు, తదితరులు కూడా నిరీక్షించుచున్నారు. (12)

ఇక్ష్వాకువంశీయుల రాజ్యములో ఎట్టి అభిషేకద్రవ్యసముదాయమును సమకూర్చుదురో ఆ జాతికి చెందిన రాజపుత్రాభిషేకానికి ఉపయోగించే అభిషేకద్రవ్యాలను రాజాజ్ఞప్రకారము సమకూర్చుకొని అచటకు చేరిన వారందరూ, రాజు కనబడకపోవుటతో "మన మందరమూ వచ్చినట్లుగా రాజుకు ఎవ్వరి ద్వారా తెలియపరచవలెను." అని అనుకొనిరి. (13, 14)

"రాజు కనబడుట లేదు. సూర్యుడు ఉదయించినాడు. ధీమంతుడైన రామునికి యౌవరాజ్యాభిషేకానికి అంతా సిద్ధముగా ఉన్నది." అనుకొనిరి. (15)

సుమంత్రుడు, వారందరును ఆ విధముగా మాటలాడుచుండగా విని సకలదేశముల నుండి వచ్చిన ఆ రాజులతో, "నేను రాజాజ్ఞప్రకారము రాముని వద్దకు వెళ్లుచున్నాను. మీరందరును దశరథునకు, విశేషించి రామునకు పూజనీయులు. మేల్కొన్న రాజు సుఖముగానే ఉన్నాడా అనే విషయమునూ, ఇచటికి రాకపోవుటకు కారణమునూ, మీ మాటగా నేను అడిగెదను." అనెను. (16-18)

ఆ విధముగా పలికి, అంతఃపురద్వారము సమీపించి సుమంత్రుడు సర్వదా మూసియుండే అంతఃపురములోనికి ప్రవేశించెను. అతడు అంతఃపురము ప్రవేశించి, ఆరాజు వంశములను స్తుతించెను. రాజశయనాగారము సమీపించి అక్కడ నిలచెను. తెరకు దగ్గరగా ఉండునట్లు ఆ శయ్యాగారములోనికి ప్రవేశించి, దశరథుని గుణవర్ణనము చేయుచు స్తుతించెను. (19-21)

"దశరథమహారాజా! సూర్యచంద్రులు, మహేశ్వరకుబేరులు, వరుణుడు, అగ్ని, ఇంద్రుడు వీరందరూ నీకు విజయము (సర్వోత్కర్షను) ఇచ్చెదరుగాక. రాజశ్రేష్ఠా! పూజనీయమైన రాత్రి గడచినది. మంగళకరమైన పగలు వచ్చినది. మేల్కొని తరువాత చేయవలసిన కార్యములు చేయుము. బ్రాహ్మణులూ, సేనాధిపతులూ, నైగములు వచ్చి నీ దర్శనంకొరకు వేచియున్నారు; మేల్కొనుము". (22-24)

అపుడు దశరథుడు మేల్కొని ఆ విధముగా స్తోత్రము చేయుచున్న మంత్రవేత్తా, తన సారథీ అయిన సుమంత్రునితో- "రాముని తీసుకొని రమ్ము." అని ఈమె

చెప్పినది కదా; అయినను నా ఆజ్ఞను పాటించకుండుటకు కారణమేమి? నేను నిద్రపోవుటలేదు. వెంటనే రాముని ఇక్కడకు తీసుకొని రమ్ము." అని ఆదేశించెను.(25-27)

అతడు రాజు మాటలు విని, అతనికి శిరస్సు వంచి నమస్కరించి, ప్రియము కలగవలె నని మనసా చింతించుచు, రాజగృహమునుండి బయటకు వచ్చెను. ప్రసన్నచిత్తుడై పతాకాధ్వజములతో శోభించుచున్న రాజమార్గమును చూచి పరమానందభరితు డగుచు వెళ్ళెను. అక్కడ, సంతసించిన ప్రజలందరూ చెప్పుకొనుచున్న - రామునికి, రామాభిషేకానికి సంబంధించిన మాటలు వినుచు వెళ్ళి, కైలాసశిఖరమువలె ఎత్తుగాను, ఇంద్రభవనమువలె మనోహరముగాను ఉన్న అందమైన రామభవనమును చూచెను.(28-31)

శ్రీరాముని గృహము పెద్ద పెద్ద తలుపులతో వందలకొలది అరుగులతో అందముగా ఉన్నది. ఒక శిఖరముమీద బంగారు ప్రతిమలు చెక్కబడినవి. మణులతోను, పొగడాలతోను, ద్వారాలు అలంకరింపబడినవి. శరత్కాలమునందు మేఘమువలె, మేరుపర్వతగుహవలె ప్రకాశించు అనేకమణులతో అలంకరింపబడి ఉన్నది. ముత్యాలు చల్లబడి ఉన్నవి. చందనాగురుసమలంకృతమై దర్దురపర్వతశిఖరము వలె మనోహరమైన సువాసనలు వెదజల్లుచున్నది. సారసపక్షులూ, నెమళ్ళు మధురముగా కూయుచున్నవి. ఈహామృగాలూ, ఎన్నో నగిషీలు అక్కడక్కడ చెక్కబడి ఉన్నవి. తీవ్రమైన తేజస్సుతో ప్రాణుల మనస్సునూ చూపునూ కూడా ఆకర్షించుచున్నది. చంద్ర-సూర్యమండలాలవలె దేదీప్యమానముగా ఉన్నది. కుబేరభవనమువలె మహేంద్రుని ప్రాసాదము వలె ప్రకాశించుచున్నది. అనేక పక్షులతో వ్యాకులముగా ఉన్నది. మేరుశృంగమువలె ఉన్నతముగా ఉన్నది. అట్టి రామప్రాసాదమును సూతుడు చూచెను. వివిధప్రాంతాలనుండి వచ్చిన జనులు రామాభిషేకముకొరకు ఎదురు చూచుచు, ఉపాయనాలు చేతపట్టుకొని వినీతులై నిలచి ఉండిరి. మహామేఘమువలె ఉన్నతముగా ఉన్నదీ, వివిధరత్నాలంకృతమూ అయిన ఆ గృహము పరిచారకులైన కుబ్జులు, కిరాతులు మొదలైన వారితో వ్యాప్తమైయున్నది.(32-40)

సుమంత్రుడు రామగృహము వైపు వెళ్ళుచున్న, ఆచ్ఛాదనయుక్తమైన, అశ్వములు కట్టిన రథము నెక్కి జనసమ్మర్దముతో నిండిన ఆ రాజకులమును ప్రకాశింపచేయుచు, అందరి పౌరుల మనస్సును సంతోషపెట్టుచు వెళ్ళెను. మహాత్ముడైన ఆ శ్రీరాముని

ప్రాసాదము దేవేంద్రుని భవనమువలె మహైశ్వర్యసంపన్నముగా ఉన్నది. అనేకమైన మృగములతోను నెమళ్ళతోను నిండి ఉన్నది. ఆ గృహమును సమీపించగానే సుమంత్రునికి గగుర్పాటు కలిగినది.(41, 42)

రాముని గృహములోని వాకిళ్ళు, కైలాసము వలె ఉన్నతములై చక్కగా అలంకరింపబడి దేవతాగృహములవలె ఉన్నవి. సుమంత్రుడు అచట ప్రవేశించి, రాముని హితమును కోరే మిత్రులను అనేకులను దాటుకొనుచు అంతఃపురమును సమీపించెను. అక్కడ అతడు శ్రీరాముని అభిషేకమును గూర్చి, రాముని మంగళముకొరకై చేయబడు క్రియలను గూర్చి, ఆనందభరితములైన సకలజనులు చెప్పుకొనుచున్న మాటలను వినెను.(43, 44)

రాముని ప్రాసాదము మేరుశిఖరమువలె ఉన్నతముగా కాంతితో ప్రకాశించుచున్నది. మృగపక్షులతో నిండియున్నది. మహేంద్రుని భవనమువలె, అద్భుతముగా ఉన్నది. అట్టి రాముని గృహమును సుమంత్రుడు చూచెను. కోట్ల కొలది పరార్థముల కొలది జానపదులు, ఇతరజనులు ఉపాయనములతో వచ్చి, తమ తమ వాహనములను విడచి, చేతులు కట్టుకొని ఆ ద్వారప్రదేశముదగ్గర నిలచి ఉండిరి. అట్టి ద్వారప్రదేశమును సుమంత్రుడు చూచెను.(45, 46)

అక్కడ రాము డెక్కవలసిన అత్యున్నతమైన శరీరము కల శత్రుంజయ మనే సుందరమైన గజమును చూచెను. అది మేఘమువలె, పర్వతము వలె ఉన్నది. మదము స్రవించుచు, అంకుశమును కూడ లెక్కచేయక సహింపరానిదై ఉన్నది. రాజప్రియులైన అమాత్యముఖ్యులు చక్కగా అలంకరించుకొని అశ్వ, రథ, కుంజరములను ఎక్కి అచటకు వచ్చియుండిరి. సుమంత్రుడు గుమిగూడియున్న వారిని అందరిని తప్పించుకొని ఐశ్వర్యసమృద్ధమగు రాముని అంతఃపురములోనికి ప్రవేశించెను. పిమ్మట అతడు పర్వతశిఖరమువలె, నిశ్చలమైన మేఘమువలె ఉన్నదియు, చుట్టును గొప్ప విమానముల వంటి గృహములు కలదియు అయిన రాముని భవనమును ప్రవేశించెను. అతనిని ఎవ్వరును అడ్డుకొనలేదు.(47-49)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని పదిహేనవ సర్గము సమాప్తము.

పదహారవ సర్గము

సుమంత్రుడు రామభవనము చేరి మహారాజు సందేశము వినిపించుట.

పురాతనవేత్త అయిన సుమంత్రుడు జనులు నిండి ఉన్న ఆ అంతఃపురద్వారమును దాటి జనసమ్మర్దము లేని వాకిలిని చేరుకొనెను. ఆ కక్ష్యఅంతములో కొందరు యువకులు ప్రాసలు ధనుస్సులు ధరించి, అప్రమత్తులై, ఏకాగ్రచిత్తులై, రక్షణకార్యమును నిర్వర్తించుచుండిరి. వారందరును గొప్ప రాజభక్తికలవాడు. అందమైన కుండలాద్యలంకారములను ధరించినవారు. (1, 2)

అక్కడ కాషాయవస్త్రములు ధరించి చక్కగా అలంకరించుకొని, చేత బెత్తములు ధరించి జాగరూకతతో ఉన్న ద్వారనియుక్తులయిన అంతఃపురాధ్యక్షులైన వృద్ధులను చూచెను. వచ్చుచున్న ఆ సుమంత్రుని చూడగానే రాముని ప్రియమునే సర్వదా చింతించుచుండెడు వారందరు తొందరపడుచు వెంటనే తమ ఆసనములనుండి లేచిరి. (3, 4)

వినయశీలుడైన ఆ సుమంత్రుడు దాక్షిణ్యపూర్వకముగా, "సుమంత్రుడు ద్వారములో నిలచియున్నాడు అని శీఘ్రముగా వెళ్ళి రామునితో చెప్పుడు." అని వారితో పలికెను. (5)

ప్రభువునకు ప్రియముచేయ కోరికగల వారు రాముని దగ్గరకు వెళ్ళి భార్యాసమేతు డగు అతనికి వెంటనే తెలిపిరి. (6)

తన తండ్రికి అంతరంగికమిత్రుడైన, సుమంత్రుడు వచ్చినట్లు తెలిసి రాముడు అతనికి ప్రియము చేయవలె నను కోరికతో తనవద్దకే పిలిపించెను. సుమంత్రుడు, శ్రేష్ఠమైన ఆచ్ఛాదనము గల బంగారు పర్యంకముపై కూర్చొని కుబేరుని వలె ఉన్న ఆ రాముని చూచెను. అతడు చక్కగా అలంకరించుకొని, వరాహరక్తము వలె నున్న 'పవిత్రమైన' సుగంధము గల శ్రేష్ఠమైన చందనమును శరీరమునకు పూసుకొని యుండెను. ప్రక్కనే నిలచి వింజామర చేత ధరించియున్న సీతతో, ఆ పరంతపుడు చిత్రానక్షత్రముతో గూడిన చంద్రుని వలె ప్రకాశించుచుండెను. వినయశీలుడైన ఆ సుమంత్రుడు, వినీతుడై మహాతేజస్సంపన్నుడై, సూర్యునివలె ప్రకాశించుచున్న రామునికి నమస్కారము చేసెను. (7-11)

సుమంత్రుడు సుఖాసనముపై కూర్చొని యున్న రమణీయవదనుడైన ఆ రాజకుమారుని చూచి, చేతులు జోడించి, "రామా! నీ తండ్రి, రాణియైన కైకేయీ

నిన్ను చూడవలె నని కోరుచున్నారు. అచటికి వెంటనే వెళ్ళుము." అని పలికెను. (12,13)

ఆ నరశ్రేష్ఠుడు ఆ మాటలు విని సంతోషించి అతనిని గౌరవించి సీతతో "సీతా! మహారాజు, మహారాణియు కలసి నన్నుగూర్చి, నా రాజ్యాభిషేకమునకు సంబంధించిన ఏదో విషయమును గూర్చి ఆలోచించుచున్నారు. నిశ్చయము. కైకేయి రాజు అభిప్రాయమును ఊహించి అతనికి ప్రియము చేయ గోరుచు నా నిమిత్తమై అతనిని ప్రేరేపించుచున్నది. నాతల్లి కైకేయి మహారాజు మనస్సును అనుసరించుచు, సంతోషించి నా హితమును, లాభమును కోరుచున్నది. మన అదృష్టముచే మహారాజు, రాణియు నాకు అర్థకామములను సంపాదించి ఇచ్చు సుమంత్రుని దూతగా పంపినారు.(14-18)

అక్కడ కలిసియున్న పరిషత్తుకు(నా తల్లితండ్రులకు) తగిన దూత వచ్చినాడు. నేడే రాజు నన్ను తప్పక యౌవరాజ్యాభిషిక్తుని చేయగలడు. నేను వెంటనే వెళ్ళి రాజును చూచెదను. నీవు ఈ పరివారముతో సుఖముగా నుండి విహరించుము." అని పలికెను. (19,20)

సీత, మనస్సులో మంగళములను తలచుకొనుచు భర్తను ద్వారమువరకు సాగనంపెను. "బ్రహ్మ దేవేంద్రునకు ఇచ్చినట్లుగా దశరథమహారాజు, రాజసూయాభిషేకమునకు యోగ్యత్వమును కల్గించు ద్విజసేవితమైన రాజ్యమును నీకు ఇచ్చును. నీవు దీక్షితుడవై వ్రతము పాటించుచు, కృష్ణాజినమును ధరించి శుచివై చేతిలో లేడికొమ్ము ధరించి యుండగా నేను చూచి ఆనందించెదను. నిన్ను తూర్పుదిక్కున ఇంద్రుడు, దక్షిణమున యముడు, పశ్చిమమున వరుణుడు, ఉత్తరమున కుబేరుడు రక్షించెదరు గాక." అని పలికెను.(21-24)

ఉత్సవమంగళాలంకారములు ధరించి యున్న రాముడు, సీత అనుజ్ఞ తీసుకొని సుమంత్రునితో కలసి గృహమునుండి బయలుదేరెను. పర్వతగుహలో నివసించు సింహము పర్వతమునుండి బయటకు వచ్చినట్లు, తన భవనమునుండి బయటకు వచ్చిన ఆ రాముడు, సవినయముగా చేతులు కట్టి ద్వారమునందు నిలబడియున్న లక్ష్మణుని చూచెను.(25, 26)

పురుషశ్రేష్ఠుడైన ఆ రాజకుమారుడు మధ్యకక్ష్యలో మిత్రులను కలుసుకొనెను. తన దర్శనము కోరి, అచటకు వచ్చిన అందరిని చూచి దగ్గరకు వెళ్ళి అభినందించి అగ్నితో సమానమైనది, వ్యాఘ్రచర్మము కప్పినది, ప్రకాశించుచున్నది యైన

శ్రేష్ఠరథమును ఎక్కెను. ఆ రథము ధ్వని మేఘధ్వని వలె ఉండెను. విశాలమైన దానిని, మణులతోను, బంగారముతోను అలంకరించిరి. కాంతిచే అది కండ్లకు మిరుమిట్లు కొల్పుచు మేరుపర్వతము వలె నుండెను. ఆ రథమునకు ఏనుగుపిల్లలవలె నున్న ఉత్తమమైన అశ్వములు కట్టబడి యున్నవి. అట్టి రథమును దేవేంద్రుడు వలె అధిష్ఠించి తేజస్సుతో ప్రజ్వలించుచున్న రాముడు శీఘ్రముగా బయలుదేరెను. (27-30)

శోభాయుక్తమైన ఆ రథము, ఆకాశమునందు ధ్వనించుచున్న మేఘము వలె ధ్వనిచేయుచు, మహామేఘమునుండి చంద్రుడు బయటకు వచ్చినట్లు గృహమునుండి బయలుదేరెను. లక్ష్మణుడు చేతులలో ఛత్రచామరములను ధరించి, రథమెక్కి వెనుక నిలచి సోదరుని రక్షించుచుండెను. (31, 32)

అపుడు, నలువైపులనుండియు, జనసముదాయము బయలుదేరగానే అత్యధికమైన కలకలశబ్దము బయల్దేరెను. ప్రధానులైన సైనికులు వందలకొలది రాముని అనుసరించి వెళ్ళిరి. చందనాగురువులచే అలంకృతులై, కవచములను తొడిగి ఖడ్గచాపములను ధరించియున్న శూరులైన భటులు రాముని ఆగమనమును ఘోషించుచు అతని ఎదుట నడిచి వెళ్ళిరి. ఆ సమయమున వాద్యధ్వనులు, వందిమాగధుల స్తోత్రధ్వనులు, శూరుల సింహనాదములు ఆ మార్గమునందు వ్యాపించినవి. (33-36)

రాముడు వెళ్ళుచున్నప్పుడు చక్కగా అలంకరించుకొని స్త్రీలు మేడల కిటికీల వద్ద నిలబడి నలువైపులనుండి అతనిపై మంచి పుష్పములను చల్లిరి. మేడలపైనను, భూమిపైనను ఉన్న ఉత్తమస్త్రీలు రామునకు ప్రీతిని కలిగించుటకై మంచి మాటలు పలుకుచు రామునికి నమస్కరించిరి. (37, 38)

"తల్లికి ఆనందము కలిగించు ఓ రామా! సఫలమైన యాత్ర కలిగి తండ్రి రాజ్యము పొందు నిన్ను చూచి నీ తల్లియైన కౌసల్య తప్పక ఆనందించును". (39)

రాముని హృదయప్రియురాలగు సీత సకలస్త్రీలలో ఉత్తమురాలని ఆ స్త్రీలు భావించిరి. (40)

రోహిణి చంద్రునితో కలసినట్లు రాముని భర్తగా పొందిన సీతాదేవి పూర్వము గొప్ప తపస్సు చేసి యున్నది. సందేహము లేదు. ప్రాసాదశిఖరములు ఎక్కియున్న స్త్రీలు పలికిన ఆ ప్రియవచనములు రాజమార్గమున వెళ్ళుచున్న రామునకు

వినబడుచుండెను. (41,42)

అతడు అచట గుమిగూడిన జనుల మాటలను, మిక్కిలి సంతోషించిన పౌరులు తనను గూర్చి చెప్పుకొనుచున్న అనేక విధములగు వాక్కులను వినెను. (43)

"ఈ రాముడు నేడు రాజానుగ్రహమువలన ఈ భూమిని, రాజ్యలక్ష్మినీ పొందనున్నాడు. ఇట్టి రాముడు మనకు పాలకుడు కానున్నాడు కాన మన కోరిక లన్నియు సఫలములు కానున్నవి. ఈ రాముడు ఈ రాష్ట్రమునంతను చాలా కాలము పరిపాలింపనున్నా డనునది ప్రజలకు గొప్ప లాభము. ఇతడు రాజైనచో ఎవ్వరును, ఎన్నడును, అప్రియమునుగాని, దుఃఖమునుగాని చూడరు."(44, 45)

ముందు నడచుచున్న సూతులూ, మాగధులూ, స్వస్తివాక్యములు పలుకుచు, పూజించుచుండగా, శ్రేష్ఠమైన వాద్యములను ప్రయోగించువారు స్తుతించుచుండగా, రాముడు ధ్వని చేయుచున్న గజహయములతో కూడి కుబేరుడు వలె, బయలుదేరి వెళ్ళెను. అతడు అనేకమైన రత్నములు, వివిధములైన అమ్మజూపిన వస్తువులుగల పరిశుద్ధముగా నున్న రాజమార్గమును చూచెను. అది ఏనుగులతోను అశ్వములతోను కిక్కిరిసి యుండెను. అచటనున్న చతుష్పథము లన్నియు జనసముదాయములతో నిండి యుండెను. (46, 47)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని పదహారవసర్గము సమాప్తము.

పదిహేడవ సర్గము

రాముడు రాజమార్గపు శోభను చూచుచు, మిత్రుల వచనములు వినుచు తండ్రి యింట ప్రవేశించుట.

సంతోషించుచున్న మిత్రులతో కూడిన శ్రీమంతుడైన ఆ రాముడు రథ మధిష్ఠించి, పతాకలతోను, ధ్వజములతోను, అలంకరింపబడినదీ, ఉత్తమమైన అగరువుచే ధూపము వేయబడినదీ, చాలామంది జనులతో నిండినదీ అయిన నగరమును చూచుచు, అగరుధూపితమైన రాజమార్గము మధ్యనుండి ప్రయాణము చేసెను. ఆ రాజమార్గము మేఘమువలె ఉన్నతమైన, తెల్లని భవనములతో ప్రకాశించుచుండెను. (1, 2)

రాముడు చందనములు, శ్రేష్ఠమైన అగురు, ఉత్తమమైన సుగంధద్రవ్యములు,

తెల్లని పట్టువస్త్రములు- వీటితో నిండినదీ, రంధ్రము చేయని ముత్యములు, ఉత్తమమైన స్ఫటికనిర్మితవస్తువులు, అనేకవిధములగు పుష్పములు, భక్ష్యములు మొదలగువాటిలో ప్రకాశించుచున్నదీ, విశాలముగ నున్నదీ యైన ఆ ఉత్తమ రాజమార్గమును ప్రవేశించెను. రాముడు చూచిన ఆ రాజమార్గము స్వర్గమునందు దేవమార్గమువలె ఉండెను. అక్కడనున్న విశాలప్రదేశములన్నియు పెరుగు, అక్షతలు, హవిస్సు, పేలాలు, ధూపములు, అగురు, చందనము, అనేకవిధములగు మాల్యములు, సుగంధద్రవ్యములు వీటితో సర్వదా పూజింపబడుచుండెను. (3-6)

రాముడు స్నేహితులు పలుకుచున్న అనేక ఆశీర్వాదవాక్యములు వినుచు, అక్కడనున్న వారందరిని తగు విధముగా గౌరవించుచు వెళ్ళెను. (7)

"నేడు రాజ్యాభిషిక్తుడవై నీ తాతలును, ముత్తాతలును అనుసరించిన మార్గమును అనుసరించుచు రాజ్యమును పాలింపుము. రాముడు రాజైనచో అతని తండ్రి పరిపాలించినప్పటికంటెను, అతని తాతలు పాలించినప్పటికంటెను, ఎక్కువగా సుఖముగా ఉండగలము. మనము నేడు రాజ్యాభిషిక్తుడై, ఊరేగుచున్న రాముని చూడగల్గినచో మనకు భోజనముతోగాని ఇతర కార్యక్రమముతో గాని పనిలేదు. మనకు మహాతేజశ్శాలియైన రాముని రాజ్యాభిషేకమునకు మించిన ప్రియమేదియు ఉండదు."(8-11)

రాముడు తన మిత్రులు తనను ప్రశంసించుచు పలుకుచున్న ఆ మంచి మాటలను విన్నను సంతోషమును ప్రకటింపక రాజమార్గమునందు వెళ్ళెను. (12)

దూరమైపోయినను ఏ ఒక్కడును, తన మనస్సును, దృష్టిని, ఆ నరశ్రేష్ఠునినుండి వెనుకకు మరలింపజాలకపోయెను. రాముని చూడనివానిని, రామునిచే చూడబడనివానిని, లోకులందరును నిందింతురు. అట్టివాడు తనను తానే నిందించుకొనును. (13, 14)

ధర్మాత్ముడైన ఆ రాముడు నాలుగు వర్ణములకు చెందిన సర్వజనులందును, వయోవృద్ధులందును, దయ చూపును. కావుననే వారందరు అతనిపై అంత ప్రేమ కలిగియుండిరి. (15)

చతుష్పథములు, దేవాలయమార్గములు, చైత్యములు, దేవాలయములు, తనకు కుడి ప్రక్కకు వచ్చునట్లుగా, వాటిని దాటుచు వెళ్ళెను. రాజకులమును ప్రవేశించి తేజస్సుతో ప్రజ్వలించుచు భూలోకమునందున్న దేవేంద్రుని భవనమువలె, సర్వగృహశ్రేష్ఠమైన తండ్రి గారి గృహములోనికి ప్రవేశించెను. ఆ గృహము చుట్టును, మేఘముల వలె, కైలాసశిఖరముల వలె, తెల్లని విమానముల వలె, ఆకాశమును

అంటుచున్న అనేకవిధములైన ప్రాసాదశృంగములును, రత్నాలంకృతములైన రాజార్హములైన వర్ధమానగృహములును ఉండెను.(16-19)

ఆ నరశ్రేష్ఠుడు ధనుర్ధరులు రక్షించుచున్న మూడు కక్ష్యలను, రథముతో దాటి, మిగిలిన రెండు కక్ష్యలను పాదచారియై దాటి వెళ్ళెను. ఆ వాకిళ్ళన్నియు దాటి, తన పరివారమును వెనుకకు పంపివేసి అంతఃపురములో ప్రవేశించెను.(20, 21)

అపుడు రాముడు తండ్రి దగ్గరకు వెళ్ళగా అక్కడ ఉన్న వారందరు సంతోషించుచు, సముద్రుడు చంద్రోదయమునకై వేచి యున్నట్లు అతడు తిరిగి వచ్చుటకై వేచియుండిరి.(22)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని పదిహేడవసర్గము సమాప్తము.

పద్దెనిమిదవ సర్గము

కైకేయి తాను కోరిన రెండు వరములను గూర్చి తెలిపి, రాముని వనవాసమునకు ప్రేరించుట.

రాముడు మంగళకరమగు ఆసనముపై కూర్చొనియున్న తండ్రిని చూచెను. అతడు ఎండిన ముఖముతో, దీనుడై ఉండెను. ఆ ప్రక్కనే కైకేయి ఉండెను. రాముడు వినయవంతుడై సావధానమగు చిత్తముతో ముందుగా తండ్రికి పాదాభివందనము చేసి, పిదప కైకేయి పాదములకు నమస్కరించెను.(1, 2)

దశరథుడు "రామా!" అని ఒక్క మాట మాత్రము పలికి కన్నీరు నిండిన నేత్రములతో దీనుడై, చూచుటకుగాని, మరొక మాట పలుకుటకుగాని సమర్థుడు కాకపోయెను.(3)

పూర్వ మెన్నడూ చూడని భయంకరమైన తండ్రి ఆకారము చూచి రాముడు పామును తొక్కినవాని వలె భయపడెను. ఆ దశరథమహారాజు సంతోషశూన్యములైన ఇంద్రియములతో శోకసంతాపములతో కృశించి, వ్యథ చెంది, వ్యాకులమైన చిత్తము కలవాడై, నిట్టూర్చుచుండెను. గ్రహణము పట్టిన సూర్యుడు వలె, అసత్యమాడిన ఋషివలె, తేజోవిహీనుడై ఉండెను. అతనిని చూచి రాముడు కూడ భయపడెను. రాజునకు కలిగిన ఊహింపశక్యముకాని ఆ శోకమును గూర్చి ఆలోచించుచు,

మిక్కిలి కలత చెందెను.(4-7)

తండ్రి హితమును గోరు, బుద్ధిశాలియగు రాముడు ఈ విధముగా చింతించెను - "ఎందుచేతనో తండ్రిగారు ఈనాడు, నన్ను సంతోషపూర్వకముగా పలుకరించుటలేదు. పూర్వము కోపముగా నున్నపుడు కూడ, నన్ను చూడగానే తండ్రి ప్రసన్నుడగుచుండెడివాడు. అట్టి తండ్రి ఈనాడు నన్ను చూచి ఎందుకో దుఃఖించుచున్నాడు."(8, 9)

రాముడు దీనుడై, శోకార్తుడై, ముఖకాంతి తగ్గి, కైకేయికి నమస్కరించి ఇట్లు పలికెను.(10)

"నేను అజ్ఞానముచే అపరాధ మేదియు చేయలేదు కదా! తండ్రి నాపై ఎందుకు కోపించినాడో చెప్పుము. నీవే ఈయనకు నాపై అనుగ్రహము కలిగించుము. ఎల్లప్పుడు నా విషయమై వాత్సల్యము చూపు నా తండ్రికి నాపై కోపము వచ్చినదా? వాడిపోయిన ముఖముతో దీనుడై నాతో మాటలాడుటలేదు. శారీరమైన వ్యాధి కాని, మానసికమైన చింతకాని, ఈయనను బాధించుట లేదు కద! సుఖ మనునది ఎల్లపుడును లభించదు కదా! కుమారుడైన భరతునికిగాని, మహాబలశాలియైన శత్రుఘ్నునకు గాని, నా తల్లులకు గాని, అశుభ మేదియు జరగలేదు కదా!" మా తండ్రికి కోపము వచ్చినచో అయనను సంతోషపెట్టకుండా గాని, ఆయన ఆజ్ఞను పాలింపకుండ గాని, ముహూర్తమైనను జీవించవలెనను కోరిక నాకు లేదు. మానవుడు ఇహలోకమున తన జన్మకు మూలకారణమైన తండ్రి ప్రత్యక్షదేవతగా ఉండగా అతని విషయమున ఇట్లు ప్రవర్తించక ఎట్లుండగలడు? (11-16)

నీవు గర్వముతో కోపావిష్టురాలవై తండ్రి మనస్సు బాధపడునట్లు ఏమియు అనలేదు కదా! పూర్వమెన్నడూ లేని వికారము, మాతండ్రి యైన మహారాజుకు ఎందువలన వచ్చినదో అడుగుచున్నాను. యథార్థముగా చెప్పుము."(17, 18)

మహాత్ముడైన రాముడిట్లు అడుగగా కైకేయి లజ్జ లేనిదై, తనకు లాభకరమైన మాటలను నిర్భయముగా పలికినది.(19)

"రామా! రాజుకు కోపము రాలేదు. కష్టమేదీ రాలేదు. కాని ఈయన మనస్సులో ఉన్న ఒక విషయమును నీకు భయపడి చెప్పజాలకున్నాడు. ప్రియపుత్రుడవైన నీకు ఒక అప్రియవిషయము చెప్పుటకు ఈయనకు నోరు రాకున్నది. ఈయన నాకు మాట ఇచ్చి ఉన్నాడు. అది నీవు తప్పక చేయవలెను.(20, 21)



మహారాజు నన్ను ఆదరించి, పూర్వము నాకొక వరము ఇచ్చియున్నాడు. ఇపుడు ఒక సామాన్యమానవుడు వలె తానట్లు వరము ఇచ్చినందుకు పశ్చాత్తాపము చెందుచున్నాడు. నాకు వరమిచ్చెద నని ప్రతిజ్ఞ చేసి ఇపుడు నీరు ప్రవహించి బైటకు వెళ్ళినచోట వ్యర్థముగా సేతువు కట్టవలెనని కోరుచున్నాడు.(22, 23)

రామా! సత్యము అన్ని ధర్మములకును మూల మని సత్పురుష లందరును అంగీకరించిన విషయము. రాజు కోపగించి, నీ నిమిత్తమై అట్టి సత్యమును విడవకుండునట్లు చూడుము. "రాజు చెప్పుచున్నది నాకు ప్రియము అయినను అప్రియము అయినను నేను చేసెదను." అని నీవన్నచో అది అంతా నీకు నేను చెప్పెదను. రాజు చెప్పిన దానిని తప్పక మన్నించెదనని నీవు మాట ఇచ్చిననో ఆ విషయము నేనే చెప్పెదను. ఈయన స్వయముగా నీకు చెప్పజాలడు." (24-26)

కైకేయి మాటలు విన్న రాముడు మనస్సులో చాలా బాధపడుచు, రాజసమక్షమున ఆమెతో,(27)

"ఛీ! ఎంత కష్టము! దేవీ! నా విషయమున నీవు ఇట్లు మాట్లాడవద్దు. తండ్రిగారు చెప్పినచో నేను అగ్నిలో దుమికెదను. మహారాజూ, పూజ్యుడూ, నా హితము కోరువాడూ అయిన తండ్రి ఆజ్ఞాపించినచో భయంకరమైన విషమును తినెదను. సముద్రములో దుమికెదను. (28, 29)

దేవీ! దశరథుని అభిలషితమైన విషయము ఏదియో చెప్పుము. తప్పక చేసెదను. ప్రతిజ్ఞ చేయుచున్నాను. రామునివద్ద రెండు మాటలు లేవు." అనెను.(30)

దుష్టురాలైన ఆ కైకేయి ఋజుస్వభావుడు, సత్యవాదీ అయిన రామునితో చాల దారుణ మైన మాట పలికినది.(31)

"రామా! పూర్వము దేవాసురుల మధ్య జరిగిన మహారణమునందు మీతండ్రి బాణశల్యములు గ్రుచ్చుకొని బాధపడుచుండగా నేను రక్షించితిని. అపుడాయన నాకు రెండు వరములు ఇచ్చినాడు. ఆ వరముల ప్రకారము, భరతుని రాజ్యాభిషిక్తుని చేయవలె నని, నీవు నేడే దండకారణ్యమునకు వెళ్ళవలెనని రాజును కోరినాను. నీతండ్రి మాటలను, నీమాటలను నిలబెట్టుకొనవలెనన్నచో నే చెప్పినట్లు చేయుము. తండ్రి ఆజ్ఞ పాలింపుము. ఆయన ప్రతిజ్ఞ చేసిన ప్రకారము నీవు పదునాలుగు సంవత్సరములు అరణ్యములో ఉండవలెను.(32-35)

నీకొరకై రాజు ఏర్పరిచిన అభిషేకసామగ్రితో భరతునకు పట్టాభిషేకము జరుగవలెను. నీ వీ అభిషేకము త్యజించి, జటాజినధారివై, పదునాలుగు సంవత్సరములు దండకారణ్యములో నివసించవలెను. భరతుడు అయోధ్యలో నివసించుచు, అనేక శ్రేష్ఠవస్తువులతోను, గజాశ్వరథాలతోను ప్రకాశించుచున్న ఈ రాజ్యమును పరిపాలించవలెను.(36-38)

ఈ కారణముచేత నీపై జాలి గల ఈ రాజు, దుఃఖముతో ముఖము వాడిపోయి, నిన్ను చూడజాలకున్నాడు. రామా! రాజు చెప్పిన విధముగా చేసి, మీ తండ్రి సత్యపాలనము చేయు అవకాశము కల్పించి ఆయనను తరింపజేయుము."(39, 40)

ఆమె ఆ విధముగా పరుషవాక్యములు పలుకుచున్నను రామునకు ఏమాత్రము దుఃఖము కలుగలేదు. కాని దశరథుడు మాత్రము పుత్రవ్యసనపీడితుడై చాల బాధపడెను.(41)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని పద్దెనిమిదవ సర్గము సమాప్తము.

పందొమ్మిదవ సర్గము

రాముడు వనవాసమునకు అంగీకరించుట. తన తల్లి కౌసల్య అనుమతి పొందుటకు వెడలుట.

శత్రుసంహారకుడైన రాముడు మరణశాసనము వంటి, అప్రియమైన ఆ మాటలు విని ఏమాత్రము వ్యథ చెందక కైకేయితో ఇట్లనెను.(1)

"నీవు చెప్పినట్లే అగుగాక. నేను రాజు చేసిన ప్రతిజ్ఞ మన్నించి, ఇచటనుండి వనమునకు వెళ్ళి అచట జటాజినధారినై నివసించగలను. కాని, రాజు వెనుకటి వలె నన్నీనాడు ఎందుచే అభినందించుటలేదో తెలుసుకొనగోరుచున్నాను.(2, 3)

దేవీ! నీ వేమాత్రము చింతించకుము. నీ ఎదుటచే చెప్పుచున్నాను. నారచీరలు, జటలు ధరించి అడవికి వెళ్ళెదను. సంతోషించుము. నా హితము కోరువాడూ, పూజ్యుడూ, కృతజ్ఞుడు, అన్నింటిని మించి రాజుకూడ అయిన తండ్రి ఆజ్ఞాపించగా నేను విశ్వాసపూర్వకముగా అతనికి ప్రియమగు కార్యము చేయకుందునా? భరతుని రాజ్యాభిషేకమును గూర్చి రాజు, నాకు స్వయముగా చెప్పలే దను మనోవ్యథ ఒక్కటే నా హృదయమును కాల్చివేయుచున్నది. నన్నెవరును ప్రేరేపింపకున్నను నేనే స్వయముగా, సోదరుడైన భరతునకు(అతని కభిలాష ఉన్నదని తెలిసినచో) సీతను, రాజ్యమును, ప్రాణాలను, ఇష్టజనులను, ధనములను కూడ సంతోషపూర్వకముగా ఇచ్చి యుండెడివాడను.(4-7)

తండ్రియైన దశరథమహారాజు స్వయముగా కోరుచుండగా నీ ప్రియమగు కోరికను తీర్చుటకై తండ్రి చేసిన ప్రతిజ్ఞను మన్నించుచు నేను సర్వస్వమును భరతున కీయగలనని వేరుగా చెప్పవలెనా? అందుచే నీవు ఈయనను ఓదార్చుము. ఇది ఏమి – మహారాజు నేలవైపు చూచుచు మెల్లమెల్లగా కన్నీళ్ళు కార్చుచున్నాడు!(8,9)

రాజాజ్ఞ ప్రకారము మేనమామ ఇంటినుండి భరతుని తీసికొని వచ్చుటకై, దూతలు, ఇప్పుడే వేగము గల గుఱ్ఱములపై బయలుదేరి వెళ్ళుదురు గాక. నేను తండ్రి మాటలలో యుక్తాయుక్తములను గూర్చి విచారణ చేయక, పదునాలుగు సంవత్సరములపాటు దండకారణ్యములో నివసించుటకై వెంటనే వెళ్ళిపోయెదను."(10, 11)

రాముని వాక్యము విన్న కైకేయి, అతడు తప్పక వెళ్ళగలడని తెలుసుకుని, సంతోషించి, అతనిని తొందరపెట్టుచు ఇట్లనెను.(12)

"నీవు చెప్పినట్లే అగుగాక! భరతుని, మేనమామ ఇంటినుండి తీసుకొనివచ్చుటకై దూతలు మహావేగము గల అశ్వములపై వెళ్లెదరు.(13)

కాని వనమునకు పోవుటకు ఉత్సాహము గల నీవు ఆలస్యము చేయుట యుక్తము కాదని నా అభిప్రాయము. అందుచే నీవు వెంటనే అరణ్యమునకు వెళ్ళుము. రాజు సిగ్గుచే, స్వయముగా నీతో చెప్పజాలకున్నాడు అనునది అంత ప్రధానవిషయము కాదు. దీనికి నీవు విచారించవద్దు. నీవు శీఘ్రముగా, ఈపట్టణము విడిచి అడవికి పోనంతవరకు నీ తండ్రి స్నానము కాని, భోజనము కాని చేయడు." అనెను.(14-16)

ఈ మాటలు విన్న రాజు "ఛీ ఎంత కష్టము వచ్చినది"! అని పలుకుచు, శోకాక్రాంతుడై మూర్ఛ చెంది ఆ సువర్ణమయమైన పర్యంకముపై పడిపోయెను. రాముడు ఆ రాజును లేవదీసి, కొరడాతో గుఱ్ఱమును కొట్టినట్లు, కైకేయి మరల ప్రేరేపించగా, వెంటనే అడవికి పోవుటకు తొందరపడెను.(17, 18)

భయంకర మగు ఫలము గల అప్రియమైన ఆ దుష్టురాలి వాక్యము విన్న రాముడు ఏమియు వ్యథ చెందక ఆమెతో ఇట్లనెను.(19)

"దేవీ! నేను ధనప్రధానుడను కాను. లోకమర్యాదను అనుసరించవలె నని మాత్రమే కోరుచున్నాను. కేవలము ధర్మమును అవలంబించిన నేను ఋషితుల్యుడ నని తెలుసుకొనుము. పూజ్యుడైన మా తండ్రికి ప్రియమైన యే పని యైనను నేను చేయవలసియున్నచో దానిని ప్రాణము విడిచియైనను చేసినట్లే తెలిసికొనుము. తండ్రికి శుశ్రూష చేయుటకు, ఆయన ఆజ్ఞను పాలించుటకు మించిన ధర్మాచరణ మేదియు లేదుకదా!(20-22)

పూజ్యుడైన మా తండ్రిగారు చెప్పకున్నను, నీ వచనము ప్రకారము పదునాలుగు సంవత్సరములు జనశూన్యమైన అరణ్యములో నివసించెదను. నాపై అధికారము కలదానివై యుండి కూడ నీవు భరతరాజ్యాభిషేకవిషయమును నాతో చెప్పక దశరథునితో చెప్పియున్నావు. దీనిని బట్టి నీకు నా గుణములపై నమ్మిక లేదని తెలియుచున్నది. నేను మా తల్లికి వీడ్కోలు చెప్పి, సీతను ఊరడించి, నేడే దండకారణ్యమునకు వెళ్ళెదను. భరతుడు రాజ్యమును పాలించుచు తండ్రికి శుశ్రూష చేయునట్లు నీవు చేయవలెను. ఇది సనాతన మైన ధర్మము కదా".(23-26)

రాముని మాటలు విన్న దశరథుడు, మిక్కిలి దుఃఖపీడితుడై, ఏమియు



మాటలాడజాలక బిగ్గరగా ఏడ్చెను.(27)

రాముడు మూర్ఛచెందిన తండ్రి పాదములకు, దుష్టురాలగు కైకేయి పాదములకు నమస్కారము చేసి బయటకు వచ్చెను. తండ్రికిని, కైకేయికిని, ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించి అంతఃపురమునుండి నిష్క్రమించి తన మిత్రులను కలుసుకొనెను.(28, 29)

సుమిత్రాకుమారుడైన లక్ష్మణుడు చాల కోపగించి, కన్నీరు నిండిన నేత్రములతో రాముని అనుసరించి వెళ్ళెను.(30)

రాముడు అభిషేకసామాగ్రికి ప్రదక్షిణము చేసి, శ్రద్ధాపూర్వకముగా తన దృష్టిని ఆ మంగళద్రవ్యములందు నిలిపి మెల్లగా వెళ్ళెను.(31)

రాముడు మహాసౌందర్యశాలి యగుటచే లోకమనోహరుడు. అట్టి రాముని గొప్ప శోభను, చంద్రుని శోభను రాత్రివలె, రాజ్యనాశము తగ్గింపజాలకపోయెను. రాజ్యమును విడచి, అరణ్యమునకు వెళ్ళనున్న ఆ రామునిలో లోకమునందలి సుఖదుఃఖాలకు అతీతుడైన యోగియందువలె చిత్తవికార మేదియు కనబడలేదు. గొప్ప మనోధైర్యము కల ఆ రాముడు, ఛత్రచామరములను వదలి, మిత్రులను, రథమును, పౌరులను పంపివేసి, దుఃఖమును మనస్సులోనే అణచుకొనుచు, ఇంద్రియములను నిగ్రహించుకొని ఆ అప్రియవార్త చెప్పుటకై తల్లి గృహమునకు వెళ్ళెను.(32-35)

ఆ రాముని ప్రక్క నున్నవారికి శోభాయుక్తుడూ, సత్యవాదీ అయిన ఆ రాముని ముఖములో ఎట్టి మార్పులు కనబడలేదు. అధికమైన కాంతులు గల శరత్కాలచంద్రుడు, తన సహజమైన కాంతిని ఎట్లు విడువడో అట్లే ఆ రాముడు తనకు సహజముగా ఉన్న హర్షమును విడువలేదు. ధైర్యముతో కూడిన మనస్సు కలవాడూ, మహాతేజశ్శాలీ యైన ఆ రాముడు, మధురము లైన మాటలతో అక్కడనున్న జనులను గౌరవించుచు తల్లి దగ్గరకు వెళ్ళెను. రాముని గుణములవంటి గుణములు కలవాడును, మహాపరాక్రమశాలియు, సోదరుడూ అయిన, లక్ష్మణుడు మనస్సులో దుఃఖమును అణచుకొనుచు, రాముని వెనుకనే వెళ్ళెను.(36-39)

రాముడు ప్రవేశించిన సమయమున కౌసల్య భవన మంతయు గొప్ప ఆనందముతో నిండియుండెను. అట్టి సమయమున, వచ్చిపడిన కార్యవిఘాతమును గూర్చి రాముడు వికారమేమియు చూపలేదు. తానేమైన వికారమును చూపినచో అక్కడ ఉన్న తనవారికి ప్రాణభయము కలుగవచ్చునని సందేహించి అత డిట్లు ప్రవర్తించెను.(40)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని పందొమ్మిదవ సర్గము సమాప్తము.

ఇరువదవ సర్గము

రాముడు కౌసల్యాభవనమునకు పోవుట, ఆమెకు తన వనవాసమును గూర్చి తెలుపుట. కౌసల్య విలపించుట.

పురుషశ్రేష్ఠుడైన ఆ రాముడు, తండ్రికి నమస్కరించి, నిష్క్రమించుచుండగా, అంతఃపురములోని స్త్రీలు బిగ్గరగా విలపించిరి.(1)

“రాముడు తండ్రి చెప్పకున్నను అవసరమైన కార్యములు నిర్వర్తించుచు తండ్రికిని, సమస్తమైన అంతఃపురమునకును సంరక్షణ చేయుచుండెడివాడు. అట్టి రాముడు ఇపుడు ప్రవాసమునకు వెళ్ళిపోవుచున్నాడు. రాముడు పుట్టినది మొదలు, తల్లియైన కౌసల్య విషయములో ఎట్టి భక్తి శ్రద్ధలు చూపుచున్నాడో, అట్లే మన విషయమున కూడ చూపుచున్నాడు. కోపము కలిగించు పనులు చేయక, కోపగించినవారి కోపము తొలగించుచు రాముడు తననెవరైన నిందించినను కోపగించెడివాడు కాదు. అట్టి రాముడు ఈనాడు ప్రవాసము పోవుచున్నాడు.

బుద్ధిలేని మన రాజు సమస్తప్రాణులకు గతియైన రాముని పరిత్యజించుట ద్వారా సకలప్రాణులను నశింపచేయుచున్నాడు." (2-5)

ఈ విధముగా, దూడలను కోల్పోయిన ఆవులవలె, ఆ రాజభార్య లందరును గట్టిగా ఏడ్చుచు భర్తను నిందించిరి. అంతఃపురములో బయలుదేరిన ఆ భయంకరమైన రోదనధ్వనిని విని దశరథుడు పుత్రశోకపీడితుడై తన ఆసనముపై పడి అణగి ఉండెను.(6, 7)

మిక్కిలి దుఃఖితుడైన రాముడు, ఏనుగువలె నిట్టూర్చుచు, ఇంద్రియములు నిగ్రహించుకొని, లక్ష్మణసమేతుడై తల్లి అంతఃపురమునకు వెళ్ళెను.(8)

రాముడు ఆ గృహద్వారమున కూర్చొనియున్న ఒక పూజనీయుడగు వృద్ధునీ, నిలబడియున్న మరికొంతమందిని చూచెను. రాముని చూడగానే వారందరును వెంటనే లేచి, విజయవంతులలో శ్రేష్ఠుడైన అతనిని "నీకు జయము కలుగుగాక." అని పలుకుచు అభినందించిరి. (9, 10)

రాముడు మొదటివాకిలి దాటి, రెండవవాకిలిలో వేదసంపన్నులు, రాజగౌరవమును పొందువారు, వృద్ధులు అయిన బ్రాహ్మణులను చూచెను. రాముడు ఆ బ్రాహ్మణులకు నమస్కరించి, మూడవ కక్ష్యలో ద్వారమును రక్షించుచున్న వృద్ధస్త్రీలను, బాలస్త్రీలను చూచెను. ఆ స్త్రీలు సంతోషించి, రాముని జయశబ్దముతో అభినందించి, శీఘ్రముగ గృహములోనికి వెళ్ళి కౌసల్యకు ప్రియమైన రామాగమనవార్తను చెప్పిరి.(11-13)

కౌసల్య రాత్రి అంతయు నియమపూర్వకముగా, జాగరము చేసి, పుత్రుని క్షేమము కోరుచు ప్రాతఃకాలమున విష్ణుపూజ చేయుచుండెను. ఎల్లప్పుడు వ్రతములను ఆచరించుటయందు ఆసక్తి గల ఆ కౌసల్య, తెల్లటి పట్టుచీర ధరించి, మంగళకర మగు వేషముతో మంత్రపూర్వముగా సంతోషముతో అగ్నిలో హోమము చేయుచుండెను.(14,15)

రాముడు మంగళకరమైన ఆ తల్లి అంతఃపురము ప్రవేశించి అక్కడ అగ్నిలో హోమము చేయించుచున్న తల్లిని చూచెను. అచట దేవకార్యము నిమిత్తమై సిద్ధముచేసి ఉంచిన పెరుగు, అక్షతలు, నెయ్యి, మోదకములు, హవిస్సులు, పేలాలు, తెల్లని పుష్పమాలలు, పాయసము, పులగము, సమిధలు, పూర్ణకుంభములు మొదలగు సామాగ్రిని చూచెను. వ్రతములు చేయుటచే కృశించిన ఆ కౌసల్య తెల్లని పట్టుచీర ధరించి దేవతాస్త్రీ వలె ప్రకాశించుచు, దేవతలకు జలతర్పణము

లిచ్చుచుండెను. (16-19)

చాల కాలమునకు వచ్చినవాడును, తల్లికి ఆనందము కల్గించువాడును అగు కుమారుని చూచి, సంతోషించి, ఆ కౌసల్య, ఆడగుఱ్ఱము తన పిల్లను సమీపించినట్లు సమీపించెను. రాముడు ఎదురుగా వచ్చిన తల్లికి, పాదములు స్పృశించి, నమస్కరించెను. అపుడామె అతనిని బాహువులతో కౌగిలించుకొని అతని శిరస్సుపై వాసనచూచెను. (20, 21)

కౌసల్య శత్రువులచే ఎదురింప శక్యముకాని తనకుమారుడైన రామునితో వాత్సల్యపూర్వకముగా ప్రియములు హితములు అయిన మాటలు ఇట్లు చెప్పెను. (22)

"నీకు వృద్ధులును, ధర్మశీలులును, మహాత్ములును అయిన రాజర్షులకు ఎంత ఆయుర్దాయము కీర్తి ఉండెనో అంత ఆయుర్దాయమూ కీర్తి లభించుగాక. నీ వంశధర్మమును పాలించెదవు గాక. రామా! నీతండ్రియైన దశరథమహారాజు చేసిన ప్రతిజ్ఞ తప్పదు. ధర్మాత్ముడైన నీ తండ్రి నేడే నిన్ను యౌవరాజ్యమునందు అభిషిక్తుని చేయగలడు." అనెను. (23,24)

కౌసల్య ఈ విధముగా పలుకుచు, భోజనము చేయుము అని కోరగా రాముడు ఆమె ఇచ్చిన ఆసనమును స్పృశించి ఆమెకు నమస్కరించుచు ఇట్లనెను. స్వభావముచేత వినయవంతుడైన ఆ రాముడు ఆ సమయమున తల్లిపై నున్న గౌరవముచే ఇంకను నమ్రుడై దండకారణ్యమునకు ప్రయాణమై తల్లి యనుజ్ఞను పొందుటకు ఆమెను ప్రార్థింప ప్రారంభించెను. (25, 26)

"తల్లీ! ఇపుడు ఒక గొప్ప అపద వచ్చిన విషయము నీకు తెలియదు. దీనివలన నీకును, సీతకును, లక్ష్మణునకును చాల దుఃఖము కలుగ నున్నది. నేను దండకారణ్యమునకు వెళ్ళనున్నాను. నాకు ఈ అసన మెందుకు? నేను దర్భాసనముపై కూర్చుండవలసిన కాలము వచ్చినది. నేను మాంసాహారమును విడచి, తేనె దుంపలు పండ్లు తినుచు పదునాలుగు సంవత్సరములు మునివలె జనశూన్యమైన అరణ్యములో నివసించవలసి యున్నది. (27-29)

మహారాజు యౌవరాజ్యమును భరతునికి ఇచ్చి, నన్నొక ముని వలె దండకారణ్యములో నివసించు నట్లు చేయుచున్నాడు. నేను వనములో లభించు వస్తువులను సేవించుచు, ఫలమూలములతో జీవనము గడుపుచు, పదునాలుగు సంవత్సరములు జనశూన్యమైన అరణ్యములో నివసించవలసి ఉన్నది." (30, 31)

ఆ మాటలు విని కౌసల్య గొడ్డలితో ఛేదించిన సాలవృక్షదండమువలె,

స్వర్గమునుండి పడిన దేవతవలె వెంటనే నేలపై పడెను. దుఃఖమునకు తగని ఆ తల్లి మూర్ఛచెంది అరటిచెట్టు వలె నేలపై పడుట చూచి, రాముడు ఆమెను పైకి లేవదీసెను. నేలపై దొరలి లేచిన, బరువుమోసిన గుఱ్ఱమువలె పరాగముతో నిండిన సకలశరీరము గల ఆ దీనురాలిని హస్తములతో స్పృశించెను.(32-34)

సుఖమునకు తగినదీ, దుఃఖముతో బాధపడుచున్నదీ యైన ఆ కౌసల్య, లక్ష్మణుడు వినుచుండగా, తన సమీపమునందున్న పురుషశ్రేష్ఠుడైన రామునితో ఇట్లు పలికెను.(35)

"రామా! నాకు సంతానమే లేకున్నచో ఇంత దుఃఖ ముండెడిదికాదు. నీవు నాకు దుఃఖమును కల్గించుటకు మాత్రమే పుట్టినావు. గొడ్రాలికి "నాకు సంతానము లేకపోయెనే" అను మానసమైన శోకము తప్ప మరి యే సంతాపము ఉండదు కదా!(36,37)

రామా! భర్త అధికారములో నున్నపుడు పూర్వము నే నెన్నడును మంగళమును గాని, సుఖమునుగాని చూచి ఎరుగను. పుత్రుడు అధికారమునకు వచ్చిన తరువాత చూచెదనులే అని నేను కోరుకొనుచుంటిని. అట్టి నేను, అందరికంటె శ్రేష్ఠురాలనై యుండి, మాటలచే హృదయమును ఛేదించువారూ, నాకంటె తక్కువవారూ అయిన, సవతులు పలుకు ఎన్నో చెడ్డమాటలను వినవలసియున్నది.(38,39)

నాకిపుడు అనంతమైన ఎట్టి శోకవిలాపములు సంప్రాప్తించినవో ఇంతకు మించిన దుఃఖము స్త్రీలకు ఏమి యుండును? నాయనా! నీవు దగ్గర ఉండగనే సవతులు నన్నిట్లు తిరస్కరించుచున్నారు. నీవు ప్రవాసమునకు వెళ్లిన పిమ్మట ఇక చెప్పవలెనా? నాకు మరణము తప్పదు. కైకేయియొక్క దాసజనముతో సమానముగాను, అంతకంటె తక్కువగాను కూడ చూచుచు, స్వాతంత్ర్యము లేనిదానినిగా చేసి భర్త నన్ను మిక్కిలి నిగ్రహించినాడు. (40-42)

ఇపుడు నన్ను సేవించుచున్నవారును, అనుసరించియున్నవారును ఇటుపై భరతుని చూచి(భరతునికి భయపడి) నన్ను పలుకరించరు. కైకేయి సర్వదా కోపముతో మండిపడుచుండును. కష్టములలో తగుల్కొన్న నేను, పరుషములగు మాటలనే పలుకు ఆమె ముఖమును ఎట్లు చూడగలను? రామా! నీకు ఉపనయనము జరిగిన పిదప ఎప్పటికైన ఈ దుఃఖములు తొలగును అను ఆశతో పదునేడు సంవత్సరములు నేను నిరీక్షించుచు ఉన్నాను. అందుచే సవతులు చేయు అవమానమును, అంతము లేని ఈ మహాదుఃఖమును , ఈవృద్ధావస్థలో నేను చాలా కాలము

సహింపజాలను.(43-46)

పరిపూర్ణచంద్రుని వంటి నీ ముఖము కనబడక, దుఃఖాక్రాంతురాలనైన నేను దైన్యముతో నిండిన జీవనమును ఎట్లు గడపగలను? దురదృష్టవంతురాలనగు నేను, ఎన్నియో ఉపవాసములు, దేవతాధ్యానములు, శ్రమకరములైన వ్రతాదులు చేసి, ఎంతో కష్టపడి నిన్ను పెంచితిని. అది అంతయూ వ్యర్థమైపోయెను. ఈ వార్త విని కూడ నా హృదయము వర్షాకాలమునందు క్రొత్తనీరు తగిలిన మహానదీతీరము వలె బ్రద్దలగుటలేదు. అందుచే ఇది చాల గట్టిదని అనుకొనుచున్నాను. నిజముగా నాకు మరణమే లేదు. యమలోకములో నాకు చోటు లేదు. అందుచేతనే యముడు నన్ను, ఏడ్చుచున్న ఆడలేడిని సింహమువలె, ఇపుడే బలాత్కారముగా లాగికొని పోవుటలేదు. ఈ దుఃఖము దేహమునంతను వ్యాపించియున్నది. ఐనను, నా హృదయము స్థిరముగా ఉన్నది. బ్రద్దలై నేలమీద పడిపోవుటలేదు. ఇది నిజముగా ఇనుముతో చేయబడినది. అకాలమునందు మరణము రాదు. ఇది నిశ్చయము.(47-51)

నేను చేసిన వ్రతములు, దానములు, నియమములు- ఇవి అన్నియు వ్యర్థమైపోయినవి కదా యని చాల దుఃఖము కలుగుచున్నది. సంతానముకొరకై నేను చేసిన తపస్సు కూడ ఊసరక్షేత్రమునందు నాటిన విత్తనము వలె నిష్ఫలమైపోయినది.(52)

అధికమైన కష్టములలో నున్నవాడు అకాలమునందు కూడ తన ఇష్టముప్రకారము, మరణించగల్గినచో, నీవు లేని నేను, దూడలేని అవు వలె ఇపుడే యమలోకమునకు వెళ్ళియుండెడిదానను. ఐనను ఈ జీవితముతో ఏమి ప్రయోజనము? చంద్రసమానమైన ముఖకాంతి గల ఓ రామా! నీవు లేనిచో నా జీవితము వ్యర్థము. దుర్బలమైన గోవు లేగదూడ వెనుక వెళ్ళినట్లు, నేను వాత్సల్యముతో నిన్నే అనుసరించి అరణ్యమునకు వచ్చెదను."(53, 54)

అపుడా కౌసల్య రాముని చూచి, వచ్చిన ఆ గొప్ప ఆపదను గూర్చి ఆలోచించుచు, దుఃఖక్రోధములతో బంధింపబడిన కుమారుని చూచి కిన్నరస్త్రీవలె బహువిధముల మిక్కిలి విలపించినది.(55)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఇరువదవ సర్గము సమాప్తము.

ఇరువది ఒకటవ సర్గము

లక్ష్మణుడు బలాత్కారముగ రాజ్యము చేజిక్కించుకొమ్మని రాముని ప్రేరేపించుట, రాముడు పితృాజ్ఞాపాలనయే ధర్మమని తల్లికిని, లక్ష్మణునికిని నచ్చబలుకుట.

ఈ విధముగా విలపించుచున్న కౌసల్యతో లక్ష్మణుడు దీనుడై, ఆ సమయమునకు తగినట్లు ఈ విధముగా పలికెను.(1)

"అర్యురాలా! రాముడు ఒక ఆడదాని మాటలకు లొంగి, రాజ్యలక్ష్మిని విడిచి అరణ్యమునకు వెళ్ళుట నాకు ఇష్టము కాదు. విపరీతబుద్ధికలవాడు, వృద్ధుడు, భోగాసక్తుడు, కామపీడితుడు ఐన రాజు కైక ప్రేరేపించగా ఏమైనను మాటలాడవచ్చును. ఈ రామునిలో రాష్ట్రమునుండి వెడలగొట్టి వనవాసమునకు పంపదగిన అపరాధముగాని, దోషముగాని, నా కేదియు కనబడుటలేదు.(2-4)

ఎంతశత్రువైనను, తిరస్కరింపబడినవాడైనను, ఏ ఒక్కడూ, పరోక్షముగానైన, రాముని గూర్చి చెడ్డగా మాటలాడగా ఈ లోకములో చూడలేదు. ధర్మబుద్ధి కలవా డెవ్వడైన, కారణమేమియు లేకుండ దేవతాతుల్యుడు, కపటము లేనివాడు, ఇంద్రియనిగ్రహవంతుడు, శత్రువులపై కూడ వాత్సల్యము కలవాడు అయిన కుమారుని పరిత్యజించునా? మరల బాల్యము పొందినవాడు వలె ప్రవర్తించుచున్న ఈ రాజు మాటలను రాజధర్మము తెలిసిన కుమారు డెవ్వడైన అంగీకరించునా?(5-7)

రామా! ఈ విషయము ఇతరులకెవ్వరికి తెలియకమునుపే నా సహాయముతో రాజ్యాధికారమును చేజిక్కించుకొనుము. ధనుర్ధారినై నేను, ప్రక్కన నిలచి రక్షించుచుండగా, యముని వలె నిలచియున్న నీకు హెచ్చుతగ్గులు చేయువా డెవ్వడు? ఈ అయోధ్యానగరము నీకు ఎదురు తిరిగినచో దీనిని తీక్ష్ణమైన బాణములతో మనుష్యశూన్యముగా చేసెదను. భరతుని పక్షమునకు చెందినవారిని, అతని హితము కోరువారిని, అందరిని వధించెదను. లోకములో మెత్తనివానిని జనులు తిరస్కరించుచుందురు.(8-11)

దుష్టుడైన మన తండ్రి కైకేయి ప్రోత్సాహముతో మనకు శత్రువుగా ప్రవర్తించినచో ఎట్టి ప్రేమయు చూపక అతనిని బంధించెదను. అవసరమైనచో వధించెదను. గురువైనను దృప్తుడై మంచి చెడ్డలు తెలియక అమార్గము నవలంబించినచో అతనిని

శిక్షించవలెను. (12,13)



పురుషశ్రేష్ఠుడవైన ఓ రామా! ఈతడు ఏ బలమును చూచుకొని, ఏ కారణముచే నీకు చెందిన ఈ రాజ్యమును కైకేయికి ఇవ్వదలచుచున్నాడు? నీతోను, నాతోను గొప్పవైరము పెట్టుకొని, భరతునికి రాజ్యమీయగల శక్తి ఈతనికి ఎక్కడిది?(14,15)

తల్లీ! యథార్థముగా నేను సోదరుడైన రామునిపై మనఃపూర్వకముగా అనురాగవంతుడనై ఉన్నాను. సత్యముమీదను, ధనస్సుమీదను, దానయాగములమీదను ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. రాముడు ప్రజ్వలించుచున్న అగ్నిలో గాని, అరణ్యములో గాని ప్రవేశింపవలసిన స్థితి ఏర్పడినపుడు నేను ముందుగానే దానిలో ప్రవేశించెదను. ఇది నిశ్చయము.(16, 17)

ఉదయించిన సూర్యుడు చీకటిని తొలగించినట్లు నా పరాక్రమమును చూపి నీ దుఃఖమును తొలగించెదను. నీవును రాముడును నా పరాక్రమమును చూడుడు".(18)

మహాపరాక్రమశాలియైన లక్ష్మణుని మాటలు విని కౌసల్య శోకాక్రాంతురాలై ఏడ్చుచు రామునితో ఇట్లనెను.(19)

"కుమారా! లక్ష్మణుని మాటలు విన్నావు కదా! నీ కిష్టమైనచో ఈ విషయమున చేయదగిన తరువాత పనులను చేయుము. ధర్మవిరుద్ధమైన నా సవతి మాటలు విని శోకపీడితురాలనైన నన్ను విడిచి, నీవు వెళ్ళిపోవుట తగదు.(20, 21)

రామా! నీవు ధర్మములు తెలిసినవాడవు. ధర్మిష్ఠుడవై ధర్మము లాచరించవలెనను కోరిక ఉన్నచో ఇచటనే ఉండి నాకు శుశ్రూష చేయుచు శుశ్రూషారూపమగు ఉత్తమధర్మమును ఆచరించుము. పూర్వము కాశ్యపుడు నియమవంతుడై గృహమునందే నివసించుచు, తల్లికి శుశ్రూష చేయుచు ఆ విధముగా గొప్ప తపస్సు చేసి స్వర్గమునకు వెళ్ళినాడు. గురువు (తండ్రి) అగుటచే రాజు నీ కే విధముగా పూజ్యుడో, తల్లి నగుటచే నేను గూడ అట్లే పూజ్యురాలను. నేను నీకు అనుమతి

ఇచ్చుటలేదు. అందుచే అరణ్యమునకు వెళ్ళవద్దు. (22-24)

నీవు దూరమైన పిమ్మట, ఈ జీవితముతోగాని, సుఖములతోగాని, నా కేమియు ప్రయోజనము లేదు. నీ దగ్గర ఉండి తృణములు భక్షించుచు జీవించినను మంచిదే. శోకముచే బాధపడుచున్న నన్ను విడచి నీవు అరణ్యమునకు వెళ్ళిపోయినచో నేను జీవింపజాలను. ఇచటనే ప్రాయోపవేశము చేసెదను. నేను నీ నిమిత్తమైన ప్రాణత్యాగము చేసినచో సముద్రుడు పిప్పలాదముని విషయమున అధర్మముగ ప్రవర్తించి, అతని కోపమువలన కష్టము పొందినట్లు, నీవు కూడ లోకప్రసిద్ధమైన దుర్గతిని పొందెదవు."(25-27)

ధర్మాత్ముడైన రాముడు దీనురాలై ఆ విధముగా విలపించుచున్న తల్లియైన కౌసల్యతో ధర్మసమ్మత మగు వచనము ఇట్లు పలికెను.(28)

"తండ్రి ఆజ్ఞను అతిక్రమించు సామర్థ్యము నాకు లేదు. శిరస్సు వంచి నిన్ను వేడుకొనుచున్నాను. నేను అరణ్యమునకు వెళ్ళవలసియున్నది. ధర్మములు తెలిసినవాడూ, వ్రతములు ఆచరించువాడూ, పండితుడూ అయిన కండుమహర్షి తండ్రియాజ్ఞను పాలించుచు గోవును కూడ చంపినాడు. మన కులమునందే పుట్టిన సగరకుమారులు పూర్వము తండ్రి యాజ్ఞచే భూమిని త్రవ్వుచు భయంకరమైన సంఘమరణమును పొందిరి. జమదగ్నికుమారుడైన పరశురాముడు తండ్రియాజ్ఞను అనుసరించి అరణ్యములో గండ్రగొడ్డలితో తల్లియైన రేణుకను స్వయముగా నరికినాడు. వీరును, దేవతాసమానులగు ఎందరో ఇతరులును, తమ తండ్రి ఆజ్ఞను వ్యర్థము గాకుండునట్లు చేసిరి. నేను కూడ నా తండ్రి కిష్టమైన కార్యమును చేసెదను.(29-33)

తల్లీ! తండ్రియాజ్ఞను నేనొక్కడనే చేయుటలేదు. నేను నీకు చెప్పిన వీరందరును, తండ్రి ఆజ్ఞను పరిపాలించినారు. నేను పూర్వాచారవిరుద్ధమైన క్రొత్త ధర్మమును దేనినీ నీ కొరకై చెప్పుటలేదు. పూర్వులందరును అంగీకరించి, అనుసరించిన మార్గమునే నేను అనుసరించుచున్నాను. భూలోకములో ప్రచారములో నున్న ఈ పితృవాక్యపరిపాలనరూపమగు కార్యమును నేను మరియొక్క విధముగా చేయజాలను. తండ్రి అజ్ఞ పాటించినవానికి యెవ్వనికిని దోషము కలుగదు."(34-36)

మాటలాడుటయందు నేర్పుకలవారిలో శ్రేష్ఠుడైన ఆ రాముడు తల్లితో ఇట్లు పలికి పిదప లక్ష్మణునితో ఇట్లనెను.(37)

"లక్ష్మణా! నీకు నాపైనున్న అత్యధికమైన స్నేహమును, నీ పరాక్రమమును, బలమును, దగ్గరకు చేర శక్యముకాని నీ తేజస్సును కూడ నేను ఎరుగుదును. (38)

నాతల్లి సత్యముయొక్కయు, శాంతియొక్కయు, రహస్యము తెలియకపోవుటచే సాటిలేని దుఃఖమును పొందుచున్నది. లోకములో అన్నింటికంటెను శ్రేష్ఠమైనది ధర్మమే. ధర్మమునందే సత్యము నిలచియున్నది. తండ్రిగారు చెప్పిన ఈ ఉత్తమమైన వచనము కూడ ధర్మమును ఆశ్రయించియున్నది. ధర్మమును ఆశ్రయించినవాడు తండ్రికిగాని, తల్లికి గాని, బ్రాహ్మణునకు గాని ఇచ్చిన మాటను వృథా చేయరాదు. (39-41)

నేను తండ్రియాజ్ఞను అతిక్రమింపజాలను. కైకేయి తండ్రి వచనము ప్రకారమే కదా నన్ను వనమునకు వెళ్ళుమని ప్రేరేపించినది. (42)

కావున క్షత్రియధర్మమునకు సంబంధించిన ఈ చెడు ఆలోచనను మాని, ధర్మమును ఆశ్రయింపుము. క్రౌర్యమును విడువుము. నా ఆలోచనను అనుసరించుము". (43)

రాముడు స్నేహపూర్వకముగా సోదరునితో ఇట్లు పలికి తల్లికి శిరస్సుతో నమస్కరించి దోసిలి కట్టి మరల ఇట్లు పలికెను. (44)

"ఓ తల్లీ! నేను వనమునకు పోవ నిశ్చయించినాను. నాకు అనుజ్ఞ ఇమ్ము. నా ప్రాణములపై ఒట్టు పెట్టుచున్నాను. ప్రయాణసమయమున చేయు మంగళకరములగు విధానము లన్నియు నాకు చేయుము. పూర్వము యయాతిచక్రవర్తి ఒక పర్యాయము స్వర్గము విడచి వచ్చి మరల స్వర్గమును చేరినట్లు, నేను ప్రతిజ్ఞను పూర్తిచేసుకొని, వనమునుండి మరల పట్టణమునకు వచ్చెదను. నీవు విచారించవద్దు. దుఃఖమును నీ హృదయమునందే అణచి వేసికొనుము. తండ్రి ఆజ్ఞను నిర్వర్తించి వనవాసమునుండి తిరిగి మరల ఇక్కడకు రాగలను. నీవు, నేను, సీత, లక్ష్మణుడు, సుమిత్ర మన మందరము కూడ మా తండ్రిగారి మాటను అనుసరించి ఉండవలెను. ఇదియే మనము చేయవలసిన సనాతనధర్మము. అభిషేకసంభారము లన్నింటిని ఉపసంహరించి, నీవు ధర్మసమ్మతమైన వనవాసమునకు వెళ్ళవలెనను నా ఆలోచనను అంగీకరింపుము. దుఃఖమును మనస్సులో అణుచుకొనుము." (45-49)

తల్లియైన కౌసల్య ధర్మమునకు అనుకూలముగాను, తొందరపాటు,

వ్యాకులత్వము లేకుండగాను, రాముడు పలికిన ఆ మాటలు విని, మరణించి మరల స్పృహవచ్చినట్లు లేచి రాముని చూచి మరల ఇట్లు పలికెను.(50)

"కుమారా! స్వధర్మముచేతను, స్నేహమును బట్టియు, నీతండ్రి ఎట్లు గురువో నేను కూడా అట్లే గురువును. నీకు అనుజ్ఞ ఇవ్వను. ఇంతగా దుఃఖించుచున్న నన్ను విడచి ఈ విధముగా వెళ్ళవద్దు. నీవు లేకుండ నేను ఈ లోకమున జీవించి ఏమి ప్రయోజనము? పరలోకమువలనగాని, పితృదేవతలకు అర్పింపబడు స్వధవలన గాని, దేవతలకు లభించు అమృతమువలన గాని నాకేమియు ప్రయోజనములేదు. క్షణకాలమైనను నీవు నా దగ్గర ఉండుట సమస్తమైన ప్రాణిలోకముకంటెను నాకు ఆనందమును కల్గించును".(51,52)

అతిదీనమైన తల్లి ఏడ్పు విన్న రాముడు, దారిలో నడచుచు మనుష్యులచే కొరవులతో అడ్డగింపబడిన మహాగజమువలె, మిక్కిలి పరితపించెను. స్మృతి తప్పినది వలె నున్న తల్లితోను, దుఃఖితుడై పరితపించుచున్న లక్ష్మణునితోను అతడు ధర్మసంబద్ధమైన వచనము పలికెను. ఆ సమయమున అతడొక్కడే అట్లు పలుకుటకు సమర్థుడు.(53, 54)

"లక్ష్మణా! సర్వదా నీకు నాయందున్న భక్తిని, పరాక్రమమును నేను ఎరుగుదును. కాని నీవిపుడు నా అభిప్రాయమును తెలిసికొనకుండగనే తల్లితో చేరి, నాకు చాల కష్టము కలుగు నట్లు బాధించుచున్నావు.(55)

భర్తకు వశ్యురాలైన భార్య అతడికి ప్రియురాలగును. సత్పుత్రులను ఇచ్చును. అట్లే ధర్మమునే ఆశ్రయించిన వానికి ధర్మార్థకామములు మూడు లభించును. ఈ విషయములో నాకు ఎట్టి సందేహము లేదు.(56)

ధర్మార్థకామములన్నియు కూడి ఉండని కార్యమును పరిత్యజించి, ధర్మము దేనియందు ఉండునో అట్టి కార్యమునే ప్రారంభించవలెను. అర్థమునకు మాత్రమే ప్రాధాన్యమిచ్చువాడు లోకములో ద్వేషపాత్రు డగును. కామపరత్వము కూడ ప్రశస్తము కాదు.(57)

పూజ్యుడు, రాజు, వృద్ధుడు నైన తండ్రి కోపమువలనగాని, సంతోషమువలనగాని, కామమువలనగాని, ఒక కార్యమును ఆజ్ఞాపించినపుడు దానిని ధర్మదృష్టికలవా డెవ్వడైన చేయకుండునా! క్రూరప్రవృత్తికలవాడు మాత్రమే ఆ కార్యమును చేయడు. తండ్రి ఆజ్ఞను పూర్తిగా యథావిధిగా నిర్వర్తింపకుండగా

నే నుండజాలను నాయనా! అతడు మన ఇద్దరిని ఆజ్ఞాపింపదగిన గురువు. తల్లియైన కౌసల్యాదేవికి కూడ ఆయన భర్త. గతి. ఆయనే ధర్మము. ధర్మాధికారి యైన దశరథమహారాజు జీవించి యుండగా, విశేషించి ఆయన తన ధర్మమార్గమున ప్రవర్తించుచుండగా, తల్లియైన కౌసల్యాదేవి, భర్తలేని ఒక సామాన్యస్త్రీ వలె, ఈ నగరము విడిచి నాతో ఎట్లు బయటకు వెళ్ళగలదు?(58-60)

పట్టపురాణి వైన ఓ తల్లీ! నేను అడవికి వెళ్ళుటకు అనుమతి ఇమ్ము. సత్యబలముచేత యయాతి తిరిగి స్వర్గమునకు వెళ్ళినట్లు, నేను కూడ వనవాసము సమాప్తమైన పిమ్మట వచ్చునట్లు ఆశీర్వదించుచు, స్వస్త్యయనములు చేయుము. కేవలము రాజ్యముకొరకై గొప్ప సత్ఫలముల నిచ్చు యశస్సును నేను విడువజాలను. ఈ జీవితము, చాల స్వల్పకాలిక మైనది. దీనికై తుచ్ఛమైన రాజ్యమును, ధర్మవిరుద్ధముగా సంపాదించుటకు అభిలషించను."(61, 62)

నరశ్రేష్ఠుడైన ఆ రాముడు తన పరాక్రమముతో నిర్భయముగా దండకారణ్యమునకు వెళ్ళవలెనని నిశ్చయించి, తల్లిని ఓదార్చి, తమ్మునకు మంచి ఆలోచనను ఉపదేశించి మనసా తల్లికి ప్రదక్షిణము చేసెను.(63)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఇరువది ఒకటవ సర్గము సమాప్తము.

ఇరువది రెండవ సర్గము

శ్రీరాముడు లక్ష్మణునికి నచ్చజెప్పి అభిషేకసంభారములు తీసివేయ నాజ్ఞాపించుట.

పిదప దృఢచిత్తుడైన ఆ రాముడు, ధైర్యముతో తన మనోభావములను అణుచుకొనుచు, మానసికదుఃఖముచే దీనుడు, ఎక్కువ కోపగించినవాడు, కోపముచే పెద్దవైన నేత్రములు కలవాడు, నాగేంద్రుడు వలె బుసలుకొట్టుచున్నవాడు, మంచి హృదయము కలవాడు, ప్రియసోదరుడు అయిన లక్ష్మణుని సమీపించి ఇట్లు పలికెను.(1, 2)

"లక్ష్మణా! నీవు రోషమును, శోకమును విడిచిపెట్టుము. కేవలము ధైర్యము నాశ్రయించి ఈ అవమానమును మరచిపొమ్ము, గొప్ప ఆనందమును పొందుము. ఈనాడు, నా అభిషేకముకొరకై చేసిన దానినంతను విడచి, అపాయరహిత మగు



కార్యమును వెంటనే చేయుము. నా రాజ్యాభిషేకముకొరకై ఇంతవరకు సంభారసంపాదనమునందు చూపిన ఉత్సాహమును, నా అభిషేకము జరుగకుండుటకై చూపుము. ఆ సంభారములను తొలగించుటకు ఉత్సాహమును చూపుము. నాకు అభిషేకము జరుగనున్నదని, మనస్సులో బాధపడుచున్న నా తల్లి కైకకు, శంక ఏమియు కలుగకుండు నట్లు ప్రవర్తించుము. ఆమె మనస్సులో, క్షణకాలముపాటైనను, శంకారూప మగు దుఃఖము కలుగుటకు నేనంగీకరించను. (3-7)

నేను తెలిసికాని, తెలియకగాని, ఎన్నడును, తల్లులకు గాని తండ్రికి గాని కొంచె మైనను అప్రియము చేసినట్లు నాకు గుర్తులేదు. సత్యమే మాట్లాడువాడును, సత్యమైన పరాక్రమము కలవాడును, పరలోకభీతి కలవాడును అయిన నా తండ్రి చేసిన ప్రతిజ్ఞ సత్య మగుగాక. అతనికి ఎట్టి భయము లేకుండుగాక. ఈ పట్టాభిషేకము మానకున్నచో 'నా మాట అసత్యమైనది కదా!' అని మన తండ్రికి మనస్తాపము కలుగును. ఆయనకు కలిగిన మనస్తాపము నాకు బాధ కల్గించును. ఆ కారణముచే ఈ అభిషేకమును నిలిపివేసి, నేను వెంటనే ఇచటనుండియే వనమునకు వెళ్ళవలె నని తలచుచున్నాను. (8-11)

నేనిపుడు అరణ్యమునకు వెళ్ళగనే కైకేయి కృతకృత్యురాలై నిర్భయముగా, తన కుమారునకు రాజ్యాభిషేకము చేయించగలదు. నేను నారచీరలను, కృష్ణాజినమును, జటలను ధరించి, అరణ్యమునకు వెళ్ళినచో కైకేయికి మనశ్శాంతి కలుగును. (12, 13)

మనస్సు గట్టి పరచుకొని, ఈ నిర్ణయము తీసుకొన్న మన తండ్రికి క్లేశమును కల్గించుట నాకు ఇష్టము కాదు. అందుచే వెంటనే అడవికి వెళ్ళెదను. ఇచ్చిన రాజ్యమును వెనుకకు తీసుకొని నన్ను అరణ్యమునకు పంపుటకు దైవమే కారణమని తెలుసుకొనుము. (14,15)

దైవమే కైకేయికి ఈ భావమును కల్గింపకున్నచో నాకు బాధ కల్గింపవలె నని ఆమెకు బుద్ధి ఎట్లు కలుగును? పూర్వ మెన్నడూ తల్లులవిషయమున నాకు భేదబుద్ధి ఏమియు లేదను అంశమును, కైకేయికి నాయందు కాని, తన కుమారుడైన భరతునియందు కాని ఎట్టి భేదబుద్ధియు లేదను అంశమునూ నీవు ఎరుగుదువు

కదా! కైకేయి నా అభిషేకమును నిలిపివేయవలె ననియు, నన్ను ప్రవాసమునకు పంపవలె ననియు, పలుకరాని ఉగ్రమైన మాటలు పలికిన దన్నచో దానికి దైవము తప్ప మరొక హేతువు ఏదియు నాకు అగపడుటలేదు. ఇందుకు దైవమే కారణము కాకున్నచో ఉత్తమస్వభావము కలది, రాజవంశసంభూతురాలు అయిన ఆ కైకేయి ఒక సామాన్యస్త్రీవలె తన భర్త యెదుట బాధ కలిగించు మాటలు పలుకునా!(16-19)

దైవప్రభావము ఊహింప శక్యముకానిది. ఏ ప్రాణులయందును, దాని ప్రభావమును అడ్డుకొనువారు లేరు. ఇపుడు నాయందును కైకేయియందును దైవవైపరీత్యము వచ్చిపడినది. ఈ విషయము స్పష్టము. దైవము నడిపించునట్లు ప్రవర్తించుట తప్ప దానిని నిగ్రహించుటకు మరియొక ఉపాయము ఏదియూ లేదు. అట్టి దైవమును ఎవడు ఎదుర్కొనగలడు? సుఖదుఃఖములు, భయక్రోధములు, లాభనష్టములు, ఉత్పత్తివినాశములు ఈవిధమైన వన్నియు దైవచేష్టితములే. ఉగ్రమైన తపస్సుగల ఋషీశ్వరులు కూడ దైవపీడితులై తీవ్రమైన నియమములను విడచి కామక్రోధములచే భ్రష్టు లగుచుందురు. ప్రారంభించిన పనికి అడ్డుగా, ఊహింపరాని విధమున, అకస్మాత్తుగా ఏదైన వచ్చిపడినచో అది దైవవిలసితమే.(20-24)

నా అభిషేకమునకు అడ్డము వచ్చినను ఈ యథార్థబుద్ధితో నన్ను నేనే నిగ్రహించుకొనుటచే నాకు మనస్సులో దుఃఖమేమియు లేదు. అందుచే నీవు కూడ నావలెనే పరితాపము విడిచి వెంటనే అభిషేకమునకు సంబంధించిన ఏర్పాట్లను నిలిపివేయుము. అభిషేకముకొరకు ఏర్పరిచిన ఈ ఘటోదకములతోనే, నేను తపోవ్రతమును అవలంబించు సందర్భమున వ్రతస్నానము చేసెదను. లేదా రాజద్రవ్యమైన ఈ ఘటములలోని ఉదకము నాకెందుకు? నేనే స్వయముగా తోడుకొనిన ఉదకము నాకు వ్రతస్నానమునకై ఉపయోగించగలదు.(25-28)

లక్ష్మణా! ఈ లక్ష్మీవైపరీత్యమును గూర్చి, సంతాపము చెందకుము. రాజ్యమా వనవాసమా అన్నచో వనవాసమే ఉత్తమఫలప్రదము. అభిషేకమునకు విఘ్నము కలిగినందులకు మన తల్లిని దూషింపరాదు. ఆమె దైవముచే ప్రేరితురాలై ఈ విధముగా అనిష్టవాక్యములను పలుకుచున్నది. దైవమునకు ఎంతటి ప్రభావమున్నదో నీకు తెలియును కదా!"(29, 30)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఇరువది రెండవ సర్గము సమాప్తము.

ఇరువది మూడవ సర్గము

లక్ష్మణుని ప్రతాపోక్తులు. అతడు దైవమును త్రోసిపుచ్చి పౌరుషమును ప్రతిపాదించుట.

రాముడిట్లు పలుకుచుండగా, లక్ష్మణుడు విని తల వంచి మనస్సుతో మాటిమాటికిని దుఃఖసంతోషముల మధ్య ప్రవేశించినట్లుండెను.(1)

లక్ష్మణు డపుడు కనుబొమ్మలు ముడిచి బిలములో నున్న పగ పట్టిన మహాసర్పమువలె నిట్టూర్పు విడచెను. కనుబొమ్మలు విరిచి చూచుటకు భయంకరముగా నున్న అతని ముఖము, అపుడు, కోపించిన సింహము ముఖమువలె కనబడెను. అతడు ఏనుగు తొండమువలె హస్తాగ్రమును కదల్చుచు, శిరస్సును అడ్డముగను పైకిని పడవేయుచు, నేత్రాగ్రముతో రాముని అడ్డముగా చూచుచు ఈవిధముగా పలికెను.(2-4)

"రామా! నీవు క్షత్రియులలో శ్రేష్ఠుడవు. పితృవాక్యమును పరిపాలింపకపోవుట అను అధర్మము కలుగు నను భయముచేతను, లోకము విషయమున కొంచెము కూడ శంక లేకపోవుటచేతను నీకు ఈ విధముగా కల్గిన గొప్ప వేగిరపాటు నీకు తగినది కాదు. శక్తివిహీనమైన దైవమును గూర్చి నీవంటి వాడు, భ్రాంతి కలుగనిచో, ఇట్లు(దైవమే బలవత్తర మని) పలుకునా?(5,6)

దుర్బలము, దీనము అయిన దైవమును గూర్చి ఈ విధముగా ఎందుకు చెప్పుచున్నావు? పాపాత్ములైన ఆ కైకేయీదశరథుల విషయమున నీకు శంక ఎందుకు కలుగుటలేదు? గూఢముగా అపకారముచేసి స్వలాభము నిమిత్తమై నీ మంచితనమును పరిహరింపవలెనను అభిప్రాయముతో ఆ ఇరువురును, మృదువైన, ధర్మరూపమైన వంచనలను చేయుచున్నారు. నీవు తెలుసుకొనుటలేదు. వారు ఇరువురు ముందుగనే ఈ విధముగా నిర్ణయించుకొని ఉండకపోయినచో ఆ వరము, పూర్వ మెన్నడో ఇవ్వబడి యుండెడిది. వారిద్దరును నిన్ను వంచించ దలచినారు కావుననే ఎన్నడో పూర్వ మిచ్చిన వరమును గూర్చి ఇపుడు చెప్పుచున్నారు. అట్లు కాకున్నచో ఆ వరమును దశరథుడు ఎన్నడో పూర్వమే తీర్చియుండెడివాడు.(7-9)

నీకు తప్ప ఇతరునికి రాజ్యాభిషేకము చేయుట లోకవిరుద్ధము. తండ్రి ప్రారంభించిన ఈ పనిని నేను సహింపజాలను. ఈ విషయమున నన్ను క్షమించుము.

నీ ఆలోచనయందు భేదమును కలిగించుచు నీకు మోహమును కూడ కల్గించిన ఈ ధర్మమును నేను ద్వేషించుచున్నాను.(10, 11)

మన తండ్రి కైకేయి మాటలకు లొంగిపోయి ధర్మవిరుద్ధము, నింద్యము అయిన మాట చెప్పుచున్నాడు. నీవు దానికి ప్రతిక్రియ చేయుటకు సమర్థుడవైయుండి కూడ ఆ తండ్రి మాటనే పాటించుట యుక్తముకాదు. వారిరువురు ఈ కపటమును పాపబుద్ధితో చేయుచున్నను నీవు దానిని ఆ విధముగా గ్రహింపనందులకు నాకు దుఃఖము కలుగుచున్నది. ఇట్టి ధర్మాచరణము నిందింపదగినది. వారిరువురును స్వేచ్ఛగా ప్రవర్తించుచు ఎన్నడును నీ హితమును కోరలేదు. వారు తల్లిదండ్రులను పేరు గల శత్రువులు. అట్టివారి కోరికను తీర్చుటను మనస్సులో తలచుట కూడ అయుక్తము. వారికి కలిగిన ఈ ఆలోచన కేవలము దైవకృతమే అని నీ అభిప్రాయము కావచ్చును అయినను నీవు దీనిని ఉపేక్షించుట నాకు అభిమతము కాదు.(12-15)

చిత్తస్థైర్యము లేనివాడు, వీర్యవిహీనుడు మాత్రమే దైవముపై ఆధారపడి యుండును. ఆత్మాభిమానము గల వీరులు దైవమును లెక్కచేయరు. స్వప్రయత్నముచే దైవమును బాధింప సమర్థుడైనవాని ప్రయోజనమును దైవము చెరచి అతనికి దుఃఖము కలిగింపజాలదు. (16,17)

దైవమునకు ఎంత శక్తి ఉన్నదో, పురుషునకు ఎంత శక్తి ఉన్నదో, నేడు అందరును చూడగలరు. దైవపౌరుషములకు ఉన్న భేదము ఈనాడు స్పష్టము కాగలదు. నీ రాజ్యాభిషేకము ఏ దైవముచే అడ్డుకొనబడినదో ఆ దైవమునే నేను పౌరుషముచే ప్రతిఘటించెదను. జను లెల్లరు చూచెదరు గాక. అంకుశమును లెక్కచేయక, బంధనమును ఛేదించి, మదబలములచే గర్వించి పరుగెత్తుచున్న ఏనుగును వలె నేడు నేను దైవమును పురుషకారముచే మరల్చెదను. ఈనాడు సమస్తమైన లోకపాలకులు గాని, మూడు లోకములు కలసివచ్చినా గాని రామునికి జరగబోవు అభిషేకమును అడ్డజాలరు. తండ్రిమాట చెప్పనేల?(18-21)

నీవు అరణ్యములో నివసించవలె నని రహస్యముగా నిర్ణయించినవారే పదునాలుగు సంవత్సరములు ఆ విధముగా అరణ్యములో నివసించగలరు. అందుచే నేను తండ్రి ఆశను, నీ అభిషేకమునకు విఘ్నము కలిగించి తన పుత్రుని రాజ్యముకొరకు ప్రయత్నించుచున్న కైకేయి ఆశను ఛేదించెదను. నా బలమును ఎదిరించిన వానికి భయంకరమైన నా పౌరుషము ఎంత దుఃఖము కల్గించునో అంత దుఃఖమును దైవబలము కూడ కల్గింపజాలదు.(22-24)

నీవు వేయి సంవత్సరములు రాజ్యపాలనము చేసి తపస్సుకై అరణ్యమునకు వెళ్ళిన పిమ్మట నీ కుమారులే రాజ్యము చేసెదరు. ప్రజలను పుత్రులను పాలించినట్లు పాలించుటకై తమ పుత్రులకు ఒప్పచెప్పి, వనములో నివసించుటకు ప్రాచీనులగు రాజర్షుల వృత్తిగా విధింపబడినది కదా?(25, 26)

రాజు అయిన దశరథుడు చపలచిత్తుడై ఉన్నప్పుడు ఈ రాజ్యము భేదములకు లోనగును అను కారణముచే నీవు ఈ రాజ్యము నాకు వలదని అనుకొన్నచో ఆ భయ మేదియు లేదు. నేను నీకు మాట ఇచ్చుచున్నాను. సముద్రతీరము సముద్రమును రక్షించినట్లు నీ రాజ్యమును నేను రక్షించెదను. అట్లు కానిచో నాకు వీరలోకము లభించకుండుగాక. నీవు మంగళద్రవ్యములతో నీకు రాజ్యాభిషేకము చేసికొనుటకై ప్రయత్నము చేయుము. నేనొక్కడనే బలప్రయోగముచే రాజుల నందరినీ నివారింపగలను.(27-29)

నా బాహువులు కేవలము శోభకు మాత్రమే కాదు. ధనుస్సు అలంకారార్థము కాదు. ఖడ్గము నడుమునకు కట్టుకొనుటకు మాత్రము కాదు. బాణములు కదలకుండ పడియుండుటకు కాదు. ఈ నాలుగును శత్రువులను దండించుటకు మాత్రమే ఉద్దిష్ట మైనవి. నాకు శత్రువని నిశ్చయింపబడినవానిని ఏవిధముగానూ జీవింపనివ్వను. తీక్ష్ణమైన అంచులు గలది, మెరుపువలె ప్రకాశించునది అగు ఖడ్గము చేత బూని నేను, ఎదుట నున్న శత్రువు దేవేంద్రు డైనను లెక్కచేయను. ఈ భూమియంతయు, ఖడ్గపాతముచే ఖండింపబడిన, గజాశ్వనరుల హస్తములతోను, ఊరువులతోను, శిరస్సులతోను నిండి, ప్రవేశింప శక్యముకానిదై నడుచుటకు వీలుకాక ఉండును. ఇపుడు ఏనుగులు నా కత్తి వేటుచే తెగి, పడుచున్న పర్వతములవలె, మెరుపుతో కూడిన మేఘములు వలె భూమిపై పడగలవు. (30-34)

వ్రేళ్ళ రక్షణమునకై ఉడుము తోలుతో చేసిన అంగుళిత్రాణములను ధరించి, ధనస్సు చేత బట్టి, నేను నిలిచియుండగా నేనే పురుషుడ నని చెప్పుకొనుచు నా యెదుట ఎవడు నిలువగలడు? నేను ఒక్క బలవంతుని అనేకబాణములతో కొట్టుచు, ఒక్క బాణముతో అనేకులను చంపుచు, నా బాణములను మనుష్యఅశ్వగజముల మర్మస్థానములందు ప్రయోగించెదను. నేడు నా అస్త్రప్రభావము రాజైన దశరథుని రాజ్యాధికారమునుండి తొలగించి నీకు రాజ్యాధికారమును ఇవ్వగలదు. మంచి గంధమునకు, కేయూరములను ధరించుటకు, ధనమును దానముచేయుటకు, మిత్రులను పాలించుటకు, తగిన ఈ బాహువులు నేడు నీ అభిషేకమునకు విఘ్నము

చేసినవారిని అడ్డుకొనుటకు తగిన పని చేయగలవు. నీ యే శత్రువును ప్రాణకీర్తిమిత్రులనుండి దూరము చేయవలెనో చెప్పుము. నేను ఇపుడే అట్లు చేసెదను. ఈ భూమి నీకు వశమగుటకు నేనేమి చేయవలెనో ఆజ్ఞాపింపుము. నేను నీ కింకరుడను."(35-40)

అపుడు రాముడు కన్నీరు తుడిచి, మాటిమాటికి ఓదార్చుచు లక్ష్మణునితో ఇట్లనెను. ఓ లక్ష్మణా! నేను తండ్రి మాట మీదనే స్థిరముగా నిలిచి యున్నాను. ఇదియే మంచి మార్గము.(41)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఇరువది మూడవ సర్గము సమాప్తము.

ఇరువది నాలుగవ సర్గము

రాముడు వనవాసమునకు తల్లి అనుమతి పొందుట.

ఆ రాముడు, తండ్రి ఆజ్ఞనే పరిపాలింపవలెనను దృఢమైన నిశ్చయముతో నున్నట్లు చూచి కౌసల్య డగ్గుత్తికతో అస్పష్టముగా మాట్లాడుచు, ధర్మయుక్తమైన ఈ వాక్యమును పలికెను.(1)

"దశరథునకును, నాకును కుమారుడైన ఈ రాముడు ధర్మాత్ముడు. అన్ని భూతములకును ప్రియమునే కోరువాడు. ఎన్నడును దుఃఖములను అనుభవించి ఎరుగడు. అట్టి ఆ రాముడు, ఉంఛవృత్తితో ఎట్లు జీవించును? ప్రభువైన ఈ రాముని భృత్యులు, దాసులు కూడా ఉత్తమమైన ఆహారమును భుజించుచుందురు కదా! ఈత డిపుడు వనమునందు, మూలఫలములను ఎట్లు తిని జీవించును? సద్గుణవంతుడు ప్రియుడు అయిన రామునే రాజు ప్రవాసమునకు పంపుచున్నా డన్నచో ఇది విని ఎవ్వరు నమ్ముదురు? ఎవరికి భయము కలుగకుండును? లోకాభిరాముడవైన నీవు కూడ అరణ్యమునకు వెళ్ళవలసి వచ్చినదన్నచో లోకములోని కార్యములను నడిపించుచున్న దైవమే బలవత్తరము అని నిశ్చితముగా చెప్పవలసి యున్నది.(2-5)

కుమారా! నీవు దూరముగా వెళ్ళిపోయిన వెంటనే నా శరీరమునందు సాటిలేని గొప్ప శోకాగ్ని పుట్టును. నీవు కనబడకుండుటయే దీనిని ప్రజ్వలింపచేయు వాయువు. విలాపదుఃఖములే సమిధలు. ఏడ్పువలన కలుగు కన్నీళ్ళే హోమము చేసిన ఆహుతి.

చింత, బాష్పము అనునవి గొప్ప ధూమము. నీవు ఎప్పుడు వచ్చెదవా అను చింతవలన ఇది మరల మరల పుట్టుచుండును. అట్టి ఈ శోకాగ్ని నన్ను పూర్తిగా కృశింపచేసి గ్రీష్మమునందు అగ్ని డొంకలను కాల్చివేసినట్లు కాల్చివేయును. (6-8)

లేగదూడ పోవుచుండగా దాని తల్లి దాని వెనుకనే వెళ్ళకుండునా? అట్లే నీవు ఎక్కడికి పోయెదవో అక్కడికే నేను వచ్చెదను." అని పలికెను. (9)

రాముడు తల్లి మాటలు విని, మిక్కిలి దుఃఖించుచున్న ఆమెతో "తల్లీ! రాజును కైకేయి మొదటనే వంచించి యున్నది. నేను అరణ్యమునకు వెళ్ళి, నీవు కూడ అతనిని పరిత్యజించినచో అతడు జీవింపజాలడు. ఇది నిశ్చితము. స్త్రీ భర్తను పరిత్యజించుట చాల క్రూరమైన కార్యము. నీవు మనస్సుచేత కూడ నిందితమైన ఈ కార్యమును చేయరాదు. నా తండ్రియు మహారాజును అయిన దశరథుడు జీవించి యున్నంతవరకు నీవు అతని సేవ చేయవలెను. ఇది సనాతనమైన ధర్మము." అని పలికెను. (10-13)

రాముడిట్లు చెప్పగనే శుభకరమైన ఆలోచన గల కౌసల్య అటులనే చేసెదను అని రామునితో అనెను. ధర్మసంరక్షకులలో శ్రేష్ఠుడైన ఆ రాముడు తల్లి మాటలు విని, మరల, "నీవు నేను కూడ తండ్రి మాటను ఆచరింపవలెను. అతడే అందరికిని రాజు; పోషకుడు; పూజ్యుడు; శ్రేష్ఠుడు; అధిపతి; ఆజ్ఞాపించు అధికారము కలవాడు. పదునాలుగు సంవత్సరములు మహారణ్యములో విహరించి వచ్చి ఆనందపూర్వకముగా నీ ఆజ్ఞను అనుసరించెదను." అనెను. (14-17)

అపుడు పుత్రవత్సలయైన కౌసల్య రాముని మాటలు విని, మిక్కిలి దుఃఖించుచు, కన్నీటితో నిండిన ముఖము కలదై ప్రియపుత్రుడైన రామునితో ఇట్లనెను. (18)

"రామా! నేను ఈ సవతుల మధ్య నివసింపజాలను. తండ్రి మాటను బట్టి అరణ్యమునకు వెళ్ళవలె ననియే నీవు నిశ్చయించుకున్నచో నన్ను కూడ అరణ్యమృగమును తీసుకొని వెళ్ళినట్లు అరణ్యమునకు తీసుకొనివెళ్ళుము."(19)

ఆ విధముగా ఏడ్చుచున్న కౌసల్యతో రాముడు తానుకూడ ఏడ్చుచు ఇట్లు పలికెను - "స్త్రీ జీవించి యున్నంత వరకును భర్తయే ఆమెకు దేవత; అతడే ప్రభువు. అధికారసంపన్నుడైన దశరథమహారాజునకు నీపైనను నాపైనను కూడ అధికార మున్నది. లోకమున కంతకు ప్రభువైన, బుద్ధిశాలియైన ఆ రాజు ఉండగా మనము, నాథుడు లేనివారము ఎట్లగుదుము? ధర్మాత్ముడు, సకలప్రాణులకు ప్రియమును

గూర్చువాడు అయిన భరతుడు కూడ నీకు అనుకూలముగానే ఉండును. అతడు సర్వదా ధర్మమునందే ఆసక్తికలవాడు.(20-22)

నీవు సావధానచిత్తురాలవై, నేను వెళ్ళిపోయిన పిమ్మట, పుత్రశోకముతో ఉండు రాజునకు ఎట్టి శ్రమయు కలుగకుండు నట్లు చేయుము. వృద్ధుడైన రాజును భయంకరమైన ఈ శోకము నశింపచేయకుండునట్లు చూచుచు సర్వదా అతనికి హితమును చేకూర్చుము. వ్రతోపవాసములు చేయుచు మిక్కిలి ఉత్తమురాలై ఉన్నను, భర్తను అనుసరించని స్త్రీ నరకమును చెందును. దేవతాదులకు నమస్కారము చేయకున్నను, దేవతలను పూజింపకున్నను, భర్త సేవ మాత్రము చేయు స్త్రీ ఉత్తమమైన స్వర్గమును పొందును. భర్తకు ప్రియమును, హితమును కోరుచు అతని సేవయే చేయవలెను. ఇదే పూర్వమునుండియు లోకములో నున్న, వేదములందు వినబడిన, స్మృతులందు చెప్పబడిన ధర్మము.(23-27)

తల్లీ! నా నిమిత్తమై నీవు ఎల్లపుడును దేవతలను హోమములచేతను, పుష్పములచేతను పూజించుచుండుము. ఉత్తమవ్రతములు గల బ్రాహ్మణులను కూడా పూజించుచుండుము. ఈ విధముగా నియమవంతురాలవై, ఆహారనియమము పాటించుచు, భర్తకు సేవచేయుచు నా రాకకై కాలమును ఎదురుచూచుచుండుము. నేను తిరిగి వచ్చిన పిమ్మట, ధర్మసంరక్షకులలో శ్రేష్ఠుడైన మా తండ్రి అప్పటికీ జీవించి ఉన్నచో, ఉత్తమమైన కోర్కెలను పొందగలవు."(28-30)

పుత్రశోకముతో బాధపడుచున్న కౌసల్య రాముని మాటలు విని కన్నీటితో వ్యాకులమైన నేత్రములు కలదై, రామునితో ఇట్లు పలికెను.(31)

"పరాక్రమశాలివైన ఓ కుమారా! వెళ్ళవలెను అనెడు, నీ దృఢనిశ్చయమును నేను మార్చజాలను. కాలమును ఎవ్వడూ దాటజాలడు. ఇది నిశ్చయము. నీవు స్థిరమైన చిత్తముతో(ఆత్మరక్షణయందు జాగరూకుడవై) వెళ్ళుము. నీకు సర్వదా క్షేమ మగుగాక. నీవు తిరిగి వచ్చిన పిమ్మట నా దుఃఖములన్నియు తొలగిపోవును. నీవు నీ కర్తవ్యమును నెరవేర్చి, వ్రతము నాచరించి, తండ్రి ఋణమును తీర్చి, తిరిగి వచ్చిన పిమ్మట నేను గొప్ప సౌఖ్యమును పొందగలను.(32-34)

నా మాట కాదని నిన్ను అరణ్యమునకు వెళ్ళుటకు ప్రేరేపించుచున్న దైవముయొక్క గతిని ఈ లోకమున ఎవ్వరును ఎన్నడును అర్థముచేసుకొనజాలరు. ఇపుడు వెళ్ళి, తిరిగి క్షేమముగా వచ్చి సామపూర్వకములైన మంచి మాటలతో,

నన్ను ఆనందింపచేయగలవు. నీవు జటావల్కలములను ధరించి, వనమునుండి తిరిగి వచ్చిన దివసము నేడే అయినచో ఎంత బాగుండెడిది!"(35-37)

కౌసల్య రాము డా విధముగా వనవాసమునకు వెళ్ళుటకే నిశ్చయించుకొని నట్లు తెలుసుకొని, శుభలక్షణములు గల ఆ రామునితో, ఉత్తమమైన మనస్సుతో ఈ విధముగా పలికి అతనికి మంగళములను చేయుటకు అభిలషించెను.(38)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఇరువది నాలుగవ సర్గము సమాప్తము.

ఇరువది ఐదవ సర్గము

రామునకు కౌసల్య స్వస్తివాచనములు చేయించుట. రాముడు సీతానివాసభవనమునకు వెళ్ళుట.

ఉత్తమమైన మనస్సు కల తల్లియైన ఆ కౌసల్య దుఃఖమును విడచి, ఆచమనము చేసి, పవిత్రురాలై, రామునకు మంగళక్రియలను చేసెను.(1)

"రామా! నిన్ను నివారించుటకు శక్యము కాకున్నది. ఇపుడు వెళ్ళి శీఘ్రముగా తిరిగి రమ్ము. సత్పురుషుల మార్గమున ప్రవర్తించుము. నీవు ఏ ధర్మమును ధైర్యముతోను, నియమముతోను పాలించుచున్నావో ఆ ధర్మమే నిన్ను రక్షించుగాక. (2,3)

కుమారా! చైత్యములందు, దేవాలయములందు ఉన్న దేవతలకు నీవు నమస్కరించెదవు గదా! ఆ దేవతలును, మహర్షులును వనమునందు నిన్ను రక్షింతురు గాక. ధీమంతుడైన విశ్వామిత్రుడు ఇచ్చిన అస్త్రము లన్నియు సద్గుణసంపన్నుడవైన నిన్ను సర్వదా రక్షించుగాక. నీవు చేసిన పితృసేవా, మాతృసేవా, సత్యమూ నిన్ను రక్షించుచుండగా, చిరకాలము జీవించుము.(4-6)

సమిధలు, కుశలు, పవిత్రములు, అగ్నివేదికలు, దేవాలయములు, దేవపూజాస్థానములు, పర్వతములు, వృక్షములు, మొక్కలు, మడుగులు, పక్షులు, సర్పములు, సింహములు నిన్ను రక్షించుగాక. సాధ్యులు, విశ్వేదేవతలు, మరుత్తులు, మహర్షులు, ధాత, విధాత, పూష, భగుడు, అర్యమ, ఇంద్రాదిసకలలోకపాలకులు నీకు క్షేమము చేయుదురు గాక. ఋతువులు, పక్షములు, మాసములు,

సంవత్సరములు, రాత్రులు, దినములు, ముహూర్తములు ఎల్లపుడును నీకు క్షేమము చేయుగాక. స్మృతి, ధృతి, ధర్మము, కుమారస్వామి, సోముడు, బృహస్పతి, సప్తర్షులు, నారదుడు నిన్ను అంతటను రక్షింతురు గాక.(7-11)

నాచే స్తుతించబడిన ప్రసిద్ధమైన ఆ దిక్కులు, దిక్పాలకులు కూడ నిన్ను అరణ్యమునందు అంతటను నిత్యము రక్షింతురు గాక. వనములో నుండునపుడు నిన్ను శైలములు, సముద్రములు, వరుణుడు, ద్యులోకము, ఆకాశము, భూమి, నదులు, నక్షత్రములు, గృహములు, గృహదేవతలు, అహోరాత్రములు, సంధ్యలు రక్షించుగాక. పవిత్రమైన ఆరు ఋతువులు, మాసములు, సంవత్సరములు, కలలు, కాష్ఠలు నీకు సుఖము ఇచ్చుగాక. మునివేషము ధరించి మహారణ్యములో సంచరించుచున్న ధీమంతుడ వైన నీకు దేవతలును, దైత్యులును, సర్వదా సుఖము నిచ్చెదరు గాక.(12-16)

భయంకరులు, క్రూరమైన కర్మల నాచరించువారు అయిన రాక్షసులనుండియు, పిశాచములనుండియు, మాంసాహారులగు సకలజంతువులనుండియు, నీకు భయము లేకుండుగాక. ప్రవేశింపశక్యముకాని ఆ అరణ్యమునందు నీకు కోతులు, తేళ్ళు, ఈగలు, దోమలు, సర్పములు, ఇతరకీటకములు, బాధ కలిగించకుండుగాక! మహాగజములు, కోరలు గల సింహవ్యాఘ్రభల్లూకములు, కొమ్ములు గల భయంకరమైన అడవి దున్నపోతులు నీకు అపకారము చేయకుండుగాక. మనుష్యమాంసమును భుజించు భయంకరమైన ఇతరజంతువు లన్నియు ఇక్కడ నాచేత పూజింపబడినవై, నిన్ను హింసింపకుండుగాక. (17-20)

నీ మార్గములు మంగళకరములు అగుగాక! నీ పరాక్రమములు సఫల మగుగాక! నీవు క్షేమముగా వెళ్ళి సమస్తకార్యములను సాధించుము. ఆకాశమునందు ఉండువారు, భూమిపై నుండువారు, తదితరులు అయిన దేవతలు, నీకు క్షేమము కలిగించెదరు గాక! నీ శత్రువులవలన నీకు అపాయము కలుగకుండుగాక. గురుడు, చంద్రుడు, సూర్యుడు, కుబేరుడు, యముడు నేను చేయు పూజకు సంతోషించి దండకారణ్యములో నివసించుచున్న నిన్ను రక్షించెదరు గాక! నీ స్నానాదిసమయములందు అగ్ని, వాయువు, ధూమము, ఋషిముఖములనుండి వచ్చిన మంత్రములు రక్షించుగాక. అరణ్యములో నివసించుచున్న నిన్ను సకలలోకములకు ప్రభువైన శివుడు, బ్రహ్మ, సకలభూతములకు ప్రభువైన విష్ణువు, ఋషులు మిగిలిన దేవత లెల్లరు రక్షింతురు గాక."(21-25)

కౌసల్య రామునితో ఇట్లు పలికి, దేవతలకు పుష్పమాలలను, సుగంధములను, అర్పించి తగిన స్తోత్రములు పఠించుచు వారిని పూజించెను.(26)

అగ్నిని సమకూర్చి, రాముని మంగళము నిమిత్తమై మహాత్ముడైన బ్రాహ్మణునిచే యథాశాస్త్రముగా హోమములు చేయించెను. ఆమె, హోమమునకై నెయ్యి, తెల్లని పుష్పమాలలు, సమిధలు, తెల్లని ఆవాలు తెప్పించెను. ఆ ఉపాధ్యాయుడు ఎట్టి దోషములు లేకుండా యథాశాస్త్రముగా, శాంతిహోమమును చేసి, హోమము చేయగా మిగిలిన ద్రవ్యముతో బాహ్యములగు బలులు అర్పించెను.(27-29)

మధు-దధి-అక్షత-ఘృతములతో ద్విజులచే పుణ్యాహము చెప్పించి, అటుపిమ్మట రామునకు వనమునందు క్షేమమును గూర్చి మంత్రములను చదివించెను. కౌసల్య ఆ బ్రాహ్మణోత్తమునకు కోరినంత దక్షిణ యిచ్చి రామునకు ఇట్లు మంగళాశాసనము చేసెను.(30,31)

"వృత్రాసురసంహారసమయమున సకలదేవతల నమస్కారములు అందుకున్న దేవేంద్రునకు ఏ మంగళము కలిగెనో అట్టి మంగళము నీకు అగుగాక. పూర్వము గరుత్మంతుడు, అమృతమును తీసుకొని వచ్చుటకు వెళ్ళు సమయమున, అతనికి, వినత, ఎట్టి మంగళమును చేసెనో ఆ మంగళము నీకు అగుగాక. అమృతమును పుట్టించు సమయమునందు దైత్యులను చంపుటకై ఉద్యమించిన దేవేంద్రునకు తల్లియైన అదితి ఏ మంగళము ఇచ్చెనో ఆ మంగళము నీకు అగుగాక. మూడు అడుగులు వేసి, త్రిలోకములను ఆక్రమించు సమయమున, సాటిలేని తేజస్సు గల విష్ణువుకు ఏ మంగళము కలిగెనో, అది నీకు కలుగుగాక. శుభకరములు, మంగళప్రదములు అయిన ఋతువులు, సముద్రములు, ద్వీపములు, వేదములు, లోకములు, దిక్కులు నీకు మంగళములను ఇచ్చుగాక." అని మంగళాశాసనములు చేసెను.(32-36)

పుత్రుని శిరస్సుపై అక్షతలు ఉంచి, శరీరమునకు గంధమును పూసి, ప్రసిద్ధమైన ఫలముగల, శుభకరమైన విశల్యకరణి యను ఓషధిని కట్టి మంత్రములతో అభిమంత్రించెను. దుఃఖముతో నిండియున్న ఆమె పైకి సంతోషముతో నున్నట్లు కనబడుచు, తొట్రుపాటు చెందుతున్న మాటలతో ఇట్లు పలికెను (ఆమె నోటితో మాత్రమే పలికినది కాని, మనస్సుతో మాత్రము కాదు). రాముని కౌగిలించుకొని, అతని తలవంచి వాసనచూచి, ఇట్లు పలికెను. "పుత్రా! రామా! కృతకృత్యుడవై సుఖముగా వెళ్ళుము. నీవు కార్యము లన్నియు సాధించి, ఆరోగ్యవంతుడవై సుఖముగా

అయోధ్యకు తిరిగి వచ్చి రాజ్యాధికారమును పొందగా చూడగలను. వనవాసమునుండి తిరిగి వచ్చిన నిన్ను ఉదయించుచున్న పూర్ణచంద్రుని వలె, దుఃఖకరములైన ఆలోచనలన్నియు తొలగిపోయిన నేను సంతోషముతో ప్రకాశించుచున్న ముఖముకలదాననై చూచెదను. నీవు తండ్రి మాట నెరవేర్చి, వనమునుండి తిరిగి ఇచటికి వచ్చి, సింహాసనముపై కూర్చుండి యుండగా చూడగలను. వనవాసమునుండి మరలివచ్చి, సర్వమంగళసంపన్నుడవై నిత్యము నా కోరికలను, సీత కోరికలను, వృద్ధి పొందించెదవు గాక. ఇపుడు వెళ్ళి రమ్ము.(37-44)

రామా! ఇచట నేను పూజించుచున్న శివాదిదేవతలును, మహర్షులును, భూత-మహాసుర-ఉరగులును, వనమునకు వెళ్ళిన నీ హితమును సర్వదా అభిలషింతురుగాక".(45)

కౌసల్య ఇట్లు పలుకుచు, కన్నీళ్ళు నిండిన నేత్రములు కలదై, యథాశాస్త్రముగా స్వస్త్యయనము పూర్తి చేసి, రక్షార్థమై అతని చుట్టును తిరిగి మాటిమాటికి గట్టిగా కౌగిలించుకొనెను. కౌసల్యాదేవి రక్షాప్రదక్షిణములు చేసిన పిమ్మట రాముడు మరల ఆమె పాదములు స్పృశించి నమస్కరించి, సీతానివాసగృహమునకు వెళ్ళెను.(46,47)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఇరువది ఐదవ సర్గము సమాప్తము.

ఇరువది ఆరవ సర్గము

రాముడు, తండ్రి ఆజ్ఞచేత తాను వనమునకు వెళ్ళుచున్నట్లు సీతకు తెలిపి, "నీవు అయోధ్యలోనే ఉండుము." అని ఆమెకు చెప్పుట.

తల్లి మంగళాశీర్వాదములు చేసిన పిమ్మట, రాముడు ఆమెకు నమస్కరించి, ధర్మమార్గమును అనుసరించుచు, అరణ్యమునకు ప్రయాణ మాయెను. అతడు జనులతో నిండిన రాజమార్గమును ప్రవేశించి, దానిని తన కాంతిచే ప్రకాశింపచేయుచు, తన సద్గుణములచే జనుల హృదయములను మిక్కిలి ఆకర్షించుచు వనవాసనిర్ణయముచే వాటిని కలత పెట్టినట్లు చేసెను.(1-2)

అభిషేకమునకై వ్రతము అవలంబించి యున్న సీతకు ఈవిషయ మేదియు తెలియదు. యౌవరాజ్యాభిషేకము జరుగగలదనియే ఆమె భావించుచుండెను. రాజధర్మము లన్నియు తెలిసిన ఆ సీత స్వయముగానే దేవపూజాదికము నిర్వర్తించి

సంతోషించిన మనస్సుతో రాజపుత్రునికై నిరీక్షించుచుండెను.(3, 4)

రాముడు సిగ్గుతో కొంచెము తల వంచుకొని, సంతోషించిన జనులతో నిండిన చక్కగా అలంకరించిన తన ఇంటిలోనికి ప్రవేశించెను. సీత వెంటనే లేచి, దుఃఖముతో బాధపడుచు విచారముచే వ్యాకులమైన ఇంద్రియములు గల, భర్తను చూచి వణికిపోయెను. ఆమెను చూడగానే ధర్మాత్ముడైన రాముడు మనస్సులో నున్న దుఃఖమును లోపల ఇముడ్చుకొనజాలక, బయటపడిపోయెను.(5-7)

పాలిపోయిన ముఖముతో, చెమట పట్టి, కోపించియున్న రాముని చూడగానే దుఃఖపీడితురాలై ఆమె ఇట్లు పలికెను. "ఓ ప్రభూ! ఇపుడు ఇట్లున్నావేమి? రామా! నేడు లక్ష్మీప్రదమైన, బృహస్పతి దేవతగా గల పుష్యమీనక్షత్రము అభిషేకమునకు తగిన దని విద్వాంసులైన బ్రాహ్మణులు చెప్పినారు కదా! నీవు దుఃఖించుచున్నావేమి? సుందరమైన నీ ముఖము నూరు ఊచలు కలదీ, నీటి నురుగువలె తెల్లనిది అయిన ఛత్రముచే కప్పబడి ప్రకాశింపవలసియున్నది కదా? అట్లు కప్పబడలేదేమి? పద్మములతో సమానమైన నేత్రములు గల నీ ముఖము, చంద్రుడు వలె, హంసవలె నున్న శ్రేష్ఠమైన వింజామరలచే వీచబడుటలేదు. కారణమేమి? ఓ నరశ్రేష్ఠా! మాటలలో నేర్పుగల వందులును, సూతమాగధులును, సంతోషపూర్వకముగా మంగళపాఠములతో నిన్ను స్తుతించుచు కనబడుట లేదు. కారణమేమి?(8-12)

మూర్ధాభిషిక్తుడవైన నీ తలపై సకలవేదవిదులైన బ్రాహ్మణులు యథాశాస్త్రముగ తేనెను పెరుగును కలిపి ఏల ఉంచలేదు? అమాత్యాదిప్రకృతులును, శ్రేణులలో ముఖ్యులును, పౌరజానపదులును చక్కగ అలంకరించుకొని నీవెంట వచ్చుటలేదేమి? బంగారముచే అలంకరింపబడిన మంచి వేగము గల నాలుగు గుర్రములు కట్టిన ప్రధానమైన పుష్యరథము నీ యెదుట నడుచుటలేదేమి?(13-15)

ఓ వీరా! నీ ప్రయాణమున, అగ్రభాగమునందు, ఉత్తమలక్షణములు కలదీ, నల్లని మేఘము వలె పర్వతము వలె ఉన్నదీ, శోభాయుక్తమూ అయిన గజము కనబడుటలేదు; కారణమేమి? మహావీరా! సువర్ణముచే చిత్రితమైన నీ సింహాసనమును ముందిడుకొని, నీ యెదుట ఏనుగు నడవవలసియున్నది కాదా! అది కనబడుటలేదు. నీకిపుడు అభిషేకము చేయబడుచుండగా, నీ ముఖవర్ణము క్రొత్తగా నున్నది; సంతోషము కూడ కానవచ్చుటలేదు. ఇది ఏమి?".(16-18)

ఈ విధముగా విలపించుచున్న సీతతో రాముడిట్లు అనెను- "సీతా! పూజ్యుడైన నా తండ్రి నన్ను అరణ్యమునకు పంపివేయుచున్నాడు. సీతా! నీవు ఉత్తమమైన

కులమునందు పుట్టినదానవు. ధర్మములన్నియు తెలిసి, ధర్మమాచరించుదానవు. నా కీ వనవాసము ఏ విధముగా వచ్చినదో చెప్పెదను వినుము.(19, 20)

సత్యప్రతిజ్ఞ గల, మా తండ్రి, దశరథమహారాజు, పూర్వము మా తల్లియైన కైకేయికి రెండు గొప్ప వరముల నిచ్చెను. ఇపుడు మహారాజు నాకు అభిషేకము చేయసంకల్పించి ఏర్పాట్లు చేయుచుండగా, ఆమె ఆ వరముల ప్రతిజ్ఞను వెలికి తీసికొనివచ్చి, ధర్మమును చూపి, ఆ ప్రతిజ్ఞ నెగ్గించినది.(21, 22)

ఆమె కోరిన వరముల ప్రకారము నేను పదునాలుగు సంవత్సరములు దండకారణ్యమునందు నివసించవలెను. నా తండ్రి భరతునికి యౌవరాజ్యభారము అప్పగించినాడు.(23)

అందుచే నేనిపుడు నిర్జనారణ్యమునకు పోవుటకు బయలుదేరి, నిన్ను చూచుటకై వచ్చినాను. నీ వెన్నడూ భరతుని ఎదుట నా ప్రసంగము తీసికొని రావలదు. ఎందుచేతననగా, ఐశ్వర్యముతో ఉన్నవారు, ఇతరులను పొగడుచుండగా సహించరు. అందుచే భరతుని ఎదుట నీవు నా గుణములను గూర్చి ముచ్చటించరాదు. నిన్ను విశేషముగా పోషించవలసిన బాధ్యత కూడ భరతునకు లేదు. అతనికి అనుకూలముగా ప్రవర్తించుచు మాత్రమే నీ వాతని వద్ద ఉండగలవు. పరంపరాగతమైన యౌవరాజ్యమును మహారాజు అతని కిచ్చినాడు. అందుచే, నీవాతని అనుగ్రహమును, విశేషించి మహారాజు అనుగ్రహమును సంపాదించుటకు ప్రయత్నించవలెను. (24-27)

నేను నాతండ్రి ఆజ్ఞ ప్రకారము అరణ్యమునకు ఇపుడే వెళ్ళుచున్నాను. నీవు ధైర్యము వహింపుము. నీవు మంగళప్రదురాలవు. దోషరహితురాలవు. నేను మునుల నివాసమైన వనమునకు వెళ్ళిన పిమ్మట నీవు వ్రతములను ఆచరించుచు ఉపవాసములు చేయుచు ఉండవలెను.(28, 29)

ఉషఃకాలమునందే లేచి, యథావిధిగా పూజ చేసి మాతండ్రియైన దశరథమహారాజునకు నమస్కరించుచుండవలెను. దుఃఖముతో కృశించుచున్నదీ, వృద్ధురాలూ, నాతల్లీ అయిన కౌసల్యను, నీవు ధర్మమునకే ప్రాధాన్య మిచ్చుచు గౌరవించవలెను. స్నేహము, ప్రేమ, పోషణము - వీటి విషయమున నాకు తల్లులందరు సమానమైనవారే. అందుచేత నా మిగిలిన తల్లులను గూడ నీవు ఆదరించుచుండవలెను. (30-32)

విశేషించి నీవు, నా ప్రాణములతో సమానులైన భరతశత్రుఘ్నులను సోదరులవలె, పుత్రులవలె చూచుకొనవలెను. భరతుడు రాజ్యమునకు, కులమునకు గూడ రాజు; సర్వాధికారి. అందుచే అతని కెన్నడును అనిష్టము చేయగూడదు. రాజులను మంచి స్వభావముచే(నడవడికచే) సంతోషింపచేయుచు ప్రయత్నపూర్వకముగా సేవించినచో వారు ప్రసన్ను లగుదురు. అట్లు కానిచో కోపింతురు. అహితమును చేయువారు ఔరసపుత్రు లైనను వారిని రాజులు పరిత్యజింతురు. బాహ్యజను లైనను సమర్థులైనచో వారిని దగ్గరకు తీయుదురు. నీవు రాజైన భరతుని విషయములో అనుకూలముగా ప్రవర్తించుచు, ధర్మనిరతురాలవై, సత్యవ్రతమును అవలంబించి, ఇచటనే నివసింపుము.(33-37)

ఓ ప్రియురాలా! నేను మహారణ్యమునకు వెళ్ళెదను. నీవు మాత్రము ఎవ్వరి మనస్సునకును కష్టము కలిగింపకుండునట్లు ఇచటనే ఉండుము. నా మాటలను వినుము."(38)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఇరువది ఆరవ సర్గము సమాప్తము.

ఇరువది ఏడవ సర్గము

"నన్ను కూడ అరణ్యమునకు తీసుకొనివెళ్ళుము." అని సీత రాముని ప్రార్థించుట.

ప్రియముగ మాటలాడునదీ, ప్రియవాక్యములకే తగినదీ అయిన సీత రాముని మాటలు విని, ప్రేమచేతనే కోపించినదై, అతనితో ఇట్లనెను.(1)

"రాజకుమారా! రామా! నీవు ఏమి చెప్పుచున్నావు? ఈ అర్థరహితమైన మాటలకు నీకే తప్పక హాస్యము కలుగును. నీ నోటినుండి విని నాకును ఇది హాస్యాస్పద మగుచున్నది.(2)

ఆర్యపుత్రా! తండ్రీ, తల్లీ, సోదరుడూ, కోడలూ, మొదలైనవారు వారు వారు చేసిన పూర్వపుణ్యము ననుసరించి ఆ యా ఫలితములను అనుభవించుచుందురు. ఎవరు చేసిన పాపపుణ్యములను వారే కాని ఇతరు లనుభవింపరు. ఓ నరశ్రేష్ఠా! భార్య ఒక్కతె మాత్రమే భర్తయొక్క భాగ్యమును పంచుకొనును. అందుచే నిన్ను వనమునకు వెళ్ళవలె నని ఆజ్ఞాపించినచో, నన్ను కూడా ఆజ్ఞాపించినట్లే.(3,4)



స్త్రీకి తండ్రి గాని, కుమారుడు గాని, తనకు తానే గాని, తల్లి గాని, సఖురాండ్రు గాని గతి(గమ్యస్థానము లేదా గమ్యము చూపువారు) కాజాలరు. ఇహలోకమునందైనను, మరణానంతరమైనను భర్త ఒక్కడే స్త్రీలకు ఉత్తమగతి.(5)

నీ విపుడే దుర్గమారణ్యమునకు ప్రయాణమైనచో, నేను గూడ నీ ముందే నడుచుచు, దర్భలను కంటకములను నలగగొట్టి, నీవు నడచుటకు సుఖముగా నుండునట్లు చేసెదను. నేను నీ మాట మన్నించనందులకు కలుగు ఈర్ష్యను, కోపమును, త్రాగగా మిగిలిన జలమును పరిత్యజించినట్లు పరిత్యజించి, నన్ను కూడా తీసుకొని వెళ్ళుము. నాయందు ఎట్టి పాపము లేదు. నీ కేమియు కష్టము కలుగదు. అందుచే నమ్మకముతో తీసుకొని వెళ్లుము.(6,7)

మేడలమీద నివాసముకంటెను, విమానములకంటెను, ఆకాశసంచారము కంటెను లేదా ప్రాసాదాగ్రనివాసాది సమయములందు కూడా, అన్ని అవస్థలందును భర్త పాదచ్ఛాయయే విశిష్టమైనది. అనేకవిషయములను గూర్చి నా తల్లిదండ్రులు నాకు పూర్వమే ఉపదేశించి ఉన్నారు. అందుచే నే నెట్లు నడచుకొనవలెనో, ఇపుడు, నా కెవ్వరును చెప్పవలసినపని లేదు.(8, 9)

జనశూన్యమూ, వివిధములైన మృగగణములతో నిండినదీ, పులులు తోడేళ్ళు మొదలైనవాటికి నివాసమూ, దుర్గమమూ అయిన అరణ్యమునకు నేను కూడ వచ్చెదను. నాకు మూడు లోకములలో ఉన్న ఏ వస్తువును గూర్చియు చింత ఉండదు. కేవలము పతి శుశ్రూషాదివ్రత మాచరించుచు, అడవియందు, పుట్టింటనున్నట్లు సుఖముగా ఉండెదను. నిత్యమూ నీ సేవచేయుచు, నియమపూర్వకముగా బ్రహ్మచర్యమును అవలంబించి, తేనెల సువాసనలతో నిండిన

అరణ్యములలో నీతో విహరింతును.(10-12)

అందరి గౌరవమును రక్షించు ఓ రామా! నీవు అరణ్యములో ఇతరులను గూడ సంరక్షించుటకు సమర్థుడవు. ఇంక నామాట చెప్పవలెనా? ఈ రోజున నీతో కూడ వనమునకు వచ్చెదను. సందేహము లేదు. ఈ విధముగా నిర్ణయించుకొన్న నన్నెవ్వరును మరల్చజాలరు. నేను నిస్సంశయముగా నిత్యము ఫలమూలములను మాత్రమే భుజించెదను. నీకు ఏ మాత్రము దుఃఖము కలిగింపకుండ నీతో కలిసి నివసింతును.(13-15)

నీ ప్రక్కనే ఉండుటచే ఎచటను భయ మేమియు లేనిదాననై, నదులను, శైలములను, చిన్న చెరువులను, వనములను చూడవలెనని కోరుచున్నాను. వీరుడవైన నీ దగ్గరనుండి, సుఖవంతురాలనై, హంసలతోనూ కారండవపక్షులతోనూ కూడిన, చక్కగా పుష్పించిన పద్మసరస్సులను చూడవలెనని కోరుచున్నాను. స్థిరమైన వ్రత మాచరించుచు, నిత్యము ఆ తామరకొలనులలో స్నానము చేయుచు, గొప్ప ఆనందము కలదాననై నీతో క్రీడించెదను. (16-18)

ఈ విధముగా నీ సాంగత్యమునందుండి లక్షసంవత్సరము లైనను సుఖసంతోషాదులలో ఎట్టి మార్పును చూడబోను. నీవు లేని స్వర్గమైనను నా కిష్టము కాదు. నీవు లేకుండ స్వర్గనివాసము కూడ నాకు ఇష్టము కాజాలదు. మృగములతోనూ, వానరములతోనూ, గజములతోనూ నిండినదై, ప్రవేశించుటకు చాల కష్టమైన అరణ్యమునకు వచ్చి, నియమవంతురాలనై, నీ పాదములనే పట్టుకొని, ఆ అరణ్యములో పుట్టింట నున్నట్లు సుఖముగా నివసించెదను.(19-21)

ఇతరభావము లేవియు లేక, నీయందే అనురాగము గల చిత్తముతో నున్న నేను నీతో వియోగ మేర్పడిన పక్షమున మరణించవలెనని నిశ్చయించుకొంటిని. అందుచే నన్ను తీసుకొని వెళ్ళుము. నా కోరికను బాగుగా మన్నింపుము. ఇట్లు చేయుటచే నావలన నీ కేమియు భారము కలుగబోదు."(22)

సీత ఇట్లు పలుకుచున్నను ధర్మాత్ముడగు రాముడు ఆమెను తీసుకొని వెళుటకు అంగీకరించలేదు. ఆమెను వనగమనప్రయత్నమునుండి మరల్చుటకై వనవాసమునం దుండు దుఃఖములను గూర్చి ఆమెకు ఎక్కువగా చెప్ప మొదలిడెను.(23)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఇరువది ఏడవ సర్గము సమాప్తము.

ఇరువది ఎనిమిదవ సర్గము

రాముడు సీతను వనమునకు రావలదని వారించుట.

రాముడు, వనములలో కలుగు దుఃఖములను గూర్చి ఆలోచించుచు సీత ఈ విధముగా మాటలాడుచున్నను, ఆమెను తీసుకొని వెళ్ళుటకు అంగీకరించలేదు.(1)

అతడు, కన్నీటితో నిండిన నేత్రములు గల సీతను ఓదార్చి, ఆమెను వన గమనోద్యమమునుండి మరల్చుటకై ఇట్లనెను.(2)

"సీతా! నీవు ఉత్తమకులమునందు పుట్టినదానవు. సర్వదా ధర్మతత్పరురాలవు. నీవు ఇచటనే ఉండి, నీ ధర్మమును ఆచరించుచున్నచో నా మనస్సుకు సుఖము కలుగును. నేను చెప్పినట్లు చేయుము. అరణ్యములో అనేక కష్టములుండును. అవి ఏవో చెప్పెదను; వినుము.(3,4)

వనమునకు వెళ్ళవలెనను ఆలోచన విడువుము. ప్రవేశింపశక్యముకాని అరణ్యమునందు ఎన్నో దోషము లున్నట్లు జనులందరును చెప్పుచుందురు కదా. నేను నీ హితమును కోరియే చెప్పుచున్నాను. వనము సర్వదా దుఃఖనిలయము. అచట సుఖ మెన్నడును కలుగదు.(5,6)

పర్వతమునుండి పడుచున్న సెలయేళ్ల ధ్వనులును, పర్వతగుహాలలో నివసించు సింహముల గర్జనలును వినుటకు భయంకరముగా ఉండును. అందుచే వనము దుఃఖకరమైనది. మత్తెక్కి, శూన్యారణ్యములో నిర్భయముగా క్రీడించుచున్న క్రూరమృగములు మనుష్యులను చూడగానే మీదికి వచ్చును. అందుచే వనము దుఃఖనిలయము. నదులు మొసళ్ళతోను, బురదతోను, మదించిన ఏనుగులు కూడ దాటుటకు శక్యముకాని విధమున ఉండును. అందువలన అరణ్యము సర్వదా దుఃఖమును కలిగించును.(7–9)

మార్గము లన్నియు డొంకలతోను, ముండ్లతోను నిండియుండును. అడవి కోళ్ళ కూతలు ప్రతిధ్వనించుచుండును. జలము లభించదు. ఈ విధముగా అరణ్యము ప్రవేశించుటకు చాల కష్టముగా నుండును. అందుచే వనవాసము చాల కష్టమైనది. పగలంతయు శ్రమపడి, రాత్రులందు, వాటంత అవి రాలి పడిన ఆకుల పక్కలపై, నేలమీద పరుండవలసి యుండును. అందుచే అరణ్యనివాసము చాల కష్టము. రేయింబగళ్ళు నియమము నవలంబించి, వాటంత అవి చెట్ల నుండి రాలిన

ఫలములతో తృప్తిచెందవలసి ఉండును. అందువలన అరణ్యమునందు నివాసము కష్టము. అరణ్యములో నివసించువారు యథాశక్తిగా ఉపవాసము చేయుచు, నారచీరలను, జటాభారమును, ధరించవలసి యుండును. అందువలన అరణ్యనివాసము కష్టము.(10-13)

దేవతలనూ, పితృదేవతలనూ, వచ్చిన అతిథులనూ, నిత్యము యథావిధిగా పూజించుచుండవలెను. వనమునందు నివసించువాడు సర్వదా నియమపరుడై ఆ యా కాలములందు, ప్రతిదినము, మూడు పర్యాయములు స్నానము చేయవలసియుండును. అందుచే వనవాసము చాల కష్టము. సీతా! స్వయముగా పుష్పములు కోసి తెచ్చి, వేదికపై, ఋషిప్రోక్తవిధానానుసారముగా, పూజ చేయవలసి యుండును. అందువలన వనవాసము దుఃఖకరము. వనములో నివసించువారు నియతాహారులై, లభించినదానితో తృప్తిపడవలసి యుండును. అందువలన వనవాసము కష్టమైనది.(14-17)

అరణ్యములో పెనుగాలులు వీచుచుండును. చీకటి దట్టముగా ఉండును. సర్వదా ఆకలి బాధ కలుగుచుండును. అనేకమైన భయహేతువులు కూడ ఉండును. అందువలన అరణ్యము దుఃఖకరము. వివిధరూపములలో నున్న అనేకము లగు సరీసృపములు, గర్వముతో(నిర్భయముగ) భూమిపై సంచరించుచుండును. అందువలన అరణ్యనివాసము చాల కష్టము. నదులలో నివసించు, నదుల వలె వంకరగా నడచు సర్పములు మార్గము నడ్డగించుచుండును. అందువలన వనము దుఃఖకరము. పక్షులు, తేళ్ళు, కీటకములు, ఈగలు, దోమలు, నిత్యము అందరినీ పీడించుచుండును. దుర్బలురాల వగు నీవు ఈ పీడను సహింపజాలవు. అందుచే వనవాసము కష్టము. అరణ్యములో చెట్లూ, దర్భలూ, రెల్లుగడ్డి ముళ్ళతో నిండి, కొమ్మలు ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఉండును. అందుచే అరణ్యము దుఃఖమును కలిగించును.(18-22)

అరణ్యములో నివసించువాడు అనేక మైన కాయక్లేశము లనుభవించవలసి యుండును. వానికి ఎన్నియో భయము లుండును. అందుచే వనములో దుఃఖమే కాని సుఖముండదు. అరణ్యములో నివసించువారు క్రోధలోభములు విడచి, మనస్సును తపస్సుపై నిలుపవలెను. భయపడవలసిన స్థితులలో గూడ భయపడగూడదు. అందుచే వనము సర్వదా దుఃఖకారణము. అందుచే నీవు అరణ్యమునకు రావద్దు. నీకు అరణ్యము నివాసయోగ్యము కాదు. ఆలోచించిన

కొలది అరణ్యములో ఎన్నియో కష్టములే కనబడుచున్నవి."(23-25)

మహాత్ముడైన రాముడు తనను అరణ్యమునకు తీసుకొని పోవుటకు సమ్మతించకపోవుటచే సీత చాల దుఃఖించుచు అతనితో ఇట్లనెను.(26)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఇరువది ఎనిమిదవ సర్గము సమాప్తము.

ఇరువది తొమ్మిదవ సర్గము

తాను కూడా అరణ్యమునకు రామునితో కలసి వెళ్ళుట యుక్త మని సీత వాదించుట.

సీత రాముని మాటలు విని, ధారగా స్రవించుచున్న కన్నీళ్ళు గల ముఖముతో, మెల్లగా అతనితో ఇట్లు పలికెను.(1)

"వనమునందు నివాసము విషయమున నీవు చెప్పిన దోషము లన్నియు, వాటి వెనుక నీ ప్రేమ అనునది ఉన్నచో, నాకు గుణములే అగు నని తెలిసికొనుము.(2)

ఓ రామా! మృగములు, సింహములు, గజములు, శార్దూలములు, శరభములు, పక్షులు, చమరమృగములు, తదితరములైన వన్యమృగములు ఇవన్నియు, పూర్వమెన్నడును నీ రూపమును చూచియుండకపోవుటచే, నిన్ను చూడగనే పారిపోవును. భయహేతువును చూచి భయపడకుండువారెవరు?(3, 4)

పెద్దల ఆజ్ఞ ప్రకారము నీతో నేను కూడ అరణ్యమునకు వెళ్ళవలెను. నీతో వియోగము కలిగినచో నేను ఇచటనే ప్రాణములు విడచెదను. దేవతాధిపతియైన ఇంద్రుడు కూడ, నీ సమీపమునం దున్నంతవరకు నన్ను తన తేజస్సుచే తిరస్కరించజాలడు. భర్తలేని స్త్రీ జీవింపజాలదను ధర్మమును నీవే నాకు ఉపదేశించి యున్నావు కదా!(5-7)

మరియొక విషయమేమనగా నేను పూర్వము మా తండ్రి గారి యింటిలో నున్నప్పుడు బ్రాహ్మణులు చెప్పగా వింటిని. నేను తప్పక వనవాసము చేయవలసి యున్నదట. సాముద్రికలక్షణవేత్తలైన బ్రాహ్మణుల మాటలు పూర్వము విన్నది మొదలు, ఎల్లప్పుడు వనవాసమునకై ఉత్సాహపడుచు ఉన్నాను. అట్టి వనవాసము నిమిత్తమై నాకు ఆదేశము లభించవలసి యున్నది కదా? అందుచే నేనిపుడు నీతో

కలసి అరణ్యమునకు వెళ్లెదను. మరొక విధముగా జరుగుటకు వీలులేదు. నేను ఆ బ్రాహ్మణుని మాట నిలబెట్టుటకై నీతో వచ్చెదను. అతని మాట సత్య మగుటకు తగిన సమయము వచ్చినది గాన ఆ బ్రాహ్మణుని వాక్యము సత్య మగుగాక.(8-11)

ఓ వీరా! వనవాసమునందు అనేకవిధములగు దుఃఖము లుండునని నాకు తెలియును. కాని ధైర్యరహితులకు మాత్రమే ఆ దుఃఖములు వచ్చును. నేను నా తండ్రి గారి ఇంటివద్ద కన్యగా నుండు నపుడు, మంచి వృత్తము గల ఒక భిక్షుకస్త్రీ, నాకు ఇపుడు వనవాసము సంభవించు నని మా తల్లితో చెప్పగా విని ఉన్నాను. (12,13)

నిన్ను నేను చాలాకాలము సేవించి అనుగ్రహింప చేసికొంటిని కదా! నీతో కలసి వనములో నివసింపవలె నను కోరికను మన్నింపుము. రామా! నీకు క్షేమమగుగాక! నాటినుండియే నేను నీ వనవాసమును గూర్చి వేచియున్నాను. నాకు శౌర్యముతో కూడిన ఆచరణమన్న చాల ఇష్టము. అందుచే నీ వనవాససమయము వచ్చినది గాన నన్ను కూడ తీసుకొని వెళ్ళుము. పరిశుద్ధ మైన అంతఃకరణముగల ఓ రామా! భర్తవైన నిన్ను ప్రేమ పూర్వకముగానే అనుసరించి వనమునకు వెళ్ళి నేను పాపశూన్యురాలను అయ్యెదను. నాకు భర్తయే దైవతము.(14-16)

మరణానంతరము గూడ నేను నీతోడనే కలసియుందును. తల్లితండ్రులు స్వధర్మానుసారముగా ఏ స్త్రీని, ఎవనికి, జలధారాపూర్వకముగా దానము చేయుదురో, ఆ స్త్రీ, మరణానంతరము కూడ, అతనికే చెంది, అతనితో కలసియుండును అని యశఃశాలు లగు బ్రాహ్మణులు వేదవాక్యమును చెప్పుచుందురు కదా? నేను నీదానను, మంచి నడవడిక కలదానను, పతివ్రతను. అట్టి నన్ను ఈ నగరమునుండి నీతో అరణ్యమునకు తీసుకొనిపోవుటకు ఎందుచే ఇచ్చగింపకున్నావు? రామా! నేను నీ భక్తురాలను, పతివ్రతను, సుఖదుఃఖములను తుల్యముగా చూడగలదానను. నీ సుఖమే నా సుఖమనీ, నీ దుఃఖమే నా దుఃఖమని భావించుదానను. అట్టి నన్ను నీతో తీసుకొని పొమ్ము.(17-20)

ఈ విధముగా దుఃఖించుచున్న నన్ను అరణ్యమునకు తీసుకొని వెళ్ళకపోయినచో విషము త్రాగి గాని, అగ్నిలో పడి గాని, జలములో దూకి గాని ప్రాణములను విడచెదను".(21)

ఈ విధముగా ఆమె తనను కూడ వనమునకు తీసుకొని పొమ్మని ఎంత బ్రతిమాలినను, రాముడు, ఆమెను, జనశూన్యమగు వనమునకు తీసుకొని

వెళ్ళుటకు అంగీకరించలేదు. రాముని మాటలు విన్న సీత దుఃఖాక్రాంతురాలై, కన్నీళ్లతో నేల తడసిపోవునట్లు ఏడ్చెను. బుద్ధిమంతు డగు ఆ రాముడు ఆ విధముగా ఏడ్చుచున్న, ఆ సీతను, వనగమన ప్రయత్నమునుండి మరల్చుటకై ప్రయత్నించుచు, ఓదార్చెను.(22-24)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఇరువది తొమ్మిదవ సర్గము సమాప్తము.

ముప్పదవ సర్గము

సీత తనతో వనమునకు వచ్చుటకు రాముడు అంగీకరించుట.

వనవాసమునకు రావద్దని చెప్పుచు రాముడు ఈ విధముగా ఓదార్చుచుండగా, సీత మిక్కిలి దుఃఖితురాలై ప్రేమచేతను, తన ప్రార్థనను వినలేదు కదా అను అహంకారముచేతను రాముని నిందించెను.(1, 2)

"రామా! నీవు పురుషశరీరము గల స్త్రీవి. అట్టి నిన్ను, విదేహదేశరాజు, మిథిలాధీశుడయిన నా తండ్రి ఏ మనుకొని అల్లునిగా చేసికొనినాడో తెలియదు. వాస్తవానికి, నీవు నన్ను అడవికి తీసుకొని వెళ్ళకపోయినచో అందుకు కారణము నీవు తేజోవిహీనుడ వగుట కాదు. లోకములో ఎవరైన రామునియందు తేజస్సు లేదు అని అజ్ఞానముచే అన్నచో, అది "ప్రకాశించుచున్న సూర్యునితో తేజస్సు లేదు." అని అన్నట్లు అసత్యమే. అందుచే నీవు నన్ను తీసుకొని వెళ్లకపోవుటకు పరాక్రమవిహీనత్వము కాదు; వేరే కారణ ముండవలెను. నీవు తప్ప వేరెవ్వరూ గతిలేని నన్ను, ఈ విధముగా పరిత్యజించి వెళ్ళవలెనని అనుకొనుచున్నావే. నీవు ఎందుకు దిగులు చెందుచున్నావు? నీ భయమునకు కారణమేమి?(3-5)

సావిత్రి ద్యుమత్సేనుని కుమారుడైన సత్యవంతుని అనుసరించి ఉండునట్లు, నేను సర్వదా నీ సమీపమునందు ఉండుదానను అని తెలిసికొనుము. నేను కులమునకు కళంకము తెచ్చు సామాన్య స్త్రీవంటిదానను కాను. నీవు తప్ప మరొకనిని మనస్సుచేత కూడ చూడను. నీతో అరణ్యమునకు వచ్చెదను. నేను నీ భార్యను. పతియే గతి యని నమ్మినదానను. నూతనయౌవనములో ఉన్నదానను. చాలాకాలము నీతో కాపురము చేసినదానను. అట్టి నన్ను నాటకాలలో వేషములు వేసికొని జీవించు నటుడు తన భార్యను స్వయముగనే ఇతరులకు ఇచ్చినట్లు,

ఇతరుల కిచ్చివేయదలచుచున్నావు. (6-8)

నీవు ఏ దశరథాదుల హితమును గూర్చి మాటలాడుచున్నావో, ఎవరిని దృష్టిలో ఉంచుకొని నన్ను నీతో రావలదని అడ్డుపెట్టుచున్నావో, వారికి నీవు సర్వదా వశ్యుడవై, విధేయుడవై ఉండవచ్చును కాని నన్ను వారికి విధేయురాలనై ఉండుమనుట తగదు. అన్నియు తెలిసిన నీవు నన్ను తీసుకొని వెళ్ళకుండగా వనమునకు బయలుదేరుటయు యుక్తము కాదు. నాకు తపస్సైనను, అరణ్యమైనను, స్వర్గమైనను నీతో కలిసియే. నీ సాన్నిధ్యము లేనిచో నా కేదియు రుచింపదు. నీ వెనుకనే వచ్చు నపుడు మార్గమునందు నా కేమియు శ్రమ కలుగదు. విహారములందును, శయనములందును ఏ విధముగ శ్రమ లేనిదాననై ఉందునో అట్లే మార్గమునందు గూడ ఉండగలను. (9-11)

నీతో కలసి ప్రయాణము చేయునప్పుడు, మార్గములో నున్న దర్భలు, కాశములు, శర-ఇషీకాదితృణములు, ముండ్లచెట్లూ కూడా నాకు దూదివలె, మంచి మృగచర్మమువలె మృదువుగా ఉండును. పెనుగాలికి ఎగిరి నన్ను కప్పివేయు పరాగమును అత్యుత్తమ మైన చందనముగా పరిగణించగలను. వనములో నివసించుచు, నేను, వనమధ్యములందు, పచ్చికబీడులపై శయనించు నపుడు కలుగు సుఖము కంటె చిత్రమైన కంబళ్ళు కప్పిన శయనములపై ఎక్కువ సుఖము కలుగునా! నీవు స్వయముగా తీసుకొని వచ్చి, ఇచ్చే పత్రమైనను, ఫలమైనను, మూలమైననూ అది కొంచెమైనను అధికమైనను, నాకు అమృతతుల్య మగును. (12-15)

అరణ్యమునందు ఆ యా ఋతువులలో లభించు పుష్పఫలాదులను అనుభవించుచు తల్లిని గాని, తండ్రిని గాని, గృహమును గాని స్మరించుచు బెంగ పెట్టుకొనను. అందుచే అరణ్యములలో నావలన కష్టము లేవియో వచ్చు నని భావించకుము. నా మూలమున నీ కేమియు శోకము కలుగదు. నీకు పోషింప భారముగా కాబోను. నాకు నీ సాహచర్యమున్నదే స్వర్గము. నీవు లేనిచో అది నరకము. రామా! ఈ విషయమును గుర్తించి నాతో కూడ గొప్ప ఆనందమును పొందుము. (16-18)

నీతో వనమునకు వెళ్ళవలె నని దృఢనిశ్చయముతో నున్న నన్ను తీసుకొని వెళ్ళకపోయినచో ఇప్పుడే విషమును త్రాగెదను. శత్రువులకు మాత్రము వశము కాజాలను. నీవు నన్ను విడిచిపోయినచో నేను దుఃఖముతో కొంతకాలము తరువాత

నైనను ప్రాణములు విడువవలసినదే. అందుచే ఇప్పుడే మరణించుట మేలు. ఈ శోకమును ఒక్క క్షణ మైనను సహింపజాలను. పదునాలుగు సంవత్సరములు దుఃఖించుచు గడపజాల నని వేరే చెప్పవలెనా?"(19-21)

శోకసంతప్తురా లైన ఆ సీత భర్తను కౌగిలించుకొని, జాలి కలుగునట్లు సస్వరముగా బిగ్గరగా ఏడ్చెను. విషము పూసిన బాణాదులచే కొట్టబడిన ఆడ ఏనుగ వలె, అనేకము లైన వాక్యములచే పీడింపబడిన ఆ సీత, చాల సేపటివరకును ఆపి యుంచిన కన్నీటిని, అరణి అగ్నిని వలె, పైకి విడచెను. ఆమె నేత్రములనుండి, దుఃఖమువలన కలిగిన స్వచ్ఛమైన కన్నీరు, పద్మములనుండి ఉదకము స్రవించి నట్లు, స్రవించెను. విశాలమైన నేత్రములు గలదీ, నిర్మలమైన చంద్రుని వంటి కాంతి గలదీ అయిన ఆమె ముఖము, కన్నీటితో, వాడిపోయెను.(22-25)

అపుడు, రాముడు దుఃఖితురాలై మూర్ఛచెంది నట్లున్న ఆ సీతను బాహువులతో కౌగిలించుకొని, ఓదార్చుచు ఇట్లనెను.(26)

"దేవీ! నీవు దుఃఖించుచుండగా, స్వర్గము లభించినను దాని కిష్టపడను. బ్రహ్మదేవునకు వలె, నాకు ఎవరినుండియు, ఏ మాత్రమును, భయము లేదు. నిన్ను రక్షింప సమర్థుడ నైనను, నీ అభిప్రాయ మేమో పూర్తిగా తెలిసికొనకుండ నిన్ను అరణ్యమునకు తీసుకొని వెళ్ళుటకు నే నిష్టపడలేదు. నిన్ను బ్రహ్మ నాతో కలసి వనవాసము చేయుటకే సృష్టించినట్లున్నది. అందుచే, ఆత్మాభిమానవంతుడు కీర్తిని ఏ విధముగా విడువజాలడో ఆ విధముగనే నేను నిన్ను విడువజాలను.(27-29)

పితృవాక్యపరిపాలన మను ధర్మమును పూర్వము సత్పురుషు లందరును ఆచరించిరి. నే నిపుడు ఆ ధర్మమునే ఆచరింతును. సత్యముచే పరిపుష్టమైన మా తండ్రి వచనము నన్ను వనమునకు తీసుకొనివెళ్ళుచున్నది. అందుచే నేను తప్పక వనమునకు వెళ్లెదను.(30,31)

తల్లికిని తండ్రికిని లొంగి యుండుట అనునదే ధర్మము. అందుచే నే నా ధర్మమును అతిక్రమించి జీవించుటకు ఇచ్ఛగించను. మనకు అందుబాటులో ఉన్న తల్లిని, తండ్రిని, గురువును కాదని, మనకు అందుబాటులో లేని దైవమును ఏవిధముగా ఆరాధించగలము? పితృమాతృగురువులే మూడు లోకములు. వీరితో సమానమైన వారెవరును ఈ భూలోకమునందు లేరు. అందుచే వారి సేవ చేయవలెను. (32-34)

తండ్రియొక్క సేవ ఏ విధముగా బలకరమో అట్లు సత్యము గాని, దానమానములు గాని, భూరిదక్షిణలు గల యజ్ఞములు గాని బలకరములు కావు. తండ్రి యాజ్ఞను పాలించుటచే, స్వర్గము గాని, ధనము గాని, ధాన్యము గాని, విద్యలు గాని, పుత్రులు గాని, సుఖములు గాని, ఏదైనను లభించును. లభించని దేదియు ఉండదు. మాతాపితృసేవాపరాయణు లగు మహాత్ములు, దేవలోకమును, గంధర్వలోకమును, గోలోకమును, బ్రహ్మలోకమును, తదితరపుణ్యలోకములను పొందగలరు. సత్యధర్మమార్గముల ననుసరించుచున్న నా తండ్రి న న్నెట్లు ఆజ్ఞాపించునో ఆ విధముగనే ప్రవర్తింపవలె నని నేను కోరుచున్నాను. సనాతన ధర్మము ఇదియే కదా?(35-38)

నిన్ను కూడ దండకావనమునకు తీసుకొని వెళ్ళవలె నను ఉత్సాహము నాకు లేకుండెను. కాని నీవు అరణ్యములో నివసించెద నని చెప్పుచు నాతో వచ్చుటకు కృతనిశ్చయురాలవై ఉన్నావు. నిన్ను అనుమతించుచున్నాను. నాతో రమ్ము. నాకు సహధర్మచారిణివి అగుము. నాకును, నీ కులమునకును అన్ని విధాల తగిన మంచి నిర్ణయమును తీసుకొనినావు. వెంటనే వనవాసమునకు తగిన పను లన్నియు ప్రారంభించుము. నీవు లేనిచో స్వర్గము కూడ నా కిష్టము కాదు. కోరి వచ్చిన బ్రాహ్మణులకు రత్నాలనూ, భిక్షుకులకు భోజనమునూ ఇమ్ము. తొందరగా చేయుము. ఆలస్యము చేయకుము. (39-43)

మంచి విలువ గల అలంకారములను, వస్త్రములను, అందమైన క్రీడాసాధనములను, నాకు సంబంధించిన శయనములను, తదితర వస్తువులను నీ పోషణలో నుండు వారి కిమ్ము. ఇంకను మిగిలిన వాటిని బ్రాహ్మణుల కిమ్ము". (44,45)

తాను కూడ అరణ్యమునకు వచ్చుట భర్తకు సంమతమే అని తెలిసికొనిన సీత చాలా సంతోషించి, వెంటనే దానములు చేయ ప్రారంభించెను. కీర్తిమంతురాలు, పవిత్రమైన మనస్సు కలదీ అయిన ఆమె భర్త మాటలు విని సంతోషించి, నిండు మనస్సుతో రత్నములనూ, ధనమునూ, ధర్మాత్ములకు దానము చేయ ప్రారంభించెను.(46, 47)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ముప్పదవ సర్గము సమాప్తము.

ముప్పది ఒకటవ సర్గము

రాముని అనుమతితో లక్ష్మణుడు వనమునకు బయలుదేరుట.

అంతకు పూర్వమే అక్కడికి వచ్చిన లక్ష్మణుడు సీతారాముల మధ్య జరిగిన ఈ సంవాదము నంతను విని, కన్నీటితో వ్యాకులమైన నేత్రములు కలవాడై, దుఃఖమును ఇముడ్చుకొనజాలక, సోదరుని పాదములకు నమస్కరించుచు, రామునితోను, సీతతోను ఇట్లనెను.(1, 2)

"మృగగజాదులతో నిండిన అరణ్యమునకు వెళ్ళవలెనని నీవు నిశ్చయించినచో, నేను కూడ ధనుర్ధారినై, ముందు నడచుచు, నీతో అరణ్యమునకు వచ్చెదను. పక్షుల కూతలతోను, మృగముల నాదములతోను అంతటా ప్రతిధ్వనించుచున్న అనేక అరణ్యములలో నాతో కలసి సంచరించగలవు. నీవు లేనిచో నాకు దేవలోకముపై విజయము గాని, దేవతాత్వము గాని, త్రిలోకాధిపత్యము గాని అక్కరలేదు."(3-5)

వనవాసమునకై, నిశ్చయము చేసికొని ఈ విధముగా పలికిన లక్ష్మణుని, రాముడు వనమునకు రావల దని అనేకవిధముల చెప్పి ఓదార్చెను. అది విని లక్ష్మణుడు మరల ఇట్లనెను.(6)

"నీవు ఇంతకు పూర్వమే నాకు అనుమతి ఇచ్చితివి కదా! ఇపు డీ విధముగా నివారించుచున్నా వేమి? నేను నీతో రావలెనని అనుకొనుచుండగా నన్ను ఎందుచేత అడ్డు పెట్టుచున్నావో, తెలుసుకొన గోరుచున్నాను. నా మనస్సులో సంశయము కలుగుచున్నది." అనెను.(7, 8)

లక్ష్మణుడు ఈ విధముగ ఎదుట నిలిచి, ముందుగనే అరణ్యమునకు పోవుటకు సంసిద్ధుడై, చేతులు మోడ్చి ఈ విధముగా ప్రార్థించుచుండగా మహాతేజశ్శాలి యగు రాముడు ఆ వీరునితో ఇట్లు పలికెను.(9)

"నీవు మంచి స్నేహశీలము కలవాడవు. ధర్మనిరతు డైన వీరుడవు. ఎల్లపుడును సన్మార్గమునందే సంచరించువాడవు. నాకు ప్రాణము వంటి వాడవు. సర్వదా నా ఆజ్ఞ అనుసరించు సోదరుడవే కాదు, మిత్రుడవు కూడ. నీవు నాతో కలసి అరణ్యమునకు వచ్చినచో కౌసల్యను, యశోవంతురా లగు సుమిత్రను ఎవరు పోషింతురు?(10,11)

మహాతేజశ్శాలి యగు దశరథమహారాజు, భూమిపై మేఘము వర్షించి నట్లు కోరిన కోరిక లన్నియు వర్షించుచుండెడివాడు. కాని ఇపు డా రాజు కామపాశముచే

కట్టుబడి ఉన్నాడు. ఈ రాజ్యము లభించిన పిమ్మట, ఆ కైకేయి దుఃఖాక్రాంతలైన సవతులకు కష్టము కల్గించును. భరతుడు రాజ్యమును పొంది, కైకేయి మాటలనే వినుచు దుఃఖితురా లైన కౌసల్యను, సుమిత్రను స్మరింపడు. నీవు ఇచటనే ఉండి స్వయముగా గాని, రాజును అనుగ్రహింపచేసుకొనుచు గాని, పూజ్యురా లైన కౌసల్యను పోషించుము. నేను చెప్పినట్లు చేయుము. ఇట్లు చేసినచో, నీకు నాపై కల భక్తిని బాగుగా చూపి నట్లగును. పెద్దల శుశ్రూష చేయుటచే సాటిలేని, గొప్ప ధర్మము కూడా లభించును.(12-16)

నా కొరకైనను నేను చెప్పినట్లు చేయుము. మనము దగ్గర లేనిచో, తల్లికి సుఖము ఉండదు."(17)

మాటలలో నేర్పరియైన లక్ష్మణుడు రాముని మాటలు విని అతనితో మధురమైన వాక్కుతో ఇట్లు పలికెను.(18)

"వీరుడ వైన ఓ రామా! నీ పరాక్రమమునకే భయపడి భరతుడు వినయవంతుడై కౌసల్యను సుమిత్రను ఆదరించగలడు. ఇందుకు సందేహము లేదు. వెయ్యి గ్రామములు కౌసల్య చేతిలో నుండి, ఆమె అనుగ్రహముపై జీవించుచున్నవి. అట్టి పూజ్యురా లగు కౌసల్య నావంటి వారిని వెయ్యిమంది నైనను పోషించగలదు. కీర్తిమంతురా లగు ఆ కౌసల్య, సహస్రగ్రామాధిపతి యగుటచే తనను, నా తల్లిని, నా వంటి వారిని అనేకులను కూడ పోషింప సమర్థురాలు.(19-21)

నన్ను నీ అనుచరునిగా చేసికొనుము. దీనిలో ధర్మవిరోధమేదియు లేదు. ఇట్లు చేయుటచే నేను కృతార్థుడ నగుదును. నీ కార్యము కూడ సిద్ధించును. ధనుర్బాణములను, గునపమును, చిన్న గంపను తీసుకొని, నీకు మార్గమును చూపుచు, నీ ముందు నడచుచు వచ్చెదను. నీకు నిత్యము దుంపలు, ఫలములు, మునులకు మంచి ఆహారముగా ఉపయోగించు వనములో లభించు ఇతరవస్తువులు, తెచ్చి యిచ్చుచుందును. నీవు సీతాసమేతుడ వై, పర్వతముల చరియలపై, విహరించవచ్చును. నీవు మేల్కొని యున్నను, నిద్రించియున్నను, నేను కార్యము లన్నియు చేయుచుందును."(22-25)

ఈ మాటలు విని రాముడు చాలా సంతోషించి అతనితో "లక్ష్మణా! వెళ్ళి నీ మిత్రు లందరి వద్ద సెలవు తీసుకొని రమ్ము. జనకమహారాజు చేసిన మహాయజ్ఞములో, మహాత్ముడగు వరుణుడు, స్వయముగా, చూచుటకు భయంకరము లైన రెండు దివ్యధనుస్సులను , భేదించుటకు శక్యము గాని రెండు దివ్యకవచములను, అక్షయ

మైన బాణములు కల తూణీరములను, బంగారముతో అలంకరించిన సూర్యుని వలె ప్రకాశించుచున్న రెండు ఖడ్గములను యిచ్చియున్నాడు. ఈ ఆయుధము లన్నియు మన ఆచార్యుడగు వసిష్ఠుని గృహములో ఉంచి పూజింపబడుచున్నవి. వాటి నన్నింటిని తీసుకొని శీఘ్రముగా రమ్ము." అని పలికెను.(26-29)

వనవాసమునకు నిర్ణయము చేసుకొన్న లక్ష్మణుడు, తన మిత్రులందరికి వీడ్కోలు చెప్పి, వసిష్ఠుని ఇంటికి వెళ్ళి అక్కడ ఉన్న ఉత్తమ మైన ఆయుధసముదాయమును తీసుకొనెను. మాలలచే అలంకృతములై పూజింప బడిన ఆ దివ్యాయుధముల నన్నింటిని తీసుకొని వచ్చి రామునకు చూపెను.(30, 31)

వచ్చిన లక్ష్మణుని చూచి, రాముడు, ప్రేమపూర్వకముగా- "సౌమ్యుడవైన ఓ లక్ష్మణా! నేను అనుకొన్న సమయమున వచ్చినావు. నీతో కలసి నేను, నా ధనము నంతను తపస్సు గల బ్రాహ్మణులకు ఇవ్వవలె నని కోరుచున్నాను. గురువులపై దృఢమైన శ్రద్ధతో ఇచట నివసించు బ్రాహ్మణోత్తములకును, నన్ను ఆశ్రయించుకొన్నవారికిని ఇవ్వవలెనని కోరుచున్నాను.(32-34)

ద్విజులలో శ్రేష్ఠుడు, వసిష్ఠపుత్రుడు, పూజ్యుడు అయిన సుయజ్ఞుని వెంటనే తీసుకొని రమ్ము. సదాచారవంతు లైన ఇతర బ్రాహ్మణు లందరిని కూడ పూజించి నేను అరణ్యమునకు వెళ్ళెదను.(35)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ముప్పది ఒకటవ సర్గము సమాప్తము.

ముప్పది రెండవ సర్గము

రాముడు తన సంపదను దానము చేయుట.

సోదరుని ఆజ్ఞ ప్రకారము లక్ష్మణుడు వెంటనే సుయజ్ఞుని ఇంటికి వెళ్ళి, అగ్నిగృహములో నున్న ఆ బ్రాహ్మణునకు నమస్కరించి, "ఓ స్నేహితుడా! ఇతరు లెవ్వరు చేయజాలని కార్యము చేయుచున్న రాముని ఇంటికి వచ్చి చూడుము." అని చెప్పెను.(1, 2)

సుయజ్ఞుడు సంధ్యోపాసనము పూర్తిచేసికొని, లక్ష్మణునితో కూడ వెంటనే వచ్చి లక్ష్మికి నిలయమై సుందరముగా నున్న రాముని గృహములోనికి ప్రవేశించెను. వేదవేత్తయైన, ఆ సుయజ్ఞుడు వచ్చిన వెంటనే రాముడు సీతాసహితు డై నమస్కరించి,

హోమానంతరము అగ్నికి ప్రదక్షిణముచేసినట్లు అతనికి ప్రదక్షిణము చేసెను.(3,4)

శ్రేష్ఠ మైన బంగారు అంగదములు, అందమైన కుండలములు, బంగారు సూత్రములు గల మణులు, కేయూరములు, వలయములు, ఇతరమైన అనేక రత్నములు, సుయజ్ఞునకు ఇచ్చి, సీత ప్రేరేపింపగా, అతనితో, "సౌమ్యుడవైన మిత్రమా! ఇపుడు సీత నీ భార్యకొరకై హారమును, బంగారు సూత్రమును, వడ్డాణమును, ఇవ్వవలెనని కోరుచున్నది. వీటిని తీసుకొని వెళ్ళుము. వనమునకు వెళ్ళుచున్న సీత నీ భార్య నిమిత్తమై అంగదములను, విచిత్రములు, సుందరములు అయిన బాహుపురులను నీకు ఇచ్చుచున్నది. శ్రేష్ఠమైన ఆస్తరణము కలిగి అనేకవిధములైన రత్నములచే అలంకృతమైన పర్యంకమును కూడ సీత నీకు ఇవ్వవలె నని కోరుచున్నది.(5-9)

నాకు నా మేనమామ ఇచ్చిన శత్రుంజయమను ఏనుగును, మరి వేయి ఏనుగులను నీకు ఇచ్చుచున్నాను." అనెను.(10)

సుయజ్ఞుడు రాముడు చెప్పిన విధమున వాటి నన్నింటిని ప్రతిగ్రహించి సీతారామలక్ష్మణులకు శుభకరములైన ఆశీర్వాదములను పలికెను.(11)

పిమ్మట ప్రియముగా మాటలాడు రాముడు తన ప్రియసోదరుడైన లక్ష్మణునితో ఇట్లు పలికెను.(12)

"లక్ష్మణా! బ్రాహ్మణోత్తము లైన, అగస్త్యునీ, కౌశికునీ ఆహ్వానించి, సస్యముపై ఉదకము వర్షించినట్లు రత్నములు వర్షించి వారిని పూజింపుము. బంగారము, వెండి, అమూల్యమైన మణులు ఇచ్చి వారిని ఆనందింపచేయుము.(13, 14)

తైత్తిరీయుల ఆచార్యుడు, అనుకూలుడు, వేదవేత్త అయిన ఒక పండితుడు, శ్రద్ధాపూర్వకముగా కౌసల్యకు ఆశీర్వచనములను పలుకుచు సేవ చేయుచుండును. అతనికి సంతోషము కలుగునంతవరకు వాహనములను, దాసులను, పట్టు వస్త్రములను ఇప్పించుము. (15, 16)

మన తండ్రి గారి సచివు డైన, చిత్రరథుడను సారథి చాలాకాలముగా మన ఇంటిలో ఉన్నాడు. అతనికి అమూల్య మైన రత్నములు, వస్త్రములు, ధనములు అన్ని విధములైన చిన్ని పశువులు, వేయి గోవులు ఇచ్చి సంతోషపెట్టుము.(17)

కఠకలాపశాఖలకు చెందిన పలాశదండధారు లైన ఎందరో బ్రహ్మచారులు నిత్యము వేదాధ్యయనమునందే నిరతులై యుండుటచే మరి యే పనులను చేయరు.

వారు సోమరులు. మధురమైన పదార్థములను తినగోరు చుందురు. పూజ్యులైనవారు కూడ వీరిని గౌరవించుచుందురు. అట్టి ఈ బ్రహ్మచారులకు రత్నములతో నిండిన ఎనుబది వాహనములను, ధాన్యమును మోయు వెయ్యి వృషభములను, భూమిని దున్ను రెండు వందల ఎద్దులను, ఆహారమునందు నెయ్యి, పెరుగు మొదలగునవి లభించుటకు వెయ్యి గోవులను ఇప్పించుము. (18-20)

మేఖలలు ధరించిన బ్రహ్మచారులు చాలా మంది కౌసల్యను ఆశ్రయించి యున్నారు. వారందరికిని వేయి గోవుల చొప్పున ఇప్పించుము. నేను ఇచ్చు దక్షిణలను చూచి మా తల్లి యైన కౌసల్య ఆనందించు విధమున ఆ బ్రాహ్మణు లందరిని సర్వవిధముల పూజించుము."(21, 22)

లక్ష్మణుడు, రాముడు చెప్పిన విధమున ఆ ధనము నంతను, కుబేరుడు వలె స్వయముగా బ్రాహ్మణశ్రేష్ఠులకు ఇచ్చెను. (23)

పిమ్మట రాముడు, బాష్పముతో నిండిన కంఠములతో అచట నిలచి యున్న భృత్యుల కందరకు జీవికార్థమై అత్యధికముగా ధనము నిచ్చి వారితో, "నేను తిరిగి వచ్చువరకును, లక్ష్మణుని గృహమును, నా గృహమును కూడ కాపలా కాయుచు, ఇవి శూన్యము కాకుండునట్లు చూడవలెను." అనెను. (24, 25)

దుఃఖితు లైన ఆ పరిచారకులను ఈ విధముగ ఆదేశించి, "ధనమును తీసుకొని రమ్ము" అని కోశాధ్యక్షుని ఆజ్ఞాపించెను. రాముని ఆజ్ఞ ప్రకారము అతని భృత్యులు, రాముని ధనము నంతను తీసుకొని వచ్చిరి. పెద్ద దైన ఆ ధనరాశి చూచుటకు చాలా అందముగా నుండెను. పురుషశ్రేష్ఠుడైన రాముడును, లక్ష్మణుడును, ఆ ధనమునంతను బ్రాహ్మణులకు, బాలురకు, వృద్ధులకు, దీనులకు ఇప్పించిరి. (26-28)

ఆ ప్రాంతమునందు పచ్చని శరీరచ్ఛాయ కల త్రిజటుడు అను గర్గవంశమునందు పుట్టిన బ్రాహ్మణుడు నివసించుచుండెను. అతడు నిత్యము చిన్న గొడ్డలి, గునపము, నాగలి అను సాధనములు ఉపయోగించుచు వనములో త్రవ్వుకొనుచు జీవించుచుండెడివాడు. (29)

పడుచు దైన అతని భార్య, దారిద్ర్యముతో బాధపడుచు, చిన్నవారైన తమ కుమారులను చూచి, ముసలివాడైన ఆ బ్రాహ్మణునితో, "నా మాట విని, ఆ చిన్న గొడ్డలిని, గునపమును దూరముగా పారవేసి, ధర్మాత్ముడైన రాముని దర్శనము

చేసినచో నీ కేమైన లభించవచ్చును." అని పలికెను.(30, 31)

త్రిజటుడు, భార్య మాట విని, పూర్తిగా చిరిగి పోవుటచే కప్పుకొనుటకు రాని ఉత్తరీయము కప్పుకొని, రాముని గృహమున్న మార్గమున బయలుదేరెను. అతడు జనసమూహములో భృగుమహర్షి వలెను, అంగిరసుని వలెను, బ్రహ్మతేజస్సుతో విరాజిల్లు చుండెను. అందుచే ఐదవ వాకిలివరకు అతనిని ఎవ్వరును అడ్డు పెట్టలేదు. త్రిజటుడు రాముని సమీపించి, "మహాకీర్తిమంతుడ వైన ఓ రామా! నేను ధనము లేనివాడను. చాల మంది పిల్లలు కలవాడను. నిత్యము అడవిలో త్రవ్వుకొనుచు, జీవించుచున్నాను. నన్ను కూడ ఒక కంట చూడుము." అనెను.(32-34)

అపుడు రాముడు పరిహాసపూర్వకముగా అతనితో - "నేను ఇంతవరకు ఒక్క గోసహస్రమును కూడా (వేయి గోవుల సముదాయము) దానము చేయలేదు. నీవు చేతిలోని దండమును ఎంతదూరము విసిరెదవో అంతవరకు వ్యాపించు గోసమూహమును నీ కిచ్చెదను." అనెను.(35)

త్రిజటుడు సంతోషించి, తొందరపడుచు వస్త్రమును నడుమునకు కట్టి, తన బలమునంతను ఉపయోగించి, ఆ దండమును వేగముగా త్రిప్పి విసిరెను. అతడు విసిరిన దండము సరయూనదిని దాటి, కొన్ని వేల ఆవులున్న ఆవులమందయందు ఆబోతు దగ్గర పడెను.(36, 37)

ధర్మాత్ముడైన రాముడు, ఆ త్రిజటుని కౌగిలించుకొని, సరయూతీరమువరకు వ్యాపించిన ఆ గోవులను అతనికి ఇచ్చి, గోపాలకులచే వాటిని అతని ఆశ్రమమునకు పంపెను. అపుడు రాముడు, గర్గవంశోద్భవుడైన ఆ త్రిజటుని బ్రతిమాలుచు, "కేవలము పరిహాసముకొరకై ఇట్లు చేసితిని. కోపించకుము. నీ తేజస్సు ఎవ్వరును మించుటకు శక్యము కానిది. దానిని చూడ వలె నను కోరికచేతనే నేను ఈ పని చేయుటకు నిన్ను ప్రేరేపించితిని. మరింకను కోరిక లేమైన ఉన్నచో కోరుకొనుము. నేను నిజముగా చెప్పుచున్నాను. ఇంతయే కోరవలె నని నియమము లేదు. నా ధనమంతయు బ్రాహ్మణులకొరకే ఉద్దిష్టమైనది. నేను సంపాదించిన ధనమును మీకు ఇచ్చుటచే నాకు ప్రీతి, యశస్సు కలుగును." అని పలికెను.(38-41)

భార్యాసహితు డైన, ఆ త్రిజటమహాముని, గోసముదాయమును ప్రతిగ్రహించి, సంతోషించినవాడై, ఆ రాముని మాటలకు బదులుగా, యశస్సును, బలమును, ఆనందమును, వృద్ధిపొందించు ఆశీర్వాదములను పలికెను.(42)

రాముడు సంతోషించిన మనస్సు కలవాడై, తగిన సమ్మానవాక్యములచే ప్రేరితుడై, ధర్మసమ్మత మైన బలముచే తాను సంపాదించిన ధనమును వెంటనే మిత్రులకు యిచ్చెను. ఆ సమయమున అక్కడ ఉన్న ద్విజులలో కాని, మిత్రులలో గాని, భృత్యులలో గాని, దరిద్రులలో గాని, యాచకులలో గాని, ఏ ఒక్కడును, తగు విధముగా సమ్మానముచేతను, దానముచేతను, గౌరవముచేతను, తృప్తి పొందనివాడు లేకుండెను.(43, 44)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ముప్పది రెండవ సర్గము సమాప్తము.

ముప్పది మూడవ సర్గము

రాముడు సీతాలక్ష్మణసమేతుడై కైకేయీభవనమునకు పోవుట.

సీతారామలక్ష్మణులు ఈ విధముగా బ్రాహ్మణులకు అధికముగా ధనము నిచ్చి, దశరథుని చూచుటకై వెళ్ళిరి. రామలక్ష్మణులు ధరించిన ఆయుధములకు సీతాదేవి పుష్పమాలలను కట్టెను. ఈ విధముగా అలంకరింపబడిన ఆ ఆయుధములు ప్రకాశించుచు, చూచుటకు భయము కల్గించుచుండెను.(1, 2)

జను లందరును ప్రాసాదములను(రాజదేవతాదిగృహములను), ధనికుల గృహములను, ఏడంతస్తుల మేడల శిఖరములను ఎక్కి దుఃఖించుచు చూచుచుండిరి. అసంఖ్యాకులైన జనులతో నిండిన వీథులు నడచుటకు శక్యము కాకుండెను. అందుచే దుఃఖాక్రాంతు లైన ప్రజలు, ప్రాసాదములను ఎక్కి, రాముని చూచుచుండిరి.(3, 4)

ఛత్రమును విడిచి పాదచారియై, వెళ్ళుచున్న ఆ రాముని చూచి, జనులందరును దుఃఖముచే పీడింపబడిన మనస్సులతో అనేకవిధములుగా చెప్పుకొనిరి.(5)

"రాముడు ఎచ్చటికి వెళ్ళినను అతని వెనుక చతురంగసైన్యము వెళ్ళుచుండెడిది. అట్టి రాముడే ఈనాడు ఒంటరిగా నడచుచుండగా, సీతాలక్ష్మణులు మాత్రము అతని వెనుక వెళ్ళుచున్నారు. ఈ రాముడు ఐశ్వర్యమును రుచి చూచినవాడు. కోరికలు కలవారి కోరికలను తీర్చగలవాడు. అట్టివాడు ధర్మమునం దున్న శ్రద్ధచే తండ్రి మాటను అసత్యము చేయకూడ దని కోరుచున్నాడు.(6, 7)

పూర్వము ఈ సీతను ఆకాశమునందు సంచరింపగలిగినవారు కూడ

చూడజాలకుండిరి. అట్టి సీతను ఈనాడు, రాజవీథులలో నున్న జనులు చూచుచున్నారు. సీత శరీరమునకు అంగరాగములను, రక్తచందనమును పూసుకొనుటకు అలవాటు పడినది. అట్టి ఈ సీత శరీరవర్ణమును వర్షము, వేడి, చలి మొదలగునవి తొందరగా చెడగొట్టగలవు.(8, 9)

రాజు ఇపుడు ఏదో భూతము ఆవేశించి, ఈ విధముగా మాటలాడుచున్నాడు. సందేహము లేదు. ప్రియపుత్రుని ఏ రాజైనను ఊరు వెడలగొట్టునా? గుణములు లేని పుత్రుని కూడ దేశమునుండి వెడలగొట్టరు కదా! మంచి చరిత్రచే ప్రజల నందరిని ఆకర్షించిన కుమారుని విషయమున చెప్పవలెనా? పురుషులలో ఉత్తము డైన రాముడు, క్రూరత్వము లేకుండుట, జాలి, విద్య, మంచి శీలము, ఇంద్రియముల నిగ్రహము, మనోనిగ్రహము అను ఆరు గుణములతో ప్రకాశించుచున్నాడు.(10-12)

అట్టి రామునకు అపకారము కలుగుటవలన, ప్రజ లందరును, గ్రీష్మఋతువునందు నీరు ఎండిపోవుటచే జలజంతువుల వలె గొప్ప బాధను అనుభవించుచున్నారు. మొదలు కొట్టి వేయుటచే పుష్పఫలములతో నిండిన వృక్షము వలె ఈ లోకమున కంతకు ప్రభువైన రామునకు కష్టము కలుగుటచే ఈ లోకమంతయు కష్టముల పా లగుచున్నది.(13, 14)

రాముడు, ధర్మమే సారముగా కలవాడు. గొప్ప కాంతి గలవాడు. ఈతడే మనుష్యులకు మొదలు. ఇతరజను లందరును ఈ చెట్టు మొదలుతో సంబంధము గల పుష్పములు, ఫలములు, శాఖలు. అందుచే మనము కూడ భార్యాబంధువులతో కలసి రాముడు ఎక్కడికి వెళ్ళుచున్నాడో అక్కడికి లక్ష్మణుని వలె అతనిని అనుసరించుచు, వెంటనే బయలుదేరి వెళ్లుదము. ఉద్యానములను, పొలములను, ఇండ్లను విడచి, రామునితో సుఖదుఃఖములను పంచుకొనుచు, ధర్మాత్ముడైన ఈ రాముని వెంట వెళ్ళుదము.(15-17)

మనము విడిచి వేయగా ఈ నగరములోని ఇండ్లన్నియు, క్షామాదిదుష్కాలముచే పాడుపడి నట్లు పాడుపడిపోవును. నిధులన్నియు త్రవ్వివేయుదురు. ముంగిళ్ళు చెడిపోవును. ధనధాన్యములు, ఇతరసంపదలు, అన్నియు నశించును. ఈ ఇండ్లపై దుమ్ము కప్పియుండును. దేవతలు వీటిని విడిచి వెళ్ళిపోవుదురు. ఎలుకలు కన్నములనుండి బయటకు వచ్చి స్వేచ్ఛగా ఇటు అటు పరుగెత్తుచుండును. ఉదకము గాని ధూమము గాని కనబడదు. వీథిని తుడుచువా రుండరు. నగరములో బలికర్మలు, యజ్ఞములు, మంత్రపఠనము, హోమములు, జపములు జరుగవు.

భ్రద్దలైన కుండలు అక్కడక్కడ పడి ఉండును. అట్టి ఇండ్లు కైకేయికి లభించుగాక.(18-21)

రాముడు వనమునకు వెళ్ళుచున్నాడు గాన ఆ వనమే నగర మగుగాక. మనము విడిచి వేసిన ఈ నగరమే వన మగుగాక. మనలను చూచి భయపడి కోరలు గల సర్పాదు లన్నియు బిలములను విడిచి పోవుగాక! మృగములు, పక్షులు పర్వతములను విడచి పోవుగాక. గజములు, సింహములు వనములను విడిచి పోవుగాక! ఇవన్నియు, మన మున్న వనమును విడిచి మనము విడచిన అయోధ్యానగరము చేరుగాక! పుత్రబాంధవాదులతో కూడిన కైకేయి క్రూరమృగములతోను, పక్షులతోను నిండిన, తృణమాంసఫలములను తిను జంతువుల దేశమును పొంది పాలించు గాక. మన మందరము రామునితో కలసి వనములో సుఖముగా నివసించెదము."(22-25)

రాముడు ఇట్లు జను లందరును అనేక విధములుగా పలుకుచున్న మాటలను వినెను. ఆ మాటలను వినిన పిమ్మట కూడ అతని మనస్సునకు వికార మేమియు కలుగలేదు. రాముడు, దూరమునుండి కైలాసశిఖరము వలె కనబడుచున్న తండ్రి గారి గృహము సమీపించెను. వీరపురుషులు వినయముతో నిలచియున్న ఆ రాజగృహమును ప్రవేశించి ఆ సమయమున, దీనుడైన సుమంత్రుని చూచెను.(26-28)

అక్కడ నున్న జను లందరు దుఃఖాక్రాంతు లగుటను చూచి కూడ రాము డే మాత్రము దుఃఖింపక మీదు మిక్కిలి నవ్వుచున్నట్లు కనబడుచు, తండ్రి యాజ్ఞను యథావిధిగా చెల్లించుటకు నిశ్చయము చేసుకొని తండ్రిని చూచుటకై వెళ్ళెను. దుఃఖితుడైన సుమంత్రుని చూచి "నేను వచ్చినట్లు రాజునకు చెప్పుము." అని సుమంత్రునితో పలికెను.(29-31)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ముప్పది మూడవ సర్గము సమాప్తము.

ముప్పది నాలుగవ సర్గము

రాముడు సీతాలక్ష్మణసమేతుడై రాణులతో కూడిన దశరథమహారాజువద్దకు పోయి, వనవాసమునకై సెలవడుగుట.

పద్మపత్రములవంటి నేత్రములు కలవాడు, శ్యామవర్ణుడు, సాటిలేనివాడు, పూజ్యుడు అయిన ఆ రాముడు "నేను వచ్చినట్లు మా తండ్రిగారికి చెప్పుము." అని సూతునితో పలికెను.(1)

సూతుని ఇంద్రియము లన్నియు దుఃఖముచే కలతచెంది యుండెను. అతడు రాముని మాట విని, వెంటనే లోనికి వెళ్ళి యచట దుఃఖముతో నిట్టూర్చుచున్న రాజును చూచెను. దశరథుడు అపుడు గ్రహణము పట్టిన సూర్యుడు వలె, భస్మముచే కప్పబడిన అగ్నివలె, జలము లేని తటాకము వలె తేజోవిహీనుడై ఉండెను. రామునిగూర్చియే దుఃఖించుచు, వ్యాకులమైన చిత్తము గల ఆ దశరథుని చూచి సుమంత్రుడు నమస్కరించుచు, సమీపించెను.(2-4)

అతడు ముందుగా రాజునకు "జయ! విజయీ భవ!" అను ఆశీర్వచనవాక్యములను పలికి భయముచే తొట్రుపడుచున్న మాటలతో, మెల్లగా మధురముగా ఇట్లు పలికెను.(5)

"పురుషశ్రేష్ఠు డైన నీ కుమారుడు, తన ధనము నంతను బ్రాహ్మణులకును, భృత్యులకును దానము చేసి వచ్చి, ద్వారము వద్ద వేచియున్నాడు. రామునికి దర్శనము ఇమ్ము. అతడు తన మిత్రుల నందరిని వీడ్కొలిపి ఇపుడు నిన్ను చూడదలచుచున్నాడు. రాముడు మహారణ్యమునకు వెళ్ళనున్నాడు. కిరణములతో కూడిన సూర్యుని వలె సకల రాజగుణములతో ప్రకాశించుచున్న ఆ రాముని చూడుము." (6-8)

సత్యమునే పలుకువాడు, ధర్మాత్ముడు, గాంభీర్యములో సముద్రముతో సమానుడు, ఆకాశము వలె మాలిన్యము లేనివాడు అయిన దశరథుడు సుమంత్రునితో, "సుమంత్రా! ఇక్కడ ఉన్న నా భార్యల నందరిని తీసుకొనిరమ్ము. వారందరితో కలసి నేను ధర్మాత్ముడైన రాముని చూడగోరుచున్నాను." అని పలికెను.(9, 10)

సుమంత్రుడు అంతఃపురము ప్రవేశించి "ఓ పూజనీయులారా!రాజు మిమ్ములను పిలుచుచున్నాడు. అచటికి వెళ్ళుడు. ఆలస్యము చేయవద్దు." అని ఆ

స్త్రీలతో పలికెను. సుమంత్రుడు ఇట్లు పలుకగా, ఆ స్త్రీ లందరును, రాజాజ్ఞ ప్రకారము అతని ఇంటికి వెళ్ళిరి. పతివ్రతలు, ఎఱ్ఱని నేత్రములు కలవారు అయిన మూడు వందల యేబది మంది స్త్రీలు, కౌసల్యను అనుసరించి మెల్లగా అచటికి వెళ్ళిరి.(11-13)



ఆ భార్య లందరును వచ్చిన పిమ్మట దశరథుడు, "ఓ సుమంత్రా! నా కుమారుని తీసుకొని రమ్ము." అని అతనితో పలికెను.(14)

సుమంత్రుడు సీతారామలక్ష్మణులను వెంటనే రాజు దగ్గరకు తీసుకొని వెళ్ళెను. స్త్రీలచే చుట్టుకొనబడిన ఆ దశరథుడు, నమస్కరించుచు వచ్చుచున్న కుమారుని, దూరమునుండియే చూచి దుఃఖితుడై, వెంటనే ఆసనమునుండి లేచి వేగముగా అతనికి ఎదురుగా పరుగెత్తి, అతనిని చేరక మునుపే దుఃఖముతో మూర్ఛచెంది నేలపై పడెను. (15-17)

అపుడు, దుఃఖముతో తెలివి తప్పినట్లు ఉన్న శోకార్తు డైన ఆ రాజు దగ్గరకు రాముడును, మహారథు డైన లక్ష్మణుడును తొందరగా పరుగెత్తిరి. వెంటనే ఆ రాజగృహమునుండి భూషణధ్వనులతో కలసి "అయ్యో రామా!" అను వేలకొలది స్త్రీల ఆర్తధ్వని బయలువెడలెను. సీతారామలక్ష్మణులు ఆ దశరథుని బాహువులతో కౌగిలించుకొని ఏడ్చుచు, అతనిని మెత్తని ఆసనముపై కూర్చుండబెట్టిరి.(18-20)

క్షణకాలమున తిరిగి సంజ్ఞ పొంది, శోకసముద్రమున మునిగి ఉన్న ఆ రాజునకు నమస్కరించుచు రాముడు ఇట్లనెను.(21)

"మహారాజా! నేను సెలవు కోరుచున్నాను. నీవు మా అందరికిని అధిపతివి. నేను దండకారణ్యమునకు బయలుదేరి వెళ్ళుచున్నాను. నీవు సుఖముగా నన్ను చూడుము. లక్ష్మణునకు కూడ అనుజ్ఞ నిమ్ము. సీత కూడ నన్ను అనుసరించి వనమునకు వచ్చుచున్నది. సత్యమైన ఎన్నో కారణములు చెప్పి నేను నివారించుచున్నను వీరిరువురు అంగీకరించుటలేదు. దుఃఖమును విడిచి, లక్ష్మణుని,

నన్ను, సీతను - మమ్ములను అందరిని కూడ బ్రహ్మ ప్రజలను వలె అనుమతింపుము."(22-24)

మనోవైకల్య మేమియు లేక వనవాసము నిమిత్తము తన అనుమతికొరకై నిరీక్షించుచున్న ఆ రాముని చూచి దశరథుడు, "రామా! కైకేయి, నన్ను, తన కిచ్చిన వరములను కారణముగ చేసికొని వంచించినది. నీవు నన్ను నిగ్రహించి అయోధ్యాధిపత్యమును పొందుము." అనెను.(25, 26)

ధర్మమును పోషించువారిలో శ్రేష్ఠుడు, మాటలలో నేర్పరి యైన రాముడు, రాజు మాటలు విని, అతనికి నమస్కరించుచు ఇట్లనెను. (27)

"మహారాజా! అనేక సంవత్సరములపాటు ఈ భూమికి నీవే రాజుగా ఉండవలెను. నేను అరణ్యములో నివసించెదను. నా నిమిత్తమై నీవు నీ మాటను అసత్యము చేయవద్దు. పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయుచు, విహరించి, ప్రతిజ్ఞ పూర్తి చేసుకొని, మరల నీ పాదములకు నమస్కరించెదను." (28,29)

సత్యపాశముచే బంధింపబడిన ఆ రాజును కైకేయి రహస్యముగా(రాముని పంపివేయుము అని) ప్రేరేపించ మొదలిడెను. అపుడు అతడు దుఃఖాక్రాంతు డై, ఏడ్చుచు, ఆ ప్రియపుత్రునితో,(30)

"నాయనా! నీవు పరలోకశ్రేయస్సుకొరకును, ఐహికాభివృద్ధికొరకును, తిరిగి వచ్చుటకు వెళ్ళుము. (వెళ్ళి తిరిగి రమ్ము.) నీ మార్గము మంగళప్రదమై, దుఃఖశూన్యమై, ఎటువైపు నుండియు భయములేనిదై ఉండుగాక. నీవు సత్యరూపుడవు. ధర్మమునందు మనస్సు నిలిపినవాడవు. అట్టి నీ బుద్ధిని మరల్చుటకు శక్యము కాదు. ఈ రాత్రి మాత్రము నీవు ఏ విధముగను, వెళ్ళవద్దు. ఒక్క రోజైనను నిన్ను చూచుచు సుఖముగా ఉండెదను. నన్ను, నీ తల్లిని చూచుకొనుచు నేటి రాత్రి యిచటనే ఉండి పొమ్ము. సర్వకామములచే సంతృప్తి చెందినవాడవై రేపు ఉదయమే వెళ్ళుము.(31-34)

నాకు ప్రియమును చేయుటకై నీవు ఇష్టజనులను అందరిని విడచి అరణ్యమునకు పోవుచున్నావు. ఈ విధముగా అన్ని విధముల ఎవ్వరును చేయజాలని పనిని చేయుచున్నావు. నీవు అరణ్యమునకు వెళ్ళుట నాకు ఏ మాత్రము ఇష్టముకాదు. సత్యముపై ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. గూఢ మైన అభిప్రాయము కలదై బూడిద

కప్పిన నిప్పువలె ఉన్న ఈ స్త్రీ నన్ను మోసగించినది. మంచి చరిత్రమును చెరచు ఈ కైకేయి ప్రేరేపించగా, నీవు నన్ను ఈ వంచననుండి ఉద్ధరించుటకై ప్రయత్నించుచున్నావు. నా జ్యేష్ఠపుత్రుడవైన నీవు తండ్రినైన నా మాట అసత్యము కాకుండు నట్లు చేయుటలో ఆశ్చర్య మేమియు లేదు."(35-38)

ఈ విధముగా దుఃఖించుచున్న తండ్రి మాటలు విని రామలక్ష్మణులు దుఃఖితులైరి. రాముడిట్లు పలికెను.(39)

"ఈనాడు నీవలన అన్ని భోగములను పొందినను రేపు వాటిని ఎవ్వరు ఇచ్చెదరు? అందుచే ఆ కామములను విడిచి వనమునకు వెళ్ళుటయే మంచి దని కోరుచున్నాను.(40)

అనేకమైన రాష్ట్రములు గలదీ, జనులతో నిండినదీ, ధనధాన్యసమృద్ధమూ అయిన, ఈ భూమిని, నేను విడిచివేయుచున్నాను. దీనిని భరతునకు ఇమ్ము. వనవాసమునకు వెళ్ళవలె నను నా నిర్ణయము ఇపుడు మారదు. వరముల నివ్వగలిగిన ఓ మహారాజా! నీవు సంతోషించి కైకేయికి యిచ్చిన వరమును పూర్తిగా ఇమ్ము. నీవు సత్యసంధుడవు అగుము. నేను మీకు మాట ఇచ్చిన విధముగా నీ ఆజ్ఞను పరిపాలించుచు పదునాలుగు సంవత్సరములు వనచరులతో కలసి వనములో నివసించెదను. ఇంక ఆలోచన ఏమియు వద్దు. రాజ్యమును భరతునకు ఇమ్ము. నాకు రాజ్యము కాని, సుఖము కాని పొందవలెనను కోరిక లేదు. నీ ఆజ్ఞానుసారముగా చేయుటయే నాకు ఇష్టము. నీవు దుఃఖమును విడువుము. కన్నీళ్ళు కార్చకుము.(41-46)

నాకు ఈ రాజ్యమునందు కాని, సీతయందు కాని, ఈ సకలభోగములందు కాని, స్వర్గమునందు కాని జీవితమునందు కాని కోరికలేదు. నీవు సత్యము కాపాడవలె నని, అసత్యవంతుడవు కాకూడదని నేను కోరుచున్నాను. నీ ఎదురుగా సత్యము పైనను, పుణ్యము పైనను, ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. ఇంక ఒక్క క్షణమైనను, నేను ఇక్కడ ఉండజాలను. నీవు నీ దుఃఖమును అణచుకొనుము. నా నిర్ణయమునకు తిరుగులేదు. "నీవు వనమునకు వెళ్ళుము." అని కైకేయి నన్ను కోరినది. నేను కూడ వెళ్ళెద నని అంగీకరించితిని. ఆ సత్యమును పాలించెదను. నీవు బెంగ పెట్టుకొనకుము. మేము ముగ్గురము ప్రశాంతమైనవి, లేళ్లతో నిండినవి, అనేకవిధము లగు పక్షులధ్వనులతో కూడినవి అగు వనములలో, సుఖముగా విహరించెదము.(47-51)

ఓ తండ్రీ! దేవతలకు కూడ తండ్రియే దేవత యని చెప్పబడినది కదా! అందువలన, తండ్రియే దేవత యను నిశ్చయముతో తండ్రి మాటను చేసెదను. నరులలో శ్రేష్ఠుడవైన ఓ తండ్రీ! పదునాలుగు సంవత్సరములు గడిచిన పిమ్మట, నేను మరల వచ్చెదను. అపుడు నన్ను చూడగలవు. అందుచే ఈ దుఃఖమును విడువుము. కంఠమునందు బాష్పమును అణచిపెట్టుకొనిన ఈ జనుల కందరికిని, నీవు ధైర్యము చెప్పవలసి యుండగా నీవే ఇట్లు వికారము పొందినా వేమి?(52-54)

ఈ పట్టణమును, రాష్ట్రమును, భూమినంతను కూడ, నేను ఇచ్చి వేయుచున్నాను. వీటిని భరతున కిమ్ము. నేను నీ ఆజ్ఞను పాలించుచు, వనములో చిరకాలము నివసించుటకై వెళ్ళెదను. అనేక పర్వతములతోను, నగరములతోను, అడవులతోను, కూడిన మంచి ఎల్లలు గల మంగళప్రదమైన, ఈ భూమిని నేను ఇచ్చివేయు చున్నాను. దీనిని భరతుడు మాత్రమే పాలించుగాక. నీవు చెప్పినట్లుగా జరుగుగాక.(55, 56)

నా మనస్సు శిష్టులకు సమ్మతమైన నీ ఆజ్ఞపై ఎట్లు దృఢముగా నిలచుచున్నదో, అంత దృఢముగా గొప్ప భోగములందు గాని, ఇతర ప్రియవస్తువులందు గాని నిలవదు. నాకొరకై నీవు దుఃఖింపకుము. నీ సత్యవ్రతమునకు భంగము కల్గించి అశాశ్వత మైన రాజ్యమునుగాని, సమస్తభోగములను గాని, సుఖమును గాని, సీతను గాని, జీవితమును గాని నేను కోరను. అందుచే నీ వ్రతము సత్య మగుగాక! నేను విచిత్రము లైన వృక్షములతో నిండిన అరణ్యమునకు వెళ్ళి, ఫలములు మూలములు తినుచు, పర్వతములు, నదులు, సరస్సులు చూచుచు, అక్కడ సుఖముగా నుండగలను. నీకు సుఖము కలుగుగాక!"(57-59)

ఈ విధముగా వ్యసనములో చిక్కుకొనిన ఆ దశరథుడు, మనోవ్యథతోను, దుఃఖముతోను బాధపడుచు, కుమారుని కౌగిలించుకొని పూర్తిగా స్మృతి తప్పి, మూర్ఛపోయి, చేష్టారహితు డయ్యెను. పిమ్మట కైకేయి తప్ప, మిగిలిన రాజభార్య లందరును, ఒక్క మాటుగా కలసి ఏడ్చిరి. సుమంత్రుడు కూడ ఏడ్చుచు మూర్ఛ పొందెను. ఆ ప్రదేశమంతయు హాహాకారములతో నిండెను.(60, 61)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ముప్పది నాలుగవ సర్గము సమాప్తము.

ముప్పది ఐదవ సర్గము

సుమంత్రుడు ఎంతగా బ్రతిమాలినను, కైక తన నిశ్చయమును మార్చుకొనకుండుట.

అపుడు, సుమంత్రుడు కోపావిష్టుడై వెంటనే లేచెను. అతడు మాటిమాటికీ నిట్టూర్చుచు, చేతిలో చేతిని వేసి బలముగా మర్దించుచు, దంతములు కటకటలాడించుచు, ఎర్రనైన నేత్రములతో చూచుచుండెను. దశరథుని మనస్సు తెలిసిన ఆ సూతుడు వజ్రాయుధములవంటి మాటలు ప్రయోగించుచు కైకేయితో ఇట్లనెను.(1-4)

"ఓ కైకేయీ! స్థావరజంగమాత్మక మైన ఈ జగత్తు కంతటికిని ప్రభువూ, నీ భర్తా అయిన దశరథమహారాజునే నీవు స్వయముగా పరిత్యజించినావు. అట్టి నీకు ఈ లోకములో చేయరాని పని యేదియు లేదు.(5)

దశరథమహారాజు, ఇంద్రుడు వలె జయింప శక్యము కానివాడు. పర్వతము వలె కదల్ప శక్యము కానివాడు. మహాసముద్రమువలె క్షోభింపచేయ శక్యము కానివాడు. అట్టి దశరథుని ఈ విధముగా చెడ్డపనులచే బాధపెట్టుచున్న నీవు భర్తను చంపుచున్నదానవు, చివరకు కులమునే నశింపచేయుదానవు అని భావించుచున్నాను. నీకు వరముల నిచ్చుచు, పోషించుచున్న భర్తయైన దశరథుని అవమానించకుము. స్త్రీలకు భర్త కోరిక (తీర్చుట) కోటిమంది పుత్రులకంటె అధికమైనది.(6-8)

రాజు తరువాత వయస్సు ననుసరించి రాజపుత్రులు రాజ్యము పొందుదురు. ఈ రాముని విషయమున ఆ పద్ధతిని మార్చవలె నని కోరుచున్నావు! నీ కుమారుడైన భరతుడు రాజై భూమిని పాలించుగాక. మే మందరము కూడ రాముడు వెళ్ళిన చోటుకే వెళ్లెదము. నీ విపుడు చేయదలచుచున్న మర్యాదావిరుద్ధ మైన పనిని బట్టి నీ దేశములో, బ్రాహ్మణు డైనవా డెవ్వడును నివసింపకూడదు.(9-11)

మే మందరము తప్పక రాముడు పోవు మార్గముననే వెళ్ళిపోయెదము. బంధువులచేతను, బ్రాహ్మణు లందరిచేతను, సత్పురుషులచేతను విడువబడిన నీకు రాజ్యము లభించినను, ఏమి ఆనందము పొందగలవు? నీవు ఆ విధ మైన మర్యాదకు విరుద్ధ మైన పని చేయుచున్నావు. నీవు ఈ విధముగా ప్రవర్తించుచుండగా, భూమి వెంటనే బ్రద్దలై నిన్ను తనలో కలుపుకొనక పోవుట చూచుచుండగా నాకు ఆశ్చర్యము కలుగుచున్నది.(12-14)

రాముని వనమునకు పంపవలె నని పట్టుపట్టుచున్న నిన్ను గొప్ప బ్రహ్మర్షులు సృజించినవి, ప్రజ్వలించుచున్నవి, చూచుటకు భయంకరముగా నుండునవి అగు 'ఛీ' అను వాగ్దండము లైనను దహించుటలేదు; ఇది ఆశ్చర్యముగా నున్నది.(15)

ఎవడైన మామిడిచెట్టును గొడ్డలితో నరికివేసి, వేపచెట్టుకు ఉపచారము చేసినను, దానిని పాలు పోసి పెంచినను అది వాని విషయమున కూడ మధురముగా నుండదు. కౌసల్యాదులను కాదని దశరథుడు నిన్ను ఇంత ప్రేమగా చూచినా నీవు అతని విషయమున చాల కటువుగానే ప్రవర్తించుచున్నావు. జన్మతః వచ్చిన నీ స్వభావము నీ తల్లి స్వభావము వంటిదే నని అనుకొనుచున్నాను. "వేపచెట్టునుండి తేనె కారునా?" అని లోకములో ప్రసిద్ధమైన సామెత ఉండనే ఉన్నది.(16, 17)

నీ తల్లికి ఏ విధముగా చెడ్డ పట్టుదల ఉండెడిదో దానిని గూర్చి మేము పూర్వము విని యున్నాము. అందుచే మాకు తెలుసును. ఒక మహాపురుషుడు నీ తండ్రికి ఒక గొప్ప వరమును ఇచ్చెను. దాని ప్రభావముచే, నీ తండ్రి సమస్తప్రాణుల ధ్వనులను, అర్థము చేసుకొనెడివాడు. తిర్యగ్జంతువులు మాటలాడు మాటలు కూడ అతనికి అర్థ మయ్యెడివి. ఒకనాడు నీ తండ్రియొక్క శయనము దగ్గర జృంభ మను ఒక చీమ మాటలాడగా దాని భావము నీ తండ్రికి తెలిసి అతడు బిగ్గరగా నవ్వెను. అపుడు నీ తల్లి అతడు తనను పరిహసించుచున్నా డని భావించి, కోపగించి, ప్రాణము పోయినను సరే అని తలచుచు, "రాజా! నీ నవ్వునకు కారణ మేమో తెలుసుకొన తలచుచున్నాను" అని పలికెను. రాజు ఆమెతో 'ఓ రాణీ! నేను నీకు కారణము చెప్పినచో, వెంటనే నాకు నిస్సంశయముగా మరణము కలుగును.' అని చెప్పెను.(18-22)

అపుడు నీ తల్లి ఆ కేకయరాజుతో "నీవు జీవించిన జీవించుము లేదా మరణించుము. ఏ మైనను నీ నవ్వునకు కారణము చెప్పి తీరవలయును. నన్ను ఈ విధముగ పరిహసించుటకు వీలులేదు." అని పలికెను. కేకయమహారాజు భార్య మాటలు విని, వరము నిచ్చిన ఆ మహాపురుషునకు ఆ విషయము నంతను జరిగినది జరిగినట్లు చెప్పెను. వరమిచ్చిన ఆ మహాపురుషుడు, నీ తండ్రితో, "ఓ రాజా! ఈమె మరణించినను, నశించినను నీవు మాత్రము ఆ రహస్యమును చెప్పకుము." అని పలికెను. ప్రసన్నమైన మనస్సుగల ఆ మహాపురుషుని మాటలు విని, ఆ రాజు నీ తల్లిని తిరస్కరించి, కుబేరుడు వలె సుఖముగా నుండెను.(23-26)

పాపదృష్టి గల ఓ కైకేయీ! నీవు కూడ నీ తల్లి వలెనే దుర్గుణములు అనుసరించు

మార్గమున ప్రవర్తించుచు, అజ్ఞానముచే ఈ దశరథుని విషయమున ఈ విధముగా, చెడ్డ పట్టుదలను వహించియున్నావు. కొడుకులకు తండ్రి గుణములు, కూతుళ్ళకు తల్లి గుణములు వచ్చునను లోకములో ప్రసిద్ధముగా నున్న మాట సత్యమే అని ఇపుడు నాకు తోచుచున్నది. నీవు ఈ విధముగా తల్లి పోలిక కలదానవు కాకుము. రాజు చెప్పినది అంగీకరించి అతని కోరిక ప్రకారము ప్రవర్తించి ఈ పౌరజానపదాదు లందరిని కాపాడుము.(27-29)

నీవు పాపాత్ములు చెప్పు మాటలు విని, దేవేంద్రునితో సమానమైన ప్రభావము కలవాడూ, భూలోకమునకు ప్రభువూ అయిన, నీ భర్తకు అధర్మము సంక్రమించు నట్లు చేయకుము. దోషములు లేనివాడూ, శ్రీమంతుడు అయిన దశరథమహారాజు, నీ కిచ్చిన మాటను అసత్యము చేయజాలడు. అందుచే నీవే నీ అభిప్రాయమును మార్చుకొనవలెను.(30, 31)

రాముడు అన్నదమ్ములలో జ్యేష్ఠుడు. ఉదారస్వభావుడు. కార్యములను నిర్వహించుటలో సమర్థుడు. స్వధర్మమును కాపాడుకొనువాడు. ప్రాణులందరిని రక్షించువాడు. మహాబలశాలి. అట్టి రామునకు రాజ్యాభిషేకము జరుగు నట్లు చూడుము. రాముడు తండ్రియైన దశరథమహారాజును విడచి అడవికి వెళ్ళినచో, లోకములో నీ విషయమున అపవాదము వ్యాపించును. అందుచే రాముడే రాజ్యమును పాలించుగాక! నీ మనస్సులోని సంతాపమును విడువుము. రాజ్యమును పరిపాలించుటకు సమర్థుడు రాముడు తప్ప వే రెవ్వరు ఈ అయోధ్యలో లేరు. రామునకు యౌవరాజ్యాభిషేకము చేసిన పిమ్మట, మహాబలశాలియైన దశరథమహారాజు, తన పూర్వపురుషుల ఆచారమును పాటించుచు, తపస్సుకై అడవికి వెళ్ళును."(32-35)

సుమంత్రు డీ విధముగా, దశరథుని సమక్షమున మంచి మాటలు, తీవ్రమైన మాటలు చెప్పి కైకేయి కలతచెందు నట్లు చేసి, మరల నమస్కరించుచు నిలబడెను. సుమంత్రు డెన్ని చెప్పినను, ఆ కైకేయి ఏ మాత్రము కలత చెందలేదు. ఆమె మనస్సులో ఏ మాత్రము బాధ కలుగలేదు. ఆమె ముఖవర్ణములో కూడ మార్పు కనబడలేదు.(36, 37)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ముప్పది ఐదవ సర్గము సమాప్తము.

ముప్పది ఆరవ సర్గము

సిద్ధార్థుడు కైక ననునయించుట.

వరముల నిచ్చెదను అని ప్రతిజ్ఞ చేసి ఉండుటచేత దశరథుడు పీడింపబడి బాష్పము(ఆవిరి) వచ్చునట్లు ఎక్కువగా నిట్టూర్చుచు సుమంత్రునితో మాటి మాటికి ఈ విధముగా చెప్పెను.(1)

"సుమంత్రా! రాముని వెనుకనే అరణ్యమునకు వెళ్ళుటకు రత్నములతో నిండిన, చతుర్విధబలములు గల సైన్యమును వెంటనే ఏర్పరుపుము. సంగీతాదిధ్వనులు చేయు వేశ్యలు, గొప్ప ధనము గల వర్తకులు, సైన్యమునం దంతటను వ్యాపించి, దానిని శోభింపచేయుదురు గాక! రామునిపై ఆధారపడి జీవించువారికిని, బలప్రదర్శనాదులచే రాముడు ఎవ్వరితో క్రీడించుచుండునో అట్టి వారికిని, అధికమైన ధనమును ఇచ్చి, వారిని కూడ ఈ సేనతో రాముని వెంట పంపుము. శ్రేష్ఠమైన ఆయుధములు, పౌరులు, శకటములు, అరణ్యములో నివసించు బోయవారు రాముని వెంట వెళ్ళెదరు గాక!(2-5)

రాముడు అరణ్యములో మృగములను, ఏనుగులను వేటాడుచు, అక్కడ లభించు తేనెను త్రాగుచు, అనేకవిధములైన నదులను చూచుచు, సుఖముగా నుండి రాజ్యమును గూర్చి స్మరించడు. నిర్జనవనములో నివసించు రాముని వెంట నా ధాన్యకోశమును, ధనకోశమును కూడ పంపుము. పుణ్యక్షేత్రములందు యాగములు చేయుచు, తగిన దక్షిణలను ఇచ్చుచు, రాముడు ఋషులతో కలసి వనములో సుఖముగా ప్రవాసకాలము గడుపగలడు. (6-8)

భరతుడు అయోధ్యను పాలించగలడు. శ్రీమంతుడైన రామునకు సమస్త మైన భోగ్యవస్తువులను ఇచ్చి పంపుము."(9)

దశరథు డిట్లు చెప్పుచుండగా, కైకేయికి భయము కలిగెను. ఆమె ముఖము వాడిపోయెను. కంఠస్వరము కూడ దుర్బలమయ్యెను. ఆమె దిగులుపడి, భయపడుచున్నదై, వాడిపోయిన ముఖముతో రాజును చూచుచు,(10, 11)

"సత్పురుషుడ వైన ఓ రాజా! జను లందరు వెళ్ళిపోయిన తరువాత శూన్యమై, అనుభవించుటకు ఏమియు మిగలని ఈ రాజ్యము, సారమును ఇతరులు త్రాగి వేసిన మద్యము వలె నుండును. అది భరతునకు అక్కరలేదు." అనెను.(12)

కైకేయి సిగ్గు విడచి అతిదారుణముగ పలికిన మాటలు విని దశరథుడు అమెతో, "కైకేయీ! నీవు నాకు శత్రువువు. నన్ను కాడికి కట్టినావు. నేను లాగుచుండగానే ఇంకనూ నన్ను పొడుచుచున్నా వేమి? నేను ప్రారంభించిన(రామునితో సైన్యాదు లను పంపుట అను) పనిని ముందుగనే నీవు ఎందుకు అడ్డుకొనలేదు?" అనెను.(13, 14)

రాజు కోపముతో పలికిన ఆ మాటలు విని, కైకేయి రెట్టింపు కోపముతో రాజుతో, "నీ వంశముననందే, సగరు డనే రాజు అసమంజు డనే తన జ్యేష్ఠపుత్రుని రాజ్యము లేకుండా అడ్డగించి, అతనిని వెడల గొట్టెను. ఈ రాముడు కూడ అట్లే వెళ్ళవలెను." అనెను.(15, 16)

కైకేయి మాటలు విని, దశరథుడు "ఛీ, ఎంత మాట అంటివి." అని మాత్రమే పలికెను. అక్కడ ఉన్న వారందరు సిగ్గుపడిరి. ఇంతైనను, కైకేయి ఏమియు లెక్కచేయలేదు. ఆ మాటలు విని, వృద్ధుడు, మంచి స్వభావము కలవాడు, రాజునకు అభిమానపాత్రుడు, అయిన అక్కడే ఉన్న సిద్ధార్థ డనే మంత్రి కైకేయితో ఇట్లనెను.(17, 18)

"దుర్మార్గు డైన అసమంజుడు మార్గములో ఆడుకొనుచున్న పిల్లలను పట్టుకొని, సరయూనదిలోనికి వారిని విసిరివేసి, ఆ విధముగా క్రీడించుచుండేవాడు. పౌరులందరు అది చూచి, కోపగించి రాజును, "రాజా! నీకు ఒక్క అసమంజుడు మాత్రమే కావలెనో లేక మేము కావలెనో కోరుకొనుము." అని అడిగిరి.(19, 20)

"మీకు ఈ విధముగా భయము కలుగుటకు కారణమేమి?" అని రాజు ప్రశ్నించగా ఆ ప్రజలు – "బుద్ధి చెడిన ఆ అసమంజుడు, ఆడుకొనుచున్న మా పుత్రు లైన చిన్న పిల్లలను, సరయూనదిలో పారవేయుచు మూర్ఖత్వముచే చాలా ఆనందించుచున్నాడు." అని చెప్పిరి. సగరచక్రవర్తి ప్రజల మాటలు విని, వారికి ప్రియము చేయదలచినవాడై, ఆ పుత్రుని విడచివేసెను.(21-23)

వెంటనే అతడు, అసమంజుని, వాని భార్యను కట్టుబట్టలతో రథమెక్కించి, "వీనిని యావజ్జీవము దేశమునుండి వెడలగొట్టవలెను." అని తన భృత్యులకు ఆజ్ఞాపించెను. ఆ అసమంజుడు, పాపకర్మ చేసినవాడు వలె, దిక్కులు పట్టి పోయి ఒక చిన్న గునపము, గంప చేత గొని పర్వతదుర్గములను త్రవ్వెను. ధర్మాత్ముడైన సగరచక్రవర్తి తన కుమారుని ఈ పాపకార్యము చేసినందుకు వెడలగొట్టెను. రాముని రాజ్యమునుండి వెడలగొట్టుటకు అత డే పాపము చేసినాడు?(24-26)

రామునిలో మాకు ఏ దోషమూ కనబడుటలేదు. చంద్రునియందు మాలిన్య మె ట్లుండదో, అట్లే రామునియందు దోషము కూడ ఉండజాలదు. అట్లు కాక నీకు రామునియందు ఏదైన దోషము కనబడినచో ఆ దోష మేదియో ఇపుడు ఉన్న దున్నట్లు చెప్పుము. అటుపైన, రాముని అరణ్యమునకు పంపవచ్చును. దోషములు ఏమియు లేక, ధర్మమార్గమునందు సంచరించుచున్న వారిని విడిచివేయుట అనునది ధర్మవిరుద్ధ మగుటచే, అది దేవేంద్రుని ఐశ్వర్యమును కూడ భస్మము చేయును.(27-29)

"కైకేయీ! నీవు రాముని ఐశ్వర్యమునకు విఘ్నము కల్గింపకుము. నీకు లోకములో చెడ్డ పేరు రాకుండునట్లు కూడ చూసుకొనవలెను కదా!"(30)

సిద్ధార్థుని మాటలు విని రాజు, మిక్కిలి అలసిపోయిన కంఠస్వరముతో, దుఃఖముచే పీడింపబడిన వాక్కుతో కైకేయితో, "చెడ్డ నడవడిక గల ఓ కైకేయీ! నీవు సిద్ధార్థుని మాటలు కూడ వినుటలేదు. చెడ్డ చేష్ట గల నీవు, కుత్సిత మైన మార్గమును అవలంబించి నా హితమును గాని, నీ హితమును గాని, తెలిసికొనజాలకున్నావు. నీవు చేయు పని సన్మార్గమునకు విరుద్ధముగా ఉన్నది. నేను ఈ రాజ్యమును, సుఖమును, ధనమును విడచి, రామునితో కలసి, ఇపుడే అరణ్యమునకు పోయెదను. నీవును, రాజైన భరతుడును, చిరకాలము సుఖముగా రాజ్యమును అనుభవింపుడు." అని పలికెను.(31-33)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ముప్పది ఆరవ సర్గము సమాప్తము.

ముప్పది ఏడవ సర్గము

రామాదులు నారవస్త్రములు ధరించుట.

వినయవంతు డైన రాముడు మంత్రి మాటలు విని దశరథునితో సవినయముగా ఇట్లనెను.(1)

"మహారాజా! భోగములను విడచి, సర్వసంగపరిత్యాగము చేసి, వనములో లభించు ఆహారమును తినుచు, వనములో నివసించు నాకు పరివార మంతయు ఎందుకు? ఉత్తమమైన గజమును ఇచ్చివేసి, దాని నడుముకు కట్టిన త్రాటియందు ఎవడైన ఆసక్తి చూపునా? ఏనుగునే ఇచ్చివేసినవానికి దాని త్రాటితో ఎట్లు

ప్రయోజనము లేదో, నాకును అట్లే ఈ సేనతో ప్రయోజన మేమియు లేదు. వీటి నన్నిటిని భరతునకే ఇచ్చివేయుచున్నాను. నాకు నారచీరలు మాత్రము తెచ్చి ఇవ్వవలెను.(2-4)

నేను పదునాలుగు సంవత్సరములు వనములో నివసించుటకై వెళ్ళుచున్నాను. అందుచే నాకు కావలసినవి ఒక గునపము, ఒక గంప అను రెండు వస్తువులు మాత్రమే" అని పలికెను.(5)

కైకేయి ఆ జనసమూహములో సిగ్గు లేక తానే స్వయముగా నార చీరలు తీసుకొని వచ్చి "ఇదిగో కట్టుకొనుము." అని రామునికి ఇచ్చెను. రాముడు కైకేయి చేతిలోనుండి, ఆ నారచీరలు తీసుకొని, తాను ధరించియున్న సన్నని వస్త్రమును వదలివేసి, ఆ మునివస్త్రములను ధరించెను. లక్ష్మణుడు కూడ తండ్రి ఎదుటనే తాను ధరించి యున్న సుందరవస్త్రములను విడిచి, నారచీరలను ధరించెను.(6-8)

ఇంతలో పట్టు వస్త్రములనే ధరించు సీత తనకొరకై తీసికొని వచ్చిన నారచీరలను చూచి, వల చూచిన లేడి వలె, భయపడిపోయినది. సీత కైకేయి చేతినుండి ఆ నారచీరలను సిగ్గుపడుచునే తీసుకొని, మిక్కిలి దుఃఖించుచు, కన్నీళ్ళతో నిండిన నేత్రములు కలదై గంధర్వరాజుతో సమానుడైన తన భర్తతో, "వనములో నివసించు మునులు నారచీరలను ఎట్లు కట్టుకుందురో" అని పలికి వాటిని ధరింప చేతగాక ఏమి చేయవలెనో తోచక అట్లే ఉండిపోయినది.(9-12)

ఆమె ఒక నారచీరను మెడపై వేసుకొని, ఒకటి చేతితో పట్టుకొని ఎట్లు కట్టుకొనవలెనో తెలియక సిగ్గుపడుచు, నిలబడెను. రాముడు, అది చూచి, వెంటనే సీత దగ్గరకు వెళ్ళి, ఆమె ధరించి యున్న పట్టువస్త్రము పైననే స్వయముగా నారచీరను కట్టెను. ఆ విధముగా సీతకు రాముడు నారచీర కట్టుచుండగా చూచి, అంతఃపురములో నున్న స్త్రీ లందరును ఏడ్చిరి.(13-15)

వారందరును మిక్కిలి దుఃఖించుచు, రామునితో ఇట్లనిరి- "నాయనా! ఉత్తమ మైన మనస్సు గల ఈ సీత కూడ ఈ విధముగా వనవాసమునకు వెళ్ళవలె నని ఎవ్వరును ఆజ్ఞాపించలేదు కదా. నీవు తండ్రి మాటను అనుసరించి అరణ్యమునకు వెళ్ళిపోయిన పిమ్మట, నీవు వచ్చువరకును మేము ఈమెను చూచుచు సంతోషించెదము గాక. నీవు లక్ష్మణుని సహాయునిగా తీసుకొని అరణ్యమునకు వెళ్ళుము. మంగళస్వరూపిణి యైన ఈ సీత ముని వలె అరణ్యములో నివసించుటకు తగదు. మా ప్రార్థనను అంగీకరించి, సీతను ఇచటనే ఉంచి వేయుము. ధర్మమునందు

స్థైర్యము కల నీవు, ఉండుటకు ఎట్టైనను అంగీకరించుట లేదు కదా!" అనిరి.(16-19)

వా రందరును ఇట్లు పలుకుచున్నను రాముడు తన వలె ధర్మస్వభావము గల సీతకు నారచీరను కట్టెను.(20)

దశరథుని గురు వైన వసిష్ఠుడు సీత నారచీర గ్రహించుటను చూచి, ఆమెను నివారించి, కైకేయిని, "మితి మీరి ప్రవర్తించేదానా! చెడ్డ బుద్ధి కలదానా! కులమును అపవిత్రము చేయుదానా! కైకేయీ! రాజును ఈవిధముగా వంచించితివి. ఇంకను ప్రమాణసమ్మత మైన న్యాయమార్గములో ప్రవర్తించుటలేదు.(21, 22)

సీత వనమునకు వెళ్ళవలసిన పనిలేదు. ఆమె ఇచటనే ఉండి రాముని సింహాసనమును అధిష్ఠించగలదు. గృహస్థు లందరికిని భార్య ఆత్మవంటిది. ఈ సీత రాముని ఆత్మ కావున రాజ్యమును పరిపాలించగలదు. అట్లు గాక సీత కూడ రామునితో అరణ్యమునకు వెళ్ళినచో మేము కూడ ఆమెను అనుసరించి వెళ్ళెదము. ఈ పట్టణము కూడ వెళ్ళగలదు. సరిహద్దులు పరిపాలించువా రందరును, దశరథసహిత మైన ఈ రాష్ట్రము, సకలపరివారములు, పరికరములతో కూడిన ఈ నగరము, రాముడున్న చోటికే వెళ్లిపోవును.(23-26)

భరతశత్రుఘ్నులు కూడ నారచీరలు ధరించి, అడవికి పోయి అచట నివసించుచున్న అన్నగారైన రామునితో కలసి, అక్కడనే నివసించగలరు. అటుపిమ్మట ప్రజలకు కీడు తెచ్చుచున్నదానవూ, చెడ్డ నడవడిక కలదానవూ అయిన నీవు ఒక్కతెవే ప్రజ లందరు విడచి పోవుటచే పాడుపడిన ఈ భూమిపై ఉన్న చెట్లను మాత్రమే పరిపాలించుము. రాముడు రాజుగా లేనిది రాజ్యము కాజాలదు. రాముడు నివసించు వనమే రాజ్య మగును.(27-29)

భరతుడు దశరథునికి పుట్టినవాడే అయినచో, తండ్రి తనకు మనఃపూర్వకముగా ఇవ్వని రాజ్యమును పాలింపడు. నీ విషయమున పుత్రుడు వలె ప్రవర్తించడు. నీవు భూతలమునుండి ఆకాశమునకు ఎగురగల్గినను, తండ్రి వంశములో పుట్టిన పూర్వపురుషుల సచ్చరిత్రలు తెలిసిన ఆ భరతుడు, నీవు చెప్పినట్లు చేయడు. పుత్రునియందు ప్రేమతో నీవు పుత్రునకు అపకారమే చేయుచున్నావు. ఈ లోకములో రాముని అనుసరించనివాడు ఎవ్వడును ఉండడు కదా! ఓ కైకేయీ! పశువులు, గజములు, మృగములు, పక్షులు కూడ రాముని వెంటనే వెళ్ళుచుండగా, వృక్షము లన్నియు రాముని వైపే ముఖము త్రిప్పి నిలచి యుండగా నీవు ఇపుడే చూచెదవు.(30-33)

అందుచే ఈ నారచీరలు తొలగించి సీతకు ఉత్తమ మైన ఆభరణాదులను ఇమ్ము. ఈమె కూడ నారచీరలు కట్టవలె నని విధింపబడలేదు కదా." అని నిందించి కైకేయి యిచ్చిన వస్త్రమును, సీత కట్టుకొనుచుండగా నివారించి మరల ఇట్లనెను. (34)

"ఓ కైకేయీ! నీవు రాముని కొక్కనికే కదా! వనవాసము కోరినది? అందుచే ఈమె అలంకారములను ధరించి, నిత్యము శరీరసంస్కారము చేసికొనుచు, రామునితో కూడ అరణ్యములో నివసించుగాక. సీత వెంట ప్రధాన మైన వాహనములు, పరిచారకులు, వస్త్రములు అన్ని విధములైన ఉపకరణములు కూడ వెళ్ళుగాక. నీవు వరములను కోరినప్పుడు ఈమె కూడ వెళ్ళవలెను అని కోరలేదు కదా!" అనెను. (35, 36)

సాటి లేని ప్రభావము కలవాడూ, రాజగురువూ, బ్రాహ్మణశ్రేష్ఠుడూ అయిన ఆ వసిష్ఠుడు, అట్లు చెప్పుచున్నను తనకు అతిప్రియుడైన భర్తకు తగిన శుశ్రూషాదికార్యమును చేయదలచి ఉన్న ఆ సీత తన అభిప్రాయమును మార్చుకొనక అరణ్యమునకు వెళ్ళుటకే సిద్ధమాయెను. (37)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ముప్పది ఏడవ సర్గము సమాప్తము.

ముప్పది ఎనిమిదవ సర్గము

తల్లి కౌసల్యను దయతో చూడవలెనని రాముడు తండ్రిని కోరుట.

నాథుడు గల ఆ సీత అనాథురాలు వలె నారచీరను ధరించుచుండగా చూచి, జను లెల్లరును గట్టిగా ఏడ్చుచు, "ఛీ ఛీ" యని దశరథుని నిందించిరి. ఆ జనుల ఆర్తధ్వని వినగానే దశరథుడు, దుఃఖితుడై, తన జీవితమునందు, ధర్మమునందు, కీర్తియందు కూడ శ్రద్ధ విడనాడెను. (1, 2)

అతడు వేడిగా నిట్టూర్చుచు, "ఓ కైకేయీ! సీత నారచీరను ధరించి వనమునకు వెళ్ళరాదు." అని భార్యతో పలికెను. (3)

"సీత సుకుమారురాలు. చిన్న వయస్సు కలది. ఎల్లప్పుడును సుఖములకు అలవాటుపడినది. అట్టి ఈమె వనవాసమునకు తగినది కాదు. అని నా గురువు చెప్పిన మాట నిజమే. జనకమహారాజు కూతురైన ఈ సీత ఎవరో ఒక సన్న్యాసిని వలె నారచీర గట్టి, స్పృహ తప్పి, దీనురా లై జనుల మధ్య ఈ విధముగా నిలచి

యుండుటకు ఈమె ఎవరికి ఏ అపకారము చేసినది? జనకుని కుమారి యైన ఈ సీత, నారచీరను ధరింప వలసిన పని లేదు. నేను నీకు ఈ విధముగా ప్రతిజ్ఞ చేసి ఉండలేదు. అందుచే ఈ రాజపుత్రి సమస్తమైన రత్నములను(ఉత్తమవస్తువులను) వెంట తీసుకొని వనమునకు సుఖముగా వెళ్ళుగాక.(4-6)

నీ నిర్బంధముచే క్రూరమైన ప్రతిజ్ఞ చేసినాను. నీవు మూర్ఖత్వముతో చేయుచున్న ఈ పని వెదురు కఱ్ఱను తన పుష్పమే దహించినట్లు నన్ను దహించివేయగలదు. నీచురాలా! రాముడు నీ కేమైన చెడు చేసినా దేమో కాని, సీత నీ కేమి అపకారము చేసినది? మృదువైన స్వభావము గలది. జాలి చూపదగినది. అట్టి ఈమె నీకు ఏమి అపకారము చేసినది? పాపాత్మురాలా! నీవు రాముని వనమునకు పంపివేయుచున్నావు. అది చాలక ఇంకను ఈ నీచమైన పాపములు ఎందుకు చేయుచున్నావు! అభిషేకము సందర్భమున రాముడు ఇక్కడికి వచ్చినపుడు నీవు అతనితో ఏమి చెప్పినావో అది విని నేను అంత మాత్రమే ప్రతిజ్ఞ చేసితిని. దానికి మించి సీత నారచీర కట్టుకొని యుండగా చూడవలె నని కూడ కోరుచు, నీవు నరకమునకు పోవుచున్నావు."(7-12)

ఈ విధముగా విలపించుచున్న ఆ దశరథునికి ఆ దుఃఖమునకు ఏ మాత్రము అంతము కనబడలేదు. అతడు పుత్రవ్యసనములో మునిగి అత్యధిక మైన మనోవేదనతో నేలపై పడిపోయెను.(13)

వనమునకు ప్రయాణమైన ఆ రాముడు తల వంచి కూర్చొని యున్న తండ్రితో ఇట్లనెను.(14)

"ధర్మాత్ముడ వైన ఓ మహారాజా! కీర్తిమంతురాలైన తల్లి కౌసల్య వృద్ధురాలైనది. ఈమె నీచస్వభావము కలది కాదు. ఎన్నడును నిన్ను నిందించి ఎరుగదు. పూర్వమెన్నడు ఇట్టి కష్టములు ఎరుగని ఈమె నేను దూరముగా వెళ్ళిపోవుటచే శోకసముద్రములో మునిగిపోవును. అట్టి ఈమెను ఎక్కువ ఆదరముతో చూడుము. నన్ను గూర్చి అలోచించుచు ఆమె పుత్రశోకము పొందకుండునట్లుగా పూజ్యుడవైన నీవు ఆదరించినచో దీనురా లైన ఈమె నీపై ఆధారపడి జీవించును. అధిక మైన పుత్రప్రేమ గల నా తల్లి, నేను వనమునకు వెళ్లిన పిమ్మట, శోకముచే కృశించి ప్రాణములు విడచి యమలోకమునకు వెళ్ళకుండు నట్లు చూచుకొనుము."(15-18)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ముప్పది ఎనిమిదవ సర్గము సమాప్తము.

ముప్పది తొమ్మిదవ సర్గము

దశరథుని విలాపము. రాముడు తల్లులను సెల వడుగుట.

రాముని మునివేషములో చూచి, అతడి మాటలు వినగానే దశరథుడు, అతడి భార్యలకు స్పృహ తప్పెను. దశరథుడు రాముని ముఖములోనికి చూడలేకపోయెను.(1, 2)

దశరథుడు కొంచెము సేపు సంజ్ఞ లేక పడి ఉండి, దుఃఖించుచు, రాముని గూర్చియే ఆలోచించుచు ఏడ్చెను.(3)

"పూర్వము నే నెందరినో తమ పిల్లలనుండి విడదీసి యుంటిని, లేదా ప్రాణులను చంపి యుంటిని. అందువలననే నాకు ఈ కష్టము వచ్చి పడినది అనుకొనుచున్నాను. కాలము రాకుండ ప్రాణములు దేహము విడిచివెళ్ళవు. అందుచేతనే కైకేయిచే ఈ విధముగా పీడింపబడుచున్న నేను అగ్నితో సమాను డైన కుమారుడు సన్నని వస్త్రములు విడచి మునులు ధరించు నారచీరలు ధరించి, ఎదుట నిలచి యుండగా చూచి కూడ మరణించ కున్నాను. ఈ విధముగా కుత్ర పన్ని స్వలాభముకొరకు ప్రయత్నించుచున్న ఒక్క కైకేయి మూలమున ఈ జను లందరును బాధపడుచున్నారు."(4-7)

అతడు ఈ విధముగా పలికి బాష్పము ఇంద్రియములను కప్పి వేయగా "రామా" అని ఒక్కమారు అని, ఇం కేమియు పలుక జాలకపోయెను. కొంత సేపటికి స్పృహ వచ్చిన ఆ దశరథుడు, కన్నీళ్ళు కార్చుచు, సుమంత్రునితో ఇట్లనెను.(8,9)

"నీవు ప్రయాణమునకు అనుకూలమైన రథమునకు ఉత్తమ మైన అశ్వములు కట్టి, తీసుకొనివచ్చి రాముణ్ణి దేశమునకు అవతల నున్న వనమునకు చేర్చుము. సత్పురుషుడు, వీరుడు అయిన కుమారుని, తల్లితండ్రులు ఈనాడు వనమునకు పంపివేయుచున్నారు. గుణవంతునకు మంచి గుణము లున్నందుకు ఇదియే ఫలము అని అనుకొనుచున్నాను."(10, 11)

సుమంత్రుడు రాజు మాట విని, శీఘ్రముగా నడచి వెళ్ళి అలంకరింపబడిన రథమునకు అశ్వములను కట్టి తీసుకొని వచ్చెను. అతడు రామునకు నమస్కరించి, బంగారముచే అలంకరింపబడిన రథము ఉత్తమ మైన గుఱ్ఱములు కట్టి సిద్ధముగా నున్నట్లు చెప్పెను.(12,13)

దశరథుడు, దేశకాలములు తెలిసినవాడూ, నిశ్చితమైన బుద్ధి కలవాడూ, అన్ని విధముల పరిశుద్ధుడూ(నిజాయితీ కలవాడు) అయిన కోశాగారాధికారిని వెంటనే పిలిపించి, "అరణ్యములో ఎన్ని సంవత్సరములు ఉండవలెనో ఆ లెక్క ప్రకారం సీతకు కావలసిన అమూల్యమైన వస్త్రములు. శ్రేష్ఠమైన అలంకారములు శీఘ్రముగా తీసుకొని రమ్ము" అని ఆదేశించెను.(14, 15)

అతడు రాజాజ్ఞ ప్రకారము కోశగృహమునుండి ఆ వస్తువుల నన్నింటిని తీసుకొని వచ్చి, ఆ మొత్తమును సీత కిచ్చెను. అడవికి ప్రయాణ మైన, సౌందర్యవతి యగు ఆ సీత, విచిత్రములైన ఆ అలంకారములతో, సుందర మైన తన అవయవములను అలంకరించుకొనెను. చక్కగా అలంకరించుకొనిన సీత ఆ గృహము నంతను, ఉదయించు చున్న సూర్యుని కాంతి ఆకాశమును ప్రకాశింపచేసినట్లు ప్రకాశింపచేసెను.(16-18)

అట్టి సమయములో కూడ దైన్యముతో ప్రవర్తించక ఉత్సాహవంతు రాలై ఉన్న ఆ సీతను కౌసల్య కౌగిలించుకొని, శిరస్సుపై ముద్దాడి,(19)

"ఈ లోకములో పాతివ్రత్యము లేని స్త్రీలు, వారిని భర్తలు ఎంతగా గౌరవించుచున్నను, ఆ భర్తలు దుర్దశలో ఉన్నప్పుడు వారిని అవమానింతురు. స్త్రీలు ముందు తా మెంత సుఖ మనుభవించినను, ఏ చిన్న ఆపద వచ్చినను కూడ తాము చెడిపోవుదురు. భర్తను కూడ పరిత్యజింతురు. ఇది స్త్రీల స్వభావము. చెడ్డ ఆలోచనలు గల యువతులకు సచ్ఛీల ముండదు. వికృతముగా ప్రవర్తింతురు. వారి హృదయమును ఆకర్షించుట కష్టము. ఒక్క క్షణములో భర్తపై అనురాగము కోల్పోవుదురు. సత్కులము గాని, ఉపకారము గాని, విద్య గాని, దానము గాని, అదరము గాని స్త్రీల హృదయమును ఆకర్షింపజాలదు. వాళ్ళ హృదయము అస్థిరము.(20-23)

కాని శీలమునందూ, సత్యమునందూ, శాస్త్రమునందూ, శమమునందూ, స్థిరమైన చిత్తము గల పతివ్రత లైన స్త్రీలకు మాత్రము ఒక్క భర్తయే పరమపవిత్రుడుగా విశిష్టస్థానమును పొంది యుండును. వనమునకు పంపివేయబడుచున్న నా కుమారుని నీవు అవమానింపకూడదు. ధనమున్నవా డైనను, ధనము లేనివా డైనను, ఇతనిని నీవు దేవతగా చూచుకొనవలెను అని ఆమెకు ఉపదేశించెను.(24, 25)

సీత ధర్మార్థములు రెండింటికిని అనుగుణముగా నున్న కౌసల్య మాటలు విని బాగా అర్థము చేసుకొని నమస్కరించుచు ఎదుట నిలచి ఉన్న అత్తగారితో,(26)

"పూజ్యురాలవైన, నీవు ఆజ్ఞాపించిన విధముననే అంతయు చేసెదను. భర్త విషయమున ఎట్లు ప్రవర్తించవలెనో నాకు తెలియును. నేను పూర్వము కూడ విని యున్నాను. నేను దుష్టస్త్రీల వంటి దాన నని పూజ్యురాల వైన నీవు భావింపకుము. కాంతి చంద్రుని విడువజాల నట్లు నేను ధర్మమును విడువజాలను. తీగలు లేని వీణ మ్రోగదు. చక్రము లేని రథము నడవదు. అట్లే భర్తలేని స్త్రీ నూర్గురు కుమారులున్నను, సుఖముగా ఉండజాలదు. (27-29)

తండ్రి గాని, తల్లి గాని, కుమారుడు గాని, స్త్రీకి ఇవ్వగలిగినది పరిమిత మైనదే. అపరిమితముగా ఇవ్వగలిగినవాడు భర్త ఒక్కడే. అట్టి భర్తను ఏ స్త్రీయైనా పూజించకుండునా? ఇట్టి ఆలోచనలు కలిగి, ధర్మమునకు సంబంధించిన సామాన్యవిషయములను విశేషవిషయములను విని శ్రేష్ఠురాల నై ఉన్న నేను భర్తను ఎట్లు అవమానింతును? స్త్రీలకు భర్తయే దేవత కదా?" అనెను.(30, 31)

కౌసల్య సీత పల్కిన మనోహరమైన మాటలు విని సంతోషించిన మనస్సు కలదై, వెంటనే దుఃఖాశ్రువులనూ, ఆనందాశ్రువులనూ గూడ కలిపి ఒక్కసారి విడచెను.(32)

పరమధర్మాత్ము డైన రాముడు తల్లు లందరిలో ఎక్కువ సత్కారము లందుచున్న ఆ తల్లికి ప్రదక్షిణము చేసి, నమస్కరించి, "అమ్మా! నీవు దుఃఖించకుము. తండ్రిగారిని చూచుకొనుచుండుము. వనవాసము తొందరగానే ముగియగలదు. పదునాల్గు సంవత్సరములు నీ నిద్రలో గడిచినట్లు, గడచిపోవును. నేను మిత్రసమేతుడ నై, ప్రతిజ్ఞ పూర్తి చేసికొని వచ్చెదను. నీవు చూడగలవు" అని ఆమెకు ధైర్యము చెప్పెను.(33-35)

రాము డీ విధముగా తల్లితో నిశ్చిత మగు అర్థము కల వాక్యము పలికి, ఆలోచించి, మూడు వందల ఏబదిమంది తల్లులను చూచెను. కౌసల్యవలెనే దుఃఖించుచున్న ఆ తల్లు లందరికిని నమస్కరించి ధర్మయుక్త మైన వాక్యమును– "చిరపరిచయమువలన గాని, అజ్ఞానము వలన గాని నే నేమైన తప్పు చేసినచో దానిని మన్నించండి. మీ అందరి దగ్గర సెలవు తీసుకొనుచున్నాను." అని పలికెను.(36-38)

ఆ స్త్రీలందరును ధర్మయుక్తమగు రామవచనమును శోకాక్రాంతచిత్తలై వినిరి. రాము డిట్లు పలుకగనే ఆ రాజభార్య లందరును క్రౌంచపక్షులు అరచి నట్లు ఏడ్చిరి. పూర్వము మేఘధ్వని వంటి మురజపణవాదివాద్యముల ధ్వనులతో

మారుమ్రోగుచుండెడి దశరథగృహము, వ్యసనములలో చిక్కి, ఏడ్పులతోను, పెడబొబ్బలతోను నిండి దుఃఖాకుల మైనది.(39-41)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ముప్పది తొమ్మిదవ సర్గము సమాప్తము.

నలుబదవ సర్గము

సీతారామలక్ష్మణులు రథము నెక్కి వనమునకు బయలుదేరుట.


పిదప సీతారామలక్ష్మణులు అంజలులు ఘటించి, దీనులై, రాజు పాదములు స్పృశించి, నమస్కరించి ప్రదక్షిణము చేసిరి. రాముడును, సీతయు దశరథుని అనుమతి పొందిన పిమ్మట, దుఃఖాక్రాంతులై, కౌసల్యకు నమస్కరించిరి.(1, 2)

రాముడు కౌసల్యకు నమస్కారము చేసిన పిమ్మట లక్ష్మణుడు కూడ ఆమెకు నమస్కారము చేసి, పిదప తన తల్లి యైన సుమిత్ర పాదములు స్పృశించి నమస్కరించెను. తల్లి యైన సుమిత్ర ఆ విధముగా నమస్కరించుచున్న తన కుమారుడైన లక్ష్మణుని శిరస్సుపై వాసన చూచి, ఏడ్చుచు అతని హితమును కోరుచున్నదై,(3,4)

"కుమారా! మిత్రులపై నీ కున్న ప్రేమ అపరిమితము. నిన్ను భగవంతుడు వనవాసము కోసమే సృష్టించి నట్లున్నది. ఏ మాత్రము ఏమరుపాటు లేకుండ సోదరుడైన రాముని అరణ్యవాసమునందు కాపాడుచుండుము. కష్టములో ఉన్నను, ఐశ్వర్యవంతు డై ఉన్నను, ఈ రాముడే నీకు పరమగతి. పెద్ద సోదరుని అనుసరించి ఉండుట అనునదే, లోకములో సత్పురుషులకు సంమత మైన ధర్మము. దానములు చేయుట, దీక్ష వహించి యజ్ఞములు చేయుట, యుద్ధములలో దేహములను పరిత్యజించుట అనునది మన వంశములో ప్రాచీనకాలమునుండియు వచ్చుచున్న పద్ధతి కదా!" అని బోధించి,(5-7)

"వెళ్ళుము వెళ్ళుము." అని మాటి మాటికిని పలుకుచు - "రాముడే దశరథు డని భావింపుము. సీతయే నే నని భావింపుము. అడవి అయోధ్య యని భావింపుము. నాయనా! సుఖముగా వెళ్ళుము." అని చెప్పెను.(8, 9)

వినయవంతుడూ, వినయము(మర్యాద) తెలిసినవాడూ అయిన సుమంత్రుడు నమస్కరించి మాతలి దేవేంద్రునితో పలికి నట్లు రామునితో,(10)



"రాజకుమారా! రామా! నీకు క్షేమ మగుగాక! రథమును ఎక్కుము. నీవు ఎక్కడికి వెళ్లవలె నని చెప్పెదవో అక్కడికి శీఘ్రముగా నిన్ను తీసుకొని వెళ్లెదను. నీవు పదునాలుగు సంవత్సరములు అరణ్యములో ఉండవలెను కదా. కైకేయి ఆజ్ఞాపించిన విధమున ఆ సంవత్సరములు నీవు ప్రారంభించవలెను." అని పలికెను.(11, 12)

సుందరాంగి యైన సీత, అలంకరించుకొని, సంతోషించుచున్న మనస్సుతో సూర్యుని వలె ప్రకాశించుచున్న ఆ రథమును ఎక్కెను. పిమ్మట రామలక్ష్మణులు కూడ, బంగారముచే అలంకరింపబడి, మండుచున్న అగ్నివలె ప్రకాశించుచున్న ఆ రథమును శీఘ్రముగా ఎక్కిరి. భర్తను అనుసరించి వెళ్ళుచున్న సీతకొరకై దశరథుడు ఆమె వనములో ఎంతకాలము ఉండవలెనో లెక్క చూచి, వస్త్రములను, ఆభరణములను ఇచ్చెను.(13-15)

ఆ సోదరుల ఉపయోగమునకై, అనేకమైన ఆయుధములను, కవచములను, డాలు, హస్తకవచము మొదలగువాటిని, రథములో ఉంచి, సుమంత్రుడు సీతారామలక్ష్మణులు రథ మెక్కి నట్లు చూచి, వాయువేగము వంటి వేగము గల, అశ్వములను ధైర్యముతో తోలెను. (16,17)

చిరకాలము నివసించుటకై, రాముడు అరణ్యమునకు బయలుదేరగానే ఆ నగర మంతయు శోకాక్రాంత మయ్యెను. జనులందరును తమ బలమును కోల్పోయిరి.

అపుడా పట్టణములో గజములు మదించి, కోపముతో చెలరేగినవి. గుఱ్ఱములు సకిలించుట ప్రారంభించినవి. ఈ విధముగ గొప్ప ధ్వనితో, ఆ పట్టణ మంతయు వ్యాకులమై పోయినది. బాలవృద్ధాదిసహితముగా ఆ పట్టణములోని జను లందరు మిక్కిలి దుఃఖితులై, ఎండకు బాధపడువాడు నీటివైపు పరుగెత్తు నట్లు, రాముని వెనుకనే పరుగెత్తిరి. ఆ జను లందరు రామునికి ప్రక్కను, వెనుకకు గుమిగూడి అతనికి అభిముఖులై, కన్నీళ్ళతో నిండిన ముఖములతో, గట్టిగా ధ్వని చేయుచు ఇట్లు పలికిరి.(18-21)

"సారథీ! గుఱ్ఱములు లాగి మెల్లగా వెళ్ళుము. మేము రాముని ముఖమును చూడవలెను. ఇటుపై దీనిని చూచుటకు మాకు శక్యము కాదు. దేవతాకుమారుని వంటి కుమారుడు అరణ్యమునకు వెళ్ళుచున్నను, కౌసల్య హృదయము బ్రద్దలు కాలేదు. నిజముగా అది ఇనుముతో చేసినది. సీత ధర్మనిరతురాలై, సూర్యుని కాంతి మేరుపర్వతమును విడువ కుందునట్లు, భర్తను విడువకుండా అతనిని నీడవలె అనుసరించుచు, వెళ్ళుచున్నది. ఈమె కృతార్థురాలు. లక్ష్మణా! ప్రియమును పలుకువాడూ, దేవతాతుల్యుడూ అయిన నీ సోదరునికి, సర్వదా సేవ చేయుచున్నావు. నీవు ఎంత అదృష్టవంతుడవు! నీవు రాముని అనుసరించి వెళ్ళుటయే గొప్ప సిద్ధి. ఇదియే గొప్ప అభివృద్ధి. ఇదియే స్వర్గమార్గము."(22-26)

ఈ విధముగా పలుకుచు, ఇక్ష్వాకువంశవర్ధనుడు, తమకు ప్రేమపాత్రుడు అయిన ఆ రాముని అనుసరించి వెళ్ళుచున్న ఆ జనులు, తమ కండ్లనుండి కార్చుచున్న కన్నీటిని నిలుపలేకపోయిరి.(27)

పిమ్మట, దుఃఖించుచున్న మనస్సు గల దశరథుడు, "ప్రియు డైన నా పుత్రుని చూచెదను". అని పలుకుచు, దుఃఖార్త లైన స్త్రీలతో కలసి గృహమునుండి బయటకు వచ్చెను. స్త్రీ లందరును, ఎదుట బిగ్గరగా ఏడ్చుచుండగా, ఆ ధ్వని మహాగజమును బంధించి నపుడు, ఏడ్చుచున్న ఆడ ఏనుగుల ధ్వని వలె అచట వినబడెను. దశరథుడు సహజ మైన శోభ కలవా డైనను అపుడు, గ్రహణకాలమున రాహువుచే పీడింపబడిన పూర్ణచంద్రుని వలె క్షీణించెను.(28-30)

శోభాయుక్తుడూ, ఊహింపరాని ధైర్యము కలవాడు అయిన ఆ రాముడు "శీఘ్రముగా తోలుము." అని సూతుని ఆదేశించెను. ఆ సమయమునందు 'తొందరగా తోలుము.' అని రాముడును, 'నిలుపుము.' అని పౌరులును ఈ సూతునితో చెప్పగా అతడు మార్గమునందు, ఆ రెండు పనులను చేయజాలక పోయెను.(31, 32)

రాముడు బయలుదేరిన సమయమునందు, జనుల తొక్కిడిచే రేగిన భూపరాగము, పౌరుల కన్నీళ్ళు పడి అణగిపోయెను. రాముని ప్రయాణసమయమునందు, ఆ నగరవాసు లందరు కన్నీళ్ళు కార్చుచు హాహాకారములు చేయుచు, మూర్ఛ పొంది చాల పీడితు లైరి. చేపల తాకిడికి కదలిన పద్మముల నుండి నీళ్ళు కారినట్లు, స్త్రీల నేత్రములనుండి దుఃఖమువలన కలిగిన కన్నీరు స్రవించెను. (33-35)

ఒకే విధ మైన మనస్సుతో ఆ విధముగా దుఃఖించుచున్న పౌరుల నందరిని చూచి, దశరథుడు, దుఃఖాక్రాంతుడై, మొదలు నరికిన చెట్టు వలె పడిపోయెను. అంతలో చాలా దుఃఖార్తు డై, క్షీణించిపోవుచున్న దశరథుని చూచి జనులు చేసిన హాహాకారధ్వని రాముని వెనుక నుండి వినవచ్చెను. ఆ జనులలో కొందరు 'అయ్యో! రామా' అని అరచిరి. కొందరు "అయ్యో రామమాతా'! అని అరచిరి. ఈ విధముగా అరచుచు, ఆ జనులు స్త్రీలతో నిండిన ఆ అంతఃపురము కూడ ఏడ్చునట్లు చేసిరి. (36-38)

రాముడు వెనుకకు తిరిగి చూడగా, తన వెంట వచ్చుచున్న, దుఃఖాక్రాంతుడై తిరిగిపోవుచున్న మనస్సు గల తండ్రీ తల్లీ కనబడిరి. ధర్మపాశముచే కట్టబడిన ఆ రాముడు, పాశముచే కట్టబడిన గుఱ్ఱపు పిల్ల తన తల్లిని సరిగ చూడజాల నట్లు, ఆ తల్లితండ్రులను సరిగా చూడజాలక ఓరకంటమాత్రమే చూచెను. సుఖమునకు అలవాటుపడినవారు, దుఃఖ మనుభవించుటకు తగని వారు, వాహనమునకు తగినవారు అయిన ఆ తల్లిదండ్రులు కాలినడకతో వచ్చుచుండగా చూచి, "తొందరగా నడుపుము." అని రాముడు సారథిని ప్రేరేపించెను. (39-41)

రాముడు, అంకుశముచే పీడింపబడిన ఏనుగు వలె బాధపడుచు, దుఃఖమును కల్గించు తల్లితండ్రుల అవస్థను చూడ లేకపోయెను. లేగదూడయందు ప్రేమ గల ధేనువు ఇంటికి తిరిగి వచ్చి, కట్టబడి యున్న తన లేగదూడ వైపుకు పరుగెత్తు నట్లు కౌసల్య తన కుమారుని వైపు పరుగెత్తెను. కౌసల్య ఆ విధముగా ఏడ్చుచు, రథము వైపు పరుగెత్తుచుండెను. హా రామా! హా సీతా! హా లక్ష్మణా! అని అరచుచు, రామలక్ష్మణసీతలకై కన్నీరు కార్చుచు, ఒళ్లు తెలియక ఇటు నటు ఊగి పోవుచు నాట్యము చేయుచున్నట్లుండెను. అట్టి తల్లి యైన కౌసల్య వైపు రాముడు మాటిమాటికిని చూచెను. (42-45)

"ఆగుము ఆగుము." అని రాజు అరచుచుండగా, "నడుపుము నడుపుము." అని రాముడు అనుచుండెను. అపుడు సుమంత్రుని మనస్సు రెండు చక్రముల

మధ్య పడినట్లు సంకటములో పడెను.(46)

"రథమును ఎందుకు ఆపలేదు" అని రాజు నిన్ను తరువాత నిందించినను, 'నాకు వినబడలేదు.' అని చెప్పవచ్చును. వీరి దుఃఖమును చాల సేపు చూచుచు ఉండుట సహింపరానిది." అని రాముడు అతనితో చెప్పెను. సుమంత్రుడు రాముని మాట ప్రకారము చేయుచు, కూడ వచ్చుచున్న ప్రజల అనుజ్ఞ తీసుకొని గుఱ్ఱములు పరుగెత్తుచున్నను ఇంకను శీఘ్రముగా పరుగెత్తు నట్లు వాటిని తోలెను.(47,48)

దశరథుని జను లందరు రామునకు ప్రదక్షిణము చేసి, తిరిగి వెళ్ళిరి. కాని, వారి మనస్సులు మాత్రము వెనుకకు మరలలేదు. కన్నీళ్ళు తగ్గలేదు.(49)

"ఎవరు తిరిగి రావలెనని మనము కోరుకుందుమో వారిని చాల దూరము సాగనంపకూడదు.' అని మంత్రులు దశరథమహారాజుతో చెప్పిరి. దశరథుని శరీర మంతయు చెమటపట్టెను. రూపము వాడిపోయెను. ఈ విధముగా దీనుడై ఉన్న భార్యాసహితు డగు అతడు సుగుణములతో కూడిన వారి మాట విని, ఆ కుమారుని వైపే చూచుచు, అచట నిలబడెను.(50, 51)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నలుబదవ సర్గము సమాప్తము.

నలుబది ఒకటవ సర్గము

రాముని అరణ్యగమనముచే అంతఃపురస్త్రీల విలాపము, నగరవాసులు శోకముతో వ్యాకులత చెందుట.

పురుషశ్రేష్ఠు డైన ఆ రాముడు నమస్కరించి, అరణ్యమునకు బయలుదేరగనే అంతఃపురములోని స్త్రీలు దుఃఖార్తలై ఏడ్చిరి.(1)

"రక్షకుడు లేనివారము, దుర్బలులము, దీనలము అయిన మా అందరికిని రాముడు గతి యై రక్షకుడుగా ఉండెను. అట్టి మా రక్షకు డైన రాముడు ఎక్కడికి పోవుచున్నాడో! ఎవ రైన నిందించినను కోపగించెడివాడు కాదు. కోపము కల్గించు పనులను చేసెడివాడే కాదు. కోపము వచ్చినవారి కోపము పోవునట్లు బ్రతిమాలెడివాడు. అందరితో సమముగా దుఃఖము పంచుకొనెడివాడు. అట్టి రాముడు ఎక్కడికి వెళ్ళిపోయినాడో! మహాతేజశ్శాలి యైన రాముడు, తన తల్లి యైన కౌసల్య విషయమున ఏ విధముగ ప్రవర్తించెడివాడో, మా విషయమునందు కూడ

అట్లే ప్రవర్తించెడివాడు. అట్టి మహాత్ముడు ఎక్కడికి వెళ్ళిపోవుచున్నాడో! మా అందరిని, ఈ జగత్తును కూడ రక్షించు రాముడు, కైకేయి నిర్బంధించగా దశరథునిచే వనమునకు వెళ్ళుమని ప్రేరేపింపబడి, ఎక్కడికి పోవుచున్నాడో! ఈ రాజు ప్రాణు లందరికి ఇష్టుడూ, ధర్మపరాయణుడూ, సత్యవ్రతుడూ అయిన, రాముని వనవాసమునకు పంపివేయుచున్నాడు. ఈతనికి బుద్ధిలేదు. ఎంత ఆశ్చర్యము!"(2-6)

ఈ విధముగా ఆ రాజభార్య లందరు, తమ దూడలనుండి దూర మైన ఆవులవలె, దుఃఖముచే పీడింపబడి, బిగ్గరగా ఏడ్చిరి. ముందుగనే పుత్రశోకముతో బాధపడుచున్న ఆ రాజునకు అంతఃపురములో నుండి వచ్చిన, ఆ ఏడ్పును వినగానే దుఃఖము రెట్టింపాయెను. (7, 8)

అపుడు ద్విజులు అగ్నిహోత్రములను చేయలేదు. గృహస్థుల యిండ్లలో వంటలు వండలేదు. ప్రజలు తమ పనులు చేయలేదు. సూర్యుడు కూడ కనబడకుండ పోయెను. ఏనుగులు నోటిలో నున్న కబలములను కక్కివేసెను. గోవులు దూడలకు పాలు ఇవ్వలేదు. తొలిసారిగా కుమారుడు పుట్టినను తల్లి అందులకు సంతోషించలేదు.(9, 10)

త్రిశంకువు, కుజుడు, గురుడు, బుధుడు, క్రూరగ్రహము లన్నియు, చంద్రునితో కలసి యుండెను. నక్షత్రముల కిరణములు లోపించెను. గ్రహముల తేజస్సు తగ్గిపోయెను. కోసలదేశనక్షత్రమైన విశాఖను ఆకాశమునందు ధూమము ఆవరించెను. సముద్రము, ప్రళయకాలమునందలి వాయువేగముచేత పొంగి నట్లు పొంగెను. రాముడు అరణ్యమునకు ప్రయాణము కాగానే, ఆ నగర మంతయు చలించెను. దిక్కు లన్నియు వ్యాకులములై, చీకటి కమ్మిన ట్లుండెను. గ్రహములు కాని, నక్షత్రములు కాని, మరేమియు కాని ప్రకాశించలేదు.(11-14)

నగరములోని పౌరు లందరిని అకస్మాత్తుగా దైన్యము ఆవహించెను. ఆహారము నందు గాని, విహారమునందు గాని ఏ ఒక్కని మనస్సు కూడ ప్రవర్తించలేదు. అయోధ్యలోని జనులందరు, శోకపరంపరచే పీడితులై నిరంతరము దీర్ఘముగ నిట్టూర్పుచు, దశరథమహారాజును గూర్చి దుఃఖించిరి. రాజమార్గములో నున్న జనుల ముఖములు కన్నీళ్లతో కలుషములై ఉండెను. సంతోషముతో నున్నవాడు ఒక్కడును కనబడలేదు. ప్రతి ఒక్కడును దుఃఖముతో నిండి ఉండెను.(15-17)

ఆ సమయమున వాయువు చల్లగా వీచలేదు. చంద్రుని చూచుటకు సౌమ్యముగా లేకుండెను. సూర్యుడు ఎండ కాయలేదు. జగత్తంతయు వ్యాకులముగా నుండెను.

పుత్రులకు తల్లుల విషయమునను, భర్తలకు భార్యల విషయమునను ఆసక్తి తగ్గినది. సోదరులు పరస్పరము ఆసక్తి లేనివారైరి. అందరును అన్నింటిని విడచి పెట్టి రాముని గూర్చియే ఆలోచించుచుండిరి. అపుడు రాముని స్నేహితు లందరును దుఃఖభారముతో నిండి, ఏమి చేయుటకును తోచక, తమ పడకలను విడువకుండిరి. రాముడు లేని అయోధ్య దేవేంద్రుడు లేని పర్వతాదిసహిత మగు భూమి వలె, భయశోకములవలన కలిగిన పీడతో, భయంకరముగా చలించెను. అక్కడ నున్న గజములు, యోధులు, అశ్వములు కూడ మిక్కిలి ధ్వని చేసెను (ఏడ్చెను). (18-21)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నలుబది ఒకటవ సర్గము సమాప్తము.

నలుబది రెండవ సర్గము

దశరథమహారాజు కౌసల్యాభవనమునకు పోవుట. అచటను రామునికై దుఃఖ మనుభవించుట.

రాముడు ప్రయాణమై వెళ్ళుచున్నప్పుడు, రథగమనముచే రేగిన పరాగము కనబడుచున్నంతవరకును, దశరథుడు అటువైపే చూచుచుండెను. అత్యంతధార్మికుడైన ఆ ప్రియపుత్రుని ఎంతవరకు ఆ రాజు చూచుచుండెనో అంతవరకు అతనికి పుత్రదర్శనసుఖము కలిగించుటకై భూమిపై పరాగము పెరిగినట్లుండెను. "రాముడు వెళ్ళుచుండగా అతని రూపము కనబడునంతవరకును దశరథుడు తన నేత్రములను వెనుకకు మరల్చలేదు." అని దీని భావము. రాముని రథమువలన ఎగిరిన ధూళి కూడ ఎప్పుడు కనబడలేదో అప్పు డా దశరథుడు దుఃఖితుడై, దిగులు చెంది నేలపై పడిపోయెను. (1-3)

దశరథుడు నేలపై పడగానే అతనిని లేవదీయుటకై, కౌసల్య కుడిచేతి వైపునకును, భరతునియందు ప్రేమ గల కైకేయి ఎడమవైపునకు వచ్చిరి. (4)

నీతిమంతుడూ, ధర్మపాలకుడూ, వినయసంపన్నుడూ, అయిన ఆ దశరథుడు ఆ కైకేయిని చూచి, మిక్కిలి బాధపడుచూ, (5)

"కైకేయీ! దుష్టమైన ప్రవృత్తి గల నీవు నా శరీరమును తాకవద్దు. నిన్ను చూచుట నా కిష్టము లేదు. నీవు నా భార్యవు కావు; బంధువు కూడ కావు. నీమీద ఆధారపడి జీవించు నీ అనుచరులకు నేనేమియు కాను. నాకు వారేమియు కాదు.

ధర్మమును పరిత్యజించి కేవలము అర్థమునందు మాత్రమే అసక్తి గల నిన్ను నేను పరిత్యజించుచున్నాను. నీ చేయి పట్టి, అగ్ని చుట్టూ ప్రదక్షిణము చేయించి, నిన్ను వివాహమాడుటవలన కలిగిన సంబంధమును ఇహలోకమునందును, పరలోకమునందును కూడ పరిత్యజించుచున్నాను. (6-8)

అక్షయ మైన ఈ రాజ్యము లభించినందుకు భరతుడు సంతోషించి నట్లైతే అతడు పితృకార్యమునందు నన్ను ఉద్దేశించి ఇచ్చిన జలతర్పణాదికము నాకు ముట్టకుండుగాక." అని ఆమెను దూషించెను. (9)

పరాగము శరీర మంతయు వ్యాపించియున్న రాజును నేలపై నుండి లేవదీసి శోకముచే కృశించిన ఆ కౌసల్యాదేవి తన గృహమునకు మరలి వెళ్ళెను. (10)

ధర్మాత్ముడైన దశరథుడు, మునివేషము ధరించి అరణ్యమునకు వెళ్ళిన కుమారుని తలచుకొని, కావలె నని బ్రహ్మహత్య చేసినవాడు వలెను, చేతితో నిప్పు ముట్టుకున్న వాని వలెను పరితపించెను. రథమార్గమును వెనుకకు తిరిగి తిరిగి చూచుచు, దుఃఖించుచున్న ఆ దశరథుని రూపము, రాహుగ్రస్తు డైన సూర్యుని రూపము వలె ప్రకాశవిహీనమైనది. అతడు ప్రియుడైన ఆ కుమారునే స్మరించుచు దుఃఖార్తు డై విలపించెను. ఇంతలో పుత్రుడు పట్టణము దాటె నని విని ఈ విధముగా పలికెను. (11-13)

"నా కుమారుని తీసుకొని వెళ్ళిన శ్రేష్ఠము లైన గుఱ్ఱముల అడుగు జాడలు నేలపై కనబడుచున్నవి కాని, మహాత్ము డైన ఆ రాముడు మాత్రము కనబడుటలేదు. నా కుమారులలో శ్రేష్ఠుడైన ఏ రాముడు శరీరమునకు చందనము పూసుకొని, ఉత్తమమైన స్త్రీలు వింజామరలతో వీచుచుండగా, మెత్తని తలగడాలపై శయనించుచుండెడివాడో, ఆ రాముడే ఇపుడు, ఏదో ఒక చెట్టునీడను ఆశ్రయించి, కఱ్ఱను గాని, రాయిని గాని, తలగడాగా ఉంచుకొని, శయనించును. దీను డైన ఆ రాముడు పరాగముచే కప్పబడినవాడై నిట్టూర్చుచు, ఏనుగు ప్రస్రవణపర్వతమునుండి లేచి నట్లు, నేలపై నుండి లేవగలడు. (14-17)

లోకములకు నాథుడైన శ్రీరాముడు ఆ విధముగా నేలపై నుండి లేచి, అనాథుడు వలె వెళ్ళుచుండగా, అజానుబాహువైన, అతనిని అడవులలో నివసించు జనులు చూడగలరు. (18)

ఎల్లపుడు సుఖములకు అలవాటు పడినదీ, జనకునకు ఇష్టమైన కుమార్తెయూ, అయిన సీత, ఇపుడు ముండ్లపై నడచుటచే బాధపడుచు అరణ్యములోనికి వెళ్ళగలదు.

పూర్వ మెన్నడును అడవులను చూడని ఆ సీత, గగుర్పాటు కల్గించు గంభీర మైన, క్రూరమృగముల ధ్వనిని విని భయపడును.(19, 20)

కైకేయీ! నీ కోరిక తీరినది. విధవ వై రాజ్యమును పాలించుము. పురుషశ్రేష్ఠు డైన ఆ రాముడు లేకుండగ నేను జీవింపజాలను."(21)

ఈ విధముగా విలపించుచు, రాజు, జనసముదాయముతో కూడి, బంధుమరణము విని స్నానము చేసినవాడు అమంగళమైన గృహమును ప్రవేశించినట్లు పురములలో శ్రేష్ఠమైన అయోధ్యలోనికి ప్రవేశించెను. అయోధ్యలోని చతుష్పథములు, గృహమధ్యములు, జనశూన్యములై ఉండెను. అంగళ్ళు, దేవాలయములు మూసివేయబడెను. జనులందరు దుఃఖార్తులై అలసి, దుర్బలులై ఉండిరి. రాజమార్గములు సరిగా శుభ్రము చేయబడలేదు. అట్టి ఆ నగరము నంతను చూచి, దశరథుడు, రామునే స్మరించుచు, విలపించుచు, సూర్యుడు మేఘములోనికి ప్రవేశించినట్లు ఇంటిలోనికి ప్రవేశించెను.(22, 23)

సీతారామలక్ష్మణులు లేని ఆ గృహము, గరుత్మంతునిచే అపహరింపబడిన సర్పము గలదీ, ప్రవేశింప శక్యము కానిదీ యైన గొప్ప మడుగు వలె ఉండెను.(24)

దశరథుడు డగ్గుత్తికతో కూడిన ధ్వనితో విలపించుచు, దీనముగా, "నన్ను శీఘ్రముగా, రామమాతయైన కౌసల్య ఇంటికి తీసుకొని వెళ్ళుడు. నా హృదయమునకు మరి ఎక్కడను ఊరట కలుగదు." అనెను.(25, 26)

రాజు మాటలు విని, ద్వారపాలకులు అతనిని కౌసల్యయింటికి తీసుకొని వెళ్ళి వినయపూర్వకముగా అచట పరుండబెట్టిరి. కౌసల్య గృహమును ప్రవేశించిన దశరథుడు శయనముపై పరుండి యున్నను, అతని మనస్సు దుఃఖాక్రాంత మై ఉండెను.(27, 28)

ఇరువురు కుమారులు, కోడ లైన సీత లేని ఆ గృహము, రాజునకు చంద్రుడు లేని ఆకాశము వలె కనబడెను. పరాక్రమవంతుడైన ఆ మహారాజు, ఆ గృహమును చూచి, చేతులు ఎత్తి "అయ్యో రామా! నన్ను విడచివేయుచున్నావు కదా!" అని బిగ్గరగా ఏడ్చెను.(29,30)

"పదునాలుగు సంవత్సరముల కాలము పూర్తియగువరకును జీవించు నరశ్రేష్ఠులు రాముడు తిరిగి వచ్చునపుడు అతనిని చూచి కౌగిలించుకొని సుఖముగా ఉండగలరు. అయ్యో! అట్టి భాగ్యము నాకుండదు కదా!" అని విలపించెను.(31)

ఇంతలో దశరథునకు కాళరాత్రి వంటి రాత్రి వచ్చినది. అపుడు దశరథుడు

అర్ధరాత్రి కౌసల్యతో, "కౌసల్యా! నా దృష్టి రాముని వెంబడించి వెళ్ళిపోయినది. అది ఇంకను తిరిగివచ్చుట లేదు. నువ్వు నాకు సరిగా కనబడుటలేదు. నీ హస్తముతో నన్ను స్పృశించుము." అనెను.(32, 33)

శయనముపై పరుండి రాముని గూర్చియే ఆలోచించుచున్న ఆ రాజును చూచి, కౌసల్య చాల దుఃఖించుచు సమీపమున కూర్చుండి, నిట్టూర్పుచు, విలపించెను.(34)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నలుబది రెండవ సర్గము సమాప్తము.

నలుబది మూడవ సర్గము

కౌసల్యావిలాపము.

పిదప, పుత్రశోకముతో బాధపడుచున్న ఆ కౌసల్య, శయనముపై పరుండి, శోకముచే కృశించిన ఆ దశరథుని చూచి, అతనితో యిట్లనెను.(1)

"సర్పము వలె వక్రముగా నడచు స్వభావము గల కైకేయి, నరశ్రేష్ఠుడైన రాముని విషయమున విషము నాటినది. ఇపుడు ఇంక కూసము విడచిన సర్పము వలె సంచరించును. రాముని అరణ్యమునకు వెడలగొట్టి, కోర్కె తీరిన ఆ కైకేయి, ఇంటిలో నున్న దుష్టసర్పము వలె, ఇటు పైన నన్ను ప్రయత్నపూర్వకముగా భయపెట్టగలదు.(2, 3)

నా కుమారుని దాసుడుగా చేసి ఆమెకు ఇచ్చినను బాగుండెడిది. అపుడు రాముడు చెప్పిన పని చేయుచు, నగరములో భిక్షాటనము చేయుచు, ఇంటిలోనే ఉండెడివాడు.(4)

నీవు కైకేయి ద్వారా రాముని, అతని స్థానమునుండి, నీ ఇష్టము వచ్చినట్లు, కిందకు పడద్రోసి, ఆహితాగ్ని పర్వసమయమున దేవతల కివ్వవలసిన భాగమును, రాక్షసుల కిచ్చి నట్లు, రాముని రాజ్యమును భరతున కిచ్చితివి.(5)

గజరాజువంటి నడక కలవాడు, వీరుడు, ఆజానుబాహువు, ధనుర్ధరుడు అయిన రాముడు, సీతాలక్ష్మణసహితుడై, అడవిలో ప్రవేశించి యుండును. సీతారామలక్ష్మణులు ఎన్నడును కష్టములు అనుభవించినవారు కాదు. అట్టివారిని

నీవు కైకేయి ఇష్టము ప్రకారము, అరణ్యమునకు పంపివేసితివి. అరణ్యములో వారి అవస్థ ఎట్లుండునో కదా! ఉత్తమ పదార్థములు ఏమియు లేని వారిని భోగములు అనుభవింపవలసిన కాలములో వెడలగొట్టితివి. యువకులైన వారు, దీనులై ఫలములను, మూలములను తినుచు ఎట్లుందురో కదా!(6-8)

రాముడు భార్యతోను, తమ్మునితోను కలసి ఇక్కడకు వచ్చి నా శోకమును తొలగించు మంగళప్రదమైన కాలము నే నెన్నడైన చూచెదనా? వీరులైన ఆ రామలక్ష్మణులు, తిరిగి వచ్చినట్లు వినగానే కీర్తి గల ఈ అయోధ్యలోని జనులందరు మిక్కిలి సంతోషించి చక్కని ధ్వజపంక్తులను ఎపుడు ఎగురవేసెదరో! రామలక్ష్మణులు తిరిగి రాగా చూచి, ఈ పట్టణ మంతయు, పూర్ణిమనాడు సముద్రము వలె ఉప్పొంగుచు, ఎపుడు ఆనందించునో!(9-11)

ఆజానుబాహుడూ, వీరుడూ, అయిన రాముడు వృషభము ఆవును ఎదుట ఉంచుకొని వచ్చు నట్లు సీతను రథముపై ఎదుట కూర్చుండ బెట్టుకొని ఎప్పుడు అయోధ్యానగరములో ప్రవేశించునో కదా! శత్రుభయంకరు లైన నా కుమారులు, రామలక్ష్మణులు, నగరములో ప్రవేశించుచుండగా, వేలకొలది జనులు రాజమార్గమునందు, వారిపై పేలాలు ఎప్పుడు చల్లెదరో కదా! అందమైన కుండలములు ధరించి, భయంకరము లైన ఆయుధములతోను, ఖడ్గములతోను, శిఖరములతో గూడిన పర్వతముల వలె ప్రకాశించుచున్న రామలక్ష్మణులు అయోధ్యలో ప్రవేశించుచుండగా, ఎప్పుడు చూచెదనో కదా! ఆ సీతారామలక్ష్మణులు కన్యలకును, ద్విజులకును పుష్పఫలములను పంచి పెట్టుచూ, ఆనందముతో పట్టణమునకు ఎప్పుడు ప్రదక్షిణము చేయుదురో కదా! దేవతలవంటి కాంతి కలవాడూ, ధర్మములు తెలిసినవాడూ అయిన రాముడు, పదునాలుగు సంవత్సరములలో బుద్ధిచేతను, వయస్సుచేతను గూడ మంచి పరిణతి చెందును. అయినను, ఆ రాముడు మూడు సంవత్సరముల పిల్ల వాడు వలె క్రీడించుచు నా దగ్గరకి ఎప్పుడు వచ్చునో!(12-16)

ఓ వీరుడా! క్రూరురాలనైన నేను పూర్వజన్మలో, దూడలు పాలు త్రాగ వలె నని అనుకొనుచుండగా, వాటి తల్లుల స్తనములను ఛేదించితిని; సందేహము లేదు. చిన్నదూడపై గోవుకు ఎంత ప్రేమ ఉండునో నాకు నా పుత్రుడన్న అంత ప్రేమ. అట్టి నన్ను కైకేయి, సింహము గోవును తన దూడనుండి దూరము చేసినట్లు, బలాత్కారముగా నా పుత్రుని నుండి దూరము చేసినది. సద్గుణములు కలవాడూ, సర్వశాస్త్రములతో పండితుడూ అయిన నా ఒకే ఒక పుత్రుని విడచి నేను

జీవించజాలను. ఆజానుబాహుడు, మహాబలశాలి అయిన నా ప్రియపుత్రుని చూడకుండ జీవించుటకు నా కేమాత్రము సామర్థ్యము లేదు.(17-20)

పుత్రశోకమువలన కలిగిన ఈ అగ్ని పైకి లేచి, గ్రీష్మకాలమునందు తీవ్రమైన కాంతి గల భగవంతు డైన సూర్యుడు తన కిరణములచే ఈ భూమిని కాల్చివేసినట్లు నన్ను కాల్చివేయుచున్నది."(21)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నలుబది మూడవ సర్గము సమాప్తము.

నలుబది నాలుగవ సర్గము

సుమిత్ర కౌసల్యను ఓదార్చుట.

ఆ విధముగా విలపించుచున్న ఉత్తమస్త్రీ యైన కౌసల్యను చూచి, ధర్మమునందు స్థిరమైన బుద్ధి గల సుమిత్ర, ధర్మసమ్మతమైన మాట పలికెను.(1)

"పూజ్యురాలా! నీ పుత్రుడైన రాముడు సకలసద్గుణసంపన్నుడు. పురుషులలో శ్రేష్ఠుడు. నీ వీ విధముగ ఏల విలపించెదవు? దీనముగా ఎందు కేడ్చెదవు? రాముడు మహాబలశాలి. శ్రేష్ఠుడు. మహాత్ముడైన తండ్రి మాటను సత్యము చేయుటకై రాజ్యమును విడిచి శిష్టులందరును ఎల్లప్పుడును చక్కగా ఆచరించినదీ, మరణానంతరము గూడ మంచి ఫలము నిచ్చునదీ అయిన ధర్మమార్గమున స్థిరముగా నిలచి ఉన్నాడు. అట్టి రాముని గూర్చి ఎన్నడును విచారించ పని లేదు.(2-4)

దోషరహితుడూ, సకలప్రాణులందును దయగలవాడూ అయిన లక్ష్మణుడు ఈ రాముని విషయమున ఉత్తమమైన ప్రవృత్తిని(భక్తిని) చూపుచున్నాడు. దానిచే అతడు(రాముడు) లాభము పొందగలడు. సుఖములకు అలవాటుపడిన సీత కూడ అరణ్యవాసములో ఉందు కష్టము లన్నియు తెలిసియే ధర్మాత్ముడైన నీ కుమారుని అనుసరించి వెళ్ళినది.(5, 6)

ధర్మమూ, సత్యవ్రతము అనునవియే ధన మని తలచిన, సర్వసమర్థుడైన నీ కుమారుడు, తన కీర్తిపతాకను ఈ లోకముమీద ఎగురవేయుచున్నాడు. అతనికి లభించని సత్ఫలిత మేమి ఉన్నది?(7)

రాముని పరిశుద్ధ మైన శీలమూ, ఉత్తమ మైన మాహాత్మ్యమూ తెలిసిన

సూర్యుడు తన కిరణములచే రాముని శరీరమును తపింపచేయడు. తథ్యము. అడవులనుండి వచ్చుచు, సమశీతోష్ణముగా, సుఖకరముగా ఉన్న గాలి, మంగళకరమగుచు, రాముని సర్వకాలములందును సేవించగలదు. రాత్రి నిద్రించుచున్న ఆ రాముని, చంద్రుడు తన కిరణములచేత స్పృశించుచు, తండ్రి వలె కౌగిలించుకొని ఆనందింపచేయగలడు.(8-10)

పూర్వము రాముడు యుద్ధమునందు, దానవేంద్రు డైన శంబరాసురపుత్రుని సంహరింపగా సంతోషించిన బ్రహ్మదేవుడు గొప్ప తేజస్సు గల ఆతనికి దివ్యాస్త్రముల నిచ్చెను. శూరుడూ, పురుషులలో శ్రేష్ఠుడూ అయిన అట్టి రాముడు, అరణ్యములో నున్నను, తన బాహుబలము సాహాయ్యముచే నిర్భయుడై, ఇంటిలో నివసించునట్లు నివసించగలడు. ఏ రాముని బాణములకు గురియైన శత్రువులు తప్పక నశింతురో, ఆ రామునికి ఈ భూమి యంతయు వశము కాక ఎట్లుండును?(11-13)

రామునియందు లక్ష్మి, శౌర్యము, మంగళప్రద మైన బలము ఉన్నవి. వీటితో కూడిన రాముడు, అరణ్యవాసమును పూర్తి చేసుకొని శీఘ్రముగా తన రాజ్యమును పొందగలడు. రాముడు సూర్యునకు కూడ సూర్యుడు గాను, అగ్నికి అగ్నిగాను, ప్రభువునకు ప్రభువుగాను, సంపదకు సంపదగాను, కీర్తికి శ్రేష్ఠమైన కీర్తి గాను, ఓర్పుకు ఓర్పు గాను, దేవతలకు దేవతగాను, భూతములకు భూతశ్రేష్ఠుడు గాను కాగల సామర్థ్యము కలవాడు. అట్టి రామునకు అరణ్యములో నున్నను పురములో నున్నను ఏ లోపము లుండును?(14-16)

పురుషశ్రేష్ఠు డైన రామునకు భూమి, సీత, లక్ష్మి అను ఈ ముగ్గురితో కలసి, రాజ్యాభిషేకము జరుగగలదు. వనమునకు ప్రయాణ మై వెళ్ళుచున్న ఏ రాముని చూచి, అయోధ్య లోని జను లందరు, శోకవేగముచే పీడితులై, కన్నీరు విడిచిరో, నారచీరలు ధరించి వెళ్ళుచున్న, పరాజయ మనునది ఎరుగని ఏ రాముని అనుసరించి, రాజ్యలక్ష్మి కూడ సీత వలె వెళ్ళినదో, అట్టి రాముడు పొందజాలనిది ఈ లోకములో ఏమి ఉన్నది? ధనుర్ధరులలో శ్రేష్ఠు డైన లక్ష్మణుడు స్వయముగా బాణములు, ఖడ్గములు, ఇతరాయుధములు ధరించి, రాముని ముందు వెళ్ళుచుండగా, ఆ రామునకు దుర్లభ మైనది యేది ఉండును?(17-20)

రాముడు వనవాసము పూర్తి చేసుకొని మరల వచ్చినపుడు నీవు తప్పక అతనిని చూడగలవు. అందుచే శోకమును, మోహమును విడువుము. నేను సత్యమును చెప్పుచున్నాను. నీ పుత్రుడు వచ్చి నీ పాదములకు నమస్కరించుచుండగా, అతనిని,

ఉదయించిన సూర్యుని వలె మరల చూడగలవు. రాముడు మరల వచ్చి రాజ్యాభిషిక్తు డై, గొప్ప తేజస్సుతో ప్రకాశించుచుండగా, అతనిని చూచి, అచిరకాలములో, ఆనందాశ్రువులను విడువ గలవు.(21-23)

రామునికి ఎట్టి అమంగళమూ కలగదు. అందుచే నీవు శోకమును దుఃఖమును విడువుము. సీతాలక్ష్మణులతో కూడిన నీ కుమారుని, అచిరకాలములో చూడగలవు. మిగిలినవా రందరిని నీవు ఓదార్చవలసి యుండగా, నీవే ఇట్లు మనస్సును దుఃఖవికలముగా చేసుకొను చున్నా వేమి?(24, 25)

రాముని వంటి కుమారుని కనిన నీవు ఈ విధముగా దుఃఖించకూడదు. ఈ లోకములో, రాముని వలె సన్మార్గములో నున్నవాడు ఎవ్వడును లేడు. స్నేహితులతో కూడ వచ్చి, నీ కుమారుడు నమస్కరించుచుండగా, అతనిని చూచి నీవు అచిరకాలములో, వర్షకాలమునందు మేఘపంక్తి వలె ఆనందాశ్రువులను విడువగలవు. వరములను ఈయ సమర్థుడైన నీ కుమారుడు, శీఘ్రముగా అయోధ్యకు తిరిగి వచ్చి, మెత్తనైన, బలిసి ఉన్న చేతులతో, నీ పాదములను స్పృశింపగలడు. మిత్రసహితుడైన, శూరు డైన నీ కుమారుడు, అభివాదము చేసి, నమస్కరించుచుండగా, మేఘపంక్తి పర్వతమును తడిపినట్లు అతనిని మరల ఆనందాశ్రువులతో తడుపగలవు".(26-29)

మాటలు చెప్పి ఉపచారము చేయుటయందు నేర్పు కలదీ, ఎట్టి దోషములు లేనిదీ, అయిన సుమిత్ర, ఈ విధముగా అనేకవాక్యములచే, రామమాత యైన కౌసల్యను ఓదార్చి, ఊరకుండెను.(30)

సుమిత్ర మాటలు వినిన పిమ్మట, రాముని తల్లి యైన కౌసల్య శోకము, శరత్కాలమునందు అల్పమైన ఉదకము గల మేఘము వలె వెంటనే ఆమె శరీరమునందే లీనమై పోయెను.(31)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నలుబది నాలుగవ సర్గము సమాప్తము.

నలుబది ఐదవ సర్గము

అయోధ్యకు మరలిపొందని రాముడు పౌరులకు చెప్పుట.

రాముడు వనవాసమునకై వెళ్ళుచుండగా అతనిపై ప్రేమ గల పౌరులందరును అతనిని అనుసరించి వెళ్ళిరి. రాముని మిత్రవర్గము, దశరథమహారాజు, బలాత్కారముగా వెనుకకు పంపబడినను, రాముని రథమును అనుసరించి వెళ్ళుచున్న ఆ పౌరులు మాత్రము తిరిగి వెళ్ళలేదు.(1, 2)

రాముడు, పూర్ణ చంద్రుదు వలె అయోధ్యలో నివసించు పౌరులందరికి చాల ఇష్టుడుగా ఉండెను. తన ప్రజలందరును, ఎంత ప్రార్థించినను వినక, ఆ రాముడు తండ్రిని సత్యవంతుని చేయుటకే, వనమునకు వెళ్ళెను. అతడు ఆ ప్రజలను తన సంతానమును వలె, కంటితో త్రాగి వేయుచున్నట్లు ప్రేమపూర్వకముగా చూచుచు స్నేహముతో నిట్లనెను.(3-5)

"అయోధ్యానివాసు లైన మీరందరును, నాపై మీకు గల ప్రేమ గౌరవములను, భరతునిపై చూపుడు. అట్లు చేసినచో నాకు అధికముగా సంతోషము కలుగును. భరతుడు, మంగళకర మైన చరిత్ర కలవాడు. మీకు ఇష్టములు, క్షేమకరములు అయిన పనులను చక్కగా చేయగలడు. అతడు వయస్సుచే చిన్నవాడైనను, జ్ఞానముచేత వృద్ధుడు. మృదు వైన స్వభావము కలవాడు. పరాక్రమముతోను, సద్గుణములతోను ఒప్పుచున్నవాడు. అతడు మీకు తగిన ప్రభువై మీ సమస్తభయములను తొలగించును. రాజగుణములతో కూడిన భరతుడు యువరాజుగా నియుక్తుడైనాడు. నేను, ఇతరులు, మీరు కూడ ప్రభు వైన దశరథుని ఆజ్ఞను అనుసరించవలెను. మీరు నాకు సంతోషము కల్గింపవలె నని కోరినచో, నేను వనవాసమునకు వెళ్ళిన పిమ్మట మహారాజు దుఃఖింపకుండు నట్లు చూసుకొనుడు." (6-10)

రాముడు ధర్మముపై స్థైర్యము చూపించినకొలది, ప్రజలు కూడ అతడే మాకు రాజు కావలెను అని కోరిరి. లక్ష్మణసమేతు డగు రాముడు కన్నీరు కప్పి, దీనముగా ఏడ్చుచున్న ఆ పౌరులను తన గుణములనే త్రాడుతో కట్టినట్లు కట్టి ఆకర్షించెను. (11,12)

జ్ఞానముచేత, వయస్సుచేత, తేజస్సుచేత మూడువిధముల వృద్ధులైన బ్రాహ్మణులు, వార్ధకముచేత శిరస్సులు వణుకుచుండగా, దూరము నుండియే ఇట్లు

పలికిరి. (13)

"ఉత్తమజాతులలో పుట్టి, మంచి వేగము గలిగి, రాముని తీసుకొని పోవుచున్న ఓ గుర్రములారా! ముందుకు వెళ్ళవద్దు. వెనుకకు మరలి రండి. మీ ప్రభువైన రామునకు హితమును చేయండి. జంతువు లన్నింటికి చెవులుండును. అందును గుఱ్ఱముల చెవులకు అధికమైన గ్రహణశక్తి ఉండును. అందుచే మీరు మా ప్రార్థనను విని వెనుకకు మరలండి. ధర్మముచే పరిశుద్ధమైన చిత్తము కలవాడూ, వీరుడూ, శుభమైన వ్రతములందు స్థిరముగా ఉండువాడూ అయిన మీ ప్రభువును మీరు పురములోనికి తీసుకొని రావలెను గాని పురమునుండి వనమునకు తీసుకొని వెళ్ళగూడదు."(14-16)

ఈ విధముగా దుఃఖముతో కూడిన మాటలు పలుకుచున్న, వృద్ధులైన, ఆ ద్విజులను చూచి, రాముడు వెంటనే రథమునుండి దిగెను. పిమ్మట సీతాలక్ష్మణసహితు డైన రాముడు వనమునకు అభిముఖుడై, అడుగులు దగ్గరదగ్గరగా వేయుచు(మెల్లగా) నడచియే వెళ్ళెను. సచ్చరిత్రమునందు ప్రేమ కలవాడు, దయతో కూడిన నేత్రములు కలవాడు అయిన రాముడు, ఆ బ్రాహ్మణులు పాదచారులై వచ్చుచుండగ వారిని విడిచి తాను రథముపై వెళ్ళజాలకపోయెను. (17-19)

రాము డింకను, వనమువైపు వెళ్ళిపోవుచుండగా చూచి, ఆ బ్రాహ్మణులు కలత చెందిన మనస్సుతో మిక్కిలి దుఃఖించుచు, ఇట్లు పలికిరి. (20)

"ఈ బ్రాహ్మణసమూహ మంతయు, బ్రాహ్మణులకు హితుడ వైన నీ వెనుకనే వచ్చుచున్నది. ఈ అగ్నులు కూడ, బ్రాహ్మణుల మూపుపై ఎక్కి నీ వెనుకనే వచ్చుచున్నవి. వాజపేయయాగము చేయుటచే మాకు లభించిన, శరదృతువునందలి మేఘముల వలె, తెల్లగా ఉన్న ఈ ఛత్రములు, మా వెనుకనే వచ్చుచున్నవి; చూడుము. ఛత్రము లేక ఎండచే తపింపబడుచున్న నీకు మేము, మాకు వాజపేయయాగమువలన లభించిన ఈ శ్వేతఛత్రముచే నీడను కల్గించెదము. (21-23)

నాయనా! మా బుద్ధి ఎల్లప్పుడును వేదమంత్రముల పైననే ఉండును. అట్టి మా బుద్ధి నీకొరకై వనవాసమును కోరుచున్నది. మా ఉత్తమ మైన వేదములు మా హృదయములందే ఉండును. మా భార్యలు పాతివ్రత్యముచే రక్షింపబడుచు, ఇండ్లలో ఉండగలరు. (24,25)

నీవు అయోధ్యకు తిరిగి రావలె నని మేము నిర్ణయించితిమి. దీనికి మరొక నిర్ణయము చేయకుము. నీవు ధర్మవిముఖుడ వైనచో, మరి ఎవరు ధర్మ మాచరింతురు?

నేలపై బడుటచే దుమ్ము తగిలిన, హంసలవలె తెల్లనైన కేశములు గల శిరస్సులతో మేము ప్రార్థించుచున్నాము. వెనుకకు మరలుము. ఇక్కడికి వచ్చిన బ్రాహ్మణులలో, చాలామంది యజ్ఞములు ప్రారంభించి యున్నారు. ఓ వత్సా! ఆ యజ్ఞముల సమాప్తి, నీవు తిరిగి వచ్చుటయందు, ఆధారపడియున్నది. స్థావరజంగమాత్మకము లైన, భూతము లన్నియు, నీపై భక్తితో, నిన్ను ప్రార్థించుచున్నవి. నీవు వాటిపై స్నేహము చూపుము.(26-29)

వాయువేగముచేత లేచిన ఈ వృక్షములు, నిన్ను అనుసరించవలె నని కోరుచున్నను, వాటి వేగమును వ్రేళ్ళు అడ్డుకొనుటచే నిన్ను అనుసరింప జాలక, ఏడ్చుచున్న ట్లున్నవి. పక్షులుకూడ, చేష్టలు, ఆహారము, సంచారము మాని, వృక్షములపై ఒక ప్రక్క కూర్చుండి, సర్వభూతములందు జాలి గల నిన్ను, వెనుకకు రమ్మని ప్రార్థించుచున్నవి."(30, 31)

రాముని వెనుకకు మరల్చుటకై ఆ బ్రాహ్మణు లిట్లు అరచు చుండగా, ఇంతలో, తాను కూడ రాముని మరల్చుచున్నదా అన్నట్లు తమసానది వచ్చెను. పిమ్మట, సుమంత్రుడు కూడ అలసిపోయిన గుఱ్ఱములను రథము నుండి విప్పి, శీఘ్రముగా నేలపై పొరలించి, నీరు త్రాగించి, వాటి శరీరములు కడిగి, తమసానదీసమీపమున వాటిని మేపెను.(32, 33)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నలుబది ఐదవ సర్గము సమాప్తము.

నలుబది ఆరవ సర్గము

రాముడు సీతాలక్ష్మణసమేతుడై తమసాతీరమున నివసించుట. పురవాసులు నిద్రించుచుండగా వారిని విడచి అరణ్యమువైపు పోవుట.

రాముడు, సుందర మైన ఆ తమసాతీరమును చేరి, సీతను చూచి, లక్ష్మణునితో ఇట్లనెను.(1)

"లక్ష్మణా! మనము వనమునకు పంపబడితిమి కదా! నేడు ఇది మన వనవాసములో మొదటి రాత్రి. నీవు ఏ విధముగను బెంగపెట్టుకొనకుము. మృగములును, పక్షులును, వాటి వాటి స్థానములకు చేరి అణగి యుండగా, శూన్యము లైన ఈ అరణ్యములు, నలువైపుల ఏడ్చుచున్నవి.(2, 3)

ఇపుడు మా తండ్రిగారి రాజధాని యైన అయోధ్యానగరములోని స్త్రీపురుష లందరును, మనము విడచి వచ్చినందుకు దుఃఖించుచుందురు. సందేహము లేదు. అనేక మైన గుణములను బట్టి పౌరుల కందరికిని రాజుపైనను, నీపైనను, నాపైనను, భరతశత్రుఘ్నుల పైనను చాల ప్రేమ ఉన్నది.(4, 5)

నా తండ్రియు, కీర్తిమంతురా లైన నా తల్లియు, నాకొరకై ఎక్కువగా ఏడ్చి, ఏడ్చి, గ్రుడ్డివా రయిపోవుదురేమో అని దుఃఖించుచున్నాను. ధర్మాత్ముడైన భరతుడు, ధర్మార్థకామములను బోధించు మాటలతో, నా తల్లిదండ్రులను తప్పక ఓదార్చగలడు.(6,7)

లక్ష్మణా! మాటి మాటికి భరతుని మంచితనమును గూర్చి తలచుకొనినపుడు నాకు తల్లిదండ్రుల విషయమున చింత యేమియు కలుగుట లేదు. లక్ష్మణా! నన్ను అనుసరించి వచ్చి నీవు మంచి పని చేసితివి. సీతను రక్షించుకొనుటకు సాహాయ్యము కావలెను కదా! (8,9)

ఈ రాత్రి ఉదకము మాత్రమే త్రాగి ఉండెదను. అనేకవిధములైన వన్యపదార్థములు లభించుచున్నను ఇపుడు నాకు ఇట్లు ఉండుటయే ఇష్టము".(10)

రాముడు లక్ష్మణునితో ఇట్లు చెప్పి, 'ఓ సౌమ్యుడా! నీవు అశ్వములను జాగ్రత్తగా చూచుకొనుచుండుము." అని సుమంత్రుని ఆదేశించెను.(11)

సూర్యుడు అస్తమించిన పిమ్మట సుమంత్రుడు, మేయుచున్న గుర్రములను కట్టివేసి, వాటికి అధికముగా గడ్డివేసి వాటి దగ్గరనే ఉండెను.(12)

సుమంత్రుడు సంధ్యోపాసనము చేసి, రాత్రి వచ్చినట్లు గుర్తించి రామునకు, లక్ష్మణునకు శయనము ఏర్పరచెను. రాముడు తమసాతీరమునందు చెట్ల ఆకులతో ఏర్పరచిన ఆ శయ్యను చూచి, సీతాసమేతుడై, శయనించెను. లక్ష్మణుడు కూడా శయనించెను.(13,14)

ఆ విధముగా రాముడును, సీతయు నిద్రించుచుండగా చూచి లక్ష్మణుడు రాముని అనేకసద్గుణములను సుమంత్రునకు వర్ణించి చెప్పెను. ఆ తమసాతీరమున లక్ష్మణుడు, సుమంత్రునకు రాముని గుణములను గూర్చి వర్ణించుచు, మేల్కొని యుండగానే, రాత్రి గడచి సూర్యుడు ఉదయించెను.(15, 16)

రాముడు ఆ రాత్రి తన వెంబడి వచ్చిన ప్రజలతో, గోసముదాయముచే వ్యాకుల మైన తీరము గల తమసానదికి దూరముగా నివసించెను.(17)

నిద్రలేచి, ఆ ప్రజలను చూచి, శుభమైన లక్షణములు గల సోదరు డైన లక్ష్మణునితో ఇట్లనెను.(18)

"లక్ష్మణా! ఈ పౌరు లందరు మనపై ప్రేమతో, గృహములపై అపేక్షను కూడ విడచి వచ్చి, ఇపుడు చెట్ల క్రింద నిద్రించుచున్నారు; చూడుము. ఈ పౌరులందరు మనలను వెనుకకు మరల్చుటకు చూపు పట్టుదలను చూడగా వీరు ప్రాణముల నైన విడుతురు కాని, తమ నిశ్చయమును విడువరు అని తోచుచున్నది. నిద్రనుండి మేల్కొనులోపుగా మనము రథ మెక్కి శీఘ్రముగా ఎట్టి భయము లేని మార్గమున వెళ్ళెదము. మన మిట్లు చేయనిచో నాపై ప్రేమగల ఈ అయోధ్యాపౌరులు చెట్ల మొదళ్ళలో, ఈ నాడు నిద్రించుచున్నట్లు, మరల నిద్రించుటకు అవసర ముండదు.(19-22)

పౌరులకు తమవలన ఏదైన దుఃఖము కలిగినచో, దానిని రాజకుమారులు తొలగించవలెను. స్వయముగా పురవాసులకు దుఃఖము కల్గించకూడదు".(23)

లక్ష్మణుడు రామునితో, 'బుద్ధిశాలి వైన ఓ రామా! నీవు చెప్పినది నాకు కూడ ఇష్ట మగుచున్నది. శీఘ్రముగా రథము నెక్కుము.' అని పలికెను.(24)

పిమ్మట రాముడు సుమంత్రునితో, "ఓ సమర్థుడా! రథమును కట్టుము. దానిపై అరణ్యమునకు వెళ్ళెదను. ఈ ప్రదేశమునుండి శీఘ్రముగా వెళ్ళుము." అనెను.(25)

ఆ సారథి తొందరగా రథమునకు గుఱ్ఱములు కట్టి రామునకు నమస్కరించి రథము సిద్ధముగా నున్నదని చెప్పుచూ, "రామా! ఈ రథము కట్టితిని. ఓ ఆజానుబాహూ! నీవు, సీత, లక్ష్మణుడు దీనిపై ఎక్కుడు." అని పలికెను.(26, 27)

రాముడు తన పరికరములతో కూడ రథము నెక్కి, సుడులతో వ్యాకుల మై శీఘ్రముగా ప్రవహించు తమసానదిని దాటెను. తమసానదిని దాటి, మంగళకరమూ, బాధలు లేనిదీ, భయపడువారికి కూడ భయమును కల్గించునది అయిన మహామార్గమును పొందెను.(28,29)

ఆ పౌరులను మోసగించుటకై రాముడు సుమంత్రునితో- 'ఓ సుమంత్రా! నీవు రథ మెక్కి కొంత దూరము ఉత్తరము వైపు వెళ్ళి మరల రథమును వెనుకకు త్రిప్పుము. నీవు సావధానచిత్తుడ వై పౌరులకు నా విషయము తెలియకుండునట్లు చూడుము." అనెను. (30,31)

సుమంత్రుడు రాముని అజ్ఞ ప్రకారము, ఆ విధముగా చేసి, తిరిగి వచ్చి రామునకు రథము సిద్ధముగా ఉన్నట్లు తెలిపెను. సీతాసహితు లైన రామలక్ష్మణులు, చక్కగా కట్టబడిన ఆ రథమును ఎక్కగా, సుమంత్రుడు, గుర్రములను తపోవనము వైపు వెళ్ళు మార్గమునందు నడిపించెను. ఉత్తరాభిముఖముగా ప్రయాణము చేయుట మంగళకర మగుటచే సారథి ఆ రథమును ఉత్తరాభిముఖముగా నుండునట్లు చేసెను. మహారథు డైన రాముడు సారథితో ఆ రథమును ఎక్కి వనమునకు వెళ్ళెను. (32-34)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నలుబది ఆరవ సర్గము సమాప్తము.

నలుబది ఏడవ సర్గము

పౌరులు వేకువనే లేచి విలపించుట. నిరాశ నొంది నగరమునకు మరలిపోవుట.

రాత్రి తెల్లవారగనే ఆ పౌరులు, రాము దక్కడ లేకపోవుట చూచి, దుఃఖముచే పీడింపబడిన చిత్తము కలవారై నిశ్చేష్టులైరి. కన్నీళ్ళతో తడిసి, దుఃఖితులై ఇటు అటు చూచుచున్న వారికి రాముని జాడ కూడ కనబడలేదు. మంచి మనస్సు గల వారు, రాము దక్కడ లేకపోవుటచే దుఃఖముచే ఎండిన ముఖములు కలవా రై దీను లై ఇట్లు మాటలాడుకొనిరి. "ఛీ! ఈ నిద్ర ఎంత పని చేసినది! దీనిచే ఒళ్ళు తెలియక మనము రాముని కోల్పోయినాము. (1-4)

మహాబాహువైన ఆ రామునకు చేసిన సేవ ఎన్నడును వ్యర్థము కాదు. అట్టి రాముడు తన భక్తుల మైన మనలను విడచి ఎట్లు దూరముగా వెళ్ళిపోయినాడు? తండ్రి ఔరసు లయిన తన కుమారులను పాలించునట్లు రాముడు మనలను సర్వదా పాలించుచుండెడివాడు. అట్టి రాముడు మనలను విడిచి అరణ్యమునకు ఎట్లు వెళ్ళినాడు? మన మందరము ఇక్కడనే మరణించెదము లేదా మరణించువరకు ఉత్తరదిక్కుకు నడిచిపోవుదము. రాముడు లేని మన ఈ జీవితము వ్యర్థము. (5-7)

ఇక్కడ అత్యధికమైన పెద్ద పెద్ద ఎండిన కఱ్ఱలున్నవి. వాటిచే చితిని ఏర్పరచి మన మందరము అగ్నిలో ప్రవేశించెదము. (8)

రాముని గూర్చి అడుగువారికి మనమేమి చెప్పగలము? రాముని అరణ్యమునకు చేర్చి వచ్చితిమి అని, మనము ఎట్లు చెప్పగలము? రాముడు లేకుండగా మనమే

తిరిగి వచ్చుట చూచి అయోధ్యలోని స్త్రీబాలవృద్ధులతో సహా అందరును దీనులై ఆనందములేనివారుగా అవుదురు. ఆత్మనిగ్రహవంతు డైన ఆ రామునితో కలసి అయోధ్య విడచి బయటకు వచ్చిన మనము, ఇపుడు అతడు లేకుండా ఆ నగరమును ఎట్లు చూడగలము?"(9-11)

ఆ జనులందరు ఈవిధముగా పలుకుచు, దుఃఖార్తులై, చేతులు పైకెత్తి, లేగదూడలు లేని ఆవుల వలె విలపించిరి. పిమ్మట రథము జాడ ననుసరించి, కొంచెము దూరము వెళ్ళి, తరువాత ఆ జాడ కనబడకపోవుటచే గొప్ప శోకములో మునిగిరి. రథము నడిచిన జాడ కనబడకపోవుటచే, ఆ పౌరు లందరు "ఇదేమిటి? దైవోపహతుల మైన మనము ఇపుడు ఏమి చేయవలెను?" అని పలుకుచు వెనుకకు మరలి, దుఃఖించుచు, శోకాక్రాంతు లైన సజ్జనులు గల అయోధ్యాపురమునకు, వచ్చిన మార్గముననే వెళ్ళిరి. వాళ్ళు ఆ నగరమును చూచి, వచ్చిన ఆపదను గూర్చి వ్యాకుల మైన మనస్సు గలవారై, దుఃఖముచేత పీడింపబడిన నేత్రములతో కన్నీళ్ళు కార్చిరి.(12-16)

రాముడు లేని ఆ నగరము ఏమాత్రము ప్రకాశించుటలేదు. దుఃఖితమైన మనస్సు గల ఆ పౌరులకు, ఆనందవిహీనమైన ఆ నగరము, చంద్రుడు లేని ఆకాశము వలె, ఉదకము లేని సముద్రము వలె కనబడినది. ఏ మాత్రము సంతోషము లేని ఆ పౌరులు, అధికమైన ధనములు గల తమ ఇండ్లలోనికి అతికష్టమున ప్రవేశించి, దుఃఖపీడితులై, ఎదురుగా చూచుచున్నను, తమవారిని గాని, ఇతరులను గాని, సరిగా గుర్తించలేకపోయిరి.(17-19)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నలుబది ఏడవ సర్గము సమాప్తము.

నలుబది ఎనిమిదవ సర్గము

నగరవాసులగు స్త్రీలు విలపించుట.

రాముని అనుసరించి వెళ్ళి మరల వచ్చిన ఆ పౌరులు, చాల దుఃఖితులై బాధపడుచుండిరి. మరణించవలె నను కోరికతో వారు కన్నీళ్ళు కార్చుచుండిరి. దుఃఖముచే ధైర్యమును కోల్పోయిరి. అట్టి ఆ పౌరులు ప్రాణములు పోయినవారి వలె ఉండిరి. వాళ్ళందరును, తమ తమ ఇండ్లు చేరి, పుత్రులును, భార్యలును తమ చుట్టు నిలిచి యుండగా, కన్నీళ్ళు కప్పిన ముఖములతో ఏడ్చిరి.(1-3)

ఆ పౌరులలో ఎవ్వరును హర్షించలేదు. ఏ కార్యమును ఆమోదించలేదు. వర్తకులు వస్తువులను అమ్మజూపలేదు. దేవాలయాది పుణ్యస్థానములు శోభావిహీనము లై ఉండెను. గృహస్థులు వంటలు చేసుకొనలేదు. పోయిన వస్తువు దొరికినవాడు అందుకు సంతోషించలేదు. అధికమైన ధర్మము లభించినవారికి దానివలన ఆనందము కలుగలేదు. తల్లి తొలిసారిగా పుత్రుని కన్నందులకు కూడ ఆనందించలేదు.(4,5)

ఇంటింటియందును, దుఃఖార్త లైన స్త్రీలు, ఏడ్చుచు, ఇంటికి వచ్చిన భర్తను, ఏనుగులను అంకుశముతో పొడిచి నట్లు మాటలతో పొడిచిరి.(6)

"రాముని చూడనివారికి గృహములతో కాని, భార్యలతో గాని, ధనముచేత గాని, పుత్రులచేత గాని, సుఖములచేత గాని ఏమి ప్రయోజనము? సీతాసమేతుడైన ఆ రామునకు ఉపచారములు చేయుచు అతనిని అనుసరించి అరణ్యమునకు వెళ్ళిన లక్ష్మణు డొక్కడే ఈ లోకమునందు సత్పురుషుడు. రాముడు ఏ పవిత్ర మైన నదులలో దిగి స్నానము చేయునో ఆ నదులూ, పద్మము లున్న చెరువులూ, సరస్సులూ పుణ్యము చేసుకొన్నవి.(7-9)

అంద మైన వృక్షసముదాయము లున్న అరణ్యములూ, విశాలమైన జలప్రాయప్రదేశము లున్న నదులూ, చరియలు గల పర్వతములూ, రాముని శోభింపచేయగలవు. రాముడు ఏ అరణ్యమునకు, ఏ పర్వతమునకు వెళ్ళినను అవి ప్రియు డైన అతిథిని వలె అతనిని ఆదరించక ఉండజాలవు. నానావిధము లైన పుష్పములను శిరోభూషణములుగా ధరించినవీ, అనేకము లైన పూలగుత్తులు కలవీ, తుమ్మెదలతో ప్రకాశించుచున్నవీ అయిన చెట్లు కనబడుచు అతనికి ఆనందము కూర్చగలవు. పర్వతములు తమ దగ్గరకు వచ్చిన రామునకు దయతో అకాలమునందు గూడ మంచి పుష్పములను, ఫలములను సమర్పించగలవు. పర్వతములు అనేక విధము లైన, విచిత్రములైన ప్రవాహములను చూపుచు, రామునికొరకై, నిర్మలము లైన జలములను స్రవింపగలవు.(10-14)

పర్వతశిఖరములమీద వృక్షములు రామునకు ఆనందము కలిగించగలవు. రాము డున్న చోట భయము గాని, పరాభవము గాని ఉండదు. శూరుడూ, అజానుబాహుడూ, దశరథకుమారుడూ అయిన ఆ రాముడు మనకు దూరము కాక ముందే అతనిని అనుసరించి వెళ్ళెదము. అట్టి మహాత్ముడైన ప్రభువు పాదచ్ఛాయ సుఖకర మైనది. అతడే ఈ జనమున కంతకును నాథుడు. అతడే గతి. అతడే పరమగమ్యస్థానము. మేము సీతను సేవించెదము. మీరు రాముని సేవించుడు."

ఈ విధముగా దుఃఖార్తలైన పౌరస్త్రీలు భర్తలతో అనేకవిధములుగా పలికిరి. (15-18)

"మనము అరణ్యములో నున్నపుడు రాముడు మీ యోగక్షేమాలను చూడగలడు. సీత మా యోగక్షేమములను చూడగలదు. ఈ అయోధ్యలో నివాసము అప్రశస్తము. ఇచట నున్న జనులందరు బెంగపెట్టుకొన్నారు. ఈ నివాసము సుఖకరము కాదు, దుఃఖకరము. అట్టి ఈ అయోధ్యానివాసమునకు ఎవ్వడు సంతోషించును? నాథుడు లేని ఈ రాజ్యము ధర్మవిరుద్ధముగా కైకేయి చేతిలోనికి వెళ్ళిన ట్లయితే, మాకు ఈ జీవితముతో ప్రయోజన మేమియు లేదు. పుత్రులచేతను, ధనములచేతను ప్రయోజనము లే దని చెప్పవలెనా? ఐశ్వర్యముకొరకై భర్తను, కుమారుని కూడ పరిత్యజించినదీ, కులమును అపవిత్రము చేసినదీ అయిన కైకేయి, మరి ఎవ్వరిని లెక్కపెట్టును? (19-22)

కైకేయి జీవించియుండగా, మేము జీవించుచున్నవారమై ఈ రాజ్యమున భృత్యులమై ఎన్నడును జీవించము. మా కుమారులపై కూడ ఒట్టు పెట్టుచున్నాము. ఏ కైకేయి, ఏ మాత్రము జాలి లేనిదై, రాముని అరణ్యమునకు పంపినదో, అధర్మాత్మురాలు, దుష్టముగా ప్రవర్తించునది అయిన ఆమెను చేరి ఎవడు సుఖముగా జీవించగలడు? కైకేయి మూలమున ఈ రాజ్యమంతయు, నాయకుడు లేక, ఉపద్రవమును పొంది, ఆధారము లేనిదై నాశనమును పొందును. రాముడు అరణ్యమునకు వెళ్ళిన పిమ్మట దశరథుడు జీవించడు. దశరథుడు మరణించినచో, తరువాత మిగులునవి విలాపములే. (23-26)

మీ యందరి పుణ్యము క్షీణించినది. కష్టములలో ఉన్నారు. అందుచే మీ రందరును విషము కలుపుకొని త్రాగండి. లేదా రాముని అనుసరించి వెళ్ళండి. లేదా ఎవ్వరికిని తెలియని ప్రదేశమునకు వెళ్ళి పొండి. దశరథుడు సీతాలక్ష్మణసమేతుడైన రాముని కపటోపాయముతో దూరముగా పంపివేసి, మనలను, పశువులను కసాయివానికి ఒప్పజెప్పినట్లు భరతునకు ఒప్ప చెప్పినాడు. (27, 28)

మహారథుడైన రాముడు పూర్ణచంద్రుని వంటి ముఖము కలవాడు. నీలవర్ణుడు. పైకి కనబడని అంససంధులు కలవాడు. శత్రువులను నశింపచేయువాడు. పద్మముల వంటి నేత్రములు కలవాడు. మోకాళ్ళ వరకు పొడవైన బాహువులు కలవాడు. లక్ష్మణునికి అన్న. ఇతరులను ముందుగా పలుకరించువాడు. తియ్యని స్వభావము గల అతడు సత్యమునే పలుకును. మహాబలశాలి. సౌమ్య మైన స్వభావము కలవాడు. సకలజగత్తుకును ఈతని దర్శనము చంద్రదర్శనము వలె ఆనందమును కల్గించును. పురుషులలో శ్రేష్ఠుడు. మదించిన ఏనుగు వంటి అందమైన నడక కలవాడు.

అతడు అరణ్యములలో సంచరించుచు, వాటిని ప్రకాశింప చేయగలడు". (29-31)

ఆ అయోధ్యానగరములో ఉన్న స్త్రీలందరును, ఆ విధముగా విలపించుచు, మృత్యువువలన భయము కల్గినట్లు, దుఃఖముచే పీడింపబడినవారై మొరపెట్టిరి. అయోధ్యాపురములోని ఇండ్లలోని స్త్రీలు ఈ విధముగా రాముని గూర్చి విలపించుచుండగా, ఇంతలో సూర్యుడు అస్తమించి రాత్రియైనది. (32, 33)

ఆ నగరములో ఎవ్వరును అగ్నిహోత్రములు చేయలేదు. స్వాధ్యాయాధ్యయనము కూడ జరుగుట లేదు. అట్టి ఆ అయోధ్యానగరము చీకటి పూసినట్లుండెను. అయోధ్యాపట్టణములోని అంగళ్ళన్నియు మూసివేసిరి. ఎక్కడను హర్షము కనబడుట లేదు. అది ఆశ్రయము లేనిదై ఉండెను. ఈ విధముగా నగరము, నక్షత్రములు కనబడని ఆకాశము వలె ఉండెను. (34, 35)

ఆ నగరములోని స్త్రీ లందరును తమ కుమారుని గాని, సోదరుని కాని, దేశము నుండి వెడలగొట్టి నపుడు ఎంత దుఃఖింతురో, రాముని విషయమై అంత దుఃఖించుచు బాధపడుచున్న మనస్సులతో దీనలై, విలపించుచు, ఏడ్చిరి. రాముడు వారికి కుమారులకంటె కూడ అధికముగ ప్రేమపాత్ర మై ఉండెను. (36)

ఆ నగరములో, సంగీతములు కాని, ఉత్సవములు కాని, నృత్యములు కాని, వాద్యములు కాని లేకుండెను. ఎక్కడను ఆనందము కనబడుటలేదు. సమృద్ధము లైన ఆపణములు మూయబడి ఉండెను. అట్టి ఆ అయోధ్య, నీరు తగ్గిపోయిన సముద్రము వలె ఉండెను. (37)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నలుబది ఎనిమిదవ సర్గము సమాప్తము.

నలుబది తొమ్మిదవ సర్గము

రాముడు కోసలగ్రామములు దాటుచు సుమంత్రునితో సంభాషించుట.

పురుషశ్రేష్ఠు డైన రాముడు, తండ్రి ఆజ్ఞను స్మరించుచు, ఆ రాత్రిశేషమునందే చాల దూరము ప్రయాణము చేసెను. అత డా విధముగా ప్రయాణము చేయుచుండగా, రాత్రి గడచెను. అప్పుడు మంగళకరమైన సంధ్యను ఉపాసించి, దేశము పొలిమేరలోనికి ప్రవేశించెను. (1, 2)

దున్నిన సీమాంతములు కల గ్రామములను, పుష్పించిన వనములను చూచుచు,

గ్రామములలో నివసించు మనుష్యుల మాటలు వినుచు, ఆ ఉత్తమాశ్వములతో, శీఘ్రముగా ప్రయాణము చేయుచు, ఆ గ్రామాదుల నన్నిటిని దాటెను.(3)

“దశరథమహారాజు కామమునకు వశుడైపోయినాడు. అయ్యో! క్రూరురాలు, పాపాత్మురాలు అయిన కైకేయి ఈనాడు పాపకర్మలనే అవిచ్ఛిన్నముగా చేయుచున్నది. ధార్మికుడు, గొప్ప బుద్ధి కలవాడు, దయాశీలుడు, ఇంద్రియము లను జయించినవాడు అయిన, ఇట్టి రాముని, వనవాసమునకై పంపివేయుచు, క్రూరురా లైన కైకేయి, కట్టుబాట్లను ఛేదించి ఎంతటి క్రూరమైన పనికి ఒడికట్టినది! మంచి భాగ్యము కలదీ, ఎల్లపుడు సుఖములకే అలవాటుపడినదీ అయిన జనకుని పుత్రి సీత, దుఃఖములను ఎట్లు అనుభవించునో. దశరథమహారాజు, దయలేనివాడై, ప్రజలకు ఇష్టుడు, దోషరహితుడు, తన కుమారుడు అయిన రాముని విడువకోరుచున్నాడు. ఎంత ఆశ్చర్యము!”(4-8)

కోసలాధీశ్వరుడైన ఆ వీరుడు, గ్రామములోనివారును, పల్లెలోనివారును చెప్పుకొనుచున్న ఈ మాటలు వినుచు, కోసలదేశమును దాటెను. పిమ్మట అతడు, పవిత్రమైన ఉదకము ప్రవహించుచున్న వేదశ్రుతియను నదిని దాటి, అగస్త్యుడు నివసించు, దక్షిణమువైపు ప్రయాణము చేసెను.(9, 10)

అక్కడ నుండి చాల సేపు ప్రయాణము చేసిన పిమ్మట రాముడు పవిత్రమైన జలములు కలది, జలముతో నిండిన ప్రాంతములలో గోవులతో నిండినది, సముద్రములోనికి ప్రవహించునదీ యైన గోమతీనదిని దాటెను. అక్కడ అతడు, పూర్వము మనుచక్రవర్తి ఇక్ష్వాకువునకు ఇచ్చిన అనేకరాష్ట్రములతో కూడిన, విశాల మైన భూమిని సీతకు చూపించెను.(11-13)

శ్రీమంతుడైన రాముడు, సారథి యైన సుమంత్రుని 'సూతా'! అని ప్రేమపూర్వకముగా పిలిచి ఇట్లనెను.(14)

“నేను మరల వచ్చి, తల్లిదండ్రుల దర్శనము చేసి, ఈ సరయూనదీతీరమున పుష్పించిన వనమునందు ఎపుడు వేటాడెదనో! వేట ఈ లోకములో సాటిలేనిది. రాజర్షులకు అంగీకారయోగ్యము, ఆనందకరము అయిన క్రీడ. కాని సరయూతీరమునందలి వనమున వేటాడవలె నని నాకు అంతగా కోరిక లేదు. ఈ లోకమునందు వేట రాజర్షులకు ఆనందకరము. ఆ యా కాలము లందు ఇతర మనుష్యులును చేయుచుందురు. ధనుర్ధరులు దీనిని అధికముగా కోరుదురు. కాని నేను దాని నంతగా కోరను.”(15-17)

రాము డీ విధముగా ఆ యా విషయములను గూర్చి మధురమైన వాక్కుతో ఆ సూతునకు చెప్పుచు, ఆ మార్గమునందు ప్రయాణము చేసెను.(18)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నలుబది తొమ్మిదవ సర్గము సమాప్తము.

ఏబదవ సర్గము

రాముడు శృంగిబేరపురమున గంగాతీరము చేరుట. నిషాదరాజు గుహుడు రామాదులను సత్కరించుట.

రాముడు, అందము విశాలము అయిన ఆ కోసలదేశమును దాటి, అయోధ్యాపురము వైపు తిరిగి, నమస్కరించుచు, "కకుత్స్థవంశమునందు పుట్టినవారిచే పరిపాలింపబడుచున్న ఓ నగరశ్రేష్ఠమా! నిన్ను, నీయందు నివసించుచు, నిన్ను పాలించుచున్న దేవతలనూ, అనుమతి కోరుచున్నాను. నేను వనవాసమును పూర్తిచేసుకొని, దశరథుని ఋణము తీర్చి, తల్లిదండ్రులతో కలసి, మరల నిన్ను చూచెదను." అనెను.(1-3)

పిమ్మట అతడు, కన్నీళ్ళతో నిండిన ముఖముతో, రక్తమువలె ఎర్రనైన నేత్రములు కలవాడై, దీను డై, కుడిచేయి ఎత్తి తనను చూడ వచ్చిన ఆ గ్రామీణులతో, "మీరు నాపై తగు విధముగా జాలి, దయ చూపించినారు. చాలా కాలము దుఃఖించుట మిక్కిలి చెడ్డది. అందుచే మీ మీ పనులు చూచుకొనుటకు వెళ్ళుడు." అనెను.(4,5)

వారందరును, మహాత్ముడైన ఆ రామునకు ప్రదక్షిణపూర్వకముగా నమస్కారము చేసి, ఘోరముగా ఏడ్చుచు, అక్కడక్కడనే నిలచి, రాముని చూచుచుండిరి. ఆ జనులందరు రామదర్శనమునకు తృప్తిచెందక, ఆ విధముగా విలపించుచుండగా, రాత్రి ప్రారంభమున సూర్యుడు వలె, రాముడు కండ్లకు కనబడకుండగా వెళ్ళిపోయెను.(6, 7)

పిమ్మట పురుషశ్రేష్ఠు డైన రాముడు కోసలదేశమును దాటెను. ఆ దేశము ధనధాన్యములతో నిండి, మంగళప్రదమై, ఎక్కడినుండియు ఎట్టి భయము లేక, సుందరముగా నుండెను. అక్కడ జనులందరు దానస్వభావులు. అచ్చటచ్చట చైత్యములు, యూపస్తంభములు కనబడుచుండెను. అడుగడుగునను ఉద్యానములు, మామిడితోటలు, జలముతో నిండిన జలాశయములు ప్రకాశించుచుండెను.

జనులందరును, సంతుష్టులై, పరిపుష్టులై ఉండిరి. ఆ దేశమునం దంతటను, అనేక గోసమూహములు వ్యాపించి యుండెను. ఎచట చూచినను, వేదఘోషము వినబడుచుండెను. ఆ దేశము, రాజు లందరును చూడవలసిన దేశము.(8-10)

రాముడు రాజులచే అనుభవింపదగిన ఆ రాజ్యమును, దాని మధ్యభాగమున ప్రయాణము చేసి దాటెను. విశాలమైన ఆ రాజ్యము ఆనందకరమై, సుందరము లైన ఉద్యానములతో నిండి ఉండెను.(11)

కోసలదేశమును దాటిన ఆ రాముడు, అక్కడ మూడు మార్గములలో ప్రవహించునదీ, సుందర మైనదీ, మంగళకరము లైన ఉదకములు కలదీ, నాచు లేనిదీ, ఋషులచే సేవింపబడునదీ అయిన గంగను చూచెను. ఆ గంగానది సమీపమున ఉన్న అందమైన ఆశ్రమములు, ఆ నదికి అలంకారములుగా నుండెను. సంతోషముతో కూడిన అప్సరస్త్రీలు ఆ యా కాలములందు వచ్చి మంగళప్రదమైన ఈ గంగకు సంబంధించిన హ్రదములలోని జలమును సేవించుచుందురు. శుభప్రదమైన ఈ గంగను, దేవతలు, దానవులు, గంధర్వులు, కిన్నరులు ప్రకాశింపచేయుచుందురు. గంధర్వుల భార్యలు చాలామంది ఈ నదిని సర్వదా సేవించుచుందురు. ఈ నదియం దంతటను, దేవతలు విహరించు పర్వతములు, ఉద్యానములు, వందలకొలది ఉన్నవి. దేవతలకొరకై ఆకాశమునందు ప్రవహించుటచే ఇది 'దేవనది' యని ప్రసిద్ధమైనది.(12-15)

ఆ నది కొన్నిచోట్ల నీటి అట్టహాసముచే భయంకరముగా ఉన్నది. కొన్ని చోట్ల నురుగు అనెడు తెల్లని మందహాసముతో కూడి యున్నది. కొన్ని చోట్ల జలము జడ వలె, దీర్ఘమై ప్రవహించుచుండెను. కొన్నిచోట్ల సుడులతో శోభించుచుండెను. ఆ గంగానదీజలము, కొన్ని చోట్ల నిశ్చలమూ, లోతుగా ఉండెను కొన్నిచోట్ల వేగముగా ప్రవహించుచుండెను. దాని ధ్వని, కొన్నిచోట్ల గంభీరము గాను, మరి కొన్ని చోట్ల భయంకరముగాను ఉండెను. దేవత లందరును, ఈ నదీజలములో స్నానమాడుచుండిరి. అది తెల్లని కలువలతో ప్రకాశించుచుండెను కొన్ని చోట్ల నిండుగా విశాలముగా నున్న ఇసుకతిన్నెలు ఉండెను. కొన్ని చోట్ల తెల్లని ఇసుక వ్యాపించి ఉండెను. (16-18)

హంసలు, సారసపక్షులు, చక్రవాకములు, ఈ నదియందు విహరించుచు ధ్వని చేయుచుండెను. దాని మధ్యభాగము ఎల్లపుడు మదించియున్న పక్షుల రొదచే ప్రతిధ్వనించుచుండెను. కొన్ని చోట్ల తీరములపై మొలచిన వృక్షములు, మాలల

వలె ఆ గంగను అలంకరించుచుండెను. కొన్ని చోట్ల వికసించిన కలువలు, మరికొన్ని చోట్ల పద్మవనములు వ్యాపించి యుండెను. కొన్ని చోట్ల తెల్లని కలువల గుంపులు, వాటి మొగ్గలు ఈ నదిని ప్రకాశింపచేయుచుండెను. కొన్ని చోట్ల అనేకవిధములైన పుష్పములు పరాగములు పడి, రంగు మారిపోవుటచే అది మత్తెక్కి నట్లు కనబడుచుండెను.(19-21)

ఆ గంగానది మణి వలె నిర్మలముగా కనబడుచుండెను. దిగ్గజములు, మదించిన వనగజములు, దేవతల వాహనము లైన ఉత్తమగజములు, దీనిలో దిగి మాటిమాటికి ధ్వని చేయుటచే, దానితో వనమధ్య మంతయు ప్రతిధ్వనించుచుండెను. ఆ గంగానదీప్రాంతమం దంతటను ఫలములు, పుష్పములు, చిగుళ్ళు, పొదలు, పక్షులు, వ్యాపించి యుండుటచే అది ప్రయత్నపూర్వకముగా ఉత్తమ మైన అలంకారములతో అలంకరించిన స్త్రీ వలె ఉండెను. ఆ నదిలో, అడవికోతులు, మొసళ్ళు, సర్పములు నివసించుచుండెను. విష్ణుపాదమునుండి ప్రవహించుచున్నది, దేవలోకమునకు సంబంధించినది, పాపములు లేనిది, అయిన ఆ గంగానది, పాపములను తొలగించునది. భగీరథుని తపస్సుచే శంకరుని జటాజూటమునుండి నేలపై బడినది. సారసపక్షులు, క్రౌంచపక్షులు, ఆ నదియందు ధ్వనిచేయుచుండును. అట్టి సముద్రమహిషి యైన గంగను, రాముడు శృంగిబేరపురము వద్ద సమీపించెను. (22-26)

తరంగములచే కప్పబడిన సుడులు కల ఆ నదిని చూచి, రాముడు సారథి యైన సుమంత్రునితో– "నేడు ఇచటనే నివసించెదము. ఈ నదికి దగ్గరనే అనేక మైన పుష్పములతో చివుళ్ళతో నిండిన చాల పెద్ద దైన గారచెట్టు ఉన్నది. ఇక్కడనే ఆగెదము. పూజింపదగిన జలము గల, నదీశ్రేష్ఠమైన ఈ గంగానది దేవతలకు, దానవులకు, గంధర్వులకు, మృగములకు, మనుష్యులకు, పక్షులకు, శుభమును కల్గించును. అట్టి ఈ నదిని చూచెదము." అనెను.(27-29)

లక్ష్మణుడు, సుమంత్రుడు కూడ రాముని మాట అంగీకరించి, ఆ రథమును ఇంగుదీవృక్షమువైపునకు తోడ్కొని వెళ్ళిరి. ఆ వృక్షము సమీపించి రాముడు, సీత, లక్ష్మణుడు రథమునుండి దిగిరి.(30, 31)

సుమంత్రుడు కూడ రథమునుండి దిగి గుఱ్ఱములను విప్పి, చెట్టు మొదట ఉన్న రాముని వద్ద వినయపూర్వకముగా కూర్చుండెను.(32)

అక్కడ, రామునకు ప్రాణసమానస్నేహితుడు, బోయజాతికి చెందినవాడు,

బలవంతుడు, ఆ బోయజాతివారికి అధిపతి యని ప్రసిద్ధుడు అయిన గుహుడు అను రాజు ఉండెను.(33)

రాముడు తన దేశమునకు వచ్చి నట్లు విని, ఆ గుహుడు, వృద్ధు లైన అమాత్యులతోను, జ్ఞాతులతోను కలసి, రాముని వద్దకు వచ్చెను. నిషాదరాజు వచ్చుచున్నట్లు దూరమునుండియే చూచిన రాముడు, లక్ష్మణసమేతు డై, అతనిని కలిసెను.(34, 35)

గుహుడు దుఃఖితుడై, రాముని కౌగిలించుకొని, "రామా! నీకు అయోధ్య ఎట్లో ఈ నగరమునూ అట్లే. నీకు ఏమి చేయవలెనో చెప్పుము. ఆజానుబాహూ! నీవంటి ప్రియాతిథి మరెవ్వరికైనా దొరకునా?" అనెను.(36)

పిమ్మట అనేకవిధము లైన అన్నమును(ఆహారపదార్థములను), అర్ఘ్యమును శీఘ్రముగా తీసుకొని వచ్చి, "అజానుబాహూ! నీకు స్వాగతము. ఈ భూమి అంతయు నీకు చెందినదే. మేము నీకు భృత్యులము. నీవు రాజువు. ఈ మా రాజ్యమును పరిపాలింపుము. భక్ష్యములూ, భోజ్యములూ, పేయములూ, లేహ్యములూ, మంచి శయనములూ, ఇవిగో అన్నియు సిద్ధముగా నున్నవి." అని చెప్పెను.(37-39)

గుహుని మాటలు విని రాముడు- "నీవు కాలినడకను మా కెదురుగా వచ్చుటచేతను, స్నేహమును ప్రదర్శించుటచేతను, మమ్ములను సర్వవిధములుగా పూజించితివి. అందుకు, చాలా సంతోషించుచున్నాము." అనెను.(40, 41)

రాము డాతనిని కౌగిలించుకొని ఇట్లు పలికెను- 'నీవూ, నీ బంధువులూ, ఆరోగ్యముగా సుఖముగా నుండగా, నా భాగ్యవశముచే చూడ కలుగుచున్నాను. నీ రాష్ట్రమునకూ, నీ మిత్రులకూ, ధనమునకూ క్షేమమే కద! నీవు ప్రేమపూర్వకముగా నాకై ఏర్పరిచినదాని నంతను నీకే ఇచ్చి వేయుచున్నాను. నేను ఇపుడు ఎవ్వరేమి ఇచ్చినా దానిని తీసుకొను స్థితిలో లేను. ఇపుడు నేను కుశచీరాజినములను ధరించి, ఫలమూలములు భక్షించుచు, వనములో నివసించు, ధర్మనిరతుడ నైన మునిని అని తెలుసుకొనుము.(42-44)

ఇపుడు నేను కోరెడి దెల్ల అశ్వములకు ఆహారము మాత్రమే. మరేదియు కోరను. నీవు ఇది ఇచ్చినచో నాకు బాగుగా పూజచేసి నట్లే అగును. ఈ గుఱ్ఱములు మాతండ్రిగా రైన దశరథమహారాజుకు ఇష్టమైనవి. వీటిని బాగుగా చూచుకొన్నచో నన్ను పూజించి నట్లే అగును".(45, 46)

అపుడా గుహుడు "అశ్వములకు పానీయమును, ఆహారమును శీఘ్రముగా ఇండు." అని అక్కడనే ఉన్న పురుషులను ఆజ్ఞాపించెను.(47)

పిదప రాముడు నారచీరను ఉత్తరీయముగా ధరించి, సాయంకాలసంధ్యను అర్చించి, స్వయముగా లక్ష్మణుడు తీసుకొని వచ్చిన ఉదకమును మాత్రమే ఆహారముగా గ్రహించెను. భార్యాసమేతు డై, నేలపై పరుండిన ఆ రాముని పాదములు కడిగి, లక్ష్మణుడు వృక్షమువద్దకు వచ్చి నిలచెను.(48, 49)

గుహుడు కూడ ధనుర్ధారి యై, లక్ష్మణసుమంత్రులతో మాట లాడుచూ రాముని సంరక్షణము నిమిత్తము సావధానచిత్తుడై, మేల్కొని ఉండెను. బుద్ధిమంతుడూ, యశఃశాలి, మహాత్ముడూ అయిన ఆ రాముడు ఎన్నడును దుఃఖములను అనుభవించి యుండలేదు. సుఖములకే అలవాటుపడి ఉండెను. ఆ రోజున ఆ విధముగా నేలపై పండుకొని ఉన్న అట్టి రామునకు రాత్రి చాల ఆలస్యముగా గడచిన ట్లుండెను. (50,51)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏబదవ సర్గము సమాప్తము.

ఏబది ఒకటవ సర్గము

నిషాదరాజైన గుహుని సమక్షమున లక్ష్మణుడు విలపించుట.

అన్నగారి రక్షణకొరకై మేల్కొని యున్న లక్ష్మణునితో, గుహుడు దుఃఖపీడితుడై కపటము లేని వాక్యమును పలికెను.(1)

"నాయనా! సుఖకర మైన ఈ శయ్య నీకొరకై ఏర్పరుపబడినది. నీవు దీనిపై సుఖముగా విశ్రాంతి తీసుకొనుము. మే మందరము శ్రమకు అలవాటుపడిన వాళ్ళము. నీవు సుఖమునకు అలవాటు పడినవాడవు. రాముని రక్షణకొరకై మేము రాత్రి యంతయు మేల్కొనెదము.(2,3)

నాకు ఈ లోకములో, రామునికంటె ఇష్టుడు మరెవ్వడును లేడు. నేను సత్యముపై ఒట్టు పెట్టి నిజముగా చెప్పుచున్నాను. ఈ రాముని అనుగ్రహముచే లోకములో గొప్ప కీర్తిని, అధికధర్మమును, అర్థమును పొందవలె నని మాత్రమే కోరుచున్నాను. నేను, నా బంధువులు ధనుస్సు ధరించి, నిద్రపోవుచున్న నా ప్రియమిత్రుడైన రాముని, సీతను కూడ అందరి నుండియు రక్షించెదము. ఎల్లపుడు ఈ అరణ్యములో సంచరించుచున్న నాకు ఇక్కడ తెలియనిది ఏదీ లేదు. గొప్ప

చతురంగబలము వచ్చినను మేము ఎదిరింప గలము."(4-7)

అపుడు లక్ష్మణుడు గుహునితో ఇట్లనెను. "గుహుడా! నీవు ఏ దోషమూ లేని వాడివి. ధర్మమునందు మాత్రమే శ్రద్ధ గల వాడివి. నీవు రక్షించుచుండగా ఇక్కడ మా కేమియు భయములేదు. సీతారాములు ఈ విధముగా నేలపై పరుండి యుండగా నాకు నిద్ర యెట్లు వచ్చును? జీవితము ఎట్లు నిలుచును? సుఖములు ఎట్లు కలుగును? సమస్త మైన దేవాసురులు కూడ యుద్ధమునందు ఎవ్వనిని ఎదురింపజాలరో, అట్టి రాముడు, సీతతో కూడ, తృణములపై ఎట్లు సుఖముగా పరుండి యున్నాడో చూడుము.(8-10)

ఈ రాముడు, దశరథునకు తగిన ఇష్టుడైన పుత్రుడు. కుమారులలో ప్రధానుడు. మంత్రములచేతను, తపస్సులచేతను, అనేకవిధము లైన పరిశ్రమలచేతను లభించినవాడు. అట్టి ఈ రాముడు, అరణ్యమునకు వెళ్ళిపోయిన పిమ్మట, రాజు చిరకాలము జీవించడు. కొద్ది కాలములో ఈ భూమి భర్త లేనిది అయిపోవును; తప్పదు.(11-12)

స్త్రీ లందరును, బిగ్గరగా అరచి, శ్రమ చెంది, ఈ సరికి ఊర్కొని యుందురు. అందుచే రాజగృహమునందు ధ్వను లన్నియు అణగియుండు నని అనుకొనుచున్నాను. కౌసల్య, రాజు, మా తల్లి-వీ రందరు, ఈ రాత్రి జీవించి యుండెద రని నేను భావించను.(13,14)

నాతల్లి శత్రుఘ్నునికొరకు ఎదురుచూచుచు జీవించిన జీవించునేమో కాని వీరు డైన పుత్రుని కన్న కౌసల్య మరణించును అనునదే నాకు దుఃఖమును కల్గించుచున్నది.(15)

అనురాగవంతు లైన జనులతో నిండినదీ, సుఖకర మైనది, లోకమునకు ప్రియము అయిన ఆ అయోధ్యానగరము, ఇపుడు రాజవ్యసనముచే నశించిపోవును. మహాత్ముడు, ప్రియుడు అయిన జ్యేష్ఠపుత్రుడు కనబడక, దూరముగా పోయిన ఆ మహాత్ముడైన రాజు ప్రాణములు శరీరములో ఎట్లు నిలచును? రాజు మరణించిన పిమ్మట కౌసల్య మరణించును. పిదప నా తల్లి కూడ, మరణించును.(16-18)

తా నెంత కాలమునుండియో అనుకొనుచు ఉన్న మనోరథము తీరక, రాముని రాజ్యాభిషిక్తుని చేయజాలక నా తండ్రి మరణించును. కాలము వచ్చి మరణించిన నా తండ్రి యైన రాజునకు భరతాదులు ప్రేతకార్యము లన్నియు చేసి సంస్కరించి కృతార్థులు కాగలరు.(19, 20)

నా తండ్రి రాజధాని యైన అయోధ్యలోని ముంగిళ్ళు అందముగా ఏర్పడి ఉండును. విశాలమైన మార్గములు, చక్కగా విభజింపబడి ఉండును. ఎన్నియో ధనికుల మేడలు, రాజులు నివసించు ప్రాసాదములు, దీనిని అలంకరించును. ఇది శ్రేష్ఠమై వేశ్యలతో ప్రకాశించుచుండును. రథములతోను, అశ్వములతోను, గజములతోను, ఇరుకుగా ఉండి, సమస్తకల్యాణములతో నిండిన ఈ పట్టణమునందు, వాద్యఘోషములు వ్యాపించుచుండును. జనులందరును సంతుష్టులై, ఆరోగ్యవంతులై ఉందురు. జనులు విహరించు ఆరామములు, రాజులు విహరించు ఉద్యానములు అచ్చటచ్చట ఉండును. జనులు సమూహములుగా చేరి అనేకవిధములైన ఉత్సవములు చేసుకొనుచుందురు. అట్టి ఈ నగరములో సుఖముగా కొందరు భాగ్యవంతులు సంచరించుచుందురు.(21-23)

దశరథుడు జీవించునా? మేము వనవాసమునుండి తిరిగి వచ్చి ఉత్తమము లైన వ్రతములను పాటించు, ఆ మహాత్ముని మరల చూడగల్గెదమా? రాముడు వనవాసము పూర్తి చేసుకొనిన పిమ్మట, మే మందరము, క్షేమవంతులై, తన ప్రతిజ్ఞను సత్యము చేసుకొనిన దశరథునితో, అయోధ్యలో ప్రవేశించగలమా?" (24,25)

మహాత్ము డైన ఆ లక్ష్మణుడు, దుఃఖార్తుడై ఈ విధముగా దీనాలాపములు చేయుచు, నిలబడి ఉండగానే రాత్రి గడిచిపోయినది. ప్రజలకు హితు డైన లక్ష్మణుడు, పెద్దలయందు ప్రేమతో పలికిన, సత్య మైన ఆ మాటలు విని గుహుడు దుఃఖముచే పీడితుడై మనోవ్యథతో బాధపడుచు, జ్వరముతో బాధపడుచున్న ఏనుగు వలె, కన్నీటిని విడిచెను.(26, 27)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏబది ఒకటవ సర్గము సమాప్తము.

ఏబది రెండవ సర్గము

రామాదులు నావచే గంగను దాటి వత్సదేశమును చేరుట.

రాత్రి తెల్లవారిన పిమ్మట, మహాతేజశ్శాలి యైన రాముడు, ఉత్తమలక్షణములు గల లక్ష్మణునితో,(1)

"నాయనా! పూజ్యురా లైన రాత్రి గడిచినది. సూర్యోదయము ఆసన్నమైనది. చాల నల్లని పక్షి యైన ఈ కోకిల కూయుచున్నది. వనములో నెమళ్ళు కూయుచున్న

ధ్వని కూడ వినబడుచున్నది. ఓ సౌమ్యుడా! శీఘ్రముగా ప్రవహించునది, సాగరమును చేరునది యైన గంగానదిని దాటెదము." అని పలికెను.(2, 3)

లక్ష్మణుడు, రాముని మాట విని, గుహుని సుమంత్రుని పిలచి వారి కా విషయము చెప్పి రాముని ఎదుట నిలచెను.(4)

గుహుడు రాముని మాట విని, దాని ప్రకారము, వెంటనే తన మంత్రులను పిలిచి,(5)

"సులభముగా దాటుటకు వీ లైనది, దృఢ మైనది, సమర్థు లైన నడుపువారూ, చుక్కాని పట్టువారూ ఉన్నది, అయిన అందమైన నావను రామునికొరకు శీఘ్రముగా రేవులోనికి తీసుకొని రండి." అని ఆదేశించెను.(6)

గుహుని అమాత్యులు, అతని ఆజ్ఞ విని, ఒక అంద మైన నావను తీసుకొని వచ్చి, ఆ విషయమును గుహునకు తెలిపిరి.(7)

అపుడు గుహుడు చేతులు మోడ్చి నమస్కరించుచు, రామునితో- 'ఓ ప్రభూ! ఇదిగో నావ వచ్చినది. ఇంక నీకేమి చేయుదును? రామా! నీవు దేవతాపుత్రులతో సమానుడవు. పురుషశ్రేష్ఠుడవు. ఈ గంగానదిని దాటుటకై, నీకు నావ సిద్ధముగా ఉన్నది. నీవు ఈ నావ నెక్కుము." అనెను.(8, 9)

రాముడు గుహునితో "నేను కోరిన విధముగా చేసితివి. మమ్ములను నావ ఎక్కించుము." అని పలికెను. పిమ్మట రామలక్ష్మణులు, అంబుల పొదులను, ఖడ్గములను కట్టుకొని, ధనుర్ధారులై, సీతతో కూడి గంగ వైపు వెళ్ళిరి.(10, 11)

సుమంత్రుడు చేతులు మోడ్చి సవినయముగా ధర్మవేత్త యైన రాముని వద్దకు వెళ్ళి, 'ఇపుడు నే నేమి చేయవలెను.' అని అడిగెను.(12)

ఆ మాట విని రాముడు సుమంత్రుని కుడిచేతితో స్పృశించుచు, "ఓ సుమంత్రా! అయోధ్యకు తిరిగి వెళ్ళి రాజు విషయమున ఏమరిపాటు లేక ఆయనను చూచుకొనుచుండుము. నా కింత సాహాయ్యము చేసినావు కదా! ఇంక రథమును విడచి కాలినడకచే అరణ్యమునకు వెళ్ళెదను. నీవు మరలి వెళ్ళుము." అని పలికెను.(13, 14)

వెనుకకు మరలి పోవుటకై రాముడు తనకు అనుజ్ఞ ఇచ్చినట్లు తెలిసికొని సుమంత్రుడు, పురుషశ్రేష్ఠుడైన ఆ రామునితో,(15)

"నీవు సోదరునితోను, భార్యతోను కలసి సామాన్యజనుడు వలె అరణ్యములో నివసింపనున్నావు. దీనిని ఈ లోకములో ఏ ఒక్కడును అతిక్రమింపజాలడు. ఇట్టి పని ఏ ఒక్కడును చేయజాలడు. నీకే ఇట్టి కష్టము వచ్చుట చూడగా బ్రహ్మచర్యానికి గాని, వేదాధ్యయనమునకు గాని, మృదుత్వమునకు గాని, ఋజుత్వమునకు గాని ఫలమే లేదని తోచుచున్నది. సీతతోను, సోదరునితోను, వనములో నివసించు నీవు, మూడు లోకములను జయించి నట్లు సద్గతిని పొందగలవు.(16-18)

మేమే చాలా దురదృష్టవంతులము. ఎందుచేతననగా నీకు దూరమై దుఃఖించుచు, పాపాత్మురా లైన, కైకేయికి వశులమై ఉండవలసి యున్నది." అని పలికెను.(19)

సుమంత్రుడు ఈ విధముగా పలుకుచు, తనకు ప్రాణతుల్యు డైన రాముడు దూరముగా వెళ్ళుట చూచి, దుఃఖార్తుడై చాలసేపు ఏడ్చెను. కన్నీరు తగ్గిన పిమ్మట ఆచమనము చేసి పరిశుద్ధుడై ఉన్న ఆ సూతునితో, రాముడు, మధురముగా మాటిమాటికి ఇట్లు పలికెను.(20, 21)

ఇక్ష్వాకువంశమువారికి నీ వంటి మిత్రు డెవ్వడును లేడు. దశరథమహారాజు, నన్ను గూర్చి విచారించకుండు నట్లు చేయుము. రాజు మనస్సు శోకావేశముచే పీడింపబడి యున్నది. అతడు వృద్ధుడు. కామభారముచే క్రుంగిపోయినవాడు. అందువలననే ఇట్లు చెప్పుచున్నాను. కైకేయికి ఇష్ట మైన కోరికను తీర్చుటకై మహాత్ము డైన ఆ రాజు ఏమేమి ఆజ్ఞాపించినను, దానిని నిస్సంశయముగా చేయుచుండవలయును.(22-24)

రాజులు రాజ్యములను పరిపాలించుచున్నా రనగా, అన్ని కార్యములందును వారి ఆజ్ఞ అప్రతిహతముగా ఉండుటవలననే కదా. ఆ మహారాజు, తాను ఆజ్ఞాపించినది, వ్యర్థమైనదే అని అనుకొనకుండునట్లును, దుఃఖముతో బాధపడకుండునట్లును చేయుచుండుము.(25,26)

పూర్వ మెన్నడును ఇట్టి దుఃఖము చూడనివాడు, వృద్ధుడు, పూజ్యుడు, జితేంద్రియుడు అయిన రాజుకు, నా పక్షమున నమస్కరించి నా మాటగా ఇట్లు చెప్పుము.(27)

"అయోధ్యను విడచి అరణ్యములో నివసింపవలసి వచ్చినదే అని నేను గాని, లక్ష్మణుడు గాని, సీత గాని ఏ మాత్రము దుఃఖించుటలేదు. పదునాలుగు సంవత్సరములు గడచిన పిమ్మట, లక్ష్మణుడు, నేను, సీత తిరిగి వచ్చెదము. అపుడు

నీవు, మమ్ములను నిత్యము చూచుచుండవచ్చును."(28, 29)

ఓ సుమంత్రా! రాజుతో ఇట్లు చెప్పి, మా తల్లిని సమస్తమైన ఇతరరాజభార్యలను, కైకేయిని, మేము మరల మరల ఆరోగ్యమును గూర్చి ప్రశ్నించి నట్లు చెప్పి, పిదప కౌసల్యకు నేను, లక్ష్మణుడు, సీత పాదాభివందనము చేసినట్లు తెలుపుము. మేము పాదాభివందనము చేసినట్లు మహారాజుకు కూడ చెప్పుము. భరతుని శీఘ్రముగా తీసుకొని రమ్ము. వచ్చిన ఆ భరతుని రాజుకు సమ్మతమైన రాజ్యాధికారమునందు స్థాపింపుము. భరతుని కౌగిలించుకొని, అతనిని యౌవరాజ్యమునందు అభిషిక్తుని చేసిన పిదప, నీకు మా కష్టములవలన కల్గిన దుఃఖము ఉండదు.(30-33)

భరతునితో ఇట్లు చెప్పవలెను- 'రాజు విషయములో ఎట్లు ప్రవర్తించుచుందువో, అందరు తల్లుల విషయములో కూడ ఎట్టి భేదబుద్ధియు లేక ఆ విధముగనే ప్రవర్తించుచుండుము. నీకు కైకేయి ఎట్లో, సుమిత్ర ఎట్లో, రాణియు, విశేషించి అందులోను నా తల్లియు అయిన కౌసల్య కూడ అట్లే. తండ్రి ఇష్టమును చేయుటకై యౌవరాజ్యమును స్వీకరించి, నీవు ఇహపరములు రెండింటియందును సుఖమును పెంచుకొనుటకు శక్యమగును'.(34-36)

రామునిచే వెనుకకు పంపబడు చున్న ఆ సుమంత్రుడు, శోకముతో కృశించి, ఆ మాటలన్నియు విని, స్నేహపూర్వకముగా రాముని.(37)

"నేను నీపై నున్న స్నేహముచే సంకోచము లేకుండగా ఉపచారములు లేని ఏ మాటలు చెప్పుచున్నానో వాటిని ఈతడు మన భక్తుడు కదా, యను భావముతో నీవు క్షమించవలెను. నీ వియోగముతో పుత్రశోకముచే బాధపడు చున్నట్లు బాధపడు చున్న ఆ అయోధ్యానగరమునకు నీవు లేకుండ నేను తిరిగి ఎట్లు వెళ్ళగలను?(38,39)

ఆ నాడు, రాము దున్న రథమును చూచి కూడ ప్రజలు అంతగా దుఃఖించిరి. నేడు రాముడు లేని రథముతో వెళ్ళినచో దానిని చూచి ఆ పౌరుల హృదయములు బ్రద్దలై పోవచ్చును కూడ.(40)

యుద్ధములో వీరుడు మరణించగా సారథిమాత్రమే మిగిలిన, తమ రథమును చూచి, సైన్యము దుఃఖించినట్లు నీవు లేని ఈ రథమును చూచి, ఆ నగరము, దైన్యమును పొందును.(41)

ఇపుడు అయోధ్యలోని ప్రజ లందరు దూరములో నివసించుచున్నను మనస్సుచే ఎదుటనే ఉన్న నిన్ను గూర్చి చింతించుచు ఆహారము లేక ఉందురు. రామా! నీ

ప్రవాససమయమునందు నిన్ను గూర్చిన శోకముతో బాధపడుచున్న ప్రజలు ఏ విధముగా క్షోభ చెంది ప్రవర్తించినారో అది నీవే చూచితివి కదా! నీవు వనమునకు ప్రయాణ మై వచ్చు సమయమున, పౌరులు ఎంత ఆర్తనాదము చేసినారో, దానికి నూరురెట్లు ఆర్తనాదమును, ఈ రథమును, నన్నును చూడగనే చేయుదురు.(42-44)

"నీ కుమారుని మేనమామ ఇంటికి తీసుకొని వెళ్ళినాను. దుఃఖించకుము." అని నేను కౌసల్యదేవితో చెప్పవలెనా! నేను, ప్రియమైనను ఇట్టి అసత్యమైన వాక్యమును చెప్పజాలను. 'నీ కుమారుని అరణ్యములో విడిచితిని.' అను అప్రియమైన ఈ సత్యవాక్యమునూ ఆమెతో చెప్పజాలను.(45, 46)

నిన్ను, సీతాలక్ష్మణులను ఇంతవరకు తీసుకొనివచ్చిన, నా అదుపులో ఉన్న ఈ శ్రేష్ఠము లైన గుఱ్ఱములు నీవు లేని రథమును ఎట్లు తీసుకొని వెళ్ళును?(47)

ఈ కారణముచే నేను అయోధ్యకు తిరిగి వెళ్లజాలను. నీ వెనుకనే అరణ్యమునకు వచ్చుటకు నాకు అనుజ్ఞ ఇమ్ము. నేను, ఇంతగా ప్రార్థించుచున్నను, నీవు నన్ను విడిచివేసినచో, నేను వెంటనే రథముతో కూడ, ఇక్కడనే అగ్నిలో ప్రవేశించెదను.(48,49)

అరణ్యములో నీ తపస్సుకు విఘ్నము కల్గించు మృగములను రథముచేత నివారించెదను. నేను నీ అనుగ్రహముచే నీ రథమును నడుపు సుఖమును పొంది యుంటిని. ఇపుడు నీ అనుగ్రహముచేతనే వనవాససుఖమును కూడ పొందదలచు చున్నాను. నన్ను అనుగ్రహింపుము. నేను అరణ్యములో నీ సమీపమునందే ఉండవలెనని కోరుచున్నాను. "నీవు సమీపమునందే ఉండుము." అని నీవు ప్రేమపూర్వకముగా చెప్పగా వినవలె నని కోరుచున్నాను.(50-52)

నీవు వనములో నివసించుచుండగా ఈ గుఱ్ఱములు నీకు సేవ చేసినచో, వాటికి కూడ, ఉత్తమగతి లభించును. నేను అన్ని విధముల అయోధ్య నైనను, దేవలోకము నైనను విడచి, వనములో నివసించుచు నీకు శిరస్సుతో నమస్కరించుచు, శుశ్రూష చేసెదను. పాపాత్ముడు దేవేంద్రుని రాజధాని యైన అమరావతిలోనికి ఎట్లు ప్రవేశింపజాలడో, అట్లే నీవు లేకుండగా నేను అయోధ్యలో ప్రవేశింపజాలను.(53-55)

వనవాసము పూర్తి యైన పిమ్మట ఇదే రథము ఎక్కించి, నిన్ను అయోధ్యాపురికి తీసుకొని వెళ్ళవలెను అనునదియే నా కోరిక. వనములో నీ సన్నిధిలో ఉన్నచో నాకు పదునాలుగు సంవత్సరములు క్షణములవలె గడచిపోవును. అట్లు కానిచో, వంద

సంవత్సరముల వలె అగును. భృత్యులయందు ప్రేమ గల ఓ రామా! నేను నా ప్రభువు పుత్రుడ వైన నీవు వెళ్ళుచున్న మార్గముననే వెళ్ళగోరుచున్నాను. నీ భక్తుడను. భృత్యుడను. మర్యాద కాపాడువాడను. అట్టి నన్ను విడువవద్దు." అని ప్రార్థించెను.(56-58)

ఇట్లు మాటి మాటికి, అనేక విధముల ప్రార్థించుచున్న, దీను డైన ఆ సుమంత్రునితో భృత్యులపై జాలి కల రాముడు ఇట్లనెను.(59)

సుమంత్రా! నీవు ప్రభువులపై ప్రేమగలవాడవు. నీకు నాపై ఎంత గొప్ప భక్తి ఉన్నదో నేను ఎరుగుదును. నిన్ను ఇక్కడనుండి, పట్టణమునకు ఎందుకు పంపుచున్నానో వినుము. నీవు అయోధ్యకు తిరిగి వెళ్ళగా, నిన్ను చూచినచో మా పినతల్లి యైన కైకేయికి రాముడు అరణ్యమునకు వెళ్ళినాడు అని నమ్మకము కలుగును. నేను వనవాసమునకు వెళ్ళుటచే కైకేయి సంతోషించును. ధార్మికుడైన రాజును గూర్చి ఇతడు అసత్యము చెప్పుచున్నాడు అను శంకను విడుచును.(60-62)

మా పినతల్లి, తన పుత్రు డైన భరతునిచే రక్షింపబడిన విశాల మైన రాజ్యమును పొందవలెను అనునదియే నాకు చాల ముఖ్యమైన విషయము. నీవు ఈ రథమును తీసుకొని నగరమునకు వెళ్ళినచో, నాకును, రాజునకును కూడ ప్రియమును చేసినవాడవు అగుదువు. నీకు ఏ యే విషయములు చెప్పినానో వాటిని అన్నింటిని ఆ విధముగా చేయుము." అని పలికెను.(63, 64)

ధైర్యవంతు డైన రాముడు సుమంత్రునితో ఇట్లు పలికి, మాటిమాటికి అతనిని ఓదార్చి, గుహునితో యుక్తియుక్త మగు వాక్యము పలుకుచు,.(65)

"గుహుడా! నే నిపుడు, జను లున్న వనములో నివసించగూడదు. నేను ఆశ్రమమునందు మాత్రమే నివసించవలెను. అందుచే దానికి తగిన విధానము చేయబడు గాక. నా తండ్రికి, సీతకూ, లక్ష్మణునకూ హితమును కోరుచున్న నేను, మునులకు అలంకార మైన నియమమును అవలంబించి, జటాధారినై, వెళ్ళెదను. మఱ్ఱిపాలు తెమ్ము." అనెను.(66, 67)

గుహుడు వెంటనే ఆ క్షీరమును తీసుకొని వచ్చి, రాముని కిచ్చెను. రాముడు ఆ పాలతో తనకును, లక్ష్మణునకును జటలు కట్టెను. ఆజానుబాహు వైన ఆ పురుషశ్రేష్ఠుడు, జటాధారి అయ్యెను. అప్పుడు నారచీరలు కట్టి, జటామండలమును ధరించిన ఆ సోదరు లైన రామలక్ష్మణులు, ఋషుల వలె శోభించిరి.(68-70)

పిమ్మట, లక్ష్మణునితో కూడ విఖనస్సు అను మహర్షి ప్రతిపాదించిన వానప్రస్థమార్గమును అవలంబించి, ఆ వ్రతమును పాలించుట ప్రారంభించెను. రాముడు మిత్రుడైన గుహునికి, "గుహుడా! సైన్యము, ధనాగారము, దుర్గము, దేశము-వీటి విషయమున ఏమాత్రము ఏమరుపాటు లేకుండగా ఉండుము. రాజ్యము పాలించుట అనునది చాల కష్టమైన దని పెద్దలు చెప్పుదురు కదా!" అని బోధించెను.(71,72)

పిమ్మట, రాముడు గుహుని వీడుకొల్పి, వ్యాకులత్వము చెందక, భార్యాలక్ష్మణసమేతు డై శీఘ్రముగా వెళ్ళెను.(73)


నది ఒడ్డున ఉన్న నావను చూచి లక్ష్మణునితో, "లక్ష్మణా! నావ నిలచియున్నది. దానిని మెల్లగా ఎక్కుము. పిదప సీతను కూడ చేయి పట్టుకొని ఎక్కించుము." అనెను.(74, 75)

బుద్ధిమంతుడైన లక్ష్మణుడు ముందుగా సీతను ఎక్కించి పిదప తాను ఎక్కెను. తేజఃశాలి యైన రాముడు కూడ నావ నెక్కిన పిమ్మట, నిషాదాధిపతి యైన గుహుడు "నావను అవలి ఒడ్డు చేర్చుడు." అని తన బంధువులను ఆజ్ఞాపించెను. రాముడు తన శ్రేయస్సును కోరుచు, బ్రాహ్మణక్షత్రియులు రెండు జాతుల వారును సాధారణముగ జపింపదగిన "దైవీం నావమ్" అను నావ నెక్కు నపుడు జపించు మంత్రమును జపించెను. పిమ్మట రాముడు, సీత, లక్ష్మణుడును యథాశాస్త్రముగా అచమనము చేసి ఆ నదికి నమస్కరించిరి. రాముడు సుమంత్రునీ, సైన్యసహితు డైన గుహునీ వీడ్కొలిపి, నావలో కూర్చుండి, 'నావ నడుపుడు.' అని నావికులను ఆదేశించెను.(76-80)

చుక్కాని పట్టువాడు చక్కగా చుక్కాని పట్టగా, నావికులు మంచి తెడ్లతో త్రోయగా ఆ నావ శీఘ్రముగా జలమును దాటెను.(81)

నావ గంగానది మధ్యను చేరిన పిమ్మట సీత చేతులు జోడించి,(82)

"ఓ గంగాదేవీ! ధీమంతుడైన దశరథమహారాజు కుమారు డైన ఈ రాముడు నీచేత రక్షింపబడుచు, సోదరునితోను, నాతోను కలసి పదునాలుగు సంవత్సరములు పూర్తిగా అరణ్యవాసము చేసి, తండ్రి యాజ్ఞను పాలించి, మరల వచ్చును. సౌందర్యవతి వైన ఓ గంగాదేవీ! అప్పుడు కోరిక లన్నియు, సఫలములై ఆనందముతో నేను క్షేమముగా తిరిగి వచ్చి, నిన్ను పూజించెదను. స్వర్గ భూలోక పాతాళములందు మూడింటియందును ప్రవహించుటచే నీవు బ్రహ్మలోకముతో సంబంధించి



ఉన్నావు. ఈ లోకమునందు సముద్రుని భార్యవుగా కనబడుచున్నావు. మంగళప్రదురాల వైన ఓ గంగాదేవీ! నిన్ను నమస్కరించి స్తుతించుచున్నాను. పురుషశ్రేష్ఠుడైన రాముడు, సుఖముగా తిరిగి వచ్చి, రాజ్యమును పొందిన పిమ్మట, నీ సంతోషమునకై బ్రాహ్మణులకు, లక్షలకొలది గోవులను, వస్త్రములను, మంచి అన్నమును ఇచ్చెదను. వనవాసము నుండి తిరిగి వచ్చిన పిమ్మట, నేను నియమవంతురాలనై నీకు వెయ్యి కుండల కల్లు, మాంసరూపమైన ఆహారము, సమర్పించి పూజించెదను. నీ తీరములపై ఉన్న సమస్తదేవతలను, తీర్థములను, దేవాలయములను కూడ పూజించెదను. ఓ పుణ్యాత్మురాలా! పాపరహితుడు, మహాబాహువు అయిన రాముడు, నాతోను సోదరునితోను కలసి, వనవాసమునుండి తిరిగి వచ్చి, మరల అయోధ్యలో ప్రవేశించుగాక." అని ఆ గంగానదిని ప్రార్థించెను. (83-91)

సీత ఇట్లు పలుకుచుండగా నావ శీఘ్రముగా దక్షిణమువైపు నున్న తీరమును చేరెను. రాముడు తీరమును చేరిన పిమ్మట ఆ నావను విడచి, సోదరునితోను సీతతోను కలిసి నడిచి వెళ్ళెను. (92,93)

పిదప రాముడు, లక్ష్మణునితో- "జనులున్న ప్రదేశమునందైనను, లేని ప్రదేశమునందైనను రక్షణము విషయమున జాగ్రత్తగా ఉండుము. పూర్వ మెన్నడును చూడని ఈ జనశూన్యమైన అరణ్యములో మనము తప్పక రక్షణవిషయమున జాగ్రత్తతో ఉండవలెను. లక్ష్మణా! నీవు ముందు నడువుము. సీత వెనుక నడచును. నేను నిన్ను, సీతను రక్షించుచు, వెనుక నడచెదను. మనము ఇక్కడ ఒకరి నొకరు

రక్షించుకొనవలెను.(94-96)

ఏ పని యైనను, చేయి దాటి పోయినచో, దానిని మరల సరిచేయుట శక్యము గాదు. వనవాసములోని కష్టములను గూర్చి ఇటు పైన, సీతకు అర్థమగును. ఈ వనములో జనసమ్మర్దము కాని, పొలములు గాని, ఉద్యానవనములు గాని ఉండవు. మిట్టపల్లములు, లోతైన లోయలు ఉండును. అట్టి వనములోనికి సీత ఈనాడు ప్రవేశించగలదు." అని పలికెను.(97, 98)

లక్ష్మణుడు, రాముని మాట ప్రకారము ముందుగా నడచెను. రాముడు సీత వెనుక నడచెను.(99)

దీను డైన ఆ సుమంత్రుడు, గంగ అవతలి ఒడ్డుకు శీఘ్రముగా చేరిన రాముని, కంటికి కనబడునంతవరకు చూచుచునే ఉండి మార్గము దీర్ఘమై పోవుటచే కనబడక, దృష్టిని మరల్చి దుఃఖితుడై కన్నీరు కార్చెను.(100)

లోకపాలురతో సమానమైన ప్రభావము కలవాడు, మహాత్ముడు, వరముల నిచ్చువాడు అయిన ఆ రాముడు గంగానదిని దాటిన పిమ్మట, నడిచి వెళ్ళుచు, ఉత్తమమైన సస్యసముదాయములతో నిండినది, ఐశ్వర్యములతో సమృద్ధమైనది, సంతోషించిన జనులు కలది యైన, వత్సదేశమును చేరెను.(101)

ఆకలిగొన్న ఆ రామలక్ష్మణులు, అక్కడ వరాహము, ఋష్యము, దుప్పి, నల్లచారల దుప్పి యను నాలుగు మహామృగములను చంపి, వాటి పరిశుద్ధమైన మాంసమును తీసుకొని, సాయంకాలము కాగానే రాత్రి నివసించుటకు ఒక చెట్టు మొదలు చేరిరి.(102)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏబది రెండవ సర్గము సమాప్తము.

ఏబది మూడవ సర్గము

రాముడు లక్ష్మణుని అయోధ్యకు పంప ప్రయత్నించుట, లక్ష్మణుడు తిరస్కరించుట.

ఆనందింపచేయువారిలో శ్రేష్ఠుడైన రాముడు వృక్షమూలము చేరి, పడమటి సంధ్యను ఉపాసించి, లక్ష్మణునితో,(1)

"ఇపుడు మనము మన దేశము బయటకు వచ్చినాము. సుమంత్రుడు కూడ

వెళ్ళిపోయినాడు. ఇటుపై మనము ఒంటరిగా ఉండవలసిన రాత్రులలో, ఇది మొదటిది. నీవు దుఃఖింపకుము. నేడు మొదలు మన మిద్దరము రాత్రులందు మేల్కొని యుండవలెను. సీత క్షేమము మన యిద్దరి పైననే ఆధారపడియున్నది కదా! ఏవియో పర్ణాదులు స్వయముగా తెచ్చుకొని, భూమిపై పరచుకొని, పరుండి, ఈ రాత్రి ఏదో విధముగా గడపెదము." అనెను.(2-4)

ఉత్తమమైన పాన్పుపై పరుండుటకు అలవాటు పడిన ఆ రాముడు నేలపై పరుండి, లక్ష్మణునితో ఈవిధముగా మంచి మాటలు చెప్పెను.(5)

"లక్ష్మణా! మహారాజునకు ఇపుడు దుఃఖముతో నిద్రపట్టదు. కైకేయి మాత్రము తన కోరిక తీరుటచే సంతోషించుచుండును. ఆ కైకేయి భరతుడు వచ్చిన పిమ్మట రాజ్యముకొరకై మహారాజు ప్రాణములు తీసివేయదు కదా! ఆ రాజు కామబుద్ధి కలవాడై, కైకేయికి లొంగిపోయినాడు. ఇపుడు నానుండి కూడ దూర మైనాడు. దిక్కు లేక, వృద్ధు డై ఉన్న ఆ రాజు ఏమి చేయగలడు?(6-8)

ఈ కష్టమును, రాజు బుద్ధిలో కలిగిన ఈ భ్రాంతిని చూడగా, అర్థధర్మములకంటె కూడ కామమే గొప్పదని నాకు అభిప్రాయము కలుగుచున్నది. మన తండ్రి నన్ను విడచివేసి నట్లు, ఎంత తెలివితక్కువ వాడైనను, మరొకడు ఎవరైనా ఆడుదాని మాట విని, తన యిష్టము ప్రకారము ప్రవర్తించు కుమారుని విడిచిపెట్టునా!(9,10)

కైకేయి కుమారుడైన భరతు డొక్కడే భార్యాసహితుడై మహారాజు వలె ఐశ్వర్యసమృద్ధ మైన కోసలదేశమును సుఖముగా అనుభవింపగలడు. రాజు వయస్సుచేత మరణించును. నేను అరణ్యములో ఉన్నాను. అందుచే ఆ భరతుడు రాజ్యమునకు అంతకును ప్రధాను డైన రాజు కాగలడు.(11, 12)

అర్థధర్మములు విడిచి కామమునే అనుసరించువాడు, దశరథమహారాజు వలె శీఘ్రముగనే ఆపదలలో చిక్కుకొనును. ఈ కైకేయి, దశరథుని చావునకును, నా వనగమనకును, భరతుని రాజ్యమునకును, మన యింట చేరినదని అనుకొనుచున్నాను. (13,14)

కైకేయి తనకు కలిగిన సౌభాగ్యముచే గర్వించి, ఒళ్ళు తెలియక నా మూలమున కౌసల్యను, సుమిత్రను కూడ బాధించదు కద! లక్ష్మణా! నా మూలమున సుమిత్రాదేవి కూడ దుఃఖపడకుండుగాక! అందుచే నీవు ప్రాతఃకాలముననే లేచి ఇక్కడినుండియే అయోధ్యకు వెళ్ళిపొమ్ము. నే నొక్కడనే సీతతో కలసి, దండకారణ్యమునకు వెళ్ళెదను. అనాథురాలైన కౌసల్యను నీవు రక్షించుము. నీచమైన కార్యములను చేయు కైకేయి,

నా తల్లి విషయమున న్యాయవిరుద్ధముగా ప్రవర్తించవచ్చును. అందుచే మా తల్లిని ధర్మములు తెలిసిన భరతునకు అప్పచెప్పుము. (15-18)

పూర్వజన్మలో ఎప్పుడో నా తల్లి, స్త్రీలను తమ పుత్రులనుండి దూరము చేసినది. అందువలననే ఈ కష్టము వచ్చినది; నిజము. నన్ను చిరకాలము పోషించి, కష్టపడి పెంచిన నా తల్లి, నావలన ఫలమును పొందవలసిన సమయమున నానుండి దూరము చేయబడినది. నేనెంత వ్యర్థజన్ముడను! నేను నా తల్లికి అనంతమైన శోకమును కలిగించుచున్నాను. ఏ ఆడుదీ కూడ నావంటి పుత్రుని కనకుండుగాక. (19-21)

లక్ష్మణా! నా వనవాసము మాట వినగానే గోరువంకపిట్ట "ఓ చిలుకా! శత్రువైన కైకేయి పాదమును కొరకుము." అని చిలుకతో పలికినది. ఆ శారికకు కౌసల్యపై నాకున్న ప్రీతికంటె ఎక్కువ ప్రీతి ఉన్న దని తలచెదను. (22)

నేను తప్ప వేరు పుత్రు లెవ్వరును లేని అల్పభాగ్యురా లైన నా తల్లి ఏడ్చుచుండగా ఏవిధముగాను ఉపకారము చేయజాలని నేను పుత్రుడనై ఉండి ఏమి ప్రయోజనము? దురదృష్టవంతురా లైన నా తల్లి కౌసల్య, నేను దగ్గర లేకపోవుటచే అత్యధిక మైన దుఃఖముచేత పీడితురా లై, శోకసాగరమునందు మునిగి పడియుండును. (23,24)

లక్ష్మణా! కోపించినచో, నేను ఒక్కడనే బాణములతో అయోధ్యను, ఈ భూమి నంతను గూడ సాధించగలను. కాని ఇది పరాక్రమము చూపు సందర్భము కాదు కదా!"(25)

రాముడా రాత్రి, విజన మైన వనమునందు, ఈ మాటలూ, మరి కొన్ని మాటలూ దైన్యముతో పలుకుచు, కన్నీళ్ళతో నిండిన ముఖము కలవాడై, మాటలాడక, కూర్చుండెను. ఈ విధముగా విలపించిన పిమ్మట మంటలు లేని అగ్నివలె, వేగము లేని సముద్రము వలె ఊర కున్న ఆ రాముని లక్ష్మణుడు ఓదార్చెను. (26-28)

"శస్త్రధారులలో శ్రేష్ఠుడవైన ఓ రామా! నీవు విడిచి వెళ్ళిపోవుటచే, అయోధ్యానగరము ఇపుడు చంద్రుడు లేని రాత్రి వలె కాంతివిహీనమై ఉండును; నిశ్చయము. (29)

నీ విట్లు దుఃఖించుట యుక్తము కాదు. నీ విట్లు చేయుటచే నాకును, సీతకును కూడ దుఃఖము కలుగును. నీ సాన్నిధ్యము లేనిచో సీత గాని, నేను గాని, నీటి నుండి పైకి తీసిన మత్స్యములు వలె క్షణకాలమైనను, జీవింపజాలము. నిన్ను విడచి,

తండ్రిని గాని, శత్రుఘ్నుని గాని, సుమిత్రను గాని, స్వర్గమును గాని, చూడవలెనను కోరిక నాకు లేదు". (30-32)

అక్కడ సుఖముగా కూర్చొని యున్న ధర్మాత్ములైన ఆ రామలక్ష్మణులు, దగ్గరనే మఱ్ఱిచెట్టు క్రింద చక్కగా అమర్చిన శయ్యను చూచి దానిపై పండుకొనిరి. రాముడు లక్ష్మణుడు చెప్పిన ఉత్తమములు, అర్థసంపూర్ణములు అయిన మాటలు సాదరముగా విని, చిరకాలము వానప్రస్థధర్మము అవలంబించి, పదునాలుగు సంవత్సరములు పూర్తిగా వనవాసము చేయ నిర్ణయించెను. అప్పుడు మహాబలశాలు లైన రామలక్ష్మణులు జనశూన్య మైన అరణ్యములో కూడ, పర్వతముల చరియలపై సంచరించు రెండు సింహముల వలె, ఏ మాత్రము భయము గాని, తొందర గాని లేకుండ ఉండిరి. (33-35)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏబది మూడవ సర్గము సమాప్తము.

ఏబది నాలుగవ సర్గము

రాముడు భరద్వాజాశ్రమమునకు పోవుట. భరద్వాజముని వారిని చిత్రకూటమున నివసింపుడని అనతిచ్చుట.

సీతారామలక్ష్మణులు మంగళకరమైన ఆ రాత్రి యంతయు మహావృక్షము క్రింద ఉండి, మరునాడు, సూర్యుడు ఉదయించిన పిమ్మట, ఆ ప్రదేశమును విడచి వెళ్ళిరి. ఆ గొప్ప అరణ్యమును ప్రవేశించి, అక్కడక్కడ అనేకవిధము లైన భూమిభాగములను, పూర్వ మెన్నడును చూడని అందమైన దేశములను చూచుచు, యమునానది గంగానదిలో ప్రవేశించిన ప్రదేశము వైపు వెళ్ళిరి. (1-3)

రాముడు, కష్టము కలుగకుండు నట్లు మెల్లగా నడచి ప్రయాణము చేయుచు, అనేక విధము లైన వృక్షములను చూచుచు, వెళ్ళి పగలు గడచిన వెంటనే లక్ష్మణునితో ఇట్లనెను. (4)

"లక్ష్మణా! ప్రయాగమునకు చుట్టు భగవంతుడైన అగ్నికి ధ్వజమైన ధూమము ఎత్తుగా కనబడుచున్నది; చూడుము. ఇక్కడ దగ్గరనే భరద్వాజముని ఉన్నాడని తలచెదను. మనము గంగాయమునా సంగమస్థానమును చేరినాము. సందేహము లేదు. ఎందుచేతననగా, నీరు నీటితో కొట్టుకొనుటచే కలుగు శబ్దము వినపడుచున్నది. వనములో లభించు వస్తువులపై ఆధారపడి జీవించువారిచే ఖండింపబడిన ఈ

కఱ్ఱలు ఇచ్చట పడియున్నవి. భరద్వాజాశ్రమములో అనేకవిధములైన ఈ వృక్షములు కనబడుచున్నవి."(5-7)

ధనుర్ధరు లైన, ఆ రామలక్ష్మణులు, సుఖముగా ప్రయాణము చేసి, సాయంకాలసమయమున, గంగాయమునల సంగమమునకు దగ్గరగా ఉన్న భరద్వాజాశ్రమమును చేరిరి. రాముడు, ఆశ్రమసమీపమునకు చేరగానే వారిని చూచి, మృగములు పక్షులును భయపడినవి. రాముడు కొంతదూరము నడచి, భరద్వాజుని ఆశ్రమమును సమీపించెను.(8, 9)

పిమ్మట ఆశ్రమము సమీపించిన సీతారామలక్ష్మణులు, మునిని చూడ వలె నను కోరికతో (కొద్దిసేపు) దూరముగనే నిలిచి యుండిరి.(10)

పిమ్మట రాముడు ఆశ్రమములో ప్రవేశించి అక్కడ శిష్యుల సముదాయములతో కూడి యున్న, మహాత్ము డైన భరద్వాజమహర్షిని చూచెను. ఆ మహర్షి కఠిన మైన వ్రతములను ఆచరించుచు, ఏకాగ్రచిత్తు డై, తపస్సుచేత దివ్యదృష్టిని పొందియుండెను. అతడు నిత్యాగ్నిహోత్రియైన మహాభాగ్యవంతుడు. ఆ మహర్షిని చూచిన వెంటనే, రాముడు, లక్ష్మణుడు, సీత, ఆయనకు నమస్కరించిరి.(11,12)

రాముడు తనను గూర్చి, ఆ భరద్వాజమహర్షికి ఇట్లు తెలిపెను. "ఓ పూజ్యుడా! మేము దశరథుని పుత్రుల మైన రామలక్ష్మణులము. ఈ కల్యాణి నా భార్య; జనకుని కుమార్తె యైన సీత. ఈమె నన్ను అనుసరించి, తపోవనమునకు వచ్చుచున్నది. నా తమ్ముడు, దృఢ మైన నిశ్చయము కలవాడు, నాయందు స్నేహము కలవాడు అయిన ఈ లక్ష్మణుడు తండ్రిచే అరణ్యమునకు పంపబడిన నన్ను అనుసరించి, తాను కూడ అరణ్యమునకు వచ్చినాడు. మేము, తండ్రి యాజ్ఞ ప్రకారము, తపోవనములో నివసించి, అక్కడ దుంపలు, ఫలములు తినుచు, ధర్మమునే ఆచరించుచు ఉండెదము".(13-16)

ధీమంతుడైన ఆ రాముని మాటలు విని, ధర్మాత్ము డైన ఆ భరద్వాజుడు, గోవును, అర్ఘ్యోదకములను, రామునకు సమర్పించుటకు తీసుకొనివచ్చెను. గొప్ప తపస్సు చేసిన ఆ భరద్వాజమహర్షి వారికి వనములో లభించు మూలములతోను, ఫలములతోను, తయారుచేసిన అనేకవిధములైన అన్నములను రసములను ఇచ్చి నివాసము ఏర్పరచెను. అక్కడ, భరద్వాజముని చుట్టును, మృగములు, పక్షులు, మునులు కూర్చుండి యుండిరి. ఆ భరద్వాజుడు తన ఆశ్రమమునకు వచ్చిన రాముని స్వాగతవచనపూర్వకముగా పూజించెను. (17-19)

తా నిచ్చిన పూజను స్వీకరించి యున్న ఆ రామునితో, భరద్వాజుడు ధర్మసమ్మత మైన మాటలు ఇట్లు పలికెను.(20)

"రామా! ఎంతో కాలమునకు ఇక్కడికి వచ్చిన నిన్ను చూడగలుగుచున్నాను. నిన్ను అకారణముగా తండ్రి అరణ్యమునకు పంపె నను విషయమును కూడ విని యున్నాను. ఈ గంగాయమునాసంగమము దగ్గరనున్న ఈ ప్రదేశములో జనసంమర్దము తక్కువగా ఉన్నది. ఈ ప్రదేశము పుణ్యమైనది; సుందరమైనది. నీవు ఇక్కడ సుఖముగా నివసించవచ్చును." (21, 22)

అందరి హితమును కోరు రాముడు, భరద్వాజుని మాటలు విని,(23)

"ఓ పూజ్యుడా! పౌరులు, జానపదులు, ఈ ప్రదేశమునకు చాలా దగ్గరగా నుందురు. ఇక్కడ నన్ను చూచుట సులభమని తెలిసి వారందరును, నన్ను, సీతను చూచుటకై ఈ ఆశ్రమమునకు వచ్చెద రని నా అభిప్రాయము. అందుచే ఇక్కడ నివసించుటకు నాకు ఇష్టము లేదు. సుఖములకు తగిన జనకాత్మజ యైన సీత, సుఖముగా ఉండి విహరింపగల్గునట్టిది, జనసమ్మర్దము లేనిది అగు ప్రదేశమును చూడుము." అని పలికెను.(24-26)

భరద్వాజమహాముని రాముడు పలికిన ఈ మంగళకరమైన మాట విని, తగిన స్థానమును చూపు వాక్యమును పలికెను.(27)

"నాయనా! ఇక్కడనుండి, పదిక్రోశుల దూరములో గంధమాదనపర్వతముతో సమానమైన చిత్రకూట మను పర్వతమున్నది. ఎందరో మహర్షులు నివసించు ఆ పర్వతము పవిత్రమైనది. అన్నివైపుల చూచుటకు ఆనందము కల్గించునది. దానిపై కొండముచ్చులు, వానరములు, ఎలుగుబంటులు, నివసించుచుండును. (క్రూరమృగము లుండవు. అందుచే) అది నీవు నివసించుటకు తగిన స్థానము. మానవుడు ఆ చిత్రకూటపర్వతశిఖరములను చూచుచున్నంతవరకు, మంగళకరములైన కార్యములనే చేయుచుండును. అతని మనస్సు అమంగళకార్యముల వైపు ప్రవర్తించదు.(28-30)

ఆ చిత్రకూటముపై ఎందరో ఋషులు వందల కొలది సంవత్సరములు, తమ శిరస్సులు కపాలములుగా ఎండిపోవునంతవరకు తపస్సు చేసి స్వర్గమునకు వెళ్ళిరి. ఏకాంతముగా ఉండు ఆ చిత్రకూటప్రాంతము నీ నివాసమునకు సుఖకరముగా ఉండునని తలచెదను. లేదా నాతో ఇక్కడనే ఉండి వనవాసమును పూర్తిచేసుకొనుము." (31, 32)

ధర్మవేత్తయైన ఆ భరద్వాజుడు భార్యతోను, సోదరునితోను కలసి ప్రియమైన అతిథిగా వచ్చిన ఆ రామునకు కావలసిన పదార్థము లన్నియు యిచ్చి స్వాగతము చెప్పెను. ఆ ప్రయాగక్షేత్రములో భరద్వాజమహర్షి దగ్గర కూర్చుండి, రాముడు అతనితో అనేకవిధముల సంభాషణలు చేయుచుండగా పవిత్రమైన రాత్రి వచ్చినది.(33, 34)

సుఖపడుటకు అలవాటుపడిన ఆ సీతారామలక్ష్మణులు చాల అలసిపోయినవారై, ఆ రాత్రి సుందర మైన ఆ భరద్వాజాశ్రమములో సుఖముగా నివసించిరి.(35)

రాత్రి తెల్లవారిన పిమ్మట నరులలో శ్రేష్ఠుడైన రాముడు తేజస్సుతో వెలుగుచున్న ఆ భరద్వాజుని వద్దకు వెళ్ళి, "మహర్షీ! నీ ఆశ్రమములో రాత్రి గడపినాము. ఇక మా నివాసస్థలమునకు వెళ్ళుటకు అనుజ్ఞ ఇమ్ము." అని కోరెను.(36, 37)

భరద్వాజుడు రామునితో "చిత్రకూటపర్వతముపై తేనె, దుంపలు, ఫలములు, అధికముగా లభించును అక్కడికి వెళ్ళుము" అని పలికెను.(38)

"రామా! చిత్రకూటపర్వతము, నీకు యుక్త మైన నివాసస్థానమని తలచెదను. అందుచే నీవు అచటకు వెళ్ళుము. ఆ పర్వతముపై అనేకవిధము లైన వృక్షములు ఉండును. కిన్నరులు, ఉరగులు దానిపై నివసించుచుందురు. నెమళ్ళ కూతలచేత ప్రతిధ్వనించుచున్న ఆ పర్వతముపై ఉత్తమమైన గజములు నివసించుచుండును. మూలఫలములతో సమృద్ధమైన ఆ పర్వతము పవిత్రమైనది; సుందర మైనది కూడ. ఆ చిత్రకూటపర్వతముపై వనమధ్యమునందు ఏనుగులు, లేళ్ళు, గుంపులు గుంపులుగా తిరుగుచుండును. నీవు వాటిని చూడగలవు. నీవు సీతతో కలసి నదులు, సెలయేళ్ళు, కొండల చరియలు, చిన్న గుహలు, పెద్ద గుహలు, జలప్రవాహములు చూచుచు ఆనందించగలవు. మంగళకరమైన ఆ చిత్రకూటపర్వతమునందు, సంతోషించిన కోయష్టిపక్షులు, కోకిలలు కూయుచుండును. ఇటు అటు సంచరించుచున్న అనేక మైన మృగములతోను, మదించిన ఏనుగులతోను, అది రమ్యముగా నుండును. అట్టి చిత్రకూటమును చేరి ఆశ్రమములో నివసించుము." (39-43)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏబది నాలుగవ సర్గము సమాప్తము.

ఏబదియైదవ సర్గము

సీతారామలక్ష్మణులు యమునానది దాటుట.

ఆ రాజకుమారులు, ఆ రాత్రి అక్కడ గడిపి, మరునాడు భరద్వాజమహర్షికి అభివాదనము చేసి, చిత్రకూటపర్వతమునకు వెళ్ళిరి. ప్రయాణమైన ఆ సీతారామలక్ష్మణులలకు భరద్వాజమహర్షి స్వస్త్యయనము చేసి, ప్రయాణమై వెళ్ళు పుత్రీ–పుత్రులను వలె, వారిని సాగనంపుటకై కొంత దూరము వెళ్ళెను.(1,2)

పిమ్మట భరద్వాజమహాముని రామునితో ఇట్లు పలికెను.(3)

"ఓ రామలక్ష్మణులారా! గంగాయమునాసంగమప్రదేశము చేరిన తరువాత, అక్కడినుండి, పడమటి వైపు ప్రవహించుచున్న యమునానదిని అనుసరించి వెళ్లండి. ఆ నది సూర్యుని కుమార్తె. దాని ప్రవాహవేగము చాల ఎక్కువ. ఆ నదీతీర్థము అతిపురాతనమైనది. అనేక మందిచే సేవింపబడినది. ఆ తీర్థమును చూచి, అక్కడ ఒక తెప్ప నిర్మించుకొని ఆ నదిని దాటి వెళ్లండి.(4,5)

యమునను దాటిన పిమ్మట పచ్చని ఆకులతో కూడిన 'శ్యామము' అను అతివిశాలమైన మఱ్ఱిచెట్టు కనబడును. దాని చుట్టును అనేక వృక్షములు పెరిగియుండును. దానిని ఆశ్రయించి సిద్ధులు నివసించి యుందురు. ఆ మహావృక్షమునకు సీత సమస్కరించి మంగళప్రదము లగు కోరికలను కోరుకొనవచ్చును.(6,7)

ఆ వృక్షముదగ్గర కావలె నన్నచో మీరు ఆగవచ్చును. లేదా దాటి ముందుకు వెళ్ళవచ్చును. అక్కడినుండి ఒక క్రోసు దూరము వెళ్లినచో మోదుగచెట్లతోను, రేగుచెట్లతోను, యమునాతీరమున పుట్టిన వెదురు పొదలతోను నిండిన నీలవర్ణ మైన అడవి కనబడును. అదే చిత్రకూటమునకు వెళ్లు మార్గము. నేను అనేకపర్యాయములు ఆ మార్గమున ప్రయాణము చేసితిని. అది అందమైనది. సుఖకరము. అక్కడ దావాగ్నిభయ ముండదు."(8,9)

ఆ మహర్షి చెప్పిన మార్గముననే చిత్రకూటమునకు వెళ్ళెదమని రాముడు చెప్పెను. పిమ్మట ఆ ఋషికి నమస్కరించి, "మీరు వెనుకకు వెళ్లండి." అని కోరగా ఆ మహర్షి వెనుకకు వెళ్ళెను.(10)

భరద్వాజముని వెళ్లిపోయిన పిమ్మట రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికెను.

"లక్ష్మణా! భరద్వాజమహర్షి మనపై దయ చూపుచున్నాడు. మనము అదృష్టవంతులము."(11)

రామలక్ష్మణులు, ఈ విధముగా అనుకొనుచు, సీతను తమ ఎదుటనే ఉంచుకొని, యమునానదిని సమీపించిరి. మిక్కిలి వేగముగ ప్రవహించుచున్న యమునానదిని ఎట్లు దాటవలెనా అని ఆలోచించిరి.(12, 13)

రామలక్ష్మణులు కొన్ని కఱ్ఱలు దగ్గరగా చేర్చి కట్టి, వాటిపై ఎండిన వెదుళ్ళు, తృణములు పరచి ఒక పెద్ద తెప్పను తయారుచేసిరి. లక్ష్మణుడు నీటి ప్రబ్బలి కొమ్మలు, నేరేడు కొమ్మలు ఛేదించి తీసికొనివచ్చి సీతకు సుఖకరమైన ఆసనమును నిర్మించెను. రాముడు కొంచెము సిగ్గుపడుచున్న ప్రియురాలైన సీతను తెప్పపైకి ఎక్కించెను.(14-16)

సీత వస్త్రములను, ఆభరణములను, చిన్న గునపమును, మేక తోలుతో చేసిన పుటికను, ఆయుధములను రాముడు ఆ తెప్ప మీద సీత ప్రక్కనే ఉంచెను. రామలక్ష్మణులు, ఆ తెప్పను గట్టిగా పట్టి నిలిపి, సీతను ఎక్కించిన పిదప తామెక్కి ప్రయత్నపూర్వకముగా దానిని నడుపుచు యమునానదిని దాటిరి.(17,18)

యమునానదీమధ్యమును చేరిన పిమ్మట, సీత ఆ నదికి సమస్కరించుచు ఈ విధముగ ప్రార్థించెను- "యమునాదేవీ! నేను నిన్ను దాటి వెళ్ళుచున్నాను. మాకు క్షేమ మగుగాక. నా భర్త వ్రతమును పూర్తిచేసికొనుగాక. రాముడు ఇక్ష్వాకువులచే పాలింపబడిన అయోధ్యకు క్షేమముగా తిరిగి వచ్చిన పిమ్మట నీకు వేయి గోవులను, వంద సురా(కల్లు)ఘటములను సమర్పించి పూజించెదను."(19,20)

సీత యమునానదిని ఈ విధముగా నమస్కారపూర్వకముగా ప్రార్థించెను. తెప్ప దక్షిణతీరమును చేరెను. సీతారామలక్ష్మణులు సూర్యపుత్రియైన యమునానదిని దాటిరి.(21,22)

నదిని దాటిన తరువాత వారు ఆ తెప్పను విడచి, యమునానదీతీరమునందున్న అరణ్యములో ప్రయాణము చేసి పచ్చని ఆకులతో నిండిన చల్లని శ్యామమను వటవృక్షమును సమీపించిరి.(23)

ఆ వటవృక్షమును సమీపించి, సీత ఇట్లు ప్రార్థించెను. "ఓ మహావృక్షమా! నీకు నమస్కారము. నా భర్త తన వ్రతమును పూర్తిచేయునుగాక. నేను మరల అయోధ్య చేరి, కౌసల్యను, కీర్తిమంతురాలైన సుమిత్రను చూచెదను గాక!" ఈ

విధముగా పలుకుచు సీత, అంజలి ఘటించి ఆ వటవృక్షమునకు నమస్కారము చేసెను. (24,25)

సీత ఈ విధముగా వటవృక్షమును ప్రార్థించుచుండగా చూచిన రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికెను. (26)

"లక్ష్మణా! నీవు సీతను తీసికొని ముందు నడువుము. నేను ఆయుధధారినై వెనుక నడచెదను. సీత ఏ యే ఫలములను, పుష్పములను కోరునో వాటిని, ఈమె మనస్సునకు సంతోషము కలిగించు ఇతర వస్తువులను ఈమెకు ఇచ్చుచుండుము."(27,28)

ఆ రామలక్ష్మణుల మధ్య నడుచుచున్న సీత రెండు గజముల మధ్య నడచుచున్న అందమైన ఆడ ఏనుగు వలె ప్రకాశించెను. (29)

తాను పూర్వము చూడని ఏదైన చెట్టు గాని, పొద గాని, పుష్పములతో నిండిన లత గాని కనబడినపుడు దానినిగూర్చి సీత రాముని అడుగుచుండెను. సీత అడిగిన వెంటనే లక్ష్మణుడు అనేకవిధములైన సుందరమైన పుష్పముల గుత్తులను తీసికొనివచ్చి ఇచ్చెను. విచిత్రమైన ఇసుక గలది, హంసధ్వనులతోను, సారసధ్వనులతోను నిండినది అయిన యమునానదిని చూచి సీత ఆనందించెను. (30-32)

వారు ఒక క్రోశు దూరము ప్రయాణము చేసి, ఆ యమునాతీరమునందు పవిత్రమైన అనేకమృగములను చంపి, తినిరి. (33)

ఆ యమునానదీ తీరప్రాంతము నెమళ్ల ధ్వనులతో నిండి యుండెను. అక్కడ వానరములు, గజములు నివసించుచుండెను. అట్టి ఆ ప్రదేశమునందు విహరించుచు సీతారామలక్ష్మణులు అనుకూలమైనదీ, మిట్టపల్లములు లేనిదీ అయిన ఒక ప్రదేశమున, ఆ రాత్రికి నివాస మేర్పరచుకొనిరి. (34)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏబది ఐదవ సర్గము సమాప్తము.

ఏబదియారవ సర్గము

రామాదులు చిత్రకూటము చేరుట, లక్ష్మణుడు పర్ణశాలను నిర్మించుట.

ఆ రాత్రి గడిచిన పిమ్మట ముందుగా నిద్రనుండి లేచిన రాముడు, ఇంకను నిద్రించుచున్న లక్ష్మణుని మెల్లగా మేల్కొలిపెను.(1)

"లక్ష్మణా! వన్యప్రాణులు మధురముగా ధ్వని చేయుచున్నవి. వినుము. ఇది మనము బయలుదేరుటకు తగిన సమయము. వెంటనే బయలుదేరెదము."(2)

సోదరుడు ఆ విధముగా మేల్కొలుపగానే లక్ష్మణుడు నిద్రను, మార్గాయాసమును కూడ విడచెను. వారందరును లేచి, మంగళప్రదమగు యమునానదీజలమును స్పృశించి(స్నానము చేసి), భరద్వాజమహర్షి చెప్పిన చిత్రకూటపర్వతమార్గమును పట్టి వెళ్లిరి.(3,4)

అట్లు లక్ష్మణునితో కలసిపోవుచున్న రాముడు పద్మపత్రముల వంటి నేత్రములు గల సీతతో ఇట్లనెను.(5)

"సీతా! ఈ కింశుకవృక్షములు శిశిరఋతువు గడచిపోవుటతో అంతటా పుష్పించి ఎఱ్ఱని పూవులతో మండుచున్న ట్లున్నవి. వాటి పుష్పములతోనే అవి మాలలను ధరించినట్లు ఉన్నవి. చూడుము. ఈ భల్లాతకవృక్షములు(జీడిచెట్లు) వికసించి పుష్పఫలములతో వంగియున్నవి. కాని వీటి ఫలాదులను అనుభవించుటకు నరు లెవ్వరును లేరు. వీటిని చూడుము. ఇట్టి వృక్షము లన్నియు ఉన్న ఈ ప్రదేశమున మనము తప్పక సుఖముగా జీవించవచ్చును."(6,7)

పిమ్మట లక్ష్మణునితో ఇట్లనెను- "లక్ష్మణా! ప్రతిచెట్టుమీదను తొట్టెల వలె ఉన్న పెద్ద తేనెపట్టులు వ్రేలాడుచున్నవి; చూడుము. ఈ వనప్రదేశము దట్టముగా రాలిన పూవులతో కప్పబడి అందముగా ఉన్నది. ఈ వానకోయిల కూయుచుండగా, నెమలి దానికి ఎదురు కూత కూయుచున్నది. ఈ చిత్రకూటశిఖరములు చాల ఎత్తుగా ఉన్నవి. ఈ పర్వతముపై ఏనుగులు గుంపులు గుంపులుగా సంచరించుచున్నవి. పక్షులు ధ్వనిచేయుచున్నవి. దీనిని చూడుము.(8-10)

నాయనా! సమమైన నేల కలదీ, అనేకమైన వృక్షములతో నిండినదీ, పవిత్రమూ అయిన ఈ చిత్రకూటపర్వతవనమునందు సుఖముగా నివసించెదము."(11)

కాలినడకన ప్రయాణము చేయుచున్న సీతారామలక్ష్మణులు సుందరమూ,

మనోహరమూ అయిన చిత్రకూటపర్వతమును సమీపించిరి. ఆ పర్వతమునందు అనేక జాతుల పక్షుల సముదాయము లుండెను. మూలములు, ఫలములు అత్యధికముగా లభించుచుండెను. మంచి రుచిగల ఉదకముతో ఆ పర్వతము రమ్యముగాను, సమృద్ధముగాను ఉండెను. అట్టి పర్వతమును సమీపించిన పిమ్మట రాము డిట్లు పలికెను.(12,13)

"లక్ష్మణా! సుందరమైనదీ, అనేకవిధములైన వృక్షములూ, లతలూ కలదీ, అనేకము లైన మూలములు ఫలములూ ఉన్నదీ, రమ్యమూ అయిన ఈ చిత్రకూటపర్వతముపై సుఖముగా జీవించవచ్చు నని నాకు తోచుచున్నది. ఈ పర్వతముపై మహాత్ములైన మునులు కూడ నివసించుచున్నారు. మన మిక్కడనే నివాస మేర్పరచుకొని సుఖముగా ఉండెదము."(14,15)

ఈ విధముగ నిర్ణయించి సీతారామలక్ష్మణులు నడుచుచూ వాల్మీకి ఆశ్రమమును సమీపించిరి. వారు వాల్మీకికి నమస్కరించిరి. ధర్మవేత్తయైన ఆ వాల్మీకిమహర్షి చాలా సంతోషించి వారిని ఆదరించి, స్వాగతవచనములు పలుకుచు, కూర్చుండుడు అని కోరెను. రాముడు తనను గూర్చి ఆ ఋషికి యథాన్యాయముగా తెలిపెను.

పిమ్మట రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికెను.(16-18)

"లక్ష్మణా! దృఢములు శ్రేష్ఠములూ అయిన కఱ్ఱలు తీసికొని వచ్చి గృహమును నిర్మింపుము. మనము నివాస మొకటి ఏర్పరచుకొనవలె నని కోరుచున్నాను."(19)

లక్ష్మణుడు రాముని ఆజ్ఞ ప్రకారము అనేకవిధములైన వృక్షములను తెచ్చి పర్ణశాలను నిర్మించెను. చాపలతో ఆవరణమును ఏర్పరచి స్థిరముగా నుండు నట్లు ఆ పర్ణశాలను కట్టెను. ఆ పర్ణశాలను చూచి రాముడు, తన ఆజ్ఞను వినవలెనను కోరికతో సావధానచిత్తుడై నిలచి ఉన్న లక్ష్మణునితో, ఇట్లు పలికెను.(20,21)

"లక్ష్మణా! చిరకాలము జీవించగోరువారు వాస్తుదేవతాశాంతి చేసుకొనవలెను. అందుచే మనము లేడిమాంసమును తీసికొనివచ్చి శాలాపూజ చేసెదము. ఒక లేడిని చంపి శీఘ్రముగా ఇచటికి తీసికొని రమ్ము. శాస్త్రవిహితమగు కార్యమును చేయవలెను. ఈ ధర్మము నీకు కూడ తెలియును కదా!(22, 23)

శత్రువీరులను సంహరించు లక్ష్మణుడు, రాముడు చెప్పినవిధముగ చేసెను. మరల రాముడు అతనితో ఇట్లనెను.(24)

"ఓ సౌమ్యుడా! ఈ లేడి మాంసమును ఉడికించుము. పర్ణశాలాపూజ చేసెదము. ఈ దినము స్థిరదినము. ముహూర్తము కూడ స్థిరముహూర్తము."(25)

లక్ష్మణుడు ఒక పవిత్రమైన కృష్ణసార మను లేడిని చంపి, దానిని ప్రజ్వలించుచున్న అగ్నిలో పడవేసి దాని మాంసమును పక్వము చేసెను. బాగుగా కాలి, రక్తము తొలగిపోయిన ఆ మృగము పక్వమైనట్లు తెలుసుకొని లక్ష్మణుడు రామునితో ఇట్లనెను. (26,27)

"అంగవైకల్య మేమియు లేని ఈ కృష్ణమృగమును పూర్తిగా పక్వము చేసినాను. రామా! దేవతాపూజ చేయుము. అట్టి కార్యమునందు నీవే నేర్పుగలవాడవు."(28)

రాముడు ఆయా సందర్భములలో జపింపదగిన మంత్రములు బాగుగా తెలిసినవాడు. ఆతడు స్నానము చేసి నియమవంతుడై, వాస్తుపూజాసమయమున పఠింపదగిన మంత్రముల నన్నింటిని సంగ్రహముగా చదివెను. దేవతల నందరిని పూజించి, పవిత్రుడై పర్ణశాలలో ప్రవేశించగనే రాముని మనస్సునందు ఆహ్లాదము కలిగెను. రాముడు విశ్వేదేవతలను, రుద్రుని, విష్ణువును ఉద్దేశించి బలులు సమర్పించి, వాస్తుశాంతినిమిత్తమై మంగళములు చేసి, నియమానుసారముగా జపించి, యథావిధిగా నదిలో స్నానము చేసి, పాపములను నశింపచేయు ఉత్తమబలిని ఇచ్చెను. (29-32)

లక్ష్మణుడు, ఆశ్రమములో ఉండవలసిన వేదికలను, చైత్యములను, అగ్నిగృహములను స్థాపించెను. సీతారామలక్ష్మణులు వనమునందు లభించు పుష్పములు, ఫలములు, మూలములు, పక్వమాంసములు, ఉదకము, వేదోక్తవిధానమున జపమును, దర్భలు, మంచి సమిధలు, కుశలు మొదలగువాటిచే యథావిధిగా భూతతృప్తిని చేసి శుభకరమైన పర్ణశాలలో ప్రవేశించిరి. (33-35)

చెట్ల ఆకులచే ఏర్పరచిన ఆచ్ఛాదనము కలదీ, మనోహరమూ, ఏ ప్రదేశములో ఏ విధముగా ఉండవలెనో అట్లు నిర్మింపబడినదీ, గాలి తాకిడి లేనిదీ, అయిన ఆ పర్ణశాలలోనికి సీతారామలక్ష్మణులు ముగ్గురును కలిసి, దేవతాగణములు సుధర్మ యను దేవసభలోనికి ప్రవేశించినట్లు ప్రవేశించిరి. (36)

సీతారామలక్ష్మణులు అసంఖ్యాకములైన వివిధపక్షిమృగాదులతో వ్యాకులమూ, విచిత్రమైన పుష్పగుచ్ఛములతో నిండిన వృక్షములు కలదీ, మదపుటేనుగులచేతను, ఇతరమృగములచేతనూ ధ్వనింపచేయబడినదీ అయిన

శ్రేష్ఠమైన ఆ వనమునందు సుఖముగా విహరించిరి. చాల రమ్యముగా ఉన్న చిత్రకూటపర్వతము సమీపమున మంచి తీర్థములు గలది. మృగపక్షిసేవితమైనది అగు మాల్యవతీనదీతీరప్రాంతమున ఆ సీతారామలక్ష్మణులు చాల ఆనందించుచు, తమ పురమును వదిలి వచ్చినందువలన కలిగిన దుఃఖమును విడచిరి. (37, 38)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏబది ఆరవ సర్గము సమాప్తము.

ఏబదియేడవ సర్గము

సుమంత్రుడు అయోధ్యకు మరలి వచ్చుట.

రాముడు గంగను దాటి దక్షిణతీరము చేరిన పిమ్మట సుమంత్రుడు గుహునితో చాల సేపు మాటలాడి, చాల దుఃఖార్తుడై అయోధ్యకు తిరిగి వెళ్ళెను. (1)

గుహుడు మొదలైనవారు అక్కడనే ఉండి సీతారామలక్ష్మణులు భరద్వాజమహర్షి వద్దకు వెళ్ళుటను, ఆయనతో కలిసి ఉండుటను, చిత్రకూటము వరకు వెళ్లుటను తెలుసుకొనిరి. (2)

రాముని అనుజ్ఞ పొందిన సుమంత్రుడు ఉత్తమములైన అశ్వములను రథమునకు కట్టుకొని, మిక్కిలి దుఃఖించుచు అయోధ్యానగరమునకు తిరిగి వెళ్లెను. (3)

అతడు మంచి వాసనలు గల అరణ్యములను, నదులను, సరస్సులను, గ్రామములను, నగరములను చూచుచు, వాటిని శీఘ్రముగా దాటి వెళ్లెను. (4)

సుమంత్రుడు మూడవ దినమునందు, సాయంకాలమున అయోధ్యను చేరి, ఆనందశూన్యమైన ఆ నగరమును చూచెను. నిశ్శబ్దమై పాడుపడి నట్లున్న అయోధ్యను చూచి, మనస్సులో మిక్కిలి బాధపడుచు, దుఃఖవేగముచే పీడితుడై ఈ విధముగ తలచెను. (5,6)

"గజములతోను, అశ్వములతోను, జనులతోను, రాజుతోను కూడిన ఈ అయోధ్యానగరము రాముని గూర్చిన దుఃఖముచే పీడితమై, శోకాగ్నిచే దగ్ధము కాలేదు కద!"(7)

సుమంత్రు డీ విధమగు ఆలోచనలు చేయుచు, శీఘ్రముగా పరుగెత్తు

అశ్వములచేత నగరద్వారమును సమీపించి, నగరములోనికి ప్రవేశించెను. అతడు వచ్చుట చూచి వందలకొలది, వేలకొలది జనులు, "రాము డెక్కడ, రాము డెక్కడ?" అని అడుగుచు, అతని వైపు పరుగెత్తిరి.(8,9)

"నేను గంగాతీరమునందు రామునకు వీడ్కోలు చెప్పి, ధర్మాత్ముడైన ఆ మహాత్ముని అనుజ్ఞ పొంది తిరిగి వచ్చినాను." అని అతడు వారికి చెప్పెను.(10)

సీతారామలక్ష్మణులు గంగానదిని దాటి వెళ్ళిపోయినా రని వినగానే ఆ జనులు 'అయ్యో! ఛీ!' అని తమను తాము నిందించుకొనుచు, 'హా! రామా!' అని అక్రందనము చేసిరి. 'రాము డిచట మనకు కనబడదు; మనము హతుల మైతిమి.' అనుచు గుంపులు గుంపులుగా చేరి అనుకొనుచున్న ఆ జనుల మాటలను కూడా సుమంత్రుడు వినెను.(11,12)

"దానయజ్ఞవివాహాదులందును, గొప్ప గొప్ప సమాజములందును, మనము రాముని చూచుచుండెడివారము. రాముడు, తండ్రి వలె, "ఈ జనమునకు ఏది తగినది? ఏది ప్రియమైనది? ఏది వీరికి సుఖము కలిగించును?" అని పర్యాలోచించి, ఈ నగరమును పరిపాలించుచుండెడివాడు. ఇపుడాతడు మరి ఎన్నడును మనకు కనబడడు." అని పౌరులు విలపించిరి(13,14)

కిటికీలలో నున్న స్త్రీల విలాపములను, బజారులలో రాముని గూర్చిన శోకముతో బాధపడుచున్న జనుల రోదనములను సుమంత్రుడు వినెను. అతడు తన ముఖ మితరులకు కనబడకుండు నట్లు కప్పుకొని, రాజమార్గము ద్వారా, దశరథుడున్న గృహమును చేరెను.(15,16)

సుమంత్రుడు రథము దిగి, శీఘ్రముగా రాజగృహములోనికి ప్రవేశించి, జనులతో కిక్కిరిసి ఉన్న ఏడు వాకిళ్లను దాటెను. మేడలలోను, ఏడంతస్తుల మేడలలోను, ప్రాసాదములలోను ఉన్న స్త్రీలు సుమంత్రుడు వచ్చినట్లు చూచి, రాముడు కనబడకపోవుటచే కృశించినవారై హాహాకారములు చేసిరి. అంతఃపురస్త్రీలు మిక్కిలి దుఃఖించిరి. విశాలములూ, నిర్మలములూ అయిన వారి నేత్రములు కన్నీటితో నిండిపోయినవి. వారు ఒకరినొకరు స్పష్టముగా చూడలేకపోయిరి.(17-19)

సుమంత్రుడు, దశరథుని భార్యలు రామశోకముతో బాధపడుచు, ప్రాసాదములలో మెల్లగా చెప్పుకొనుచున్న మాటలు వినెను.(20)

"రామునితో కలిసి వెళ్ళి ఇపుడు రాముడు లేకుండా తిరిగి వచ్చిన ఈ సుమంత్రుడు, దుఃఖించుచున్న కౌసల్యకు ఏమి సమాధానము చెప్పును? తాను

వలదన్నను అంగీకరించక పుత్రుడు దూరముగా వెళ్ళిపోయిన పిమ్మట కూడా కౌసల్య జీవించియున్నది. ఇట్లు జీవించుట చాల కష్టము. అంత సులభముగా చేయదగిన పని కాదు.".(21,22)

దశరథుని భార్యలు చెప్పుకొనుచున్న, సత్యమైన ఆ మాటలు వినుచు సుమంత్రుడు శీఘ్రముగా, శోకముతో దహించుకుపోవు చున్నట్లున్న దశరథుని గృహమును ప్రవేశించెను. ఎనిమిదవ కక్ష్యలో ప్రవేశించి అక్కడ తెల్లని గృహమునందు రాజును చూచెను. అతడు దీనుడై, మిక్కిలి దుఃఖించుచు, పుత్రశోకముతో కాంతివిహీనుడై యుండెను.(23,24)

దీనుడై కూర్చొని ఉన్న ఆ రాజును సుమంత్రుడు సమీపించి, నమస్కరించి రాముడు పంపిన సందేశమును యథాతథముగా వినిపించెను. సుమంత్రుడు చెప్పిన రామసందేశమును ఆ రాజు మౌనముగానే వినెను. అతని మనస్సు కలత చెందెను. రామశోకపీడితుడై అతడు మూర్ఛిల్లి నేలపై పడెను. రాజు మూర్ఛ చెందగనే అంతఃపురములోని వారందరు మిక్కిలి బాధపడిరి. అతడు నేలపై పడిపోగా, వారందరు చేతులనెత్తి ఏడ్చిరి.(25-27)

నేలపై పడిపోయిన భర్తను చూచి కౌసల్యయు, సుమిత్రయు అతనిని లేవదీసిరి. కౌసల్య అతనితో ఇట్లనెను.(28)

"మహారాజా! ఎవ్వరును చేయలేని పనులను చేసిన రామునియొక్క దూతగా సుమంత్రుడు వనవాసమునుండి వచ్చినాడు. ఈతనితో మాట్లాడ వేమి? చేయకూడని పని చేసి ఇపు డీ విధముగా ఎందుకు సిగ్గుపడుచున్నావు? లెమ్ము. మాట నిలుపుకొనిన పుణ్యము లభించినది కదా! ఇట్లు దుఃఖించినచో ఎవ్వరు సాహాయ్యము చేయుదురు? కైకేయికి భయపడి నీవు రాముని గూర్చి సారథితో మాటలాడుట లేదు. కాని, ఇక్కడ కైకేయి లేదు. నీవు నిర్భయముగా మాటలాడవచ్చును."(29-31)

దుఃఖముతో నిండిన ఆ కౌసల్య, బాష్పములచే కలిగిన డగ్గుత్తికతో మాటలాడుచు, రాజుతో ఇట్లు పలికి, వెంటనే నేలపై బడెను. ఈ విధముగా నేలపై బడి విలపించుచున్న కౌసల్యను, మూర్ఛితుడైన భర్తను చూచి, ఆ స్త్రీలందరును ఎలుగెత్తి ఏడ్చిరి. అంతఃపురమునుండి బయలుదేరిన ఆ రోదనధ్వని విని వృద్ధులు, యువకులు, స్త్రీలు అందరును, అంతటను ఏడ్చిరి. అపుడు మరల ఆ పట్టణము దుఃఖములో మునిగిపోయెను.(32-34)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏబది యేడవ సర్గము సమాప్తము.

ఏబది యెనిమిదవ సర్గము

సుమంత్రుడు రామలక్ష్మణుల సందేశము వినిపించుట.

పిమ్మట కొంత సేపటికి రాజు తెప్పరిల్లి, తిరిగి సంజ్ఞ పొంది, రాముని వృత్తాంతము తెలిసికొనుటకై ఆ సారథిని పిలచెను.(1)

ఆ రామునిగూర్చియే ఆలోచించుచు దుఃఖశోకములలో క్రుంగి యున్న దశరథమహారాజు దగ్గరకు సుమంత్రుడు అంజలి ఘటించి వెళ్లెను. వృద్ధుడైన ఆ దశరథుడు దుఃఖముచే హృదయము దహించుకొనిపోవుచుండగా, క్రొత్తగా పట్టుకొనిన ఏనుగు వలె, దీర్ఘముగా నిట్టూర్పుచుండెను. అస్వస్థమైన గజమువలె ఏదియో ఆలోచించుచుండెను.(2,3)

ప్రయాణమువలన ఆ సూతుని శరీరమంతా దుమ్ము కప్పి ఉండెను. అతడు దీనుడై, కన్నీళ్ళతో నిండిన ముఖముతో రాజును సమీపించెను. రాజు మిక్కిలి దుఃఖించుచు ఆ సూతునితో ఇట్లు పలికెను.(4)

"సుమంత్రా! ధర్మాత్ముడైన ఆ రాముడు, ఎక్కడ చెట్ల క్రింద నివసించినాడు? ఇంత వరకును చాల సుఖపడిన అతడు ఏమి తినుచున్నాడు? రాముడు రాజకుమారుడు. ఎన్నడును దుఃఖములకు అలవాటు పడినవాడు కాడు. శయనములపై శయనించుటకు అలవడ్డవాడు. అట్టి రాముడు, అనాథుడు వలె, నేలపై దుఃఖముగా ఎట్లు శయనించుచున్నాడో కదా! రాముడు ఎచటి కైన ప్రయాణమై వెళ్ళుచుండగా, కాలిబంట్లు, రథములు, గజములు వెంట వెళ్ళెడివారు. అట్టి రాముడు, జనశూన్య మైన వనములో ఎట్లు నివసించగలడు? సీతారామలక్ష్మణులు క్రూరమృగములతోను, కృష్ణసర్పములతోను నిండిన అరణ్యము నెట్లు చేరినారు?(5-8)

ఆ రాజకుమారులు, దీనయైన, సుకుమారి సీతతో కలిసి, రథమునుండి క్రిందకి దిగి, పాదచారులై అరణ్యములోనికి ఎట్లు ప్రవేశించినారు? అశ్వినీదేవతలు మందరపర్వతప్రాంతమును ప్రవేశించుచున్నట్లు, అరణ్యములోనికి ప్రవేశించుచున్న నా కుమారులను చూడగల్గితివి. నీ వెంతయు అదృష్టవంతుడవు.(9,10)

అరణ్యమునకు చేరిన పిమ్మట రాము డేమనినాడు? లక్ష్మణు డేమనినాడు? సీత ఏమన్నది? రాముడు ఎక్కడ కూర్చుండెనో, ఎక్కడ పరుండెనో, ఎక్కడ భుజించెనో చెప్పుము. ఆ విషయములను వినుచు, నేను, సాధుజనసంగముచేత

యయాతి జీవించి నట్లు జీవించెదను."(11,12)

దశరథు డిట్లు ప్రశ్నింపగా సుమంత్రుడు దగ్గుత్తికతో, తొట్రుపడుచున్న వాక్కుతో రాజుకు ఇట్లు చెప్పెను.(13)

"మహారాజా! రాముడు ధర్మమునే పాలించుచు అంజలి ఘటించి, శిరస్సు వంచి నీకు నమస్కరించి, నాతో ఇట్లు చెప్పెను.(14)

'సుమంత్రా! మహాత్ముడైన నా తండ్రికి నేను శిరస్సు వంచి నమస్కరించినట్లు చెప్పుము. అంతఃపురములో నున్నవారి నందరినీ ఎట్టి భేదము లేకుండ క్షేమ మడిగినట్లును, ఆ యా వ్యక్తులకు వారి యోగ్యతానుసారముగా అభివాదనము చేసినట్లును చెప్పవలెను. (15,16)

నా తల్లియైన కౌసల్యకు నా కుశలమును, నా అభివాదనమును చెప్పి, ఏమరిపాటు లేకుండ ఉండవలె నని తెలిపి, ఈ మాటలు కూడ చెప్పుము.(17)

'తల్లీ! ధర్మమునందు స్థిరత్వము కలదానవై, యథాకాలమున, అగ్నిగృహములో అగ్నిహోమాదికము చేయుచు, దేవతలకు ఉపచారములు చేసినట్లు దశరథమహారాజునకు ఉపచారములు చేయుచు ఆయనను రక్షించుకొనుము. అహంకారమును, నేను పట్టపురాణిని అను చిత్తసమున్నతిని (గర్వమును) విడచి నా మిగిలిన తల్లుల(నీ సవతుల) విషయమున సౌహార్దముతో ప్రవర్తింపుము. పూజ్యురాలైన కైకేయి రాజునకు అనుకూలముగా నుండునట్లు చేయుము.(18,19)

భరతుడు నీకు కుమారుడే యైనను అతని విషయమునందు రాజు విషయమున ప్రవర్తించినట్లు ప్రవర్తించుచుండుము. రాజులు అర్థముచేత జ్యేష్ఠులుకదా!(రాజులకు అర్థమే ప్రధానముకదా!) రాజధర్మమును గుర్తుంచుకొనుము.'(20)

భరతుని కుశల మడిగి, అతనితో ఈ విధముగ కూడ చెప్పమనినాడు. "తల్లులందరి విషయమునను, న్యాయానుసారముగా ప్రవర్తింపుము. నీవు యౌవరాజ్యమును పొందిన పిదప, మహారాజుగా నున్న తండ్రిగారి అనుమతి ప్రకారము రాజ్యపాలనము చేయుము. రాజు చాల వృద్ధుడైనాడు. ఏ విషయమునందును ఆయనను నిర్బంధింపకుము. ఆయన ఆజ్ఞయే చెల్లునట్లు చూచుచు, నీ యౌవరాజ్యమును నడిపింపుము."(21-23)

అధికముగా కన్నీళ్ళు కార్చుచు, భరతునితో చెప్పమని మరల ఇట్లు పలికెను.

"పుత్రునిపై అధిక మైన ప్రేమ గల నా తల్లిని నీ తల్లిని వలె చూచుకొనుము."(24)

మహారాజా! పద్మముల వలె ఎఱ్ఱని నేత్రములు కలవాడూ, మహాయశఃశాలీ అయిన రాముడు, నాతో ఈ విధముగ మాటలాడుచునే, అత్యధికముగ కన్నీళ్ళు రాల్చెను. (25)

లక్ష్మణుడు మాత్రము చాల కోపగించి, నిట్టూర్చుచు ఇట్లు పలికెను. "ఈ రాజకుమారుడు ఏ అపరాధము చేసినా డని ఇతనిని రాజ్యమునుండి వెడలగొట్టినారు?". (26)

రాజైతే, కైకేయి ఇచ్చిన తుచ్ఛమైన శాసనమును పాటించి, చేయదగిన పని చేసినట్లు ఒక చేయకూడని పనిని చేసినాడు. దీనితో మే మందరము కష్టము లనుభవించవలసి వచ్చినది. రాజ్యముపై దురాశచేత వెడలగొట్టినా, వరము అను కారణముచే వెడలగొట్టినా రాముని వెడలగొట్టుట రాజు చేసిన చెడ్డ పని. ఈ రామపరిత్యాగ మనునది, నేను ప్రభువును కదా అని దశరథుడు యథేచ్ఛగా చేసినదే కాని, ఇందుకు తగిన హేతువు నా కేదియు కనబడదు. సరిగా ఆలోచించక, తెలివితక్కువతనముచే రాముని ప్రవాసమునకు పంపివేయుట జరిగినది. ఇది దుఃఖమును కలిగించగలదు. (27–30)

నేను దశరథమహారాజును తండ్రిగా పరిగణించను. నాకు సోదరుడైనను, ప్రభువైనను, బంధు వైనను, తండ్రి యైనను రాముడే. సకలజనులకు ప్రియుడు, సకలజనుల హితము కోరువాడు అయిన రాముని పరిత్యజించి, ఇట్టి అకార్యము చేసిన నీ విషయమున ఎవరికి అనురాగముండును?(31, 32)

మహారాజా! సకలప్రజలకును మనోహరుడు, ధార్మికుడు అయిన రాముని వనమునకు పంపి ప్రజలందరితో విరోధము తెచ్చుకొనిన నీవు రాజుగా ఎట్లు ఉండగలవు?"(33)

ఆత్మాభిమానవంతురా లగు జానకి యైతే, నిట్టూర్చుచు, తనను తాను మరచినదై, భూతముచే ఆక్రమింపబడిన మనస్సుకలది వలె, వికలయై నిలచినది. పూర్వ మెన్నడును ఇట్టి బాధలు ఎరుగని, కీర్తిమతి యైన ఆ సీత, దుఃఖముతో ఏడ్చుచు నాతో ఏమియు చెప్పలేదు. తిరిగి వచ్చుటకు ప్రయాణ మైన నన్ను చూచి, సీత, ఎండి పోవుచున్న ముఖముతో భర్త వైపు చూచుచు, కన్నీరు రాల్చెను. (34–36)

రాముడు, కూడ, కన్నీళ్లతో నిండిన ముఖముతో, చేతులు ఘటించి

నమస్కరించుచు, లక్ష్మణుని భుజమును ఆనుకొని నిలబడెను. దీనురాలైన సీత ఏడ్చుచు, రాజరథము వైపునకు, నా వైపునకు చూచుచు నిలచిపోయెను."(37)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏబది ఎనిమిదవ సర్గము సమాప్తము.

ఏబదితొమ్మిదవ సర్గము

రామవియోగముచే జడచేతనముల దురవస్థను సుమంత్రుడు చెప్పుట.

సుమంత్రుడు చెప్పిన మాటలు విని "ఇంకను విషయములను చెప్పుము" అని రాజు పలికెను. దశరథుని మాట విని, సుమంత్రుడు కన్నీళ్లతో వ్యాకులుడై, రాముని సందేశమునందలి వివరములను మరల చెప్పెను.(1, 2)

"మహారాజా! నారచీరలు ధరించిన రామలక్ష్మణులు జటలు కట్టుకొని గంగానది దాటి ప్రయాగ వైపు వెళ్లిరి. రాముని రక్షించుచు లక్ష్మణుడు ముందు నడచి వెళ్ళెను. ఈ విధముగా వెళ్లిపోవుచున్న వారిని చూచి నేను చేయున దేమియు లేక తిరిగి వచ్చితిని.(3, 4)

రాముడు అరణ్యమునకు ప్రయాణమైన పిమ్మట నేను వెనుకకు మరలితిని. నా గుఱ్ఱములు మాత్రము వేడియైన కన్నీళ్ళు కార్చుచు, మార్గమునందు నడచుటకు నిరాకరించినవి. రాముడు మరల నన్ను పిలచునేమో అను ఆశచే గుహునితో కలిసి అక్కడనే మూడు దినములు ఉండిపోయితిని. నేను ఎటులనో ఆ దుఃఖమును ఆపుకొనుచు రాజకుమారు లిరువురికిని అంజలి ఘటించి నమస్కరించి రథము నెక్కి ప్రయాణమైతిని.(5-7)

మహారాజా! నీ దేశములో ఉన్న చెట్లు కూడ, రామవ్యసనముచే కృశించి, పుష్పములతో చిగుళ్ళతో మొగ్గలతో సహ వాడిపోయినవి. నదులలోను, చిన్న చెరువులలోను, సరస్సులలోను ఉన్న నీరు వేడెక్కినది. వనములలోను, ఉద్యానములలోను (వృక్షాదుల) ఆకులు ఎండిపోయినవి. ప్రాణులన్నియు కదలకుండ పడియున్నవి. క్రూరమృగములు గూడ సంచరించుట లేదు. రాముని గూర్చి శోకముచే పీడింపబడినదై ఆ అరణ్యము నిశ్శబ్దముగా నున్నది.(8-10)

పద్మసరస్సులలోని జలము కలుషమై పోయినది. పద్మములు వాడిపోయి

వాటి పత్రములు పైకి కనబడుట లేదు. ఆ సరస్సులోని చేపలు, పక్షులు అణగి పడి యున్నవి. నీటిలో పుట్టు పద్మాదులు, నేలపై జనించు మల్లె, మొల్ల మొదలైన పుష్పములు, ఫలములు కూడ ఇపుడు సుగంధము తగ్గిపోయి, పూర్వము వలె మనోహరముగా లేవు.(11, 12)

ఇక్కడ అయోధ్యలో ఉద్యానవనము లన్నియు జనశూన్యములై, అణగి పడియున్న పక్షులతో, ఏ మాత్రము మనోహరములుగా కనబడుట లేదు. అయోధ్యలో ప్రవేశించుచున్న నన్ను చూచి ఏ ఒక్కడును అభినందించుట లేదు. రాముడు కనబడక జనులందరు మాటి మాటికి నిట్టూర్చుచున్నారు. రాముడు లేకుండా తిరిగి వచ్చిన రాజరథమును చూచి రాజమార్గమునందున్న జనులందరును దుఃఖముతో కన్నీళ్లు కార్చుచున్నారు. తిరిగి వచ్చిన రథమును హర్మ్యములనుండి, విమానములనుండి, ప్రాసాదముల నుండి చూచిన స్త్రీలు, రాముడు కనబడకపోవుటచే దుఃఖించుచు, హాహాకారము చేయుచున్నారు. రాముని ప్రవాసముచేత శత్రువులు, ఉదాసీనులు అందరును గూడ సమముగానే దుఃఖించుచున్నారు. వారి దుఃఖములో భేదమేమియు కనబడుటలేదు.(13-18)

అయోధ్యానగరము సంతోషము లేని మనుష్యులతో, దీనములైన గజాశ్వములతో నిండియున్నది. ఆర్తస్వరముచేత వాడిపోయినదై ఉన్నది. నిట్టూర్పుల ధ్వనులే అంతటను వ్యాపింపగా ఆనందశూన్యమై యున్నది. రాముని ప్రవాసము చేత దుఃఖించుచున్న అయోధ్య, నా దృష్టికి, పుత్రుడు దూరమైన కౌసల్య వలె కనబడుచున్నది."(19-20)

దశరథమహారాజు సూతుని మాటలు విని, దగ్గుత్తికచే ఆగిపోవుచున్న మాటలలో దైన్యము ఉట్టిపడ అతనితో ఇట్లనెను.(21)

దుష్టులైన బంధుజనులు, దుష్టమైన సంకల్పము గల కైకేయి ప్రేరేపించగా, నేను ఆలోచనలో నేర్పరులైన వృద్ధులతో సంప్రతించకుండగా ఈ పని చేసితిని. ఒక స్త్రీ మాటలు విని, స్నేహితులతోను, మంత్రులతోను, నైగములతోను ఆలోచించకుండగా, ఈ పని, తొందరపడి చేసితిని. ఈ విధముగ కావలసి యుండుటచేతనే ఈ గొప్ప దుఃఖము ఈ వంశము నంతను నశింపచేయుటకై, దైవవశముచేత, వచ్చిపడినది. నిశ్చయము.(22-24)

సుమంత్రా! నీకు నే నేమాత్రమైన ఉపకారము చేసి యున్నట్లయితే, నన్ను రామునివద్దకు తీసికొని వెళ్లుము. నన్ను నా ప్రాణములు తొందరపెట్టు చున్నవి.

ఇప్పుడు కూడ నా ఆజ్ఞ చెల్లుటకు వీలున్నచో, రాముని వెనుకకు తీసికొని రమ్ము. రాముడు లేకుండ క్షణకాల మైనను జీవింపజాలను.(25-26)

ఆజానుబాహుడైన రాముడు దూరము వెళ్లిపోవుటచే అతనిని తీసికొనివచ్చుటకు శక్యము కానిచో, నన్నే రథము నెక్కించి తీసికొని వెళ్ళి రాముని చూపుము. నా రాముడు గుండ్రని దంతములు గలవాడు. గొప్ప ధనుస్సును ధరించినవాడు. ఆ రాముడు ఇప్పుడు ఎక్కడ నున్నాడు? నేను సీతాసమేతుడైన అతనిని చూచినయెడలనే జీవించగలను. ఎఱ్ఱని నేత్రములు కలవాడు, ఆజానుబాహుడు, మణికుండలములను ధరించినవాడూ అయిన రాముని చూడకున్నచో నేను మరణింతును.(27-29)

ఇట్టి దురవస్థలో నున్న నేను, ఇక్ష్వాకువంశమునకు ఆనందకరుడైన రాముని చూడజాలకున్నా ననగా ఇంతకంటె దుఃఖ మేమి ఉండును? అయ్యో! రామా! అయ్యో! లక్ష్మణా! అయ్యో! దీనురాలవైన సీతా! అనాథుడు వలె నేను మరణించుచున్నా నను విషయము మీకు తెలియదు కదా!"(30, 31)

ఆ దుఃఖముతో చిత్తము మిక్కిలి దుర్బల మైపోయిన ఆ దశరథుడు ఏ మాత్రము దాట శక్యము కాని శోకసాగరములో మునిగిపోయినవాడై ఇట్లు పలికెను.(32)

"ఓ కౌసల్యాదేవీ! నేను ఈ శోక మనెడు మహాసముద్రములో మునిగి పోయినాను. రామశోకమే దీని మహావైశాల్యము. సీతావిరహమే దీని అవలి ఒడ్డు. నిట్టూర్పులే దీని తరంగములు, మరియు పెద్ద సుడులు. ఇది బాష్పమనెడు నురుగుతోను, జలముతోను వ్యాకులముగా నున్నది. చేతులు కదుపుటయే(కదలుచున్న చేతులే) మీనసముదాయము. ఏడ్పులే మహాధ్వని. విరబోసికొనిన కేశములే నాచు. కైకేయియే బడబాగ్ని. ఇది నా కన్నీళ్ల వేగమునకు కారణభూతము. దీనిలో గూనుదాని మాటలే పెద్ద పెద్ద మొసళ్లు. క్రూరురాలైన కైకేయి అడిగిన వరములే తీరములు. రాముని దూరముగా పంపివేయుటచే ఇది అతిదీర్ఘమైనది. రాముడు లేకుండగా, నేను దీనిని సజీవుడనై దాటజాలను. ఎంత కష్టము వచ్చిపడినది!(33-36)

లక్ష్మణసహితుడైన రాముని చూడవలె నను కోరిక ఉన్నను నే నాతనిని ఇక్కడ చూడజాలకపోవుచున్నాను. ఇది ఏ మాత్రము బాగు లేదు." అని విలపించుచు మహాయశఃశాలి యైన ఆ దశరథుడు మూర్ఛిల్లి, శయనముపై పడిపోయెను.(37)

దశరథు డా విధముగ రామునికొరకై అతిదీనముగా, పూర్వముకంటెను రెట్టింపు దుఃఖముతో విలపించుచు మూర్ఛిల్లగా, రాముని తల్లియైన కౌసల్య, ఆ మాటలు విని చాల భయపడెను.(38)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఏబది తొమ్మిదవ సర్గము సమాప్తము.

అరువదియవ సర్గము

కౌసల్య విలపించుట. సుమంత్రు డామెను ఓదార్చుట.

అపుడు కౌసల్య భూతము ఆవహించినది వలె వణకుచు, స్పృహతప్పినది వలె నేలపై మాటిమాటికిని దొర్లుచు, సుమంత్రునితో ఇట్లు పలికెను.(1)

"సీతారామలక్ష్మణు లెక్కడ ఉన్నారో, నన్ను కూడా అక్కడికే తీసికొని పొమ్ము. వాళ్లను విడచి నేను ఇక్కడ క్షణకాల మైనను ఉండుటకు ఇచ్చగింపను."(2)

రథమును శీఘ్రముగా వెనుకకు మరల్చుము. నన్ను కూడ దండకారణ్యముకు తీసుకొనిరమ్ము. వాళ్లకు అనుసరించి వెళ్ళక పోయినచో నేను యమలోకమునకే పోయెదను. (3)

సుమంత్రుడు అంజలి ఘటించి నమస్కరించుచు, బాష్పవేగము అడ్డుకొనగా తొట్రుపడుచున్న వాక్కుతో కౌసల్యను ఓదార్చుచు ఇట్లు పలికెను.(4)

"శోకమును, మోహమును, దుఃఖమువలన కలిగిన తొందరపాటును విడిచిపెట్టుము. రాము డే కష్టములును లేకుండ వనములో నివసించగలడు. ధర్మజ్ఞుడైన లక్ష్మణుడు జితేంద్రియుడై వనమునందు రాముని పాదసేవ చేయుచు పరలోకమును సాధించుచున్నాడు.(5, 6)

సీత వనమునందు, గృహమునందు వలె నివసించుచు, మనస్సును రామునిపైననే నిలిపి, భయము లేనిదై, విశ్వాసముతో ఉన్నది. సీతలో ఏ మాత్రము కూడ దైన్యము కనబడుటలేదు. ఆమె ఎన్నియో ప్రవాసములకు, ఎప్పటినుండియో అలవాటుపడి నట్లు నాకు కనబడుచున్నది. సీత, పూర్వము నగరోద్యానములకు వెళ్లి అక్కడ ఏవిధముగ క్రీడించుచుండెడిదో, అట్లే నిర్జనము లైన అరణ్యములందు కూడ విహరించుచున్నది.(7-9)

పూర్తిగా రామునిపై చిత్తము నిలిపిన ఆ పూర్ణచంద్రముఖి యగు సీత, విజనమైన వనములో నివసించుచున్నను, బాలిక వలె విహరించుచున్నది. ఆమె హృదయ మెల్లప్పుడును రామునియందే లగ్నమైనది. ఆమె జీవితము రామునిపై ఆధారపడి యున్నది. రాముడు లేనిచో అయోధ్య కూడ ఆమెకు వనమే అగును. సీత, వనములో నున్నను, అయోధ్యకు క్రోసు దూరమునందున్న ఉద్యానవనములో ఉన్నట్లు ప్రవర్తించుచు, తనకు కనబడిన గ్రామములు, నగరములు, నదీప్రవాహములు, వివిధవృక్షములు మొదలగు వాటినిగూర్చి రాముని గాని, లక్ష్మణుని గాని ప్రశ్నించి తెలుసుకొనుచున్నది.(10-13)

సీతకు సంబంధించి ఈ విషయము మాత్రమే నాకు జ్ఞప్తిలో ఉన్నది. కైకేయిని గూర్చి ఆమె తొందరగా ఏమో అన్నది గాని, అది నాకు ఇప్పుడు గుర్తు లేదు."(14)

ఈ విధముగా నాలుక చివరకు వచ్చిన, కైకేయిని గూర్చి సీత అన్న మాటలను కప్పిపుచ్చి, సుమంత్రుడు కౌసల్యకు ఆనందమును కలిగించు, మధురమైన వాక్యము పలికెను. ('సుమంత్రుడు సీతకు సంబంధించిన విషయములు చెప్పుచుండగా, ఆమె కైకేయిని గూర్చి అన్న పరుషవాక్యములు కూడ నాలుక చివరకు వచ్చినవి. ఆ మాటలు కూడ చెప్పినచో కౌసల్యాదులకు ఇంకను దుఃఖము కలుగు నని అతడు వెంటనే గ్రహించి, మాట మార్చివేసి, "కైకేయిని గూర్చి కూడ సీత ఏమేమియో అన్నది కాని, తొందరగా చెప్పుటచే అది నా కిపుడు గుర్తు లేదు" అని ఆ ప్రసంగము దాటవేసి, కౌసల్యకు ఆనందము కలిగించు విషయము చెప్పెనని భావము').(15)

ప్రయాణముచేత గాని, వాయువేగముచేత గాని, కంగారుపడుటచేత గాని, ఎండచేత గాని, చంద్రకిరణములతో సమానమైన సీత శరీరకాంతి ఏ మాత్రము వాడిపోవుటలేదు. పద్మముతో సమానమూ, పూర్ణచంద్రునివంటి కాంతి గలదీ అయిన, ఉదారస్వభావురాలగు ఆ సీత ముఖము ఏ మాత్రము వసివాడలేదు. ఆమె పాదములకు లత్తుక(పారాయణ) వ్రాసుకొనకపోయినను అవి లత్తుక వలె ఎఱ్ఱగా నుండి, ఇప్పుడు కూడ, పద్మపు మొగ్గల వంటి కాంతితో ప్రకాశించుచున్నవి.(16-18)

సీత ఆడుకొనుచున్నట్లు నడచుచుండగా ఆమె కాలి నూపురములు, ఆమె విలాసమును ఘోషించుచున్నట్లున్నవి. సీత ఇప్పుడు, రామునకు ఆనందమును కలిగించుటకై భూషణములు ధరించి ఉన్నది. వనములో ఉన్న ఆ సీత, రాముని బాహుబలముచే రక్షింపబడుచు ఏనుగును గాని, సింహమును గాని, వ్యాఘ్రమును

గాని చూచి కూడ భయపడుట లేదు. వారిని గూర్చి గాని, మనలను గూర్చి గాని, మహారాజును గూర్చి గాని విచారించవలసిన పని లేదు. ఈ చరిత్ర లోకమునందు స్థిరముగా నిలచి ఉండగలదు.(19-21)

ఆ సీతారామలక్ష్మణులు శోకమును విడచి, సంతోషముతో గూడిన మనస్సులతో, మహర్షులు నడచిన మార్గమునందు స్థిరముగా ఉన్నవారై, వనములో ఆనందించుచు, అక్కడ లభించు ఫలములను భుజించుచు, తండ్రియొక్క శుభమైన ప్రతిజ్ఞను పాలించుచున్నారు."(22)

యుక్తముగా పలుకుచున్న సుమంత్రు డీ విధముగా నివారించుచున్నను కౌసల్య పుత్రశోకముచే పీడితురాలై, "ప్రియపుత్రా రామా!" అని అరచుట మానలేదు.(23)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని అరువదవ సర్గము సమాప్తము.

అరువదియొకటవ సర్గము

కౌసల్య విలపించుచు దశరథుని నిందించుట.

కౌసల్య చాలా దుఃఖించుచు, ఏడ్చుచు భర్తతో ఇట్లు పలికెను.(1)

"దశరథుడు దయాశీలుడు, ఉదారస్వభావము కలవాడు, ప్రియముగా మాటలాడువాడు." అని నీకు మూడు లోకములందును గొప్ప కీర్తి ఉండిన ఉండవచ్చును. (నీకెంత కీర్తి ఉన్నను), చిన్నతనమునుండియు సుఖముగా పెరిగిన, సీతాసహితులైన నీ కుమారు లిరువురును దుఃఖించుచు, వనములో క్లేశములను ఎట్లు సహించగలరు? సుకుమారీ, సుఖములకు అలవాటుపడినదీ అయిన ఆ సీత యౌవనమధ్యమునం దున్నది. అట్టి ఆ తరుణి శీతోష్ణములను ఎట్లు సహింపగలదు? ఇంతవరకును, సూపములతోను, ఉపదంశములతోను కూడిన మంచి ఆహారమును భుజించుచున్న విశాలాక్షి యైన సీత, అరణ్యములో లభించు నెవరు ధాన్యముతో చేసిన ఆహారమును ఎట్లు తినగలదు?(2-5)

మంగళకరమైన గీతవాద్యధ్వనులను వినుటకు అలవాటుపడిన, అనిందిత యగు ఆ జానకి, అరణ్యములో సింహాదిక్రూరమృగముల భయంకరధ్వనిని ఎట్లు

వినగలదు? ఇంద్రధ్వజము వలె ఉన్నతమైనవాడు, మహాబలశాలీ అయిన రాముడు పరిఘ వంటి బాహువును తలగడగా పెట్టుకొని ఎక్కడ శయనించుచున్నాడో కదా! పద్మము వంటి వర్ణము, అందమైన కేశాగ్రములు, పద్మగంధము వంటి గంధము గల శ్వాస, పద్మములవంటి నేత్రములూ కల ఉత్తమమైన రాముని ముఖమును మరల ఎప్పుడు చూచెదనో! ఆ రాముని చూడకున్నను నా హృదయము, వేయి ముక్కలుగా బ్రద్దలగుట లేదు. నిజముగా ఇది వజ్రములో ఉండు సారముతో చేయబడినది; సందేహము లేదు. నీవు కరుణావిహీనుడవై, సుఖము ననుభవించుటకు తగిన నా కుమారుడు మొదలగువారిని దూరముగా పంపివేయగా, వారు దీనులై వనములో తిరుగాడుచున్నను నా హృదయము బ్రద్దలుకాకున్నది. (6-10)

రాముడు పదునైదవ సంవత్సరమునందు తిరిగి వచ్చినను భరతుడు రాజ్యమును, కోశమును విడచి, రామునకు అప్పచెప్పు నని ఊహింపజాలము. (11)

కొందరు శ్రాద్ధమునందు తమ బంధువులకే ముందుగా భోజనము పెట్టి అటు పిమ్మట బ్రాహ్మణోత్తములను ఇష్టపంక్తికి ఆహ్వానింతురట. ఆ విధముగ ఆహ్వానించినపుడు గుణవంతులు, విద్వాంసులు, దేవతాసదృశులు అయిన బ్రాహ్మణులు, ఇతరులు భోజనము చేసిన తరువాత తమకు అమృతము పెట్టినను స్వీకరింపరు. తమకంటె ముందు భుజించినవారు బ్రాహ్మణులే యైనను, బుద్ధిమంతులైన బ్రాహ్మణులు, వృషభములు తమ కొమ్ములను ఛేదించుటకు ఎట్లు అంగీకరింపవో, అట్లు ఇతరులు భుజించిన పిదప భుజించుటకు అంగీకరింపజాలరు. (12-14)

అదేవిధముగా జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అయిన సోదరుడు తమ్ముడు అనుభవించి తనకిచ్చిన రాజ్యమును నిరాకరింపకుండునా? మరి యొక మృగము ముట్టిన ఆహారమును పెద్దపులి తినదు. అట్లే పురుషశ్రేష్ఠుడైన రాముడు, ఇతరు లనుభవించిన రాజ్యమును, అంగీకరించడు. (15, 16)

హవిస్సు, నెయ్యి, పురోడాశములు, కుశలు, ఖాదిరయూపస్తంభములు వీటిని ఒక పర్యాయము ఉపయోగించిన వాటిని, మరల యజ్ఞములో ఉపయోగించరు. అట్లే, రాముడు, ఇతరు లనుభవించిన రాజ్యమును, సారము తీసివేసిన సురను వలె, నష్టమైన సోమలత గల యజ్ఞమును వలె అంగీకరింపజాలడు. (17, 18)

మిక్కిలి ఆత్మాభిమానము గల రాముడు ఆ అవమానమును సహించడు.

అతడు కోపించినచో, తీక్ష్ణమైన శరములతో మందరపర్వతమును కూడా చీల్చివేయగలడు. తండ్రి వనే గౌరవముచేత ఆ మహాత్ముడు నిన్ను చంపుటకు ఉత్సహించుటలేదు. కోపగించినచో, చంద్రసూర్యగ్రహాదులతో కూడినదీ, నక్షత్రములచే విచిత్రముగా ఉన్నదీ అయిన ఆకాశమును, ద్యులోకమును కూడ క్రిందికి పడగొట్ట సమర్థుడైన ఆ రాముడు నీ మాట దాటుటలేదు. అతడు తలుచుకొన్నచో వందలకొలది శైలములతో వ్యాప్తమైన భూమిని క్షోభింపచేయగలడు. లేదా చీల్చివేయగలడు.(19-21)

బలము గల వ్యాఘ్రము, ఎవరైన దాని తోకను స్పృశించినచో ఎట్లు సహింపదో, అట్లే రాముడు ఈ అవమానమును సహించడు. మహాయుద్ధములో లోకము లన్నియు కలిసి వచ్చి ఎదిరించినను రామునకు భయము కలిగింపజాలవు. ఈ ధర్మాత్ముడు, ధర్మవిముఖమైన లోకమునందు ధర్మమును నిలుపగలడు.(22, 23)

మహాపరాక్రమవంతుడు, ఆజానుబాహువు అయిన రాముడు బంగారుబాణముల చేత, ప్రళయకాలము వలె, సకలభూతములను, సముద్రములను కూడ కాల్చివేయగలడు. (24)

సింహము వంటి బలము కలవాడూ, వృషభము నేత్రముల వంటి నేత్రములు కలవాడూ అయిన అట్టి ఆ పురుషశ్రేష్ఠుని తండ్రివైన నీవే స్వయముగా, మత్స్యము తన పిల్లను చంపినట్లు నశింపచేసినావు. ధర్మనిరతుడైన పుత్రుని దేశమునుండి వెడలగొట్టినావు. శాస్త్రబోధితము, ద్విజులు అనుసరించునదీ అయిన సనాతనధర్మము ఇదేనా?(25, 26)

రాజా! స్త్రీకి మొదటి గతి (రక్షకుడు) భర్త, కుమారుడు రెండవ గతి, జ్ఞాతులు మూడవ గతి, నాల్గవ గతి ఏదీ లేదు. ఆ మూడు గతులలో మొదటి గతి యైన నీవు నాకు ఉన్ననూ లేనట్లే. రాముడా అరణ్యమునకు పోయినాడు. అతనితో అరణ్యానికి వెళ్లజాలకపోయినాను. నీవు అన్ని విధములా నన్ను గతి లేనిదానిని చేసినావు. (27,28)

నీవు ఈ రాష్ట్రమును రాజ్యమును నశింపచేసితివి. మంత్రులను నశింపచేసితివి. నిన్ను నీవే నశింపచేసికొంటివి. నా కుమారుని నన్ను కూడ నశింపచేసితివి. పౌరులను నశింపచేసితివి. కేవలం నీ కుమారుడైన భరతుడు నీ భార్యయైన కైకేయి మాత్రమే ఆనందించుచున్నారు."(29)

రాజు తీవ్రమైన పదములతో కూడిన ఆ వాక్యమును విని, దుఃఖితుడై మోహము చెందెను. పిదప తాను చేసిన తప్పు పనిని స్మరించుచు శోకార్తుడయ్యెను.(30)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని అరువది ఒకటవ సర్గము సమాప్తము.

అరువది రెండవ సర్గము

దశరథమహారాజు కౌసల్యను ఊరడించుట. కౌసల్య ఆయన పాదములపై పడి క్షమింపగోరుట.

శోకాక్రాంతయైన కౌసల్య చాల కోపముతో పలికిన పరుషములైన ఆ మాటలు విని దశరథమహారాజు చాల దుఃఖించుచు ఆలోచించెను. ఆవిధముగ ఆలోచించి, ఇంద్రియములు కలత చెందగా మూర్ఛచెందెను. పిదప చాల సేపటికి మూర్ఛనుండి తేరుకొనెను. స్పృహ వచ్చిన వెంటనే దీర్ఘముగాను, వేడిగాను, నిట్టూర్చుచు, ప్రక్కనున్న కౌసల్యను చూచి మరల చింతాకులు డయ్యెను.(1-3)

దశరథుడు ఆలోచించుచుండగా, పూర్వము తాను అజ్ఞానమున శబ్దవేధి బాణమును ప్రయోగించి చేసిన పాపకర్మ గుర్తుకు వచ్చెను. ఆ పాపకర్మమువలన కలిగిన శోకము, రామశోకము రెండును మనస్సును ఎక్కువగా పీడించగా పరితపించెను. ఈ శోకములు దహించివేయుచుండగా, ఆ రాజు వణికిపోవుచు, ముఖము క్రిందికి వంచి, కౌసల్యను అనుగ్రహింపచేసికొనుటకై చేతులు జోడించి నమస్కరించుచు. ఆమెతో ఇట్లనెను.(4-6)

కౌసల్యా! నేను ఇదిగో చేతులు జోడించి బ్రతిమాలుచున్నాను. నీవు సర్వదా ఇతరుల విషయమునందు కూడ ప్రేమ కలిగియుండి ఎన్నడును కఠినముగా ప్రవర్తించిన దానవు కాదు కదా? ధర్మదృష్టి గల స్త్రీలకు, గుణవంతుడైనను, గుణవిహీనుడైనను, భర్తయే ప్రత్యక్ష దైవము కదా! నీవు నిత్యము ధర్మమునం దాసక్తి కలదానవు. లోకములోని మంచి చెడ్డలు పెద్ద చిన్న అను తారతమ్యము తెలిసినదానవు. అట్టి నీవు ఎంత దుఃఖముతో ఉన్నను, చాల దుఃఖించుచున్న నన్ను ఈ విధముగ దూషించుట తగదు."(7-9)

దీనుడైన దశరథుడు పలికిన, కరుణాభరితమైన ఆ మాటలు వినగానే, కౌసల్య, నీటి గొట్టము క్రొత్త వాననీటిని కార్చినట్లు, కన్నీరు కార్చెను. ఆమె మిక్కిలి భయపడిపోయి ఏడ్చుచు, రాజు దోసిలిని పద్మమును వలె తన తలపై ఉంచుకొనుచు, కంగారుచే అక్షరములు తొట్రుపడ ఇట్లు పలికెను.(10, 11)

"మహారాజా! భూమిపై పడి నీకు శిరస్సు వంచి నమస్కరించుచు ప్రార్థించుచున్నాను. నన్ను ప్రార్థించుట ద్వారా నీవు నన్ను చంపివేసినట్లయినది. నేను క్షమింప రాని అపరాధము చేసినాను. శ్లాఘింపదగినవాడూ, బుద్ధిమంతుడూ అయిన భర్తచేత అనునయింపచేసుకొనే స్త్రీ ఈ ఇహలోకమునకును, పరలోకమునకును కూడా చెడును కదా. నాకు ధర్మము తెలియును. నీవు సత్యసంధుడవనే విషయము కూడా తెలియును. అయినను నేను పుత్రశోకముతో బాధపడుచు ఏమేమో అనరాని మాటలు పలికినాను.(12-14)

శోకము ధైర్యమును నశింపచేయును. శోకము శాస్త్రజ్ఞానమును నశింపచేయును. శోకము సర్వమును నశింపచేయును. శోకము వంటి శత్రువు లేదు. శత్రువు కొట్టిన దెబ్బ నైనను సహించవచ్చును గాని, హఠాత్తుగా వచ్చిన శోకము ఎంత చిన్న దైనను, దానిని సహించుట కష్టము.(15, 16)

ఓ వీరుడా! ధర్మవేత్తలూ, శాస్త్రజ్ఞులూ, ధర్మార్థముల విషయమున సంశయములన్నియు తొలగినవారు అయిన సంన్యాసులు కూడ శోకముచేత మనస్సు మూఢ మై మోహము చెందుచుందురు. రాముడు అరణ్యమునకు వెళ్ళి నేటికి ఐదు దినము లయినది. కాని శోకముచే సంతోషము నశించిన నాకు ఐదు సంవత్సరముల వలె ఉన్నది. నదీవేగములచే, సముద్రజలము అధికముగా వృద్ధిపొంది నట్లు రాముని తలచుకొనిన కొలది నా హృదయములో శోకము పెరుగుచున్నది."(17-19)

కౌసల్య ఈ విధముగా శుభమైన మాటలాడుచుండగా, సూర్యకిరణములు మందము లాయెను. రాత్రి వచ్చెను.(20)

కౌసల్యచే అనునయించుకొనబడిన ఆ రాజు, శోకాక్రాంతుడై నిద్రకు వశు డాయెను.(21)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని అరువదిరెండవ సర్గము సమాప్తము.

అరువదిమూడవ సర్గము

దశరథుడు పూర్వము తాను మునికుమారుని చంపిన వృత్తాంతమును కౌసల్యకు వినిపించుట.

పిమ్మట ఆ రాజు కొంచెము సేపటికి మేల్కొని, శోకముచేత పీడింపబడిన మనస్సుతో ఆలోచించుట ప్రారంభించెను. రామలక్ష్మణులను ప్రవాసమునకై పంపివేయుటచే, రాహువు సూర్యుని ఆక్రమించి నట్లు గొప్ప ఉపద్రవము దశరథుని ఆక్రమించెను. పూర్వము తాను చేసిన పాపము జ్ఞప్తికి రాగా అతడు దానినిగూర్చి నల్లని నేత్రాంతములు గల కౌసల్యకు చెప్పదలచెను.(1-3)

రాముని అరణ్యమునకు పంపివేసిన తరువాత, ఆ దశరథమహారాజునకు ఆరవ రోజున అర్ధరాత్రమునందు, అతడు పూర్వము చేసిన పాపము గుర్తుకు వచ్చెను. అతడు తాను చేసిన పాపకృత్యమును స్మరించుచు, పుత్రశోకార్త యైన కౌసల్యతో ఇట్లనెను.(4, 5)

"ఓ కౌసల్యా! మానవుడు పుణ్యమైనను, పాపమైనను ఎట్టి కర్మ చేయునో దానికి తగిన ఫలమునే పొందును. తా నేదైన ఒక పని ప్రారంభించినపుడు అది మంచిదా చెడ్డదా అను విషయమును, దానివలన కలుగు ఫలమును, దోషమును ఎవడు తెలుసుకొనడో వాడే బాలుడు(మూఢుడు) అని పెద్దలు చెప్పుదురు. అందమైన పెద్ద పెద్ద మోదుగు చెట్టు పూవులను చూచి, దాని పండ్లు బాగుండు ననుకొని వాటిపై ఆశతో ఒకడు మామిడితోట నరికి మోదుగు చెట్లు పెంచును. చివరకు దాని పండ్లు చూడగానే హతాశుడై దుఃఖించును. తాను చేయు కర్మకు ఎట్టి ఫలము కలుగునో తెలుసుకొనక కర్మ వెనుకనే పరుగెత్తువాడు, కింశుకవృక్షమునకు నీళ్ళుపోసి పెంచినవాని వలె దుఃఖించును.(6-9)

నేను మామిడితోటను నరికి, మోదుగు చెట్లకు నీళ్ళుపోసి పెంచినాను. చెడు బుద్ధి గల నేను ఫలములు లభించే సమయమునందు రాముని దూరముగా పంపివేసి ఇపుడు దుఃఖించుచున్నాను.(10)

కౌసల్యా! శబ్దమును పట్టి బాణముతో కొట్ట గల నవయువకుడు అని పేరు పొందిన నేను కౌమారావస్థలో ఉన్నపుడు, ధనుర్ధారినై ఈ పాపము చేసితిని. తెలియక విషము తిన్న బాలునకు వలె ఇపుడు నాకు కూడ స్వయముగా చేసికొనిన(తెచ్చుకొన్న) దుఃఖము వచ్చిపడినది. ఎవరో ఒక వ్యక్తి పలాశవృక్షములను

చూచి మోసపోయినట్లే నేను కూడ శబ్దమును లక్ష్యముగా చేసి కొట్టుటచే కలుగు ఫలమును తెలుసుకొనజాలక పోయితిని.(11-13)

కౌసల్యా! అప్పటికి నేను నిన్ను వివాహము చేసుకొనలేదు. నేను యువరాజునుగా ఉంటిని. అప్పుడు మదమును, కామమును, వృద్ధిపొందించు వర్షర్తువు వచ్చినది.(14)

సూర్యుడు భూమిలో నున్న రసములు గ్రహించి, కిరణములచేత జగత్తును తపింపచేసి, ప్రేతలు సంచరించు భయంకరమైన దక్షిణదిక్కునకు వెళ్ళెను. వెంటనే వేడి మటుమాయ మయ్యెను. నిగనిగలాడుచున్న మేఘములు కనబడెను. అపుడు కప్పలు, చక్రవాకములు, నెమళ్ళు అన్నీ సంతోషించెను. తడిసిపోయిన రెక్కల పైభాగములతో పక్షులు స్నానము చేసినట్లయినవై గాలికిని, వర్షమునకును కదలిపోవుచున్న అగ్రభాగములు గల చెట్లను అతికష్టముమీద చేరుచుండెను. కురిసిన జలము, ఇంకనూ కురియుచున్న జలము కప్పివేయగా పర్వతము సముద్రము వలె ఉండెను. జలప్రవాహములు నిర్మలములే అయినను, పర్వతములపై నున్న గైరికాదిధాతువుల సంపర్కముచేత వాటి బూడిద కలిసి తెల్లగాను, ఎఱ్ఱగాను మారినవై, సర్పముల వలె ప్రవహించుచుండెను. అంతవరకును నిర్మలముగా ఉన్న ప్రవాహములు కూడ, వర్షకాలము రాగానే, కరిగిపోయి ఎఱ్ఱనైన జలముతో దారి తప్పి ప్రవహించుచుండెను.(15-20)

ఆనందజనకమైన ఆ వర్షాకాలమునందు వేట అను వ్యాయామము చేయవలెనని సంకల్పించి, రథము నెక్కి, ధనుర్బాణములు ధరించి, సరయూనదీతీరము వైపు వెళ్ళితిని.(21)

అక్కడ, నేను రాత్రి నదిలో నీరు త్రాగు రేవునకు వచ్చు మహిషమును గాని, గజమును గాని, మరి యేదైన క్రూరమృగమును గాని చంపవలె నను అభిప్రాయముతో, ధనస్సు సిద్ధముగా ఉంచుకొని, రాత్రియం దొక ఏకాంతప్రదేశమునందు పొంచి ఉంటిని. అక్కడ నేను రహస్యముగా పొంచి ఉండి నదీతీరమునకు వచ్చిన ఒక వన్యమృగమును మరొక క్రూరమృగమును, అవి చేయు శబ్దమును పట్టి గుర్తించి చంపితిని. ఇంతలో అంధకారమునందు, కంటికి కనబడని ప్రవేశమునందు, నీరు నింపుచున్న కుంభము ధ్వని, ఘీంకరించుచున్న ఏనుగు ధ్వని వలె వినవచ్చెను.(22-24)

పిమ్మట ఆ గజమును కొట్టవలె నను అభిలాషతో, ప్రకాశించుచున్న



సర్పమువంటి బాణము తీసి ఆ ధ్వనిని గురి చూచి విడచితిని.(25)

ఆ ప్రాతఃకాలసమయమున, బాణము మర్మస్థలమునందు గ్రుచ్చుకొనగా నీటిలో పడిపోయిన ఒక వననివాసి "అయ్యో అయ్యో" అని అరచిన అరపు స్పష్టముగా వినబడెను. (26, 27)

ఆ బాణము తగలగనే అక్కడ ఒక మనుష్యవాక్కు వినబడెను– "తపస్సు చేసుకొను నావంటి వానిపై ఈ శస్త్ర మెవరు ప్రయోగించినారో కదా! నేను జలము తీసికొనిపోవుటకై, రాత్రి, ఈ నిర్జన మైన నదికి వచ్చినాను. నన్ను బాణముతో ఎవరు కొట్టినారో! నేను ఎవరికి ఏమి అపకారము చేసితిని? హింసను పరిత్యజించి వనములో లభించు వస్తువులతో వనమునందు జీవిక గడుపుచున్న నా వంటి ఋషికి, ఆయుధముచే మరణమును విధించుటకు కారణమేమి? జటాభారమును, నారచీరలను, కృష్ణాజినమును ధరించిన నన్ను చంపవలెనను కోరిక గలవాడు ఎవ్వడో! అతనికి నేను ఏమి అపకారము చేసితిని? అతడెవ్వడో కాని, కేవలము అనర్థమును మాత్రమే కలిగించు వ్యర్థమైన కార్యము చేసినాడు. గురుతల్పగమనము చేసినవానిని ఎవ్వరునూ మెచ్చుకొనరు. అట్లే నాపై బాణము ప్రయోగించినవానిని ఎవ్వరునూ మెచ్చుకొనరు.(28–32)

నేను మరణించుచున్నందుకు నన్ను గూర్చి నాకు అంతగా విచారము లేదు. నాకు మరణము సంప్రాప్తించినందుకు నా తల్లిదండ్రుల నిద్దరిని గూర్చి మాత్రమే విచారించుచున్నాను. నేను ఆ వృద్ధదంపతులను చిరకాలమునుండి పోషించుచున్నాను. నేను మరణించిన పిమ్మట వారు ఏ విధముగా జీవితమును సాగింతురో కదా! నా తల్లిదండ్రులు, నేనూ కూడా నాకు తగిలిన ఒకే బాణముచేత చంపబడినాము. ఈ విధముగా మమ్ముల నందరినీ చంపిన, ఆ మనోనిగ్రహము లేని పరమమూఢు డెవ్వడో కదా!"(33–35)

దీనములైన ఆ మాటలు వినగానే, ధర్మమునందు ఆసక్తి గల నాకు చాల వ్యథ కలిగినది. నా చేతులనుంచి శరచాపములు జారి నేలపై పడినవి. రాత్రి ఆ విధముగ మిక్కిలి విలపించుచున్న అతని దీనవచనములు విని నా మనస్సు చాల వికల

మైపోయెను. బలము ఉడిగిపోయి, మనస్సులో మిగుల దుఃఖించుచు, నేను ఆ ప్రదేశమునకు వెళ్ళి సరయూనదీ తీరమున బాణముచే హతుడై, శల్యముచేత పీడింపబడుచు, నేలపై పడి యున్న మునికుమారుని చూచితిని. అతని జటాభారము విడిపోయి చెదరి ఉండెను. కలశములోని ఉదకము దూరముగా పడిపోయెను. అతని శరీర మంతయు పరాగము చేతను, రక్తముచేతను కప్పబడి ఉండెను. (36-39)

భయపడి, దిగులు చెందిన మనస్సు గల నన్ను అతడు తన తేజస్సుచేత కాల్చివేయదలచుచున్నాడా అన్నట్లు నేత్రములతో పైకి చూచి పరుషముగా ఇట్లు పలికెను. (40)

"రాజా! నా తల్లిదండ్రుల కోసము జలము తీసికొనిపోవుచున్న నన్నిట్లు కొట్టితివే! వనములో నివసించుచున్న నేను నీకు ఏమి అపకారము చేసినాను? ఒక్క బాణముతో నన్ను మర్మస్థానమునందు కొట్టుటచేత, వృద్ధులూ, అంధులూ అయిన నా తల్లిదండ్రులను కూడా చంపి నట్లు అయినది కదా! దప్పికొన్న దుర్బలులు, అంధులు అయిన నా తల్లిదండ్రులు, నా కోసమై నిరీక్షించుచు, నేను జలము తీసికొనివచ్చెద నను ఆశతో, అతికష్టముగా దప్పికను ఆపుకొనుచుందురు. (41-43)

నే నీ విధముగ నేలపై పడి ఉన్నట్లు నా తండ్రికి తెలియదు. దీనిని పట్టి తపస్సునకు గాని, శాస్త్రజ్ఞానమునకుగాని ప్రయోజన మేమియు లేదని నిశ్చయముగ చెప్పవచ్చును. దుర్బలుడై, నడచుటకు కూడా శక్తి లేని నా తండ్రి, ఈ విషయము తెలిసినను ఏమి చేయగలడు! ప్రక్కనున్న వృక్షమును నరికివేయుచుండగా మరి యొక వృక్షము దానినెట్లు రక్షింపజాలదో, అట్లే ఆతడేమియు చేయజాలడు. రగిలిన అగ్ని వనమును దహించినట్లు, నా తండ్రి కోపగించి నిన్ను దహించకుండ వలె నన్నచో, నీవే వెంటనే వెళ్ళి, నా తండ్రికి ఈ విషయమును చెప్పుము. (44-46)

ఈ కాలిబాట నా తండ్రి ఆశ్రమమునకు పోవును. నీవు వెళ్ళి అతనిని బ్రతిమాలుకొనుము. అట్లు చేసినచో అతడు నిన్ను శపించక విడచును. (47)

నా శరీరమునుండి బాణశల్యమును తీసివేయుము. వాడియైన నీ బాణము నా మర్మస్థానమును, జలవేగము మృదువైన, ఎత్తైన, తీరమును పీడించినట్లు పీడించుచున్నది."(48)

అతని శల్యము తొలగించు విషయమున, "శల్యము లాగి వేయకున్నచో

ఇతడు ప్రాణములు పోక బాధపడును. శల్యము తీసివేసినచో మరణించును. ఇపుడేమి చేయవలెను?" అను చింత నాకు కలిగెను. అప్పుడా మునికుమారుడు, దుఃఖితుడనై, దీనుడనై, శోకముతో వ్యాకులుడనై ఉన్న నా మనస్సులోని భావమును గ్రహించెను. అతడు బాధతో క్రుంగిపోయి, అవయవము లన్నియు మెలికలు తిరుగగా, నేలపై దొరలుచు మరణోన్ముఖుడై, చాల దుఃఖించుచు, నాతో అతికష్టము మీద ఇట్లనెను.(49-51)

"నేను ధైర్యముతో శోకమును అణగద్రొక్కుకుని, స్థిరచిత్తుడను అగుచున్నాను. బ్రహ్మహత్యాపాపము చేసితినే అని భయపడకుము. నేను బ్రాహ్మణుడను కాను. నీవు మనస్సులో బాధ పడకుము. నేను వైశ్యజాతీయునకు శూద్రస్త్రీయందు జన్మించిన వాడను.(52,53)

మర్మస్థానమునందు బాణము తగిలి, తిరిగిపోవుచు, నేలపై దొరలుచున్న అతడు అతికష్టముమీద నాతో ఈ మాటలు చెప్పెను. శరీరము ముడుచుకొని పోవగా అతని చేష్టలు కూడ తగ్గిపోయెను. అపుడాతని శరీరమునుండి నేను బాణమును లాగివేసితిని. ఆ సమయమునందు ఆ తపోధనుడు కండ్లెత్తి నా వైపు చూచి, భయపడుచు ప్రాణములు విడచెను.(54, 55)

కౌసల్యా! మర్మప్రదేశమునందు తగిలిన గాయముచే కలిగిన బాధతో విలపించి, ఎడతెగక నిట్టూర్చుచు, నీళ్లతో తడిసి, సరయూనదిలో పడి ఉన్న అతనిని చూడగానే నాకు చాల దుఃఖము కలిగెను."(56)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని అరువది మూడవ సర్గము సమాప్తము.

అరువది నాలుగవ సర్గము

దశరథుడు రోదించుచు అర్ధరాత్రిసమయమున ప్రాణములు విడచుట.

ధర్మాత్ముడైన దశరథుడు, విలపించుచునే ఆ మునికుమారవధను గూర్చి కౌసల్యతో మరల ఇట్లనెను.(1)

"అక్కడ ఒంటరిగానే ఉన్న నాకు ఇంద్రియములన్నీ వ్యాకులమైపోయినవి. అజ్ఞానముచే చేసిన ఈ మహాపాపమునుండి బైటపడుట ఎట్లా అని ఆలోచించితిని.

పిమ్మట నేను ఆ ఘటమునందు నీరు నింపుకొని, ఆ మునికుమారుడు చెప్పిన మార్గమున ఆ ఆశ్రమమును చేరితిని.(2, 3)

అక్కడ నేను వృద్ధులూ, అంధులూ, దుర్బలులూ అయిన ఆ మునికుమారుని తల్లిదండ్రులను చూచితిని. చేయి పట్టుకొని నడిపించు వారెవ్వరును లేకపోవుటచే వారు రెక్కలు నరికిన పక్షుల వలె ఉండిరి. మరి యొక కార్యమేమియు లేక కుమారుని గూర్చిన మాటలే చెప్పుకొనుచుండిరి. రక్షకుడు లేనివారు వలె ఉత్సాహశూన్యులై ఉన్న వారికి ఉన్న కుమారుని గూర్చిన ఆశకూడ నాచే భగ్నము చేయబడినది.(4,5)

అంతకు పూర్వమే శోకముచేత పీడింపబడిన చిత్తముతో, ఏమి జరుగునో అని భయపడుచున్న నాకు ఆ ఆశ్రమమును చేరగానే ఇంకను అధికముగా దుఃఖము కలిగెను.(6)

నా అడుగుల చప్పుడు విని ఆ ముని ఇట్లు పలికెను – "కుమారా! ఆలస్యము చేసితి వేమి! నాకు శీఘ్రముగా ఉదకము ఇమ్ము. నీ వీ విధముగా చాల సేపు నీటిలో ఆడుకొనుటచే నీ తల్లి బెంగపెట్టుకొన్నది. శీఘ్రముగా ఆశ్రమములోనికి రమ్ము. నీ తల్లి గాని, నేను గాని ఏదైన అపరాధము చేసినచో తపఃశాలి వైన నీవు దానిని మనస్సులో ఉంచుకొనరాదు. గతి లేని మాకు నీవే గతివి. నేత్రములు లేని మాకు నీవే నేత్రములు. మా ప్రాణములు నీమీదనే ఆధారపడి యున్నవి. నీవు మాతో మాటలాడుట లే దేమి?"(7-10)

నేనా మునిని చూడగానే భయపడి అస్పష్టమూ, పదములు కలిసి పోయినదీ అయిన వాక్కుతో ఇట్లు పలికితిని. నేను ఎంతో ప్రయత్నించి మనఃప్రవృత్తిని, వాగ్బలమును నిలబెట్టుకొని ఆ మునీశ్వరునకు పుత్రవ్యసనమువలన కలిగిన భయమునుగూర్చి చెప్పితిని. (11, 12)

"నేను దశరథుడనే పేరు గల క్షత్రియుడను; మహాత్ముడైన నీ కుమారుడిని కాదు. సజ్జనులు నిందించు ఈ దుఃఖమును చేతులార చేసిన కర్మచే తెచ్చి పెట్టుకొనినాను.(13)

ఓ పూజ్యుడా! నేను ధనుస్సు ధరించి, ఏదైన ఒక క్రూరమృగమును, నీరు త్రాగు రేవునకు వచ్చు గజమును చంపవలె నను కోరికతో సరయూతీరమునకు వచ్చితిని. అంతలో నాకు నీరు నింపుచున్న కుంభము ధ్వని వినబడెను. అది ఏనుగు

అని తలచి నేను దానిని బాణముతో కొట్టితిని.(14, 15)

పిదప నదీతీరమునకు వెళ్లి అక్కడ, బాణము వక్షఃస్థలమునందు గ్రుచ్చుకొని ప్రాణములు పోయి, నేలపై పడి యున్న మునిని చూచితిని. శబ్దమును లక్ష్యముగా చేసి ఏనుగును చంపవలె నను ఉద్దేశముతో నేను నారాచబాణమును విడువగా అది తగిలి నీ కుమారుడు నిహతుడైనాడు.(16, 17)

పిమ్మట నే నాతనిని సమీపించి, బాధపడుచున్న అతని మాట ప్రకారము, అతని మర్మస్థానమునుండి బాణమును ఊడలాగితిని. ఆ బాణమును ఊడలాగినవెంటనే అతడు తల్లిదండ్రులైన మీ ఇరువురను గూర్చి దుఃఖించుచు, వారు అంధులని చెప్పి విలపించుచు, అక్కడనే స్వర్గమునకు వెళ్ళినాడు. అజ్ఞానముచే తొందరపడి నేను నీ కుమారుని చంపినాను. ఇది ఈ విధముగ జరిగిపోయినది. ఈ విషయమున నే నేమి చేయవలెనో నీవు ఆజ్ఞాపించుము."(18-20)

దుర్వార్తను తీసికొని వచ్చిన నేను చెప్పిన ఆ క్రూరమైన మాట విని పూజ్యుడైన ఆ మునీశ్వరునకు తీక్ష్ణమైన దుఃఖము(లేదా కోపము) కలిగెను. మహాతేజఃశాలియైన ఆ మునీశ్వరుడు కన్నీళ్ళు కారుచున్న ముఖముతో నిట్టూర్చుచు, దుఃఖపీడితుడై దగ్గరనే చేతులు జోడించుకొని నిలచి ఉన్న నాతో ఇట్లనెను.(21, 22)

రాజా! నీవు చేసిన ఈ అమంగళకృత్యమును నీవు స్వయముగా వచ్చి నాకు చెప్ప కున్నచో, వెంటనే నీ శిరస్సు లక్ష ముక్కలుగా బ్రద్దలై ఉండెడిది. క్షత్రియుడు ఎవ్వని నైన తెలిసి చంపినచో, విశేషించి వానప్రస్థుని చంపినచో, ఆ పాపము దేవేంద్రుని కూడ పదచ్యుతుని చేయును. తపస్సులో నున్న మునిపై గాని, అట్టి బ్రహ్మచారిపై గాని, తెలిసి ఆయుధమును ప్రయోగించినవాని శిరస్సు ఏడు ముక్కలగును.(23-25)

నీ వీ పనిని తెలియక చేసితివి గాన ఇంకను బ్రతికి ఉన్నావు. అట్లు కానిచో నీ వేమిటి, ఇక్ష్వాకువంశమే నశించేది!(26)

రాజా! మా ఇద్దరినీ ఆ ప్రదేశమునకు తీసికొని వెళ్ళుము. రక్తముచే శరీరము తడిసి, వస్త్రముగా ధరించిన కృష్ణాజినము తొలగిపోయి, యమునకు వశుడై ప్రాణములు కోల్పోయి నేలపై పడి యున్న కుమారుని చివరి చూపుగా చూడవలెనని కోరుచున్నాము." అని నాతో పలికెను.(27, 28)

పిదప, నేను, చాల దుఃఖించుచున్న వారిద్దరినీ ఆ ప్రదేశమునకు తీసికొని

వెళ్ళి వారు తమ పుత్రుని స్పృశించునట్లు చేసితిని. తపశ్శాలు లైన ఆ ఇద్దరును తమ కుమారుని సమీపించి, అతని శరీరమును స్పృశించి, అతని శరీరముపై పడిరి. తండ్రి ఇట్లు పలికెను.(29, 30)

వత్సా! నేడు నీవు నాకు నమస్కారము చేయుట లేదు. మాట కూడ మాటలాడుట లేదు. నేలపై శయనించితివా(లేదా ఏల పడియున్నావు?) లేక నాపై నీకు కోపము వచ్చినదా? నేననినచో నీకు ఇష్టము లేనిచో నీ తల్లి నైనను చూడుము. పుత్రా! నన్ను అలింగనము చేసికొనుట లేదేమి! ఓ సుకుమారా! నాతో మాటలాడుము. తెల్లవారు జామున వేదమును గాని, మరియొక గ్రంథమును గాని మనోహరముగా చదివెడు నీ మధురకంఠధ్వని నా కిటుపై ఎట్లు వినిపించును?(31-33)

కుమారా! స్నానము చేసి, సంధ్యోపాసనానంతరము అగ్నికార్యము చేసికొని, శోకభయములతో బాధపడుచున్న నా ప్రక్కనే కూర్చుండి, నన్ను శ్లాఘించువాడవు. ఇకపై ఆ పని ఎవడు చేయగలడు? నేను ఏ పనులూ చేయక, వస్తువులను సంగ్రహింపజాలక నడిపించువాడు లేక కూర్చొని యుండగా, కందమూలఫలములను తెచ్చి ఎవ్వరు నన్ను ప్రియుడైన అతిథికి తినిపించినట్లు తినిపించును? పుత్రప్రేమ కలదీ, వృద్ధురాలూ, అంధురాలూ అయిన నీ తల్లి చాల దుఃఖించుచు శోచనీయస్థితిలో ఉన్నది. ఈమెను నేను ఎట్లు పోషించగలను?(34-36)

కుమారా! ఆగుము; యమలోకమునకు వెళ్ళవద్దు, వెళ్ళవద్దు. నాతోను తల్లితోను కలసి రేపు వెళ్ళెదవు లెమ్ము. నీవు లేకపోవుటచే శోకార్తులమై, దీనులమై, ఈ అరణ్యములో రక్షకులెవ్వరును లేక ఉన్న మేము ఇద్దరమూ కూడ యమలోకమునకు వచ్చెదము. అక్కడ నేను యమునితో, "యమధర్మరాజా! క్షమించుము; ఇతడు తల్లిదండ్రులను పోషించు నట్లు అనుమతి నిమ్ము." అని పలికెదను. ధర్మాత్ముడూ, మహాయశశాలీ, లోకపాలకుడూ అయిన ఆ యమధర్మరాజు ఇట్టి స్థితిలో ఉన్న నాకు ఈ అభయదక్షిణ నొక్కదానిని ఇవ్వగలడు.(37-40)

కుమారా! నీవు ఏ పాపము లేనివాడవు. అట్టి నిన్ను ఈ పాపకర్ముడు చంపినాడు. అందుచే ఆయుధములతో యుద్ధము చేయువారికి ఏ లోకములు లభించునో వాటిని పొందుము. యుద్ధములో వెనుకకు తిరగని శూరులు శత్రువులకు ఎదురుగా నిలచి, వారిచే నిహతులై ఏ ఉత్తమగతిని పొందుదురో ఆ గతిని పొందుము. సగరుడు, శైబ్యుడు, దిలీపుడు, జనమేజయుడు, నహుషుడు

దుందుమారుడు ఏ గతి పొందినారో అట్టి సద్గతి నీకు లభించుగాక. సమస్తమైన సాధువులకు ఏ గతి లభించునో, స్వాధ్యాయమువలనను, తపస్సువలనను ఏ గతి లభించునో, భూదానము చేసినవారికి, ఆహితాగ్నికిని, ఏకపత్నీవ్రతము పాటించువానికిని ఏ గతి లభించునో, వేయి గోవులను దానము చేసినవారికి ఏ గతి లభించునో, పెద్దలను పోషించువారికి ఏ గతి లభించునో గంగాదిపుణ్యనదులలో సంకల్పపూర్వకముగా దేహత్యాగము చేసినవారికి ఏ గతి లభించునో ఆ గతి నీకు లభించుగాక.(41-45)

మన కులములో పుట్టినవాని కెవ్వనికిని చెడ్డ గతి రాదు. నా కుమారుడ వైన నిన్ను చంపినవానికే అట్టి గతి కలుగును."(46)

ఈ విధముగా ఆ ముని అక్కడ చాలసేపు ఏడ్చెను. పిమ్మట, భార్యాసహితుడైన అతడు కుమారునకు ఉదకక్రియలు చేయుటకు ప్రారంభించెను. ధర్మవేత్త యైన ఆ మునికుమారుడు తన పుణ్యకర్మల ఫలముగ దివ్యరూపము ధరించి దేవేంద్రునితో కూడ శీఘ్రముగా స్వర్గలోకమునకు వెళ్లెను. ఇంద్రసమేతుడైన ఆ మునికుమారుడు ఆ వృద్ధులతో మాటలాడెను. తల్లిదండ్రులను క్షణకాలము పాటు ఓదార్చి వారితో ఇట్లు పలికెను.(47-49)

"మీకు సేవ చేయుటవలన ఉత్తమస్థానమును పొంద గలిగితిని. మీరు కూడ శీఘ్రముగ నా సమీపమునకు రాగలరు."(50)

జితేంద్రియుడైన ఆ మునికుమారుడు ఇట్లు పలికి, అందమైన దివ్య విమానముపై ఎక్కి వెంటనే స్వర్గమునకు వెళ్ళెను.(51)

గొప్ప తేజస్సు గల ఆ ముని భార్యాసమేతుడై, జలతర్పణములు శీఘ్రముగ ముగించుకొని, దగ్గరనే అంజలి ఘటించి నిలచిన నాతో ఇట్లనెను.(52)

"రాజా! బాణముచే నా ఏకైకపుత్రుని చంపి నన్ను పుత్రుడు లేని వానినిగా చేసితివి కదా! నన్ను కూడ ఇప్పుడే చంపివేయుము. మరణమును గూర్చి నాకు బాధ లేదు. నీవు పవిత్రుడైన నా కుమారుని తెలియక చంపినను, నీకు చాల దుఃఖము కలుగునట్లు భయంకరమైన శాపము నిచ్చెదను.(53, 54)

ఇపుడు నేను పుత్రశోకముతో బాధపడుచున్నట్లే నీవు కూడా పుత్రశోకముతో బాధపడుచు మరణించగలవు. క్షత్రియుడ వైన నీవు మునిని తెలియక చంపినావు గాన నీకు బ్రహ్మహత్యాదోషము అంటదు. నీ జీవితమును అంత మొందించు,

ఘోరమైన ఇట్టి పుత్రశోకము, తప్పక నీవు అనుభవించెదవు.(55-57)

ఆ దంపతులు నన్నీ విధముగా శపించి, చాల దీనముగా ఏడ్చి తమ శరీరములను చితిపై ఉంచి ప్రాణత్యాగము చేసి స్వర్గమునకు వెళ్ళిరి.(58)

కౌసల్యా! ఆనాడు, శబ్దవేధిని ప్రయోగించి, నేను స్వయముగ అజ్ఞానముచే చేసిన పాపము నా కీనాడు, ఆలోచించుచుండగా గుర్తుకు వచ్చినది. అపథ్యమైన వస్తువులు కలిపిన అన్నము భుజింపగా కాలాంతరమున వ్యాధి వచ్చినట్లు నేను ఎప్పుడో చేసిన ఆ కర్మకు ఫలముగా ఇది వచ్చినది. నేను పుత్రశోకముతో మరణించగలను అని ఆ మునీశ్వరుడు చెప్పిన మాట ఈనాడు నాకు వచ్చినది. (59-61)


నా దృష్టి మందగించినది. నీవు నాకు కనబడుటలేదు. నన్ను స్పృశించుము." అని పలుకుచు, దశరథుడు ఏడ్చుచు, మరల ఆమెతో ఇట్లనెను.(62)

"కౌసల్యా! రాముని విషయమున నేను చేసిన పని,(అతనిని అరణ్యవాసమునకు పంపివేయుట అనునది) పాపబుద్ధినైన నాకు తగినట్లే ఉన్నది. రాముడు నా విషయమున చేసినపని, (మారు మాటాడక అరణ్యమునకు వెళ్ళుట అనునది) అతనికే తగును. ఈ లోకములో తెలివిగలవా డెవ్వడైనా, ఎంత చెడ్డవాని నైనను కుమారుని విడిచిపెట్టునా? ఏ కుమారుడైనా, తనను ప్రవాసమునకు పంపివేయు తండ్రిపై కోపించకుండునా!(63, 64)

నేను మరణించుటకు పూర్వము రాముడు నన్నొకసారి స్పృశించినను, లేదా నా దగ్గరకు వచ్చినను బాగుండెడిది. మరణానంతరము మానవులు తమ బంధువర్గమును చూడజాలరు కదా!(65)

కౌసల్యా! నా కండ్లకు నీవు కనబడుటలేదు. నా జ్ఞాపకశక్తి తగ్గిపోవుచున్నది, ఇదిగో ఈ యమదూతలు నన్ను తొందరపెట్టుచున్నారు. మరణసమయమున నాకు ధర్మవేత్త, సత్యపరాక్రముడూ అయిన రాముడు దూరమైపోయినాడు. ఇంతకంటె అధికమైన దుఃఖమేదైన ఉండునా! సాటిలేని మహాకార్యములు చేయ గల నా కుమారుడు కనబడక పోవుటచే కలిగిన శోకము నా ప్రాణములు తీసివేయుచున్నది.(66-68)

పదునైదవ సంవత్సరమునందు తిరిగి వచ్చిన రాముని అందమైన కుండలశోభితమైన ముఖమును చూడగలుగువారు దేవతలే; మానవులు కారు.



తామరరేకుల వంటి కండ్లు, అందమైన కనుబొమ్మలు, చక్కని పలువరుస, చక్కని ముక్కు కల చంద్రసమానమైన రాముని ముఖమును అతడు తిరిగివచ్చిన తరువాత చూడగలవారు ధన్యాత్ములు. శరత్కాలచంద్రునితోను, వికసించిన పద్మముతోను సమానమైన, ఉత్తమగంధము గల రాముని ముఖమును చూడగలవారు ధన్యులు. వనవాసము ముగించుకొని అయోధ్యకు తిరిగివచ్చిన రాముని, అకాశమార్గమునందున్న శుక్రుని చూచినట్లు, సుఖవంతులు మాత్రమే చూడగలరు.(69-72)

కౌసల్యా! చిత్తమోహముచేత నా హృదయము క్రుంగిపోవుచున్నట్లున్నది. నా ఇంద్రియములకు దగ్గరగ వచ్చినను శబ్దస్పర్శరూపాదులను గ్రహింప జాలకున్నాను. మనస్సు నశించుటచే నా ఇంద్రియము లన్నియు, తైలము క్షీణించుటచే దీపకిరణములు వలె, నశించుచున్నవి. నదీప్రవాహవేగము తీరమును కూలత్రోసి నట్లు, పుత్రవియోగముచే కలిగిన ఈ శోకము రక్షకులెవ్వరూ లేనివాడను, చైతన్యశూన్యుడను అయిన నన్ను క్షీణింపచేయుచున్నది.(73-75)

అయ్యో రామా! అయ్యో మహాబాహూ! అయ్యో మదీయదుఃఖనాశకా! అయ్యో పితృప్రియా! అయ్యో మద్రక్షకా! అయ్యో నా కుమారా! ఇపు డెక్కడికి వెళ్ళిపోయినావు!(76)

అయ్యో కౌసల్యా! అయ్యో దీనురాలవైన సుమిత్రా! అయ్యో! క్రూరురాలవూ, నా శత్రువువూ, కులమును అపవిత్రము చేసినదానవూ అయిన కైకేయీ! నే నిపుడు మరణించనున్నాను. (77)

దశరథమహారాజు ఈ విధముగా కౌసల్యాసుమిత్రల సమీపమున, విలపించుచు మరణించెను. (78)

దశరథమహారాజు పుత్రుడు అరణ్యమునకు పోవుటచే దుఃఖార్తుడై ఈ విధముగా దీనముగా మాటలాడుచు, అర్ధరాత్రి గడిచిన పిమ్మట దుఃఖము అధిక మగుటచే దానిని భరింపజాలక ప్రాణములు విడచెను. (79)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని అరువది నాలుగవ సర్గము సమాప్తము.

అరువదియైదవ సర్గము

రాజు మరణించుట తెలిసి రాణులు రోదించుట.

దశరథమహారాజు ఈ విధముగా విలపించిన పిమ్మట, మౌనముగా ఉండుట చూచి, రామప్రవాసదుఃఖితురాలగు కౌసల్య, రాజుకు నిద్ర పట్టిన దని తలచి అతనిని మేల్కొలుపలేదు. పుత్రశోకముచే పీడిత మైన మనస్సు గల కౌసల్య శోకశ్రమచే అలసి ఉండెను. అందుచేత ఆమె భర్తతో ఇంక నేమియు మాటలాడక, మరల శయనముపై శయనించెను. (సుమిత్ర కూడ ఇట్లే చేసి ఉండు నని మన మూహింప వచ్చును). ఇంతలో రాత్రి గడిచినది. మరునాడు ప్రాతఃకాలమునందే ఉత్తమమైన సంస్కారమూ విద్యా గల, మంగళవాక్యములను పలుకు సూతులూ, స్తోత్రపాఠకులూ, స్తుతిగీతములు పాడు గాయకులూ తమ తమ స్తుతిపాఠవంశావళ్యాది పాఠములు చేయుచు రాజగృహమును చేరిరి. (1, 2)

ఉచ్చైఃస్వరముతో ఆశీస్సులు పలుకుచు రాజును స్తుతించుచున్న వారి స్తోత్రధ్వని ప్రాసాదముయొక్క విశాలప్రదేశమునందు వ్యాపించెను. సూతులు స్తోత్రములు చేయు సమయమున పాణివాదకులు దశరథుడు పూర్వము చేసిన కృత్యములు ఉదాహరించుచు, చప్పట్లు చరుచుచు పాడిరి. (3, 4)

చెట్ల కొమ్మలమీదా, పంజరాలలోనూ ఉన్న రాజగృహమునకు సంబంధించిన

పక్షులన్నీ ఆ శబ్దమునకు మేల్కొని రొదచేయుట ప్రారంభించినవి. (5)

వందిమాగధాదు లుచ్చరించిన పుణ్యశబ్దములు, వీణాధ్వనులూ, ఆశీర్వాదరూపము లైన గాథాఛందోనిబద్ధగేయములూ, ఆ గృహమును నింపివేసినవి. (6)

పిమ్మట మంచి ఆచారము కలవారు, రాజసేవయందు నిపుణులూ, అయిన జనులు పూర్వము వలెనే దశరథుని సేవించుటకు వచ్చిరి. వారిలో స్త్రీలును, కంచుకులును అధికసంఖ్యలో ఉండిరి. స్నానము చేయించుటలో నేర్పుగల పరిచారకులు, కాలమునకు అనుగుణముగా, నియమానుసారముగా, బంగారు ఘటములలో మంచి గంధము కలిపిన ఉదకమును తీసికొనివచ్చిరి. ఎక్కువమంది కన్యక లున్న స్త్రీలు, శరీరమునకు అలదుకొనే మంగళద్రవ్యములను, తినే వస్తువులను, వస్త్రాదులను తీసికొనివచ్చిరి. (7-9)

దశరథమహారాజుకొరకై, తీసికొనివచ్చిన ఆ పదార్థము లన్నియు, మంచి లక్షణములు కలవై, యథాశాస్త్రముగా అమర్చబడి, సుగుణసంపత్తుతో ప్రకాశించుచు ఉండెను. ఆ పరిజన మంతయు, రాజుకు దగ్గరగా మాత్రము వెళ్ళక, ఉత్సుకతతో, ఏ మైనదా అని శంకించుచు, సూర్యోదయమువరకు అట్లే వేచి ఉండిరి. (10, 11)

అటుపిమ్మట, దశరథమహారాజు శయనము దగ్గరకు వెళ్ళుటకు అధికారముగల స్త్రీలు, అతని శయనము దగ్గరకు వెళ్ళి మేల్కొలిపిరి. వినయముతోను, నయముతోను ఉచితరీతిని ప్రవర్తించు ఆ స్త్రీలు దశరథుని శయనము స్పృశించి చూచినను ఏమియు తెలుసుకొనలేకపోయిరి. ఆ స్త్రీలు చేష్టలను, కదలికలనూ బట్టి నిద్రాస్వభావమును గుర్తింప గలిగినవారు. అట్టి ఆ స్త్రీలు, రాజు ప్రాణముల విషయమున శంకతో వణకిపోవుచు, ప్రవాహమునకు ఎదురుగా నిలచిన తృణముల చివరిభాగములు వలె అయిరి. రాజును చూచిన పిమ్మట, అంతవరకును సందేహించుచున్న స్త్రీలు ఏ పాపమును శంకించిరో, అది నిశ్చిత మాయెను. (12-15)

పుత్రశోకము ఆక్రమింపగా నిద్రపోవుచున్న కౌసల్యాసుమిత్రలు, మరణించిన వారు వలె మేల్కొనలేదు. కౌసల్య శోకముచేత కాంతివిహీనురాలై, శరీరచ్ఛాయ కూడ మారిపోగా, క్రుంగి, కృశించి ఉండుటచే, చీకటి కప్పిన నక్షత్రము వలె ప్రకాశించలేదు. రాజు ప్రక్కనే ఉన్న కౌసల్యా, ఆమె ప్రక్కనే ఉన్న సుమిత్రా కూడ

దుఃఖమువలన కలిగిన కన్నీళ్లచే వ్యాకులములైన ముఖములతో ప్రకాశహీనులుగా ఉండిరి. ఆ విధముగా నిద్రపోవుచున్న రాణులిద్దరినీ, ఆ రాజునూ చూచి, రాజు నిద్రలోనే మరణించె నని అంతఃపురజనులు తలచిరి(తెలుసుకొనిరి).(16-19)

పిమ్మట ఆ స్త్రీ లందరును, అరణ్యములో తమ గుంపుకు నాయకుడైన గజము దూరమైపోయినపుడు ఆడ ఏనుగులు ఏడ్చినట్లు బిగ్గరగా, సస్వరముగా ఏడ్చిరి.(20)

ఆ స్త్రీల ఆక్రందనధ్వనిచేత హటాత్తుగా తెలివి వచ్చి, కౌసల్యాసుమిత్రలు నిద్రనుండి మేల్కొనిరి. కౌసల్యాసుమిత్రలు, ఆ దశరథమహారాజును చూచి, స్పృశించి "హా నాథా!" అని అరచుచు నేలపై పడిపోయిరి. నేలపై దొరలుచు బూడిదచే కప్పబడిన కౌసల్య, ఆకాశమునుండి క్రిందికి పడిన నక్షత్రము వలె, కాంతివిహీన అయి ఉండెను. నేలపై పడి యున్న కౌసల్య ఆ స్త్రీల కందరికిని, చంపబడి నేలపై పడి ఉన్న ఆడ ఏనుగు వలె కనబడెను. (21-24)

కైకేయి మొదలైన రాజభార్య లందరును, ఏడ్చుచు, దుఃఖముచేత పీడితలై, స్పృహ తప్పి, నేలపై పడిపోయిరి.(25)

ఏడ్చుచున్న ఆ స్త్రీలు అత్యధిక మైన ఆ ధ్వనిని అవిచ్ఛిన్న మగునట్లు చేసిరి. ఆ ధ్వనిని గృహము(ప్రతిధ్వనిచే) ఇంకను అధికముచేయగా దానితో గృహమంతయు నిండిపోయెను. దశరథుడు మరణించగనే ఆ గృహమునందు ఆనందము తొలగిపోయెను. పరిజనులందరును భయవిభ్రాంతులై ఏమి చేయుటకును తోచక ఉండిరి. నలుమూలలనుండి ఏడ్పులు వినబడుచుండెను. బంధువు లందరును దుః ఖముచే పీడితులైరి. ఎటు చూచినను దైన్యము, విషాదము కనబడుచుండెను.(26-28)

యశఃశాలీ, రాజశ్రేష్ఠుడూ అయిన, దశరథుడు మరణించి నట్లు తెలియగానే అతని భార్యలు, అతనిని చుట్టుముట్టి, చాలా దుఃఖించుచు, జాలి కలుగునట్లు ఎక్కువగా ఏడ్చుచు ఒకరి చేతు లొకరు పట్టుకొని అనాథలు వలె విలపించిరి.(29)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని అరువది ఐదవ సర్గము సమాప్తము.

అరువదియారవ సర్గము

మంత్రులు రాజు శవమును తైలపాత్రలో నుంచుట. రాణులు విలపించుట.

శాంతించిన అగ్ని వలె, ఉదకము లేని సముద్రము వలె, తేజస్సు పోయిన సూర్యుడు వలె ఉన్న, మరణించిన ఆ రాజును చూచి, కౌసల్య అతని శిరస్సును ఒడిలో నుంచుకొని, కన్నీళ్లు కారుచున్న నేత్రములతో, అనేకవిధములైన శోకములచే కృశించినదై, కైకేయితో ఇట్లు పలికెను.(1, 2)

"క్రూరురాలా! చెడ్డ పనులు చేయు కైకేయీ! నీ కోరికలు ఈడేరినవి. ఇంక రాజు లేడు గాన, నీవు ఎట్టి అడ్డంకులు లేని రాజ్యమును నిరంతరము అనుభవించవచ్చును. రాముడు నన్ను విడచి వెళ్ళిపోయినాడు. నా భర్త స్వర్గస్థుడైనాడు. భయంకరమైన మార్గములో గుంపునుండి విడిపోయినదాని వలె అయినాను. ఇంక జీవించ వలెనను కోరికలేదు.(3, 4)

ధర్మమును కాల తన్నిన కైకేయి తప్ప మరి యే స్త్రీయైన తనకు దేవత యైన భర్తను విడచి జీవించుటకు ఇచ్ఛగించునా? కింపాకమును తినువాడు వలె దురాశాపీడితుడు తాను చేయు పనిలోని దోషమును గుర్తింపడు. గూనుదాని మూలమున కైకేయి రఘువంశమును నశింపచేసినది.(5, 6)

చెడ్డపని చేయుటకై ప్రేరేపింపబడిన దశరథమహారాజు భార్యాసమేతుడైన రాముని అరణ్యమునకు పంపివేసినా దని విని, జనకుడు, నా వలెనే దుఃఖించును. ధార్మికుడు, కమలపత్రముల వంటి నేత్రములు కలవాడూ అగు రాముడు జీవించి ఉండగానే ఇక్కడ కనబడకుండ పోయినాడు. భర్త చనిపోగా నేను అనాథురాలనై ఉన్నట్లు ఆ రామునకు తెలియదు కదా!(7, 8)

దుఃఖమునకు తగనిదీ, దీనురాలూ అయిన జనకరాజదుహిత సీత, వనములో చాల దుఃఖితురాలై భయపడును. ఆమె రాత్రులందు అరుచు భయంకరధ్వని గల మృగపక్ష్యాదుల ధ్వనులను విని భయపడిన దై, తప్పక రాముని చెంత చేరుచుండును. వృద్ధుడూ, పుత్రులు లేనివాడూ అయిన, జనకుడు కూడ సీతను గూర్చియే చింతించుచు, దుఃఖాక్రాంతుడై ప్రాణములను విడచును.(9-11)

పతివ్రత నైన నేను నా భర్త శరీరమును ఆలింగనము చేసికొని అగ్నిలో ప్రవేశించి ఇప్పుడే ప్రాణములను విడచెదను."(12)

దీనురాలైన కౌసల్య శోకార్తురా లై, దశరథుని శరీరమును కౌగిలించుకుని ఈ విధముగ ఏడ్చుచుండగా, అంతఃపురకార్యములందు నియుక్తలైన స్త్రీలు, ఆమెను అక్కడి నుండి దూరముగా తీసికొనిపోయిరి.(13)

అమాత్యులు, వసిష్ఠాదుల ఆజ్ఞ ప్రకారము, రాజు శరీరమును తైలద్రోణిలో ఉంచి, తరువాత చేయవలసిన పను లన్నియు చేసిరి.(14)

అన్ని విషయములు తెలిసిన మంత్రులు, కుమారులెవ్వరును దగ్గర లేనపుడు రాజు శరీరమునకు దహనసంస్కారము చేయుటకు ఇచ్చయించక ఆ దేహమును రక్షించిరి. ఆ రాజు శరీరమును మంత్రులు తైలద్రోణిలో ఉంచగానే "అయ్యో! ఇతడు మరణించినాడు." అని స్త్రీలు ఏడ్చిరి.(15, 16)

కన్నీళ్లు కారుచున్న నేత్రములు గల ముఖములతో, దీనలై బాహువులను పై కెత్తి ఏడ్చుచు, శోకపీడిత లై, దీనముగా విలపించిరి.(17)

"అయ్యో! మహారాజా! ప్రియముగా మాటలాడువాడూ, సత్యసంధుడూ అయిన రామునకు దూరమైన మమ్ములను నీవు కూడ ఏల విడిచిపోయినావు? దుష్టమైన భావము గల కైకేయి మొదటనే మమ్ములను రామునకు దూరము చేసినది. ఇపుడు భర్త కూడా లేని మేము, భర్తను చంపిన ఆమె వద్ద ఎట్లుండగలము? సమర్థుడూ, సద్బుద్ధిశాలీ, శ్రీమంతుడూ, సర్వదా నీకును మాకును సంరక్షకుడుగా ఉన్నవాడూ అయిన ఆ రాముడు రాజ్యలక్ష్మిని విడచి అరణ్యమునకు వెళ్లిపోయినాడు కదా! నీవు, ఆ వీరుడైన రాముడూ లేకపోవుటచే దుఃఖముతో బాధపడుచున్న మేము కైకేయి దూషణలను కూడ సహించుచు ఎట్లు నివసించగలము? రాజును, రాముని, మహాబలుడైన లక్ష్మణుని, సీతను కూడ వదలి వేయగల్గిన కైకేయి ఇతరుల నెవ్వరిని విడిచివేయదు?"(18-22)

దశరథుని భార్యలందరు కన్నీళ్లు కార్చుచు, అధికమైన శోకముతో ఆనందము పూర్తిగ నశింపగా, నేలపై దొర్లిరి.(23)

మహాత్ముడైన ఆ దశరథమహారాజు లేని ఆ అయోధ్య, చంద్రుడు లేని రాత్రి వలె భర్త లేని స్త్రీ వలె శోభావిహీన మయ్యెను. ఆ నగరములోని జనులందరును కన్నీళ్లతో కలత చెంది ఉండిరి. కులాంగనలు హాహాకారము చేయుచుండిరి. ఇళ్ళముందు వాకిళ్లు, గృహమధ్య ప్రదేశములును, శూన్యములైనవి. ఈ విధముగ వెనుకటి శోభను కోల్పోయెను.(24, 25)

దశరథమహారాజు పుత్రశోకముచే స్వర్గస్థుడయ్యెను. అతని భార్యలు దుఃఖములచే నేలపై పడియుండిరి. ఆ సమయమునందు సూర్యుడు అస్తమించెను. రాత్రి సంచరించు ప్రాణుల సంచారమునకు అనువుగ రాత్రి వచ్చెను.(26)

పుత్రులు లేకుండ దశరథునకు సంస్కారము చేయుటకు, వచ్చిన స్నేహితులు ఇష్టపడరు అని ఆలోచించి, ఊహించరాని దర్శనము గల ఆ దశరథుని శరీరమును ఆ శయనముపైననే (తైలద్రోణిలో) ఉంచిరి.(27)

దశరథుడు మరణించుటచే, మార్గములు, చత్వరములు(ముంగిళ్ళు లేదా చతుష్పథములు) బాష్పమును కంఠమునందు నిలుపుకొని దుఃఖించుచున్న జనులతో వ్యాకులములై ఉండెను. అట్టి అయోధ్య సూర్యుడు లేని ఆకాశము వలె, నక్షత్రములు లేని రాత్రి వలె, కాంతి విహీన మై ప్రకాశించకుండెను. దశరథుడు మరణించిన పిమ్మట నగరములోని పురుషులును, స్త్రీలును గుంపులు గుంపులుగా చేరి, భరతుని తల్లిని నిందించుచు చాల దుఃఖించిరి.(28, 29)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని అరువది అరవ సర్గము సమాప్తము.

అరువదియేడవ సర్గము

మునులు, మంత్రులు ఎవ్వరినైన రాజును చేయుమని వసిష్ఠుని ప్రార్థించుట.

అయోధ్యలో ఆ రాత్రి అతిదీర్ఘమై, అరపులతో కన్నీళ్ళు కంఠములం దున్న జనులతో వ్యాకుల మై ఎట్లో గడచెను.(1)

రాత్రి గడచి సూర్యోదయ మైన పిమ్మట రాజును ఏర్పరచు బ్రాహ్మణులందరును కలిసి సభకు వచ్చిరి. మార్కండేయుడు, మౌద్గల్యుడు, వామదేవుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, గొప్ప కీర్తి గల జాబాలి అను బ్రాహ్మణుడును, ఇతర మంత్రులును రాజపురోహితుడైన వసిష్ఠునితో వేరు వేరుగా ఇట్లు పలికిరి.(2, 3)

పుత్రశోకముచే దశరథమహారాజు మరణించిన పిమ్మట వచ్చి, మనకు నూరు సంవత్సరముల వలె తోచిన రాత్రి అతికష్టముమీద గడచినది.(4)

మహారాజు మరణించినాడు. రాముడా అరణ్యమునకు వెళ్ళిపోయినాడు.

తేజఃశాలియైన లక్ష్మణుడు కూడ రామునితో కలిసి వెళ్ళిపోయినాడు. మహావీరులైన భరతశత్రుఘ్ను లిద్దరూ కేకయదేశములో రాజగృహము అను నగరములో మాతామహుని ఇంట ఉన్నారు. అందుచేత ఇక్ష్వాకువంశమునకు చెందిన ఎవని నైనను ఇక్కడ, ఇప్పుడే రాజుగా చేయవలెను. రాజు లేకున్నచో మన రాష్ట్రము నశించి పోవచ్చును. (5-8)

రాజు లేని దేశములో మేఘములు మెరుపులు మెరియుచుండును. ఉరుముచుండును. కాని, భూమిపై వర్షములు కురియవు. రాజు లేని దేశములో, పిడికిళ్లతో విత్తనములు చల్లుట జరుగదు(వ్యవసాయము సక్రమముగా నడవదు). పుత్రుడు కాని, భార్యగాని ఇంటి యజమాని మాట వినరు. రాజులేని రాజ్యమునందు ధనము దక్కదు. రాజు లేని రాజ్యములో భార్య కూడ దక్కదు. చాల ప్రమాదకరమైన విషయమేమనగా రాజు లేని దేశములో సత్యానికి తావు ఉండదు. రాజు లేని దేశమునందలి ప్రజలు, సంతోషముతో సభలు నిర్వహింపరు. అందమైన ఉద్యానములను, దేవాలయాదులను నిర్మింపరు. (9-12)

రాజు లేని రాజ్యములో, యజ్ఞము చేయు స్వభావము కలవారూ, ఇంద్రియనిగ్రహవంతులూ, వేదాధ్యయనసంపన్నులూ, తీవ్రమైన వ్రతములు అవలంబించు వారూ అయిన ద్విజులు యజ్ఞములు చేయరు. రాజు లేని రాజ్యంలో ధనవంతులైన బ్రాహ్మణులు యాగములు చేసి, ఆ మహాయజ్ఞములందు తగిన దక్షిణలను ఇవ్వరు. రాజు లేని దేశములో ఎందరో నటులూ, వర్తకులూ పాల్గొను రాష్ట్రాభివృద్ధికారకము లైన ఉత్సవములూ, సమాజములూ వృద్ధి పొందవు. (13-15)

రాజు లేని రాజ్యములో దాయభాగాదివ్యవహారములకై న్యాయస్థానాదులకు వెళ్ళినవారి పనులు న్యాయసమ్మతముగా నెరవేరవు. కథలు చెప్పు అలవాటు కలవారు కథాప్రియులతో(కథలంటే చాల ఇష్టపడు వారితో) కలిసి కథలు చెప్పుకొనుచు ఆనందింపజాలరు. రాజులేని రాజ్యములో కన్యకలు బంగారు అలంకారములు ధరించి ఒండొరులతో కలిసి, క్రీడించుటకై సాయంకాలమున ఉద్యానమునకు వెళ్ళరు. రాజు లేని రాజ్యములో, యువకులు యువతులతో కలిసి, వేగముగా పరుగెత్తు వాహనము లెక్కి, అరణ్యములకు వెళ్లజాలరు. (16-18)

రాజు లేని దేశములో, కృషి గోరక్షణము మొదలగు వాటిచే జీవించు ధనికులు చక్కగ, రక్షింపబడినవారై, తలుపులు తెరచుకొని నిద్రింపజాలరు. రాజు లేని

రాజ్యములో దంతములకు గంటలు కట్టిన అరువది సంవత్సరాల యౌవనములో ఉన్న ఏనుగులు, రాజమార్గములలో సంచరించవు. రాజు లేని దేశములో, బాణాస్త్రాదుల ప్రయోగమును అభ్యసించునపుడు అవిచ్ఛిన్నముగా బాణములను ప్రయోగించుచున్న వీరుల తలధ్వని వినబడదు. (తల మనగా కుడిచేతిలో లాగిన ధనస్సు వారి దెబ్బ తగలకుండు నట్లు ఎడమచేతికి చుట్టి కట్టిన కఠినచర్మము.)(19-21)

రాజు లేని రాజ్యములో, అనేకమైన పణ్యవస్తువులతో దూరదేశములకు ప్రయాణము చేయవలసిన వర్తకులు మార్గములో క్షేమముగ ప్రయాణము చేయజాలరు. రాజు లేని రాజ్యములో, ఎల్లప్పుడు ఒంటరిగానే సంచరించువాడూ, ఇంద్రియనిగ్రహము కలవాడూ, మనస్సులో ఆత్మస్వరూపమును గూర్చి ధ్యానము చేయువాడూ, ఎక్కడ సాయంకాల మగునో అక్కడనే గృహముగా భావించి ఆ రాత్రి నివసించువాడూ, అయిన ముని సంచరించడు. రాజు లేని దేశములో యోగక్షేమములు సరిగా ఉండవు. రాజు లేని దేశములో సేన, యుద్ధములో, శత్రువులను ఎదిరింపజాలదు. (22-24)

రాజు లేని రాష్ట్రములో మనుష్యులు చక్కగా అలంకరించుకొని, ఉత్సాహపూర్ణములగు అశ్వములమీదను, రథములమీదను కూర్చుండి ప్రయాణము చేయుటకు భయపడుదురు. రాజు లేని దేశములో ఆ యా శాస్త్రములలో విశారదులైన పండితులు, వనములలోను, ఉపవనములలోను కూర్చుండి శాస్త్రచర్చలు జరుపజాలరు. రాజు లేని రాజ్యములో, జనులు నియమపూర్వకముగా దేవతాపూజ నిమిత్తము పుష్పమాలలను, మధురభక్ష్యములను, దక్షిణలను సమకూర్చరు. (25-27)

రాజు లేని రాజ్యమునందు, రాజపుత్రులు, చందనాగరువులు పూసికొని, వసంతమునందు వృక్షములు ప్రకాశించు నట్లు ప్రకాశించరు. (28)

రాజులేని రాష్ట్రము ఉదకము లేని నదులు వంటిది. తృణములు లేని వనము వంటిది. గోపాలురు లేని గోవుల వంటిది. ఒక రథము ఎవరి రథమో తెలుసుకొనుటకు సాధనము ధ్వజము. అగ్నిని గుర్తించు సాధనము ధూమము. మనల కందరకును ధ్వజము వంటి వాడైన,(తన ప్రభావముచే మనకు కూడ గురితింపు తెచ్చి పెట్టిన) ఆ దశరథమహారాజు ఈ లోకమును విడిచి స్వర్గమునకు వెళ్ళిపోయినాడు. రాజు లేని రాజ్యములో ఎవ్వడునూ దేనినీ కూడ తన సొత్తుగా

భావించుటకు వీలుండదు. మానవులు, నిత్యము మత్స్యములు వలె ఒకరి నొకరు తినివేయుదురు.(29-31)

కట్టుబాట్లను పాటింపక, ఎట్టి సంశయము లేక స్వేచ్ఛగా ప్రవర్తించు నాస్తికులు కూడా, రాజదండముచే దండితులై, సన్మార్గమున ప్రవర్తింతురు. దృష్టి నిత్యము శరీరమునకు ఎట్లు ఉపకరించునో, అట్లే రాజు రాష్ట్రముయొక్క సత్యధర్మముల పోషణమునకు కారణభూతుడు. సత్యమును, ధర్మమును, రక్షించువాడు రాజే. కులవంతుల కులమును రక్షించువాడు కూడ రాజే. రాజే తల్లి, తండ్రి ప్రజలకు హితమును చేయువాడు కూడా రాజే.(32-34)

కావుననే రాజు తన గొప్ప చరిత్రచేత, దిక్పాలకు లైన యమ-కుబేర-ఇంద్ర-వరుణులను కూడ అతిశయించి ఉండును. ఇది ధర్మము, ఇది అధర్మము అని రాజు విభజించి చూపకున్నచో ఈ ప్రపంచమంతయు అంధకారబంధురమై ఉండెడిది. సృష్టియే జరుగకుండెడిది. మహారాజు జీవించి ఉన్నకాలమునందు కూడ మేమందరము, సముద్రము తీరమును దాటనట్లు, నీ మాటలు దాట లేదు. ద్విజులలో శ్రేష్ఠుడవైన ఓ వసిష్ఠా! జరిగిన విషయమును పరిశీలించి, రాజులేని రాజ్యము అరణ్య మైపోవు నను విషయమును గుర్తించి, నీవే, ఉత్తమస్వభావవంతుడైన ఇక్ష్వాకువంశసంభూతు నొకనిని మాకు రాజుగా రాజ్యాభిషిక్తుని చేయుము.(35-38)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని అరువది ఏడవ సర్గము సమాప్తము.

అరువదియెనిమిదవ సర్గము

వసిష్ఠుని ఆనతిపై దూత లైదుగురు అయోధ్యనుండి కేకయదేశమున రాజగృహమునకు పోవుట.

వారి వచనము విని, వసిష్ఠుడు ఆ రాజమిత్రగణముతోను, అమాత్యగణముతోను, బ్రాహ్మణులతోను ఇట్లు పలికెను.(1)

"భరతుడు శత్రుఘ్నసహితుడై మేనమామ ఇంటి వద్ద సుఖముగా ఉన్నాడు. వీరులైన ఆ సోదరుల నిద్దరిని తీసికొనివచ్చుటకు శీఘ్రముగా పరుగెత్త గల అశ్వములను అధిరోహించి, వేగవంతులైన దూతలు వెంటనే వెళ్లవలెను. దశరథుడే

భరతునకు రాజ్యమిచ్చిన పిమ్మట ఈ విషయమున మనము ఆలోచించవలసినది ఏ మున్నది?"(2, 3)

"నీవు చెప్పి నట్లు దూతలు వెళ్లెదరుగాక." అని వారందరు వసిష్ఠునితో పలికిరి. అపుడు ఆ మాట విని వసిష్ఠుడు మరల ఇట్లనెను.(4)

"సిద్ధార్థా! జయంతా! విజయా! అశోకా! నందనా! రండి. మీ అందరికి చెప్పుచున్నాను. ఏమి చేయవలెనో వినండి.(5)

మీ రిచటినుండి శీఘ్రముగా బయలుదేరి, మంచి వేగము గల గుఱ్ఱములపై ప్రయాణము చేసి రాజగృహపురమును చేరి, మనస్సులోని దుఃఖమును పైకి కనబడనీయక నా ఆజ్ఞగా భరతునితో ఇట్లు చెప్పవలెను.(6)

"పురోహితుడును మంత్రు లందరును నీ కుశలము ప్రశ్నించుచున్నారు. వెంటనే నీవు బయలుదేరి రావలెను. నీతో చాల తొందర పని ఉన్నది."(7)

మీ రక్కడికి వెళ్ళి, రాముడు ప్రవాసమునకు వెళ్లినట్లును, అతని తండ్రి మరణించినట్లును, రఘువంశీయులకు ఆపదలు సంభవించినట్లును చెప్పవద్దు.(8)

కేకయరాజుకూ, భరతునికీ పట్టువస్త్రములనూ, ఉత్తమమైన అలంకారములనూ తీసికొని వెళ్ళవలెను."(9)

కేకయదేశమునకు వెళ్ళనున్న ఆ దూతలు, దారిలో కావలసిన ఆహారాదిసామగ్రిని తీసికొని, ఉత్తమాశ్వముల నెక్కి, తమ ఇండ్లకు వెళ్ళిరి. పిమ్మట ఆ దూతలు, ప్రయాణము నిమిత్తమై చేసుకొనవలసిన మిగిలిన పనులన్నియు పూర్తి చేసికొని, వసిష్ఠుని అనుమతి తీసికొని, శీఘ్రముగా వెళ్ళిరి.(10, 11)

దూతలు అయోధ్య నుండి బయలుదేరి పశ్చిమాభిముఖులై కొంత దూరము వెళ్ళి, అపరతాల పర్వతము చివరి దక్షిణభాగము దాటి, పిదప అవరతాల-ప్రలంబపర్వతముల మధ్య మాలినీనదీతీరమార్గమున ఉత్తరముగా ప్రయాణము చేసి, పశ్చిమాభిముఖులై వెళ్ళిరి.(12)

ఆ దూతలు హస్తినాపురమున గంగానదిని దాటి, పశ్చిమాభిముఖులై ప్రయాణము చేసి, కురుజాంగల మధ్యదేశముమీదుగా పాంచాలదేశము చేరి, అచటనుండి, బాగుగా జలముతో నిండిన సరస్సులను, నిర్మలమైన ఉదకము గల నదులను చూచుచు, పనితొందరను బట్టి అతిశీఘ్రముగా వెళ్ళిరి.(13, 14)

ఆ దూతలు, నిర్మలమైన ఉదకము కలదీ శ్రేష్ఠమూ, వివిధములైన పక్షులచే సేవింపబడినదీ, జనులతో నిండినదీ అయిన శరదండానదిని దాటి వేగముగా ప్రయాణము చేసిరి. వారు తీరముపై ఉన్న సత్యోపయాచన మను దివ్యవృక్షమును సమీపించి నమస్కారార్హమైన దానికి ప్రదక్షిణము చేసి, కులింగానగరిని ప్రవేశించిరి. వారు అక్కడినుండి అభికాలగ్రామమునకు చేరి, అక్కడ బోధిభవన మను పర్వతమునుండి ప్రవహించుచున్న పవిత్రమైన ఇక్షుమతీనదిని దాటిరి. ఆ నదీప్రాంత దేశము దశరథుని పితృపితామహాదులచేత అనుభవింపబడినది.(15-17)

అక్కడ దోసిళ్ళతో మాత్రమే నీళ్ళు త్రాగి జీవించు వేదవిద్వాంసులైన బ్రాహ్మణులను చూచి, బాహ్లీకదేశమధ్యప్రాంతమున ప్రయాణము చేసి, సుదామపర్వతము చేరిరి. ఆ ప్రాంతమునందున్న విష్ణుక్షేత్రమును, విపాశానదిని, శాల్మలీవృక్షమును, నదులను, దిగుడుబావులను, తటాకములను, పల్వలములను, సరస్సులను, అనేక విధము లైన సింహవ్యాఘ్రమృగగజాది వన్యమృగములను చూచుచు, ప్రభువు ఆజ్ఞను పాలించవలెనను ఉత్సాహముతో అతిదీర్ఘమైన మార్గమున ప్రయాణము చేయుచు వెళ్ళిరి. అతి దూరప్రయాణముచేత అశ్వములు అలసిన ఆ దూతలు వేగముగా, గిరివ్రజపురమును, చక్కగా ప్రవేశించిరి. ఆ దూతలు తమ ప్రభువునకు ప్రియ మాచరించు విషయములోను, రాజకులమును రక్షించే విషయములోను, రాజవంశప్రతిష్ఠ కాపాడు విషయములోను అశ్రద్ధ చూపక, రాత్రి అగు సరికి, ఆ పట్టణము చేరిరి.(18-22)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని అరువది ఎనిమిదవ సర్గము సమాప్తము.

అరువది తొమ్మిదవ సర్గము

భరతుడు తాను చూచిన భయంకర దుఃస్వప్నములు వర్ణించుట.

ఆ దూతలు ఆ నగరములోనికి ప్రవేశించిన రాత్రియందే, భరతుడు ఒక అప్రియమైన దుఃస్వప్నమును చూచెను. రాజాధిరాజకుమారుడైన భరతుడు తెల్లవారుజామున ఆ దుఃస్వప్నమును చూచి మనస్సులో చాల ఖేదమును పొందెను. (1,2)

ప్రియవాక్యములు పలుకు స్నేహితులు భరతుడు పరితపించుచున్నట్లు గ్రహించి,

అతని మనఃపరితాపమును తొలగించుటకై, సభలో అనేక విధములైన కథలు(వినోద కార్యక్రమములు) జరిపిరి. భరతుని మనస్సుకు శాంతి కలుగుటకై కొందరు వీణాదివాద్యములను ప్రయోగించిరి. కొందరు నాటకము లాడించిరి. మరికొందరు వివిధములైన, హాస్యప్రధానము లైన మాటలు చెప్పిరి. ప్రియముగా మాటలాడు ఆ స్నేహితులందరును, గోష్ఠీహాస్యాదు లెన్ని చేసినను, మహాత్ముడైన భరతునకు సంతోషము కలుగలేదు.(3-5)

మిత్రులతో కూడిన ఆ భరతుని, ఒక ప్రియమిత్రుడు " ఓ మిత్రమా! స్నేహితులందరు వచ్చి నిన్ను చుట్టి ఉన్నను నీవు ఇట్లు ఆనందములేక ఉన్నావేమి?" అని ప్రశ్నించెను.(6)

ఇట్లు ప్రశ్నించిన ఆ మిత్రునితో భరతు డీ విధముగ చెప్పెను. "నాకు ఈ దైన్యము కలుగుటకు కారణమును వినుము."(7)

నా తండ్రి మలిన మైన శరీరముతో, జుట్టు విరబోసికొని, పర్వతశిఖరమునుండి, గోమయముతో నిండిన గోతిలో పడుచున్నట్లు స్వప్నము చూచితిని. నా తండ్రి ఆ గోమయహ్రదమునందు, తేలుచు, మాటిమాటికిని నవ్వుచు, దోసిలితో తైలము త్రాగుచున్నట్లుగా కనబడినాడు. పిదప తిలలు కలిపిన అన్నము తిని, మాటిమాటికి శిరస్సు క్రిందకి వంచుచు, శరీరమున కంతకును తైలము పూసికొని, తైలములోనే మునిగి పోయెను.(8-10)

సముద్రము ఎండిపోయినట్లు, చంద్రుడు నేలపై పడిపోయినట్లు, భూమి చీకటి కప్పివేయుటచేత వలె కనబడకుండ పోయినట్లు, రాజు ఉత్సవసమయములలో అధిరోహించు గజము దంతములు విరిగిపోయినట్లు, ప్రజ్వలించు చున్న అగ్ని హఠాత్తుగా ఆరిపోయినట్లు, భూమి బ్రద్దలై పోయినట్లు, చెట్లన్నియు ఎండిపోయి నట్లు, పర్వతములు నశించి ధూమముచే ఆవరింపబడి నట్లు, నాకు స్వప్నములో కనబడినది.(11-13)

ఇనుముతో చేసిన ఆసనముపై, నా తండ్రి నల్లని వస్త్రములను ధరించి కూర్చున్నట్లును, అతనిని చూచి నల్లగాను, ఎర్రగాను ఉన్న స్త్రీలు పరిహాసపూర్వకముగా నవ్వుచున్నట్లును స్వప్నములో కనబడినది. ధర్మాత్ముడైన నా తండ్రి ఎఱ్ఱని మాలికలు ధరించి, ఎఱ్ఱని చందనము శరీరమునకు పూసుకొని, తొందరగా, గాడిదలు కట్టిన రథము పై ఎక్కి, దక్షిణాభిముఖముగా వెళ్ళినట్లు స్వప్నములో కనబడినది. ఎఱ్ఱని వస్త్రములు ధరించి, వికృతమైన ముఖము గల ఒక

రాక్షసస్త్రీ నవ్వుచూ, దశరథమహారాజును లాగుచున్నట్లుగా నాకు కనబడినది. (14-16)

ఈ రాత్రి నేను ఇట్టి భయంకరమైన స్వప్నము చూచితిని. నాకు గాని, రామునకు గాని, రాజునకు గాని, లక్ష్మణునకు గాని మరణము రానున్నది. ఎవడు గాడిదలు కట్టిన రథముపై ఎక్కి వెళ్లినట్లు స్వప్నము వచ్చునో, అతనిని దహించగా చితినుండి వచ్చు ధూమశిఖ, కొద్ది కాలములోనే కనబడును. అందుచేతనే నేను దీనుడనై మిమ్ములను సరిగా ఆదరించుటలేదు. నా కంఠము ఎండిపోవుచున్నట్లున్నది. నా మనస్సు కూడ స్వస్థముగా లేదు. (17-19)

దేనిని గూర్చి భయపడవలెనో తెలియుట లేదు గాని భయము మాత్రము తప్పక కలుగును అనిపించుచున్నది. నా కంఠస్వరము మందగించినది. కాంతి తగ్గినది. కారణమేమియు లేకుండగనే నాపై నాకే జుగుప్స కలుగుచున్నట్లున్నది. పూర్వ మెన్నడును ఊహింపబడని, అనేక రూపములు గల ఈ స్వప్నమును చూచుటచేతను, నా తండ్రియైన దశరథమహారాజు దర్శనమును గూర్చి ఇక ఊహింప పనిలే దను చింత కలుగుటచేతను పుట్టిన మహాభయము నా హృదయమునుండి తొలగుటలేదు. (20,21)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని అరువది తొమ్మిదవ సర్గము సమాప్తము.

డెబ్బదవ సర్గము

భరతశత్రుఘ్నులు అయోధ్యకు బయలుదేరుట.

భరతుడు తనకు వచ్చిన భయంకరమైన స్వప్నమును గురించి మిత్రులకు చెప్పుచుండెను. అదే సమయమున వసిష్ఠుడు పంపిన దూతలు ఆ రాజగృహమునకు చేరిరి. (సుదీర్ఘప్రయాణమువలన) అలసిపోయిననూ దూతలు వెంటనే కేకయరాజు దర్శనము చేసుకొనిరి. ఆ రాజు పాదములకు నమస్కరించి అక్కడనే ఉన్న భరతునితో ఇట్లనిరి. (1,2)

"పురోహితుడును, మంత్రు లందరును నీ కుశలము ప్రశ్నించుచున్నారు. వెంటనే నీవు బయలుదేరి రావలెను. నీతో చాల తొందర పని ఉన్నది. విలువైన ఈ వస్త్రములను, ఆభరణములను తీసికొని నీ మేనమామకు ఇమ్ము. ఈ

వస్త్రాభరణాదులలో మీ మాతామహుడైన కేకయరాజునకు ఇవ్వదగినవాటి వెల ఇరువది కోట్లు. మీ మేనమామకు ఇవ్వ వలసిన వాటి వెల పూర్తి పది కోట్లు.(3-5)

భరతుడు ఆ వస్తువుల నన్నింటిని తీసికొని ఆ దూతలకు కావలసిన వస్తువులను బహుకరించి ఆదరించి ఇట్లు పలికెను.(6)

నా తండ్రి దశరథమహారాజు క్షేమముగా నున్నాడా! రాముడును, మహాత్ముడైన లక్ష్మణుడును ఆరోగ్యముగా ఉన్నారా? పూజ్యురాలూ, ధర్మమునందే ఆసక్తి కలదీ, ధర్మము నెరిగినదీ, ధర్మమునే చూచునదీ, ధీమంతుడైన రాముని తల్లీ అయిన కౌసల్యాదేవీ ఆరోగ్యముగా ఉన్నదా? ధర్మములు తెలిసినదీ, లక్ష్మణునకూ, వీరుడైన శత్రుఘ్నునకూ తల్లీ, మా మధ్యమాంబ అయిన సుమిత్రాదేవి ఆరోగ్యముగా ఉన్నదా? తన సుఖమునే కోరేదీ, తీవ్రముగా ప్రవర్తించేదీ, క్రోధస్వభావురాలూ, బుద్ధిమంతురాలననే గర్వము కలదీ అయిన, నా తల్లి కైకేయి ఆరోగ్యముగా ఉన్నదా? ఆమె మాకు ఏమి చెప్ప మన్నది?"(7-10)

మహాత్ముడైన భరతుని మాటలు విని ఆ దూతలు, భరతునితో సవినయముగా ఇట్లు పలికిరి.(11)

"ఓ నరశ్రేష్ఠా! వారందరును క్షేమముగా ఉన్నారు. నిన్ను ఐశ్వర్యము, లక్ష్మి వరించుచున్నవి. శీఘ్రముగా రథము కూర్చుకొని బయలుదేరుము."(12)

దూతల మాటలు విని భరతుడు వారితో, "నన్ను దూతలు తొందరపెట్టుచున్నారు అని చెప్పి రాజు అనుజ్ఞ వేడెదను." అని చెప్పెను. వారితో పై విధముగ చెప్పి, తన మాతామహునితో ఇట్లు అనెను.(13, 14)

"మహారాజా! దూతలు నన్నయోధ్యకు రమ్మనుచున్నారు. నేను నా తండ్రిగారి వద్దకు వెళ్ళెదను. మరల నీవు ఎప్పుడు రమ్మనిన అప్పుడు వచ్చెదను."(15)

మాతామహుడైన కేకయరాజు భరతుని మాట విని, అతని శిరస్సుపై మూర్కొని, మంగళకరమైన వాక్యమును పలికెను.(16)

"నాయనా! నేను అనుజ్ఞ ఇచ్చుచున్నాను. వెళ్లుము. నీవు కైకేయిసత్పుత్రుడవు. నీ తల్లినీ, తండ్రినీ కుశల మడిగి నట్లు చెప్పుము. పురోహితుడైన వసిష్ఠునీ, ఇతరులైన బ్రాహ్మణోత్తములనూ, మహాధనుర్ధరులైన ఆ సోదరులు రామలక్ష్మణులనూ కుశల మడిగినానని చెప్పుము.(17, 18)

కేకయరాజు ఆ భరతునకు ప్రేమపూర్వకముగా శ్రేష్ఠమైన గజములను, రంగు రంగుల కంబళ్లను, మృగచర్మములను, ధనమును ఇచ్చెను. రెండువేల బంగారు కంఠహారములు, పదునారువందల అశ్వములు అను ధనమును బహూకరించెను. (19,20)

అశ్వపతి ఆ భరతునకు, ఇష్టులూ, విశ్వాసపాత్రులూ, సద్గుణవంతులూ, సర్వదా సమీపముననే ఉండదగినవారూ అయిన అనుచరులను ఇచ్చెను. (21)

మేనమామ యైన యుధాజిత్తు అతనికి ఐరావతవంశమునకు చెందిన, ఇంద్రశిరఃపర్వతమునందు పుట్టిన, చూచుటకు అందమైన గజములూ, బాగుగా శిక్షణము ఇచ్చిన శీఘ్రముగా పరుగెత్తు గాడిదలూ అను ధనమును ఇచ్చెను. అంతఃపురములో చక్కగా పెంచబడినవీ, వ్యాఘ్రములతో సమానమైన వీర్యబలములు కలవీ, కోరలే ఆయుధములుగా కలవీ, చాల పెద్ద శరీరము కలవీ అయిన కుక్కలను కూడ ఉపాయనముగా ఇచ్చెను. (22, 23)

అయోధ్యకు వెళ్ళే తొందరలో ఉన్న కైకేయీపుత్రుడగు భరతునకు తన మాతామహుడిచ్చిన కానుక లేవియు ఆనందమును కలిగించలేదు. దూతలు తొందరపెట్టుటను పట్టియు, తాను చూచిన స్వప్నముచేతను ఆ సమయమున అతని మనస్సు చాలా చింతాక్రాంతమై ఉండెను. (24, 25)

శ్రీమంతుడైన ఆ భరతుడు, నరులతోను, గజాశ్వాదులతోను నిండిన సువిశాలమైన తన గృహమును దాటి శ్రేష్ఠమైన రాజమార్గమును ప్రవేశించెను. పిదప రాజమార్గము దాటి వెళ్ళి, అంతఃపురమును చూచెను. పిదప ఆ శ్రీమంతుడైన భరతుడు, అడ్డ మేమియు లేక ఆ అంతఃపురములో ప్రవేశించెను. (26, 27)

అతడు మాతామహునివద్దనూ, మేనమామ యైన యుధాజిత్తు వద్దనూ సెలవుగైకొని, శత్రుఘ్నసమేతుడై రథ మెక్కి బయలుదేరెను. (28)

భరతుడు ప్రయాణమై వెళ్ళుచుండగా, భృత్యులు, వందలకొలది రత్నవిచిత్రములైన రథములను కూర్చుకొని, ఒంటెలు, గోవులు, అశ్వబలము మొదలగువాటితో భరతుని వెనుకనే వెళ్లిరి. భరతుడు తనతో సమానులైన శరీరరక్షకులును, శత్రుఘ్నుడును వెంట రాగా, సిద్ధపురుషుడు ఇంద్రలోకమునుండి బయలుదేరినట్లు మాతామహుని ఇంటినుండి బయలుదేరెను. (29, 30)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని డెబ్బదవ సర్గము సమాప్తము.

డెబ్బది ఒకటవ సర్గము

భరతుడు అయోధ్యానగరి దురవస్థను చూచుచు ముందుకు పోవుట.

కాంతి గలవాడు, శ్రీమంతుడు, ఇక్ష్వాకువంశమునకు ఆనందకరుడూ అయిన ఆ భరతుడు, రాజగృహమునుండి తూర్పు దిక్కునకు అభిముఖముగ బయలుదేరి, ఆచటినుండి సుదామానదిని చూచి, దానిని దాటి, పిదప హ్లాదినీనదిని, దూరమైన తీరము గల పశ్చిమాభిముఖముగా ప్రవహించు శతద్రూనదిని దాటెను. ఏలాధానమను గ్రామమునందు శతద్రూనదిని దాటి, అపరపర్పటదేశమును చేరి, శిలలను లాగు శిలావహానదిని దాటి, ఆగ్నేయము, శల్యకర్తనము అను గ్రామములను, శిలావహానదిని చూచుచు, మహాశైలములను దాటి, చైత్రరథవనము వైపు ప్రయాణము చేసెను. సరస్వతీగంగ లను నదీయుగ్మమును చేరి, వీరమత్స్యదేశమునకు ఉత్తరమున నున్న భారుండ మను వనమును ప్రవేశించెను. అక్కడినుండి అధికవేగము కలది, ఆనందమును కలిగించునది, పర్వతములచే ఆవరింపబడినది అయిన కులింగనదిని, యమునానదిని చేరి, వాటిని దాటి, అక్కడ సైన్యమును విశ్రమింపచేసెను. (1-6)

అలసిన అశ్వముల శరీరముపై చల్లని నీరు చల్లి, వాటిని సేదదీర్చి, స్నానము చేసి, నీరు త్రాగి, కొంచెము నీరు కూడా తీసికొని ప్రయాణమై వెళ్ళెను. (7)

మంగళకరుడైన భరతుడు, జనసంచారము లేని ఆ అరణ్యమును (ఉత్తమమైన వాహనముపై లేదా భద్ర మను గజముపై) ఎక్కి వాయువు ఆకాశమును దాటి నట్లు దాటెను. ప్రాగ్వట మను ప్రసిద్ధమైన పురమునందు, అంశుధాన మను ప్రదేశమునందు, దాటుటకు కష్టమైన భాగీరథీమహానదిని సమీపించెను. అతడు ప్రాగ్వటమునందు గంగను దాటి, కుటికోష్ఠికానదిని చేరి సైన్యసహితుడై, ఆ నదిని కూడ దాటి, ధర్మవర్ధన మను గ్రామమును చేరెను. తోరణ మను ప్రదేశమునకు దక్షిణముగా ఉన్న జంబూప్రస్థమును, అక్కడినుండి వరూథ మను సుందరగ్రామమును చేరెను. (8-11)

భరతుడు, అక్కడ రమ్యమైన అరణ్యమునందు విడిది చేసి, అక్కడినుండి తూర్పుగా వెళ్ళి కదంబవృక్షములు అధికముగా గల, ఉజ్జిహాన గర్యుద్యానమును చేరెను. ఆ సాల-ప్రియకవృక్షములవద్ద విశ్రాంతి తీసికొని, ఆచటినుండి శీఘ్రముగా నడచు గుఱ్ఱములు కట్టిన రథ మెక్కి మీరు వెనుక రండని సైన్యము నాదేశించి, తాను తొందరగా వెళ్ళెను. (12, 13)

ఆ నరశ్రేష్ఠుడు సర్వతీర్థ మను ప్రదేశమునందు నివసించి, పిదప ఉత్తానికానదిని, ఇతరమైన అనేకవిధములైన నదులను పర్వతములందు పుట్టిన అశ్వముల సాహాయ్యముతో దాటి, ఏనుగుపై ఎక్కి కుటికానదిని దాటెను. పిదప లౌహిత్య మను ప్రదేశమున కపీవతీనదిని దాటెను. ఏకసాలగ్రామమునందు స్థాణుమతీనదిని, వినతగ్రామమునందు గోమతీనదిని దాటి, అశ్వములు అలసిపోవుటచే కలింగనగరమునందలి సాలవనమున విశ్రమించి, మరల శీఘ్రముగ ప్రయాణము చేసెను.(14-16)

రాత్రియందే శీఘ్రముగా సాలవనమును దాటి వెళ్ళి అరుణోదయ సమయమునందు, మనుచక్రవర్తిచే నిర్మితమైన అయోధ్యానగరమును చూచెను.(17)

ప్రయాణములో ఏడు దినములు గడిపిన ఆ పురుషశ్రేష్ఠుడు, ఎదుట అయోధ్యానగరమును చూచి సారథితో ఇట్లనెను.(18)

"సారథీ! పుణ్యమైన ఉద్యానములతో ఒప్పుచు, మంచి కీర్తిని కలిగిన ఈ అయోధ్యానగరము నాకు దూరమునుండి అస్పష్టముగా కనబడుచున్నది. తెల్లని మట్టి గల ఈ నగరమును ఎందరో రాజర్షులు పాలించి ఉన్నారు. ఉత్తమగుణసంపన్నులు, వేదవేత్తలు, చాలవరకు ఐశ్వర్యవంతులు, ఎన్నియో యజ్ఞములు చేసినవారు అయిన బ్రాహ్మణు లిక్కడ నివసించుచున్నారు.(19,20)

పూర్వము అయోధ్యలో స్త్రీపురుషాదుల సంచారమువలన, గొప్ప కలకలధ్వని వినబడుచుండెడిది. ఈనాడు వినబడుట లేదు. సాయంకాలమునందు వచ్చి, రాత్రి అంతయు క్రీడించి, ఉదయముననే ఇండ్లకు పరుగెత్తుచున్న నరులతో ఉద్యానములు పూర్వము నాకొక విధముగ కనబడుచుండెడివి. ఆ ఉద్యానములే ఇప్పుడు కాముకులు విడిచిపెట్టుటచే ఏడ్చుచున్నట్లున్నవి. సారథీ! అయోధ్యానగరి నా కిపుడు అరణ్యమువలె కనిపించుచున్నది. (21-23)

ఇపుడిక్కడ నరశ్రేష్ఠులు వెనుకటి వలె వాహనములపై గాని, గజములపై గాని, అశ్వములపై గాని ఎక్కి, నగరములో ప్రవేశించుచు గాని, నగరమునుండి నిర్గమించుచు గాని కనబడుటలేదు. పూర్వము ఉద్యానవనము లన్నియు జనులు ఆనందపూర్వకముగా కలసి విహరించుటకు(లేదా కాముకులు కలియుటకు) అనుకూలముగా ఉండుటచే మదించినట్లు, ఆనందభరితము లైనట్లును కనబడుచుండెడివి. ఆ ఉద్యానవనములే నేడు ఆకులు రాలిపోయి మార్గసమీపమున ఏడ్చుచున్నట్లు నిలచిన వృక్షములతో, అన్ని వైపులా, ఆనందశూన్యములుగా

కనబడుచున్నవి. (24-26)

సూర్యోదయ మయినను, మదించి, అనురాగభరితము, మధురము అయిన ధ్వనులను చేయు మృగపక్ష్యాదుల శబ్దములు వినబడుటలేదు. చందనగంధము, అగరుగంధము కలిసి, ధూపముచే వ్యాప్తమైన సుఖకరమైన వాయువు, వెనుకటి వలె ఈనాడు ఇంకను వీచుటలేదు. కారణమేమై ఉండునో! పూర్వము ఎన్నడును తగ్గని ప్రసారము గల, కోణసంఘట్టనముచే పుట్టిన భేరీమృదంగవీణాదుల ధ్వని ఇప్పుడు ఆగిపోయినది ఎందుచేతనో!(27-29)

అనిష్టమును కలిగించునవీ, క్రూరములూ, అయిన అనేక విధములైన చెడు శకునములు కనబడుచున్నవి. అందుచే నా మనస్సు చాల బాధపడుచున్నది. అన్ని విధములా నా బంధువులకు క్షేమము దుర్లభ మనియే తోచుచున్నది. ఏల ననగా, దుఃఖహేతు వేదీ కనబడకున్నను నా మనస్సు దిగులు చెందుచున్నట్లున్నది."(30,31)

ఈ విధముగ దిగులు చెంది, అలసిన హృదయముతోను, పట్టుతప్పిన ఇంద్రియములతోను భరతుడు అయోధ్యానగరమును భయపడుచు ప్రవేశించెను. వైజయంత మను ద్వారము నుండి లోనికి ప్రవేశించి, ద్వారపాలకులు లేచి జయజయధ్వానములు చేయగా వారితో కలిసి వెళ్ళెను. (32, 33)

ఆ ద్వారపాలకులను గౌరవించి, అశ్వపతికి ఇష్టుడైన ఆ సారథితో ఇట్లు పలికెను. (34)

ఏ కారణము లేకుండగా నన్ను ఇంత తొందరగా ఎందుకు రప్పించినారో! నా మనస్సు ఏదో అమంగళమును శంకించుచున్నది. నా సచ్ఛీలము పతిత మైపోయినట్లున్నది. రాజులు మరణించి నపుడు ఎట్టి చిహ్నాములు కలుగునని పూర్వము వినుచుండెడివారమో అట్టి చిహ్నాము లన్నీ ఇక్కడ కనబడుచున్నవి. అయోధ్యలోని కుటుంబీకుల భవనము లన్నీ, తుడవక పోవుటచే ఎబ్బెట్టుగా కనబడుచున్నవి. వీటి తలుపు లన్నియు తెరచి ఉన్నవి. అన్ని వైపుల శోభావిహీనములై ఉన్నవి. ఎవ్వరును పూజలకు సంబంధించిన బలులు మొదలగునవి ఇచ్చినట్లు లేదు. ధూపముచే ఈ భవనములు సుగంధములుగా లేవు. కుటుంబములోని వారందరు భోజనములు లేక శోభావిహీనులై ఉన్నారు. భవనముల కుండవలసిన లక్ష్మి కనబడుటలేదు. (35-39)

దేవాలయములలో మాలికల శోభ లేదు. వాటి ముంగిళ్ళను తుడిచి అలకలేదు.

ఇవి శూన్యములై, పూర్వము ప్రకాశించినట్లు ప్రకాశించుట లేదు. దేవతాపూజలు ఆగిపోయినవి. దేవతామూర్తులు కాంతివిహీనముగా ఉన్నవి. యజ్ఞగోష్ఠులు నడచుటలేదు. పుష్పమాలలు అమ్మే అంగళ్ళు మాలలు లేక శోభాశూన్యముగా ఉన్నవి.(40, 41)

వ్యాపారము లేకపోవుటచే ఉత్సాహము లేక, ఆలోచనలతో మనస్సు దిగులు చెందిన వర్తకులు కూడ ఇపు డిక్కడ, వెనుకటి వలె కనబడుటలేదు. దేవాలయములలోను, చైత్యములందును(చైత్యము లనగా వీథుల మొగలలో ఉన్న కట్టడములు, లేదా పూజాస్థానములకు సంబంధించిన శిలానిర్మితగృహములు; లేదా వీథులలో ఉన్న మఱ్ఱిచెట్లు) నివసించు పక్షిసముదాయములు దీనముగా ఉన్నవి. నగరములో స్త్రీపురుషులందరును, బెంగపెట్టుకొని, మలినవస్త్రధారులై, కన్నీళ్ళు నిండిన నేత్రములతో, దీనులై, చింతానిమగ్నులై, కృశించి ఉన్నారు."(42-44)

భరతుడు అయోధ్యలో ఆ అనిష్టములైన అపశకునాదులను చూచి, దైన్యము చెందిన మనస్సుతో, ఆ సారథితో ఈ విధముగ పలికి, రాజభవనమునకు వెళ్లెను.(45)

ఇంద్రుని పురియైన అమరావతితో సమానమైన ఆ అయోధ్య, పరాగముతో ఎఱ్ఱనైన తలుపులు దారుబంధములతో, చతుష్పథములందును, గృహములందును, వీథులందును జనశూన్యముగ ఉండుట చూచిన ఆ భరతునకు చాల దుఃఖము కలిగెను. మహాత్ముడైన భరతుడు, పూర్వ మెన్నడును ఆ పురములో జరగని, మనస్సుకు అప్రియమైనవాటిని ఎన్నియో చూచుచు, దైన్యముతో నిండిన మనస్సుతో, సంతోషవిహీనుడై, తల వంచుకొని, తండ్రి గృహమును ప్రవేశించెను.(46, 47)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని డెబ్బది ఒకటవ సర్గము సమాప్తము.

డెబ్బది రెండవ సర్గము

భరతుడు కైకేయి భవనమునకు పోయి తల్లికి ప్రణమిల్లుట. ఆమె చెప్పగా, తన తండ్రి స్వర్గస్థు డయ్యెనని విని దుఃఖితుడై విలపించుట. అన్న రాము డెక్కడ అని యడిగి ఆమె వలన రామవనవాసవార్తను వినుట.

తండ్రి గృహములో తండ్రి కనబడకపోగా, భరతుడు, తల్లిని చూచుటకై ఆమె గృహమునకు వెళ్ళెను. దూరదేశమునుండి, తిరిగి వచ్చిన కుమారుని చూడగానే, కైకేయి, సంతోషించి బంగారు ఆసనమునుండి దిగ్గున లేచెను.(1, 2)

భరతుడు శోభావిహీనమై ఉన్న తన గృహములో ప్రవేశించి మంగళకరములైన తల్లి పాదములు స్పృశించి సమస్కరించెను. ఆమె, యశఃశాలియైన ఆ కుమారుని శిరస్సుపై మూర్కొని, కౌగిలించుకొని, ఒడిలో కూర్చుండబెట్టుకొని, ప్రశ్నింప ప్రారంభించెను.(3, 4)

"నీవు తాతగారి ఇంటినుండి బయలుదేరి ఎన్ని రోజు లైనవి? రథముపై శీఘ్రముగా ప్రయాణము చేయుటచే నీ కేమియు మార్గాయాసము కలగలేదు కదా? నీ తాత, నీ మేనమామయైన యుధాజిత్తూ క్షేమముగా ఉన్నారా? నీ ప్రవాసము సుఖముగా గడచినదా? ఈ విషయము లన్నీ చెప్పుము.(5, 6)

కైకేయి ప్రేమపూర్వకముగా ఇట్లు ప్రశ్నించగా భరతుడు ఆమెకు అంతయు చెప్పెను.(7)

"నేను తాతగారి ఇంటినుండి బయలుదేరి నేటికి ఏడు రోజులైనది. నీ తండ్రియైన కేకయరాజూ, నా మేనమామ యైన యుధాజిత్తూ క్షేమముగా ఉన్నారు. శత్రుసంహారకుడైన కేకయరాజు నాకు ఇచ్చిన ధనమును, రత్నములను, తీసికొనివచ్చువారు మార్గములో అలసట చెందుటచే వారిని వెనుక రమ్మని, నేను ముందుగా వచ్చితిని.(8, 9)

రాజసందేశము తీసికొని వచ్చిన దూతలు తొందరపెట్టుటచే నేను ముందుగా వచ్చినాను. నేను కొన్ని ప్రశ్నలు అడగదలచుచున్నాను. సమాధానము చెప్పుము.(10)

శయనించుటకు తగినదీ, బంగారముచే అలంకరింపబడినదీ అయిన నీ పర్యంకము శోభావిహీనముగా ఉన్నది. ఇక్కడనున్న దశరథమహారాజు పరివారజను

లెవ్వరును ఆనందముగ ఉన్నట్లు కనబడుటలేదు. దశరథమహారాజు ఎక్కువగా, ఇక్కడ నీ గృహములో ఉండును. ఈనాడు ఆయన కనబడుట లేదు. ఆయనను చూచుటకై నే నిక్కడికి వచ్చినాను. నా తండ్రిగారికి పాదాభివందనము చేయవలెను. ఆయనను గూర్చి చెప్పుము. ఆయన ఇక్కడికి రానిచో, నా పెద్దతల్లి యైన కౌసల్య గృహములో ఉన్నాడా?"(11-13)

అన్ని విషయములు తెలిసిన దైనను, రాజ్యలోభముచే మోహితురాలైన ఆ కైకేయి ఈ విషయము లేవియు తెలియని ఆ భరతునకు, భయంకరమైన అప్రియవిషయమును, ప్రియమైన విషయమును చెప్పినట్లు చెప్పెను.(14)

"మహారాజు, మహాత్ముడు, తేజఃశాలీ, యజ్ఞములు చేసినవాడు, సత్పురుషులకు ఆశ్రయభూతుడూ అయిన నీ తండ్రి ప్రాణులన్నింటికి ఏది చివరి గతియో, ఆ గతిని పొందినాడు."(15)

ఆ మాట వినగానే భరతుడు పితృశోకముచే మిక్కిలి బాధపడుచు వెంటనే నేలపై పడిపోయెను. అతడు "అయ్యో చచ్చితిని" అని జాలి కొలుపునట్లుగా, దీనముగా పలుకుచు, చేతులు చాచి నేలపై పడెను. పితృమరణముచే కలిగిన దుఃఖము భరింపరానిదై అతని మనస్సును కలత చెందునట్లు చేసెను. ఇట్లు శోకాక్రాంతుడై అతడు విలపించెను.(16-18)

సుందరమైన ఆ నా తండ్రి శయనము, వర్షాకాలము గడచిన పిమ్మట నిర్మలముగా ఉన్న రాత్రియందు ఆకాశము చంద్రునితో ప్రకాశించినట్లు ప్రకాశించుచుండెడిది. ధీశాలియైన నా తండ్రి లేకపోవుటచే, ఆ శయనమే ఈనాడు, చంద్రుడు లేని ఆకాశము వలె, నీరు ఎండిపోయిన సముద్రము వలె, ప్రకాశరహితమై ఉన్నది.(19, 20)

జయించువారిలో శ్రేష్ఠుడైన భరతుడు, కంఠముతో బాష్పమును(డగ్గుత్తికను కలిగించు శ్లేష్మాదికమును) విడుచుచు, శోభాయుక్త మైన ముఖమును వస్త్రముతో కప్పికొని, మనస్సులో అధికముగా పీడితుడయ్యెను. ఆర్తుడైన భరతుడు వనమునందు గండ్రగొడ్డలిచేత ఛేదించిన సాలవృక్షము మాను వలె నేలపై పడి యుండెను. శోకార్తుడైన భరతుని చూచి, కైకేయి, అతనిని నేలమీదనుండి లేవదీసి ఇట్లు పలికెను.(21-23)

"గొప్ప కీర్తి గల ఓ రాజకుమారా! లెమ్ము, లెమ్ము. అట్లు పండుకొని ఉన్నావేమి?

సభలలో సంమానమును పొందుటకు అర్హత గల నీ వంటి సత్పురుషులు ఈ విధముగా దుఃఖింతురా? శీలమును, వేదవాక్యములను అనుసరించు నీ బుద్ధి, దానయజ్ఞాదులందు అధికారము కలదై, సూర్యుని గృహమున కాంతి వలె అవిచ్ఛిన్నముగ ప్రకాశించును.(24, 25)

అనేకవిధములైన శోకములు చుట్టుముట్టగా అతడు నేలపై దొర్లుచు చాలసేపు ఏడ్చి, తల్లితో మరల ఇట్లనెను.(26)

"మహారాజు రామునకు రాజ్యాభిషేకము చేయునో, లేదా ఏదైన యజ్ఞము చేయునో అని ఆలోచించుకొనుచు నేను సంతోషముతో ప్రయాణము చేసితిని. నేను అనుకున్న దంతయు తారుమారైనది. నిత్యమూ నా ప్రియహితములను కోరు నా తండ్రిని చూడజాలకపోవుటచే నా మనస్సు బ్రద్దలై పోయినది.(27, 28)

తల్లీ ! నేను ఇక్కడ లేనప్పుడు తండ్రి చనిపోవుటకు అతని కేమి వ్యాధి వచ్చినది? స్వయముగా తండ్రికి ప్రేతసంస్కారము చేసిన రామాదులు ధన్యాత్ములు కదా! కీర్తిమంతుడైన మహారాజునకు, నిజముగా, నేను వచ్చి నట్లు తెలియదు. తెలిసి ఉన్నచో శీఘ్రముగా నన్ను వంచి, నా తలపై ఆఘ్రాణించి ఉండెడివాడు. బూడిద కప్పి ఉన్న నన్ను ఏచేతితో మాటిమాటికి తుడుచుచుండెడివాడో, శ్రమ లేకుండ పనులను సాధించు నా తండ్రియొక్క సుఖకరమైన స్పర్శగల అట్టి హస్తము ఎక్కడ ఉన్నది?(29-31)

ఏ రాముడు నాకు సోదరుడో, తండ్రియో, బంధువో, ధీమంతుడైన ఏ రామునకు నేను దాసుడనో, శ్రమపడకుండ కార్యములను సాధించు ఆ రామునకు నన్ను గూర్చి శీఘ్రముగా తెలుపుము. ధర్మము తెలిసిన పూజ్యులందరికిని అన్నగారు తండ్రి కదా? అట్టి అన్నగారి పాదములు పట్టుకొనెదను. ఇప్పుడు నా కతడే గతి కదా?(32, 33)

ధర్మములు తెలిసినవాడూ, నిత్యము ధర్మము ననుసరించువాడూ, సత్యమైన ప్రతిజ్ఞ కలవాడూ, దృఢమైన నియమము కలవాడూ, పూజ్యుడూ, సత్యమైన పరాక్రమము కలవాడూ, మహారాజూ అయిన నా తండ్రి ఏమి చెప్పినాడు? నాకు నా తండ్రి ఇచ్చిన చివరి సందేశమును యథాతథముగా వినగోరుచున్నాను." భరతుడీ విధముగ ప్రశ్నించగా, కైకేయి జరిగినది జరిగినట్లుగా చెప్పుచు ఇట్లు పలికెను.(34, 35)

"ఆ రాజు, హా రామా! హా లక్ష్మణా! అని విలపించుచు పరలోకమును పొందినాడు. నీ తండ్రి, పాశములచే కొట్టబడిన మహాగజము వలె, మృత్యుపాశములచే చుట్టబడినవాడై, చివరి మాటలు ఇట్లు పలికెను. 'సీతాసమేతుడై తిరిగి వచ్చిన రామునీ, మహాబాహువైన లక్ష్మణునీ చూడ గల్గినవారు ధన్యాత్ములు కదా!'"(36-38)

అప్రియమైన ఆ రెండవ వార్తను వినగానే భరతుడు దుఃఖించుచు దిగులుచెందిన ముఖముతో తల్లిని మరల ఇట్లు అడిగెను. (39)

"ధర్మాత్ముడైన రాముడు, సోదరుడైన లక్ష్మణునితోను, సీతతోను, ఇపు డెక్కడికి వెళ్ళినాడు?"(40)

భరతుడీ విధముగ ప్రశ్నించగా, అతని తల్లి "అతనికి ప్రియమైన విషయము చెప్పుచున్నాను." అని భ్రాంతితో చాల అప్రియమైన వాక్యమును, జరిగినది జరిగినట్లుగా, చెప్పుటకు ప్రారంభించెను. (41)

"కుమారా! రాముడు నారచీరలు ధరించి, సీతాసమేతుడై, లక్ష్మణుడు కూడ వెంట రాగా, దండకారణ్యమునకు వెళ్ళినాడు."(42)

భరతుడు ఆ మాటలు విని, తన వంశము ఔన్నత్యము తెలిసినవాడగుటచే, రాము డేమైన అధర్మకార్యము చేయుటచే దేశమునుండి వెడలకొట్ట బడినాడా అని శంకించుచు, మరల ప్రశ్నించెను. (43)

"రాముడు ఎవ్వడైన బ్రాహ్మణుని ధనమును అపహరించలేదు కదా! అపరాధ మేదియు లేకుండగ, అతడు ఏ ధనవంతునైనను, దరిద్రునైనను హింసించలేదు కద! రాజకుమారుడైన రాముడు పరభార్యలపై అభిలాష చూపలేదు కద! భ్రూణహత్యాపాపము చేసినవానిని వలె అతనిని దండకారణ్యమునకు ఎందువలన పంపివేసినారు?"(44, 45)

పిమ్మట చపలస్వభావురా లైన అతని తల్లి, తాను వెనుక చూపిన స్త్రీస్వభావమునే పురస్కరించుకొని తాను చేసిన పనిని గూర్చి, జరిగినది జరిగినట్లు చెప్పుటకు ప్రారంభించెను. మూఢురాలూ, బుద్ధిమంతురాల ననే గర్వము కలదీ అయిన కైకేయి, మహాత్ముడైన భరతుని మాటలు విని, సంతోషించుచు ఇట్లు పలికెను. (46,47)

"రాముడు ఏ బ్రాహ్మణుని ధనమును కూడ, కొంచె మైనను హరించ లేదు. అతడు పాపము చేయని ధనికుని గాని, దరిద్రుని గాని ఎవ్వనిని హింసించలేదు.

రాముడు పరభార్యలను కంటితో చూడను కూడ చూడడు.(48)

కుమారా! రామునకు అభిషేకము జరుగనున్నదని వినగానే నేను, నీ తండ్రిని, నీకు రాజ్యము ఇమ్మనీ, రాముని అరణ్యమునకు పంపివేయమనీ కోరినాను. నీ తండ్రి తన నియమమును పాటించుచు ఆ విధముగానే చేసెను. సీతాలక్ష్మణసమేతుడైన రాముని అరణ్యమునకు పంపివేసెను. మహాకీర్తిశాలి యైన మహారాజు తన ప్రియపుత్రుడైన రాముడు కనబడక పోవుటచే, పుత్రశోకముతో బాధపడుచు మరణించెను.(49-51)

ఇపుడు నీవు రాజత్వమును స్వీకరింపుము. ఈ విధముగా నేను నీకోసమే ఇది అంతా చేసినాను. శోకమును సంతాపమును విడచి నీవు ధైర్యము అవలంబించుము. ఈ నగరమూ, శత్రుబాధాదులు లేని ఈ రాజ్యమూ కూడ నీకు అధీనములై ఉన్నవి. శాస్త్రవిధానము తెలిసిన వసిష్ఠుడు మొదలగు బ్రాహ్మణశ్రేష్ఠులతో కలిసి, శీఘ్రముగా రాజునకు యథావిధిగా సంస్కారము చేసి, మనస్సులో ఏ దైన్యమూ లేనివాడవై, రాజ్యాభిషిక్తుడవు అగుము."(52-54)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని డెబ్బదిరెండవ సర్గము సమాప్తము.

డెబ్బదిమూడవ సర్గము

భరతుడు కైకను చీకొట్టుట. ఆమెపై తీవ్రముగా కోపించుట.

భరతుడు తండ్రి మరణించి నట్లును, సోదరులిద్దరినీ దేశమునుండి వెడలగొట్టినట్లును విని, దుఃఖపీడితుడై ఇట్లు పలికెను.(1)

"తండ్రి మరణించి, తండ్రితో సమానుడైన సోదరుడు ప్రవాసమునకు పోయి దుఃఖించుచు కష్టములపాలై ఉన్న నాకు ఇప్పు డీ రాజ్య మెందుకు? రాజు మరణించునట్లు, రాముడు తాపసుడగునట్లును చేసి, నీవు పుండుపై ఉప్పు చల్లినట్లు, ఒక దుఃఖములో మరొక దుఃఖము కలిగించినావు.(2, 3)

నీవు ఈ కులమును నశింపచేయుటకు కాలరాత్రి వలె దాపురించినావు. నా తండ్రి తాను కొరివిని కౌగిలించుకొనినానని తెలుసుకొనలేకపోయినాడు. నీవు



పాపపు ఆలోచనలు కలదానవు. నీవే తండ్రిని చంపినావు. కులమును అపవిత్రము చేసినావు. అజ్ఞానముచే నీవు ఈ వంశములో సుఖము లేకుండా చేసినావు. సత్యసంధుడు, మహాకీర్తిశాలీ అయిన నా తండ్రి దశరథమహారాజు, ఇప్పుడు నీ మూలమున తీవ్రమైన దుఃఖముచే పీడితుడై మరణించినాడు.(4-6)

ధర్మశ్రద్ధ గల నా తండ్రి దశరథమహారాజును ఎందుకు చంపినావు? రాముని దేశమునుండి వెడలగొట్టి అరణ్యమున కెందుకు పంపినావు? పుత్రశోకముతో బాధపడుచున్న కౌసల్యాసుమిత్రలు, నా తల్లివైన నీ సహవాసమున జీవింపగల రనునది కల్ల.(7, 8)

ధర్మాత్ముడు, పెద్దల విషయమున ఎట్లు ప్రవర్తించవలెనో తెలిసినవాడూ అయిన, నా అన్నగారైన రాముడు, నీ విషయమునందు కూడా, తన తల్లి విషయమున ఎట్లు ప్రవర్తించునో అట్లే ప్రవర్తించెడివాడు కదా! అట్లే, దూరదృష్టి గల మా పెద్దతల్లి కౌసల్య కూడ, ధర్మమును అనుసరించుచు, నీ విషయమున సోదరి విషయమున ప్రవర్తించుచున్నట్లు ప్రవర్తించుచున్నది కదా! పాపాత్మురాలా! అట్టి కౌసల్యయొక్క బుద్ధిశాలియైన కుమారుని నారచీరలు కట్టింపచేసి, వనవాసమునకు పంపిన తరువాత కూడా నీకు విచారము కలుగుట లేదా! పుణ్యప్రదమైన దర్శనము కలవాడూ, శూరుడూ, మనోనిగ్రహవంతుడూ, కీర్తిశాలీ అయిన రాముని నారచీరలు ధరింపచేసి అరణ్యమునకు పంపితివి కదా! దీనికి ఏమి కారణము చెప్పెదవు?(9-12)

నీవు లుబ్ధురాలవు. రాముని పట్ల నాకున్న భక్తిని గూర్చి నీకు తెలియదు. అందువలననే రాజ్యముకొరకై నీవు అనర్థము తెచ్చి పెట్టినావు. పురుషశ్రేష్ఠులైన

రామలక్ష్మణులు దగ్గరలేని నేను, ఆ రాజ్యమును ఏ శక్తితో పాలించుటకు సమర్థుడ నగుదును? మేరుపర్వతము తన రక్షణకొరకై తన చుట్టు ఉన్న వనమును ఆశ్రయించినట్లు, మహాబలశాలీ, ధర్మాత్ముడూ అయిన దశరథమహారాజు, ఎల్లప్పుడు మహాబలశాలియైన ఆ రాముని ఆశ్రయించి ఉండెడివాడు కదా?(13-15)

కాడికి కట్టదగిన పెద్ద వృషభము మోయు కాడిని, ఇంకను ఆ పని నేర్వవలసిఉన్న చిన్న ఎద్దు మోయలేదు. అట్లే రాముడు మోయగల రాజ్యభారమును మోయు బలము నాకు లేదు. అథవా, సామదానాద్యుపాయములను ప్రయోగించుటచేతను, బుద్ధిబలముచేతను, నా కీ భారమును మోయు శక్తి కలుగవచ్చునేమో. అయినను, పుత్రునిపై మితి మీరిన ప్రేమ గల నీ కోరికను మాత్రము తీర్చను. (16,17)

రాముడు సర్వదా నిన్ను తన తల్లి వలె చూచుకొనుచుండెడివాడు. అందుచేతనే పాపబుద్ధి కలదాన వైనను నిన్ను విడచుటకు మనసు రాకున్నది. మా పూర్వులందరూ నిందించు ఇట్టి బుద్ధి నీ కెట్లు కలిగినది? పుత్రులందరిలోను జ్యేష్ఠుడైనవాడు రాజ్యాభిషిక్తుడు కాగా మిగిలిన సోదరులందరు అతనిపై మంచి భక్తితో ప్రవర్తించుచుందురు అనునది ఈ వంశములోని ఆచారము కదా!(18-20)

క్రూరురాలా! నీకు రాజధర్మముపై ఆదరమైన లేకపోవలె, లేదా నీకు శాశ్వత మైన రాజధర్మపద్ధతి తెలియకపోవలె అని అనుకొనుచున్నాను. రాజధర్మానుసారము జ్యేష్ఠుడే ఎల్లప్పుడును, రాజ్యమునందు అభిషిక్తుడగును. ఈ నియమము రాజు లందరికిని సమానమే. విశేషించి, ఇది ఇక్ష్వాకువంశీయులకు ప్రధానమైన ధర్మము. ఇక్ష్వాకువంశీయులకు ధర్మమే ప్రధానరక్ష. వారు మంచి కులము, దానికి తగిన సదాచారము కలవారు. సచ్చరిత్ర విషయమున వారికి గల గర్వమును ఈనాడు నీవు నశింపచేసినావు. (21-23)

నీ వంశములో పూర్వపురుషులైన మహారాజులందరు కూడ మహానుభావులే కదా! నిందింపదగిన ఈ బుద్ధిమోహము నీ కెట్లు కలిగినది? నీకు కలిగినది పాపపుటాలోచన. నేను మాత్రము నీవు కోరిన పని చేయను. నీవు నా ప్రాణములకే ముప్పు వాటిల్లు చెడ్డ పని ప్రారంభించినావు. (24, 25)

నే నిపుడు నీకు అప్రియము చేయ నిశ్చయించినాను. స్వజనులకు ఇష్టుడూ, దోషరహితుడూ అయిన సోదరుని వనమునుండి వెనుకకు తీసికొని వచ్చెదను. రాముని మరల వెనుకకు తీసికొని వచ్చి, అతనికి సుస్థిరమైన మనస్సుతో దాస్యము

చేసెదను."(26, 27)

మహాత్ముడైన భరతుడు ఈ విధముగ పలుకుచు, అప్రియములైన మాటలచే ఆమెను పీడించుచు, శోకపీడితుడై పర్వతగుహలో ఉన్న సింహమువలె మరల బిగ్గరగా ఏడ్చెను.(28)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని డెబ్బది మూడవ సర్గము సమాప్తము.

డెబ్బదినాల్గవ సర్గము

భరతుడు కైకను తీవ్రముగా నిందించుట.

అప్పుడు భరతుడు తల్లిని ఈ విధముగా దూషించి, చాల కోపముతో కూడినవాడై మరల ఇట్లు పలికెను.(1)

"క్రూరురాలా! దుష్టమైన ప్రవృత్తి గలదానా! ఓ కైకేయీ! నీవు కోరిన రాజ్యము నీకు లభించకపోవుగాక! ధర్మవిహీనురాల వైన నీవు మరణించిన నన్ను గూర్చి ఏడ్చుచు కూర్చుండుము. నీ మూలమున రాజునకు మరణము, రామునకు ప్రవాసము ఒక్క మారుగా సంప్రాప్తించినవి కదా! ఆ రాజుగాని, పరమధార్మికుడైన రాముడు కాని నీ కేమి అపకారము చేసినాడు? ఈ కులమును నశింపచేసి, భ్రూణహత్యాపాపమును పొందినావు. నీకు నరకమే ప్రాప్తించును గాని, భర్తతో సాలోక్యము(భర్త ఉన్న లోకములోనే అతనితో కలిసి నివసించుట) లభింపదు.(2-4)

నీ వీ భయంకరమైన పని చేసి ఇట్టి పాపము సంపాదించితివి. ఈ విధముగ అందరికిని అప్రియమును చేయుటచే నీ కుమారుడ నైన నాకు కూడ భయము కలిగించినావు. నీ మూలమున నా తండ్రి మరణించినాడు. రాముడు అరణ్యమునకు వెళ్ళిపోయినాడు. నాకు కూడా నీ వీ లోకమునందు గొప్ప అపకీర్తి తెచ్చి పెట్టినావు. నీవు నాకు తల్లి అను పేరు పెట్టుకొన్న శత్రువువు. క్రూరురాలవు. రాజ్యలోభము కలదానవు. చెడ్డగా ప్రవర్తించి భర్తను చంపినావు. నీవు నాతో మాటలాడతగినదానవు కావు.(5-7)

కులమునకు చేటు తెచ్చిన నీ మూలమున, కౌసల్యకూ, సుమిత్రకూ, నా మిగిలిన తల్లులందరికీ కూడ గొప్ప కష్టము వచ్చిపడినది. ధార్మికుడూ, సత్యపరాయణుడూ అయిన రాముని అరణ్యమునకు పంపివేసినావు. పుత్రశోకముతో నా తండ్రి స్వర్గస్థుడైనాడు. అందుచే, నీవు ధర్మాత్ముడూ, బుద్ధిశాలీ అయిన అశ్వపతి కుమార్తెవు కాదు. తండ్రి కులమును నశింపచేయుటకై ఆ వంశమునందు జన్మించిన రాక్షసివి.(8-10)

నీవు చేసిన పాపము నాకు సంక్రమించుటచే నా తండ్రి మరణించినాడు. సోదరులు నన్ను పరిత్యజించినారు. నేను అందరికిని అప్రియుడను అయినాను. ధర్మాత్మురాలైన కౌసల్యకు పుత్రవియోగము కలిగించిన నీవు పోవుటకు తగిన లోకమేదియో తెలియదు! క్రూరురాలా! కౌసల్యాకుమారుడైన రాముడు ఆత్మనిగ్రహము కలవాడనీ, బంధువులకు ఆశ్రయ మైనవాడనీ, జ్యేష్ఠు డగుటచే మాకు తండ్రి వంటివాడనీ నీకు తెలియదా?(11-13)

పుత్రుడు తన అంగములనుండీ, ప్రత్యంగములనుండీ(చిన్న, పెద్ద ప్రతి అవయవములనుండి) హృదయమునుండీ కూడ పుట్టినవాడగుటచే తల్లికి అత్యంతప్రియుడు. ఇతర బాంధవులు ప్రియులు మాత్రమే.(14)

ఒకానొకప్పుడు, ధర్మములు తెలిసినదీ, దేవతలచే పూజింపబడినదీ అయిన కామధేనువు తన పుత్రులు, భూలోకమున దున్నుచూ మూర్ఛ చెంది ఉండగా చూచెనట. భూలోకమునందు దినములో సగము భాగము శ్రమించి అలసిపోయిన ఆ వృషభములను చూచి, పుత్రశోకముచే కన్నీళ్లతో వ్యాకుల మైన నేత్రములు కలదై ఏడ్చెను. ఆ సమయమున దేవేంద్రుడు క్రింది భాగమున వెళ్ళుచుండగా, కామధేనువుయొక్క పరిమళించుచున్న సూక్ష్మమైన కన్నీటి బిందువులు అతనిపై పడినవి.(15-17)

దేవాధీశుడైన ఇంద్రుడు తన శరీరముపై పడిన పరిమళించుచున్న కన్నీటిబిందువులను చూచి, అవి పూజ్యురాలైన కామధేనువు కన్నీటి బిందువులే అయి ఉండు నని తలచెను. దేవేంద్రుడు పైకి చూచి, అక్కడ, వ్యాకులురాలై, దైన్యముతో మిక్కిలి దుఃఖించుచు ఏడ్చుచున్న ఆ కామధేనువును చూచెను. ఇంద్రుడు కామధేనువు శోకసంతప్తురా లగుటను చూచి, దిగులు చెంది, నమస్కరించుచు ఇట్లు పలికెను.(18-20)

"అందరి హితమునూ కోరుదానా! మాకు ఎవ్వరినుండీ మహాభయము

వచ్చుట లేదు కదా! నీ శోకమునకు కారణ మేమో చెప్పుము."(21)

ధీమంతుడైన ఆ సురరాజు మాటలు విని, ధైర్యవంతురాలైన ఆ కామధేనువు మాటలలో నేర్పరి యైన అతనితో ఇట్లు పలికెను.(22)

"పాపము శమించుగాక! ఇంద్రా! మీకు ఎక్కడినుండీ ఏ భయమూ లేదు. నా పుత్రులైన ఈ వృషభములు కష్టములో ఉన్నవి. కృశించి ఎండకు బాధపడుచున్న వీటిని ఈ కర్షకుడు ఇంకను పీడించుచున్నాడు. దుఃఖమగ్నము లైన వీటిని చూచుటచే నాకు దుఃఖము కలిగినది. భారము మోయలేక దుఃఖించుచున్న ఈ వృషభములు నా శరీరమునుండి పుట్టినవి. అందుచేతనే వాటి దుఃఖమును చూచి నాకు దుఃఖము కలిగినది. పుత్రునితో సమానుడైన ప్రియుడు ఉండదు కదా!"(23-25)

వందలాది కామధేనుపుత్రులు ఈ ప్రపంచమునం దంతటను వ్యాపించి ఉన్నారు. అట్టి కామధేనువు కూడ పుత్రులకై ఏడ్చుట చూచి దేవేంద్రుడు "పుత్రుని మించిన వారెవ్వరును లేరు కదా" అని నిర్ణయించుకొనెను.(26)

ఈ లోకములను నిలుపవలె ననే కోరికతో కామధేనువు సర్వదా సాటి లేని విధముగా ప్రవర్తించుచుండును. స్వభావముచేతనే ఎల్లప్పుడును సకలసద్గుణములకు నిలయమైనది, సకలైశ్వర్యసంపన్నురాలు, వేలకొలది పుత్రుల పరంపర గల అట్టి కామధేనువే ఈ విధముగ తన సంతానమైన రెండు వృషభములకొరకై దుఃఖించుచున్నది కదా; ఏకైకపుత్రుడైన రామునకు దూరమై జీవింపవలసిన కౌసల్య ఆ రామునకై ఎంత దుఃఖించునో చెప్పవలెనా? ఒకే కుమారుడు గల ఈ పరమసాధ్విని నీవు కుమారునకు దూరము చేసినావు. అందుచే, ఇహలోకమునందూ, మరణానంతరమూ కూడ నీకు ఎల్లప్పుడూ, దుఃఖము తప్పదు.(27-29)

నా సోదరుని విషయమునందూ, నా తండ్రి విషయమునందూ జరిగిన అపచారమునకు ప్రాయశ్చిత్తముగా చేయవలసిన దంతా చేసి, నేను కీర్తిని కూడ పెంచుకొనెదను. సంశయము లేదు. మహాబలశాలి యైన రాముని అరణ్యమునుండి వెనుకకు రప్పించి, నేనే మునినివాసమైన అరణ్యమునకు పోయెదను. ఓ పాపాత్మురాలా! పౌరు లందరూ దుఃఖమును దిగమ్రింగికొని చూచుచుండగా, నీవు చేసిన పాపమును మోయజాలను.(30-32)

నీవు అగ్నిలోనైనా దూకుము. నీవే ఆ దండకారణ్యమునకు వెళ్ళుము. లేదా

ఉరి పోసికొనుము. మరొక మార్గ మేదీ లేదు. సత్యపరాక్రముడైన రాముడు రాజ్యమును స్వీకరించిన పిమ్మట, నేను కూడ, నా పాప మంతయు తొలగిపోవుటచే కృతకృత్యుడ నయ్యెదను."(33, 34)

అరణ్యములో తోమరములచేతను, అంకుశములచేతను పొడవబడిన ఏనుగువలె ఈ విధముగ చాల కోపించినవాడై, భరతుడు సర్పము వలె నిట్టూర్పుచు నేలపై పడెను. కండ్లు ఎఱ్ఱబడి, వస్త్రము జారిపోవుచు, అలంకారము లన్నీ చెల్లాచెదురుగా క్రింద పడిపోయి, నేలపై పడి ఉన్న పరంతపు డైన ఆ భరతుడు, ఇంద్రధ్వజోత్సవాంతమునందు నేలపై పడిన ఇంద్రధ్వజము వలె ఉండెను.(35, 36)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని డెబ్బది నాలుగవ సర్గము సమాప్తము.

డెబ్బదియైదవ సర్గము

కౌసల్య యెదుట భరతుడు శపథము చేయుట.

వీర్యవంతుడైన ఆ భరతుడు చాల సేపటికి తిరిగి సంజ్ఞ రాగా లేచి అశ్రువులతో నిండిన నేత్రములతో, దీనురాలైన తల్లిని చూచి, అమాత్యుల మధ్యయందు, ఆమెను ఈ విధముగా నిందించెను.(1)

నే నెన్నడూ రాజ్యము కావలె నని కోరలేదు. ఈ విషయమునందు తల్లితోకూడ ఎన్నడూ ఆలోచన చేయలేదు. రాజు నాకు రాజ్య మిచ్చుటకు అంగీకరించిన విషయము కూడ నాకు తెలియదు. నేనూ శత్రుఘ్నుడూ చాల దూరమైన దేశములో ఉంటిమి కదా. మహాత్ముడైన రాముడు వనవాసమునకు వెళ్ళినట్లు గాని, సీత, లక్ష్మణుడు ఏ విధముగా అరణ్యములోనికి వెళ్ళినారో ఆ విషయమును గాని నేను ఎరుగను.(2-4)

మహాత్ముడైన భరతు డీ విధముగా అరచుచుండగా, కౌసల్య అతని కంఠధ్వనిని గుర్తించి సుమిత్రతో ఇట్లనెను.(5)

"క్రూరమైన పని చేసిన కైకేయి కుమారుడైన భరతుడు వచ్చినాడు. దీర్ఘాలోచన గల ఆ భరతుని చూడగోరుచున్నాను."(6)

రంగు మారి, మలినమైన శరీరముతో కృశించి ఉన్న ఆ కౌసల్య సుమిత్రతో ఇట్లు పలికి, వణకిపోవుచు, సంజ్ఞ తప్పినదై భరతుడున్న చోటికి వెళ్ళుటకు బయలుదేరెను.(7)

రాముని తమ్ముడైన ఆ భరతుడు శత్రుఘ్నసమేతుడై కౌసల్య గృహము వైపు బయలుదేరెను.(8)

దుఃఖముచే ఆర్తురాలై, సంజ్ఞ తప్పి, నేలపై బడి, ఏడ్చుచున్న పూజ్యురాలూ, ఉత్తమమనస్సు కలదీ అయిన కౌసల్యను చూచి, భరతశత్రుఘ్నులు, దుఃఖితులై, ఏడ్చుచు, అతికష్టమున ఆమె దగ్గరకు వెళ్ళి కౌగిలించుకొనిరి.(9)

మిక్కిలి దుఃఖితురాలైన కౌసల్య భరతునితో ఇట్లు పలికెను.

"రాజ్యము కావలె నని కోరుకున్న నీకు ఏ శత్రుబాధా లేని రాజ్యము లభించినది. కైకేయి చేసిన క్రూరకార్యముచే చాల శీఘ్రముగా లభించినది! క్రూరమైన ఆలోచనలు గల కైకేయి నా కుమారుడు నారచీర కట్టి వనానికి వెళ్ళునట్లు చేసినది కదా! ఏమి గుణమును(ప్రయోజనమును) ఉద్దేశించి అట్లు చేసినది? నా కుమారుడున్న చోటికి కైకేయి నన్ను కూడ పంపివేయుట మంచిది. లేదా, నేనే స్వయముగా, సుమిత్ర నావెంట రాగా, అగ్నిహోత్రమును ముందు ఉంచుకొని, రాముడున్న చోటికి సుఖముగా పోయెదను. లేదా, పురుషశ్రేష్ఠుడైన నా పుత్రుడు తపస్సు చేయుచున్న ప్రదేశమునకు, నీకు ఇష్టమైనచో, నీవే స్వయముగా నన్నిప్పుడు తీసికొని వెళ్ళుము.(10-15)

ధనధాన్యసమృద్ధమూ, గజాశ్వరథపూర్ణమూ, అతివిస్తృతమూ అయిన రాజ్యము ఆమె నీ కిప్పించినది కదా!"(16)

వ్రణమునందు సూదితో గుచ్చినట్లు, ఈ విధముగా అనేకమైన క్రూరవాక్కులతో నిందింపబడిన, ఏ పాపమూ ఎరుగని భరతుడు చాల బాధపడెను. ఆ మాటలు వినగానే తల తిరిగిపోయి, ఆమె పాదములపై బడి, అనేక విధముల విలపించి, సంజ్ఞ కోల్పోయెను. కొంత సేపటికి సంజ్ఞ తిరిగి రాగా అట్లే ఉండిపోయెను.(17,18)

భరతుడప్పుడు దోసిలి పట్టి నమస్కరించుచు, అనేకవిధములైన శోకములు పట్టి పీడింపగా, ఈ విధముగా విలపించుచున్న కౌసల్యతో ఇట్లు పలికెను.(19)

"ఆర్యురాలా! ఏ విషయమూ తెలియని, ఏ పాపమూ ఎరుగని నన్నీ విధముగా ఎందుకు నిందించెదవు? నాకు రామునిపై ఎంత అధికమూ స్థిరమూ అయిన

ప్రేమ ఉన్నదో కూడా నీకు తెలియును కదా?(20)

సత్యసంధుడూ, సత్పురుషులలో శ్రేష్ఠుడూ అయిన అన్నగారు ఎవ్వని సమ్మతిచే అరణ్యమునకు వెళ్ళినాడో, వానికి శాస్త్రమును అనుసరించు నదీ, స్థిరమైనదీ అయిన బుద్ధి లేకుండు గాక. అనగా రాముడు అరణ్యవాసమునకు పోవలె నని నేనెన్నడైన మనస్సులో కూడ అనుకొని ఉన్నచో నా బుద్ధి వక్ర మై, శాస్త్రమును అనుసరించక, అస్థిరము అయిపోవుగాక అని భావము. (సత్పురుషులకు అపకారము తల పెట్టువాని బుద్ధి చెడి, అమార్గమున ప్రవర్తించి వాని వినాశమునకు హేతువగునని తాత్పర్యము. ఈ విధముగా భరతుని శపథము లను వ్యాజముచే వాల్మీకిమహాముని ఈ ఘట్టములో మనకు ధర్మబోధ చేయుచున్నాడు.) అన్నగారు అరణ్యమునకు వెళ్ళుటకు నేను సమ్మతించి ఉన్నట్లయితే, నాకు పాపాత్ముల సేవ చేసిన(లేదా చేయవలసిన) పాపము, సూర్యునకు ఎదురుగా మలమూత్రవిసర్జన చేసిన పాపము, నిద్రించుచున్న గోవును పాదముతో తన్నిన పాపము వచ్చుగాక. అన్నగారు నా సమ్మతి ప్రకారమే అరణ్యమునకు వెళ్ళి ఉన్నచో, నాకు ఒక యజమాని తన భృత్యునిచేత చాల పని చేయించుకొని అతని కేమీ ధన మివ్వనిచో వానికి ఎంత పాపము కలుగునో అంత పాపము కలుగు గాక.(21-23)

ఆర్యుడు అరణ్యమునకు వెళ్ళుటకు నా సమ్మతి ఉన్నచో, నాకు ప్రజలను తన పుత్రులను వలె పరిపాలించుచున్న రాజుకు ద్రోహము చేసేవారికి ఎట్టి పాపము కలుగునో అట్టి పాపము కలుగుగాక. అన్నగారు అడవికి వెళ్ళుటలో నా అంగీకార మున్నచో, నాకు, ప్రజలనుండి వారి ఆదాయములోని ఆరవ వంతు పన్నుగా స్వీకరించుచున్నను వారిని రక్షింపని రాజునకు ఎట్టి పాపము కలుగునో అది కలుగుగాక. అన్నగారు అరణ్యమునకు వెళ్ళవలె నని నేను సమ్మతించి ఉన్నచో, నాకు యాగమునందు, దానికి కావలసిన దక్షిణలన్నీ ఇచ్చెదనని మునులకు మాట ఇచ్చి, పిదప నేను అట్లనలేదని బొంకువానికి కలుగు పాపము కలుగు గాక.(24-26)

అన్నగారు నా అనుమతి ప్రకారమే అడవికి వెళ్లి ఉన్నచో, నాకు గజములతోను, అశ్వములతోను, రథములతోను నిండిన, యోధజనులతో వ్యాకులమైన రణరంగమునకు వెళ్లి, ధర్మము పాటించక, వెన్నిచ్చి పారిపోయి వచ్చినవానికి కలుగు పాపము కలుగు గాక. అన్నగారు అడవికి వెళ్ళుటలో నా సమ్మతి ఉన్న పక్షమున, దుష్టాత్ముడనైన నాకు ధీమంతుడైన ఆచార్యుడు ప్రయత్నపూర్వకముగా

ఉపదేశించిన సూక్ష్మవిషయములు గల, శాస్త్రమును విస్మరించిన వానికి కలుగు పాపము కలుగు గాక. అన్నగారు అరణ్యమునకు వెళ్ళుట నాకు సమ్మతమే అయినచో, బలిష్ఠమైన బాహువులూ భుజములూ గల, చంద్రార్కసమాన తేజఃశాలియైన ఆ రాముడు రాజ్యాధీశుడై సింహాసనము పై కూర్చొని ఉండగా చూచు భాగ్యము నాకు కలగకపోవుగాక.(27-29)

అన్నగారు అడవికి వెళ్లుటకు నా సమ్మతి ఉన్నచో, అప్పుడు, దయారహితుడనైన నాకు, పితృఅతిథిపూజాదినిమిత్తము లేవీ లేకుండగానే, పాయసమునూ, కృసరమును (పులగము లేదా బెల్లం కలిపిన నువ్వులు), మేకమాంసమునూ తినువానికీ, గురువులను అవమానించు దయావిహీనునికీ కలుగు పాపము కలుగుగాక. రాముడు నా సమ్మతి ప్రకారమే అరణ్యమునకు వెళ్ళినచో, నాకు గోవులను పాదముతో తన్నిన పాపము, స్వయముగా పెద్దవారిని దూషించిన పాపము, మిత్రునకు గొప్ప ద్రోహము చేసిన పాపము కలుగుగాక. అన్నగారు నా అనుమతి ప్రకారమే అడవికి వెళ్ళినచో, దుష్టాత్ముడ నైన నాకు, ఒక వ్యక్తి, తనపై ఉన్న విశ్వాసముతో, రహస్యమునందు తన మిత్రాదులు ఇతరులను గూర్చి చెప్పిన దూషణవాక్యములను, వారికి చెప్పినచో ఆ వ్యక్తికి ఎంత పాపము వచ్చునో అంత పాపము కలుగుగాక.(30-32)

అన్నగారు అరణ్యమునకు వెళ్లుటలో నా అంగీకార మున్నచో, నేను ఎవ్వరికీ ఎట్టి ఉపకారమూ చేయనివాడనుగానూ, కృతఙ్ఞత లేనివాడనుగానూ, ఆత్మహత్యా పాపవంతుడనుగానూ, సిగ్గులేనివాడనుగానూ, లోకములో అందరిచేత ద్వేషింపబడేవాడను గానూ అగుదును గాక. అన్నగారు నా అనుమతి ప్రకారమే అడవికి వెళ్ళినచో, నాకు, ఇంటిలో భార్యపుత్రాదులు, ఇతరు లైన పోష్యజనులు ఉండగా, తా నొక్కడే మృష్టాన్నమును భుజించినవానికి ఎట్టి పాపము వచ్చునో అట్టి పాపము వచ్చుగాక. ఆర్యుడైన రాముడు నా అనుమతి ప్రకారమే అడవికి వెళ్ళి ఉన్నచో, నాకు, తగిన భార్యను వివాహము చేసికొనక, సంతానరహితుడై, ధర్మసంమతమైన కర్మలు చేయజాలనివానికి కలుగు పాపము కలుగుగాక. (అనగా ఎంత పాపము చేసిన ఇట్టి దుఃస్థితి కలుగునో అట్టి పాపము కలుగుగాక అని భావము.)(33-35)

అన్నగారు నా అనుమతి ప్రకారమే అరణ్యమునకు వెళ్ళినచో, నాకు పూర్ణాయుర్దాయము లేక దుఃఖితుడై తన భార్యయందు సంతానము పొందని వానికి కలుగు పాపము - అనగా ఎంత పాపము చేయుటచే ఇట్టి దుఃస్థితి కలుగునో అంత

పాపము కలుగుగాక. అన్నగారు అరణ్యమునకు వెళ్ళవలె నని కోరుకున్నవాడు రాజును, స్త్రీలను, బాలలను, వృద్ధులను చంపుటచేతను, పోషించతగినవారిని విడచివేయుటచేతను ఏ పాపము కలుగునో ఆ పాపమును పొందుగాక. అన్నగారు అరణ్యమునకు వెళ్ళవలె నని నేను కోరి ఉన్నచో, నాకు పణ్యములు కాని(అమ్మకూడని) లక్క, మధువు, మాంసము, లోహము, విషము విక్రయించి వ్యాపారము చేయుచు నిత్యము దారపుత్రాదులను పోషించువానికి ఎట్టి పాపము కలుగునో అట్టి పాపము కలుగుగాక. (36-38)

అన్నగారు అడవికి వెళ్లుటలో నా సమ్మతి ఉన్న పక్షమున, నాకు, శత్రుపక్షములు రెండింటికీ భయము కలిగించు యుద్ధము తారస్థాయిలో ఉండగా వెన్నిచ్చి పారిపోవుచు చంపబడిన యోధునకు ఎంత పాపము కలుగునో అంత పాపము కలుగుగాక. అన్నగారు అరణ్యమునకు వెళ్ళవలె నని కోరినవాడు, కుండపెంకు చేతిలో పెట్టుకొని, చినిగిన గుడ్డలు కట్టుకొని, బిచ్చ మెత్తుకొనుచు, పిచ్చివానివలె భూమిమీద తిరుగుగాక. అన్నగారు అరణ్యమునకు వెళ్లవలె నని కోరుకొన్నవాడు కామక్రోధములకు వశుడై నిత్యము మద్యపానము, స్త్రీలు, జూదము మొదలైన వ్యసనములందు ఆసక్తుడగుగాక. నేను రాముని వనగమనము నంగీకరించి యున్నచో నాకు పైన చెప్పినవానికి ఎంత పాపము కలుగునో అంత పాపము కలుగుగాక. (39-41)

ఆర్యుడైన అన్నగారు అరణ్యమునకు వెళ్ళవలె నని కోరినవాని మనస్సు ధర్మమునందు ప్రవర్తింపకుందుగాక. అతడు అధర్మమునే ఆచరించు గాక. అపాత్రులకు దానము చేయుగాక. ఆర్యుడు అరణ్యమునకు వెళ్ళవలె నని కోరినవాడు వేలకొలది సంపాదించుకొనిన అనేకవిధములైన ధనములను చోరులు అపహరింతురుగాక. రాముని అరణ్యగమనమునకు నేను కారణమైనచో ఎంత పాపము చేసినచో కూడబెట్టుకొనిన ధన మంతా దొంగలు అపహరింతురో అంత పాపము నాకు కలుగుగాక. అన్నగారు అడవికి వెళ్ళుటకు అనుమతించినవానికి సాయంప్రాతః సంధ్యాకాలములందు నిద్రించువానికి కలుగు పాపము కలుగుగాక. (42-44)

అన్నగారి అరణ్యగమనానికి కారణ మైనవానికి ఇతరుల గృహములను దహించినవానికి కలుగు పాపము, గురుభార్యాగమనము చేసినవానికి కలుగు పాపము, మిత్రద్రోహమువలన కలుగు పాపము కలుగుగాక. నేను అన్నగారి అరణ్యగమనానికి కారణమైనచో, దేవతలకు, పితృదేవతలకు, తల్లిదండ్రులకు శుశ్రూషచేయనివానికి ఎట్టి పాపము వచ్చునో అట్టి పాపము నాకు కలుగుగాక.

అన్నగారు అరణ్యమునకు వెళ్ళవలె నని అనుమతించినవాడు, ఇప్పుడే, వెంటనే, సత్పురుషులకు లభించు లోకమునుండీ, సత్పురుషుల కీర్తినుండీ, సత్పురుషులు ఆచరించు కర్మనుండీ భ్రష్టుడగుగాక.(45-47)

దీర్ఘబాహుడూ, విశాలవక్షముకలవాడూ అయిన అన్నగారు అరణ్యమునకు వెళ్ళవలె నని కోరుకొన్నవానికి, తల్లి శుశ్రూష చేయుట మాని, అనర్థకరమైన పనులు చేయువానికి కలుగు పాపము కలుగుగాక. అన్నగారు ఎవరి అనుమతిచే వెళ్ళినాడో అతడు అత్యధికసంతానవంతుడై, దారిద్ర్యముతోను, జ్వరరోగములతోను ఎల్లప్పుడు బాధపడుచుండుగాక. నేను రాము డడవికి వెళ్ళుటకు కారణమైనచో ఎంతటి పాపము చేసినవానికి పైన చెప్పిన బాధలన్నీ వచ్చునో అన్ని బాధలూ నాకు కలుగుగాక. అన్నగారు అడవికి వెళ్లుటకు నేను నిమిత్త మైనచో నాకు, దీనులై పైకి చూచుచు, యాచించుచున్న యాచకుల ఆశను నిష్ఫలము చేసినవానికి వచ్చు పాపము వచ్చుగాక.(48-50)

రాముని అరణ్యగమనమునకు నేనే కారణమైనచో, నాకు, క్రూరుడై చాడీలు చెప్పుచు, అపవిత్రుడై, అధర్మాత్ముడై, నిత్యము రాజున కెక్కడ పట్టుబడుదుమో అని భయపడుచు, అందరిని మోసగించుచు జీవించువానికి ఎట్టి పాపము వచ్చునో అట్టి పాపము కలుగుగాక. అన్నగారు అరణ్యమునకు వెళ్లుటకు నేను అనుమతించి ఉన్నచో, నాకు, ఋతుస్నాత యై, ఋతుకాలమును పాటించు పతివ్రత యైన భార్యను కలియని దుష్టాత్మున కెంత పాపము కల్గునో అంత పాపము కలుగుగాక. పూజ్యుడైన అన్న గారు అడవికి వెళ్ళవలె నని నేను కోరి ఉన్నచో నాకు, ధర్మమునందు ఆసక్తి లేక తన ధర్మపత్నిని విడచి పరభార్యాసంగము చేసిన మూఢాత్మునకు ఎట్టి పాపము కలుగునో అట్టి పాపము కలుగుగాక.(51-53)

ఆర్యుడు అరణ్యమునకు వెళ్ళవలె నని కోరుకొన్నవానికి, సంతానము లేని బ్రాహ్మణునకు ఎంత పాప ముండునో - అనగా ఎంత పాపము చేసినచో బ్రాహ్మణుడు సంతానహీనుడగునో - అంత పాపము కలుగుగాక. అన్నగారు అరణ్యమునకు వెళ్లుటకు నేను కారణ మైనచో, త్రాగే నీరు పాడుచేసినవానికీ, ఇతరులకు విషము ఇచ్చినవానికీ ఎట్టి పాపము కలుగునో ఆ పాపమంతా నా ఒక్కనికే కలుగుగాక. అన్నగారు అరణ్యమునకు వెళ్ళవలె నని నేను కోరి ఉన్నచో, నాకు దుష్టములైన ఇంద్రియములు కలవాడై, బ్రాహ్మణునికొరకై సిద్ధము చేసిన పూజకు విఘాతము కలిగించువానికి ఎట్టి పాపము వచ్చునో, లేగదూడ ఉన్న ఆవు పాలను దూడకై మిగల్చకుండా పితికివేయువానికి(లేదా ఈనిన పిదప పదిరోజులు దాటకుండా

ఆవుపాలు పిదుకువానికి) ఎట్టి పాపము వచ్చునో అట్టి పాపము వచ్చుగాక. (54-56)

అన్నగారి అరణ్యగమనమునకు నేను కారణమైనచో నాకు జలము ఉండికూడ లేదని చెప్పి దప్పికొన్నవానిని మోసగించినవానికి కలుగు పాపము కలుగుగాక. అన్నగారు అడవికి వెళ్ళవలె నని నేను కోరి ఉన్నచో, నాకు, కొందరు రెండు పక్షాలుగా విడిపోయి కలహించుచుండగా, వారిని విడదీయక, మార్గములో నిలబడి చోద్యము చూచుచున్నవానికి ఎట్టి పాపము వచ్చునో అట్టి పాపము కలుగుగాక. (57, 58)

పతి లేక, పుత్రునకు దూరమైన కౌసల్యను ఈ విధముగా ఓదార్చుచునే భరతుడు దుఃఖార్తుడై నేలపై పడిపోయెను. (59)

ఈ విధముగా కష్టమైన శపథములతో ఒట్టు పెట్టుచు, దుఃఖార్తుడై స్పృహ తప్పి నేలపై పడిపోయిన భరతునితో కౌసల్య ఇట్లు పలికెను. (60)

"కుమారా! నీవు ఈ విధముగా శపథములు చేసి, ఒట్లు పెట్టుచు నా ప్రాణములకు దుఃఖము కలిగించుచున్నావు. అందుచే నా దుఃఖము ఇంకను పెరిగిపోవుచున్నది. వత్సా! పుణ్యవశముచే, నీ మనస్సు ధర్మమార్గమునుండి చలించలేదు. సత్యప్రతిజ్ఞుడవైన నీవు, లక్ష్మణసమేతుడవై సత్పురుషుల లోకమును చేరగలవు."(61, 62)

రామునియందు అత్యధికమైన ప్రేమ గల ఆ భరతునితో ఇట్లు పలికి కౌసల్య ఆ మహాబాహుని ఒడిలో కూర్చుండబెట్టుకొని, కౌగిలించుకొని, చాల దుఃఖించుచు ఏడ్చెను. (63)

దుఃఖార్తుడై ఆ విధముగా విలపించుచున్న ఆ మహాత్ముని మనస్సు మోహముచేతను, దుఃఖపీడచేతను చాలా నలిగిపోయెను. ఎక్కువ విలపించుచు, చైతన్యరహితుడై, బుద్ధి నశించి, నేలపై పడి, మాటి మాటికిని వేడిగా నిట్టూర్చుచున్న ఆ భరతునకు ఆ రాత్రి దుఃఖముతో గడచెను. (64, 65)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని డెబ్బది ఐదవ సర్గము సమాప్తము.

డెబ్బది అరవ సర్గము

దశరథమహారాజునకు దహనసంస్కారము.

ఈ విధముగా దుఃఖసంతప్తుడైన కైకేయీకుమారుడైన భరతునితో మాటలలో నేర్పు కలవాడు, శ్రేష్ఠమైన మాటలు మాటలాడువాడు అయిన వసిష్ఠమహర్షి ఇట్లు పలికెను.(1)

"ఉత్తమమైన కీర్తి గల రాజకుమారా! నీకు మంగళమగుగాక. దుఃఖించకుము. రాజునకు ఉత్తమమైన ఉత్తరకర్మ చేయవలసిన సమయము కదా! ఆ ఉత్తరకర్మ చేయుము."(2)

ధర్మవేత్తయైన భరతుడు వసిష్ఠుని మాటలు విని, స్థైర్యము నవలంబించి, ప్రేతకార్యము లన్నింటిని చేయించెను.(3)

దశరథమహారాజు కళేబరమును తైలద్రోణినుండి పైకి తీసి నేలపై ఉంచిరి. పచ్చనైన ముఖముతో అతడు నిద్రపోవుచున్నట్లుండెను. పిదప అతనిని అనేకరత్నములచే అలంకృతమైన శ్రేష్ఠమైన శయనముపై పరుండ బెట్టిరి. అట్టి దశరథుని చూచి కుమారుడైన భరతుడు చాలా దుఃఖించుచు విలపించెను.(4, 5)

"మహారాజా! ప్రవాసమునుండి నేను తిరిగి రాకుండగా, ధర్మవేత్తయైన రామునీ, మహాబలశాలి యైన లక్ష్మణునీ దూరముగా పంపివేసినావు కదా. నీవు ఏమి నిర్ణయము చేసికొని అట్లు చేసినావు? శ్రమపడకుండా పనులు చేయగలవాడూ, పురుషశ్రేష్ఠుడూ అయిన రాముడు దగ్గర లేని, దుఃఖార్తుడ నైన నన్ను విడచి ఎక్కడికి వెళ్ళెదవు? నీవు స్వర్గమునకు వెళ్ళిపోయినావు. రాముడు అరణ్యమునకు వెళ్ళినాడు. ఇపుడు నీ అయోధ్యానగరమునకు సంబంధించిన యోగక్షేమములు చూచువారెవరు? నీవు లేని ఈ భూమి విధవ యై ప్రకాశహీనురాలై ఉన్నది. నాకు ఈ నగరము చంద్రుడు లేని రాత్రి వలె కనబడుచున్నది."(6-9)

దీనమైన మనస్సుతో ఈ విధముగా విలపించుచున్న భరతునితో మహాముని యైన వసిష్ఠుడు మరల ఇట్లు పలికెను.(10)

"మహాబాహూ! ఇంక జాగు చేయక, తొందరపాటు లేక, ఈ రాజుకు జరపవలసిన ప్రేతకార్యము లన్నీ జరుపుము."(11)

భరతుడు "అటులనే చేసెదను" అని పలికి, వసిష్ఠుని మాటను గౌరవించి

వివిధ కార్యములు చేయుటకు ఋత్విక్కులను, పురోహితులను, ఆచార్యులను తొందరపెట్టెను. (12)

అగ్నిగృహమునుండి బైటకు తీసికొనివచ్చిన దశరథుని అగ్నులను ఋత్విక్కులు, పురోహితులు యథాశాస్త్రముగా గ్రహించిరి. పిమ్మట పరిచారకులు, బాష్పముతో నిండిన కంఠములతో దుఃఖించుచు, మరణించిన ఆ రాజును చిన్న పల్లకీపై ఎక్కించి మోసికొని వెళ్ళిరి. రాజునకు ఎదుట వెండి, బంగారము, అనేక విధాలైన వస్త్రములు చల్లుచు జనులు మార్గమునందు వెళ్ళిరి. (13-15)

మరి కొందరు చందనము, అగురువు, గుగ్గిలము, సరళ పద్మక దేవదారువృక్షముల కఱ్ఱలు, ఇంకా అనేకవిధాలైన గంధద్రవ్యములు తీసికొని వచ్చి అక్కడ వేసిరి. పిదప ఋత్విక్కులు ఆ రాజు కళేబరమును చితిమధ్యలో పరుండ బెట్టిరి. అప్పుడు దశరథుని ఋత్విక్కులు అతని అగ్నిలో హోమములు చేసి జపించిరి. సామగులు యథాశాస్త్రముగా సామగానము చేసిరి. (16-18)

రాజభార్య లందరును వృద్ధులు వెంట రాగా, తమ తమ అర్హత ననుసరించి పల్లకీలను, ఇతరవాహనములను ఎక్కి నగరమునుండి బయలుదేరి వచ్చిరి. (19)

అప్పుడు ఋత్విక్కులు, దుఃఖాక్రాంతులైన కౌసల్యాదిస్త్రీలు ఆహితాగ్నియైన ఆ రాజుకు చుట్టూ అప్రదక్షిణముగా తిరిగిరి. ఆ సమయమున, అతిదీనముగా దుఃఖముతో ఏడ్చుచున్న వేలకొలది స్త్రీల రోదనధ్వని క్రౌంచపక్షుల ధ్వని వలె విన వచ్చెను. పిమ్మట స్వాధీనము తప్పి, ఏడ్చుచున్న స్త్రీలు మాటిమాటికిని విలాపము చేసి సరయూనదీ తీరమునందు యానములనుండి దిగిరి. (20-22)

ఆ రాజస్త్రీలూ, మంత్రిపురోహితాదులూ, భరతునితో పాటు తాము కూడా రాజునకు జలతర్పణములు ఇచ్చి, కన్నీళ్లతో నిండిన నేత్రములతో పురమును ప్రవేశించి నేలమీదనే పరుండుచు, పది దివసములు అతికష్టముతో గడిపిరి. (23)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని డెబ్బది ఆరవ సర్గము సమాప్తము.

డెబ్బది యేడవ సర్గము

భరతుడు తండ్రికి శ్రాద్ధవిధులు చేయుట.

పదవ దినము గడిచిన పిమ్మట శుద్ధి చేసికొని, భరతుడు పండ్రెండవ దినమునందు శ్రాద్ధకర్మలు చేయించెను. (1)

భరతుడు శ్రాద్ధసమయమునందు బ్రాహ్మణులకు రత్నములు, ధనము, పుష్కలమైన భోజనము, విలువైన వస్త్రములు, అనేకవిధములైన శ్రేష్ఠవస్తువులు దానము చేసెను. దశరథుని పారలౌకికక్రియలు చేయు సమయమున భరతుడు అత్యధిక మైన తెల్లని మేకల మందను, వందల కొలది గోవులను, దాసదాసీజనమును, వాహనములను, విశాలమైన గృహములను బ్రాహ్మణులకు దానము చేసెను. (2,3)

పదమూడవ దినమున ప్రాతఃకాలమునందు అస్థిసంచయనము చేయుటకై శ్మశానమునకు వెళ్ళిన మహాబాహు వగు ఆ భరతుడు, శోకాక్రాంతుడై, ఎలుగెత్తి ఏడ్చెను. తండ్రి చితాస్థానమును సమీపించి, చాల దుఃఖించుచు ఇట్లు పలికెను. (4,5)

"తండ్రీ! నీవు నన్ను రామునకు అప్పగించినావు. ఆ రాముడు అరణ్యమునకు వెళ్ళిపోయినాడు. ఇక నన్నిపుడు శూన్యములో వదలివేసినావు. అనాథురాలైన కౌసల్యకు గతి కావలసి యున్న రాముని అరణ్యమునకు పంపివేసి, ఇపుడు నీవు కూడ ఆమెను విడచి ఎక్కడికి వెళ్ళిపోయినావు?" (6, 7)

అతడు అక్కడ ఎముకలు దగ్ధములు కాగా, భస్మముచేత ఎఱ్ఱగా ఉన్నది, తన తండ్రి శరీరమును అదృశ్యముచేసినది అయిన ఆ మండలాకార మైన స్థానమును చూచి బిగ్గరగా ఏడ్చెను. భరతుడు ఆ చితాస్థానము చూచి, ఏడ్చుచు దీనుడై, పైకి ఎత్తుచుండగా జారి క్రిందపడిపోయిన యంత్రబద్ధమైన ఇంద్రధ్వజము వలె, నేలపై పడెను. అప్పు డాతని మంత్రు లందరును, భరతుని శీఘ్రముగా సమీపించిరి. శత్రుఘ్నుడు కూడ, భరతుని చూచి, శోకముతో వ్యాకులుడై, రాజును స్మరించుచు, స్పృహ తప్పి నేలపై పడెను. తండ్రియొక్క శ్రేష్ఠములైన ఆ యా అవయవములను ఆ యా విధములుగా స్మరించుచు, పిచ్చివాడు వలె, మనఃస్థైర్యము కోల్పోయి, చాలా దుఃఖించుచు, విలపించెను. (8-12)

మంథరనుండి పుట్టినదీ, కైకేయి అనే మొసలిచే భయంకరమైనదీ, తీవ్రమూ, క్షోభింపశక్యము కానిదీ అయిన, వరదాన మనే సముద్రము అందరినీ ముంచివేసినది. (13)

"తండ్రీ! సుకుమారుడు, బాలుడు సర్వదా నీచేత లాలింపబడినవాడు అయిన భరతుడు ఈ విధముగా విలపించుచుండగా విడచి ఎక్కడికి వెళ్ళి పోయినావు? మీకు కావలసిన భోజ్యములు, పానీయములు, వస్త్రములు, అలంకారములు తీసికొనుడని అనుచు మా కందరికీ ఆ యా వస్తువులను ఇచ్చుచుండెడి వాడవు కదా! మా కట్లు మరి యెవ్వరు చేయగలరు? ధర్మాత్ముడవు, మహాత్ముడవు, రాజువు అయిన నీవు లేని ఈ భూమి బ్రద్దలైపోవలసి ఉన్నది, కాని అట్లు బ్రద్దలగుటలేదు. తండ్రి స్వర్గస్థుడైనాడు. రాముడు అరణ్యమునకు వెళ్ళిపోయినాడు. ఇంక నాకు జీవించుటకు సామర్థ్య మెక్కడిది? అగ్నిలో ప్రవేశించెదను. సోదరుడూ, తండ్రీ లేని నేను, ఇక్ష్వాకువంశీయులచే పాలితమైన ఈ శూన్యమైపోయిన అయోధ్యను ప్రవేశించను. తపోవనమును ప్రవేశించెదను.(14-18)

వారిద్దరి విలాపములు విని, వచ్చి పడిన ఆ ఆపదను చూచి, అనుచరులందరు చాల దుఃఖితులైరి. దుఃఖితులై అలసిపోయిన ఆ శత్రుఘ్నభరతులిద్దరూ కొమ్ములు విరగగొట్టిన రెండు వృషభములు వలె నేలపై దొర్లిరి. అప్పుడు ఉత్తమస్వభావము కలవాడూ, జ్ఞానవంతుడూ, వీరి తండ్రికి పురోహితుడూ అయిన వసిష్ఠుడు భరతుని లేవదీసి, ఇట్లు పలికెను.(19-21)

"ప్రభువైన ఓ భరతా! నీ తండ్రి మరణించి ఇది పదమూడవ దివసము. అస్థిసంచయనకార్యము ఇంకను మిగిలి ఉన్నది. నీ విక్కడ ఆలస్యము చేయుచున్నావేమి? ఆకలిదప్పులు, సుఖదుఃఖములు, జరామరణములు అను మూడు జంటలు అన్ని ప్రాణుల విషయమునను భేద మేమీ లేకుండా ప్రవర్తించును. అవి పరిహరింప శక్యము కానివి. అట్టి స్థితిలో నీ విట్లు అగుట బాగుగాలేదు."(22, 23)

తత్త్వవేత్త యైన సుమంత్రుడు శత్రుఘ్నుని లేవదీసి, సకలప్రాణులకు జన్మమరణములు తప్పనివి అను విషయమును బోధించెను. నేలనుంచి లేచిన ఆ యశఃశాలులు ఇరువురూ, ఒక మారు వర్షమునకు తడిసి, పిదప ఎండకు ఎండి రంగుమారిన రెండు ఇంద్రధ్వజముల వలె ఉండిరి.(24, 25)

కన్నీరు తుడుచుకొనుచు, ఎఱ్ఱబడిన కళ్ళతో దీనముగా మాటలాడు చున్న ఆ రాజకుమారులను, అమాత్యులు, మిగిలిన పనులు చేయుటకు తొందర బెట్టిరి.(26)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని డెబ్బది ఏడవ సర్గము సమాప్తము.

డెబ్బది ఎనిమిదవ సర్గము

శత్రుఘ్నుడు గూనిదానిని పట్టి ఈడ్చుట. భరతుడు వారించగా ఆమెను విడచిపెట్టుట.

అనంతరము రాముని వద్దకు వెళ్ళవలె నని యోచించుచున్న, శోకసంతప్తుడైన భరతునితో శత్రుఘ్ను డిట్లు పలికెను.(1)

"బలశాలియైన రాముడు సకలప్రాణులకును గతి యైనవాడు. మనకు ఆపద వచ్చినపుడు అతడే రక్షకుడని వేరుగా చెప్పవలెనా! అట్టి రాముని ఒక ఆడుది వనమునకు పంపివేసినది. బలవంతుడూ, పరాక్రమవంతుడూ అయిన మన సోదరుడు లక్ష్మణుడు ఇక్కడనే ఉండెను కదా! అతడైనను తండ్రిని నిగ్రహించి రాముని ఎందుకు ఈ ప్రవాసమునుండి విడిపించలేదో! స్త్రీకి వశుడై అమార్గమున సంచరించుచున్న రాజును, న్యాయాన్యాయములు పరీక్షించి, ముందుగానే నిగ్రహించినచో బాగుండెడిది." (2-4)

శత్రుఘ్నుడు ఇట్లు మాటలాడుచున్న సమయమునందు, మంథర సర్వాభరణములు అలంకరించుకొని, తూర్పు ద్వారమునందు కనబడెను. ఆమె శ్రేష్ఠమైన చందనము పూసికొని, రాజులకు తగిన చాల విలువైన వస్త్రములను ధరించి, అనేకవిధములైన అలంకారములతో అలంకరించుకొని ఉండెను. చిత్రములైన వడ్డాణములు, అనేకమైన శుభకరములైన అలంకారములు కట్టుకొన్న ఆమె త్రాళ్ళతో కట్టిన ఆడకోతి వలె ఉండెను.(5-7)

అప్పుడు ద్వారపాలకులు మిక్కిలి పాపము చేసిన, జాలి లేని ఆ మంథరను చూచి, ఆమెను పట్టుకొని శత్రుఘ్ననకు తెలిపిరి.(8)

"ఎవతె మూలమున రాముడు అరణ్యమునకు వెళ్ళినాడో, నీ తండ్రి మరణించినాడో, పాపాత్మురాలూ, క్రూరురాలూ అయిన అట్టి స్త్రీ ఇదిగో; ఈమెను ఏమి చేయదలచెదవో అది చేయుము."(9)

మిక్కిలి దుఃఖించుచున్న, ఉత్తమనియమవంతుడైన శత్రుఘ్నుడు ఆ మాటలు విని, అంతఃపురములోని వారందరితో ఇట్లు పలికెను.(10)

"మా అన్నదమ్ములకూ నా తండ్రికీ తీవ్రమైన దుఃఖమును కలిగించిన ఈమె తాను చేసిన క్రూరకర్మకు ఫలము అనుభవించుగాక."(11)

అతడిట్లు పలికి వెంటనే ఆ మంథరను బలాత్కారముగా పట్టుకొనగా,

సఖీజనముతో కూడిన ఆమె ఏడ్చుచు ఆ గృహమును ధ్వనింపచేసెను. ఆమె సఖురాళ్లు అందరూ శత్రుఘ్నుడు కోపగించినాడని తెలుసుకొని, చాల దుఃఖించుచు నలుదిక్కులకూ పారిపోయిరి. "ఇతని ఉపక్రమము చూడగా మనల నందరిని నిశ్శేషముగా చంపునట్లు ఉన్నాడు." అని ఆమె సఖురాళ్ళు అందరును అనుకొనిరి.(12–14)

"జాలికలదీ, ఔదార్యవంతురాలూ, ధర్మజ్ఞురాలూ, కీర్తిమంతురాలూ అయిన కౌసల్యను శరణు వేడెదము. ఆమె తప్పక మనలను రక్షించును."(15)

రోషముచేత కళ్లు ఎఱ్ఱబారిన, శత్రువినాశకుడగు ఆ శత్రుఘ్నుడు, అప్పుడు, అరచుచున్న ఆ గూనుదానిని నేలపై ఈడ్చెను. శత్రుఘ్ను దా విధముగా మంథరను నేలపై ఈడ్చినపుడు ఆమె ధరించిన చిత్రమైన, బహువిధమైన అలంకారసముదాయము చెల్లాచెదురుగ పడిపోయెను. ఆ అలంకారములన్నియు చెల్లాచెదురై పడుటచేత ఆ రాజగృహము శరత్కాలమునందలి (నక్షత్రములతో నిండిన) ఆకాశము వలె మిక్కిలి ప్రకాశించెను.(16–18)

బలవంతుడైన ఆ పురుషశ్రేష్ఠుడు ఆమెను బలాత్కారముగ గ్రహించి, కైకేయిని భయపెట్టుచు పరుషమైన వాక్కులు పలికెను. పరుషములు, దుఃఖజనకములు అయిన ఆ మాటలకు చాల దుఃఖించుచు, శత్రుఘ్నునివలన ఏమి సంభవించునో అని భయపడుచు కైకేయి భరతుని శరణువేడెను.(19, 20)

భరతుడు కోపగించిన ఆ శత్రుఘ్నుని చూచి, అతనితో ఇట్లనెను– "ఏ ప్రాణులలో ఐనను స్త్రీలను చంపకూడదు. అందుచేత దీనిని క్షమింపుము. ధర్మాత్ముడైన రాముడు మాతృహత్య చేసినందుకు నన్ను నిందింప కున్నచో నేను చెడ్డగా ప్రవర్తించిన, పాపాత్మురాలైన కైకేయిని చంపి ఉండెడి వాడను. రాముడు ధర్మాత్ముడు. మనము ఈ గూనుదానిని చంపినట్లు అతడికి తెలిసినచో అతడు మనతో మాట్లాడడు."(21–23)

లక్ష్మణుని తమ్ముడైన శత్రుఘ్నుడు భరతుని మాటలు విని, కోపమును అణచుకొని ఆ మంథరను విడచెను. ఆ మంథర కైకేయి పాదముల చెంత పడి, చాల దుఃఖముచేత పీడితురాలై, నిట్టూర్పుచు విలపించెను. శత్రుఘ్నుడు దూరముగా విసిరివేయుటచే స్పృహ చెడి, దుఃఖించుచు నలువైపుల చూచుచున్న ఆ కుబ్జను చూచి భరతుని తల్లి యైన కైకేయి మెల్లగా ఓదార్చెను.(24–26)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని డెబ్బది ఎనిమిదవ సర్గము సమాప్తము.

డెబ్బది తొమ్మిదవ సర్గము

మంత్రులు రాజ్యము స్వీకరింపుమని భరతుని కోరుట. రాముడే రాజ్యాధికారి యని పలికి, భరతుడు ఆయనను మరలించి తెచ్చుటకై తగు ప్రయత్నము చేయుడని ఆదేశించుట.

పిమ్మట, పదునాల్గవ దినమునందు, రాజును చేయు అధికారముగల అమాత్యాదులు, భరతుని వద్దకు వెళ్ళి ఇట్లు పలికిరి.(1)

"మన అందరికీ అధికపూజ్యుడైన దశరథుడు, జ్యేష్ఠకుమారుడైన రాముని, మహాబలవంతుడైన లక్ష్మణునీ వనమునకు పంపివేసి, తాను స్వర్గస్థుడైనాడు.(2)

ఓ రాజకుమారా! ఇపుడు నీవు మాకు రాజువగుము. అరాజక మైన ఈ రాజ్యములోని ప్రజలు, దైవవశముచే పరస్పరపీడనము మొదలైన అపరాధములు చేయుటలేదు. నీవు ఆలసించినచో అట్టి ఉపద్రవములు కూడ ప్రారంభము కావచ్చును. నీవారందరూ అభిషేకసంభారములు సిద్ధము చేసికొని నీకొరకై వేచి ఉన్నారు. పితృపితామహక్రమమున వచ్చుచున్న, స్థిరమైన, ఈ రాజ్యమును గ్రహించి, రాజ్యాభిషిక్తుడవై, మమ్ము పాలింపుము."(3-5)

నియమమును అవలంబించిన భరతుడు, అభిషేకమునకు సంబంధించిన ఆ సమస్తవస్తుసముదాయమునకు ప్రదక్షిణనమస్కారములు చేసి, వారందరికీ ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెను.(6)

"మా వంశములో, ఎల్లప్పుడూ, పెద్దకుమారుడే రాజగుట ఉచితముగా ఉన్న ఆచారము. అన్నియు తెలిసిన మీరు నాతో ఇట్లు పలుకుట యుక్తము కాదు. మా సోదరులలో పెద్దవాడైన రాముడు రాజు కాగలడు. నేను పదునాలుగు సంవత్సరాలు అరణ్యములో నివసించెదను. చతురంగబలములు గల మహాసైన్యమును సమకూర్చుడు. నేను నా జ్యేష్ఠసోదరుడైన రాముని అరణ్యమునుండి తీసికొని వచ్చెదను.(7-9)

సంస్కరించిన ఈ అభిషేకసంభారము లన్నీ ఎదుట ఉంచుకొని, రాముని తిరిగి తీసికొనివచ్చుటకు అడవికి వెళ్లెదను. పురుషశ్రేష్ఠుడైన రామునకు అక్కడనే రాజ్యాభిషేకము చేసి, అతనిని ముందు ఉంచుకొని, యజ్ఞమునుండి అగ్నిని తీసికొనివచ్చి నట్లు తీసికొని వచ్చెదను. నా తల్లి అను పేరు పెట్టుకొనిన ఈమె కోరిక తీరు నట్లు చేయను. నేను దుర్గమమైన అరణ్యములో నివసించెదను. రాముడు

రాజు కాగలడు.(10-12)

శిల్పులు, ఎత్తుపల్లములున్న ప్రదేశములు సమములుగా ఉండునట్లు చేసి మార్గమును ఏర్పరచవలెను. ప్రవేశించ శక్యము కాని ప్రదేశములలో సంచరించగలుగు రక్షకులు మార్గమునందు మన వెంటనే రావలెను."(13)

ఈ విధముగ మాటలాడుచున్న ఆ భరతునితో ఆ జనులందరూ, శోభాయుక్తమూ, చాల ఉత్తమమూ అయిన మాట పలికిరి.(14)

"పెద్దవాడైన రాజకుమారునికి రాజ్యమును ఇవ్వవలె నని అభిలషించుచు, ఈ విధముగా మాటలాడుచున్న నిన్ను లక్ష్మి ఆశ్రయించుగాక."(15)

తమ చెవులు ప్రత్యక్షముగా వినునట్లు ఆ రాజకుమారుడు పలికిన మాటలు విన్న పిదప అతని విషయమున కలిగిన ఆనందముచేత, ఆ పూజ్యులైన జనుల నేత్రములనుండి కన్నీటి బిందువులు కారినవి. అమాత్యులు, పరిషత్తు కలిసిన ఆ జనులందరు అతని మాటలు విని సంతోషించి, "ఓ నరశ్రేష్ఠా! నీ ఆజ్ఞప్రకారము, భక్తిమంతులైన జనులను, శిల్పిసముదాయమును, మార్గనిర్మాణము చేయుడని ఆదేశించినాము." అని పలికిరి. (16,17)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని డెబ్బది తొమ్మిదవ సర్గము సమాప్తము.

ఎనుబదవ సర్గము

అయోధ్యనుండి గంగాతీరమువరకు శిల్పులు రాజమార్గము నిర్మించుట.

పిమ్మట, ఆయా ప్రదేశముల స్వరూపస్వభావములు తెలిసినవారు, సూత్రములు పట్టి కొలతలు వేయువారు, తమ తమ పనులందు శ్రద్ధ గల కార్యశూరులు, నేల త్రవ్వువారు, యంత్రము లుపయోగించువారు, కూలివాళ్లు, పెద్ద శిల్పులు, యంత్రముల ప్రయోగముల నెరిగిన పురుషులు, వడ్రంగులు, బాట వేయువారు, వృక్షములు ఛేదించువారు, నూతులు త్రవ్వువారు, సున్నము వేయువారు, వెదురు పని చేయువారు, సమర్థులైన పర్యవేక్షకులు వీరందరూ ముందు బయలుదేరిరి.(1-3)

సంతోషముతో ఆ ప్రదేశమునందు నడుచుచున్న ఆ జనసమూహము

పర్వదివసమునందు గొప్ప వేగముతో పొంగిన సముద్రము వలె ఉండెను. బాటలు వేయుటలో నేర్పు కల వారందరు అనేకవిధములైన సాధనములు ధరించి, ఒక గుంపుగా ముందు బయలుదేరిరి. తీగలు, పొదలు, పెద్ద శిలలు, చిన్న రాళ్లు, అనేకవిధములైన చెట్లు ఛేదించి, వారు మార్గము ఏర్పరచిరి. కొందరు చెట్లు లేని ప్రదేశములందు చెట్లు నాటిరి. కొందరు ఆ యా ప్రదేశములందు (మార్గమునకు అడ్డుగా ఉన్న చెట్లను) గొడ్డళ్ళతోను, ఉలులలోను, రంపములతోను ఛేదించిరి. (4-7)

అధికబలవంతులైన కొందరు దృఢముగా ఉన్న వీరణములు, స్తంబములు అను తృణములను పెరికివేసిరి. అక్కడక్కడ ఉన్న నడచుటకు శక్యము కాని ప్రదేశములను చదును చేసిరి. కొందరు నూతులను, పొడవైన గోతులను బూడిదతో కప్పివేసిరి. మరి కొందరు పల్లములను సమము చేసిరి. (8, 9)

అప్పుడు కొందరు మనుష్యులు కట్టదగిన ప్రదేశములను కట్టిరి. చూర్ణము చేయదగిన వాటిని చూర్ణముచేసిరి. బ్రద్దలు కొట్టదగిన వాటిని బ్రద్దలు కొట్టిరి. (10)

కొద్ది సమయములోనే, అధికమైన ఉదకము కలవీ, అనేకవిధములైన ఆకారములు కలవీ, సముద్రమువంటి ఆకారము కలవీ అయిన, అనేకమైన కాలువలను నిర్మించిరి. నీరు లభించని ప్రదేశములలో, చుట్టును వేదికలు (పళ్ళెములు) కట్టిన, అనేకవిధములైన, శ్రేష్ఠమైన నూతులు త్రవ్వించిరి. (11, 12)

సేన నడుచు ఆ మార్గమునందు సున్నము(ఒక విధమైన సిమెంటు) వేసి చదునుచేసిరి. ప్రక్కల నున్న వృక్షము లన్నీ పుష్పించినవి. పక్షులు మదించి కూయుచుండెను. మార్గమునం దంతటను పతాకలు కట్టి అలంకరించిరి. చందనోదకముతో తడిపిరి. అనేకపుష్పములు రాలి ఉన్నవి. ఈ విధముగా దేవతలు నడుచు మార్గము వలె ఉన్న ఆ సేనామార్గము చాలా ప్రకాశించెను. (13, 14)

భరతుని ఆజ్ఞ పాటించి అధికారులు తమక్రింద పనిచేయువారికి ఆదేశములిచ్చిరి. మార్గములో (సేన విడిది చేయుటకు) భరతుడు నివసించు గృహము మిగిలిన గృహములకు అలంకారముగ ఉండునట్లు నిర్మింపచేసిరి. మధురమైన ఫలములనిచ్చు వృక్షములున్న చోట భరతుడు నివసించుటకు ఏర్పాటు చేసిరి. (15, 16)

జ్యోతిశ్శాస్త్రవేత్తలు, ప్రశస్తములైన నక్షత్రములయందు, ముహూర్తములందు

మహాత్ముడైన భరతుని సైన్యముకొరకు శిబిరములు స్థాపించిరి. ఆ శిబిరములదగ్గర ఇసుకకుప్పలు, చుట్టును పరిఖలు ఉండెను. ఇంద్రకీలపర్వతము వలె ఎత్తుగా ఉన్న వాటి దగ్గర ప్రాసాదములు(దేవతాగృహములు) చుట్టూ ప్రాకారములు, అందమైన చిన్న మార్గములు, విశాలములైన మార్గములు నిర్మితములై ఉండెను. అక్కడ నిర్మించిన ఉత్తమగృహములు ఎత్తుగా ఉన్న తమ శిఖరములతో ఆకాశములోనికి ఎగిరిపోవుచున్నట్లుండెను. అంతటను అలంకారార్థమై కట్టిన పతాకలు ఎగురుచుండెను. ఈ విధముగా ఆ శిబిరము లేర్పరచిన ప్రాంతములు దేవేంద్రనగరము వలె ఉండెను.(17-20)

గంగానదివరకును ఆ శిబిరములు వ్యాపించి ఉండెను. ఉత్తమములైన శిల్పులు క్రమముగా నిర్మించిన ఆ రమ్యమైన రాజమార్గము చంద్రనక్షత్రగణములతో నిర్మితమైన ఆకాశము రాత్రియందు ప్రకాశించినట్లు ప్రకాశించెను.(21, 22)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనుబదవ సర్గము సమాప్తము.

ఎనుబది యొకటవ సర్గము

వసిష్ఠుడు సభకు వచ్చి మంత్రులు మున్నగువారిని పిలువ దూత నంపుట.

పిమ్మట మాటలలో నేర్పరులైన సూతమాగధులు, రాత్రియందు రాత్రి చివరి భాగమున మంగళవాద్యాదులతో కూడిన స్తోత్రములతో భరతుని స్తుతించిరి. బంగారు దండముతో కొట్టి యామదుందుభి మ్రోగించిరి. వందలకొలది శంఖములను పూరించిరి. వివిధస్వరములు గల వాద్యములు వాయించిరి.(1, 2)

ఆకాశము నంతను నింపుచున్నట్లున్న ఆ గొప్ప తూర్యధ్వని శోకముతో బాధపడుచున్న భరతుని, ఇంకను అధికమైన శోకముచే పీడించెను. భరతుడు మేల్కొని, "నేను రాజును కాను." అని చెప్పుచు ఆ తూర్యధ్వనిని నిలిపివేసి, శత్రుఘ్నునితో ఇట్లు పలికెను.(3, 4)

"శత్రుఘ్నా! చూడు. కైకేయివలన లోకమునకు ఎంత గొప్ప అపకారము జరిగినదో! దశరథమహారాజు దుఃఖము లన్నీ నాకు విడిచిపెట్టి వెళ్ళిపోయినాడు. ధర్మరక్షకుడు, మహాత్ముడు అయిన ఆ దశరథమహారాజునకు ధర్మానుసారముగా సంక్రమించిన ఈ రాజ్యలక్ష్మి, ఇపుడు చుక్కాని లేని పడవ నీటిలో తిరిగినట్లు

తిరుగుచున్నది. మన కందరికిని గొప్ప రక్షకుడైన రాముని కూడ, ధర్మహీనురాలైన తల్లి, స్వయముగా అడవికి పంపివేసినది."(5-7)



ఈ విధముగా విలపించుచు స్పృహ తప్పి ఉన్న భరతుని చూచి, స్త్రీ లందరు దీనముగా, ఎలుగెత్తి ఏడ్చిరి.(8)

భరతు డీ విధముగా విలపించుచుండగా, రాజధర్మము లెరిగినవాడూ, గొప్ప కీర్తి కలవాడూ అయిన వసిష్ఠుడు, దశరథుని సభాభవనమునకు వచ్చెను. ధర్మాత్ముడైన వసిష్ఠుడు, జనసమూహముతో కూడి, బంగారము పూసి, రమ్యమై, వివిధరత్నసమలంకృతమై, దేవసభ యైన సుధర్మవలె ఉన్న ఆ సభను ప్రవేశించెను. వసిష్ఠుడు, సుఖకర మైన ఆస్తరణము కప్పిన బంగారు పీఠముపై కూర్చుండి, దూతలను ఈ విధముగ ఆజ్ఞాపించెను.(9-11)

మీరు ఏ మాత్రము కంగారు పడక, బ్రాహ్మణులను, క్షత్రియులను, వైశ్యులను, అమాత్యులను,(శిల్పకారాది) గణాధ్యక్షులను శీఘ్రముగా తీసికొని రండి. మాకు వారితో చాల తొందరపని ఉన్నది. రాజభృత్యులను, శత్రుఘ్నుని, కీర్తిమంతు డైన భరతుని, యుధాజిత్తును, సుమంత్రుని, రాజహితుల నందరిని తీసికొనిరండి." (12,13)

పిమ్మట వసిష్ఠుని ఆజ్ఞప్రకారము ఆహూతులందరూ రథములు, అశ్వములు, గజములు ఎక్కి వచ్చుచుండగా గొప్ప కలకలధ్వని కలిగెను.(14)

వచ్చుచున్న భరతుని చూచి అమాత్యాదిప్రకృతులు తాము దశరథుని అభినందించినట్లును, దేవతలు దేవేంద్రుని అభినందించినట్లును అభినందించిరి. దశరథకుమారునిచేత శోభిత మైన ఆ సభ, పూర్వము దశరథుడు ఉండగా ఎట్లు ప్రకాశించెనో అట్లే ప్రకాశించెను.(15, 16)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనుబది ఒకటవ సర్గము సమాప్తము.

ఎనుబది రెండవ సర్గము

వసిష్ఠుడు భరతుని రాజ్యాభిషిక్తుడవు కమ్మని ఆదేశించుట. భరతు డది యనుచితమని పలికి రాముని కొనితెచ్చుటకై వనమునకు బయలుదేరుదని అందరిని ఆజ్ఞాపించుట.

బుద్ధిశాలి యైన భరతుడు మాన్యులైన జనుల గణములతో నిండిన ఆ సభను, పూర్ణచంద్రుడు ఉత్తమ మైన గ్రహములతో కూడిన రాత్రిని వలె చూచెను. సభ్యు లందరు ఎవరికి తగిన ఆసనములు వారు అధిష్ఠించుచుండగా వారి వస్త్రముల కాంతిచేతను, అంగరాగముల కాంతిచేతను, ఉత్తమ మైన ఆ సభ ప్రకాశింపచేయబడెను. విద్వాంసులతో నిండిన అంద మైన ఆ సభ శరదృతువునందు పూర్ణచంద్రునితో కూడిన రాత్రి వలె ప్రకాశించెను.(1-3)

దశరథుని అమాత్యాదిప్రకృతులు, ఒక్కరును మానకుండ అందరును అచటికి వచ్చి యుండిరి. వారిని చూచి, ధర్మవేత్త యైన వసిష్ఠుడు భరతునితో మృదువుగా ఇట్లు పలికెను.(4)

"నాయనా! భరతా! దశరథమహారాజు ధర్మాచరణము చేయుచు రాజ్యము పాలించి, ధనధాన్యసమృద్ధమైన విశాల మైన ఈ పృథివిని నీకు ఇచ్చి, స్వర్గస్థుడైనాడు. సత్యమునందు స్థిర మైన చిత్తము గల రాముడు కూడ, సత్పురుషులు అనుసరించిన ధర్మమును స్మరించుచు, ఉదయించిన చంద్రుడు వెన్నెలను విడువకుండునట్లు, తండ్రి ఆజ్ఞను విడువలేదు. ఈ విధముగ నీ తండ్రీ, సోదరుడూ నీ కిచ్చిన, ఏ బాధలూ లేని రాజ్యమును సంతోషించిన మంత్రులతో అనుభవింపుము. శీఘ్రముగా రాజ్యాభిషిక్తుడవు అగుము. ఉత్తరదేశపురాజులు, పశ్చిమదేశరాజులు, దాక్షిణాత్యరాజులు, సింహాసనము లేని రాజులు, సరిహద్దులోని రాజులూ, సముద్రమధ్యద్వీపములోని రాజులూ నీకు కోట్లకొలది ఉత్తమవస్తువులను పారితోషికముగ తీసికొనివచ్చి సమర్పించెదరుగాక.(5-8)

ధర్మజ్ఞు డైన భరతుడు ఆ మాటలు విని, శోకాక్రాంతుడై, ధర్మమార్గము నవలంబింపవలె నని కోరుచు, రాముని మనసా స్మరించెను. కలహంసస్వరము వంటి స్వరము గల యువకు డైన ఆ భరతుడు, సభామధ్యమునందు, బాష్పముతో కూడిన మధుర మైన స్వరముతో విలపించుచు, పురోహితుని సూచనను తిరస్కరించెను.(9, 10)

బ్రహ్మచర్యవ్రతమును ఆచరించి, సకలవిద్యాపారంగతు డై, ధర్మమును రక్షించుటకు ప్రయత్నించుచున్న రామునివంటి ధీశాలికి చెందవలసిన రాజ్యమును అపహరించవలె నని నా వంటివాడు ఎవ్వడైన యత్నించునా? దశరథునికి పుట్టినవా డెన్నడైన రాజ్యాపహారము చేయునా! ఈ రాజ్యము, నేనూ కూడ రామునకు చెందినవారము. ఈ విషయములో ధర్మమేదో నీవే చెప్పుము. పెద్దవాడూ, శ్రేష్ఠుడూ, ధర్మాత్ముడూ, దిలీపనహుషులతో సమానుడూ అయిన రామునకే ఈ రాజ్యముపై దశరథునకు వలె అధికార మున్నది. వే రెవ్వరికీ లేదు. పెద్దవారు చేసే ఈ నరకహేతువైన పాపమును చేసినచో నే నీ లోకమునందు ఇక్ష్వాకువంశమునకు కళంకము తెచ్చినవాడను అగుదును.(11-14)

నా తల్లి చేసిన పాపకార్యమును నే నేమాత్రము అంగీకరించను. దుర్గమమైన వనములో ఉన్న అన్నగారికి దోసిలి కట్టి ఇక్కడినుండియే నమస్కరించు చున్నాను. నేను రామునే అనుసరించి వెళ్ళెదను. మనుష్యశ్రేష్ఠుడైన ఆ రాముడే రాజు. వేరెవ్వరును కాజాలరు. రాముడు మూడు లోకముల రాజ్యమేలుటకు కూడ తగినవాడు.(15, 16)

ఆ సభాసదులందరు ధర్మబద్ధమైన ఆ భరతుని మాటలు విని, రామునే స్మరించుచు, ఆనందబాష్పమును విడచిరి. "అన్నగారిని వనమునుండి వెనుకకు తీసికొనిరాజాలని యెడల, ఆర్యుడైన లక్ష్మణుడున్నట్లే నేను కూడా ఆ వనములోనే ఉండిపోయెదను. గుణవంతులూ, సత్పురుషులూ, పూజ్యులూ అయిన మీ అందరి సమక్షమున, రాముని ఎట్టైన వెనుకకు తీసికొని వచ్చుటకు అన్ని ఉపాయములు ప్రయోగించెదను. మార్గమును శోధించేవారూ, రక్షించేవారూ అయిన వెట్టివాళ్ళనూ కూలివాళ్ళనూ నేను ముందుగనే పంపి ఉన్నాను. ఇపుడు నేను కూడ బయలుదేరవలె నని అనుకొనుచున్నాను.(17-20)

ధర్మాత్ముడు, సోదరునియందు ప్రేమ కలవాడు అయిన భరతుడు ఇట్లు పలికి, ప్రక్కనే ఉన్న, మంత్రనిపుణుడైన సుమంత్రునితో ఇట్లు పలికెను.(21)

సుమంత్రా! శీఘ్రముగా లేచి వెళ్ళి నా ఆజ్ఞగా చెప్పి, యాత్రను ఏర్పరుపుము. వెంటనే సైన్యమును కూడ తీసికొనిరమ్ము.(22)

మహాత్ముడైన భరతుని మాటలు విని సుమంత్రుడు సంతోషించి, భరతుని ఆజ్ఞ ప్రకారము ఆ కార్యము నంతను, తన కిష్టమైన కార్యము చేయునంతటి శ్రద్ధతో చేసెను. రాముని వెనుకకు తీసికొనివచ్చుటకై సైన్యమును కూడ తీసికొని వెళ్ళవలె

నని ఆజ్ఞ ఇచ్చినట్లు విని, ఆ ప్రకృతులూ, సైన్యాధ్యక్షులూ సంతోషించిరి.(23, 24)

పిమ్మట, యోధుల భార్య లందరును భరతుడు సంకల్పించిన యాత్రను గూర్చి విని, సంతోషించుచు, ప్రతి ఇంటియందును, తమ తమ భర్తలను తొందరపెట్టిరి. ఆ సేనాధ్యక్షులు గుఱ్ఱములు, శీఘ్రముగా పోవు ఎడ్లబండ్లు, గొప్పవేగము గల రథములు, యుద్ధభటులు ఉన్న సైన్యము నంతను ప్రేరేపించిరి(నడిపించిరి). భరతుడు సన్నద్ధమైన ఆ సైన్యమును చూచి, గురువైన వసిష్ఠుని సమక్షమునందు, తన ప్రక్కన ఉన్న సుమంత్రునితో – "నా రథమును తొందరగా సిద్ధము చేయుము." అని ఆజ్ఞాపించెను.(25-27)

భరతుని ఆజ్ఞ విని సుమంత్రుడు సంతోషముతో ఉత్తమమైన గుఱ్ఱములు కట్టిన రథమును తీసికొనివచ్చెను. భరతుడు, మహారణ్యములో ఉన్న యశఃశాలియైన అన్నగారిని అనుగ్రహింపచేసికొననున్నవాడై, అపుడు ఇట్లు పలికెను.(28, 29)

సుమంత్రా! శీఘ్రముగా లేచి వెళ్ళి సైన్యమును సమకూర్చుడని సైన్యాధిపతులకు చెప్పుము. వనములో ఉన్న రాముని అనుగ్రహింపచేసుకొని, జగత్తుకు హితము చేకూర్చుటకై తీసికొనిరావలె నని కోరుచున్నాను.(30)

భరతుడీ విధముగా చక్కగ ఆజ్ఞాపించగా, సుమంత్రుడు తన కోరిక తీరుటచే సంతోషించుచు ప్రకృతులలో ప్రధాను లైనవారినీ, సేనాధిపతులనూ, మిత్రులను ఆజ్ఞాపించెను. ప్రతిగృహమునందును, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులూ, బ్రాహ్మణులూ లేచి, ఒంటెలనూ, గాడిదలనూ, రథములనూ, ఉత్తమజాతులకు చెందిన గజములను, అశ్వములను సిద్ధము చేసిరి.(31, 32)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనుబది రెండవ సర్గము సమాప్తము.

ఎనుబది మూడవ సర్గము

భరతుని వనగమనము, శృంగిబేరపురమున ఆ రాత్రి నివసించుట.

పిమ్మట భరతుడు ప్రాతఃకాలముననందే లేచి, శ్రేష్ఠమైన రథము నధిష్ఠించి, రాముని చూడవలె నను కోరికతో శీఘ్రముగా వెళ్లెను. మంత్రులు, పురోహితులూ అందరూ, గుఱ్ఱములు కట్టిన, సూర్యరథసదృశములైన రథము లెక్కి భరతుని ముందు వెళ్ళిరి.(1, 2)

ఇక్ష్వాకువంశమునకు ఆనందకరుడైన భరతుడు ముందు వెళ్లు చుండగా అతని వెనుక నియమానుసారముగా కూర్చిన తొమ్మిదివేల ఏనుగులు ప్రయాణము చేసినవి. ఆరువదివేల రథములు, అనేకవిధములైన ఆయుధములు ధరించిన ధనుర్ధరులూ, అతని వెనుక వెళ్ళిరి. లక్షమంది అశ్వారూఢులు అతడిని అనుసరించి వెళ్ళిరి.(3-5)

కైకేయి, సుమిత్ర, యశఃశాలిని యైన కౌసల్యా కూడ రాముడు తిరిగి వచ్చును కదా అని ఆనందించుచు, ప్రకాశించుచున్న వాహనము నెక్కి వెళ్ళిరి. పూజ్యులైన జనులు, గుంపులు గుంపులుగా కలిసి, రామునికి సంబంధించిన విచిత్రమైన కథలు చెప్పుకొనుచు, రామలక్ష్మణులను చూచుటకై, సంతోషముతో వెళ్ళిరి.(6, 7)

"మేఘశ్యాముడూ, మహాబాహువు, స్థిరమైన బలము, దృఢమైన నియమము కలవాడూ అయిన, జగత్తు శోకము నంతను నశింపచేయు రాముని ఎప్పుడు చూచెదమో కదా! ఉదయించిన సూర్యుడు సకలలోకము నందలి అంధకారమును తొలగించి నట్లు రాముడు మన కంటబడగానే మన శోకములన్నియు తొలగించును.(8, 9)

పట్టణములోని జనులందరూ ఈ విధముగా మంచి మాటలు చెప్పుకొనుచు సంతోషముతో ఒండొరులను కౌగిలించుకొనుచు వెళ్ళిరి. ఆ పట్టణములోని రాజకుటుంబమునకు దగ్గరగా ఉండేవారూ, వర్తకుల సంఘములకు చెందినవారూ, సమస్తమైన ప్రకృతులూ సంతోషించుచు రాముని చూచుటకై వెళ్ళిరి.(10, 11)

భరతుని వెంట, రత్నములు సానపట్టువారు, అందమైన కుండలు తయారు చేయువారు, సాలెవారు, ఆయుధములతో జీవించువారు, నెమళ్ళ వాళ్ళూ, రంపపు పని చేయువారూ, అలంకరణము చేయువారూ, రంధ్రములు చేయువారూ, దంతపుపని చేయువారు, వెల్ల వేయువారు లేదా సున్నము పనిచేయువారూ, సుగంధద్రవ్యములు చేసి జీవించేవారు, ప్రసిద్ధులైన కంసాలులూ, కంబళ్ళు

ఉతికేవారూ, స్నానాలు చేయించేవారూ, వేన్నీళ్ళు అందించేవారూ, వైద్యులూ, సుగంధధూపములు వేయువారూ, మద్యము తయారుచేయువారూ, చాకళ్లూ, కుట్టుపనివారూ, గ్రామాలకు గొల్లపల్లెలకు చెందిన పెద్దలూ, స్త్రీ సహితులైన నటులు, చేపలు పట్టేవాళ్లూ వెళ్ళిరి.(12-15)

నిశ్చలమైన మనస్సు కలవారూ, మంచి నడవడికచేత పూజ్యులూ, వేదవేత్తలూ అయిన వేలకొలది బ్రాహ్మణులు భరతుని వెనుక మెల్లగా ఎడ్లబండ్లెక్కి వెళ్ళిరి. వారందరు మంచి వేషములు పరిశుద్ధమైన వస్త్రములు ధరించి ఎఱ్ఱగా ఉన్న మంచి సుగంధద్రవ్యముల అనులేపములను శరీరములకు పూసికొని, అనేకవిధములైన వాహనము లెక్కి ఆ భరతుని మెల్లగా అనుసరించి వెళ్ళిరి. మిక్కిలి సంతోషించుచు ఆనందించుచున్న ఆ సేన సోదరునిపై ప్రేమతో అతనిని తిరిగి తీసికొనివచ్చుటకై వెళ్ళుచున్న, కైకేయీపుత్రుడైన భరతుని వెంట వెళ్ళెను.(16-18)

వారందరూ రథముల పైన, బండ్లపైన, గుఱ్ఱముల పైన, గజముల పైన చాల దూరము ప్రయాణము చేసి వెళ్ళి, రాముని మిత్రుడూ, వీరుడూ అయిన గుహుడు తన బంధువులతో కలిసి నివసించుచున్న శృంగబేరిపురము దగ్గర గంగానదిని సమీపించిరి. భరతుని వెనుకనే ప్రయాణము చేయుచున్న ఆ సేన, చక్రవాకపక్షులతో అందముగా ఉన్న గంగాతీరమును చేరి అక్కడ నిలచెను.(19-21)

తన వెనుక వచ్చిన సేనను, ముందున్న ఆ పవిత్రోదకము కల గంగను చూచి, మాటలలో నేర్పరియైన భరతుడు అమాత్యులందరితో ఇట్లు పలికెను.(22)

మీ సౌకర్యమును అనుసరించి సైన్యమును ఆయా స్థానములందు విడిదిచేయించండి. ఈనాడు విశ్రాంతి తీసికొని రేపు ఈ గంగానదిని దాటెదము. నేను ఈ గంగానదిలో దిగి, స్వర్గస్థుడైన నా తండ్రిగారికి పారలౌకిక శరీరమునందు సుఖము కలుగుటకై, జలతర్పణములు చేయవలె నని కూడ కోరుచున్నాను.(23,24)

భరతుని మాటలు విన్న ఆ అమాత్యులు "అట్లే చేసెదము" అని పలికి తమ తమ ఇష్టము ప్రకారము ఆ సేనను వేరు వేరుగా అచ్చటచ్చట నిలిపిరి.(25)

భరతుడు అనేకవిధములైన ఉపకరణములతో శోభించుచున్న ఆ సేనను ఆ గంగామహానది వెంబడి విడిది చేయించి, మహాత్ముడైన రాముని ఎట్లు వెనుకకు తీసుకొని రావలెనా అని ఆలోచించుచుండెను.(26)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనుబది మూడవ సర్గము సమాప్తము.

ఎనుబది నాల్గవ సర్గము

గుహుడు తన బంధువులను నది వద్ద కావలి యుండి యుద్ధసన్నద్ధులు కండని ఆజ్ఞాపించుట. స్వాగతసత్కార సామాగ్రితో భరతుని కడకేగుట. ఆతిథ్యము స్వీకరింపుమని భరతుని కోరుట.

గంగానది పొడవున విడిసి యున్న ఆ సైన్యమును చూడగానే గుహుడు తొందరపడుచు తన బంధువులతో ఇట్లనెను.(1)

"ఇటు వైపు సముద్రము వలె విశాలమైన గొప్ప సేన ఇదిగో, కనబడుచున్నది. ఇది ఎంత ఉన్నదో నా ఊహకు కూడా అందుటలేదు. పెద్ద ఆకారము గల కోవిదారవృక్షము ఉన్న ధ్వజము రథముపై కనబడుచున్నది. దుర్బుద్ధియైన భరతుడే స్వయముగా వచ్చినట్లు కనబడుచున్నది. కైకేయీకుమారుడైన ఈ భరతుడు ఇక్కడ ఉన్న పల్లె వారి నందరిని బంధించుటకై వచ్చినాడా! లేదా మనలను చంపుటకై వచ్చినాడా! లేదా చాల దుర్లభమైన దశరథుని సుసమృద్ధమైన రాజ్యలక్ష్మిని వశము చేసుకొనవలెనను ఉద్దేశ్యముతో తండ్రిచే అరణ్యవాసమునకు పంపబడిన రాముని చంపుటకై వచ్చుచున్నాడా!(2-5)

దశరథకుమారుడైన రాముడు నాకు ప్రభువు మాత్రమే కాదు, నా మిత్రుడు కూడ. అందుచేత అతని ప్రయోజనమును కాపాడుటకై సన్నద్ధులై గంగాతీరప్రాంతమునందు నిలచి ఉండుడు. మాంసమును, దుంపలను, ఫలములను తినుచు నదిని రక్షించుచుండు పల్లె వారందరు తమ సైన్యముతో, గంగానది వెంబడినే నిలచి ఉండవలెను. ఐదువందల నావలలో ఒక్కొక్కదానిపై నూరుగురు చొప్పున యువకులైన కైవర్తులు కవచాదులు ధరించి సిద్ధముగా ఉండవలెను. భరతునకు రాముని విషయమున దుష్టబుద్ధి లేదని తెలిసిన పిమ్మటనే ఈ సేన సుఖముగా గంగానదిని దాటగలదు. అని ప్రేరేపించెను."(6-9)

గుహుడు ఈ విధముగా పలికి, మత్స్యములను, మాంసమును, తేనెను భరతునకు ఉపాయనముగా తీసికొని వెళ్ళెను.(10)

సుమంత్రుడు వచ్చుచున్న గుహుని చూచి వినయపూర్వకముగా భరతునకు ఇట్లు చెప్పెను.(11)

"వేయిమంది బంధువులతో కలిసి వచ్చిన ఈ గుహుడు దండకారణ్యముతో చాల పరిచయము కలవాడు. వయస్సు కలవాడు. నీ సోదరుడైన రామునకు

మిత్రుడు కూడ. ఈ గుహునకు దర్శన మిమ్ము. రామలక్ష్మణు లెక్కడ ఉన్నారో ఇతనికి తప్పక తెలిసి ఉండును."(12, 13)

భరతుడు శుభకరములైన సుమంత్రుని మాటలు విని "వెంటనే గుహుని నా వద్దకు తీసికొని రండి" అని పలికెను.(14)

గుహుడు భరతుని అనుజ్ఞ లభించుటచే సంతోషించుచు, తన జ్ఞాతివర్గముతో భరతుని సమీపించి సవినయముగా ఇట్లు పలికెను.(15)

"ఈ ప్రదేశము నీ గృహోద్యానము వంటిది. మేము నీకు లొంగి యుండే మనుష్యులము. ఇది నీ దాసుని గృహము. దీనిలో ఇచ్ఛానుసారము నివసింపుమని మే మందరము కోరుచున్నాము. ఇక్కడ దుంపలు, ఫలములు, బోయవారు తీసికొనివచ్చిన అనేకవిధములైన చాల అధికమైన పచ్చిమాంసము, ఎండు మాంసము ఉన్నవి. నీ సైన్యము సుఖముగా భుజించి ఈ రాత్రి ఇక్కడనే నివసించునని అనుకొనుచున్నాను. వివిధపదార్థములను సమర్పించి మేము చేయు సపర్యలను అందుకొని నీవు సేనాసమేతుడవై రేపు వెళ్ళవచ్చును." (16-18)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనుబది నాలుగవ సర్గము సమాప్తము.

ఎనుబది యైదవ సర్గము

గుహభరత సంవాదము, భరతుని శోకము

భరతుడు ఆ మాటలు విని గుహునితో ఇట్లు పలికెను.(1)

"ఓ గుహుడా! నీవు మా అన్నగారికి మిత్రుడవు. ఇంత సేనకు నీవొక్కడవే ఆతిథ్యమీయవలెనని కోరుచున్నావు; నీ అభిలాష ఎంత గొప్పది!"(2)

భరతుడు గుహునితో మరల ఇట్లనెను.(3)

"ఓ గుహుడా! జలముతో నిండిన ఈ గంగాతీరప్రాంతము ప్రవేశింప శక్యము కానిది; దాటుటకు కష్టమైనది. నేను ఏ మార్గమున భరద్వాజాశ్రమమునకు వెళ్ళవలెనో చెప్పుము."(4)

ధీమంతుడైన ఆ భరతుని మాటలు విని, గుహుడు, చేతులు జోడించి ఇట్లు పలికెను.(5)

"రాజకుమారా! ఈ దాశులు, ధనుర్ధారులై, జాగరూకులై నీ వెనుక వచ్చెదరు. నేను కూడ వచ్చెదను. నీవు, రామునికి కీడు తలపెట్టి అచటికి వెళ్లుటలేదు కదా! నీ విశాలసైన్యమును చూడగా నాకు శంక కలుగుచున్నది.(6, 7)

ఆకాశము వలె నిర్మలుడైన భరతుడు ఈ విధముగా మాటలాడుచున్న గుహునితో మృదువుగా ఇట్లనెను.(8)

"రాముని విషయమున అపచారము తలపెట్టు దుష్కాలము ఎన్నడును రాకుండుగాక. నా జ్యేష్ఠసోదరుడైన ఆ రాముడు నాకు తండ్రి వంటివాడుకదా! వనములో నివసించుచున్న ఆ రాముని వెనుకకు తీసికొనివచ్చుటకై, వెళ్లుచున్నాను. నీవు మరొకవిధముగా తలపకుము. సత్యము చెప్పుచున్నాను.(9, 10)

ఆ గుహుడు భరతుని మాటలు విని, సంతోషించి, వికసించిన ముఖముతో మరల అతనితో ఇట్లు పలికెను.(11)

"అప్రయత్నముగా లభించిన రాజ్యమును కూడ విడచివేయ వలె నని కోరుచున్నావు; నా కీ లోకములో నీవంటివాడు ఎవ్వడును కనబడుటలేదు. కష్టాలలో ఉన్న రాముని తిరిగి వెనుకకు తీసికొని రావలెనని కోరుచున్న నీ కీర్తి శాశ్వతముగా లోకములలో వ్యాపించగలదు." (12, 13)

గుహుడు ఈ విధముగ భరతునితో మాటలాడుచుండగా, సూర్యుని కాంతి తగ్గెను. ఇంతలో రాత్రి కూడ వచ్చెను.(14)

శ్రీమంతుడైన ఆ భరతుడు సేనను తగు విధముగా విడియచేసి, గుహుని సేవలకు సంతోషించుచు, శయనించెను. శత్రుఘ్నుడు కూడ శయనించెను.(15)

మహాత్ముడు, ధర్మదృష్టి కలవాడు, అట్టి శోకమునకు తగనివాడు అయిన ఆ భరతునకు రాముని గూర్చిన విచారము అను శోకము కలిగెను. అడవి కాలిపోయినపుడు శుష్కించిన వృక్షమును లోపల దాగి యున్న అగ్ని కాల్చివేసి నట్లు భరతుని దుఃఖాగ్ని లోలోన తపింపచేయుచు బాధ పెట్టెను. సూర్యుని కిరణములచే వేడెక్కిన హిమవత్పర్వతమునుండి మంచు కారునట్లు అతని అన్ని అవయవములనుండి శోకాగ్నివలన పుట్టిన చెమట కారుచుండెను.(16-18)

దుఃఖ మనెడు మహాశైలము ఆ భరతుని ఆక్రమించెను. ఏదియో ఆలోచించుటయే ఆ పర్వతమునందలి భేదింపరాని శిలలు. నిట్టూర్పులే ధాతువులు.

దైన్యమే వృక్షసముదాయము. శోకము, ఆయాసము, మనస్తాపము అనునవే దాని శిఖరములు. మోహామే అనంతమైన జంతుసముదాయము. సంతాపమే దానిపై నున్న ఓషధులు, వేణువులు(వెదురుకర్రలు).(19, 20)

అపుడు నరులలో శ్రేష్ఠుడైన ఆ భరతుడు, దుఃఖపీడితమైన మనస్సుతో నిట్టూర్చుచు, ఏమి చేయవలెనో తోచక గొప్ప ఆపదలో చిక్కుకొని హృదయజ్వరముచే పీడితుడై తన గుంపులోని వృషభములచే పీడింపబడిన వృషభమువలె, మనశ్శాంతిని పొందలేక పోయెను.(21)

మహానుభావుడైన ఆ భరతుడు ఏకాగ్రచిత్తుడై(రాముని తలచుచు) పరివారసహితుడై గుహుని చేరియుండెను. అపుడు దుఃఖార్తుడైన ఆ గుహుడు భరతుని, అన్నగారి విషయమున మరల ఓదార్చెను.(22)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనుబది ఐదవ సర్గము సమాప్తము.

ఎనుబది ఆరవ సర్గము

నిషాదరాజు గుహుడు లక్ష్మణుని ఉత్తమస్వభావమును, విలాపమును వర్ణించుట.

అప్పుడు గుహుడు భరతునకు మహాత్ముడైన లక్ష్మణుని భ్రాతృభక్తి మొదలగు సద్గుణములను గూర్చి చెప్పెను.(1)

"సద్గుణవంతుడైన లక్ష్మణుడు శరచాపఖడ్గములను ధరించి సోదరుని రక్షణకై పూర్తిగా మేల్కొని యుండెను. అట్టి లక్ష్మణునితో నేను యిట్లంటిని.(2)

'తండ్రీ లక్ష్మణా! సుఖకరమైన ఈ శయ్యను నీకోసమే ఏర్పరచితిమి. ఎట్టి భయము లేక దీనిపై సుఖముగా శయనించుము. మే మందరము కష్టపడుటకు అలవాటుపడినవారము. నీవు సుఖమునకు అలవాటుపడినవాడవు. రాముని రక్షించుటకై మేము మేల్కొని ఉండెదము.(3, 4)

ఈ భూలోకములో నాకు రాముని కంటె ప్రియమైనవాడు ఎవ్వడును లేడు. అందుచే నీ వేమియు భయపడకుము. నీ యెదుట సత్యమే చెప్పుచున్నాను. రాముని అనుగ్రహామువలన ఈ లోకములో గొప్ప కీర్తిని, అధికమైన ధర్మమును, పరిశుద్ధమైన

అర్థకామములను పొందవలె నని కోరుకొనుచున్నాను. అట్టి నేను నా బంధువులతో కలసి ధనుస్సు చేత ధరించి నిద్రించు చున్న సీతారాములను రక్షించెదను. ఎల్లపుడు ఈ వనములో సంచరించుచున్న నాకు తెలియని దేదీ ఇక్కడ లేదు. చతురంగసైన్యమును కూడా మేము యుద్ధములో ఎదిరించగలము.'(5-8)

మా మాటలు విని మహాత్ముడైన లక్ష్మణుడు ధర్మైకదృష్టితో ఇట్లనెను. 'రాముడు సీతాసహితుడై నేలపై శయనించి ఉండగా నాకు నిద్ర ఎట్లు వచ్చును? జీవితము కాని సుఖములు కాని ఎట్లు నిలుచును? దేవాసురులందరును కలిసి గూడ ఏ రాముని యుద్ధమునందు ఎదుర్కొనజాలరో అట్టి రాముడు సీతాసమేతుడై తృణములపై శయనించినాడు. చూడుము.(9-11)

ఈ రాముడు దశరథునితో సమానములైన లక్షణములు గల ముఖ్యుడైన కుమారుడు. గొప్ప తపస్సుచేసి, అనేకవిధములైన కష్టములు సహించి దశరథుడు ఇతనిని పొందగలిగినాడు. ఇతడు ప్రవాసమునకు వెళ్ళిన పిమ్మట, దశరథమహారాజు చిరకాలము జీవింపడు. ఈ భూమి అచిరకాలములో తప్పక వైధవ్యము పొందగలదు. (12, 13)

అంతఃపురస్త్రీలు బిగ్గరగా అరచి అరచి అలసట చెంది ఏడ్పును మానివేసియుందురు. ఇపుడు ఆ రాజగృహములో ఆర్తధ్వని నిలిచిపోయి ఉండును. కౌసల్యాదేవి, దశరథమహారాజు, నా తల్లియైన సుమిత్రాదేవి, వీరందరు ఈ రాత్రి జీవించి గడపగల రను విశ్వాసము నాకు లేదు. శత్రుఘ్నుని చూచుకొనుచు నా తల్లి జీవించి యుండవచ్చునేమో! కాని వీరమాతయైన కౌసల్యాదేవి మాత్రము దుఃఖితురాలై మరణించును. నా తండ్రియైన దశరథమహారాజు, ఒకదాని వెనుక ఒకటిగా ఏ మనోరథమును సఫలము చేసుకొనలేక రాముని రాజ్యాభిషిక్తుని చేయజాలక పోవుటచే మరణించును. ఆ సమయము వచ్చినపుడు మరణించిన తండ్రియైన దశరథమహారాజునకు ప్రేతకార్యము లన్నియు చేసి సంస్కరింపగలిగిన భరతశత్రుఘ్నాదులు కృతార్థులు.(14-18)

వారందరు మా తండ్రిగారి రాజధానిలో, సుఖముగా సంచరించగలరు. ఆ రాజధానిలోని ముంగిళ్ళు చక్కగా ఏర్పరపబడి యుండును. విశాలమైన రాజమార్గములు ధనికుల గృహములు, ప్రాసాదములు, ఆ నగరమునం దంతటను ఉన్నవి. అన్ని విధములైన రత్నములచే, ఆ నగరము అలంకృతమై ఉండును. ఏనుగులతోను, అశ్వములతోను, రథములతోను కిక్కిరిసియుండును. అక్కడ

తూర్యనాదములు మారుమ్రోగుచుండును. సకలవిధములైన మంగళములు సంపూర్ణముగా నుండును. ఆ నగరము పరిపుష్టులై సంతోషించుచున్న జనులతో నిండి యుండును. ఇంటి వెనుక నుండు చిన్న చిన్న ఆరామములు, విశాలములైన ఉద్యానములు, ఆ నగరమునందు అంతటను ఉండును. జనులు సమాజములుగా ఏర్పడి ఉత్సవములు చేసుకొనుచుందురు.(19-21)

ఈ గడువు గడచిన పిమ్మట ప్రతిజ్ఞను పాలించి క్షేమముగా నున్న రామునితో కలిసి మేము సుఖముగా అయోధ్యలో ప్రవేశింపగలుగుదుమా?"(22)

మహాత్ముడైన ఆ రాజపుత్రుడు ఈ విధముగా విలపించుచు నిలచి ఉండగానే ఆ రాత్రి గడచిపోయినది. మరునాడు సూర్యోదయానంతరము వారిద్దరు ఈ గంగాతీరమున జటలను కట్టించుకొనిరి. నేను వారిని సుఖముగా ఈ నది దాటించితిని. శత్రుసంహారకులు, మహాబలశాలురు, గజరాజులతో సమానులూ అయిన, ఆ రామలక్ష్మణులు జటాధారులై నారచీరలు కట్టుకొని శ్రేష్ఠములైన బాణములను, ధనుస్సులను, ఖడ్గములను ధరించి జాగరూకతతో సీతాసమేతులై వెళ్ళిపోయినారు."(23-25)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనుబది ఆరవ సర్గము సమాప్తము.

ఎనుబది ఏడవ సర్గము

భరతుడు, శత్రుఘ్నుడు, తల్లులును దుఃఖించుట. గుహుని రామాదుల భోజనము, శయనము మున్నగు విషయములను గూర్చి ప్రశ్నించుట. గుహు దా ప్రశ్నలకు బదులు పలుకుట.

గుహుడు చెప్పిన చాల అప్రియమైన ఆ వాక్యమును విన్న భరతుడు అచ్చటనే కూర్చుండిపోయి ఆలోచింపదొడగెను.(1)

ఆ భరతుడు క్షణకాలము తెప్పరిల్లి మిక్కిలి దుఃఖించుచున్న మనస్సుతో, కొరడాలచే ఎక్కువగా కొట్టబడిన ఏనుగు వలె వెంటనే నేలపై పడెను. సమీపమునందే ఉన్న శత్రుఘ్నుడు శోకముచే పీడింపబడినవాడై ఆ విధముగా నేలపై బడిన భరతుని కౌగిలించుకొని, స్పృహ తప్పినవాడై, బిగ్గరగా ఏడ్చెను.(2-4)

ఉపవాసములచే కృశించి, దీనలై భర్తృవియోగముతో దుఃఖించుచున్న తల్లులందరు భరతుని వద్దకు వచ్చి చేరిరి. వారందరును ఏడ్చుచు నేలపై బడిన ఆ భరతుని చుట్టి నిలచిరి. కౌసల్య మాత్రము మిక్కిలి దుఃఖించుచు, సమీపించి అతనిని కౌగిలించుకొనెను. శోకముతో వ్యాకులురాలు, దీనురాలు, వాత్సల్యవంతురాలు అయిన ఆ కౌసల్య తన పుత్రుని కౌగిలించుకొన్నట్లుగా భరతుని కౌగిలించుకొని ఏడ్చుచు అతనిని ప్రశ్నించెను.(5-7)

కుమారా! నీ శరీరమును వ్యాధి ఏదియు బాధించుటలేదు కదా! ఇపుడు ఈ రాజవంశము జీవితము నీమీదనే ఆధారపడి యున్నది. రాముడు, లక్ష్మణసహితుడై వనమునకు వెళ్ళిపోయినాడు. దశరథమహారాజు మరణించినాడు. ఇపుడు నిన్నే చూచుకొని జీవించుచున్నాను. నీవు ఒక్కడివే మాకు ఇపుడు రక్షకుడవు. లక్ష్మణుని గూర్చి గాని, భార్యాసమేతుడై అరణ్యమునకు వెళ్ళిన నా ఏకైకపుత్రుడైన రాముని గూర్చి గాని, నీవు ఏ దైన అప్రియమైన వార్తను వినలేదు కదా!"(8-10)

ఆ భరతుడు క్షణకాలము ఊరడిల్లి కౌసల్యను ఓదార్చి ఏడ్చుచునే గుహునితో యిట్లనెను.(11)

"ఓ గుహుడా! నా సోదరుడైన రాముడు రాత్రి ఎక్కడ నివసించెను? సీత ఎక్కడ నివసించెను? లక్ష్మణుడు ఎక్కడ నివసించెను? వారు ఏమి భుజించిరి? ఏ శయనముపై శయనించిరి? నాకు చెప్పుము.(12)

నిషాదుల ప్రభువైన ఆ గుహుడు సంతోషించినవాడై, ప్రియుడు హితుడు అయిన అతిథిగా వచ్చిన రాముని విషయమున తాను ఎట్లు ప్రవర్తించెనో భరతునితో చెప్పెను.(13)

నేను రాముని భోజనముకొరకై చాల రకములైన అన్నములను, భక్ష్యములను, అనేకవిధములైన ఫలములను సమర్పించితిని. సత్యపరాక్రముడైన ఆ రాముడు వాటి నన్నిటిని వెనుకకు తీసుకొని పొమ్మని ఆజ్ఞాపించెను. అతడు క్షత్రియధర్మమును పాటించుచు, వానిని స్వీకరించలేదు.(14, 15)

ఓ రాజా! మహాత్ముడైన ఆ రాముడు 'ఓ స్నేహితుడా! మేము ఎల్లపుడు ఇతరులకు ఇవ్వవలెను గాని ఇతరులనుండి ప్రతిగ్రహింపకూడదు." అని మమ్ములను అనునయించెను(మాతో ప్రేమపూర్వకముగా చెప్పెను). ఆ రోజున సీత, రాముడు లక్ష్మణుడు తెచ్చి యిచ్చిన జలమును త్రాగి ఉపవాసము చేసిరి. అపుడు లక్ష్మణుడు

కూడ మిగిలిన జలమును ఆహారముగా గ్రహించెను. వారు ముగ్గురు మౌనమును పాటించుచు, ఏకాగ్రచిత్తులై సంధ్యోపాసనము చేసిరి.(16-18)

పిమ్మట లక్ష్మణుడు స్వయముగా దర్భలను తీసుకొని వచ్చి రామునికొరకై ఒక మంగళకరమైన శయనమును శీఘ్రముగా ఏర్పరచెను. రాముడు సీతాసమేతుడై ఆ శయనముపై శయనించెను. లక్ష్మణుడు వారి పాదములను కడిగి దూరముగా వెళ్ళి నిలిచియుండెను. సీతారాములిరువురు ఆ రాత్రి శయనించిన ఇంగుదీవృక్షమూలము, ఆ గడ్డిపరుపు ఇవే.(19-21)

లక్ష్మణుడు, అరచేతులను, వ్రేళ్ళను రక్షించు తొడుగులు ధరించి, బాణములతో నిండిన అంబులపొదులు వీపున కట్టుకొని, నారి కట్టిన ధనుస్సును చేత ధరించి రాత్రి యంతయు ఆ రాముని పరిసరములందు నిలబడియే ఉండెను. అపుడు నేను కూడ ఉత్తమమైన బాణములను ధనుస్సును ధరించి, ఏమరుపాటులేని ధనుర్ధరులైన బంధువులతో కూడినవాడనై, మహేంద్రునితో సమానుడైన రాముని రక్షించుచు, లక్ష్మణుడు నిలచిన చోటనే నిలిచియుంటిని."(22, 23)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనుబది ఏడవ సర్గము సమాప్తము.

ఎనుబది ఎనిమిదవ సర్గము

రాముని కుశశయ్యను చూచి భరతుడు మిక్కిలి శోకించుట. తాను జటావల్కలములు దాల్చి వనమందుండు తలంపును ప్రకటించుట.

మంత్రిసహితుడైన భరతుడు ఆ మాటలన్నీ శ్రద్ధగా విని ఇంగుదీవృక్షమూలము చేరి, రాముని శయ్యను చూచి తల్లులందరితో ఇట్లనెను. "మహాత్ముడైన రాముడు ఆ రాత్రి ఇక్కడనే నేలపై శయనించెను. అతడు పండుకొనగా నలిగిన శయనము ఇదే. గొప్ప భాగ్యము కల వంశమునందు పుట్టినవాడు, గొప్ప భాగ్యము కలవాడు, బుద్ధిమంతుడైన దశరథుని కుమారుడు అయిన రాముడు నేలపై శయనించుట తగదు. మృగచర్మములు పైన కప్పినదీ, శ్రేష్ఠమైన ఆస్తరణముల సముదాయముతో ఏర్పరచినదీ అయిన శయనముపై శయనించుటకు అలవాటు పడిన పురుషశ్రేష్ఠుడైన ఆ రాముడు నేలపై ఎట్లు శయనించెనో!".(1-4)

శత్రుభయంకరుడైన ఆ రాముడు ఎల్లప్పుడు ప్రాసాదాగ్రములందు, విమానములందు, (ఉత్తమగృహములందు) గృహముల పైభాగములందు, అతిశ్రేష్ఠమైన ప్రాసాదములందు నివసించుచుండెడివాడు. ఆ ప్రాసాదములు శ్రేష్ఠమై, ఆస్తరణములతో ప్రకాశించుచుండెడివి. పుష్పముల సముదాయములు అక్కడక్కడ ఉంచుటచే వివిధవర్ణములు కలవై, చందనాగరుసుగంధముతో నిండియుండెడివి. తెల్లని మేఘము వలె ఎత్తుగా ఉండి గుంపులు గుంపులుగా తిరుగు చిలుకల పలుకులతో ప్రతిధ్వనించుచు, సుగంధయుక్తములై చల్లగా ఉండెడివి. బంగారు గోడలతో కట్టబడి మేరుపర్వతము వలె నున్న ఆ ప్రాసాదములలో నివసించుచున్నపుడు ఆ రాముని గీతవాద్యాదుల ధ్వనులచేతను, పరిచారికల శ్రేష్ఠమైన అలంకారముల ధ్వనులచేతను, మధురమైన మృదంగశబ్దములచేతను మేల్కొలుపు చుండెడివారు. చాలమంది వందులు, సూతమాగధులు గాథలు పాడుచు, తగిన స్తోత్రవాక్యములు పలుకుచు, ఆయా కాలములందు వచ్చి ఆ రామునికి నమస్కరించుచుండెడివారు.(5-9)

ఇది(అట్టి రాముడు ఇట్లగుట) నమ్మ శక్యము గాకున్నది. ఇది సత్యమని నాకు తోచుటలేదు. నా మనస్సు మోహము చెందుచున్నది. ఇది యంతయు స్వప్నమా అనిపించుచున్నది. దశరథకుమారుడైన అట్టి రాముడే నేలపై శయనింపవలసివచ్చిన దనగా ఏ దేవతయు కాలముకంటె అధికమైన బలము కలది కాదని తెలియుచున్నది. ఇది నిజము. చూచువారికి ఆనందమును కల్గించునది, జనకుని కూతురు, దశరథునకు ఇష్టమైన కోడలు అయిన సీత కూడ నేలపై పండుకొనినది కదా! ఇది నా అన్నగారి శయనము. ఆయన పొరలిన చోటు ఇది. కఠినమైన నేలపై పరచిన ఈ తృణమంతయు అవయవముల రాపిడిచే నలిగియున్నది.(10-13)

ఈ శయ్యపై అక్కడక్కడ బంగారపు పొడులు అంటుకొని ఉన్నవి. దీనిని బట్టి సీత ఈ శయనముపై అలంకారములతోనే శయనించిన దని అనుకొనుచున్నాను. ఇక్కడ తగుల్కొనియున్న పట్టు దారములు ప్రకాశించుచున్నవి. దీనిని బట్టి ఆనాడు సీత ఉత్తరీయము ఈ ప్రదేశమున తగుల్కొన్నదని స్పష్టమగుచున్నది. చిన్నవయసులో ఉన్నదీ, శోచనీయురాలు, సుకుమారి, పతివ్రతా అయిన సీతాదేవి ఇట్టి పరిస్థితులలో కూడ, దుఃఖముగా భావించుటలేదు. దీనిని బట్టి ఆమెకు భర్త ఉన్న శయనమే సుఖకరమని అనుకొనుచున్నాను.(14-16)

అయ్యో! ఎంత కష్టము వచ్చినది! నేను చాల క్రూరుడను. ఎందుచేత ననగా



భార్యాసహితుడైన రాముడు నా మూలమున అనాథుడు వలె ఇట్టి శయనముపై పండుకొనవలసి వచ్చినది. చక్రవర్తివంశమునందు పుట్టి, జనులందరిచే ఆదరింపబడుచు, వారికి ఇష్టుడైన ఇందీవరశ్యాముడు, ఎఱ్ఱని నేత్రములు కలవాడు, చూచువారికి ఆనందమును కల్గించువాడు, సుఖమునకు తగినవాడు, దుఃఖములకు తగనివాడు అయిన రాముడు రాజ్యమును, అత్యుత్తమమైన సుఖమును కూడ పరిత్యజించి నేలపై ఎట్లు పండుకొనెనో."(17-19)

"మహాభాగ్యవంతుడు, ఉత్తమలక్షణములు కలవాడు అయిన లక్ష్మణుడు చాలా ధన్యుడు. ఎందుచేత ననగా ఇట్టి కష్టసమయములో అతడు సోదరుడైన రాముని అనుసరించి వెళ్ళినాడు. భర్త ననుసరించి అరణ్యమునకు వెళ్ళిన సీత కృతార్థురాలు. మహాత్ముడైన ఆ రామునకు దూరమైన మన అందరి పరిస్థితి సంశయాస్పదమై పోయినది.(20, 21)

దశరథమహారాజు స్వర్గస్థుడయినాడు. రాముడు అరణ్యమునకు వెళ్ళిపోయినాడు. అందుచే ఆ రాజ్యము చుక్కాని పట్టువాడులేని ఓడ వలె కనబడుచున్నది. రాముడు అరణ్యములో ఉన్నను, అతని బాహుపరాక్రమము ఈ భూమిని రక్షించుచునే ఉండును. అందుచే దీనిని ఆక్రమింపవలె నని ఎవ్వడును మనస్సులో కూడ అనుకొనజాలడు.(22, 23)

ఇపుడు మన రాజధానియైన అయోధ్యలో ప్రాకారమునకు రక్షణము లేదు. అశ్వములు, గజములు యుద్ధసన్నద్ధములుగా లేవు. పట్టణపు ద్వారము లన్నీ తెరచి రక్షణశూన్యములై ఉన్నవి. సైనికులందరు సంతోషరహితులై ఉన్నారు. కష్టములలో నున్న ఈ నగరము శూన్యమై వెలుపల కూడ రక్షణవిధానము లేకుండా ఉన్నది. అయినను శత్రువులు, ఈ నగరమును గూర్చి విషముతో చేసిన భక్ష్యములను గూర్చి మనసా కూడ ఎట్లు తలపరో అట్లే తలపరు.(24, 25)

నేను ఈనాడు మొదలు జటలను నారచీరలను ధరించి, ఫలములను

దుంపలను భక్షించుచు, నేలపై కాని, తృణములపై కాని శయనించెదను. రాముడు చేసిన వనవాసప్రతిజ్ఞను నాపై వేసుకొని ఆ రామునికి బదులు నేను మిగిలిన కాలము వనములో సుఖముగా నివసించెదను. అట్లు చేయుటచే రాముని ప్రతిజ్ఞ కూడా అసత్యము కాదు. సోదరుడైన రామునకు బదులు అరణ్యములో నివసించుచున్న నాతో కలిసి శత్రుఘ్నుడు అరణ్యములో నివసించగలడు. పూజ్యుడైన రాముడు లక్ష్మణసమేతుడై అయోధ్యను పాలింపగలడు. బ్రాహ్మణులు అయోధ్యలో రాముని రాజ్యాభిషిక్తుని చేయగలరు. నా యీ మనోరథమును దేవతలు సఫలము చేయుదురా!(26-29)

నేను స్వయముగా తలవంచి నమస్కరించుచు, అనేకవిధముల బ్రతిమాలినను రాముడు అంగీకరించనిచో నేను కూడా అరణ్యములో సంచరించు చున్న ఆ రాముని అనుసరించి అచటనే నివసించెదను. రాముడు నన్ను కాదన జాలడు."(30)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనుబది ఎనిమిదవ సర్గము సమాప్తము.

ఎనుబది తొమ్మిదవ సర్గము

భరతుడు సేనాసమేతుడై గంగను దాటి భరద్వాజాశ్రమమున కేగుట.

భరతుడు ఆ రాత్రి ఆ గంగాతీరమునందే నివసించి, మరునాడు, ప్రాతః కాలమున లేచి శత్రుఘ్నునితో యిట్లు పలికెను.(1)

"శత్రుఘ్నా! ఇంకను పరుండి ఉన్నావేమి? లెమ్ము. నీకు భద్రమగు గాక! నిషాదుల ప్రభువైన గుహుని శీఘ్రముగా తీసుకొని రమ్ము. అతడు సేనను దాటించును."(2)

భరతుడు ఈ విధముగా ప్రేరేపింపగా; సోదరుడైన శత్రుఘ్నుడు ఇట్లు పలికెను. "పూజ్యుడైన రామునిగూర్చి ఆలోచించుచు నేను మేల్కొనియే ఉన్నాను. నిద్రపోవుటలేదు".(3)

పురుషశ్రేష్ఠులైన ఆ భరతశత్రుఘ్నులు ఈ విధముగా పరస్పరము మాటలాడుకొనుచుండగా, గుహుడు తగిన సమయమునందు వచ్చి నమస్కరించుచు భరతునితో ఇట్లనెను.(4)

"భరతుడా! నదీతీరమునందు రాత్రి నీ నివాసము, సుఖకరముగా ఉన్నదికదా! సైన్యసహితుడవైన నీకు ఎట్టి బాధలు కలుగలేదు కదా?"(5)

రామునికి వశవర్తియైన భరతుడు స్నేహపూర్వకముగా పలికిన గుహుని మాటలు విని ఇట్లనెను.(6)

"ఓ గుహుడా! రాత్రి మాకు సుఖముగా గడిచినది. నీవు మమ్ములను అనేకవిధముల పూజించితివి. ఇపుడు అనేకమైన ఓడలపై మమ్ము గంగను దాటించుటకు, నీ భృత్యులను ఆజ్ఞాపించుము."(7)

మిక్కిలి తొందరను సూచించుచున్న ఆ భరతాజ్ఞను విని గుహుడు నగరములోనికి తిరిగి వెళ్ళి తన బంధుజనముతో యిట్లు పలికెను.(8)

"మేల్కొనండి! లేవండి, మీ కందరుకును ఎల్లపుడు క్షేమ మగు గాక! ఓడలను లాగికొని తీసుకొనిరండి. సైన్యమును గంగ దాటించెదము".(9)

గుహుని మాటలు విని వారు రాజాజ్ఞచే తొందరపడుచు వెంటనే నలుమూలలనుండి ఐదువందల ఓడలను తీసుకొనివచ్చిరి. స్వస్తికములను పేరు గల శ్రేష్ఠమైన మరికొన్ని ఓడలనుకూడ తీసికొనివచ్చిరి. వాటికి పెద్ద పెద్ద గంటలు కట్టి ఉండెను. వాయువునకు అనుకూలముగా నడచు ఆ ఓడలు చిన్న జెండాలతో ప్రకాశించుచుండెను. వాటి బంధములు దృఢముగా ఉండెను. పిమ్మట గుహుడు స్వయముగా, తెల్లని కంబళులతో కప్పిన మంగళప్రదమైన, ఆనందకరమైన ధ్వని కల, స్వస్తిక మను ఓడను తీసుకొనివచ్చెను.(10-12)

ముందుగా వసిష్ఠుడు, పూజ్యులైన బ్రాహ్మణులు ఆ ఓడను ఎక్కిరి. భరతుడు, శత్రుఘ్నుడు, కౌసల్య, సుమిత్ర, ఇతరరాజస్త్రీలు ఎక్కిన పిమ్మట రాజభార్యలు, బండ్లు, అంగళ్లు ఎక్కినవి. అపుడు కొందరు తాము విడిది చేసిన స్థానములను కాల్చివేయుచుండిరి. కొందరు రేవులో దిగుచుండిరి. కొందరు ఓడలో చేర్చుటకై ఆయా వస్తువులను తీసుకొనుచుండిరి. వీరందరు చేయు ధ్వని స్వర్గమువరకు వ్యాపించెను.(13-15)

పతాకలచే అలంకరించిన ఆ నావలను, పల్లెవారు స్వయముగా నడుపుచుండిరి. అవి ఎక్కిన జనమును మోసుకొని అతివేగముగా పరుగెత్తినవి. ఈ ఓడలలో కొన్ని స్త్రీలతోను, కొన్ని గుఱ్ఱములతోను నిండి ఉండెను. కొన్నిటిపై రథాదివాహనములు, బండ్లను లాగు యెద్దులు గొప్ప ధనము ఎక్కింపబడినవి. ఆ

ఓడలు ఆవలి ఒడ్డు చేరి, జనులను దింపి, తిరిగి వచ్చినవి. కొందరు పల్లెవారు నీటిపై ఆ నావలతో వివిధచిత్రాకారము లగు సన్నివేశములను చేసిరి. మావటివారు ప్రేరేపించగా ఈదుచు నదిని దాటుచున్న, జెండాలు కట్టిన ఏనుగులు ధ్వజములతో కూడిన పర్వతముల వలె ప్రకాశించెను.(16-19)

అపుడు కొందరు నావలపై ఎక్కిరి. కొందరు తెప్పలపై ఎక్కి దాటిరి. కొందరు కడవల సహాయముతో తేలుచూ దాటిరి. మరి కొందరు చేతులతో ఈది దాటిరి. ఆ పల్లెవారు స్వయముగా దాటింపగా, పవిత్రమైన ఆ సేన గంగానదిని దాటి మైత్రముహూర్తమునందు శ్రేష్ఠమైన ప్రయాగవనమును చేరెను.(20, 21)

పూజ్యుడైన భరతుడు మంచి మాటలచే సేనకు విశ్రాంతి కలుగజేసి, దానిని సుఖముగా నుండునట్లు విడియచేసి, ఋషులలో శ్రేష్ఠుడైన భరద్వాజుని చూచుటకై ఋత్విక్కులతో కూడ బయలుదేరి వెళ్లెను. దేవపురోహితుడు, మహాత్ముడు అయిన ఆ భరద్వాజుని ఆశ్రమమును సమీపించి భరతుడు అందమైన పర్ణశాలలు, వృక్షసముదాయములు గల ఆ బ్రాహ్మణోత్తముని సుందరమైన వనమును చూచెను.(22, 23)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని ఎనుబది తొమ్మిదవ సర్గము సమాప్తము.

తొంబదవ సర్గము

భరతుడు భరద్వాజమహర్షితో సంభాషించుట. తన ఆశ్రమమున వసింపుమని భరద్వాజు డాదేశించుట.

ధర్మవేత్తయైన ఆ భరతుడు, కోసు దూరమునుండియే, భరద్వాజాశ్రమమును చూచి, సైన్యమును అక్కడనే నిలిపివేసెను. ఆయుధములను పరివారమును విడచివేసి, పట్టుబట్టలు ధరించినవాడై వసిష్ఠుని ఎదుట ఉంచుకొని, మంత్రులతో కూడ కాలినడకనే అచటికి వెళ్ళెను. భరద్వాజుడు కనబడునంత దూరములో మంత్రులను నిలిపివేసి తాను వసిష్ఠుని వెనుక నడిచి వెళ్లెను.(1-3)

వసిష్ఠుని చూడగానే మహాతపశ్శాలియైన భరద్వాజుడు, "అర్ఘ్యము, అర్ఘ్యము." అని శిష్యులతో పలుకుచు వెంటనే అసనము నుండి లేచెను. మహాతేజశ్శాలియైన

ఆ భరద్వాజుడు, వసిష్ఠునితో కలిసిన పిమ్మట భరతుడు ఆయనకు నమస్కరించెను. అపుడు అతడు దశరథుని కుమారుడు అని భరద్వాజునకు తెలిసెను.(4, 5)

ధర్మములు తెలిసిన ఆ భరద్వాజుడు ఆ యిద్దరికిని క్రమము తప్పకుండా అర్ఘ్యమును, పాద్యమును ఫలములను ఇచ్చి, "మీ వంశములో అందరును క్షేమముగా ఉన్నారా!" అని(భరతుని) ప్రశ్నించెను. అయోధ్యానగరము, సైన్యము, ధనాగారము, మీ మిత్రులు, మంత్రులు అందరును కుశలమా" అని ప్రశ్నించెను కాని, దశరథమహారాజు మరణించెనని తెలిసినవాడగుటచే అతనిని గూర్చి ప్రశ్నించలేదు.(6, 7)

"నీ శరీరమునకు, అగ్నులకు, వృక్షములకు, శిష్యులకు, మృగపక్షులకు ఏ బాధలు లేవు కదా" అని వసిష్ఠుడు, భరతుడు ఆ భరద్వాజుని ప్రశ్నించిరి.(8)

భరద్వాజుడు, "ఇక్కడ మేము అన్ని విధముల క్షేమముగా ఉన్నాము." అని తెలిపి రామునియందలి స్నేహమును పురస్కరించుకొని భరతునితో ఇట్లనెను.(9)

"రాజ్యమును పాలించుచున్న నీవు ఇచటకు ఎందుకు వచ్చితివి? ఈ విషయము నంతను పూర్తిగా తెలుపుము. నా మనస్సులో ఏదియో శంక కలుగుచున్నది. కౌసల్యాతనయుడైన రాముడు శత్రుసంహారకుడు. లోకములకు ఆనందము కలిగించువాడు. అతడిని తండ్రి, 'పధ్నాలుగు సంవత్సరములు అరణ్యవాసము చేయుము.' అని ఆజ్ఞాపించెను. మహాయశశ్శాలియైన రాముడు వెంటనే అంగీకరించి అరణ్యమునకు వెళ్ళిపోయెను.

అతడికి దక్కవలసిన రాజ్యము నీకు దక్కినది. ఆ రాజ్యమును ఎట్టి ఆటంకములు లేకుండ అనుభవించవలెనను అభిలాషతో నీవు రాముడిపట్లను, లక్ష్మణుడిపట్లను ఏ పాపకార్యమును చేయుటకు ప్రయత్నించుటలేదు కదా?(10-13)

భరతుడు ఆ మాటలు విని, దుఃఖముతో కన్నీళ్లు కార్చుచు, తొట్రుపడుచున్న మాటలతో, భరద్వాజునితో ఇట్లు పలికెను.(14)

"పూజ్యుడ వైన నీవు కూడ నన్ను గూర్చి ఇట్లు భావించినచో, నన్ను చంపివేసినట్లే. నావలన ఎట్టి దోషమును లేదు. నన్ను గూర్చి నీవు ఈ విధముగా పలుకరాదు. నేను లేని సమయమున నా తల్లి పలికిన మాట లన్నీ నాకు ఇష్టము కాదు. వాటిచే నేను సంతోషించలేదు. వాటిని నేను సమ్మతింపను.(15, 16)

నేను ఇపుడు పురుషులలో శ్రేష్ఠుడైన ఆ రాముని పాదములకు

నమస్కరించుటకు, అతనిని అనుగ్రహింపచేసుకొని మరల అయోధ్యకు తీసుకొని వెళ్లుటకు వచ్చి యున్నాను. నేను ఇట్టి పరిస్థితులలో ఉన్నట్లు తెలిసికొని, నన్ను అనుగ్రహింపుము. మహారాజైన రాముడు ఇపుడు ఎక్కడ ఉన్నాడో నాకు తెలుపుము."(17, 18)

వసిష్ఠాదిఋత్విక్కులు కూడ ప్రార్థింపగా, పూజ్యుడైన ఆ భరద్వాజుడు, ప్రసన్నుడై, భరతునితో ఇట్లు పలికెను.(19)

"భరతా! గురువుల విషయమున సత్ప్రవర్తనము, ఇంద్రియనిగ్రహము, సత్పురుషులను అనుసరించి ఉండుట, ఇవన్నీ రఘువంశములో జన్మించిన నీకు తగి ఉన్నవి. నీ మనస్సులోని భావము నాకు తెలియును. అయినను దానిని ధ్రువీకరించుకొనుటకును, నీ కీర్తిని అభివృద్ధిచేయుటకును, నిన్ను ఇట్లు ప్రశ్నించితిని.(20, 21)

ధర్మజ్ఞుడైన రాముడు సీతాలక్ష్మణసహితుడై, ఎక్కడ వున్నాడో నాకు తెలియును. నీ సోదరుడైన రాముడు చిత్రకూటపర్వతమునందు నివసించుచున్నాడు. నీవు రేపు అక్కడకు వెళ్ళవచ్చును. మంత్రిసహితుడవై, నీవు ఇక్కడనే ఉండుము. ఈ నా కోరికను తీర్చుము."(22, 23)

ఉత్తమమైన ఆలోచన కల భరతుడు చాల సంతోషించి, "అట్లే అగుగాక" అని పలికెను. అపుడు ఆ రాజకుమారుడు ఆ రాత్రి ఆశ్రమమునందు నివసించుటకు నిశ్చయించుకొనెను.(24)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొంబదవ సర్గము సమాప్తము.

తొంబది ఒకటవ సర్గము

సైన్యసమేతుడగు భరతునకు భరద్వాజు డాతిథ్యమిచ్చుట.

అపుడు అక్కడ నివసించుటకు, అంగీకరించిన భరతునితో భరద్వాజుడు "నేను ఇచ్చు ఆతిథ్యమును స్వీకరింపుము." అని కోరెను.(1)

భరతుడైతే భరద్వాజునితో ఇట్లనెను, "పాద్యము, అర్ఘ్యము, అరణ్యములో లభించు ఈ ఆతిథ్యము నీవు నాకు ఇచ్చియే ఉన్నావు కదా!"(2)

పిమ్మట భరద్వాజుడు చిరునవ్వు నవ్వుచు, భరతునితో ఇట్లనెను. "నీవు సంతుష్టి కలవాడ వని ఎరుగుదును. నీకు ఏమి ఇచ్చినను దానితో తృప్తి పడెదవు. నీ సేన కంతకును భోజనము ఏర్పరుపవలె నని నేను కోరుచున్నాను. నీవు సత్కరించుటకు తగినవాడవు. నిన్ను తగు విధముగా సత్కరించిన నాకు ఆనందము కలుగును.(3, 4)

నీ సైన్యమును దూరముగా ఉంచి ఇక్కడికి వచ్చినా వేమి? సైన్యముతో కూడ ఎందుకు రాలేదు?"(5)

భరతుడు చేతులు జోడించి నమస్కరించుచు, భరద్వాజునితో ఇట్లనెను. "ఓ పూజ్యుడా! నేను నీకు భయపడి ఇక్కడకు సేనను తీసుకొని రాలేదు. రాజుగాని రాజపుత్రుడు గాని ఎల్లప్పుడును దేశములో ప్రయత్నపూర్వకముగా మునులకు దూరముగా సంచరించవలెను. ఉత్తమమైన అశ్వములు, మనుష్యులు, మదించిన శ్రేష్ఠమైన గజములు విశాలమైన భూమిని ఆక్రమించుచు నా వెనుక వచ్చుచున్నవి. ఆ సైన్యములు ఆశ్రమములో నున్న వృక్షములను, ఉదకములను, భూమిని, పర్ణశాలలను పాడుచేయును అను భయముచే అట్లు జరుగకుండుటకై నేను ఒక్కడనే వచ్చినాను."(6-9)

"సైన్యమును ఇక్కడకు తీసికొని రమ్ము" అని ఆ మహర్షి ఆజ్ఞాపింపగా భరతుడు సైన్యమును రప్పించెను.(10)

పిదప భరద్వాజుడు అగ్నిగృహములో ప్రవేశించి, ఆచమనము చేసి, అవయవముల పరిమార్జనము చేసుకొని ఆతిథ్యమును ఏర్పరచుటకు విశ్వకర్మను ఆహ్వానించెను.(11)

"ఆతిథ్యము ఇవ్వ గోరుచున్న నేను గృహాదుల నిర్మించు విశ్వకర్మను

ఆహ్వానించుచున్నాను. అతడు వచ్చి తగు ఏర్పాట్లు చేయుగాక! దేవేంద్ర, యమ, వరుణ, కుబేరులు అను లోకపాలకులు ముగ్గురిని ఆహ్వానించుచున్నాను. నేను భరతునకు ఆతిథ్యము చేయగోరుచున్నాను. కావున వారు వచ్చి తగు ఏర్పాట్లు చేయుదురు గాక! భూమిపైన, అంతరిక్షమునందు, తూర్పుగాను, పడమటవైపునకు ప్రవహించు నదులన్నియు కలిసి ఇపుడు నలువైపులనుండి వచ్చుగాక!(12-14)

కొన్ని నదులు మైరేయమను మద్యమును, కొన్ని నదులు బాగుగా తయారు చేయబడిన సురను, మరికొన్ని నదులు చెఱకురసము వలె మధురమైన చల్లని ఉదకమును స్రవించుగాక!(15)

దేవగంధర్వులైన విశ్వావసు, హాహా, హూహూలను, దేవజాతికి చెందిన అప్సరసలను, గంధర్వజాతికి చెందిన అప్సరసలను నలువైపులనుండి ఆహ్వానించుచున్నాను. ఘృతాచి, విశ్వాచి, మిశ్రకేశి, అలంబుస, నాగదంత, హేమ అను అప్సరస్త్రీలను, పర్వతముపై నివసించు హిమ అను అప్సరసను ఆహ్వానించు చున్నాను. దేవేంద్రుని సేవించుచున్న స్త్రీలను, బ్రహ్మను సేవించు స్త్రీలను, తుంబురువును ఆహ్వానించుచున్నాను. వారు తమ తమ ఉపకరణములు తీసికొని రావలెను.(16-18)

ఎల్లపుడు వస్త్రములు, భూషణములు అను పత్రములతోను, ఉత్తమస్త్రీలు అను ఫలములతోను ప్రకాశించుచున్న కుబేరుని ఏ దివ్యవనము ఉత్తరకురుదేశమునందు ఉన్నదో అది ఇక్కడికి వచ్చుగాక! భగవంతుడైన చంద్రుడు ఇక్కడ నాకొరకై ఉత్తమమైన అన్నమును, అనగా బహువిధములైన భక్ష్యములను, భోజ్యములను, చోష్యములను, లేహ్యములను కల్పించుగాక! చంద్రుడు అపుడే చెట్లనుండి రాలి నూతనముగా నున్న వివిధపుష్పమాలలను, సుర మొదలగు పేయములను, అనేకవిధములైన మాంసములను ఇచ్చుగాక!"(19-21)

సాటిలేని తేజస్సు, తపస్సు గల ఆ భరద్వాజుడు, ఏకాగ్రచిత్తుడై శిక్షలో చెప్పబడిన స్వరములను పాటించుచు, ఇట్లు పలికెను. ఆ మహర్షి తూర్పుదిక్కువైపు తిరిగి, చేతులు జోడించి నమస్కరించుచు మనస్సులో ఈ విధముగా ధ్యానము చేయుచుండగానే, ఆహూతులైన ఆ దేవత లందరును ఒక్కరొక్కరుగా అక్కడికి వచ్చిరి.(22, 23)

ఇంతలో వాయువు మలయదర్దురపర్వతములనుండి వచ్చుచు, శరీరములకు తాకుటచే సుఖానందములను కల్గించుచు, చెమటలను తొలగించుచు

మంగళకరముగా వీచెను. దివ్యమైన మేఘములు వచ్చి, పుష్పవర్షములను వర్షించెను. దివ్యములైన దుందుభుల ధ్వని అన్ని దిక్కులందును వినబడెను. వాయువులు సుఖకరముగా వీచెను. అప్సరసలు నృత్యము చేసిరి. దేవతలు, గంధర్వులు గానములు చేసిరి. వీణాధ్వనులు అంతట వ్యాపించెను. లయసమన్వితమై మృదువుగాను, సమముగాను ఉన్న ఆ వీణాదిధ్వని ఆకాశమును, భూమిని, ప్రాణుల శ్రవణములను ప్రవేశించెను. మానవుల శ్రోత్రములకు సుఖకరమైన ఆ దివ్యధ్వని శాంతించిన పిమ్మట భరతుని సైన్యము విశ్వకర్మ చేసిన నిర్మాణమును చూచెను. (24-28)

ఆ చుట్టుప్రక్కల అయిదు ఆమడల భూమి చదునుగా ఏర్పడెను. అంతటను ఇంద్రనీలవైడూర్యమణుల వలె నున్న అనేకమైన పచ్చికబీళ్ళు వ్యాపించి యుండెను. ఆ ప్రదేశమునందు, ఫలములతో నిండిన మారేడుచెట్లు, వెలగచెట్లు, పనసచెట్లు, మాదీఫలపుచెట్లు, ఉసిరిచెట్లు, మామిడిచెట్లు, ఆవిర్భవించెను. ఉత్తరకురుదేశము నుండి దివ్యమైన భోగ్యవస్తువులు గల వనము, తీరములపై అనేకవృక్షములతో నిండిన దివ్యమైన నది అచటికి వచ్చెను. (29-31)

పరిశుభ్రములైన నాలుగిండ్ల భవంతులు, గజశాలలు, అశ్వశాలలు, మేడలకును, ప్రాసాదములకును సంబంధించిన శుభకరమైన ముఖద్వారములు ఆవిర్భవించెను. (32)

మంచి ముఖద్వారములతో, తెల్లని మేఘము వలె నున్న శోభాయుక్తమైన, రాజగృహము కూడా అక్కడ ఆవిర్భవించెను. దానియందు దేవలోకమునకు సంబంధించిన గంధద్రవ్యములు చల్లి దానిని తెల్లనిపుష్పమాలలతో అలంకరించిరి. నలుచదరముగా నున్న విశాలమైన ఆ రాజభవనమునందు శయనములు, ఆసనములు, వాహనములు, దివ్యములైన సమస్తరసములు, దివ్యములైన భోజనవస్త్రాదులు సిద్ధముచేసి ఉన్నవి. అనేకవిధములైన ఆసనములు, అందమైన ఆచ్ఛాదనములు కప్పిన ఉత్తమమైన శయనములు అచట సిద్ధము చేయబడి ఉన్నవి. (33-35)

భరతుడు, మహర్షి అనుమతి తీసుకొని, శ్రేష్ఠమైన వస్తువులతో నిండిన ఆ రాజభవనములోనికి ప్రవేశించెను. పురోహితులు, మంత్రులు భరతుని అనుసరించి వెళ్ళి ఆ గృహములో ప్రవేశించి దాని సంవిధానమును(ఏర్పాటు) చూచి చాల సంతోషించిరి. భరతుడు మంత్రిసహితుడై అక్కడ ఉన్న దివ్యమైన సింహాసనమునకు, ఛత్రచామరములకు రాజునకు ప్రదక్షిణము చేసినట్లు ప్రదక్షిణము చేసెను. రామునకు

నమస్కారములు చేసి, ఆ సింహాసనమును పూజించి, వింజామరను చేత బట్టుకొని, మంత్రి కూర్చుండ దగిన ఒక ఆసనము పై కూర్చుండెను.(36-39)

పిమ్మట మంత్రులు, పురోహితులు అందరు యథాక్రమముగా కూర్చుండిరి. తరువాత సేనాపతి, అతని వెనుక ప్రశాస్త కూర్చుండిరి. భరద్వాజుని ఆజ్ఞచే, క్షణకాలములో కొన్ని నదులు భరతుని దగ్గరకు వచ్చెను. వాటిలో బురదకు బదులు పాయసము ఉండెను. ఆ నదుల రెండు తీరములందును, సుందరమైన దివ్యగృహములు, బ్రహ్మ అనుగ్రహముచే ఆవిర్భవించెను. ఆ గృహములు తెల్లని మట్టిచే పూయబడి ఉండెను.(40-42)

అదే సమయమునందు, బ్రహ్మ పంపగా దివ్యములైన ఆభరణములు అలంకరించుకొని ఇరువదివేలమంది స్త్రీలు వచ్చిరి. కుబేరుడు పంపగా ఇరువదివేలమంది స్త్రీలు బంగారము, మణులు, ముత్యములు, పగడములు, మొదలగువాటితో ప్రకాశించుచు వచ్చిరి. ఇరువదివేలమంది అప్సరసస్త్రీలు నందనవనమునుండి వచ్చిరి. వారి చేతిలో చిక్కిన పురుషుడు ఎవడైనను ఉన్మత్తుడివలె మైమరిచిపోవును.(43-45)

నారదుడు, తుంబురుడు, గోపుడు అను సూర్యుని వంటి కాంతిగల శ్రేష్ఠులైన గంధర్వరాజులు భరతుని ఎదుట గానము చేసిరి. భరద్వాజుని ఆజ్ఞను అనుసరించి, అలంబుస, మిశ్రకేశి, పుండరీక, వామన అను అప్సరసలు భరతుని సమీపమున నృత్యము చేసిరి. దేవలోకములోని పుష్పమాలలు, కుబేరుని చైత్రరథవనములోని పుష్పమాలలు ప్రయాగక్షేత్రమునందు ఆవిర్భవించినవి. మారేడుచెట్లు మృదంగము వాయించువారు గాను, తాండ్రచెట్లు తాళమువేయువారుగాను, రావిచెట్లు నర్తకులుగాను అయినవి.(46-49)

సరళవృక్షములు, తాళవృక్షములు, తిలకవృక్షములు, నక్తమాల వృక్షములు, అంతఃపురములో చరించు కుబ్జులుగాను, వామనలుగాను మారి సంతోషముతో అక్కడికి వచ్చినవి. అడవులలో నున్న శింశుపావృక్షములు, ఆమలకీవృక్షములు, జంబూవృక్షములు, ఇతరమైన వృక్షములు, మాలతీ, మల్లికా, జాజి మొదలైన ఇతరలతలు స్త్రీశరీరములు ధరించి భరద్వాజాశ్రమమునకు వచ్చి ఇట్లు పలికినవి. “మద్యమును త్రాగువారందరు ఎంత కావలెనో అంత మద్యము త్రాగండి. ఆకలిగొన్నవారు పాయసమును పవిత్రములైన మాంసములను తినండి.”(50-53)

ఒక్కొక్క పురుషుని ఏడుగురు లేదా ఎనమండుగురు స్త్రీలు నదీతీరమునకు తీసుకొనిపోయి ఒడలికి నలుగు పెట్టి స్నానము చేయించిరి. వారి శరీరములు పట్టుటకై అందమైన నేత్రములు గల కొందరు స్త్రీలు, శీఘ్రముగా వచ్చిరి. ఉత్తమలైన మరి కొందరు స్త్రీలు వారి శరీరములు తుడిచి, పరస్పరము సురాపానము చేయించిరి.(54, 55)

వాహనములను పాలించువారు, అశ్వములకు, ఏనుగులకు, గాడిదలకు, ఒంటెలకు, ఎద్దులకు వాటి వాటి ఆహారమును యథావిధిగా ఇచ్చి తినిపించిరి. మహాబలశాలురైన ఆ వాహనపాలకులు భరతుని సైన్యములోని యోధులు ఎక్కి వచ్చిన వాహనములను “తినండి తినండి” అని ప్రేరేపించుచు, వాటికి చెరుకుగడలు, తేనె కలిపిన పేలాలు తినిపించిరి. గుఱ్ఱములు కట్టువాడు గుఱ్ఱములను, ఏనుగులను పాలించువాడు ఏనుగులను గుర్తించుటలేదు. ఈ విధముగా అక్కడ ఆ సైనికులందరు మదించి ఒళ్లు తెలియక ఆనందముతో ఉండిరి.(56-58)

సమస్తభోగములచే తృప్తిపొందింపబడినవారై ఎఱ్ఱని చందనము శరీరమునకు పూసుకొని అప్సరస్త్రీలతో కూడి యున్న ఆ సైనికులు ఇట్లు పలికిరి.(59)

“మేము అయోధ్యకు వెళ్ళము. దండకారణ్యమునకు కూడ వెళ్లము. ఇక్కడనే ఉండిపోయెదము. భరతునకు క్షేమ మగుగాక! రాముడు కూడా సుఖముగా నుండుగాక.”(60)

ఈ విధముగా భరద్వాజుడు చేసిన సత్కారమును పొందిన కాలి బంట్లు, అశ్వములను గజములను ఎక్కువారు, వాటిని పాలించువారు, తమను నియంత్రించు ప్రభువు లేడనుకొనుచు స్వతంత్రులై ఈ విధముగా పలికిరి. భరతుని అనుచరులైన వేల సంఖ్యలో నున్న ఆ సైనికులు సంతోషముతో బిగ్గరగా కేకలు వేయుచు, ఇదే స్వర్గము అని పలికిరి.(61, 62)

పుష్పమాలలు ధరించిన వేలకొలది ఆ సైనికులు, నృత్యము చేయుచు, నవ్వుచు, పాటలు పాడుచు, నలువైపుల పరుగెత్తుచుండిరి. అమృతముతో సమానమైన ఆ అన్నమును తినిన ఆ సైనికులకు, అక్కడ ఉన్న దివ్యములైన భక్ష్యములను చూచి వాటిని తినవలె నని మరల కోరిక పుట్టెను. అక్కడ ఉన్న వేలకొలది నౌకర్లు, దాసీలు, స్త్రీలు, సైనికులు, అందరును నలగని వస్త్రములు ధరించి, దృప్తులై ఉండిరి.(63-65)

అక్కడ ఏనుగులు, గాడిదలు, ఒంటెలు, వృషభములు, అశ్వములు, మృగములు, పక్షులు వీటి కన్నిటికి ఇష్టమైన చక్కని ఆహారము లభించుటచే అవి ఒకదానిని ఒకటి బాధించలేదు.(66)

ఆ సైన్యములో, తెల్లని వస్త్రములు ధరించనివాడు గాని, ఆకలి గొన్నవాడు గాని, మాలిన్యవంతుడుగాని, కేశములకు పరాగము తగిలినవాడు గాని ఏ ఒక్కడును లేకుండెను. ఆ సైనికులు, అక్కడ నలువైపుల, తెల్లని అన్నముతో కూడిన, పైన పుష్పములు కప్పిన వేలకొలది లోహపాత్రలను, ఆశ్చర్యముతో చూచిరి. ఆ పాత్రలు మేకమాంసముతోను, వరాహమాంసముతోను, శ్రేష్ఠమైన శాకాదివ్యంజనముల తోను, వివిధ ఫలరసములతోను మంచిసువాసన, రుచీ గల సూపములతోను నిండియుండెను.(67-69)

ఆశ్రమము ప్రక్కలందు పాయసము బురద గల(చిక్కని పాయసముతో నిండిన) కూపములు ఏర్పడినవి. అచట నున్న ఆవులు కోరిన వస్తువులను ఇచ్చెను. వృక్షములనుండి తేనె స్రవించుచుండెను. అక్కడ మద్యముతో నిండిన దిగుడుబావులు, వాటి చుట్టును పరిశుద్ధమైన లేడి మాంసము, నెమలి మాంసము, కోడి మాంసము కుండలలో వండి రాసులుగా పోయబడి ఉండెను. అక్కడ వేలకొలది చిన్న పాత్రలు, లక్షలకొలది గిన్నెలు, పదికోట్ల బంగారు పాత్రలు, పెరుగు నింపిన బాగుగా సంస్కరింపబడిన గిన్నెలు, చిన్న కుంభములు, విశాలమైన ముఖము గల పాత్రలు ఉండెను.(70-72)

పాతది కాని, క్రొత్తది కాని కాక, మధ్యరకముగా ఉన్న సుగంధము, కపిత్థవర్ణము గల పెరుగుతో నిండిన హ్రదములు, రసాల మను పెరుగు హ్రదములు, తెల్లని పెరుగుతో నిండిన హ్రదములు, పాయసముతో నిండిన హ్రదములు ఏర్పడెను. శర్కర కలిపిన యవల చూర్ణము రాసులు ఏర్పడెను.(73, 74)

ఆ సైనికులు నదుల రేవులలో, కల్కములను, చూర్ణములను, కషాయములను పాత్రలలో ఉంచిన అనేకవిధములైన స్నానద్రవ్యములను చూచిరి.(75)

ఆ ప్రాంతమునందంతటను తెల్లని కుచ్చులు గల దంతకాష్ఠసముదాయములు, దొప్పలలో ఉంచిన తెల్లని చందనపు ముద్దలు, శుభ్రముగా తుడిచిన అద్దములు, వస్త్రసముదాయములు, వేలకొలది తొడుగుకొను చెప్పుల జోళ్ళు, పాదములకు కట్టుకొను చెప్పులజోళ్ళు, కాటుకభరిణెలు, దువ్వెనలు, కూర్చెలు, వస్త్రములు, ధనుస్సులు, కవచములు, చిత్రములైన శయనములు, ఆసనములు ఉండెను.

గాడిదెలు, ఒంటెలు, గజములు, అశ్వములు త్రాగుటకై నీళ్లు నింపిన గుంటలు ఉండెను. దిగుటకు అనువైన రేవులు, కలువలు, పద్మములు ఉండెను. స్వచ్ఛమైన ఉదకముతో ఆకాశము వంటి రంగు గల, సుఖముగా స్నానముచేయుటకు అనుకూలమైన సరస్సులు, పశువులు మేయుటకై నీపవృక్షముల, వైడూర్యమాణిక్యముల వంటి రంగు గల మృదువైన తృణసముదాయములు ఉండెను.(76-80)

భరద్వాజమహర్షి భరతునకు చేసిన అద్భుతమైన ఆ ఆతిథ్యము స్వప్నలోకములో జరిగినట్లుండెను. దానిని చూచి అక్కడ నున్న మనుష్యులందరును ఆశ్చర్యపడిరి.(81)

ఈ విధముగా వారు నందనవనములో దేవతలు విహరించి నట్లు రమ్యమైన భరద్వాజాశ్రమములో విహరించుచుండగా, ఆ రాత్రి గడచి పోయినది. ఆ నదులు, గంధర్వులు, ఆ ఉత్తమస్త్రీలు అందరు భరద్వాజుని అనుజ్ఞపొంది వచ్చినట్లుగానే తిరిగి వెళ్ళిపోయిరి.(82, 83)

గంధర్వాదులందరు తిరిగి వెళ్ళిపోయిన పిమ్మట కూడ, ఆ సైనికులందరు మితిమీరి త్రాగిన మద్యము మత్తుతో అట్లే పడి ఉండిరి. వారి శరీరమునకు పూసుకొనిన దివ్యమైన అగరుచందనములు అట్లే ఉండెను. నలిగిన అనేకవిధములైన ఆ దివ్యపుష్పమాలలు అచ్చటచ్చట పడి ఉండెను.(84)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొంబది ఒకటవ సర్గము సమాప్తము.

తొంబది రెండవ సర్గము

భరతుడు సేనాసమేతుడై చిత్రకూటమున కేగుట.

పరివారసహితుడైన భరతుడు ఆతిథ్యము స్వీకరించి, ఆ రాత్రి అక్కడ గడిపి, అనుజ్ఞ వేడవలె నను కోరికతో భరద్వాజుని సమీపించెను.(1)

అగ్నిహోత్రము పూర్తిచేసికొని కూర్చొనియున్న ఆ భరద్వాజమహర్షి ముకుళితహస్తములతో తన వద్దకు వచ్చిన ఆ భరతునితో ఇట్లనెను.(2)

"నీవు మా ఆశ్రమమునందు, రాత్రిని సుఖముగా గడిపినావా? మీ పరిజనమున కంతకును పరిపూర్ణముగా ఆతిథ్యము లభించినదా? చెప్పుము."(3)

ఆ ఋషికి చేతులు జోడించి నమస్కరించుచు భరతుడు ఇట్లు పలికెను.(4)

"ఓ పూజ్యుడా! అమాత్యసహితుడనైన నేను, సమస్తమైన నా సైన్యము, వాహనములు కూడ నీవు ఇచ్చిన సమస్తభోగములచే తృప్తిపొందినవారమై సుఖముగా ఉంటిమి. మా పరిచారకుల దగ్గరనుంచి కూడ మే మందరము శ్రమయు, సంతాపమును తొలగి, మంచి ఆహారము భుజించి, ఉత్తమమైన గృహములలో సుఖముగా నివసించితిమి. ఋషిశ్రేష్ఠుడా! వెళ్లుటకై అనుజ్ఞ కోరుచున్నాను. సోదరుని వద్దకు ప్రయాణమైన నా విషయమున స్నేహమును చూపుము. రాముని ఆశ్రమము ఎక్కడ ఉన్నదో, అచటికి పోవుటకు ఏది మార్గమో, ఎంత దూరమో చెప్పుము."(5-8)

భరద్వాజుడు సోదరుని చూచుటకై ఆసక్తి గల భరతుని మాటలు విని అతనితో ఇట్లనెను.(9)

ఇక్కడనుండి మూడున్నర యోజనముల దూరమున నిర్జనవనమునందు అందమైన సెలయేళ్లు, అడవులు కల చిత్రకూట మను పర్వతము ఉన్నది. దాని ఉత్తరపార్శ్వమున మందాకినీనది ఉన్నది. దాని తీరమునందు పుష్పించిన వృక్షములు దట్టముగా ఉండును. పుష్పించిన అందమైన అరణ్యములు కూడ దాని ఇరు పార్శ్వములం దుండును. ఆ నదికి అవతల చిత్రకూటపర్వతము, దానిపై ఆ రామలక్ష్మణుల పర్ణశాల ఉన్నవి. వారు ఆ పర్ణశాలలో నివసించుచున్నారు. నిశ్చయము. గజములతోను, అశ్వములతోను, రథములతోను నిండిన సేనను దక్షిణమార్గమున గాని, నైఋతి మార్గమునగాని నడిపించికొని వెళ్ళినచో రాముడు కనబడును.(10-13)

ప్రయాణమును గూర్చి విన్న దశరథుని భార్యలు, తమ వాహనములనుండి దిగి, ఆ భరద్వాజమహర్షి చుట్టును చేరి నిలచిరి. కృశించి, దీనురాలై వణకుచున్న కౌసల్యా, సుమిత్రాదేవీ ఆ భరద్వాజుని పాదములను స్పృశించి నమస్కరించిరి.(14,15)

తన కోరిక నెరవేరక, సర్వలోకనిందిత అయిన కైకేయి సిగ్గు పడుచు ఆ భరద్వాజముని పాదములు స్పృశించి నమస్కరించెను. ఆమె భగవంతుడైన ఆ మహామునికి ప్రదక్షిణము చేసి, దీనమైన మనస్సుతో భరతుని దగ్గర నిలబడెను.(16,17)

భరద్వాజుడు, "ఓ భరతా! నీ తల్లులలో ఎవరు ఎవరో తెలుసుకొనగోరుచున్నాను." అని భరతునితో పలికెను.(18)

భరతుడు చేతులు జోడించి నమస్కరించుచు ఇట్లు పలికెను.(19)

ఓ మహామునీ! దీనురాలై, శోకముచేతను, ఉపవాసములచేతను కృశించి ఉన్న దేవతాసదృశురాలగు ఈమె తండ్రిగారి పట్టపురాణియైన కౌసల్యాదేవి. ఈమెయే పురుషశ్రేష్ఠుడైన రాముని, అదితి ధాతను కన్నట్లు కనినది.(20, 21)

దుఃఖించుచున్న మనస్సుతో, వనమధ్యమునందు పుష్పములు రాలిపోయిన కర్ణికారశాఖ వలె, కాంతిహీనయై కౌసల్య ఎడమభుజమునకు దగ్గరగా నిలిచి యున్నది సుమిత్ర. దేవతలతో సమానులు, వీరులు, సత్యపరాక్రమవంతులు అయిన లక్ష్మణశత్రుఘ్నులు ఇరువురు ఈ సుమిత్రాదేవి పుత్రులు.(22, 23)

కోపస్వభావము గలది, వివేకములేనిది, నేనే అందమైనదానను అను గర్వము కలది, ఐశ్వర్యమునందు కోరిక గలది, ఆర్యురాలు వలె కనబడు అనార్యురాలు, క్రూరురాలు, పాపమైన నిశ్చయము కలది అయిన ఈమెయే నా తల్లియైన కైకేయి. ఈమె మూలముననే పురుషశ్రేష్ఠులైన రామలక్ష్మణులకు మరణమువంటి అరణ్యవాసము ప్రాప్తించినది. దశరథమహారాజు పుత్రవియోగముతో బాధపడుచు స్వర్గస్థుడైనాడు. ఈమెయే నాకు వచ్చిన ఈ మహావ్యసనమునకు మూలకారణము.(24-26)

నరశ్రేష్ఠుడైన ఆ భరతుడు కండ్లు ఎఱ్ఱబారి గద్గదమైన కంఠస్వరముతో ఇట్లు పలికి పగబట్టి బుసలు కొట్టుచున్న పాము వలె నిట్టూర్పులు విడచెను.(27)

ఈ విధముగా పలుకుచున్న భరతుని మాటలు విని మహాబుద్ధిశాలియైన భరద్వాజమహర్షి మంచి అర్థము గల మాటలు చెప్పెను.(28)

"ఓ భరతా! నీవు కైకేయి విషయమున దోషమును చూడవలదు. రాముని అరణ్యగమనమువలన మున్ముందు సుఖకరమైన ఫలము లభించగలదు. రాముని అరణ్యగమనమువలన దేవతలకు, దానవులకు, పరిశుద్ధహృదయులైన ఋషులకు హితమే కలుగనున్నది." (29, 30)

భరతుడు ఆ భరద్వాజమహర్షికి ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించి ఆయన అనుజ్ఞ పొంది, ప్రయాణమునకు సన్నద్ధుడై "ప్రయాణమునకు సన్నాహము చేయబడుగాక!" అని సైన్యమును ఆజ్ఞాపించెను.(31)

పిమ్మట అనేకవిధములైన జనులు ప్రయాణముకొరకై ప్రకాశించుచున్న బంగారముతో అలంకరించిన గుఱ్ఱములు కట్టిన రథములను ఎక్కిరి. బంగారు నడుము త్రాళ్లు, పతాకలు ధరించిన ఏనుగులు, ఆడఏనుగులు ధ్వని చేయుచు వర్షాకాలమునందలి మేఘముల వలె బయలుదేరెను. అమూల్యమైన చిన్నవి, పెద్దవి అయిన అనేకవిధముల వాహనములు బయలుదేరినవి. కాలిబంట్లు కాలినడకనే వెళ్ళిరి. కౌసల్య మొదలైన స్త్రీలు, రామదర్శనము కోరుచు సంతోషించు చున్నవారై, ఉత్తమములైన వాహనము లెక్కి వెళ్ళిరి. శ్రీమంతుడైన భరతుడు, చంద్రసూర్యుల కాంతి వంటి కాంతి గల, సిద్ధముచేయబడిన, మంగళకరమైన పల్లకిని ఎక్కి పరివార సమేతుడై వెళ్ళెను. (32-36)

గజములతోను, అశ్వములతోను, రథములతోను నిండిన, ఆ మహాసేన, పైకి లేచిన మహామేఘమువలె దక్షిణదిక్కును ఆవరించుచు, మృగములు పక్షులు నిండి ఉన్న వనములను దాటి, గంగ అవతలి ఒడ్డున పర్వతముల మీదుగను, నదులమీదుగను ప్రయాణము చేసెను. ఆ సేన, మృగపక్షిసముదాయములను భయపెట్టుచు, ఆ మహావనమును ప్రవేశించుచు ప్రకాశించెను. (37-39)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొంబది రెండవ సర్గము సమాప్తము.

తొంబది మూడవ సర్గము

భరతుడు సేనాసమేతుడై చిత్రకూటమున కేగుట.

ప్రయాణముచేసి, వెళ్ళుచున్న ఆ మహాసైన్యమును చూచి, వనములోని ఆ యా మృగముల నాయకులైన మదించిన మృగములు భయపడి తమ తమ గుంపులతో పరుగెత్తినవి. పారిపోవుచున్న ఎలుగుబంట్లు, చుక్కల లేళ్ళ సముదాయములు, చుక్కలు లేని పెద్ద కొమ్ముల లేళ్లు వనపంక్తులలోను, పర్వతములమీదను, నదుల లోను అన్ని వైపుల కనబడుచుండెను. (1,2)

ధర్మాత్ముడైన ఆ భరతుడు, ధ్వనిచేయుచున్న ఆ గొప్ప చతురంగబలముతో ఉత్సాహవంతుడై బయలుదేరెను. సముద్రప్రవాహము వంటి ఆ సేన వర్షాకాలమునందు మేఘము ఆకాశమును కప్పివేసినట్లు భూమిని కప్పివేసెను. ఆ సమయమునందు మహావేగము గల గుఱ్ఱములు, ఏనుగులు అంతటను వ్యాపించి

యుండుటచేత నేల చాలసేపటివరకు కనబడలేదు.(3-5)

వాహనము లన్నియు మిక్కిలి అలసిపోవునట్లు దీర్ఘప్రయాణము చేసినవి. అపుడు భరతుడు, మంత్రులలో శ్రేష్ఠుడైన వసిష్ఠునితో ఇట్లనెను.(6)

"ఈ పరిసరములలో కనబడుదానిని, నేను విన్నదానిని బట్టి, భరద్వాజమహర్షి చెప్పిన ప్రదేశమునకు వచ్చితిమని స్పష్టముగా తెలియుచున్నది. ఈ పర్వతమే చిత్రకూటపర్వతము. ఈ నది మందాకినీనది. దూరముగా ఆ వనము నీలమేఘము వలె ప్రకాశించుచున్నది. పర్వతముల వంటి నా ఏనుగులు ఇపుడు అందమైన చిత్రకూట పర్వతపు చరియలపై నడుచుచున్నవి. ఈ పర్వతము చరియలపై ఉన్న వృక్షములు వర్షాకాలమునందు నల్లని దట్టమైన మేఘములు ఉదకమును వర్షించినట్లు పుష్పములను వర్షించుచున్నవి.(7-10)

శత్రుఘ్నా! కిన్నరుల సంచారభూమియైన ఈ పర్వతము మృగములచే అంతటను వ్యాప్తమై ఉన్నది; చూడుము. సైన్యకోలాహలముచే ప్రేరేపింపబడి, శీఘ్రముగా పరుగెత్తుతున్న ఈ మృగసముదాయములు, శరత్కాలమునందు ఆకాశమున వాయువుచే చెదరగొట్టబడిన మేఘపంక్తివలె ప్రకాశించుచున్నవి. దక్షిణదేశీయులైన మనుష్యులవలె ఈ పర్వతసానువులు, మేఘముల వంటి శిలాఫలకముల అగ్రభాగమున పరిమళించుచున్న పుష్పము లనెడు అలంకారములను ధరించియున్నవి.(11-13)

చూచుటకు భయంకరమైన ఈ వనము ఇంతవరకును అధికమైన ధ్వనులేవియు లేకుండ ఉండి ఇపుడు మన రాకచే జనులతో నిండిన అయోధ్య వలె కనబడుచున్నది. డెక్కలచే ఎగరగొట్టబడిన పరాగము అరణ్యమును కప్పివేయుచుండగా, వాయువు నాకు ప్రియమును చేయగోరుచున్నదా అన్నట్లు దానిని శీఘ్రముగా, దూరముగా ఎగురగొట్టివేయుచున్నది. శ్రేష్ఠులైన సారథులు ఎక్కి ఉన్న ఈ రథములు, గుఱ్ఱములు కట్టి శీఘ్రముగా అరణ్యములో నడుచుచున్నవి; వీటిని చూడుము.(14-16)

చూచుటకు అందముగా ఉన్న ఈ నెమళ్లు, పక్షులు భయపడి తమ తమ నివాసములకు పోవుచున్నవి. వీటిని చూడుము. ఈ ప్రదేశము చాల మనోహరముగా కనబడుచున్నది. స్వర్గమార్గము వలె ఉన్నది. ఇది తప్పక ఋషుల నివాసస్థానమే. ఈ అరణ్యములో శరీరముపై చుక్కలుగల లేళ్లు, ఆడలేళ్లతో కలిసినవై పుష్పములచేత చిత్రించబడినవి వలె మనోహరమైన రూపములతో విహరించుచున్నవి.(17-19)

సైనికులందరు అరణ్యములో ప్రవేశించి పురుషశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులు కనబడువరకు వెదకెదరుగాక!"(20)

భరతుని మాటలు విని, శూరులైన పురుషులు ఆయుధములు ధరించి ఆ అరణ్యములో ప్రవేశించిరి. అపుడు వారికి అక్కడ ధూమము కనబడెను. వారు ధూమాగ్రమును చూచి భరతునివద్దకు వచ్చి ఇట్లు పలికిరి. "మనుష్యులు లేనిచోట అగ్ని ఉండదు. రామలక్ష్మణులు తప్పక ఇక్కడనే ఉండి ఉందురు. లేదా ఇక్కడ శత్రుసంహారకులు, నరశ్రేష్ఠులు అయిన ఆ రాజపుత్రులు లేకపోయినచో రామునితో సమానులైన మునులు ఇతరులు ఎవరో ఉండవచ్చును. ఇది తథ్యము."(21-23)

ఆ భరతుడు ఆ సైనికులందరితో ఇట్లు పలికెను.(24)

"మీరందరును వినీతులై ఇక్కడనే ఉండుడు. ముందుకు వెళ్లవద్దు. నేను, సుమంత్రుడు, వసిష్ఠుడు వెళ్ళెదము."(25)

వారందరును భరతుని ఆజ్ఞ ప్రకారము అక్కడనే ఉండిపోయిరి. భరతుడు ధూమాగ్రము కనబడుచోట తన దృష్టిని నిలిపెను.(26)

భరతుడు ఆ విధముగా నిలిపివేసిన సైన్యము, తన ఎదుట నున్న ప్రదేశమును చూచుచు, తన ప్రేమపాత్రుడైన రాముని దర్శనము అచిరకాలములో జరుగనున్నదని తెలుసుకొని చాల సంతోషించెను.(27)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొంబది మూడవ సర్గము సమాప్తము.

తొంబది నాలుగవ సర్గము

శ్రీరాముడు సీతకు చిత్రకూటశోభను చూపుట.

రాముడు దేవతాసమానుడు. అతడు పర్వతములందును, అరణ్యములందును, మిక్కిలి ప్రీతికలవాడు. సీతకూడ ఆ పర్వతములను, అరణ్యములను చూచి ఆనందించవలెనను కోరికతో అతడామెకు ఆ చిత్రకూటపర్వతమును చూపించెను.(1, 2)

"సీతా! ఈ సుందరమైన పర్వతమును చూచుచుండుటచే, రాజ్యభ్రంశము గాని, స్నేహితులకు దూరమైపోవుట గాని, నా మనస్సును బాధించుటలేదు. ఈ



పర్వతము అనేకవిధములైన పక్షులతో నిండి ఉన్నది. గైరికాదిధాతువులు కల దీని శిఖరములు ఆకాశమును పొడుచుచున్నట్లున్నవి చూడుము. వివిధములైన ధాతువులతో నిండిన ఈ పర్వతప్రదేశములలో కొన్ని వెండివలెను, కొన్ని రక్తమువలెను, కొన్ని పచ్చని మంజిష్ఠవలెను, కొన్ని ఇంద్రనీలమాణిక్యముల వలెను, కొన్ని పుష్యరాగములవలెను, స్ఫటికములవలెను, మొగలిపూవులవలెను, కొన్ని నక్షత్రములవలెను, పాదరసములవలెను ప్రకాశించుచున్నవి. (3-6)

ఈ చిత్రకూటపర్వతముపై అనేకవిధములైన మృగములు, పులులు, చిరుతపులులు, భల్లూకములు, క్రూరత్వమును విడచి నివసించుచున్నవి. ఎన్నియో పక్షుల సమూహములు కూడ దీనిపై ఉన్నవి. ఈ పర్వతముపై పుష్పములతోను, ఫలములతోను నిండి అధికమైన నీడ నిచ్చు మామిడి, నేరేడు, వేగిస, లొద్దుగు, మోరటి, పనస, చంద్ర, ఊడుగు, తినిసము, మారేడు, తుమ్మికి చెట్లు, వెదుళ్ళు, గుమ్ముదు, వేప, ఉలిమిరి, ఇప్ప, బొట్టుగు, రేగి, ఉసిరి, పేము, ఏరుమద్ది, దానిమ్మచెట్లు, ఇంకను ఈ విధమైన అనేకమైన చెట్లు అంతట వ్యాపించి ఉన్నవి. వీటితో ఇది చాలా శోభాయుక్తముగా ఉన్నది. (7-10)

చూచువారికి రోమాంచము కలిగించువారు, ఉత్తమమైన మనస్సు కలవారు అయిన కిన్నరులు, పర్వతముల చరియలపై జంటజంటలుగా విహరించుచున్నారు. వీరిని చూడుము. విద్యాధరులు, వారి స్త్రీలు విహరించు మనోహరమైన ప్రదేశములను, వృక్షశాఖలకు తగిల్చిన వారి ఖడ్గములను, శ్రేష్ఠములైన వారి వస్త్రములను చూడుము. (11, 12)

ఈ పర్వతముమీద కొన్ని చోట్ల జలము ప్రవహించుచున్నది. కొన్ని చోట్ల భూమిని ఛేదించుకొని జలము పైకి వచ్చుచున్నది. అందుచే ఈ పర్వతము మదోదకము స్రవించుచున్న ఏనుగు వలె ప్రకాశించుచున్నది. గుహలలోని వాయువు

అనేకవిధములైన పుష్పముల సువాసనలను మోసికొని ఘ్రాణేంద్రియమునకు(నాసికకు) తృప్తికలుగునట్లు వీచుచున్నది. దీని వలన ఆనందము కలుగనివారెవరైనా ఉందురా!(13, 14)

సీతోను, లక్ష్మణునితోను, కలిసి, ఇక్కడ ఎన్ని సంవత్సరములు నివసించుచున్నను నన్ను శోకము పీడింపదు. అనేకములైన పుష్పములు, ఫలములు, వివిధములైన పక్షిగణములు కల, విచిత్రములైన శిఖరములు గల రమ్యమైన ఈ పర్వతమునందు నాకు చాల ప్రీతి కలుగుచున్నది.(15, 16)

ఈ వనవాసము చేయుటచే, తండ్రి ఋణమును తీర్చుట, భరతునకు సంతోషము కల్గించుట అను రెండు ఫలములు నాకు లభించినవి.(17)

నాతో కలిసి నివసించుచున్న నీవు మనోవాక్కాయములకు అనుకూలమైన వస్తువులను చూచుచు, ఈ చిత్రకూటపర్వతముమీద ఆనందముగా నుండగలుగుచున్నావా?(18)

రాజునకు మరణానంతరము ఉత్తమజన్మ లభించుటకై, ఈ వనవాసమే అమృతము వంటి దని నా ముత్తాతలైన ప్రాచీనులగు రాజర్షులు చెప్పిరి.(19)

అనేకమైన నీలము, పసుపు, తెలుపు, ఎరుపు రంగులతో, విశాలమైన వందలకొలది రాళ్లు ఈ పర్వతమునకు చుట్టుప్రక్కల ప్రకాశించుచున్నవి. పర్వతశ్రేష్ఠమైన ఈ చిత్రకూటముమీద, రాత్రులందు వేలకొలది ఓషధులు, తమ కాంతుల శోభతో ప్రకాశించుచు, అగ్నిశిఖల వలె కనబడుచున్నవి. ఈ పర్వతము మీద ఉన్న కొన్ని ప్రదేశములు గృహముల వలెను, కొన్ని ప్రదేశములు ఉద్యానవనముల వలెను, కొన్ని ప్రదేశములు ఏకశిలల వలెను, ప్రకాశించుచున్నవి. ఈ చిత్రకూటపర్వతము, భూమిని చీల్చుకొని, పైకి వచ్చినట్లు కనబడుచున్నది. ఎదుట కనబడుచున్న దాని శిఖరము, అంతటను రమణీయముగా ఉన్నది.(20-23)

కాముకులు ఇచట, కుష్ఠ-స్థగర-పున్నాగ-భూర్జవృక్షముల ఆకులను, పద్మముల రేకులను పైన పరచి, మంచి శయనములను ఏర్పరచుకొనియున్నారు. వాటిని చూడుము. అక్కడ కాముకులు నలిపి పారవేసిన పద్మములతో గుచ్చిన మాలలు, అనేకవిధములైన ఫలములు పడి ఉన్నవి; చూడుము.(24, 25)

అనేకవిధములైన దుంపలు, ఫలములు, ఉదకము గల ఈ చిత్రకూటపర్వతము అలకాపట్టణమును, సౌగంధికసరస్సును, ఉత్తరకురుదేశమును కూడ మించి

ఉన్నది. నేను నీతోను, లక్ష్మణునితోను కలసి, ఇక్కడ విహరించుచు, ఉత్తమమైన నియమములతో, సత్పురుషుల మార్గమునందు సంచరించుచు, కులమును, ధర్మమును, వృద్ధిపొందించు ఆనందమును పొందగలను.(26, 27)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొంబది నాలుగవ సర్గము సమాప్తము.

తొంబది ఐదవ సర్గము

రాముడు సీతకు గంగానది శోభను వర్ణించి చెప్పుట.

రాముడు సీతకు పర్వతశోభను చూపించిన పిదప మంగళకరమైన ఉదకముతో రమ్యమైన మందాకినీనదిని ఆమెకు చూపెను.(1)

పద్మములవంటి నేత్రములు గల రాముడు, చంద్రునివంటి అందమైన ముఖము గల వైదేహితో ఇట్లు పలికెను.(2)

"విచిత్రమైన ఇసుకతిన్నెలతో రమ్యమై, హంసలతోను, సారసపక్షులతోను పద్మములతోను, నిండి యున్న ఈ మందాకినీనదిని చూడుము. ఈ నది తీరములపై అంతటను అనేకవిధములైన పుష్పవృక్షములు, ఫలవృక్షములు ఉండుటచే ఇది కుబేరుని సౌగంధికసరస్సు వలె ప్రకాశించుచున్నది. దీని రేవులలో దిగి లేళ్ల గుంపులు ఇపుడే నీరు త్రాగుటచే నీరు కలగిపోయి ఉన్నది. సుందరమైన ఈ తీర్థములు చూచుటకు చాలా ఆనందకరముగా ఉన్నవి.(3-5)

జటలను, కృష్ణాజినమును ధరించి, నారచీరలను ఉత్తరీయముగా వేసికొన్న ఋషులు, సంధ్యాకాలాదులందు ఈ మందాకినీనదిలోనికి దిగి స్నానము చేయుచున్నారు. తీవ్రమైన వ్రతములు గల మరికొందరు మునులు చేతులు పైకెత్తి, నియమపూర్వకముగా సూర్యోపస్థానము చేయుచున్నారు.(6, 7)

అగ్రభాగములను గాలి కదల్పగా నదిచుట్టును వృక్షములు పుష్పములను, పత్రములను విడుచుచున్నవి. వీనితో ఈ పర్వతము, నాట్యము చేయుచున్నట్లున్నది. ఈ మందాకినీనదిలో కొన్ని చోట్ల మణుల వలె నిర్మలమైన ఉదకమున్నది. కొన్ని చోట్ల ఇసుక తిన్నెలు ఉన్నవి. కొన్ని చోట్ల సిద్ధులు అంతటను వ్యాపించి ఉన్నారు. చూడుము.(8, 9)

వాయువు ఎగురగొట్టుటచే, పుష్పసముదాయములు కొన్ని చోట్ల విస్తృతముగా పడుచున్నవి. మరికొన్ని పుష్పసముదాయములు జలమధ్యమునందు పడి తేలియాడుచున్నవి; చూడుము. మధురమైన ధ్వనులు గల చక్రవాకపక్షులు మంగళప్రదముగా కూయుచు, ఆ పుష్పరాశులపై ఎక్కుచున్నవి. నీవు కనబడుచు ఉండగా(ప్రక్కన ఉండగా) ఈ చిత్రకూటమును, మందాకినీనదిని చూచుట అయోధ్యాపురములో నివాసముకంటె కూడ ఆనందకరమని తలచుచున్నాను.(10-12)

తపస్సు, ఇంద్రియనిగ్రహము, శాంతి కలిగి, పాపములను తొలగించు సిద్ధులు ఎల్లపుడును ప్రవేశించి స్నానము చేయుటచే, క్షోభింపచేయబడిన జలము గల ఈ మందాకినీనదిలో, నాతో కూడ దిగి జలక్రీడ చేయుము. ఎఱ్ఱని పద్మములు, తెల్లని పద్మములు నీటిలో మునిగిపోవునట్లు చేయుచు, సఖురాలు వలె మందాకినీనదిలోనికి ప్రవేశించి, జలక్రీడలు చేయుము.(13, 14)

అడవిలోని మృగాలను పౌరులను గాను, ఈ చిత్రకూటపర్వతమును అయోధ్యనుగాను, ఈ మందాకినీనదిని సరయూనదినిగాను భావింపుము. నా అజ్ఞను పాలించుచున్న ధర్మాత్ముడైన లక్ష్మణుడు, నాకు అనుకూలురాలవై ఉన్న నీవు నాకు సంతోషమును కల్గించుచున్నారు. నీతో కలిసి నివసించుచు, త్రిషవణస్నానము చేయుచు, తేనె, దుంపలు, ఫలములు భుజించుచు ఉన్న నాకు అయోధ్యమీదగాని, రాజ్యము మీదగాని ఆసక్తి లేదు.(15-17)

రమ్యమైన ఈ మందాకినీనది లేళ్ల గుంపులతో ప్రకాశించుచున్నది. గజములు, సింహములు, వానరములు దీని ఉదకమును త్రాగుచున్నవి. ఇది చక్కగా పుష్పించిన వృక్షముల నుండి రాలిన పుష్పరాశులచే అలంకృతమై ఉన్నది. అట్టి ఈ నదిని చేరుటచే శ్రమ తొలగి సంతోషించనివాడు ఉండడు."(18)

రఘువంశమును వృద్ధిపొందించు ఆ రాముడు, మందాకినీనదిని గూర్చి ఈ విధముగా చక్కగా వర్ణించి చెప్పుచు, ప్రియురాలితో గూడి, కాటుక కాంతి వంటి కాంతి గల ఆ చిత్రకూటపర్వతముపై విహరించెను.(19)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొంబది ఐదవ సర్గము సమాప్తము.

తొంబది ఆరవ సర్గము

లక్ష్మణుడు భరతుని సేనను చూచుట. భరతునిపై తీవ్రకోపము ప్రకటించుట.

రాముడు, ఆ విధముగా మైథిలికి, ఆ మందాకినీనదిని చూపి ఆమెను అనునయించి మాంసమును తినిపించుచు, పర్వతశిఖరముపై కూర్చుండెను. రాముడు ఈ మాంసము పరిశుద్ధమైనది, ఇది రుచిగా ఉన్నది, ఇది బాగుగా కాలినది అని పలుకుచు సీతతో కూడ అక్కడ ఉండెను.(1, 2)

రాముడా విధముగా కూర్చుండి ఉండగా అచటకు భరతుడు వచ్చుచుండుటచే సేనాపరాగము, సేనాధ్వని ఆకాశమును ముట్టుచు బయల్వెడలెను. ఇంతలో మదించిన యూథనాయకులైన గజాదులు, ఆ మహాధ్వనికి భయపడి, తమ యూథములతో కలిసి అక్కడినుండి నలుదిక్కులకు పారిపోయినవి. రాముడు సైన్యమువలన కలిగిన ఆ శబ్దమును వినెను. పారిపోవుచున్న ఆ యూథనాయకులైన మృగముల నన్నింటిని కూడ చూచెను.(3-5)

పారిపోవుచున్న ఆ మృగములను చూచి, ఆ ధ్వనిని కూడ విని, రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికెను.(6)

"లక్ష్మణా! భయంకరము, మేఘగర్జితము వలె గంభీరము అయిన ధ్వని ఇక్కడ వినబడుచున్నది. ఇది ఆశ్చర్యకరముగా ఉన్నది. అది ఏమో చూడుము. అరణ్యములోని గజయూథములు, మహావనములో ఉన్న మహిషములు, లేళ్లు, సింహములు, భయపడి నలుదిక్కులకు పారిపోవుచున్నవి. ఎవరైనా రాజుగాని, రాజపుత్రుడు గాని వేటాడుటకై వచ్చినాడా? లేక ఏదైన ఒక క్రూరమృగము ఈ వనములోనికి ప్రవేశించినదా? తెలుసుకొనుము. ఈ పర్వతముపై పక్షులు కూడ సంచరించుట కష్టము. అందుచే ఈ శబ్దము ఎట్లు వచ్చినదో దానినిగూర్చి వెంటనే తెలుసుకొనుము.(7-10)

ఆ లక్ష్మణుడు శీఘ్రముగా పుష్పించిన ఒక సాలవృక్షమును ఎక్కి నలుదిక్కులు పరికించుచు, తూర్పుదిక్కువైపు చూచెను. లక్ష్మణుడు ఉత్తరము వైపు చూచుచు, అటుప్రక్క రథములతోను, అశ్వములతోను, గజములతోను, కిక్కిరిసి ఉన్న సన్నద్ధులైన కాలిబంట్లతో నిండిన గొప్ప సేనను చూచెను. అశ్వములతోను, గజములతోను నిండి రథములపై కట్టిన ధ్వజములతో ప్రకాశించుచున్న సేన

వచ్చుచున్న దని రామునకు తెలిపి మరల ఇట్లనెను.(11-13)

"నీవు అగ్నిని చల్లార్చి సీతను పర్వతగుహలోనికి పంపివేసి, ధనుస్సునకు నారి కట్టుము. కవచము ధరించి బాణములను సిద్ధము చేయుము."(14)

రాముడు "ఓ! లక్ష్మణా! సరిగా చూడుము; ఈ సేన ఎవరిది అని అనుకొనుచున్నావు?" అని లక్ష్మణునితో పలికెను.(15)

మిక్కిలి కోపించి, ఆ సైన్యమును, అగ్ని కాల్చివేసినట్లు కాల్చివేయదలచుచున్నాడా అన్నట్లున్న లక్ష్మణుడు రాముని మాటలు విని ఇట్లు పలికెను.(16)

"కైకేయి కుమారుడైన భరతుడు రాజ్యాభిషిక్తుడై రాజ్యమును నిష్కంటకము చేయవలె నను కోరికతో మనలను ఇద్దరిని చంపుటకు వచ్చుచున్నాడు. ఇదిగో ఆ రథము మీద చాల గొప్పదీ, కాంతిగలదీ, విశాలమైన ద్రానుగలదీ అయిన కోవిదారవృక్షము చిహ్నముగా గల ధ్వజము ప్రకాశించుచున్నది. ఈ మహాసైన్యములో రథముపై నున్న ధ్వజమునందు చిత్రింపబడి, విశాలమైన ద్రాను, కొమ్మలు గల కోవిదారవృక్షము ప్రకాశించుచున్నది.(17-19)

ఈ ఆశ్వికులు యథేచ్ఛగా శీఘ్రముగా నడుచు అశ్వములను ఎక్కి ఈ ధ్వజమును అనుసరించి వచ్చుచున్నారు. గజారోహకులైన యోధులు గజముల నెక్కి, సంతోషముతో ప్రకాశించుచున్నారు. మన మిద్దరము ధనుస్సులు ధరించి పర్వతముపై ఎక్కెదము; లేదా కవచములు కట్టుకొని ఆయుధములు ధరించి ఇక్కడనే ఉండెదము. ఈ కోవిదారధ్వజము యుద్ధములో మనకు స్వాధీనమగునా! నీకును, సీతకును, నాకును దుఃఖము కలుగుటకు మూలకారణమైన భరతుని చూడగలుగుదునా!(20-22)

నీవు రాజ్యభ్రష్టుడవు అగుటకు కారణమైన శత్రువు భరతుడు వచ్చియున్నాడు. అతడు నాకు వధ్యుడే. భరతుని చంపుటలో నాకు దోష మేమియు కనబడుట లేదు. పూర్వము అపకారము చేసినవానిని చంపినవానికి అధర్మమేమియు కలగదు. భరతుడు నీకు ముందుగా అపకారము చేసియున్నాడు. ధర్మమును త్యజించినాడు. ఈతనిని వధించిన పిమ్మట భూమి నంతను పరిపాలింపుము. (23-25)

రాజ్యమునందు కోరిక గల కైకేయి ఈనాడు నాచే యుద్ధమునందు చంపబడి, ఏనుగు విరుగగొట్టిన వృక్షము వలె పడి ఉన్న పుత్రుని చూచి దుఃఖించుగాక.

బంధుపరివారాదులతో కూడిన కైకేయినికూడ చంపెదను. భూమిపై నున్న పాపము నేటితో తొలగిపోవుగాక! మనకు జరిగిన అవమానమును, అణచి ఉంచిన కోపమును, నేడు శత్రుసైన్యములపై, అగ్నిని డొంకలలో విడిచినట్లు విడచెదను. తీక్ష్ణమైన బాణములచే, శత్రువుల శరీరములను ఛేదించి ఈ చిత్రకూటారణ్యమును రక్తముచే తడిపెదను. (26-29)

నా బాణములచే, హృదయము చీల్చబడి పడిఉన్న ఏనుగులను, గుఱ్ఱములను నాచేత చంపబడిన మనుష్యులను క్రూరమృగములు ఈడ్చుకొని పోవుగాక. ఈ మహారణ్యములో, భరతుని, అతని సైన్యమును చంపి, నేను నా ధనుర్బాణముల ఋణమును తీర్చుకొనెదను. సంశయము లేదు." (30, 31)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొంబది ఆరవ సర్గము సమాప్తము.

తొంబది ఏడవ సర్గము

రాముడు లక్ష్మణుని శాంతపరచుట.

అటు పిమ్మట రాముడు, ఈ విధముగా మిక్కిలి కోపించి తొందరపడుచున్న లక్ష్మణుని శాంతింపచేయుచు ఇట్లు పలికెను. (1)

"భరతుడు స్వయముగా వచ్చుచున్నపుడు, మనకు ధనుస్సుతోగాని, కత్తితో గాని, డాలుతో గాని, ఏమి పని ఉన్నది? ఓ లక్ష్మణా! తండ్రి వాక్యము సత్యము చేసెదనని ప్రతిజ్ఞ చేసిన నేను, నన్ను చూడవచ్చిన భరతుని చంపి, అపకీర్తితో కూడ సంపాదించిన ఈ రాజ్యముతో ఏమి చేసెదను? బంధువులకు గాని, మిత్రులకు గాని నాశము కలుగుటచే లభించిన ద్రవ్యమును విషముతో వండిన పిండివంటలను వలె నేను ముట్టుకొనను. (2-4)

ధర్మార్థకామములను, ఈ రాజ్యమును కూడ మీ నిమిత్తమే కోరుచున్నాను కాని, నా కొరకు కాదు. ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను. నేను రాజ్యము నైనను కోరుచున్నానన్నచో అది సోదరులైన మిమ్ములను కూడగట్టుకొనుటకు, మీ సుఖముకొరకు మాత్రమే. అయుధములు స్పృశించి శపథము చేయుచున్నాను. నేను తలచుకొన్నచో సముద్రపర్యంతమైన ఈ భూమిపై అధిపత్యము నాకు లభించనిది

కాదు. కాని, అధర్మముచే వచ్చిన ఇంద్రపదవి కూడ నాకు ఇష్టము కాదు.(5-7)

గౌరవమును సంరక్షించు ఓ లక్ష్మణా! భరతుడు, నీవు, శత్రుఘ్నుడు, అనుభవించని ఏమాత్రము సుఖము నాకు కలిగినను దానిని అగ్ని భస్మముచేయుగాక!(8)

భరతుడు సోదరులయందు ప్రేమకలవాడు. నాకు ప్రాణములకంటే ప్రియుడు. అతడు కేకయదేశమునుండి అయోధ్యకు తిరిగి వచ్చియుండును. నేను జటావల్కలములు ధరించి నీతోను, జానకితోను అరణ్యమునకు పంపివేయబడినట్లు తెలిసికొనియుండును. అది విని అతడి ఇంద్రియములు శోకముతో వ్యాకులమైయుండును. మన వంశములో రాజుయొక్క జ్యేష్ఠపుత్రుడే రాజు కావలెను అను ధర్మమును తెలిసినవాడు అగుటచే మనలను చూచుటకు వచ్చినాడు. వేరొక కారణమువలన కాదని తలచుచున్నాను.(9-11)

భరతుడు తన తల్లి కైకేయిపై కోపించి ఆమెను పరుషములైన అప్రియవాక్యములతో దూషించి, తండ్రిగారిని అనుగ్రహింపచేసుకొని, నాకు రాజ్యమును ఇచ్చుటకై వచ్చినాడు. భరతుడు మనలను చూచుటకై వచ్చుటకు ఇది తగిన సమయమే. ఇతడు మన విషయమున ఏమాత్రము అప్రియము చేయుటకు, మనస్సులో కూడ ఆలోచింపజాలడు. నీకు పూర్వ మెన్నడైన భరతుడు ఏదైన అపకారము చేసి యున్నాడా? లేదా ఇట్టి భయమును కలిగించినాడా! నీవు భరతుని గూర్చి ఇపుడు ఇట్లు ఎందువలన శంకించుచున్నావు?(12-14)

నీవు భరతుని విషయమున పరుషములు, అప్రియములు అయిన మాటలు చెప్పరాదు. భరతుని గూర్చి అప్రియవాక్యములు పలికినచో ఆ వాక్యములు నన్ను గూర్చియే పలికినట్లగును. భరతుని దూషించినచో నన్నే దూషించినట్లగును. ఎంతటి ఆపదయందైనను పుత్రులు తండ్రిని చంపుదురా! సోదరుడు తన ప్రాణసమానుడైన సోదరుని చంపునా!(15, 16)

నీవు రాజ్యముకొరకై ఇట్లు మాటలాడుచున్నావేమో! అట్లైనచో "రాజ్యమును లక్ష్మణునకు ఇమ్ము" అని భరతునితో చెప్పెదను. "రాజ్యమును ఇతనికి ఇమ్ము" అని నేను చెప్పగానే భరతుడు కూడ తప్పక అట్లే చేసెదను" అని పలకగలడు."(17,18)

సోదరుడైన రాముని హితమునందే ఆసక్తి గల ఆ లక్ష్మణుడు, ధర్మశీలుడైన

రాముని మాటలు విని సిగ్గుతో తన శరీరములో క్రుంగిపోయినట్లయ్యెను. అతడు సిగ్గుపడి ఇట్లనెను. "మన తండ్రిగారైన దశరథమహారాజు నిన్ను చూచుటకై స్వయముగా వచ్చుచున్నారని తలచెదను."(19, 20)

లక్ష్మణుడు సిగ్గుపడినట్లు తెలుసుకొని, రాముడిట్లు పలికెను. "మహాబాహువైన దశరథమహారాజు మనలను అందరిని చూచుటకు ఇక్కడికి వచ్చినాడని తలచెదను. లేదా వనవాసములోని కష్టములను గ్రహించి, మన మిద్దరము సుఖమునకు అలవాటుపడిన వారము అను విషయమును కూడ తెలిసికొని, తప్పక మనలను మరల ఇంటికి తీసుకొనిపోగలడు అని తలచెదను. శ్రీమంతుడైన మన తండ్రి దశరథమహారాజు, మిక్కిలి సుఖమునకు అలవాటుపడిన ఈ సీతనైనను వనము నుండి తీసుకొనివెళ్లును. ఇవిగో ఉత్తమజాతియందు పుట్టినవీ, అందమైనవీ, వాయువేగముతో సమానమైన వేగము కలవీ అయిన, ఈ ప్రసిద్ధమైన ఉత్తమాశ్వములు రెండూ సైన్యముముందు ప్రకాశించుచున్నవి.(21-24)

మన తండ్రిగారి పెద్ద శరీరము గల శత్రుంజయ మను గజము ఇదిగో సేనాముఖమునందు కదలుచు వచ్చుచున్నది. జనులందరు గౌరవించు, శ్రేష్ఠమైన మన తండ్రిగారి ఆ శ్వేతఛత్రము మాత్రము ఎందుచేతనో ఈ ఏనుగుపై కనబడుటలేదు. నాకు ఈ విషయమున సంశయము కల్గుచున్నది. నీవు వృక్షాగ్రమునుండి దిగుము. నేను చెప్పినట్లు చేయుము." అని ధర్మాత్ముడైన రాముడు లక్ష్మణునితో చెప్పెను.(25-27)

లక్ష్మణుడు సాలవృక్షాగ్రమునుండి దిగి, అంజలి ఘటించి రాముని ప్రక్కనే నిలబడెను.(28)

"రాముని ఆశ్రమమునకు సమ్మర్దము కలుగకూడదు" అని భరతుడు ఆజ్ఞాపించుటచే ఆ సైన్యము పర్వతము చుట్టును విడిసెను. ఏనుగులతోను, గుఱ్ఱములతోను, రథములతోను నిండిన భరతుని సైన్యము పర్వతము చుట్టును, ఒకటిన్నర యోజనములు దూరము ఆవరించి విడిసెను. ధర్మమును పురస్కరించుకొని, దర్పమును విడచి, శ్రీరాముని అనుగ్రహింప చేసుకొనుటకై నీతిమంతుడైన భరతుడు తీసుకొనివచ్చిన ఆ సేన చిత్రకూటపర్వత ప్రాంతమునందు ప్రకాశించుచుండెను.(29-31)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొంబది ఏడవ సర్గము సమాప్తము.

తొంబది యెనిమిదవ సర్గము

భరతుడు రాముని ఆశ్రమమును దర్శించుట.

భరతుడు, సేనను నిలిపి రాముని వద్దకు నడచియే వెళ్లవలె నని నిశ్చయించెను. సైన్యమును తగు స్థానములందు నిలిపిన పిమ్మట భరతుడు శత్రుఘ్నునితో ఇట్లు పలికెను. (1, 2)

"శత్రుఘ్నా! నీవు నరసముదాయములతోను, ఒక్కచోట కూడిన ఆటవికులతోను కలిసి వెంటనే ఈ అరణ్యము నంతను వెదకుము. గుహుడు శరచాపఖడ్గములు ధరించిన వేయిమంది బంధువులతో కూడినవాడై స్వయముగా ఈ వనములో రామలక్ష్మణులను వెదకుగాక! నేను స్వయముగా అమాత్యులతోను, పౌరులతోను, గురువులతోను, బ్రాహ్మణులతోను కలిసి ఈ వనము నంతను కాలినడకతో తిరిగెదను. (3–5)

రాముని, మహాబలశాలి యైన లక్ష్మణుని, మహాభాగ్యవంతురాలైన సీతను, చూడనంతవరకు నాకు దుఃఖశాంతి కలుగదు. చంద్రసమానము, పద్మపత్రముల వంటి నేత్రములు కలది, అయిన అన్నగారి మంగళకరమైన ముఖమును చూడనంతవరకు నాకు మనఃశాంతి కలుగదు. రాజచిహ్నములతో కూడిన నా అన్నగారి పాదములను శిరస్సుమీద ధరించనంతవరకు నాకు మనఃశాంతి కలుగదు. (6–8)

రాజ్యమునకు తగిన ఆ రాముడు, రాజ్యాభిషేకజలములచే తడిసి పితృపితామహాక్రమమున వచ్చుచున్న రాజ్యమును పొందనంతవరకు, నాకు మనః శాంతి కలుగదు. స్వచ్ఛమైన చంద్రునితో సమానము, పద్మములవంటి నేత్రములు కలది, గొప్ప కాంతితో ప్రకాశించుచున్నది అయిన రాముని ముఖమును సర్వదా చూడకలిగిన లక్ష్మణుడు కృతార్థుడు కదా! సముద్రమువరకు వ్యాపించిన ఈ భూమి కంతకును ప్రభువైన ఆ రాముని అనుసరించి వెళ్ళిన మహాభాగ్యవంతురాలైన సీత చాల కృతార్థురాలు. కుబేరుడు నందనవనములో నివసించు నట్లు రాముడు హిమవత్పర్వముతో సమానమైన ఈ చిత్రకూటపర్వతముపై నివసించుచున్నాడు. అందుచే ఈ పర్వతము చాల భాగ్యశాలి. (9–12)

క్రూరమృగములతో నిండి, ప్రవేశింప శక్యము గాని ఈ వనము కూడ ఎంతో పుణ్యము చేసుకొన్నది. ఎందుచేత ననగా మహాతేజశ్శాలి, శస్త్రధారులలో శ్రేష్ఠుడు

అయిన రాముడు, దీనిలో నివసించుచున్నాడు."(13)

భరతుడు ఈ విధముగా పలుకుచు, కాలినడకనే ఆ మహావనములోనికి ప్రవేశించెను. అతడు పర్వతము చరియల మీద పెరిగిన వృక్షముల సముదాయముల నడుమ నడచుచు వెళ్ళెను.(14, 15)

అతడు చిత్రకూటపర్వతముపై ఉన్న పుష్పించిన ఒక సాలవృక్షమును సమీపించి, రాముని ఆశ్రమమునుండి పైకి ఎగురుచున్న పొగను చూచెను. ఆ భరతుడు, ఆ ధూమమును చూడగానే రాముడు ఇక్కడనే ఉన్నాడని తెలుసుకొని, నది అవతలి ఒడ్డున చేరిన ఈతగాడు వలె చాలా సంతోషించెను. మహాత్ముడైన ఆ భరతుడు, ఆ చిత్రకూటపర్వతముపై పుణ్యాత్ములతో నిండిన రాముని ఆశ్రమమును చూచి, సేనను దూరముగనే ఉండమని నియమించి, గుహునితో కూడ మరల తొందరగా నడుచుచు వెళ్లెను.(16-18)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొంబది ఎనిమిదవ సర్గము సమాప్తము.

తొంబది తొమ్మిదవ సర్గము

భరతుడు శత్రుఘ్నాదులతో రామాశ్రమమునకు పోవుట. రాముడు వారిని కలిసికొని గాఢాలింగన మొనర్చుట.

సేనను అట్లు నిలిపి, భరతుడు సోదరుని చూడవలెనను ఆత్రముతో శత్రుఘ్నునకు ఆ యా చిహ్నములను చూపుచు శీఘ్రముగా వెళ్ళెను. పెద్దలయందు అధికప్రేమ గల ఆ భరతుడు, 'నా తల్లులను శీఘ్రముగా తీసుకొని రమ్ము' అని వసిష్ఠమహర్షిని ఆదేశించి, తాను ముందుగా తొందరగా వెళ్ళెను. సుమంత్రుడు శత్రుఘ్నుని వెనువెంటనే వెళ్ళెను. రాముని చూడవలెనను అభిలాష భరతునకు ఎంత ఉండెనో అతనికికూడ అంతే ఉండెను. భరతుడు నడచి వెళ్లుచుండగనే అతనికి తాపసాశ్రమములో సోదరుని ఒక పెద్ద పర్ణశాల, ఒక చిన్న పర్ణశాల కనబడెను.(1-4)

ఆ పర్ణశాల ముందు విరిచి పడవేసిన కట్టెలు, కోసిన పుష్పములు కూడ భరతునకు కనబడెను. ఆశ్రమములో నున్న రామలక్ష్మణులు పర్ణశాలమార్గము తెలియుటకై అక్కడక్కడ, చెట్లపై గుర్తుగా కట్టుకొనిన దర్భలను, నారచీరలను కూడ

భరతుడు చూచెను. చలికాలములో ఉపయోగించుకొనుటకై ఆ వనములో వారు, లేళ్ళ పేడతోను, మహిషముల పేడతోను చేసుకొనిన పిడకల ప్రోగులను కూడ అతడు చూచెను. ఆ భరతుడు అవి అన్నియు చూచి, సంతోషించి నడచి వెళ్ళుచునే, శత్రుఘ్నునితోను, తన చుట్టూ ఉన్న మంత్రులతోను ఇట్లు పలికెను.(5-8)

“భరద్వాజుడు చెప్పిన ప్రదేశమునకు వచ్చినాము. మందాకినీనది ఇక్కడికి దగ్గరగనే ఉన్నదని తలచెదను. ఇక్కడ నారచీరలు ఎత్తైన ప్రదేశములలో కట్టబడి ఉన్నవి. అకాలమునందు ఆశ్రమమునుండి బయటకు వెళ్ళి తిరిగి వచ్చునపుడు గుర్తుగా ఉండుటకు లక్ష్మణుడు ఈ మార్గమున ఇట్లు చేసి యుండును. పెద్దపెద్ద దంతములు కలవీ, గొప్ప బలము కలవీ అయిన ఏనుగులు ఒకదానిని చూచి ఒకటి గర్జించుచు ఇక్కడ శైలము ప్రక్కన సంచరించుచున్నవి.(9-11)

అరణ్యములో నివసించు మునులు ఎల్లపుడు సంరక్షించుకొనుటకై కోరుకొనుచుండు అగ్నినుండి బయల్వెడలిన దట్టమైన ధూమము, ఇదిగో, ఇక్కడ కనబడుచున్నది. పురుషశ్రేష్ఠుడు, గురువులను సత్కరించువాడు, పూజ్యుడు, మహర్షిసదృశుడు అయిన రాముని నేను ఇక్కడ సంతోషపూర్వకముగా చూడగలను.”(12, 13)

ఆ భరతుడు చిత్రకూటపర్వతము వైపు కొంచెము సేపు మాత్రమే నడచి, మందాకినీనదిని చేరి అమాత్యాదులతో ఇట్లు పలికెను.(14)

జనులకు ప్రభువు, పురుషశ్రేష్ఠుడు అయిన రాముడు ఈ నిర్జనవనములో వీరాసనము వేసుకొని నేలపై కూర్చుని యున్నాడు. ఛీ! నా జన్మము జీవితము ఎందుకు? రాముడు నా మూలమున కష్టములకు లోనై భోగము లన్నియు విడిచి, అరణ్యములో నివసించుచున్నాడు. ఈ విధముగా లోకులచే నిందింపబడుచున్న నేను ఈనాడు, సీతా రామలక్ష్మణుల పాదములపై పడి వారిని అనుగ్రహింపచేసుకొనెదను.(15-17)

భరతుడు ఈ విధముగా విలపించుచు, ఆ వనములో, పవిత్రము సుందరము అయిన, చక్కని పర్ణశాలను చూచెను. యజ్ఞములో వేదిక మెత్తని కుశలచే కప్పబడి నట్లు విశాలమైన ఆ పర్ణశాల, సాల-తాళ-అశ్వకర్ణవృక్షముల అనేకపర్ణములచే, కప్పబడియుండెను. మహాకార్యమును సాధించునవి, బంగారము పూసిన వెనుక భాగములు కలవీ, గొప్ప సారము కలవీ, శత్రువులను బాధించునవీ, వజ్రాయుధముతో సమానములూ అయిన ధనస్సులు ఆ పర్ణశాలలో ఉండెను. ప్రకాశించుచున్న అగ్రభాగములు గలవీ, సూర్యకిరణములతో సమానములూ, భయంకరములూ



అయిన అంబులపొదులలో నున్న బాణములతో ఆ పర్ణశాల సర్పములతో భోగవతివలె ప్రకాశించుచుండెను. (భోగవతి పాతాళములోని నగరము). బంగారపు ఒరలలో ఉన్న రెండు ఖడ్గములు, బంగారపు చుక్కలతో చిత్రవర్ణములైన రెండు డాలులూ, బంగారముచే అలంకరింపబడినవీ, గోడలకు వ్రేలాడతీయబడినవీ, చిత్రవర్ణములూ అయిన అంగుళీకవచములూ, ఆ పర్ణశాలను ప్రకాశింపచేయుచుండెను. అది మృగములచే ఎదిరింప శక్యము గాని సింహనివాసగుహ వలె శత్రుసంఘములచే ఎదిరింప శక్యముగానిదై, ఉండెను. (18-23)

భరతుడు ఆ రాముని గృహమునందు ఈశాన్యమువైపున పల్లముగా నున్నదీ, విశాలమైనదీ మండుచున్న అగ్ని కలదీ, పవిత్రమూ అయిన వేదిని చూచెను. క్షణకాలము పరిశీలించి ఆ పర్ణశాలలో జటామండలధారియై కూర్చొని ఉన్న అన్నగారైన రాముని చూచెను. (24, 25)

ఆ రాముడు కృష్ణాజినమును, నారచీరలను ధరించెను. అతని చుట్టును అగ్నికాంతివంటి కాంతి వ్యాపించి యుండెను. సింహము వంటి మూపుతో దీర్ఘమైన బాహువులతో పద్మముల వంటి నేత్రములతో ఒప్పుచుండెను. సముద్రపర్యంతమైన భూమికి అధిపతియైన ఆ రాముడు ధర్మము నాచరించుచు శాశ్వతుడైన బ్రహ్మదేవుని వలె, సీతాలక్ష్మణులు పార్శ్వముల నుండి సేవింపగా, దర్భలు పరచిన నేలపై కూర్చొనియుండెను. భరతుడు అట్టి రాముని చూచెను. (26-28)

ఆ భరతుడు, రాముని చూచి దుఃఖముతోను, మనస్తాపముతోను అతని వైపు పరుగెత్తెను. దుఃఖపీడితుడై, విలపించెను. దుఃఖమును అణచుకొనుటకు తగిన ధైర్యము లేక ఇట్లు పలికెను.(29, 30)

'సభలో అమాత్యులు మొదలగు ప్రకృతులు చుట్టును కూర్చుండి సేవింపవలసిన మా అన్నగారు, అరణ్యమృగములు చుట్టును కూర్చుని ఉండగా ఇక్కడ ఉన్నాడు. పూర్వము వేలకొలది వస్త్రములకు అలవాటుపడి ఉండిన మహాత్ముడు ఇపుడు ధర్మాచరణము చేయుచు, రెండు మృగాజినములు ధరించి యున్నాడు. ఆ కాలమునందు, చిత్రవర్ణము లైన అనేకవిధముల పుష్పములను ధరించిన రాముడు, ఈనాడు జటాభారమును ఎట్లు ధరించుచున్నాడో! శాస్త్రోక్తము లైన యజ్ఞములను ఆచరించి ధర్మసంపాదనము చేయవలసిన రాముడు, శరీరమును కష్టపెట్టుట ద్వారా కలుగు ధర్మమును ఆచరించుచున్నాడు.(31-34)

అమూల్యమైన చందనము పూసుకొనదగిన మా అన్నగారి శరీరము ఇపుడు మురికి పట్టి ఉన్నది కదా! సుఖమునకు అలవాటు పడిన రాముడు, నా మూలమున ఈ విధముగా కష్టపడుచున్నాడు. ఛీ! లోకులచే నిందింపబడుచున్న క్రూరుడనైన నా జీవితము ఎందుకు?(35, 36)

భరతుడు దీనుడై, ముఖపద్మమునుండి చెమటలు కారుచుండగా, ఈ విధముగా విలపించుచు, రాముని పాదములు చేతులకు అందకుండగనే ఏడ్చుచు నేలపై పడెను. భరతుడు దుఃఖపీడితుడై, "అర్యా! అని ఒక్కసారి దీనముగా పలికి, పిదప ఏమియు మాటలాడలేక పోయెను. రాముని చూచి, బాష్పము కంఠమును అడ్డుకొనుచుండగా, "ఓ ఆర్యా!" అని మాత్రమే అరచి, ఇంక ఏమియు మాటలాడక పోయెను.(37-39)

శత్రుఘ్నుడు కూడ ఏడ్చుచు, రాముని పాదములకు నమస్కరించెను. రాముడు వారిద్దరిని కౌగిలించుకొని కన్నీళ్లు కార్చెను. పిమ్మట ఆ రామలక్ష్మణులు అరణ్యములో సూర్యచంద్రులు ఆకాశమునందు శుక్రబృహస్పతులతో కలసి నట్లు సుమంత్రునితోను, గుహునితోను కలిసిరి. అరణ్యములో నివసించు ఋషులు మొదలగువారందరు, ఆ మహారణ్యములో కలిసిన మహాగజసమానులైన ఆ రాజకుమారులను చూచి, దుఃఖముతో కన్నీళ్ళు కార్చిరి.(40-42)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని తొంబది తొమ్మిదవ సర్గము సమాప్తము.

నూరవ సర్గము

రాముడు కుశలమడుగుట అను వ్యాజముతో భరతునకు రాజనీతి నుపదేశించుట.

భరతుడు అంజలి ఘటించి నేలపై బడియుండగా రాముడు చూచెను. ముఖము రంగు మారిపోయి, కృశించి యున్న సోదరుడైన భరతుని రాముడు బాహువును పట్టుకొని లేవదీసెను. రాముడు భరతుని కౌగిలించుకొని, అతని శిరస్సు వాసన చూచి,(ముద్దిడుకొని) ఒడిలో కూర్చుండబెట్టుకొని, సావధానచిత్తుడై ఇట్లు ప్రశ్నించెను.(1-3)

"నాయనా! నీ విపుడు, అరణ్యమునకు వచ్చినావే. నీ తండ్రి, దశరథమహారాజు, ఎక్కడికి వెళ్ళినాడు? ఆయన జీవించియుండగా నీవు అరణ్యమునకు రాజాలవు కదా? చాలకాలము తరువాత భరతుని చూడగలుగుచున్నాను. సంతోషము. నాయనా! నీవు కృశించి గుర్తుపట్టలేనట్లు ఉన్నావు. చాల దూరము నుండి శ్రమపడి వచ్చినావు. ఈ అరణ్యమునకు ఎందుకు వచ్చినావు? నాయనా! నీవు ఇక్కడకు వచ్చితివే! దశరథమహారాజు జీవించి ఉన్నాడు కదా? ఆయన దుఃఖాక్రాంతుడై, పరలోకమునకు వెళ్లలేదు కదా?(4-6)

నీవు చిన్నవాడవగుటచే, శాశ్వతమైన రాజ్యమును కోల్పోలేదు కదా? సత్యపరాక్రముడైన తండ్రికి శుశ్రూష చేయుచున్నావు కదా? దశరథమహారాజు కుశలముగా ఉన్నాడు కదా?(7-8)

వేదవేత్త, విద్వాంసుడు, ధర్మనిరతుడు, మహాకాంతిశాలీ యైన, ఆ ఇక్ష్వాకువంశపురోహితుడైన వసిష్ఠుని వెనుకటి వలె పూజించుచున్నావు కదా? కౌసల్య, మంచి సంతానము గల సుమిత్ర సుఖముగా ఉన్నారు కదా? పూజ్యురాలూ, రాణీ అయిన కైకేయి సంతోషముగా ఉన్నది కదా? వినయసంపన్నుడు, ఉత్తమకులమునందు పుట్టినవాడు, అధికమైన శాస్త్రజ్ఞానము కలవాడు, అసూయలేనివాడు, కర్తవ్యవిషయములను బోధించువాడు అయిన పురోహితుని(వసిష్ఠుని కుమారుడైన సుయజ్ఞుని) సత్కరించుచున్నావు కదా!(9-11)

శాస్త్రవిధి తెలిసినవాడూ, బుద్ధిమంతుడూ, కపటము ఎరుగనివాడూ అయిన పురోహితుడు నీ అగ్నుల విషయమున శ్రద్ధకలవాడై, ఎప్పుడు ఏ హోమములు

జరిగెనో, ఎప్పుడు ఏ హోమములు జరుగవలెనో నీకు ఎల్లపుడు చెప్పుచున్నాడు కదా! నీవు దేవతలను, తల్లులను, తండ్రులను, గురువులను, తండ్రితో సమానులైన బంధువులను, వృద్ధులను, వైద్యులను, బ్రాహ్మణులను గౌరవించుచున్నావు కదా! (12,13)

శ్రేష్ఠములైన బాణములు, అస్త్రములు కలవాడు, రాజనీతిశాస్త్రములో నిష్ణాతుడు, ఉపాధ్యాయుడు అయిన సుధన్వుని గౌరవించుచున్నావు కదా!(14)

నీవు, నీతో సమానులు, శూరులు, విద్యావంతులు, జితేంద్రియులు, ఉత్తమకులమునందు పుట్టినవారు, మనస్సులోని భావములను తెలుసుకొనగలిగినవారు అయినవారినే మంత్రులుగా నియమించినావు కదా? శాస్త్రపండితులు, ఆలోచనలను తమలోనే ఉంచుకొనగలవారు అయిన అమాత్యులు రహస్యముగా ఉంచిన ఆలోచనలవలననే రాజులకు విజయము లభించును కదా?(15, 16)

నీవు నిద్రకు వశుడవు అగుటలేదు కదా? తగు కాలమునందు మేల్కొనుచున్నావు కదా? వివిధకార్యముల సామర్థ్యమును గూర్చి తెల్లవారుజామునందు ఆలోచించుచున్నావు కదా? నీవు ఒక్కడవే ఆలోచించుటలేదు కదా! చాల మందితో ఆలోచించుటలేదు కదా? నీ ఆలోచన రాజ్యములోని వారి కందరికిని తెలిసిపోవుటలేదు కదా. స్వల్పమైన ప్రయత్నములతో ఎక్కువ ఫలమును సాధింపకల్గిన కార్యమును నిశ్చయించి ఆలస్యము చేయకుండగ వెంటనే దానిని ప్రారంభించుచున్నావు కదా.(17-19)

ఇతర రాజులు, నీవు చక్కగా పూర్తి చేసిన పనులను, లేదా చాలవరకు పూర్తిచేసిన పనులను మాత్రమే తెలుసుకొనుచున్నారుకదా? నీవు మున్ముందు చేయదలపెట్టిన పనులు వారికి తెలియుటలేదు కదా! ఇతరు లెవ్వరును, ఊహలచేత గాని, యుక్తిచేత గాని, ఇతరోపాయములచేత గాని, నీ ఆలోచనలను, నీ మంత్రులు చేసిన ఆలోచనలను తెలిసికొనుటలేదుకదా?(20, 21)

వేయిమంది మూర్ఖులను విడచి యైనను ఒక్క పండితుని చేరదీయుటకు ప్రయత్నించుచున్నావు కదా! ఎందుచేతననగా కార్య సంకటములు ఏర్పడినపుడు పండితుడు గొప్ప సాహాయ్యమును చేయగలడు. రాజు మూర్ఖులను వేలకొలది, లేదా అయుతములకొలది చేరదీసినను, వారు ఎట్టి సాహాయ్యము చేయజాలరు. మేధాశాలి, శూరుడు, సమర్థుడు, పండితుడు అయిన మంత్రి ఒక్కడున్నను,

రాజునకు లేదా చిన్న ప్రభువునకు గొప్ప అభివృద్ధి కలుగునట్లు చేయును.(22-24)

నీవు అధిక మైన సామర్థ్యము గల సేవకులను ఉత్తమకార్యములు చేయుటకు, సామాన్య మైన సామర్థ్యము కలవారిని సామాన్య మైన పనులు చేయుటకు, చాలా తక్కువ సామర్థ్యము కలవారిని అధమమైన కార్యములు చేయుటకు నియోగించినావు కదా? రహస్యమైన పరీక్షలకు నిలిచినవారు, పితృపితామహక్రమమున వచ్చుచున్నవారు, పరిశుద్ధమైన నడవడిక కలవారు, శ్రేష్ఠులు అయిన అమాత్యులను శ్రేష్ఠమైన పనులు చేయుటకు వినియోగించుచున్నావు కదా!(25, 26)

భరతా! నీ రాజ్యములోని ప్రజలందరు, తీక్ష్ణము లైన దండనములచే భయపడిపోవుచుండగా నీ మంత్రులు ఊరక చూచుచుందరు కదా? సదాచారసంపన్ను లైన ఋత్విక్కులు భయంకర మైన దుర్దానములు ప్రతిగ్రహించు పతితుని అవమానించినట్లును, స్త్రీలు కాముకుని అనుమానించినట్లును మంత్రులు నిన్ను అవమానించుటలేదు కదా?(27, 28)

విద్యావంతుడైన శూరుడెవడైన సామాద్యుపాయములందు నేర్పరియై అధికారవాంఛతో రాజు ఆంతరంగిక సేవకులలో భేదము కలిగించుటకు ప్రయత్నించినచో రాజు అట్టివానిని వధించవలెను. అట్లు చేయనిచో ఆ రాజే నశించును.(29)

తృప్తికలవాడు, శూరుడు, బుద్ధిమంతుడు, ధైర్యవంతుడు, నిజాయితీ కలవాడు, ఉత్తమకులసంజాతుడు, రాజభక్తి కలవాడు, సమర్థుడు అయినవానిని సేనాపతిగా చేసినావుకదా? బలవంతులు, యుద్ధములో నేర్పు గలవారు, పూర్వమెన్నియో ఘనకార్యములు సాధించినవారు, శూరులు అయిన వీరులను సత్కరించి గౌరవించుచున్నావు కదా! సైన్యమునకు ఇవ్వదగిన ఆహారమును, యథోచితమైన జీతమును ఆలస్యము చేయకుండగ తగు సమయములలో ఇచ్చుచున్నావు కదా! ఆహారము, వేతనము, అందవలసిన కాలములో అందకపోయినచో భృత్యులు రాజు విషయమున కోపించి అతనికి విరుద్ధముగా ప్రవర్తించెదరు. దీనివలన గొప్ప అనర్థము కలుగును.(30-33)

ప్రజలందరును, ప్రధానముగ ఉత్తమవంశీయులగు క్షత్రియు లందరును, నీ విషయమున అనురాగవంతులై ఉన్నారు కదా! వారందరు ఐకమత్యముతో, నీ కార్యములను సాధించుటకై, ప్రాణములు విడచుటకు కూడ సిద్ధముగా ఉన్నారు

కదా!(34)

స్వదేశములో పుట్టినవాడు, విషయములు తెలిసినవాడు, సమర్థుడు, సమయస్ఫూర్తి కలవాడు, చెప్పిన విషయమును ఉన్నది ఉన్నట్లు చెప్పువాడు, పండితుడు అయిన పురుషుని దూతగా నియమించినావు కదా?(35)

శత్రుపక్షములోని పద్దెనిమిది తీర్థములను నీ పక్షములోని పదిహేను తీర్థములను ఇతరుల కెవ్వరికి తెలియని ముగ్గురు ముగ్గురు గూఢచారుల ద్వారా తెలుసుకొనుచున్నావు కదా.

(మంత్రులు, పురోహితులు, యువరాజు, సేనాపతి, ద్వారపాలకులు, అంతః పురాధికారులు, కారాగారాధికారులు, ధనాధ్యక్షులు, కార్యనియోజకులు(పనులు చేయించేవాళ్లు) ప్రాడ్వివాకులు,(న్యాయాధికారులు), సేనానాయకులు, నగరాధ్యక్షుడు, కర్మాంతికులు(పనులలో నియుక్తులైనవారు), సభాధికృతులు, ధర్మాధికారులు, దండపాలులు, దుర్గపాలులు, రాష్ట్రాంతపాలకులు, (రాష్ట్రము సరిహద్దుల ప్రభువులు) అనునవి శత్రుపక్షములోని పద్దెనిమిది తీర్థములు. ఈ తీర్థములను, ఒక్కొక్కదానికి ముగ్గురేసి గూఢచారులను నియమించి, అవి చేయు కార్యకలాపములను రాజు తెలుసుకొనవలెను. అట్లే తన రాజ్యములో మంత్రిపురోహిత యువరాజులు తప్ప మిగిలిన పదిహేను తీర్థముల కార్యకలాపములు తెలుసుకొనుటకై ముగ్గురేసి గూఢచారులను నియమించవలెను. మొదటి ముగ్గురును రాజువద్దనే ఉందురు కాన వారి విషయమై గూఢచారుల అవసరము లేదు.(36)

నీచే ఓడింపబడి, తిరిగి వెళ్ళిపోయిన శత్రువులను గూర్చి వీరు దుర్బలులే కదా అని నిర్లక్ష్యము చేయక, జాగరూకతతో ఉన్నావు కదా!(37)

ఈ లోకమును గూర్చియే ఆలోచించు నాస్తికులైన బ్రాహ్మణులు నీ దరికి చేరకుండా చూచుకొనుచున్నావు కదా! మేమే పండితులమని తలచుచుండు ఈ అజ్ఞానులు, అనేక అనర్థములను కలిగింతురు. ఈ దుష్టపండితులు ప్రధానమైన ధర్మశాస్త్రములు ఉండగా, వాటిని కాదని శుష్కతర్కమును అవలంబించి, నిరర్థకముగా ఏమేమో మాటలాడు చుందురు.(38, 39)

నాయనా! వీరులైన మన పూర్వులు పూర్వము రక్షించినదీ, శత్రువులు వచ్చి యుద్ధము చేయుటకు శక్యమైనది కాకపోవుటచే 'అయోధ్య' అను యథార్థమైన పేరుకలదీ, దృఢమైన ద్వారములు కలదీ, గజాశ్వరథములతో నిండినదీ, ఎల్లపుడు

తమ తమ కర్మలు చేయుటలో ఆసక్తి కలవారూ, జితేంద్రియులూ, గొప్ప ఉత్సాహము కలవారూ, పూజ్యులూ అయిన వేలకొలది బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు నివసించునదీ, అనేక ఆకారములు గల రాజభవనములతో కూడినదీ, పండితజనులతో నిండిఉన్నదీ, సర్వసమృద్ధమై ఆనందించుచున్నదీ యైన మన నగరమును రక్షించుచున్నావు కదా!(40-42)

అక్కడక్కడ భూముల సరిహద్దులను చూపు రాళ్లు గలదీ, చక్కగా నివాసము ఏర్పరచుకొని ఉన్న జనులతో నిండినదీ, దేవాలయములతోను, చలివెందళ్ళతోను, చెఱువులతోను ప్రకాశించుచున్నదీ, సంతోషించుచున్న స్త్రీ పురుషులు కలదీ, సమాజములో జరుగు ఉత్సవములతో ప్రకాశించుచున్నదీ, చక్కగా దున్నిన భూములు కలదీ, పశుసమృద్ధి కలదీ, హింస లేనిదీ, దేవమాతృకము కానిదీ, క్రూరజంతువుల భయము లేక రమ్యముగా నున్నదీ, ఎట్టి భయములు లేనిదీ, గనులతో నిండియున్నదీ, పాపాత్ము లెవ్వరును నివసించనిదీ, నా పూర్వికులచేత చక్కగా రక్షింపబడినదీ అయిన మన దేశము సుఖసమృద్ధులతో అలరారుచున్నదికదా?(43-46)

వ్యవసాయముచేతను, గోరక్షణచేతను జీవించు వైశ్యులందరు నీకు అనుకూలముగా ఉన్నారు కదా? జనులందరు కృషిగోరక్షణములపై ఆధారపడియే సుఖముగా ఉందురుకదా? నీవు వారి నందరిని రక్షణ ఇచ్చి, ఆపద తొలగించి, పోషించుచున్నావు కదా? ఎందుచేతననగా రాజు దేశములోని ప్రజల నందరిని ధర్మముతో రక్షించవలెను.(47, 48)

స్త్రీలతో మంచి మాటలాడుచు వారిని బాగుగా రక్షించుకొనుచున్నావు కదా? వారి మాటలను నమ్ముటలేదు కదా? వారికి రహస్యమేమియు చెప్పుట లేదు కదా?(49)

నాగవనమును రక్షించుకొనుచున్నావు కదా? నీకు ఆడ ఏనుగులు అధికముగా ఉన్నవి కదా? ఆడ ఏనుగులు, అశ్వములు, గజములు ఇవి ఉన్నవి చాలునని నీవు వాటి విషయమున తృప్తి చెందుటలేదు కదా?(50)

నీవు ప్రతిదినము ఉదయమున లేచి, చక్కగా అలంకరించుకొని, పూర్వాహ్ణమునందు రాజమార్గమునకు వెళ్ళి, జనులకు దర్శన మిచ్చుచున్నావు కదా? నీ క్రింద పని చేయువారందరును నిన్ను చూచుటకు భయపడుచుందురు కదా? పూర్తిగా భయాతిశయముచేత వారు దూరముగా ఉండి పోవుట లేదు కదా? ఈ రెండును గాక మధ్యమార్గమును అవలంబించుటయే మంచిది.(51, 52)

దుర్గము లన్నింటిలోను ధనధాన్యములు, ఆయుధములు, ఉదకము, యంత్రములు, శిల్పులు, ధనుర్ధరులు, కావలసినంతగా ఉన్నారు కదా?(53)

ఓ భరతా! నీ ఆదాయము అధికముగా నుండి వ్యయము చాలా తక్కువగా ఉన్నది కదా? నీ ధనము అపాత్రులచేతులలోనికి వెళ్ళిపోవుటలేదు కదా! నీవు దేవతలు, పితృదేవతలు, బ్రాహ్మణులు, అతిథులు, యుద్ధభటులు, మిత్రవర్గములు వీరి కొరకు మాత్రమే వ్యయము చేయుచున్నావు కదా!(54, 55)

ఆర్యుడు, పరిశుద్ధమైన మనస్సు కలవాడు, మంచి ఉత్తమమైన చరిత్ర కలవాడు అయిన పురుషునిపై ఏదియో ఒక అపరాధము ఆరోపింపబడగా, శాస్త్రమునందు నేర్పుకలవారిచే వానిని ప్రశ్నింపచేయకుండగనే దురాశచే వానిని చంపివేయుటలేదు కదా!(56)

చౌర్యము చేయు సమయమునందు చూపబడి, పట్టుబడి, ప్రశ్నించగా చౌర్యము చేసినట్లు నిర్ధారణ చేయుటకు తగిన కారణములు గల చోరుని ధనలోభముచే విడచివేయుటలేదు కదా! మంచి విద్యావంతులైన నీ మంత్రులు, ధనికునకు కష్టము వచ్చినపుడును, దరిద్రునకు కష్టము వచ్చినపుడును ఇతడు ధనికుడు, ఇతడు దరిద్రుడు అను పక్షపాతబుద్ధి లేక వ్యవహారనిర్ణయము చేయుచున్నారు కదా!(57, 58)

రాజు తన ఇష్టము వచ్చినట్లు శాసనము చేయుచు, ఎవరిపై లేని అపరాధమును మోపి శిక్షించునో అతడు కార్చిన కన్నీళ్లు ఆ రాజు పుత్రపశ్వాదులను నశింపచేయును.(59)

వృద్ధులను, బాలురను, ఉత్తములైన పండితులను దానము, మనస్సు, వాక్కు అను మూడింటిచే, వశము చేసికొనుటకు ప్రయత్నించుచున్నావు కదా?(60)

గురువులకు, వృద్ధులకు, మునులకు, దేవతలకు, అతిథులకు, చైత్యములకు, కృతార్థులైన బ్రాహ్మణులకు నమస్కారము చేయుచున్నావు కదా?(61)

నీవు అర్థముచేత ధర్మమును కాని, ధర్మముచేత అర్థమును కాని, అధిక సుఖాసక్తుడవై, కామముచేత ధర్మార్థములను కాని బాధించుటలేదు కదా? నీవు ధర్మార్థకామములనన్నింటిని వాటికి తగు కాలమున విభజించి సేవించుచున్నావు కదా?(62, 63)

సమస్తమైన శాస్త్రార్థములందు పండితులైన బ్రాహ్మణులు, నీకు, నీ రాజ్యములోని పౌరులకు, జానపదులకు, సౌఖ్యము కలుగవలెనని కోరుచున్నారు కదా?(64)

నాస్తికత్వము, అసత్యము, క్రోధము, ఏమరపాటు, ఏ కార్యముల విషయమునను, నిర్ణయము తీసుకొనకుండగా దీర్ఘాలోచన చేయుట, జ్ఞానవంతులను నిర్లక్ష్యము చేయుట, సోమరితనము, ఇంద్రియములకు వశుడగుట, మంత్రులెందుకు అని తాను ఒక్కడే ఆలోచన చేయుట, విషయము అర్థము కాని వారితో ఆలోచనలు చేయుట, నిర్ణయించిన కార్యములు ప్రారంభించకపోవుట, ఆలోచనలను రహస్యముగా ఉంచకపోవుట, మంగళకరమైన పనులు చేయకపోవుట, చాలామంది శత్రువులను ఒకే కాలమునందు ఎదిరించుట అనునవి పదునాలుగు రాజదోషములు; నీవు వీటిని త్యజించుచున్నావు కదా!(65-67)

దశవర్గము, పంచవర్గము, చతుర్వర్గము, సప్తవర్గము, అష్టవర్గము, త్రివర్గము, మూడు విద్యలు, ఇంద్రియ జయము, షాడ్గుణ్యము, దైవమానుషములు, కృత్యము, వింశతివర్గము, ప్రకృతులు, మండలము, యాత్రావిధానము, దండవిధానము, సంధి విగ్రహములను రెండు కారణములు, వీటినన్నింటిని యథాతథముగా అర్థము చేసికొని అనుసరించుచున్నావు కదా?(68-70)

నీవు శాస్త్రోక్తలక్షణములు గల ముగ్గురు లేక నలుగురు మంత్రులతో, అందరితో కలిసి గాని, వేరు వేరుగా గాని రహస్యముగా, ఆలోచన చేయుచున్నావు కదా?(71)

నీవు చదివిన వేదములు, నీవు తలపెట్టిన పనులు, నీ భార్య, నీవు వినిన శాస్త్రములు సఫలములుగా ఉన్నవా?(72)

నేను కోరుకొనుచుండు విధముగా నీ బుద్ధి ధర్మకామార్థముల యందు శ్రద్ధకలదై, ఆయుర్దాయమును, యశస్సును, వృద్ధిపొందించునదిగా ఉన్నదా? సన్మార్గమున నడిపించు, మంగళకరమైన ఏ ఆచారమును మన తండ్రి అనుసరించుచున్నాడో, మన ముత్తాతలు అనుసరించినారో, దానినే నీవు కూడా అనుసరించుచున్నావు కదా.(73, 74)

వండిన మధురమైన పదార్థములను నీవొక్కడవే భుజించకుండగా, దానియం దభిలాష గల నీ మిత్రులకు కూడ ఇచ్చుచున్నావు కదా?(75)

మహాబుద్ధిశాలి, విద్వాంసుడు అయిన రాజు, సమస్తరాజ్యమును పొంది,

ప్రజలను తగు విధముగా దండించుచు, యథాశాస్త్రముగా ధర్మము ప్రకారము పరిపాలించుచు, మరణానంతరము స్వర్గమునకు వెళ్లును కదా."(76)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూరవ సర్గము సమాప్తము.

నూట ఒకటవ సర్గము

రాముడు భరతు డడవికి వచ్చుటకు కారణ మడుగుట, భరతు డాయనను రాజ్యము స్వీకరింపు మని కోరుట. రాముడు అందులకు అంగీకరింపకుండుట.

లక్ష్మణసమేతుడైన ఆ రాముడు, పెద్దలయందు ప్రేమ గల ఆ భరతుని ఓదార్చి యిట్లు ప్రశ్నించుటకు ప్రారంభించెను.(1)

నీవు చీరజటాజినములు ధరించి ఇక్కడకు వచ్చుటకు కారణమును తెలుసుకొనగోరుచున్నాను. చెప్పుము. నీవు రాజ్యమును విడచి, కృష్ణాజినజటాధారివై, ఈ అరణ్యమునకు వచ్చుటకు కారణమేమో సవిస్తరముగా చెప్పుము.(2, 3)

భరతుడు రాముని మాటలు విని, రాముని మరల గట్టిగా కౌగిలించుకొని, నమస్కరించుచు, ఇట్లు పలికెను.(4)

మన తండ్రి నిన్ను అడవికి పంపి, చేయ శక్యము గాని అట్టి పనిని చేసి, పుత్రశోకము సహింపజాలక స్వర్గస్థుడయ్యెను. స్త్రీయైన నా తల్లి కైకేయి ప్రేరేపింపగా, మన తండ్రి తన కీర్తిని అంతను నశింపచేయు ఈ మహాపాపమును చేసినాడు. నా తల్లి, రాజ్యము లభింపక వైధవ్యమును మాత్రము పొంది, శోకముచే కృశించినదై, భయంకరమైన నరకములో పడగలదు.(5-7)

దాసుడ నైన నన్ను అనుగ్రహించి, దేవేంద్రుడు వలె ఇపుడే రాజ్యాభిషిక్తుడవు అగుము. ఈ ప్రజలు, భర్తను కోల్పోయిన మన తల్లులు, అందరును నీ దగ్గరకు వచ్చినారు. అనుగ్రహింపుము. అందుచే, వంశక్రమమును బట్టి పెద్ద వాడవగు నీకు సంక్రమించినదీ తగినదీ అయిన ఈ రాజ్యమును ధర్మానుసారముగా స్వీకరించి నీ మిత్రుల కోరికను తీర్పుము. శరత్కాలరాత్రి నిర్మలమైన చంద్రుని పొందినట్లు,

సమస్తమైన ఈ భూమి నిన్ను ప్రభువుగా పొంది సనాథురాలు అగుగాక.(8-11)

ఈ సచివులు, నేను, అందరము కూడా శిరస్సు వంచి నమస్కరించుచు, నిన్ను ప్రార్థించుచున్నాము. నీ సోదరుడను, శిష్యుడను, దాసుడను అయిన నన్ను అనుగ్రహింపుము. వంశక్రమమున వచ్చుచున్నది, తండ్రిగారికి సంబంధించినదీ, గౌరవింపబడునదీ అయిన ఈ ప్రకృతిమండలము చేయు ప్రార్థనను కాదనకుము.(12, 13)

మహాబాహువైన భరతుడు ఇట్లు పలికి, కన్నీరు కార్చుచు మరల రాముని పాదములను శిరస్సుతో స్పృశించి నమస్కరించెను.(14)

రాముడు మాటిమాటికి నిట్టూర్చుచు, మదించిన ఏనుగు వలె ఉన్న సోదరుడైన ఆ భరతుని కౌగిలించుకొని ఇట్లు పలికెను.(15)

"ఉత్తమకులమునందు పుట్టినవాడు, బలవంతుడు, తేజశ్శాలి, సద్వ్రతములను ఆచరించువాడు, అయిన నీవంటి జనుడెవ్వడైన, రాజ్యముకొరకై, పాపము చేయునా!(అనగా నీ విషయమున నా కేమియు సందేహము లేదని భావము). నీలో ఏ కొంచెము కూడ దోషము నాకు కనబడుటలేదు. బాల్యముచేత, నీవు నీ తల్లిని కూడ నిందింపవద్దు.(16, 17)

పెద్దలు సమర్థులైన తమ భార్యాపుత్రాదుల విషయమున తమ ఇష్టము వచ్చినట్లు చేయవచ్చునని శాస్త్రము. సత్పురుషులు లోకములో భార్యాపుత్రశిష్యుల విషయమున, ఏవిధముగా చెప్పుచున్నారో, మనము దశరథమహారాజునకు అట్టి వారమే అను విషయమును తెలుసుకొనుము. నాచేత నారచీరలు కృష్ణాజినము ధరింపజేసి అరణ్యములో నివసింపచేయుటకు గాని, నన్ను రాజ్యములో అభిషిక్తుని చేయుటకు గాని, మహారాజునకు అధికార మున్నది.(18-20)

ధర్మవేత్తలలో శ్రేష్ఠుడవైన ఓ భరతా! ధర్మజ్ఞుడైన తండ్రి విషయమున లోకులందరు మెచ్చుకొను నట్లుగా ఎంతటి గౌరవమును చూపించవలెనో అంతటి గౌరవమును తల్లివిషయమునందు కూడ చూపవలెను. ధర్మశీలులైన నా తల్లిదండ్రులిద్దరు నన్ను అరణ్యమునకు వెళ్లమని ఆజ్ఞాపించగా నేను మరి యొక విధముగా ఎట్లు చేయుదును?(21, 22)

నీవు అయోధ్యలో లోకుల గౌరవమునకు పాత్రమైన రాజ్యపాలనము చేయుచుండవలెను. నేను నారచీరలు ధరించి దండకారణ్యములో నివసించెదను.

మహాతేజశ్శాలి యైన దశరథమహారాజు, ప్రజల సమక్షమున ఈ విధముగా పంపకము చేసి, మనలను ఆజ్ఞాపించి స్వర్గస్థుడైనాడు. ధర్మాత్ముడు, లోకగురువు, అయిన ఆ మహారాజు వాక్యమును నీవు ప్రమాణముగా గ్రహించవలెను. నీకు తండ్రి ఇచ్చిన భాగమును అనుభవింపవలెను. మహాత్ముడైన తండ్రి పదునాలుగు సంవత్సరములు దండకారణ్యములో నివసించుట అనే భాగమును నాకిచ్చినాడు. నేను దానిని అనుభవించెదను."(23-26)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట ఒకటవ సర్గము సమాప్తము.

నూట రెండవ సర్గము

భరతుడు తిరిగి రాజ్యమును గ్రహింపుమని పట్టుబట్టి తండ్రి మరణము నెరిగించుట.

రాముని మాటలు విని భరతుడిట్లు చెప్పెను. "ధర్మవిహీనుడనైన నాకు రాజధర్మముతో ఏమి ప్రయోజనము? మన వంశములో ఎల్లపుడు ఉన్న శాశ్వతమైన ధర్మము ఏమనగా జ్యేష్ఠపుత్రుడు ఉండగా చిన్నవాడు రాజు కాకూడదు. అందుచేత నీవు నాతో కూడ ఐశ్వర్యసమృద్ధమైన అయోధ్యకు వచ్చి, మన కులమునకు క్షేమము కలుగుటకై రాజ్యాభిషిక్తుడవు అగుము.(1-3)

జనులు రాజు కూడా మనుష్యుడే అని అనుకొనుచుండవచ్చును. కాని ధర్మార్థములను సంరక్షించు చరిత్రగల రాజు మనుష్యునకు శక్యము కాని ప్రభావము గల దేవత యని నా అభిప్రాయము.(4)

నేను కేకయదేశములో ఉండగా, నీవు అరణ్యమునకు వెళ్ళగా, అనేక యజ్ఞములు చేసినవాడూ, పూజ్యుడూ, సత్పురుషులకు ఇష్టమైనవాడూ అయిన దశరథమహారాజు స్వర్గస్థుడైనాడు. నీవు సీతాలక్ష్మణసహితుడవై, అరణ్యమునకు వెళ్ళిన వెంటనే దశరథమహారాజు దుఃఖపీడితుడై, స్వర్గస్థుడయ్యెను. లేచి తండ్రికి జలతర్పణములు ఇమ్ము. నేనూ శత్రుఘ్నుడూ కూడ పూర్వమే జలతర్పణము ఇచ్చి యున్నాము.(5-7)

ప్రియుడైన పుత్రుడిచ్చినది పితృలోకములలో అక్షయ్యముగా ఉండునని

చెప్పుదురు కదా! మన తండ్రికి ప్రియమైన పుత్రుడవు నీవే. అందుచేత నీవు ఆయనకు అపరక్రియలు చేయుము. నీ తండ్రియైన దశరథుడు, నీవు దూరముగా వెళ్ళిపోవుటచే నిన్ను గూర్చియే దుఃఖించుచు, నిన్ను చూడవలె నని కోరుచు, నీయందు లగ్నమైన మనస్సును మరల్చజాలక, నిన్ను గూర్చిన శోకముతో మునిగిపోయి నిన్నే స్మరించుచు మరణించినాడు.(8, 9)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట రెండవ సర్గము సమాప్తము.

నూట మూడవ సర్గము

రాముడు తండ్రికి జలాంజలి నిచ్చుట, పిండదానము చేయుట, రోదించుట.

భరతుడు చెప్పిన దుఃఖకర మైన ఆ పితృమరణవార్తను విని రాముడు స్మృతి తప్పి మూర్ఛపడెను. శత్రుసంహారకు డైన ఆ రాముడు యుద్ధములో దేవేంద్రుడు ప్రయోగించిన వజ్రము వంటి దుఃఖకరమైన భరతుడు పలికిన ఆ వాగ్వజ్రము తగులగానే రెండు బాహువులు మెలివేసి అరణ్యములో గొడ్డలిచేత ఖండించిన, పుష్పించిన వృక్షము వలె నేలపై పడెను.(1-3)

దగ్గరనే ఉన్న ఆ సోదరులూ, సీతా ఏడ్చుచు ఆ విధముగా నేలపై బడిన ఆ రామునిపై ఉదకము చల్లిరి. రాముడు మూర్ఛనుండి తేరుకొని లేచి, కన్నీళ్లు కార్చుచు, దైన్యముతో, అధికముగా విలపింప ప్రారంభించెను.(4-6)

ధర్మాత్ముడైన ఆ రాముడు, తన తండ్రి యైన దశరథమహారాజు స్వర్గస్థుడైనట్లు విని, భరతునితో, ధర్మసమ్మతమైన మాటలను ఇట్లు పలికెను.(7)

“తండ్రి మరణించిన పిమ్మట ఆ అయోధ్యతో నాకు ఏమి పని? ఆ రాజశ్రేష్ఠుడు లేని అయోధ్యను ఎవరు పాలింపగలరు? నన్ను గూర్చిన శోకముతో మరణించిన ఆ మహాత్మునకు నేను సంస్కారము కూడ చేయజాలకపోతిని. చెడ్డపుట్టుక గల అట్టి నాచేత ఆయనకు ఏమి ప్రయోజనము? పాపశూన్యుడవైన ఓ భరతుడా! నీవును శత్రుఘ్నుడును, మన తండ్రి యైన దశరథమహారాజునకు చేయవలసిన ప్రేతకృత్యము లన్నీ చేసి సత్కరించినారు. అందుచే మీ రిద్దరు కృతార్థులు.(8-10)

దశరథమహారాజు చనిపోవుటచే ప్రధానపురుషుడు లేక వ్యాకులముగా నున్న ఆ అయోధ్యకు నేను వనవాసానంతరము కూడా వెళ్ళను. తండ్రిగారు మరణించినారు కదా! నేను వనవాసమును పూర్తి చేసుకొని అయోధ్యకు తిరిగి వచ్చిన పిమ్మట అక్కడ నాకు ఉపదేశము చేయువారు ఎవరు? పూర్వము మన తండ్రి నా మంచి నడవడికను చూచి ఆనందించుచు నన్ను సంతోషపెట్టుటకై కొన్ని మాటలు చెప్పుచుండెడివాడు. చెవులకు సుఖకరములైన అట్టి మాటలను, ఇటుపై నేను ఎవరినుండి వినగలను?(11-13)

రాముడు భరతునితో ఇట్లు పలికి, శోకసంతప్తుడై, పూర్ణచంద్రుని వంటి ముఖము గల సీతతో ఇట్లనెను.(14)

"ఓ సీతా! నీ మామగారు మరణించినారు. ఓ లక్ష్మణా! తండ్రిలేని వాడవైనావు. దశరథమహారాజు మరణించె నను దుఃఖవార్తను భరతుడు చెప్పుచున్నాడు."(15)

రాముడట్లు చెప్పగానే యశశ్శాలు లైన ఆ భరతలక్ష్మణశత్రుఘ్నుల నేత్రములనుండి అత్యధికముగా కన్నీరు కారెను. ఆ సోదరులందరు, రాముని మిక్కిలి ఓదార్చి "తండ్రియైన దశరథమహారాజునకు జలతర్పణము లిమ్ము." అని ప్రార్థించిరి.(16,17)

మామగారైన దశరథమహారాజు స్వర్గస్థుడైనట్లు వినిన ఆ సీత, కన్నీళ్ళతో నిండిన నేత్రములతో, భర్తను చూడలేకపోయెను. రాముడు ఏడ్చుచున్న సీతను ఓదార్చి, దుఃఖించుచు, దుఃఖముతో బాధపడుచున్న లక్ష్మణునితో ఇట్లు పలికెను.(18,19)

మహాత్ముడైన తండ్రిగారికి ఉత్తరక్రియలు చేయుటకు వెళ్లెదను. గారచెట్టు తెలగపిండిని, ఉత్తరీయమును తీసుకొనిరమ్ము. సీత ముందు నడుచుగాక. నీవు ఆమె వెనుకనే నడచి వెళ్లుము. నీ వెనుక నేను వచ్చెదను. ఈ మరణనిమిత్తక మైన స్నానముకొరకై మనము చేయు ఈ గమనము చాలా భయంకరమైనది.(20, 21)

పిమ్మట, ఎల్లప్పుడు ఆ రాజకుమారులను అనుసరించి ఉండువాడూ, ప్రశస్తమైన బుద్ధీ, గొప్ప ఆలోచనాశక్తీ, మెత్తని స్వభావమూ కలవాడూ, ఇంద్రియనిగ్రహవంతుడూ, శాంతుడూ, రామునియందు, దృఢభక్తికలవాడూ అయిన సుమంత్రుడు ఆ రాజకుమారులందరిని ఓదార్చి, మంగళకరమైన ఆ మందాకినీనదిలో స్నానములు చేయుటకు వారి చేతులను పట్టుకొని దింపెను.(22,23)

గొప్ప కీర్తి గల ఆ సోదరులు, మంచి రేవులు కలదీ, సుందరమైనదీ, ఎల్లపుడును పుష్పించిన అరణ్యములు కలదీ అయిన మందాకినీనదిని అతికష్టముగా సమీపించి, బురద లేని మంగళకరమైన రేవులో దిగి, "తండ్రీ! ఈ జలము నీకు తృప్తి కలిగించుగాక." అని పలుకుచు దశరథమహారాజునకు జలతర్పణములు ఇచ్చిరి.(24, 25)

రాముడు దోసిలితో నీళ్లు గ్రహించి, దక్షిణాభిముఖుడై ఏడ్చుచు ఇట్లనెను.(26)

"రాజులలో శ్రేష్ఠుడ వైన ఓ తండ్రీ! పితృలోకములో నున్న నీకు ఇపుడు నే నిచ్చుచున్న ఈ పవిత్రమైన జలము అక్షయ మై, నిన్ను చేరుగాక."(27)

పిమ్మట తేజశ్శాలి యైన ఆ రాముడు, సోదరులతో మందాకినీనది అవలితీరమునకు వెళ్ళి, తండ్రికి పిండప్రదానము చేసెను. దర్భలు పరచి, వాటి పై రేగుపండ్లు కలిపిన గారతెలకపిండిని ముద్దలు చేసి ఉంచి, దుఃఖార్తుడై, ఏడ్చుచు ఇట్లు పలికెను.(28, 29)

"మహారాజా! మేము తినుచున్నదానినే నీకు అర్పించుచున్నాను. సంతోషముతో భుజింపుము. పురుషుడు ఏ అన్నమును తినునో, వాని దేవతలు కూడ ఆ అన్నమునే తినెదరు కదా."(30)

నరశ్రేష్ఠుడైన రాముడు, పిదప ఆ మార్గముమీదుగానే నదీతటమును దాటి వెళ్ళి, అందమైన చరియలు గల చిత్రకూటపర్వతమును ఎక్కెను.(31)

భూమండలాధిపతి యైన ఆ రాముడు, పర్ణశాల ద్వారము చేరి, భరతలక్ష్మణుల నిద్దరిని చేతులతో కౌగిలించుకొనెను. ఆ సోదరులు, సీత ఏడ్చుటచే, ఆ పర్వతమునందు, సింహములు గర్జించినపుడు కలుగునట్లు ప్రతిధ్వని కలిగెను. తండ్రికి జలతర్పణములు చేయుచు, ఏడ్చుచున్న ఆ మహాబలశాలురైన సోదరులు చేసిన వ్యాకులమైన ధ్వనిని విని భరతుని సైనికులు భయపడిరి. భరతుడు రామునితో తప్పక కలిసి యుండును. ఈ ధ్వని, మరణించిన తండ్రిని గూర్చి ఏడ్చుచున్న వారి రోదనధ్వనియే; అని ఆ సైనికులు అనుకొనిరి.(32-35)

వారందరు తమ తమ స్థానములు విడిచి, ఒకే విధమైన ఆలోచనతో పరుగెత్తుచు, ఆ ధ్వని వచ్చు వైపునకు తమ తమ స్థానములను అనుసరించి వెళ్ళిరి. కొందరు గుఱ్ఱముల మీదను, కొందఱు ఏనుగులమీదను, సుకుమారులైన కొందరు చక్కగా అలంకరించిన రథములమీదను, మరికొందరు కాలినడకను వెళ్ళిరి.(36, 37)

ఆ జనులందరు కొంచెము కాలము క్రితమే ప్రవాసమునకు వెళ్ళిన ఆ రాముని చాలా కాలము క్రితము వెళ్ళిన వానిని వలె చూడవలె నను కోరికతో ఆ ఆశ్రమమునకు శీఘ్రముగా వెళ్ళిరి. అక్కడ కలిసిన సోదరులను చూడవలె నను తొందరతో, ఆ జనులందరు, డెక్కల ధ్వనులతోను, చక్రాంతముల ధ్వనులతోను, వ్యాకులమైన వివిధ వాహనము లెక్కి వెళ్ళిరి.(38, 39)

అనేకమైన వాహనములు, డెక్కలు, చక్రాంతములు, ఆ భూమిని నలగగొట్టుటచేత మేఘములు, కమ్మినపుడు ఆకాశమునందు వలె సంకుల మైన ధ్వని బయలుదేరెను. ఆ ధ్వనికి భయపడిన ఏనుగులు, ఆడ ఏనుగులు తమ వెంట రాగా మదగంధమును అంతట వ్యాపింపచేయుచు, ఆ వనమునుండి మరియొక వనమునకు వెళ్ళినవి. ఆ శబ్దము విని, వరాహములు, తోడేళ్లు, మహిషములు, సర్పములు, వానరములు, వ్యాఘ్రములు, గోకర్ణములు, గవయములు, చుక్కల జింకలు భయపడినవి. చక్రవాకములు, నత్యూహములు, హంసలు, కారండవములు, కొంగలు, కోకిలలు, క్రౌంచములు,ఆ ధ్వని విని భయపడి, నలుదిక్కులకు పారిపోయినవి. ఆ శబ్దమునకు భయపడిన పక్షులతో నిండిన ఆకాశము, మనుష్యులతో నిండిన భూమి, ఆ రెండును ఆ సమయమునందు సమముగా ప్రకాశించెను.(40-44)

పిదప ఆ జనులు, పురుషశ్రేష్ఠుడు, కీర్తిశాలి, శత్రుసంహారకుడు అయిన ఆ రాముడు నేలపై కూర్చుండి యుండగా చూచిరి. వారందరు రాముని సమీపించి, కైకేయిని, మంథరను నిందించుచు కన్నీళ్లు కార్చిరి.(45, 46)

పిదప ధర్మజ్ఞుడైన ఆ రాముడు, చాల దుఃఖితులై, నేత్రములలో బాష్పములు నిండి యున్న వారి నందరిని చూచి పురుషులను తండ్రులను వలెను, స్త్రీలను తల్లులను వలెను కౌగిలించుకొనెను. అక్కడ రాముడు కొందరిని కౌగిలించుకొనెను. కొందరు ఆ రామునకు అభివాదనము చేసిరి. అపుడు దశరథనందనుడు తన మిత్రులను, బంధువులను అందరిని చేరి అర్హతలను అనుసరించి గౌరవించెను. (47,48)

అక్కడ, ఆ మహాత్ముల రోదనధ్వని భూమిని, ఆకాశమును, పర్వతగుహలను, దిక్కులను ప్రతిధ్వనింపచేయుచు, మృదంగధ్వని వలె అవిచ్ఛిన్నమై వినవచ్చెను.(49)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట మూడవ సర్గము సమాప్తము.

నూట నాలుగవ సర్గము

సుమిత్రాదుల సమక్షమున కౌసల్య దుఃఖించుట. రామలక్ష్మణులు, సీత తల్లులకు ప్రణమిల్లుట.

రాముని చూడవలె నని తీవ్రమైన ఇచ్ఛ గల వసిష్ఠుడు దశరథుని భార్యల వెంట ఆ ప్రదేశమునకు నడచి వెళ్లెను. రాజభార్యలు మందాకినీనది వైపు మెల్లగా నడచి వెళ్లుచు, రామలక్ష్మణులు ఉపయోగించు రేవును అక్కడ చూచిరి.(1, 2)

దీనురాలైన కౌసల్య కన్నీటితో నిండి, ఎండిపోవుచున్న ముఖముతో సుమిత్రతోను, ఇతర రాజస్త్రీలతోను ఇట్లు పలికెను.(3)

"దేశమునుండి వెడలగొట్టబడి, అనాథలై, వనములో నివసించుచున్న ఆ సీతారామలక్ష్మణులు ఉపయోగించు రేవు ఇదియే. సుమిత్రా! నీ కుమారుడైన లక్ష్మణుడు రామునికొరకు, ఎల్లపుడును, ఉత్సాహవంతుడై, ఇక్కడినుండి జలము తీసికొని పోవుచుండును. నీ కుమారుడు జలము తీసుకొని వచ్చుట వంటి నీచకార్యము చేసినను ఆ కార్యము నింద్యము మాత్రము కాదు. ఎందుచేతననగా సోదరుని ప్రయోజనము నుద్దేశించి చేసిన అన్ని కార్యములు, గుణములచే శ్రేష్ఠమైనవే.(4-6)

ఇటుపై రాముడు, భరతుని ప్రార్థనచే రాజ్యాభిషిక్తు డగును కావున ఇట్టి కష్టములకు తగని నీ కుమారుడు, నీచము అధికదుఃఖకరము అయిన ఈ సేవను విడుచుగాక."(7)

విశాలనేత్ర యైన ఆ కౌసల్య నేలపై దక్షిణాగ్రములుగా పరిచిన దర్భలమీద రాముడు తండ్రిని ఉద్దేశించి ఉంచిన ఇంగుదిచెట్టు తెలకపిండిని చూచెను. ఆ కౌసల్యాదేవి, రాముడు దుఃఖించుచు తండ్రికొరకై నేలమీద ఉంచిన ఆ పిండమును చూచి దశరథుని భార్య లందరితోను ఇట్లు పలికెను.(8, 9)

"ఇక్ష్వాకువంశప్రభువూ, మహాత్ముడూ, తండ్రీ యైన దశరథమహారాజునకు రాముడు యథావిధిగా ఇచ్చిన ఈ పిండమును చూడండి. దేవసమానుడు, అనేకభోగములను అనుభవించినవాడు, మహాత్ముడు అయిన ఆ రాజునకు ఇది తగిన ఆహారము కాదు. మహేంద్రునితో సమానుడై, నాలుగు సముద్రములవరకు, వ్యాపించిన సమస్త భూమండలమును పాలించిన ఆ దశరథమహారాజు, ఇంగుదిచెట్టు

తెలక పిండిని ఎట్లు తినగలడు?(10-12)

ఐశ్వర్యవంతుడైన రాముడు తండ్రికి ఇంగుదికాయల పిండిని ఇచ్చినాడే! ఇంతకంటే దుఃఖకరమైన దేదియు నాకు లోకములో కనబడుట లేదు. రాముడు తండ్రికి ఇచ్చిన ఈ ఇంగుదీపిణ్యాకమును చూచిన పిమ్మట కూడ నా హృదయము దుఃఖముతో వేయి ముక్కలుగా పగిలిపోకున్నది. ఎంత ఆశ్చర్యము!(13, 14)

"పురుషుడు తాను ఏ ఆహారమును తినునో, అతని దేవతలకు కూడ, అదే ఆహారము" అని లోకప్రసిద్ధమైన ఈ శ్రుతి సత్యమైనది అని నేను తలచుచున్నాను."(15)

ఈ విధముగా దుఃఖితురా లైన, ఆ కౌసల్యను, ఓదార్చి, రాజభార్య లందరు ఆశ్రమమును చేరి, అక్కడ స్వర్గమునుండి భూమికి వచ్చిన దేవత వలె ఉన్న రాముని చూచిరి. సమస్తభోగములు విడిచి ఆశ్రమములో ఉన్న రాముని చూడగానే కౌసల్య మొదలైన తల్లులు దుఃఖాక్రాంతలై, బిగ్గరగా ఏడ్చిరి.(16, 17)

మనుజులలో శ్రేష్ఠుడు, సత్యప్రతిజ్ఞ కలవాడూ అయిన రాముడు లేచి, ఆ తల్లులందరికిని పాదములు స్పృశించి నమస్కరించెను. కౌసల్య మొదలైనవారు, మృదువైన వేళ్లూ, అరచేతులూ గల, స్పృశించుటకు సుఖకరముగా నున్న, మంగళకరములైన చేతులతో, రాముని వీపుపై అంటుకొని యున్న పరాగమును దులిపిరి.(18, 19)

ఆ తల్లులందరినీ చూచి దుఃఖితుడైన లక్ష్మణుడు కూడ, రాముని తరువాత, వారి కందరికి మెల్లగా, భక్తిపూర్వకముగా నమస్కరించెను. దశరథుని భార్య లందరు దశరథకుమారుడు, మంగళకరము లైన లక్షణములు కలవాడు అయిన ఆ లక్ష్మణుని కూడ రాముని ఆదరించినట్లే ఆదరించిరి.(20, 21)

దుఃఖితురా లైన సీత కూడ, అత్తలకు పాదములు స్పృశించి నమస్కరించి, అశ్రువులు కార్చుచు ఎదుట నిలబడెను. వనవాసముచే కృశించి, దుఃఖముచేత పీడింపబడుచు, దీనురాలైన ఆ సీతను కౌసల్యాదేవి తల్లి కుమార్తెను కౌగిలించుకొని నట్లు కౌగిలించుకొని, ఇట్లు పలికెను.(22, 23)

జనకుని కూతురు, దశరథుని కోడలు, రాముని భార్య అయిన సీత కూడ నిర్జనమైన అరణ్యములో ఈ విధముగా కష్టపడవలసి వచ్చినది కదా! ఓ సీతా! ఎండకు ఎండిన పద్మము వలె, నలిగిన కలువ వలె, దుమ్ముపట్టిన బంగారము వలె,

మేఘములు కప్పిన చంద్రబింబము వలె, ఉన్న నీ ముఖమును చూడగానే, కష్టములను అరణినుండి(అరణి అనగా మథించి, యజ్ఞాదులలో ఉపయోగించు అగ్నిని తీయుటకై ఉపయోగించు కఱ్ఱ) పుట్టిన శోకము, అగ్ని తనకు ఆశ్రయమైన దారువును దహించు నట్లు, నా మనస్సును, మిక్కిలి దహించివేయుచున్నది."(24-26)

దుఃఖితురా లైన తల్లి ఇట్లు చెప్పుచుండగా రాముడు వసిష్ఠుని సమీపించి, ఆయనకు కూడ పాదాభివందనము చేసెను. అప్పుడా రాముడు అగ్నిసమానుడు, మహాతేజశ్శాలీ యైన ఆ వసిష్ఠుని పాదములు దేవతాప్రభువైన ఇంద్రుడు బృహస్పతి పాదములను స్పృశించినట్లు స్పృశించి, అతనితో కలిసి కూర్చుండెను. (27, 28)

వసిష్ఠుడూ, రాముడూ కూర్చున్న పిదప, ధర్మాత్ముడైన భరతుడు, మంత్రులు, ప్రధానపౌరులు, సైనికులు, ధర్మము తెలిసిన జనులు రాముని సమీపమునందే కూర్చుండిరి. పరాక్రమవంతుడైన ఆ భరతుడు ఆ సమయమున, మునుల వేషము ధరించి కాంతితో వెలుగుచున్న ఆ రాముని చూచి నమస్కరించుచు, పరిశుద్ధు డైన మహేంద్రుడు బ్రహ్మదేవుని సమీపమునందు కూర్చున్నట్లు ఆయన ప్రక్కనే కూర్చుండెను. (29, 30)

భరతుడు ఇపుడు రాముని నమస్కరించి, సత్కరించి, ఏ మంచి మాటలు చెప్పునో అని అక్కడచేరిన జనులందరికిని అత్యధిక మైన కౌతుకము కలిగెను. (31)

సత్యమైన ధైర్యము గల రాముడు, గొప్ప ప్రభావము గల లక్ష్మణుడు, ధార్మికుడైన భరతుడు, మిత్రులందరు చుట్టు కూర్చొని ఉండగా, యజ్ఞశాలలో చుట్టూ సదస్యులు కూర్చున్న త్రేతాగ్నులు వలె ప్రకాశించిరి. (32)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట నాలుగవ సర్గము సమాప్తము.

నూట అయిదవ సర్గము

భరతుడు రాము డయోధ్యకు వచ్చి రాజ్యము స్వీకరింపవేడుట. తండ్రియాజ్ఞ పాటించుటకే రాజ్యమును స్వీకరింపక అడవిలో నుండ నిశ్చయించితినని రాముడు పలుకుట.

స్నేహితులతో కూడి పురుషశ్రేష్ఠు లైన ఆ నలుగురు సోదరులు దుఃఖించుచుండగానే, ఆ రాత్రి అతికష్టముగా గడచినది.(1)

రాత్రి తెల్లవారిన పిమ్మట, ఆ సోదరులందరు తమ స్నేహితులతో కూడి మందాకినీతీరమునందు హోమజపాదులు చేసుకొని, రాముని వద్దకు వచ్చిరి. వారందరు మౌనముగా కూర్చుండిరి. ఎవ్వరును ఏమియు మాట్లడలేదు. భరతుడు మాత్రము మిత్రుల మధ్యమునందు, రామునితో ఇట్లనెను.(2, 3)

నా తల్లిమాట మన్నించి నాకు రాజ్యమును ఇచ్చినావు. దానిని నీకే తిరిగి ఇచ్చివేయుచున్నాను. నిష్కంటక మైన ఈ రాజ్యమును అనుభవింపుము. ఈ విశాలరాజ్యమును, నీవు తప్ప ఎవ్వరును నిలుపజాలరు. గాడిద గుఱ్ఱము నడకను ఎట్లు అనుసరింపజాలదో, సాధారణపక్షి గరుత్మంతుని గమనమును ఎట్లు అనుసరించజాలనో అట్లే ఓ మహారాజా! నేను నీ గమనమును అనుసరింపజాలను. (4-6)

రామా! ఎల్లపుడు ఇతరులు తమ జీవికకై ఎవనిని ఆశ్రయింతురో అతని జీవనము మంచి జీవనము. ఎవడు ఇతరులపై ఆధారపడి జీవించునో, వాని జీవనము దుర్జీవనము.(7)

ఒక పురుషుడు, ఒక వృక్షమును నాటి, దానిని పెంచగా, అది పొట్టివాడు ఎక్కుటకు శక్యము కానంత లావైన మ్రాను గల మహావృక్షముగా పెరిగి, పుష్పించి ఫలములను మాత్రము ఇవ్వకపోయినచో, దానిని దేనికోసమై, నాటినాడో అతనికి ఆ ఆనందము కలుగదు. ప్రభువులలో శ్రేష్ఠుడవైన నీవు, భృత్యులమైన మమ్ము పరిపాలింపకపోయినచో ఈ ఉపమలోని అర్థమును గ్రహించుము. (నీవు రాజ్యాభిషేకమునకు అంగీకరించకపోయినచో మన తండ్రి యైన దశరథుడు నీవు రాజువై, ప్రజల నందరను పారిపాలించెదవు అను అశతో చిన్ననాటినుండియు నిన్ను పెంచిన శ్రమ అంతయు వ్యర్థ మగును అని భావము.)(8-10)

శత్రుసంహారకుడవైన నీవు రాజ్యాభిషిక్తుడవై తపింప చేయుచున్న సూర్యునివలె ప్రకాశించుండగా, శ్రేష్ఠములైన శ్రేణులన్నియు, నిన్ను చూచి ఆనందించుగాక!(శ్రేణులనగా వర్తకులు, శిల్పులు మొదలైన వారి సంఘములు లేదా ప్రజాసముదాయములు). నిన్ను వెంబడించి వచ్చుచు మదించిన ఏనుగులు ధ్వని చేయుగాక. అంతఃపురములో స్త్రీలు కుదుటపడిన మనస్సులతో ఆనందించెదరు గాక.(11, 12)

అయోధ్యానివాసులైన వివిధజనులు, రాముని ప్రార్థించుచు, భరతుడు పలికిన మాటలు విని, చాలా బాగున్నది అని అనుకొనిరి.(13)

పరాక్రమశాలి, నిశ్చితమైన బుద్ధి కలవాడు అయిన రాముడు, ఆ విధముగా దుఃఖితుడై, విలపించుచున్న భరతుని ఈ విధముగా ఓదార్చెను.(14)

"ఏ పురుషునకును స్వాతంత్ర్యము కాని, తన ఇష్టము వచ్చినట్లు పనులు చేయు సామర్థ్యము కాని లేదు. ప్రతి ఒక్కనిని దైవము ఇటువైపు అటువైపు లాగుచుండును. ఎంత ప్రోగుచేసినను ధనము చివరకు నశింపక తప్పదు. ఎంత ఉన్నతి పొందినను ప్రతి ఒక్కడును పతనమును పొందితీరును. మానవుల పరస్పరసంబంధములు చివరకు విచ్ఛిన్నము లగుట తప్పదు. పుట్టినవాడు మరణింపక తప్పదు. పండిన పండ్లకు చెట్టునుండి పడిపోవుట అనునది ఒక్కటే భయము. అట్లే జనించిన మానవునకు మరణమే భయము.(15-17)

ఎంత దృఢము లైన స్తంభములతో నిర్మించినను, కొంతకాలమునకు ఇల్లు జీర్ణమై, కూలిపోవును. అట్లే మానవులు కూడ జరామృత్యువులకు వశులై నశించెదరు.(18)

గడచిన రాత్రి తిరిగి రాదు. జలపూర్ణమైన యమునానది జలముతో నిండిన సముద్రములో ప్రవేశించిన పిమ్మట మరల రాదుకదా! గడచిపోవుచున్న రాత్రులు, పగళ్లు గ్రీష్మకాలములో సూర్యకిరణములు జలమును పీల్చివేయునట్లు సమస్తప్రాణుల అయుర్దాయమును క్షీణింప చేయుచున్నవి. నిలచి ఉన్నా, నడుచుచున్నా నీ ఆయుర్దాయము క్షీణించిపోవుచున్నది. అందుచే నీవు నిన్ను గూర్చియే విచారింపవలెను గాని, ఇతరులను గూర్చి ఎందుకు విచారించెదవు?(19-21)

మానవుడు ఎక్కడికి వెళ్ళినను మృత్యువు కూడ అతనిని అనుసరించుచునే వెళ్ళుచున్నది. కూర్చుండువాడు మృత్యువుతో కలిసియే కూర్చొనుచున్నాడు. ఎంత

దీర్ఘప్రయాణము చేసినను మృత్యువుతో కలిసియే తిరిగి వచ్చుచున్నాడు. శరీరముపై ముడతలు పడినవి. వెంట్రుక లన్నియు తెల్లబడినవి. ఈ విధముగా ముసలితనముచే జీర్ణుడైపోయిన మనుష్యుడు ఏమి చేసి మాత్రము తనను సమర్థునిగా చేసుకొనగలడు?(22, 23)

సూర్యుడు ఉదయించగానే మనుష్యులు తమ పనులు చేసుకొనవచ్చును గదా అని సంతోషించుచున్నారు. సూర్యుడు అస్తమించగనే విశ్రాంతిసుఖమును పొందవచ్చును గదా అని సంతోషించుచున్నారు. తమ ఆయుర్దాయము క్షీణించుచున్నదను విషయమును మాత్రము తెలుసుకొనకున్నారు. క్రొత్త ఋతువు ప్రారంభము చూడగానే మానవులు ఇపుడు క్రొత్త క్రొత్త పుష్పఫలాదులు వచ్చినవి కదా అని సంతోషించుచుందురు. కాని ఋతువు మారుచుండగా ప్రాణుల ఆయుర్దాయము కూడ క్షీణించుచుండును.(24, 25)

మహాసముద్రములో ఒక కాష్ఠము, మరియొక కాష్ఠము కలిసి దగ్గరగా ఉండి, కొంతకాలమునకు విడిపోవుచుండును. అట్లే భార్యలు, పుత్రులు, బంధువులు, ధనములు కొంతకాలము కలిసియుండి విడిపోవుచుందురు. వీరు విడిపోవుట తప్పదు. ఈ లోకములోని ఏ ప్రాణి కూడ తన ఇష్టము వచ్చినట్లు ప్రవర్తింపజాలదు. అందుచేత మరణించినవానికి గాని, మరణించినవానిని గూర్చి ఏడ్చువానికి గాని, దాని విషయమున(మరణాదివిషయమున) సామర్థ్యము లేదు.(26-28)

కొందరు బాటసారుల గుంపు నడిచి వెళ్ళిపోవుచుండగా, "మీ వెనుకనే నేను కూడ వచ్చుచున్నాను" అని దారిలో ఉన్నవాడు ఒకడు చెప్పునట్లు, పూర్వీకులైన పితృపితామహాదులు వెళ్ళిన మార్గము అందరికి నిశ్చితము. తిరుగులేని ఆ మార్గమును పొందువాడు ఎందుకు దుఃఖించవలెను? జలప్రవాహము వలె వెనుకకు మరలకుండగ వయస్సు దాటిపోవుచుండును. అందుచేత రాజు తన మనస్సును సుఖకరమైన ధర్మమునందు లగ్నము చేయవలెను. అట్లు చేయుటచే ప్రజలు సుఖవంతు లగుదురు.(29-31)

ధర్మాత్ముడైన మన తండ్రి దశరథమహారాజు, యథాశాస్త్రముగా పుష్కలమైన దక్షిణ లిచ్చుచు అనేక క్రతువులు చేయుటచే స్వర్గమునకు వెళ్ళినాడు. పోష్యవర్గమును పోషించుటవలనా, ప్రజలను చక్కగా పాలించుట వలనా, ధర్మానుసారముగా ధనమును స్వీకరించుటవలనా మన తండ్రిగారు స్వర్గమునకు వెళ్ళకలిగినారు. మన తండ్రి యైన దశరథమహారాజు, మంగళకరములైన పనులు చేయుటచేతా, ఉత్తమమైన

దక్షిణలతో యాగములు చేయుటచేతా స్వర్గమును చేరగలిగినాడు. దశరథమహారాజు, అనేకవిధము లైన యాగములచే దేవతలను పూజించి దీర్ఘాయుర్దాయవంతుడై పుష్కలముగా భోగము లనుభవించి స్వర్గస్థుడైనాడు. అట్లు దీర్ఘాయుర్దాయవంతుడై, ఉత్తమమైన భోగములనుభవించి సత్పురుషులచే గౌరవము అందుకొని స్వర్గస్థుడైన మన తండ్రి దశరథమహారాజును గూర్చి విచారించవలసిన పని లేదు.(32-36)

మన తండ్రి జీర్ణమైపోయిన మనుష్యదేహమును విడచి, బ్రహ్మలోకములో కూడ సంచరించగల దివ్యదేహమును పొందినాడు కదా? శాస్త్రజ్ఞానసంపన్నుడూ, అధికబుద్ధిశాలీ అయిన ఆ దశరథమహారాజు వంటి ప్రాజ్ఞుడు గాని, నీవంటివాడు గాని, నావంటివాడు గాని ఆయనను గూర్చి దుఃఖింపకూడదు. ధీమంతుడు ధైర్యము వహించి, ఎట్టి అవస్థ వచ్చినను ఇట్టి అనేకవిధములైన శోకములను విలాపమును, రోదనమును విడువవలెను.(37-39)

నీవు స్వస్థుడవు అగుము. దుఃఖించకుము. వెళ్ళి అయోధ్యను పాలించుము. జితేంద్రియుడైన మన తండ్రి నీకు ఆ విధముగ ఆజ్ఞ ఇచ్చి ఉన్నాడు. పవిత్రమైన కర్మలు గల తండ్రి నన్ను ఏ విషయమునందు ఆజ్ఞాపించినాడో ఆ విషయమునందే, నేను ఆయన ఆజ్ఞను నిర్వర్తించెదను. నేను మహారాజు ఇచ్చిన ఆజ్ఞను ఉల్లంఘింపరాదు. నీవు కూడ దానిని గౌరవించవలెను. ఎందుచేత ననగా ఆయనయే మనకు బంధువు. ఆయన మన తండ్రి.(40-42)

అందువలన నేను ధర్మాత్ముడైన తండ్రిగారి పూజనీయమైన ఆజ్ఞనే వనములో నివసించుట ద్వారా పాలించెదను. పరలోకములో సుఖముకావలె నని కోరు మానవుడు ధార్మికుడై, క్రూరత్వము లేక గురుశుశ్రూష చేయవలెను. మన తండ్రి యైన దశరథుడు ఎట్టి ఉత్తమచరిత్ర కలవాడో తెలుసుకొని, నీవు కూడ నీ స్వధర్మమును నిర్వర్తింపుము."(43-45)

మహాత్ముడు, సర్వసమర్థుడు అయిన రాముడు ఇట్లు "తండ్రి యాజ్ఞను పరిపాలింపుము." అని భరతునితో ఉత్తమమైన అర్థము గల మాటలు చెప్పి విరమించెను.(46)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట ఐదవ సర్గము సమాప్తము.

నూటఆరవ సర్గము

భరతుడు మరల రాము నయోధ్యకు వచ్చి రాజ్యము గ్రహింపుమని కోరుట.

ఆ మందాకినీతీరమునందు, రాము డీ విధముగా మంచి అర్థము గల మాటలు పలికి ఊరకుండెను. అపుడు ధార్మికుడైన భరతుడు స్వభావముచేతనే వాత్సల్యము కలవాడైన రామునితో, ధర్మసమ్మతము, ఆశ్చర్యజనకము అయిన వాక్యమును పలికెను.(1)

"ఓ శత్రుసంహారకుడవైన రామా! నీకు దుఃఖమువలన బాధ కాని, సుఖమువలన సంతోషము గాని లేదు. అట్టి నీతో సమానమైనవాడు ఈ లోకములో ఎవడున్నాడు? నీవు వృద్ధులచే గౌరవింపబడుచున్నావు. సంశయములు కలిగినపుడు వెళ్ళి వారిని అడుగుచుందువు.(2, 3)

మరణించినవాని విషయమునందు, జీవించి ఉన్నవాని విషయమునందు, చెడ్డవాని విషయమునందు, మంచివాని విషయమునందు, రాగద్వేషాదులు లేని బుద్ధి కలవానికి ఈ లోకములో దుఃఖమును కల్గించున దేది? వస్తువులలోని లేదా జనులలోని, తారతమ్యమును చక్కగా గుర్తింపగలిగిన నీవంటివాడు ఇట్టి దుఃఖమును పొంది బాధపడకూడదు.(4, 5)

(ఈ శ్లోకములోను, రాబోవు రెండు మూడు శ్లోకములలోను-రాముడు దుఃఖించుచుండగా అట్లు దుఃఖించరాదని భరతుడు ధైర్యము చెప్పుచున్నట్లు కనబడుచున్నది. కాని ఇంతవరకు, "ఏదీ మన చేతులలో లేదు. దేనికీ విచారించకూడదు; మన కర్తవ్యం మనము నెరవేరుస్తూ పూర్వీకులు నడచిన మార్గంలో నడవాలి" అని భరతునకు ఉపదేశించిన రాముడు తనకు వచ్చిన కష్టాలకై చింతించుచున్నాడనీ, భరతుడు ఓదార్చుచున్నాడనీ చెప్పుట యుక్తము కాదు. అందుచేత "నీవంటి సత్పురుషుడు ఈ విధముగా కష్టములు పడుట యుక్తము కాదు. నీవు తిరిగి అయోధ్యకు వచ్చి రాజ్యము పాలింపుము" అని చెప్పుటయే భరతుని ఉద్దేశ్యమని గ్రహించవలెను.)

నీవు దేవతలతో సమానమైన బలము కలవాడవు. సత్యమైన ప్రతిజ్ఞ కలవాడవు. అన్నీ తెలిసినవాడవు. అన్నీ చూడగలిగిన వాడవు. బుద్ధిమంతుడవు. జగత్తుయొక్క ఉత్పత్తివినాశాదులను గూర్చి తెలిసికొనగలిగిన నీవంటి ఉత్తమగుణవంతుడు

సహింపశక్యము కాని ఇట్టి దుఃఖముతో బాధపడుట యుక్తము గాదు.(6, 7)

నేను దేశాంతరములో నున్నపుడు నాకొరకై దుష్కరాలగు నా తల్లి చేసిన పాపకార్యము నాకు ఇష్టము కాదు. నీవు నన్ను అనుగ్రహింపుము. పాపకార్యము చేయుటచే దండమునకు తగిన నా తల్లిని నేను ధర్మమునకు భయపడి, తీవ్రదండముచేత వధింపలేకపోవుచున్నాను. పవిత్రమైన వంశమునందు బుట్టి, పవిత్రమైన కర్మలు ఆచరించిన దశరథుని కుమారుడనైన నేను ధర్మము తెలిసికూడ, లోకనిందితమైన ఈ అధర్మకార్యమును ఎట్లు చేయుదును?(8-10)

దశరథమహారాజు నాకు గురువు, క్రియాశీలుడు; వృద్ధుడు; తండ్రి; దేవతవంటివాడు. ఇపుడు మరణించినాడు కూడ. ఈ కారణములచే తండ్రిని నేను సభలో నిందించుటలేదు. ధర్మజ్ఞు డైనవాడు ఎవ్వడైన స్త్రీని సంతోషపెట్టుటకై, ధర్మార్థములకు విరుద్ధమైన ఇట్టి పాపకర్మను చేయునా! వినాశకాలమునందు ప్రాణుల బుద్ధి చెడిపోవునని ప్రాచీన మైన లోకోక్తి ఉన్నది. దశరథమహారాజు ఈ విధముగా ప్రవర్తించి ఆ లోకోక్తి సత్యమే అని నిరూపించినాడు.(11-13)

మన తండ్రిగారు, కోపమువలననో, అజ్ఞానమువలననో, సాహసము వలననో ధర్మాతిక్రమణము చేసినారు. అందుచే నీవు కర్తవ్యమును బాగుగా ఆలోచించి, వారు చేసిన ధర్మవిరుద్ధమైన కార్యమును వెనుకకు త్రిప్పవలయును. తండ్రి చేసిన ఉత్తమకార్యమును మాత్రమే అభినందించు పుత్రుడే పుత్రుడు. అట్లు కానిచో,(అధర్మకార్యమును అభినందించినచో) అతడు పుత్రుడే కాదు. అందువలన నీవు అట్టి సుపుత్రుడవు అగుము. లోకములో నున్న బుద్ధిమంతులందరు నిందించిన, తండ్రి చేసిన, పాపకర్మ నిన్ను పొందకుండుగాక!(14-16)

నీవు కైకేయిని, నన్ను, తండ్రిని, మన మిత్రులను, బంధువులను, పౌరజానపదులను, ఈ సకలరాజ్యమును రక్షింపుము.(17)

అరణ్యమెక్కడ! క్షత్రియధర్మ మెక్కడ? జట లెక్కడ! రాజ్యపాలన మెక్కడ? నీవు ఇట్టి విరుద్ధమైన కార్యమును చేయవలదు. రాజ్యమునందు అభిషిక్తుడగుటయే క్షత్రియుని ప్రధానధర్మము. దానిచే అతడు ప్రజలను పరిపాలింప గలుగును. ప్రత్యక్షఫలము నిచ్చు రాజ్యపాలనరూపమైన ధర్మమును విడిచి, క్షత్రియుడు ఎవడైన సంశయాస్పదము, మంచి లక్షణములు లేనిది, కాలాంతరమున ఫలము నిచ్చునది. నిశ్చితమైన ఫలములు లేనిది అయిన తాపసధర్మమును ఆచరించునా?(18-20)

లేదా నీవు శ్రమపడుటవలన కలుగు ధర్మమునే ఆచరించవలె నని కోరుకొన్నచో, నాలుగు వర్ణములను, ధర్మానుసారముగా పరిపాలించు శ్రమను పొందుము. నాలుగు ఆశ్రమములలో గృహస్థాశ్రమము శ్రేష్ఠమైన దని ధర్మవేత్తలు చెప్పుచుందురు కదా! అట్టి గృహస్థాశ్రమమును ఎట్లు విడిచిపెట్టెదవు?(21, 22)

నేను విద్యచేతను, స్థానముచేతను, జన్మముచేతను కూడ, నీకంటె చిన్నవాడను. అట్టి నేను, నీవు ఉండగా ఈ భూమిని ఎట్లు పరిపాలించగలను? బాలుడనైన నేను, బుద్ధిచేతను, గుణములచేతను, స్థానముచేతను గూడ చాలా తక్కువైనవాడను. నీవు లేనిచో నేను జీవించవలె నని కూడ అభిలషించను.(23, 24)

తండ్రిగారి నుండి సంక్రమించిన, నిష్కంటకమైన ఈ రాజ్యమునంతను, బంధుసమేతుడవై, ధర్మానుసారముగా జాగరూకుడవై పరిపాలింపుము. సమస్తమైన అమాత్యాదిప్రకృతులు, మంత్రకోవిదులైన వసిష్ఠాది ఋత్విక్కులు, నీకు ఇక్కడనే, వేదమంత్రములతో, రాజ్యాభిషేకము చేయుదురుగాక. అన్ని లోకములను బలముచే జయించిన దేవతాసహితుడైన దేవేంద్రుని వలె, నీవు రాజ్యాభిషిక్తుడవై, మే మందరము వెంట రాగా అయోధ్యను పాలించుటకు వెళ్లుము.(25-27)

దేవఋషిపితృఋణము లను మూడు ఋణములను తీర్చుచు, శత్రువులను బాధించుచు, మిత్రుల కోరికలను తీర్చుచు, నీవే నన్ను పాలింప వలయును. ఈనాడు నీవు రాజ్యాభిషిక్తుడ వగుటచే నీ మిత్రులందరు సంతోషించెదరుగాక! నీ శత్రువు లందరు భయపడి దిక్కులు పట్టి పారిపోవుదురుగాక!(28, 29)

నా తల్లికి జనులవలన కలిగిన శాపమును తొలగించి, పూజ్యుడైన తండ్రిగారిని కూడా పాపమునుండి రక్షించుము. నేను శిరస్సు వంచి ప్రార్థించుచున్నాను. మహేశ్వరుడు ప్రాణులపై దయచూపి నట్లు నాపైన, సమస్తబాంధవుల పైన దయ చూపుము. నా ప్రార్థనను కాదని నీవు అరణ్యమునకే వెళ్ళినచో, నేను కూడా నీతో అరణ్యమునకు వచ్చెదను."(30-32)

గొప్ప మనఃస్థైర్యము కలవాడు, భూమండలమునకు ప్రభువు అయిన రాముడు భరతుడా విధముగా సవినయముగా ప్రార్థించుచున్నను తండ్రిమాటమీదనే స్థిరముగా నిలచినవాడై అయోధ్యకు తిరిగి వెళ్లుటకు అంగీకరించలేదు. రామునిలోని ఆశ్చర్యకరమైన ఆ మనఃస్థైర్యమును చూచి, జనులందరు దుఃఖితులై దుఃఖముతో పాటు సంతోషమును కూడ పొందిరి. అతడు అయోధ్యకు వచ్చుటలేదే అని దుఃఖించిరి. అతని స్థిరప్రతిజ్ఞత్వమును చూచి సంతోషించిరి.(33, 34)

అపుడు ఆ విధముగా పలుకుచున్న భరతుని ఋత్విక్కులు, నిగమసముదాయముల నాయకులు, స్పృహ తప్పి కన్నీళ్ళ బొట్లు కూడా లేని తల్లులు స్తుతించిరి. వారందరు రాముని సవినయముగా ప్రార్థించిరి.(35)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట ఆరవ సర్గము సమాప్తము.

నూట ఏడవ సర్గము

రాముడు భరతుని ఓదార్చి అయోధ్యకు పొమ్మని ఆదేశించుట.

శ్రీమంతుడు, అందరిచేత పూజింపబడినవాడు అయిన రాముడు బంధువుల మధ్య మరల ఈ విధముగా మాటలాడు చున్న భరతునితో ఇట్లు పలికెను.(1)

"రాజశ్రేష్ఠుడైన దశరథునకు కైకేయియందు జన్మించిన పుత్రుడ వైన నీవు చెప్పినదంతయు యుక్తముగానే ఉన్నది. మన తండ్రి పూర్వము నీ తల్లిని వివాహమాడు సమయమునందు అత్యుత్తమ మైన ఈ రాజ్యమును ఆమె కుమారునకే ఇచ్చెద నని నీ మాతామహుని ముందు ప్రతిజ్ఞ చేసెను. దేవాసురుల సంగ్రామము జరిగినపుడు నీ తల్లి చేసిన సేవకు చాల సంతోషించి, సమర్థుడైన దశరథమహారాజు, ఆమెకు వరమును కూడ ఇచ్చెను. పిదప కీర్తిగలదీ, ఉత్తమస్త్రీజాతికి చెందినదీ అయిన నీ తల్లి, దశరథమహారాజుచే ఒట్టు పెట్టించుకొని, నీకు రాజ్యము, నాకు అరణ్యవాసము అను రెండు వరములను కోరెను. ఆమె అట్లు కోరగా రాజు ఆ వరములను ఆమెకు ఇచ్చెను.(2-6)

ఆ వరములలో ఒకటిగా పదునాలుగు సంవత్సరములు నేను వనములో నివసించవలెనని, నన్ను తండ్రి ఆజ్ఞాపించినాడు. నేను తండ్రి పలికిన సత్యవాక్యునందే స్థిరముగా నిలచి, ఎదురు లేనివాడనై, సీతాలక్ష్మణసహితుడనై, ఈ నిర్జనవనమునకు వచ్చితిని. నీవు కూడ మన తండ్రి చెప్పిన విధమున వెంటనే రాజ్యాభిషిక్తుడ వై, ఆయన సత్యవాదిత్వమును నిలబెట్టుము.(7-9)

నా మాట విని దశరథమహారాజును ఋణవిముక్తుని చేయుము. ధర్మజ్ఞుడైన తండ్రిని, తల్లిని సంతోషపెట్టుము. పూర్వము గయాక్షేత్రములో పితృదేవతలను గూర్చి యాగము చేయుచు, కీర్తిమంతుడైన గయుడు, ఈ విధముగ చెప్పినట్లు

వినుచున్నాము. సుతుడు తండ్రిని "పుత్" అను నరకమునుండి రక్షించును. పితృదేవతలను అన్ని విధముల రక్షించును. అందుచేత అతనికి పుత్రుడు అను పేరు వచ్చినది. గుణవంతులు, విద్యావంతులు అయిన చాలామంది పుత్రులు కావలెనని కోరుకొనవలెను. ఎందుచేత ననగా, వారిలో ఏ ఒక్కడైన గయాక్షేత్రమునకు వెళ్ళవచ్చును కదా!(10-13)

రాజర్షులందరు ఇట్లే నిర్ణయించినారు. అందుచే నీవు తండ్రిని నరకములో పడకుండ రక్షించుము. నీవు అయోధ్యకు వెళ్లుము. శత్రుఘ్నునితోను, ద్విజులందరితోను కూడి, ప్రజలనందరిని రంజింపచేయుము. లేదా నీవు శత్రుఘ్నునితోను, ద్విజులతోను కలిసి అయోధ్యకు వెళ్ళి ప్రజలను రంజింపచేయుము. నేను ఈ సీతాలక్ష్మణులతో కలిసి, వెంటనే దండకారణ్యమునకు వెళ్ళెదను. నీవు నరులకు రాజు వగుము. నేను వనములో నున్న మృగములకు రాజు అయ్యెదను. నీవు సంతోషపూర్వకముగా ఇపుడు అయోధ్యకు వెళ్లుము. నేను సంతోషపూర్వకముగా దండకారణ్యమునకు వెళ్ళెదను.(14-17)

సూర్యుని ఎండను తొలగించుచు, శ్వేతచ్ఛత్రము నీ శిరస్సుపై చల్లని నీడను ఇచ్చుగాక. నేను కూడా ఈ అరణ్యవృక్షముల దట్టమైన నీడను సుఖముగా ఆశ్రయించెదను. బుద్ధిశాలియైన శత్రుఘ్నుడు నీకు తోడుగా ఉండును. లక్ష్మణుడు నాకు ప్రధానమిత్రుడని ప్రసిద్ధమైన విషయమే కదా! మనము నలుగురు కుమారులము దశరథమహారాజు సత్యవ్రతమును నిలబెట్టెదము. దుఃఖించకుము.(18, 19)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట ఏడవ సర్గము సమాప్తము.

నూట ఎనిమిదవ సర్గము

జాబాలి నాస్తికమత మవలంబించి రామునికి నచ్చజెప్పుట.

ధర్మజ్ఞుడైన రాముడు భరతునకు ఈ విధముగా నచ్చచెప్పుచుండగా, బ్రాహ్మణోత్తముడైన జాబాలి అతనితో ధర్మవిరుద్ధముగా ఇట్లు పలికెను.(1)

"రామా! బాగు బాగు! ఉత్తమ మైన బుద్ధిగల ఆత్మాభిమానవంతుడ వైన నీకు సామాన్యుడైన మూఢునకు వలె, ఇట్టి నిష్ప్రయోజన మైన ఆలోచన కలుగకూడదు.(2)

ఎవడైనను ఒక్కడే పుట్టుచున్నాడు; ఒక్కడే మరణించుచున్నాడు. అట్టి స్థితిలో ఎవనికి ఎవడు బంధువు? ఎవడు ఎవనినుంచి ఏమి పొందగలుగును? తల్లి యనీ, తండ్రి యనీ, అనుకొనుచు వారిపై అధికప్రేమబంధము కలవాడు ఉన్మత్తునివంటి వాడు. ఎవ్వరు ఎవరికి ఏమి కావలెను? గ్రామాంతరమునకు వెళ్లువాడు, ఒక చోట ఆగి, మరునాడు ఆ నివాసస్థానమును విడచి, ప్రయాణమై పోవుచుండును. మనుష్యులకు తండ్రి, తల్లి, గృహము, ధనము అనునవి ఇట్టి నివాసస్థానమువంటివి మాత్రమే. సజ్జనులకు వాటియందు సంగము ఉండదు.(3-6)

తండ్రివలన సంక్రమించిన రాజ్యమును విడిచి అనేక ఉపద్రవములతో, దుఃఖకరమైన, విషమమైన ఈ చెడ్డమార్గమును అవలంబించకుము. నీవు సర్వసమృద్ధమైన అయోధ్యకు వెళ్ళి, పట్టాభిషేకము చేసుకొనుము. పతివ్రత ఏకవేణిని ధరించి, భర్తకై వేచియున్నట్లు, ఆ నగరము నీకై వేచి యున్నది. నీవు శ్రేష్ఠము లైన రాజభోగములను అనుభవించుచు దేవేంద్రుడు స్వర్గములో విహరించునట్లు, అయోధ్యలో విహరింపుము.(7-9)

నీకు దశరథు డేమియు కాడు. అతనికి నీవును ఏమియు కావు. అ రాజెవ్వరో నీ వెవ్వరో! అందుచేత నేను చెప్పినట్లు చేయుము. ప్రాణికి తండ్రి బీజము మాత్రమే. తల్లి ఋతుమతి యైనప్పుడు శుక్లము శోణితము కలువగా పురుషుడు జన్మించుచున్నాడు.(10, 11)

ఆ దశరథమహారాజు, తాను ఎక్కడికి వెళ్ళవలెనో, అక్కడికి వెళ్ళిపోయినాడు. మరణశీలు లైన మానవుల పద్ధతి ఇట్లే ఉండును. నీవు మాత్రము అనవసరముగా కష్టముల పాలగుచున్నావు. కేవలము అర్థముకొరకు, ధర్మముకొరకు, పాటుపడువారిని చూచి నాకు దుఃఖము(జాలి) కల్గుచున్నది. ఇతరులను చూచి కలుగదు. ఎందుచేతననగా ఆ అర్థధర్మపరులు, ఈ లోకములో కష్టములు అనుభవించి, మరణానంతరము కూడ నాశనమును చెందుదురు.(12, 13)

జనులు అష్టకాశ్రాద్ధమని, ప్రత్యాబ్దికశ్రాద్ధ మని చేయుచుందురు. ఎంత అన్నము వ్యర్థమగుచున్నదో చూడుము. చచ్చినవాడు ఏమి తినును? ఇక్కడ ఒకడు భుజించిన ఆహారము మరియొకని దేహములోనికి వెళ్ళినచో, విదేశమునకు వెళ్లువానికి శ్రాద్ధము పెట్టవచ్చును. అది అతనికి మార్గములో ఆహారము అగును గదా? యజ్ఞములు చేయుము; దానములు ఇమ్ము; దీక్ష వహించుము; తపస్సు చేయుము; అన్నీ ఇచ్చివేయుము, అని చెప్పుచు, మేధావులు వ్రాసిన గ్రంథములన్నీ

దానవశీకరణోపాయములు.(14-16)

పర మనునది లేదనియే నిశ్చయించుకొని, ప్రత్యక్షమైనదానిని ఆచరించుము. పరోక్షమైన దానిని లెక్కచేయకుము. భరతుడు బ్రతిమాలుచున్నాడు. అందుచేత నీవు లోకములో ఎన్నియో ఉదాహరణములు గల నేను చెప్పిన ఆలోచనను అంగీకరించి రాజ్యమును స్వీకరింపుము.(17, 18)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట ఎనిమిదవ సర్గము సమాప్తము.

నూట తొమ్మిదవ సర్గము

రాముడు జాబాలి పలికిన నాస్తికమతమును ఖండించి అస్తిక మతమును స్థాపించుట.

సత్యబుద్ధులలో శ్రేష్ఠుడైన రాముడు, జాబాలి మాటలు విని అధికమైన భక్తితోను, చలించని బుద్ధితోను ఇట్లు పలికెను.(1)

"నీవు నా ప్రియమును కోరి ఇంతవరకు మాటలాడిన మాటలు పైకి కర్తవ్యములు వలె, హితములువలె కనబడు అకర్తవ్యములు అహితములు అయిన మాటలు. కట్టుబాట్లు లేక, పాపాచారవంతుడై, సచ్చరిత్రకు, మంచి దృష్టికి విరుద్ధముగా ప్రవర్తించు మానవుడు సత్పురుషుల గౌరవము పొందజాలడు. ఎవడు కులీనుడో ఎవడు కాడో, ఎవడు వీరుడో ఎవడు కేవలము వీరత్వాభిమానము కలవాడో, ఎవడు పరిశుద్ధుడో ఎవడు కాడో, వాని నడవడికయే చెప్పును.(2-4)

నేను ఆర్యుడు(పూజ్యుడు) వలె పైకి కనపడుచు, అనార్యుడనై, శుచిత్వము(నిజాయితీ) లేక అశుచినై, ఉత్తమలక్షణములున్నవాడు వలె కనబడుచు, ఉత్తమలక్షణములు లేనివాడనై, చెడ్డశీలము కలవాడనైనను, శీలవంతుడు వలె కనబడుచు, శుభమైన మార్గమును విడిచి, సత్కర్మలు గాని, శాస్త్రము గాని లేనిదీ, లోకసంకరహేతువూ ఐన ఈ అధర్మమును, ధర్మ మనే వేషముతో ఆచరించినచో, ఈ విధముగా దుష్టమైన ప్రవృత్తితో లోకమునకు కీడు కల్గించుచున్న నన్ను ఈ లోకములో కార్యాకార్యములు తెలిసిన చైతన్యవంతుడైన ఏ పురుషుడైన గౌరవించునా?(5-7)

నేను ప్రతిజ్ఞ విడచి ఈ విధముగా ప్రవర్తించినచో, ఎవరికి మంచి మార్గమును ఉపదేశించగలను? స్వర్గమునకు ఎట్లు వెళ్ళగలను? నేను అట్లు ప్రవర్తించినచో జనులందరు స్వేచ్ఛాచారు లైపోవుదురు. రాజులు ఏ విధముగా ప్రవర్తింతురో ప్రజలు కూడ ఆ విధముగానే ప్రవర్తించుచుందురు కదా! అతిపురాతనము, శాశ్వతము అయిన ఈ రాజధర్మము, సత్యస్వరూపమైనది. దీనిలో క్రూరత్వమునకు తావు లేదు. అందుచే రాజ్యము సత్యప్రధానము. సత్యము మీదనే లోకము నిలిచి యున్నది. (8-10)

ఋషులు, దేవతలు కూడ సత్యమే పరమధర్మమని అంగీకరించిరి. సత్యమును పలుకువాడు ఈ లోకములో ఉత్తమమైన స్థానమును పొందును. అసత్యము చెప్పువానిని చూచి, జనులు సర్పమును చూచి భయపడునట్లు భయపడుదురు. ఇహ లోకములో, సత్యమే ఉత్తమధర్మము. ఇది స్వర్గమునకు కూడ మూలకారణమని చెప్పుదురు. ఈ లోకములో సత్యమే ఈశ్వరుడు. లక్ష్మి ఎల్లపుడు సత్యమును ఆశ్రయించి ఉండును. అన్నిటికిని సత్యమే మూలము. సత్యమును మించిన ఉత్తమధర్మ మేదియు లేదు. దానము, యాగము, హోమము, తపస్సు, వేదములు ఇవన్నియు సత్యము మీదనే ఆధారపడి యున్నవి. అందుచే మానవుడు సత్యమును అవలంబింపవలెను. (11-14)

లోకములో ఒకడు రాజ్యమును పాలించును. ఒకడు వంశమును వృద్ధిలోనికి తెచ్చును. ఒకడు నరకములో పడును. ఒకడు స్వర్గములో గౌరవమును పొందుచుండును. (ఇవి సత్యాసత్యముల వలన వచ్చు ఆ యా ఫలములు). నేను సత్యప్రతిజ్ఞ కలవాడను. తండ్రి యెదుట సత్యముపై శపథము చేసి సత్యమైన, అతని యాజ్ఞను పరిపాలించకుండ ఎట్లుందును? సత్యప్రతిజ్ఞ కల నేను నా తండ్రిగారి సత్యమను సేతువును లోభము వల్ల కాని, చిత్తభ్రమవలన కాని, తమోగుణముచే కలిగిన అజ్ఞానమువలన గాని భేదించను. అసత్యసంధుడై, చిత్తస్థైర్యము లేక, చపలుడుగా ఉన్నవాడు సమర్పించిన హవ్యకవ్యాదులను దేవతలు గాని, పితృదేవతలు గాని స్వీకరించరని మేము విన్నాము. సత్యమనే ఈ ధర్మము, సాక్షాత్తు ప్రత్యగాత్మ యని నేను తలచుచున్నాను. అందుచేతనే సత్పురుషు లాచరించిన ఈ కష్టమైన కార్యమును నేను గౌరవించుచున్నాను. (15-19)

నీచులు, క్రూరులు, దురాశాపరులు, పాపాత్ములు అయినవారు సేవించునదీ, కొంచెము ధర్మముతో కూడినను, అధర్మముతో నిండినదీ అయిన క్షత్రియధర్మమును

నేను పరిత్యజించెదను. మానవుడు ముందుగా మనస్సుతో నిర్ధారణ చేసుకొని, పిమ్మట దేహముతో పాపకర్మ చేయును. నాలుకతో అసత్యము పలుకును. ఈ విధముగా పాపము మానసికము, కాయికము, వాచికము అని మూడు విధములు. భూమి, సత్కార్యాదులచే కలిగిన కీర్తి, పౌరుషాదులచే కలిగిన యశస్సు, లక్ష్మి ఇవి సత్యవంతుడైన పురుషుని చేరవలెనని కోరుచుండును. అతడు స్వర్గస్థుడయినను అతనినే చూచుచుండును. అందువలన సత్యమునే అవలంబించవలయును. (20-22)

నీవు శ్రేష్ఠము అని నిర్ణయించి, యుక్తియుక్తములైన మాటలతో "మంగళకరమైన దీనిని చేయుము" అని నాతో చెప్పిన దంతయు చెడ్డదే. నేను వనవాసము చేసెదను అని తండ్రిగారి ఎదుట ప్రతిజ్ఞ చేసి, ఇపుడు ఆయన మాట కాదని భరతుని మాట లెట్లు చేయుదును? నేను తండ్రి ఎదుట స్థిరమైన, ప్రతిజ్ఞ చేసితిని. అపుడు కైకేయీ దేవి కూడ చాల సంతోషించినది. నేను పరిశుద్ధుడనై, మితభోజనము చేయుచు, పవిత్రము లైన మూలఫలములతో, పితృదేవతలను తృప్తి పొందించుచు, పంచేంద్రియములను సంతుష్టి కలవాటినిగా ఉంచుకొనుచు, కపటము విడనాడి శ్రద్ధావంతుడనై కార్యాకార్యములను తెలుసుకొనుచు, ఈ విధముగా వనవాసము చేయుచు జీవితమును గడపెదను. (23-27)

ఈ కర్మభూమిని పొందినవాడు, శుభమైన కర్మను తప్పక చేయవలెను. అగ్ని వాయుచంద్రులు, వారు చేసిన కర్మలకు ఫలముగా ఆ యా పదములను పొందగలిగినారు. దేవేంద్రుడు నూరు యజ్ఞములు చేయుటచేతనే స్వర్గాధిపత్యమును పొందినాడు. మహర్షులు తీవ్రమైన తపస్సులు చేసి స్వర్గమునకు వెళ్ళినారు."(28-29)

ఉగ్రమైన తేజస్సు గల దశరథకుమారుడైన రాముడు, నాస్తికత్వముతో కూడిన ఆ జాబాలి చేసిన హేతువాదమును విని, దానిని సహించజాలక అతని మాటలు ఖండించుచు ఇంకను ఇట్లు పలికెను. (30)

"సత్యము, ధర్మము, పరాక్రమము, భూతదయ, ప్రియవాక్కు దేవబ్రాహ్మణాతిథుల పూజ, ఇవి స్వర్గమునకు మార్గములని సత్పురుషులు చెప్పుచున్నారు. అందుచేతనే బ్రాహ్మణులు, విషయమును సరిగా తెలుసుకొని, తప్పక సత్ఫలము నిచ్చు మార్గమును అవలంబించి, ఏమరుపాటు లేకుండగ, సకల ధర్మములను యథావిధిగా ఆచరించుచు, ఉత్తమలోకప్రాప్తిని కోరుచున్నారు. (31,32)

చెడుమార్గమునందు ప్రవర్తించుచున్న బుద్ధికలవాడవూ, ఈ విధమైన ఆలోచనలతో సంచరించుచున్న నాస్తికుడవూ, ధర్మమార్గమునుండి చ్యుతుడవూ అయిన నిన్ను చేరదీసిన మా తండ్రిగారిని నేను నిందించుచున్నాను. (33)

బుద్ధుడు చోరుని వంటివాడు. అతడు నాస్తికుడని తెలుసుకొనుము. అందుచే అతడు ప్రజలకు శంకాపాత్రుడు. పండితుడు ఎన్నడును నాస్తికునితో సంబంధము ఉంచుకొనరాదు. (34)

నీకంటే పూర్వులు, శ్రేష్ఠులు అయిన జనులు అనేకమైన శుభకర్మలు చేసిరి. ఇహలోకమును పరలోకమును, కూడ జయించిరి. ఆ కారణమువలన బ్రాహ్మణులు హోమమును, కర్మలను మంగళార్థమై చేయుచుందురు. ధర్మమునందాసక్తి కలవారు, సత్పురుషుల స్నేహము చేయువారు, తేజోవంతులు, దానగుణము ప్రధానముగా కలవారు, హింస చేయనివారు, తొలగిన పాపము గలవారు, ఉత్తములు అయిన మునులే లోకములో పూజింపదగినవారు. (35, 36)

ఈ విధముగా కోపముతో పలుకుచున్న మహాత్ముడూ, దైన్యము లేని బుద్ధికలవాడూ అయిన రామునితో జాబాలి హితమూ, ఆస్తిక్యముతో కూడినదీ, సత్యమూ అయిన మాటను అనునయపూర్వకముగా ఇట్లు పలికెను. (37)

నేను నాస్తికుల మాటలు చెప్పుటలేదు. నేను నాస్తికుడను కాను. పరలోకాదికము ఏమీ లేదనునది లేదు. కాలమును బట్టి నేను మరల ఆస్తికుడను అగుదును. మరొక సమయమునందు నాస్తికుని వలె మాటలాడుదును. నేను నాస్తికవాక్కు పలుకవలసిన సమయము మెల్లగా వచ్చుటచే అట్టి మాటలు చెప్పితిని. నిన్ను అయోధ్యకు మరలించుటకూ నిన్ను అనుగ్రహింపచేసుకొనుటకు నీకొరకు మాత్రమే నేను ఈ విధముగా మాటలాడితిని. (38, 39)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట తొమ్మిదవ సర్గము సమాప్తము.

నూట పదవ సర్గము

వసిష్ఠుడు సృష్టిపరంపరను, ఇక్ష్వాకువంశపరంపరను తెలిపి జ్యేష్ఠుడే రాజగుట యుక్తమని నిర్ణయించి, రాముని రాజ్యము స్వీకరింపుమని పలుకుట.

రాముడనకు కోపము వచ్చినట్లు గుర్తించి, వసిష్ఠుడు ఇట్లు పలికెను. "జనులు ఆ యా లోకములకు పోవుచు, తిరిగి వచ్చుచు ఉందురని జాబాలికి కూడ తెలియును. కేవలము నిన్ను అయోధ్యకు మరలింపవలె నని మాత్రమే ఇతడు ఇట్లు పలికినాడు. ఈ లోకము ఎట్లు పుట్టినదో చెప్పెదను వినుము.(1, 2)

సృష్టిప్రారంభమున, అంతయు జలమయమై ఉండెను. దానిపై భూమి పుట్టెను. అటుపిమ్మట దేవతలు, బ్రహ్మదేవుడు పుట్టిరి. ఆ బ్రహ్మదేవుడు వరాహరూపము ధరించి, భూమిని ఉద్ధరించెను. శిక్షితమైన బుద్ధి గల, తన పుత్రులైన మరీచ్యాదులతో కలసి అతడు ఈ జగత్తునంతను సృష్టించెను.(3, 4)

(బ్రహ్మయే వరాహావతారము ఎత్తి భూమిని ఉద్ధరించెనని కూడ కొన్ని పురాణములలో ఉన్నది. అందుచేత విష్ణువు అను పదమును అధ్యాహారము తెచ్చుకొని అతడు వరాహావతారమున భూమిని ఉద్ధరించెనని పూర్వవ్యాఖ్యాతలు చెప్పినట్లు గ్రహించవలసిన పనిలేదు.)

శాశ్వతుడు, నిత్యుడు, వినాశము లేనివాడు అయిన బ్రహ్మదేవుడు పరబ్రహ్మనుండి పుట్టెను. బ్రహ్మదేవునకు మరీచి, అతనికి కశ్యపుడు కుమారులుగా పుట్టిరి. కశ్యపునకు సూర్యుడు కుమారుడుగా పుట్టెను. పూర్వము ప్రజాపతిగా నున్న మనువు సూర్యుని కుమారుడు. మనువు కుమారుడు ఇక్ష్వాకువు. మనువు మొదట సమృద్ధమైన ఈ భూమిని ఎవనికి ఇచ్చెనో ఆ ఇక్ష్వాకువే మొదటి అయోధ్యారాజని తెలిసికొనుము.(5-7)

ఇక్ష్వాకువునకు శ్రీమంతుడైన కుక్షి కుమారుడుగా పుట్టెను. కుక్షి కుమారుడు వికుక్షి. వికుక్షికి గొప్ప తేజస్సు గలవాడు, ప్రతాపవంతుడు అయిన బాణుడు పుత్రుడుగా పుట్టెను. బాణునకు గొప్ప బాహువులు కలవాడూ, గొప్ప కీర్తి గలవాడు అయిన అనరణ్యుడు పుట్టెను. సత్పురుషులలో శ్రేష్ఠుడైన ఈ అనరణ్యమహారాజు రాజ్యము చేయుచున్నపుడు, అనావృష్టి కాని, దుర్భిక్షము కాని కలుగలేదు. ఒక్క దొంగ కూడ లేకుండెను. అనరణ్యునకు మహాబాహువైన పృథువు అను రాజు,

పృథువునకు త్రిశంకువు పుట్టిరి. వీరుడైన త్రిశంకువు సత్యవాక్యవరముచే శరీరముతో స్వర్గమునకు వెళ్ళినాడు.(8-11)

త్రిశంకువునకు గొప్ప కీర్తి గల దుందుమారుడు, దుందుమారునకు గొప్ప తేజస్సు గల యువనాశ్వుడు పుట్టిరి. శ్రీమంతుడైన మాంధాత యువనాశ్వుని కుమారుడు. మాంధాతకు మహాతేజశ్శాలి యైన సుసంధి పుట్టెను. సుసంధికి ధ్రువసంధి, ప్రసేనజిత్తు అను ఇద్దరు కుమారులు పుట్టిరి. కీర్తి కలవాడు, శత్రుసంహారకుడు అయిన భరతుడు ధ్రువసంధి కుమారుడు.(12-14)

భరతునకు అసితుడు పుట్టెను. అతనికి హైహయులు, తాలజంఘులు, శూరులైన శశిబిందులు అను రాజవంశీయులు శత్రువులైరి. అసితుడు ఆ శత్రురాజు లందరిని ఎదిరించగా వారు అతనిని తరిమివేసిరి. అతడు అపుడు అందమైన పర్వతమును ఆశ్రయించి, అక్కడ మునివృత్తిని అవలంబించెను.(15-17)

అసితుని ఇద్దరు భార్యలు గర్భవతులై ఉండిరి. వారిలో ఒక భార్య సవతి గర్భము నశించుటకై ఆమెకు విషము పెట్టెను. భృగువంశమునకు చెందిన చ్యవనమహర్షి హిమవత్పర్వతముపై నివసించుచుండెను. అసితుని భార్యయైన కాళింది అతని దగ్గరకు వెళ్ళి నమస్కరించెను. పుత్రుడు జన్మించ వలెనను వరమును కోరుచున్న ఆమెను చూచి ఆ బ్రాహ్మణుడు ఇట్లు పలికెను. "ఓ దేవీ! నీకు మహాత్ముడూ, లోకప్రసిద్ధుడూ, ధార్మికుడూ, ఉత్తమశీలుడూ, వంశోద్ధారకుడూ, శత్రుసంహారకుడూ అయిన పుత్రుడు పుట్టును."(18-20)

ఆ కాళిందీ దేవి చాలా సంతోషించి, ఆ చ్యవనమహర్షికి ప్రదక్షిణముచేసి, అతని అనుమతి పొంది, ఇంటికి వచ్చి పద్మపత్రముల వంటి నేత్రములు కలవాడు, బ్రహ్మసమానమైన కాంతి కలవాడూ అయిన కుమారుని కనెను. ఆమె గర్భమును చంపవలె నని ఆమె సవతి విషము పెట్టెను. ఆ పిల్లవాడు విషముతోనే పుట్టుటచేత సగరుడయ్యెను. ఆ సగరచక్రవర్తి యజ్ఞము చేసి, యజ్ఞాశ్వమును అన్వేషించు సమయమునందు పర్వములలో పొంగి ప్రజలను భయపెట్టుచున్న సముద్రమును త్రవ్వించెను.(21-24)

సగరునకు అసమంజుడను పుత్రుడు కలిగెను. అతడు పాపకర్మలు చేయుటచే తండ్రి అతనిని జీవించియుండగానే పరిత్యజించెను. అసమంజునకు పరాక్రమశాలి యైన అంశుమంతుడు, అంశుమంతునకు దిలీపుడు, దిలీపునకు భగీరథుడు పుట్టిరి. భగీరథునకు కకుత్స్థుడను పుత్రుడు పుట్టెను. అతనిని బట్టియే మీకు

కాకుత్స్థులని పేరు వచ్చినది. కకుత్స్థునకు రఘువను పుత్రుడు పుట్టెను. అతనిని బట్టియే మీకు రాఘవు లని పేరు వచ్చినది.(25-27)

రఘువు పుత్రుడు తేజశ్శాలియై, పెరిగి లోకములో పురుషాదకుడు, కల్మాషపాదుడు, సౌదాసుడు అను పేర్లతో ప్రసిద్ధుడయ్యెను. కల్మాషపాదుని పుత్రుడు శంఖణుడు. అతడు తండ్రితోనే యుద్ధము చేసి ససైన్యముగా నశించెను.(28, 29)

శంఖణుని కుమారుడు శ్రీమంతుడు శూరుడు అయిన సుదర్శనుడు. అతని కుమారుడు అగ్నివర్ణుడు. అతని కుమారుడు శీఘ్రగుడు. అతని కుమారుడు మరువు. అతని కుమారుడు ప్రశుశ్రువుడు. అతని కుమారుడు మహాకాంతిశాలియైన అంబరీషుడు. అతని కుమారుడు సత్యవిక్రముడైన నహుషుడు. అతని కుమారుడు పరమధార్మికుడైన నాభాగుడు. నాభాగునకు అజుడు, సువ్రతుడు అను ఇద్దరు కుమారులు. ధర్మాత్ముడైన దశరథమహారాజు అజుని కుమారుడే.(30-33)

రాముడను ప్రసిద్ధనామధేయము గల నీవు ఆ దశరథుని జ్యేష్ఠకుమారుడవు. అతని రాజ్యముపై అధికారము కలవాడవు. అందుచేత ఓ రాజా! నీ రాజ్యమును నీవు గ్రహించి ప్రజలను పాలింపుము. ఇక్ష్వాకువంశీయులలో జ్యేష్ఠపుత్రుడే రాజగును. జేష్ఠ దుండగా, చిన్నవాడు రాజు కాదు. జ్యేష్ఠుడే రాజ్యాభిషిక్తుడగును. నీవు ఇపుడు అతిప్రాచీనమైన రఘువంశీయుల ఆ కులధర్మమును చెరచవద్దు. అధికమైన రత్నములు, విశాలములైన రాష్ట్రములు గల ఈ భూమిని, నీ తండ్రివలెనే పరిపాలింపుము."(34-36)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట పదవ సర్గము సమాప్తము.

నూట పదకొండవ సర్గము

వసిష్ఠుడు నచ్చబలికినను రాముడు తండ్రియాజ్ఞ మీర దలంచక పోవుట చూచి భరతుడు ప్రాయోపవేశమునకు సిద్ధపడుట. రాము డతనికి నచ్చజెప్పి అయోధ్యకు మరలిపొమ్మని ఆజ్ఞాపించుట.

రాజపురోహితుడైన వసిష్ఠుడు, రామునితో ఇట్లు పలికి, మరల ధర్మ సంయుక్తమైన మాట లిట్లు చెప్పెను.(1)

ఓ రామా! జన్మించిన ప్రతిపురుషునకును ఆచార్యుడు, తండ్రి, తల్లి, అను ముగ్గురు గురువులు ఉందురు. తండ్రి పురుషుని పుట్టించును. ఆచార్యుడు అతనికి జ్ఞానమును ఇచ్చును. అందుచే అతడు గురు వగుచున్నాడు. నేను నీ తండ్రికి నీకు కూడ ఆచార్యుడను. నీవు నేను చెప్పినట్లు చేసినచో, సత్పురుషుల మార్గమును అతిక్రమించినవాడవు కావు.(2-4)

ఈ పండితపరిషత్తులు, శ్రేణులు, ద్విజులు వీరందరు నీవారు. వీరి విషయమున నీవు పాలనారూపమైన ధర్మము ఆచరించినచో సత్పురుషుల మార్గమును అతిక్రమించినవాడవు కావు. నీవు వృద్ధురాలు, ధర్మము చేయు స్వభావము కలదీ అయిన తల్లికి శుశ్రూష చేయకుండగా ఉందరాదు. ఈమె చెప్పినట్లు ఆచరించినచో నీవు సత్పురుషుల మార్గమును అతిక్రమించినట్లు కాదు. ఈ విధముగా ప్రార్థించుచున్న భరతుని మాటలు అంగీకరించినచో నీవు స్వధర్మమును అతిక్రమించినట్లు కాదు.(5-7)

పురుషశ్రేష్ఠుడైన రాముడు, గురువైన వసిష్ఠుడు స్వయముగా చెప్పిన మధురమైన మాటలు విని, తన ప్రక్కనే కూర్చొని ఉన్న అతనితో ఇట్లనెను.(8)

"తల్లిదండ్రులు పుత్రుని విషయమున ఎల్లపుడు ఏ విధముగా ప్రవర్తించుచుందురో దానికిని, యథాశక్తిగా ఆయా వస్తువులను ఇచ్చి, నిద్రపుచ్చుచు స్నానాదులు చేయించుచు నిత్యము మంచిమాటలు చెప్పుచు, పెంచు తల్లీ, తండ్రి ఏ ఉపకారము చేయుదురో దానికిని ప్రత్యుపకారము చేయుట శక్యమైన పనికాదు. మా తండ్రి యైన దశరథమహారాజు నాకు జన్మ ఇచ్చినవాడు. ఆయన ఎదుట నేను చేసిన ప్రతిజ్ఞ వ్యర్థము కారాదు."(9-11)

గొప్ప ఔదార్యవంతుడైన భరతుడు రాముని మాటలు విని, చాలా

దుఃఖించెను. దగ్గరనే ఉన్న సుమంత్రునితో ఇట్లనెను.(12)

"ఓ సుమంత్రా! ఇక్కడ నేలపై కుశలను పరచుము. నా విషయమున ప్రసన్నుడగునంతవరకు అన్నగారిని అడ్డగించి, ఇక్కడ పరుండెదను. ధనహీనుడైన బ్రాహ్మణుడు వలె ఆహారము తీసుకొనక, వెలుతురు చూడక, ఈ పర్ణశాలముందు రాముడు తిరిగి వచ్చునంతవరకు శయనించెదను."(13, 14)

దుఃఖితుడైన ఆ భరతుడు, రాముని ఆజ్ఞకై అతనిని చూచుచున్న సుమంత్రునిచూచి స్వయముగానే కుశాస్తరణము తీసుకొనివచ్చి నేలపై పరచెను.(15)

మహాతేజశ్శాలీ, రాజర్షులలో శ్రేష్ఠుడూ అయిన రాముడు అతనితో ఇట్లనెను. "నాయనా! భరతా! నేను ఏమి చెడ్డ పని చేసితినని నీవు ఇట్లు అడ్డముగా శయనించెదవు. తనవద్ద అప్పు తీసుకొని ఎగగొట్టచూచుచున్న వారిని అడ్డగించుటకై బ్రాహ్మణుడు ఒక ప్రక్క శయనించవచ్చును గాని, ఈ విధముగా ప్రత్యుపవేశనము చేయుట క్షత్రియులకు విధింపబడలేదు. దారుణమైన ఈ వ్రతమును విడిచి వెంటనే పురములలో శ్రేష్ఠమైన అయోధ్యకు వెళ్ళుము."(16-18)

భరతు డా విధముగా కూర్చుండియే, అక్కడ ఉన్న పౌరులను, జానపదులను అందరిని చూచి, "మీరు అన్నగారికి ఏమియు చెప్పుటలేదేమి?" అని ప్రశ్నించెను.(19)

ఆ పౌరజానపదులు మహాత్ము డైన భరతునితో ఇట్లనిరి. "రాముని గూర్చి మాకు బాగుగా తెలియును. రాముడు చెప్పునది యుక్తముగా ఉన్నది. మహాభాగ్యశాలి యైన ఈ రాముడు తండ్రిమాటపై నిలబడియున్నాడు. అందుచేతనే మేము ఈతనిని మరలింపజాలకున్నాము."(20, 21)

వారి మాటలు విని రాము డిట్లు పలికెను. "ధర్మదృష్టి గల మన మిత్రులు చెప్పుచున్న మాట వినుము. నా మాటలు, వీరి మాటలు చక్కగా ఆలోచించి లెమ్ము. నన్నూ, ఉదకమునూ స్పృశించుము.(22, 23)

పిమ్మట భరతుడు లేచి ఆచమనము చేసి ఇట్లు పలికెను. "విద్వత్పరిషత్తులు, మంత్రులు, శ్రేణులు, నే జెప్పు మాటలు విందురు గాక! నే నెప్పుడు నాకు రాజ్యము ఇమ్మని తండ్రిని అడగలేదు. రాజ్యము వచ్చు నట్లు చేయు మని నా తల్లిని ప్రేరేపించలేదు. పరమధర్మవేత్తా, పూజ్యుడు అయిన రాముడు అరణ్యమునకు వెళ్ళవలె నని నేను ఎన్నడునూ సమర్థించలేదు. తండ్రి మాట ప్రకారము తప్పక

అరణ్యములో నివసించవలసి ఉన్నచో, నేనే పదునాలుగు సంవత్సరములు అరణ్యములో నివసించెదను."(24-26)

ధర్మాత్ము డైన రాముడు తన తమ్ముడు దృఢనిశ్చయముతో పలికిన ఆ మాటలు విని ఆశ్చర్యపడుచు పౌరులను జానపదులను చూచి ఇట్లనెను.(27)

"మా తండ్రిగారు జీవించి యుండగా చేసిన అమ్మకము, కుదువబెట్టుట, కొనుట మొద లైన వ్యాపారమును నేను గాని, భరతుడు గాని మార్చుటకు వీలు లేదు. వనవాసము విషయమున నాకు బదులు మరొకరిని ప్రతినిధిగా పంపుట అనునది చాలా జుగుప్సిత మైన పని. కైకేయి రాజ్యమును ఇమ్మని కోరుట యుక్తమే. తండ్రి పని కూడ యుక్తమే. భరతుడు ఓర్పు గలవాడు, పెద్దలను పూజించువాడు అని నాకు తెలియును. సత్యసంధుడు, మహాత్ముడు అయిన ఈ భరతునకు సమస్తము మంగళకరము అగును. నేను వనమునుండి తిరిగి వచ్చి, ధర్మశీలు డైన ఈ సోదరునితో కలసి ఈ భూమిని పాలించెదను. కైకేయి దశరథమహారాజును కోరెను. నేను ఆయన చెప్పి నట్లు వనవాసము చేయుచున్నాను. అందుచేత నీవు కూడ రాజ్యమును అంగీకరించి మహారా జైన తండ్రికి అసత్యదోషము కలుగకుండు నట్లు చేయుము.(28-32)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట పదకొండవ సర్గము సమాప్తము.

నూట పన్నెండవ సర్గము

రాముడు భరతునికి నచ్చచెప్పి, తన పాదుకల నొసగి పోయి రమ్మనుట.

అక్కడ చేరిన మహర్షు లందరు సాటిలేని తేజస్సు గల ఆ ఇరువురి సోదరుల, గగుర్పాటు కల్గించు ఆ సమాగమమును చూచి చాలా ఆశ్చర్యపడిరి. అక్కడ అంతర్ధానము చెంది ఉండి చూచుచున్న ఋషిగణములు, సిద్ధులు, దేవర్షులు మహాత్ములైన ఆ రామభరతులను ప్రశంసించిరి.(1, 2)

"ధర్మవేత్తలూ, ధర్మమునందు అత్యాసక్తి చూపించువారూ అయిన ఈ ఇద్దరిని కుమారులుగా కన్న దశరథుడు ధన్యుడు. వీరి సంభాషణము వినుటచే మనకు వీరిద్దరిపైనను మక్కువ కలుగుచున్నది కదా!"(3)

పిమ్మట ఋషు లందరు శీఘ్రముగా రావణసంహారము కావలె నను ఈ కోరికతో, కలిసి వచ్చి రాజశ్రేష్ఠు డైన భరతునితో ఇట్లు చెప్పిరి.(4)

"ఓ భరతుడా! నీవు ఉత్తమకులమందు పుట్టినావు. గొప్ప బుద్ధిమంతుడవు. మంచి ఆచారము కలవాడవు. గొప్ప కీర్తి గలవాడవు. నీవు, తండ్రిపై గౌరవభావ మున్నచో, రాముడు చెప్పినట్లు చేయుము. రాముడు తండ్రి ఋణమును తీర్చవలె నని మేము ఎల్లపుడు కోరుచున్నాము. దశరథుడు కైకేయి ఋణమును తీర్చివేయుటచేతనే స్వర్గమునకు వెళ్లగలిగినాడు."(5, 6)

గంధర్వులు, మహర్షులు, రాజర్షులు అందరు ఇంతమాత్రమే చెప్పి తమ స్థానములకు వెళ్ళిరి.(7)

చూచువారికి మంగళము ఇచ్చు రాముడు మంగళకర మైన, ఆ వాక్యము విని, సంతోషించినవాడై, వికసించిన ముఖముతో ఆ ఋషులను పూజించెను. భరతుడు మాత్రము చాలా భయపడుచు, అంజలి ఘటించి మాటలు తొట్రుపడ, రామునితో మరల ఇట్లు పలికెను.(8, 9)

"ఓ రామా! రాజధర్మము, కులధర్మము అవిచ్ఛిన్నముగా జరుగవలెనను విషయమును దృష్టిలో ఉంచుకొని నా ప్రార్థనను, నా తల్లి ప్రార్థనను మన్నింపుము. నే నొక్కడను విశాల మైన ఈ రాజ్యమును రక్షించుటకు, అనురాగము గల ఈ పౌరులను జానపదులను సంతోషపెట్టుటకును సమర్థుడను కాను. మన బంధువులు, సైనికులు, మిత్రులు, మన హితాభిలాషులు, అందరు భూమిని దున్నువారు మేఘములకై ఎదురుచూచునట్లు నీవే కావలె నని ఎదురుచూచుచున్నారు. ఈ రాజ్యమును స్వీకరించి, నిలబెట్టుము. ఈ లోకమును పాలించుటకు నీవే సమర్థుడవు."(10-13)

ప్రియముగా మాటలాడు ఆ భరతుడు, సోదరు డైన రాముని ఈ విధముగా ఎంతో ప్రార్థించుచు అతని పాదములపై పడెను. రాముడు భరతుని తన ఒడిలో కూర్చుండ బెట్టుకొని, ఇట్లు పలికెను.(14, 15)

"తండ్రీ! నీకు సహజముగాను, గురుశిక్షణవలన, ఉత్తమ మైన బుద్ధి ఉన్నది. దానిచే నీవు ఈ భూమిని పాలించుటకు సర్వవిధముల సమర్థుడవు. బుద్ధిమంతు లైన అమాత్యులతోను, మిత్రులతోను, మంత్రులతోను, కలిపి ఆలోచించి ఎంత పెద్ద వైనను కార్యము లన్నింటిని చేయించుము. చంద్రుని కాంతి తొలగిపోయిన



తొలగిపోవచ్చును. హిమవత్పర్వతమునందు మంచు లేకుండ పోయిన పోవచ్చును. సముద్రము తీరమును దాటిన దాటవచ్చును. నేను మాత్రము తండ్రి ప్రతిజ్ఞను అతిక్రమించను.(16-18)

తండ్రీ! నీతల్లి యైన కైక కోరిక వల్లనో, ఆశవల్లనో, నీ కొరకై ఇది అంతా చేసినది. నీవు దానిని మనస్సులో ఉంచుకొనకూడదు. తల్లిగా ఆమెను గౌరవించవలెను."(19)

రాముని మాటలు విని భరతు డిట్లు చెప్పెను.(20)

"పూజ్యుడవైన రామా! బంగారముచే అలంకరించిన ఈ పాదుకలపై నీ పాదము లుంచుము. ఈ పాదుకలే సమస్తలోకమునకు యోగక్షేమములు సమకూర్చగలవు."(21)

రాముడు పాదుకలను తొడిగికొని, మరల విడచి, వాటిని మహాత్ము డైన భరతునకు ఇచ్చెను.(22)

భరతుడు పాదుకలకు నమస్కరించి, రామునితో ఇట్లు చెప్పెను. "శత్రుసంహారకుడవు, వీరుడవు అయిన ఓ రామా! నేను జటలను, నారచీరలను ధరించి ఫలమూలములనే తినుచు, రాజ్యభారము నంతను నీ పాదుకలపై ఉంచి, నగరము బయటనే నీ రాకకై ఎదురుచూచుచు, పదునాలుగు సంవత్సరములు నివసించెదను. పదునాలుగు సంవత్సరములు గడిపిన పిదప మరుసటి దినమున నీవు నాకు కనబడక పోయినచో, నేను అగ్నిలో ప్రవేశించెదను.(23-25)

రాముడు భరతుని మాటలకు అంగీకరించి, అతనిని శత్రుఘ్నుని ప్రేమపూర్వకముగా కౌగిలించుకొని, భరతునితో ఇట్లనెను.(26)

"ఓ భరతా! నీ తల్లి యైన కైకేయిని భక్తితో చూచుకొనుము. ఆమెపై కోపము చూపకుము. నాపైనను, సీతపైనను, ఒట్టుపెట్టి చెప్పుచున్నాను." అని పలికి నేత్రముల నుండి కన్నీళ్లు కార్చుచు, భరతునకు వెళ్లుటకు అనుజ్ఞ ఇచ్చెను.(27,28)

ప్రతాపవంతుడు, ధర్మవేత్త అయిన భరతుడు, చక్కగా అలంకరింపబడిన ఆ

పాదుకలను పూజించి రామునకు ప్రదక్షిణముచేసి, ఆ పాదుకలను ఉత్తమ మైన ఏనుగుపై ఎక్కించెను.(29)

స్వధర్మముపై, హిమవత్పర్వతము వలె స్థిరముగా నిలబడిన ఆ రాముడు అచటకు వచ్చిన జను లందరిని, గురువులను, మంత్రులను, ప్రకృతులను భరతశత్రుఘ్నులను యథాప్రకారముగా అభినందించి వారిని పంపివేసెను. దుఃఖార్త లైన తల్లులు వారి కంఠములకు కన్నీళ్లు అడ్డుపడుటచే రామునకు వీడ్కోలు మాటలు చెప్పజాలకపోయిరి. అపుడు రాముడే తల్లు లందరికీ నమస్కరించి ఏడ్చుచు, తన పర్ణశాలలోనికి వెళ్ళిపోయెను.(30, 31)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట పన్నెండవ సర్గము సమాప్తము.

నూట పదమూడవ సర్గము

భరతుడు భరద్వాజుని కలిసికొని అయోధ్యకు మరలి వచ్చుట.

పిమ్మట శత్రుఘ్నసహితు డైన భరతుడు, రాముని పాదుకలను శిరస్సుపై ఉంచుకొని, సంతోషించుచు రథమును ఎక్కెను.(1)

అతని ముందు వసిష్ఠుడు, వామదేవుడు, వ్రతములలో స్థిరచిత్తుడైన జాబాలి, ఉత్తమ మైన ఆలోచనాశక్తి గల మంత్రులు, అందరూ వెళ్ళిరి. వారందరు చిత్రకూటపర్వతమునకు ప్రదక్షిణముగా తూర్పుదిక్కునకు అభిముఖులై, మందాకినీనది వైపు వెళ్ళిరి. అతడు సైన్యముతో కూడ వేలకొలది సుందరమైన అనేకవిధములైన ధాతువులను చూచుచు, ఆ పర్వతపార్శ్వమున ప్రయాణము చేసి వెళ్ళెను. అపుడు భరతుడు చిత్రకూటమునకు సమీపమునందు భరద్వాజమహర్షి నివసించు ఆశ్రమమును చూచెను.(2-5)

బుద్ధిమంతుడైన ఆ భరతుడు, భరద్వాజుని ఆశ్రమమునకు వెళ్ళి, రథమునుండి దిగి, ఆ మహాముని పాదములకు నమస్కరించెను. అతనిని చూచి సంతోషించిన భరద్వాజుడు "నీ కార్యము పూర్తియైనదా? రాముని కలిసినావా"? అని అడిగెను.(6,7)

ధీమంతు డైన భరద్వాజుని మాటలు విని, సోదరులపై ప్రేమ గల భరతుడు అతనితో ఇట్లు పలికెను.(8)

"దృఢ మైన పరాక్రమము గల ఆ రాముని గురు వైన వసిష్ఠుడు, నేను ప్రార్థింపగా, అతడు సంతోషించి వసిష్ఠునితో ఇట్లు చెప్పెను. "పదునాలుగు సంవత్సరములు నేను అరణ్యములో ఉండవలె నని నా తండ్రి చేసిన ప్రతిజ్ఞనే నేను పాలించెదను."(9,10)

మహాబుద్ధిశాలి, మాటలు చెప్పుటలో సమర్థుడు అయిన వసిష్ఠుడు ఆ మాటలు విని, మాటలలో నేర్పరి యైన రామునితో ఇట్లు పలికెను. "గొప్ప బుద్ధి కల ఓ రామా! నీవు బంగారముచే అలంకరింపబడిన నీ పాదుకలను సంతోషపూర్వకముగా ఇమ్ము. అవి ఆయోధ్యానగరములో ప్రజల యోగక్షేమములను సమకూర్చును." వసిష్ఠుని మాటలు విని రాముడు తూర్పుదిక్కుకు తిరిగి ఈ పాదుకలు తొడుగుకొని, రాజ్యము నడుపుటకై వీటిని నాకు ఇచ్చెను. మహాత్ము డైన రాముని అనుజ్ఞ పొంది, మంగళకరము లైన ఈ పాదుకలతో నేను మరల అయోధ్యకే వెళ్లుచున్నాను. (11-14)

మహాత్ము డైన భరతుని మంగళకర మైన మాటలు విని, భరద్వాజమహర్షి అధికముగా మంగళకరమైన మాట పలికెను. (15)

"ఓ నరశ్రేష్ఠుడా! మంచి శీలము, ఉత్తమ మైన చరిత్రము కలవారిలో శ్రేష్ఠుడా! విడచిన నీరు పల్లములో నిలచి నట్లు పూజ్య మైన లక్షణము లన్నియు నీయందు ఉండుటలో ఆశ్చర్యము లేదు. ధర్మజ్ఞుడు, ధర్మమునం దాసక్తి కలవాడు అయిన నీవంటివానిని పుత్రునిగా బడసిన నీ తండ్రి దశరథమహారాజు మరణించినను మరణించనివాడే."(16, 17)

మహాత్ముడైన ఆ భరద్వాజుని మాటలు విని, భరతుడు అంజలి ఘటించి అతని పాదములు స్పృశించి నమస్కరించుచు, ప్రయాణమునకు అనుమతి కోరెను. శ్రీమంతు డైన భరతుడు, భరద్వాజునకు అనేకపర్యాయములు ప్రదక్షిణపూర్వకముగా నమస్కారము చేసి, మంత్రులతో అయోధ్యకు వెళ్ళెను. (18, 19)

విశాల మైన ఆ భరతుని సేన అతనిని వెంబడించి వాహనములతోను, బండ్లతోను, అశ్వములతోను, గజములతోను, తిరిగి అయోధ్యవైపు మరలెను. పిమ్మట వారందరు తరంగముల పంక్తులతో నిండిన శ్రేష్ఠ మైన యమునానదిని దాటి, మరల పవిత్రము లైన జనములు గల, ఆ గంగానదిని చూచిరి. భరతుడు బంధువులతోను, సైనికులతోను, కలిసి రమ్య మైన జలముతో నిండిన ఆ గంగానదిని

దాటి, సుందర మైన, శృంగిబేరపురమును ప్రవేశించెను. శృంగిబేరపురమునుండి బయలుదేరి వెడలి అయోధ్యానగరమును చూచెను.(20-22)

తండ్రీ, అన్నా లేని అయోధ్యను చూడగానే దుఃఖముచేత పీడితు డై భరతుడు సారథితో ఇట్లనెను.(23)

"ఓ సారథీ! ఆ అయోధ్యానగరము పూర్తిగా చెడిపోయి, మంచి ఆకారము లేక, ఆనందహీనమై, దైన్యముతో మంచి ధ్వను లన్నియు నశించి ఏ మాత్రము ప్రకాశించుట లేదు."(24)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట పదమూడవ సర్గము సమాప్తము.

నూట పదునాల్గవ సర్గము

భరతు డయోధ్య దురవస్థను చూచుట. అంతఃపురమును ప్రవేశించి దుఃఖితుడగుట.

భరతుడు చెవుల కింపైన గంభీరధ్వని గల రథముపై ప్రయాణము చేసి అయోధ్యలోనికి ప్రవేశించెను.(1)

ఆ అయోధ్యలో పిల్లులు, గుడ్లగూబలు తిరుగుచుండెను. మనుష్యులు గాని, ఏనుగులు గాని బయట సంచరించుటలేదు. అందుచేత, చీకటి ఆవరించగా ప్రకాశము లేని రాత్రి వలె ఉండెను. ప్రకాశించుచున్న కాంతి గలదీ, ఎదురుగా నిలచిన క్రూరగ్రహముచేత పీడింపబడినదీ, చంద్రుని ప్రియభార్యా అయిన రోహిణి వలె ఆ అయోధ్య కాంతివిహీనముగా ఉండెను. వేడెక్కి కరిగిపోయిన స్వల్ప మైన జలముతో, పక్షు లన్నీ ఎండకు బాధపడుచుండగా, మీనములు, పెద్దమత్స్యములు, మొసళ్ళు అడుగున అణగి పడియున్న కృశించిన పర్వతనది వలె ఆ అయోధ్య శోభావిహీన మై ఉండెను. ప్రారంభమున పైకి ఎగురుచు, ధూమము లేకపోవుటచే బంగారము వలె ప్రకాశించుచు, పిదప హవిస్సు వేయగనే ఆరిపోయిన యజ్ఞమునందలి అగ్నిశిఖ వలె ఆ అయోధ్య శోభావిహీనమై ఉండెను. ఘోరయుద్ధమునందు కవచము లన్నీ బ్రద్దలై, ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, ధ్వజములు, క్రింద పడి, ఉత్తమవీరు లందరు మరణించగా గొప్ప ఆపదలో ఉన్న

సైన్యము వలె ఆ అయోధ్య భయంకరముగా కనబడుచుండెను.(2-6)

ఎక్కువ నురుగుతోను, ధ్వనితోను లేచి, ఇంతలో ప్రశాంత మైన వాయువు చెదరగొట్టుటచే, ధ్వని లేకుండా పోయిన సముద్రతరంగము వలె ఆ అయోధ్య ఎట్టి ధ్వనులు లేకుండ ఉండెను. యాగసమాప్తిదినము గడిచిన పిమ్మట, చుట్టు ప్రక్కల యజ్ఞమునకు సంబంధించిన ఉపకరణములు, ఉత్తము లైన ఋత్విక్కులు లేకపోవుటచే, నిశ్శబ్దముగా నున్న వేదిక వలె అయోధ్య ఉండెను. ఆ అయోధ్య, వృషభము దూరముగా వెళ్ళిపోగా, దానిపై అధికమైన ఆసక్తితో ఆర్తురాలై, గోష్ఠమధ్యములో నిలచి, కొత్త తృణమును మేయని గోవు వలె ఉండెను. ఆ అయోధ్య, చాలా నున్నగా ఉన్నవీ(అందమైనవీ) జ్వలించుచున్నట్లున్నవీ, మంచి జాతికి చెందినవీ అయిన పద్మరాగాదిమణులు లేని కొత్త ముత్యాలహారము వలె ఉండెను. ఆ అయోధ్య పుణ్యము క్షీణించుటచే స్థానమునుండి చలించి, కాంతియంతయు నశించగా ఆకాశమునుండి జారి తటాలున భూమిపై పడిన నక్షత్రము వలె ఉండెను.(7-11)

పుష్పములతో నిండి, మదించిన తుమ్మెదల రొజతో కూడిన వనలత, వసంతాంతమునందు దావాగ్నిచే వేడెక్కి, ఏ విధముగా వాడిపోవునో అయోధ్య ఆ విధముగా ఉండెను. అయోధ్యలోని కార్యాలయము లన్నీ ఏ పనులు లేకుండా ఉండెను. అంగళ్ళు, అంగళ్ళున్న వీధులు మూత బడి ఉండెను. ఈ విధముగా స్తబ్ధమై ఉన్న అయోధ్య మేఘము లావరించగా, చంద్రుడు, నక్షత్రములు కనబడకుండా పోయిన ఆకాశము వలె ఉండెను. చుట్టును బ్రద్ద లైన ఉత్తమపానపాత్రలు పడి ఉండగా, సంస్కారము లేక, శాలాధ్యక్షుడు మరణించిన పానభూమి వలె అయోధ్య కాంతిహీనమై ఉండెను. నేల పగిలి పల్లమై పోగా, బద్ద లైన పాత్రలు ఇటు అటు పడి ఉండగా త్రాగుటకు జలము లేక, విరిగి నేలపై బడిన చలివెందల వలె ఆ అయోధ్య కనబడుచుండెను. దీర్ఘము, తగిన త్రాళ్ళు కలది అయిన విశాల మైన నారి బలవంతుల బాణములచే ఛేదింపబడి, ధనస్సునుండి నేలపై పడిన ఎట్లుండునో అయోధ్య ఆ విధముగా ఉండెను.(12-16)

యుద్ధశూరు డైన రౌతు తటాలున ఎక్కి, యుద్ధరంగమునకు తీసికొనిపోగా, అక్కడ శత్రువులచే చంపబడి, నేలపై పడిన ఆడగుఱ్ఱము వలె ఆ అయోధ్య కనబడెను. నీరు ఎండిపోయి, అనేక మైన పెద్ద పెద్ద మత్స్యములు, కూర్మములు, బయటపడి ఉండగా, చుట్టుప్రక్కల నున్న తీరప్రదేశము బీటలువారియున్న,

ఉత్పలములు లేని, దిగుడుబావి వలె ఆ అయోధ్యానగరము కాంతివిహీనమై ఉండెను. పైన పూసుకొను చందనాదులు పూయక, భూషణములు ధరించక, శోకముతో బాధపడుచున్న దుఃఖితు డైన పురుషుని శరీరము వలె ఆ అయోధ్య ఉండెను. మంచి వర్షకాలమునందు, సూర్యుడు మేఘమండలములో ప్రవేశించగా నల్లని మేఘములచే కప్పబడిన సూర్యుని కాంతి వలె ఆ అయోధ్య ఉండెను.(17-20)

శ్రీమంతుడు, దశరథుని పుత్రుడు అయిన భరతుడు, రథమునందు కూర్చుండి, ఆ రథశ్రేష్ఠమును నడిపించుచున్న సారథితో, ఇట్లు పలికెను.(21)

"అయోధ్యానగరములో ఇపుడు గంభీర మైన గీతవాద్యాదుల ధ్వని పూర్వమునందు వలె సర్వత్ర వ్యాపించి వినబడుట లేదు. కారణ మేమో! మద్యగంధము, పుష్పమాలల సుగంధము, అగరుధూపముల సుగంధము అంతటను వ్యాపించి గుబాళించుటలేదు. రాముడు విడిచివెళ్ళిపోవుటచే, ఇపుడు ఈ నగరమునందు, శ్రేష్ఠమైన వాహనముల ధ్వని, మధుర మైన అశ్వముల ధ్వని, మదించిన గజముల ధ్వని, గొప్ప రథధ్వని వినబడుటలేదు.(22-24)

రాముడు అయోధ్యను విడిచి వెళ్ళిపోయిన పిమ్మట దుఃఖాక్రాంతులైన యువకులు చందనమును, అగరువును, ఇతర సుగంధద్రవ్యములను, శ్రేష్ఠము లైన క్రొత్త పుష్పమాలలను ధరించుట లేదు. ఈ అయోధ్యానగరము రామశోకముచే పీడితమై ఉన్నది. పౌరులెవ్వరు వివిధములైన పుష్పమాలలు ధరించి, విలాసయాత్రకై బయటకు వెళ్లుటలేదు. ఉత్సవము లేమియు జరుగుటలేదు. శోభ అంతయు నా సోదరునితో కలిసి, ఈ పురమును విడచి వెళ్ళిపోయినది. నిశ్చయము. ధారావర్షము పడుచున్నపుడు, కృష్ణపక్షరాత్రివలె ఈ అయోధ్యానగరము ప్రకాశించుటలేదు.(25-27)

నా సోదరు డైన రాముడు మహోత్సవము వలె వచ్చి గీష్మకాలమునందు మేఘము వలె, అయోధ్యకు ఎపుడు ఆనందమును కలుగజేయునో కదా! అయోధ్యలోని విశాలమార్గములు, అంద మైన వేషములు ధరించి సగర్వముగా నడచుచున్న యువకు లైన నరులతో ప్రకాశించుటలేదు.(28, 29)

భరతు డిట్లు అనేక విధములుగా మాట్లాడుచు తండ్రి గృహములోనికి ప్రవేశించెను. దశరథమహారాజు లేకపోవుటచే ఆ గృహము సింహము లేని గుహ వలె ఉండెను. ఆత్మస్థైర్యవంతు డైన ఆ భరతుడు, సూర్యుడు లేక దేవతలుకూడ

విడిచివేసిన దివసము వలె, కాంతిరహిత మై శూన్యముగా ఉన్న ఆ అంతఃపురము నంతను చూచి కన్నీళ్ళు విడచెను.(30, 31)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట పదునాలుగవ సర్గము సమాప్తము.

నూట పదిహేనవ సర్గము

భరతుడు నందిగ్రామమున కేగి రామపాదుకలకు రాజ్యాభిషేకమొనర్చి, రాజకార్యములను వానికే నివేదించుచు కార్యములు నిర్వహించుట.

దృఢ మైన వ్రతము గల భరతుడు తల్లులను అయోధ్యకు చేర్చిన పిదప, శోకసంతప్తు డై, వసిష్ఠాదిగురువులతో ఇట్లు చెప్పెను.(1)

"నేను ఇపుడు బయలుదేరి నందిగ్రామమునకు వెళ్ళుచున్నాను. మిమ్ముల నందరిని వీడ్కొనుచున్నాను. రాముడు లేకపోవుటచే కలిగిన ఈ దుఃఖము నంతను అక్కడ సహించెదను. దశరథమహారాజు స్వర్గస్థు డైనాడు. అన్నగారు వనములో ఉన్నాడు. నేను రాజ్యముచేయుటకొరకు రామునికై వేచి యుండెదను. మహాయశశ్శాలియైన అతడే రాజు కదా!"(2, 3)


మహాత్ము డైన ఆ భరతుడు పలికిన మంగళకరము లైన మాటలు విని పురోహితు డైన వసిష్ఠుడు, మంత్రు లందరును ఇట్లు పలికిరి.(4)

"ఓ భరతుడా! సోదరప్రేమచే నీవు పలికిన ఈ మాట చాలా శ్లాఘింపదగినది. ఇట్టి మాట చెప్పుట నీకే తగును. బంధువులయం దాసక్తి కలవాడవు, స్థిర మైన సోదరస్నేహము కలవాడవు, పెద్దల మార్గము అనుసరించుచున్నవాడవు అయిన నీవు చెప్పినది ఎవరు అంగీకరించరు?"(5, 6)

తన ఇష్టమును అనుసరించి, మంత్రులు పలికిన ప్రియ మైన ఆ మాటలు విని భరతుడు, "నా రథమును సిద్ధము చేయుము." అని సారథిని ఆజ్ఞాపించెను.(7)

శ్రీమంతు డైన ఆ భరతుడు, సంతోషించి తల్లు లందరికి నమస్కరించి, శత్రుఘ్నసహితు డై రథము ఎక్కెను.(8)

భరతశత్రుఘ్ను లిద్దరు చాలా సంతోషించుచు, శీఘ్రముగా రథమును ఎక్కి




మంత్రులతోను, పురోహితులతోను కలిసి శీఘ్రముగా వెళ్ళిరి. గురువు లైన వసిష్ఠాదిబ్రాహ్మణు లందరు ఎదుట తూర్పుదిక్కునకు అభిముఖులై నందిగ్రామము ఉన్న వైపు వెళ్ళిరి. భరతుడు వెళ్లగానే అతడు పిలవకపోయినను గజాశ్వరథములతో నిండిన సేన, పౌరులందరూ అతని వెనుక వెళ్ళిరి.(9–11)

సోదరులయందు అత్యధిక మైన ప్రేమ గల, ధర్మాత్ము డైన ఆ భరతుడు, రథ మెక్కి పాదుకలు శిరస్సుపై ఉంచుకొని శీఘ్రముగా నందిగ్రామమునకు వెళ్లెను. భరతుడు శీఘ్రముగా నందిగ్రామములో ప్రవేశించి రథము దిగి గురువులతో ఇట్లు పలికెను.(12, 13)

"మా అన్నగారు ఈ రాజ్యమును నావద్ద న్యాసముగా ఉంచి యోగక్షేమములు నిర్వహించుటకై, బంగారముచే అలంకరించబడిన ఈ పాదుకలను కూడా స్వయముగా ఇచ్చినారు."(14)

పిమ్మట భరతుడు ఉత్తమన్యాస మైన పాదుకలను శిరస్సుపై ఉంచుకొని దుఃఖపీడితుడై, సమస్త ప్రకృతిమండలముతో ఇట్లు పలికెను.(15)

"వెంటనే ఛత్రమును పట్టుడు. ఇవి మా అన్నగారి పాదములు. రాజ్యములో ధర్మము మా అన్నగారి ఈ పాదుకలే నిర్వహించును. నా మీద నున్న ప్రేమచేత మా అన్నగారు ఈ న్యాసమును నాకు అప్పగించినారు. ఆయన వచ్చువరకు నేను దీనిని పాలించెదను. నేను స్వయముగా ఈ పాదుకలు రాముడు వచ్చిన పిదప, అతని



పాదములకు తొడిగి పాదుకలతో కూడిన ఆ రామపాదములను చూచెదను.(16-18)

ఇపుడు ఈ రాజ్యభారము నామీద ఉంచబడినది. రాముడు వచ్చిన పిదప, నేను ఆయనను కలిసి ఆయనకు ఈ రాజ్యమును సమర్పించి, ఆయన శుశ్రూష చేసెదను. నా దగ్గర న్యాసముగా ఉంచిన పవిత్రములైన పాదుకలను, ఈ రాజ్యమును, ఆయోధ్యను కూడా రామునకు మరల సమర్పించి, నా పాపములను కడిగివేసుకొనెదను. రాముడు అభిషిక్తుడైన పిమ్మట జను లందరు మిక్కిలి సంతోషముతో ఆనందించెదరు. అపుడు నాకు రాజ్యమువలన వచ్చినదానికంటే నాలుగు రెట్లు ఎక్కువ ఆనందము, కీర్తి కలుగును."(19-21)

మహాకీర్తిశాలి యైన ఆ భరతుడు దుఃఖితు డై, దైన్యముతో ఈ విధముగా విలపించుచు, నందిగ్రామములో నివసించి, మంత్రులతో కూడి, రాజ్యము చేసెను. వీరుడు, ప్రభువు అయిన ఆ భరతుడు నారచీరలను, జటలను ధరించి, మునివేషముతో ఆ నందిగ్రామమునందు, సేనాసమేతుడై నివసించెను.(22, 23)

సోదరునియందు ప్రేమ గల భరతుడు, రాముని యాజ్ఞ ప్రకారము ప్రవర్తించుచు, తన ప్రతిజ్ఞను నిర్వర్తించుచు, రాముని పాదుకలకు అభిషేకము చేసి, రాముని రాకకు ఎదురుచూచుచు, నందిగ్రామములో ఆ విధముగా నివసించెను.(24)

భరతుడు ఆ పాదుకలకు సమస్తరాజకార్యములను విన్నవించుచు, వాటికి స్వయముగా ఛత్రచామరములు పట్టుచుండెను. శ్రీమంతు డైన భరతుడు, అన్నగారి పాదుకలకు రాజ్యాభిషేకము చేసి, వాటి క్రింద ఎల్లపుడు బంటు వలె ఉండి రాజ్యము చేసెను. ఏ కార్యము వచ్చినను, అమూల్య మైన ఏ ఉపాయనము ఎవరైన సమర్పించినను, భరతుడు ముందుగా వాటిని పాదుకలకు తెలిపి, తరువాత తగు విధముగా చేయుచుండెడివాడు.(25-27)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట పదిహేనవ సర్గము సమాప్తము.

నూట పదహారవ సర్గము

వృద్ధకులపతితో కూడి పలువురు ఋషులు చిత్రకూటము వీడి ఇతరములగు ఆశ్రమములకు పోవుట.

భరతుడు తిరిగి వెళ్ళిపోయిన పిమ్మట, రాముడు తపోవనములో నివసించుచు అక్కడ ఉన్న మహర్షులు భయపడుచున్నట్లు, ఆ ప్రదేశమును విడుచుటకై అభిలషించుచున్నట్లు గుర్తించెను. ఆ చిత్రకూటపర్వతముపై ఉన్న ఆశ్రమములో పూర్వము తనను ఆశ్రయించుకొని సంతోషముతో ఉన్నవారే ఇపుడు ఎందుకో కంగారు పడుచున్నట్లు రామునకు కనబడెను. ఆ మునులు భయపడుచు చూపులతోను, కనుబొమ్మల కదలికలతోను, రాముని వైపు సంజ్ఞలు చేయుచు, ఏమేమో గొణుగుకొనుచు, రహస్యముగా మాటలాడుకొనుచుండిరి.(1-3)

రాముడు వారి ఔత్సుక్యమును గుర్తించి, తనవలన ఏ మైన అపరాధము జరిగినదేమో అని శంకించెను. ఆ ఆశ్రమమునకు అధిపతియైన ఋషి వద్దకు వెళ్ళి, నమస్కరించుచు ఇట్లు పలికెను.(4)

"ఓ పూజ్యుడా! ఈ మహర్షు లందరిలో ఏదో మార్పు కనబడుచున్నది. నే నింతవరకు నడచిన నడతలో వికార మేదియు లేదు కదా? నా తమ్ముడైన లక్ష్మణుడు పొరపాటుచే ఏదైన చేయకూడని పని చేయలేదు కదా! నాకు అత్యాసక్తితో శుశ్రూష చేయుచు మీకు కూడ శుశ్రూష చేయుచున్న సీత మీ విషయమున స్త్రీ ప్రవర్తించవలసిన పద్ధతిలో ప్రవర్తించకుండగా లేదు కదా!"(5-7)

ఆ మాటలు విని, ముసలితనముచేతను, తపస్సుచేతను కూడ వృద్ధు డైన ఆ మహర్షి వణకుచు, భూతదయాశాలి యైన రామునితో ఇట్లు పలికెను.(8)

"తండ్రీ! సీత మంగళకరమైన స్వభావము కలది, ఎల్లపుడు మంగళకరము లైన కార్యములందే ఆసక్తి కలది. అట్టి సీతతో ధర్మలోపము ఎట్లు కలుగును? విశేషించి మునుల విషయమున ఎట్లు కల్గును?(9)

నీ మూలమున తాపసులకు రాక్షసులవలన ఆపద కలుగుచున్నది. ఆ కారణముచే భయపడినవారై వీరు రహస్యముగా మాటలాడుకొనుచున్నారు. తండ్రీ! ఇక్కడ రావణుని తమ్ముడైన ఖరు డనే రాక్షసుడు జనస్థానములో నున్న మునులను అందరిని, సమూలముగా చంపివేసినాడు. ధార్ష్ట్యము కలవాడూ, క్రూరుడూ, మానవభక్షకుడూ, యుద్ధములలో విజేతా, గర్వితుడూ, పాపాత్ముడూ అయిన ఆ

రాక్షసుడు నిన్ను చూచి ఓర్వజాలకున్నాడు.(10-12)

నీవు ఈ ఆశ్రమములో నివాసము ఏర్పరచుకున్నది మొదలు, రాక్షసులు మునులను బాధించుచున్నారు. ఆ రాక్షసులు జుగుప్స కల్గించునవీ, క్రూర మైనవీ, భయమును పుట్టించునవీ, వివిధరూపములలో నున్నవీ, వికృత మైన రూపము కలవీ, చూచుటకు వికారముగా ఉన్నవీ అయిన ఆకారములతో కనబడుచున్నారు. దుష్టు లైన రాక్షసులు, కొందరు మునులపై, అపవిత్రము లైన చెడ్డ పదార్థములు పడవేసి, యెదుట నిలచి, మరికొందరిని చంపుచున్నారు.(13-15)

నీచబుద్ధి గల ఈ రాక్షసులు, ఆశ్రమమునందు ఆ యా ప్రదేశములలో, తెలియకుండగా దాగి ఉండి, మునులను చంపుచు, ఆనందించుచున్నారు. హోమసమయమునందు, స్రుక్కులనూ, హోమద్రవ్యపాత్రలనూ పారవేయుచున్నారు. అగ్నిగుండములో నీరు పోయుచున్నారు. కలశలను బ్రద్దలు కొట్టుచున్నారు. ఇపుడు ఈ ఋషు లందరు, ఈ దురాత్ములు ఆక్రమించిన ఆశ్రమములను విడచి, మరి యొక ప్రదేశమునకు వెళ్లెదము అని నన్ను ప్రేరేపించు చున్నారు.(16-18)

ఆ దుర్మార్గులు మునుల విషయమున, శారీరక మైన హింస కూడ చేసెదరు. అందువలన ఈ ఆశ్రమమును మేము విడిచేసెదము. ఇక్కడికి సమీపమున అధిక మైన మూలఫలములు లభించు, చిత్రమైన వనము ఉన్నది. నేను, మునిగణము మరల ఆ ప్రాచీనాశ్రమమునే ఆశ్రయించెదము. ఆ ఖరుడు నీ విషయములో కూడ చెడ్డగా ప్రవర్తించగలడు. అందుచే నీకు ఇష్టమైనచో ఈ ప్రదేశమును విడచి మాతో రమ్ము.(19-21)

భార్యతో కూడిన నీవు, ఎంత జాగురూకతతో ఉన్నను, ఎంత సమర్థుడవైనను, సందేహమే కలుగుచుండును. ఇపుడు ఇక్కడ నీవు నివసించుటవలన కష్టము కలుగును."(22)

ఈ విధముగా చెప్పి ఆశ్రమమును విడిచి వెళ్ళిపోవుటకు వేగిరపడుచున్న ఆ మునిని ఎన్ని మాటలు చెప్పినను రాముడు వెళ్లకుండ చేయలేక పోయెను. ఆ కులపతి, రాముని అభినందించి, వీడ్కొలిపి, అతనిని అంగీకరింపచేసి, మునిసమూహములతో కలిసి, ఆ ఆశ్రమమును విడిచి వెళ్ళిపోయెను. రాముడు కొంత దూరము అనుసరించి వెళ్ళి, ఆ ఋషులను వీడ్కొలిపి, కులపతికి నమస్కరించి, అధికముగా సంతోషించి వారు ఉపదేశించిన విషయములు గ్రహించి, వారి అనుమతి పొంది, పవిత్ర మైన తన పర్ణశాలను చేరెను.(23-25)

ప్రభువైన ఆ రాముడు, ఋషులు లేని ఆ ఆశ్రమమును క్షణకాల మైనను విడువలేదు. ఋషుల ధర్మము నాచరించుటయందు వైశిష్ట్యమును పొందిన ఆ ఋషీశ్వరులు ఇంతవరకును రామునే అనుసరించి ఉండెడివారు కదా!(26)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట పదహారవ సర్గము సమాప్తము.

నూట పదిహేడవ సర్గము

రామాదులు అత్రిముని ఆశ్రమమున కేగి, ఆయనచే సత్కరింపబడుట. అనసూయ సీతను సత్కరించుట.

ఆ మును లందరు వెళ్ళిపోయిన పిమ్మట రాముడు బాగుగా ఆలోచించి, అనేక కారణములచేత, అక్కడ నివసించకూడ దని నిశ్చయించెను. "భరతుడు, తల్లులు, పౌరులు వచ్చి ఇక్కడనే నన్ను కలిసినారు. ఎల్లపుడు వారినిగూర్చియే దుఃఖించుచుండుటచే ఆ స్మృతియే వెంబడించుచున్నది. ఈ ప్రదేశమునకు దగ్గరగానే భరతుడు సేనానివేశము చేయుటచే, అశ్వగజముల పేడతో ఈ ప్రదేశ మంతా చెడిపోయినది. అందువలన మనము మరి యొక చోటకు వెళ్ళెదము." అని ఆలోచించి రాముడు సీతాలక్ష్మణసహితు డై, ప్రయాణ మయ్యెను.(1-4)

మహాయశశ్శాలి యైన రాముడు అత్రిమహాముని ఆశ్రమమును చేరి అతనికి నమస్కరించెను. ఆ మహాముని కూడ రాముని, పుత్రుని వలె ఆదరించెను.(5)

ఆ అత్రిమహాముని రామునకు యథావిధిగా ఆతిథ్యమునంతను స్వయముగా ఇచ్చి, మంచిమాటలతో లక్ష్మణునీ, మహాభాగ్యవంతురా లైన సీతనూ సంతోషపెట్టెను. ధర్మములు తెలిసినవాడూ, సమస్తప్రాణుల హితమును కోరువాడూ అయిన ఆ అత్రిమహాముని అటువైపు వచ్చిన వృద్ధురాలైన తన భార్యను గౌరవపూర్వకముగా పిలచి, ఆమె సమ్ముఖమున రామాదులను మంచి మాటలతో సంతోషపెట్టెను. ఆ అత్రిమహాముని, మహాభాగ్యవంతురాలు, తపోధనురాలు, ధర్మమును ఆచరించునది అయిన అనసూయతో "ఈ సీతను స్వీకరింపుము(గౌరవించుము)" అని పలికెను. ధర్మచారిణి యైన ఆ అనసూయను గూర్చి రామునకు ఇట్లు చెప్పెను.(6-8)

"ఓ రామా! ఈ అనసూయాదేవి పది సంవత్సరములు నిరంతరము అనావృష్టి

వచ్చి, లోక మంతయు కాలిపోవుచున్నపుడు, మూలములను, ఫలములను సృష్టించి, గంగానదిని ప్రవహింపచేసినది. అత్యుగ్రమైన తపస్సు గల ఈమె అనేక నియమములను పాటించినది. పదివేల సంవత్సరములు గొప్ప తపస్సు చేసినది. ఎన్నియో వ్రతములు పూర్తిచేసినది. దేవతలకు సహాయము చేయుటకై ఉద్యుక్తురాలై, అనేక విఘ్నములను తొలగించి, పది దివసములు ఒకే రాత్రిగా అగునట్లు చేసినది. ఈమె నీకు తల్లి వంటిది.(9-12)

తన పనులచేత అనసూయ(కోపములేనిది) అని లోకములో ప్రసిద్ధి చెందిన ఈమె సర్వప్రాణులకు నమస్కరింపదగినది. కీర్తిమంతురాలు. వృద్ధురాలు. ఎన్నడును కోపము ఎరుగనిది. అట్టి ఈమెవద్దకు సీత వెళ్ళుగాక!"(13)

రాముడు ఆ మహాముని చెప్పిన మాటలు విని, అటులనే అగుగాక అని పలికి, ధర్మజ్ఞురా లైన సీతతో ఇట్లనెను.(14)

"సీతా! ఈ మహాముని మాట విన్నావు కదా? వెంటనే తపోధనురాలైన ఈ అనసూయాదేవివద్దకు వెళ్లుము. నీకు శ్రేయస్సు కలుగును."(15)

సీత తన హితము కోరి రాముడు చెప్పిన మాట విని, ధర్మమును తెలిసిన ఆ అనసూయాదేవిని ప్రదక్షిణపూర్వకముగా సమీపించెను.(16)

మహాపతివ్రత, మహాభాగ్యవంతురాలు అయిన ఆ అనసూయ శరీరము వార్ధక్యముచే దుర్బలమై, ముడతలు పడి ఉండెను. జుట్టు తెల్లబడెను. ఆమె గాలిలో అరటిచెట్టు వలె వణకుచుండెను. అట్టి ఆ అనసూయాదేవికి సీత తన నామధేయము చెప్పుచూ, ఏకాగ్రతచిత్తముతో నమస్కరించెను. సీత ఎట్టి దోషములు లేని అనసూయాదేవికి నమస్కరించి, దోసిలి కట్టి నిలచి, ఆనందించుచు, "ఆరోగ్యముగా నున్నారా" అని ఆమెను ప్రశ్నించెను.(17-19)

అపుడు ఆ అనసూయాదేవి చాలా సంతోషించి, మహాభాగ్యవంతురాలు ధర్మమును ఆచరించునది అయిన ఆ సీతను ఓదార్చుచు ఇట్లు పలికెను. "భాగ్యవశముచేత నీవు ధర్మమును పాటించుచున్నావు. ఓ సీతా! నీవు మంచి భాగ్యవంతురాలవు. బంధుజనమును, అహంకారమును, ఐశ్వర్యమును విడచి నీవు అడవికి వెళ్లుచున్న రాముని వెంబడించి వచ్చుచున్నావు. ఏ స్త్రీలు తమ భర్త వనములో ఉన్నా, నగరములో ఉన్నా, పాపాత్ముడైనా, పుణ్యాత్ముడైనా, అతనిని అనుసరించి ఉండెదరో వారికి ఉత్తమలోకములు కలుగును. ఉత్తమస్వభావ లైన

స్త్రీలకు, భర్త - దుశ్శీలుడైనా, స్వేచ్ఛాచారి యైనా, దరిద్రుడైనా అతడే ఉత్తమదేవత.(20-23)

ఓ సీతా! నేను ఎంత ఆలోచించినను, భర్తను మించిన బంధువు నాకు కనబడుట లేదు. ఇతడు అనంత మైన తపస్సు వంటివాడు. కామమునకు వశమైన మనస్సుతో, భర్తలపై అధికారము వహించు దుష్టస్త్రీలు ఈ విధముగా మంచి చెడ్డలను తెలుసుకొనుటలేదు. ఉత్తమగుణవతు లై, లోకములోనే మంచిచెడుగులను చూడగల్గిన నీ వంటి స్త్రీలు మాత్రము అనేకధర్మకార్యములు చేసినవారి వలె, స్వర్గములో విహరించెదరు. అందుచే నీవు భర్తనే అనుసరించుచు, పతివ్రతల ఆచారమును పాలించుచు, నీ భర్తకు సహధర్మచారిణిగా ఉండుము. దానివలన నీకు యశస్సు, ధర్మము లభించును."(24-28)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట పదిహేడవ సర్గము సమాప్తము.

నూట పదునెనిమిదవ సర్గము

సీత, అనసూయ సంభాషించుట. అనసూయ సీతకు ప్రీతితో బహుమాన మిచ్చుట. అనసూయ ప్రశ్నించగా సీత తన స్వయంవరవృత్తాంతము తెలుపుట.

అసూయ లేని ఆ సీత, అనసూయాదేవి చెప్పిన మాటలు విని, ఆ మాటలు శ్లాఘించుచు, మెల్లగా ఇట్లు పలికెను.(1)

పూజ్యురాల వైన నీవు నాతో ఇట్లు పలుకుట ఆశ్చర్యము కాదు. స్త్రీకి భర్త పూజ్యు డను విషయము నాకు కూడ తెలియును. నా భర్త చరిత్రహీను డైననూ నేను అతనిని తప్పక పూజించవలసినదే. గుణములచేత శ్లాఘింపతగినవాడూ, దయామయుడూ, జితేంద్రియుడూ, స్థిరమైన ప్రేమ గలవాడూ, ధర్మాత్ముడూ, తల్లి వలె, తండ్రి వలె, చాలా ఇష్టుడు అయిన భర్త విషయమున వేరే చెప్పవలెనా.(2-4)

మహాబలశాలి యైన రాముడు కౌసల్య విషయమున ఏ విధముగా ప్రవర్తించునో, ఇతర రాజభార్యల విషయమునందు కూడ ఆ విధముగానే ప్రవర్తించును. దశరథమహారాజుపై ప్రేమ గలవాడూ, ధర్మవేత్తా, పరాక్రమవంతుడూ అయిన

రాముడు అహంకారము లేనివాడై దశరథుడు ఒక్కమాటు చూచిన స్త్రీలను కూడ తల్లులను వలె గౌరవించెను.(5, 6)

భయంకరమైన ఈ నిర్జనవనమునకు వచ్చుచున్న సమయమున అత్తగారు నాకు చేసిన ఉత్తమమైన ఉపదేశమును మనస్సులో ఉంచుకొని యున్నాను. పూర్వము వివాహసమయమునందు అగ్నిసన్నిధిలో, నాకు తల్లి ఉపదేశించిన మాటలు కూడ మనస్సులో ఉంచుకొన్నాను. నీ మాటలు వినగానే మా అత్తగారు, తల్లి చేసిన ఉపదేశములు మరల స్మృతికి వచ్చుచున్నవి. స్త్రీకి పతిశుశ్రూష తప్ప మరియొక తపస్సు విధింపబడలేదు.(7-9)

సావిత్రీదేవి పతిశుశ్రూష చేయుటచేత స్వర్గములో ప్రకాశించుచున్నది. అదే విధముగా ప్రవర్తించుచున్న నీవు కూడ పతిశుశ్రూషచేత స్వర్గమునకు వెళ్ళనున్నావు. సమస్తస్త్రీలలో ఉత్తమురాలైన రోహిణీదేవత చంద్రుని, క్షణకాల మైనను విడచి, ఆకాశమునందు కనబడదు. ఇట్టి ఎందరో ఉత్తమస్త్రీలు, భర్తల విషయమున దృఢ మైన నియమములు అవలంబించి, తాము చేసిన పుణ్యకర్మకు ఫలితముగా దేవలోకమునందు పూజింపబడుచున్నారు."(10-12)

పిమ్మట అనసూయాదేవి సీత మాటలు విని, చాలా సంతోషించి, ఆమెను శిరస్సుపై వాసన చూచి,(ప్రేమతో ముద్దు పెట్టుకొని) ఆమెకు సంతోషము కల్గించుచు, ఇట్లు పలికెను.(13)

"అంద మైన చిరునవ్వు గల ఓ సీతా! నేను అనేకవిధములైన నియమములు పాటించి సంపాదించిన గొప్ప తపస్సు ఉన్నది. దాని బలముచేత నీకు ఏమి కావలెనో ఇచ్చెదను; కోరుకొనుము. నీ మాటలు యుక్తముగాను, మనోహరముగాను ఉన్నవి. చాలా సంతోషించుచున్నాను. అందుకు తగినది ఏమి కోరెదవో చెప్పుము. ఇచ్చెదను."(14, 15)

సీత అనసూయాదేవి మాటలు విని, ఆశ్చర్యపడినదై, చిరునవ్వు నవ్వుచు, "ఇదియే చాలును, నీవు వరము నిచ్చినట్లే" అని తపోబలముతో కూడిన ఆమెతో పలికెను. ధర్మజ్ఞురా లైన ఆ అనసూయాదేవి సీత మాటలు విని ఇంకను సంతోషించినదై, ఇట్లు పలికెను. "ఓ సీతా! నాకు నీ విషయమున కలిగిన అధికసంతోషమును సఫలము చేసెదను. దివ్యములు, శ్రేష్ఠములు అయిన ఈ పుష్పమాలలను, వస్త్రమును, అలంకారములను, అంగరాగమును, శ్రేష్ఠ మైన మైపూతను ఇచ్చుచున్నాను. ఇవి ఎల్లపుడు అనుకూలముగా ఉండి నలగక నీ అవయవములకు శోభ కల్గించును.(16-19)

దివ్య మైన ఈ అంగరాగమును శరీరమునకు పూసుకొని, నీవు నాశరహితు డైన విష్ణువును లక్ష్మి శోభింపచేసినట్లు, నీ భర్తను శోభింపచేయగలవు."(20)

అనసూయాదేవి ఇచ్చిన వస్త్రమును, అంగరాగమును, భూషణములను, మాలికలను, సీత శ్రేష్ఠ మైన ప్రీతిదానముగా స్వీకరించెను. అధికమైన యశస్సు గల సీత, ఆ ప్రీతిదానమును స్వీకరించి, చేతులు జోడించి నమస్కరించుచు, అనసూయాదేవిని సేవించెను. స్థిర మైన నియమములు గల ఆ అనసూయాదేవి ప్రియ మైన విషయము నొకదానిని ప్రశ్నించుటకై, తన ప్రక్కనే కూర్చొని యున్న సీతతో ఇట్లు పలికెను.(21-23)

"ఓ సీతా! యశశ్శాలి యైన ఈ రాముడు నిన్ను స్వయంవరంలో పొందినా డను విషయమును నేను విని ఉన్నాను. ఆ వృత్తాంతమును సవిస్తరముగా విన గోరుచున్నాను. నీవు దానిని పూర్తిగా జరిగినది జరిగినట్లు చెప్పుము.(24, 25)

సీత ఆ మాటలు విని, చెప్పెదను వినుము అని పలికి, ధర్మాత్మురాలైన ఆ అనసూయకు ఆ కథ నంతను చెప్పెను.(26)

"మిథిలకు ప్రభువు, వీరుడు, ధర్మవేత్త అయిన జనకు డను పేరు గల ఒక మహారాజు, క్షత్రియధర్మమును పాలించుచు, న్యాయానుసారముగా భూమిని పాలించుచున్నాడు. ఆ రాజు నాగలి పట్టి మండలాకారముగా ఉన్న యజ్ఞభూమిని దున్నుచుండగా, నేను ఆ నేలను బ్రద్దలు కొట్టుకొని, పైకి వచ్చి ఆ రాజునకు కుమార్తెను అయినానట. ఆ క్షేత్రమునందు ఓషధీబీజములను పిడికిళ్ళతో చల్లు కార్యమునందు నిమగ్నుడైన ఆ జనకమహారాజు, శరీరమంతా పరాగము కప్పియున్న నన్ను చూచి ఆశ్చర్యపడెను. (27-29)

సంతానము లేని ఆ జనకమహారాజు నన్ను స్వయముగా లేవనెత్తి ఒడిలో కూర్చుండబెట్టుకొని, "ఈమె నా కూతురు" అని పలుకుచు నాపై స్నేహమును చూపెను. "ఓ రాజా! ఈమె మనుష్యజాతికి చెందినది కాదు. సాటి లేని దేవతా స్త్రీ. ధర్మముచేత నీకు ఈమె కూతురు అను విషయము సత్యమే." అని ఆకాశవాణి వినబడెను. ఆ మాట విని, ధర్మాత్ముడు, నరులకు ప్రభువూ, మిథిలాధిపతీ యైన నా తండ్రి, నన్ను పుత్రికనుగా సంతోషముతో చేరదీసెను. ఆ నాటినుండి అత్యధిక మైన అభివృద్ధిని పొందెను.(30-32)

పుణ్యాత్ము డైన ఆ జనకమహారాజు నన్ను తన పట్టపురాణికి చాలా ఇష్టమైన వస్తువును ఇచ్చి నట్టు ఇచ్చెను. స్నేహశీలురాలైన ఆమె నన్ను మాతృప్రేమతో



ఆదరించెను. (33)

నాకు వివాహమునకు తగిన వయస్సు వచ్చుట గమనించిన నా తండ్రి దీనుడై, ధనముపోయిన దరిద్రుడు ఎట్లు చింతించునో అట్లు చింతించెను. భూలోకములోని దేవేంద్రుని వంటివా డైనను కన్య తండ్రి తనతో సమాను లైన వారినుండీ, తనకంటె తక్కువవారినుండీ లోకములో తిరస్కారము పొందవలసి వచ్చును. అట్టి తిరస్కారము తనకు చాలా దగ్గరలో ఉన్నది అని గ్రహించిన జనకమహారాజు చింతాసముద్రములో పడి తెప్ప లేనివాడు వలె తీరమును చేరలేకపోయెను. (34-36)

నేను అయోనిజను అను విషయమును గుర్తించి, ఆ జనకమహారాజు ఎంత ఆలోచించినను నాతో సమానుడు, నాకు తగినవాడు అయిన భర్త ఆయన మనస్సుకు గోచరించలేదు. నిరంతరము ఆలోచన చేయగా చేయగా, బుద్ధిమంతు డైన ఆ జనకునకు "కుమార్తెకు స్వయంవరము చేసెదను" అను బుద్ధి కలిగినది. (37, 38)

పూర్వము ఒక మహాయజ్ఞమునందు మహాత్ము డైన వరుణుడు ఆ జనకమహారాజునకు శ్రేష్ఠ మైన ధనస్సును, తరగని బాణములు గల రెండు అంబులపొదులను ప్రేమపూర్వకముగా ఇచ్చియుండెను. ఆ ధనుస్సు చాలా బరువైన దగుటచే, దానిని మనుష్య లెవరు, ఎంత ప్రయత్నము చేసినను కదల్చజాలరు. రాజులు స్వప్నమునందు కూడ దానిని వంచుటకు సమర్థులు కారు. (39,40)

సత్యవాది యైన మా తండ్రి ముందుగానే రాజుల నందరిని పిలిచి, ఆ

ధనుస్సును గూర్చి వారితో ఇట్లు చెప్పెను. "ఎవడు ఈ ధనుస్సును ఎత్తి, దీనికి నారిని కట్టునో, అతనికి నా కుమార్తె నిచ్చి వివాహము చేసెదను. సందేహము లేదు."(41, 42)

ఆ రాజులు పర్వత మంత బరువు గల శ్రేష్ఠ మైన ధనుస్సును చూచి, దానిని కదల్చుటకు అసమర్థులై దానికి నమస్కరించి వెళ్ళిపోయిరి.(43)

చాలాకాలము గడిచిన పిమ్మట, గొప్ప కాంతిగలవాడు, సత్యమైన పరాక్రమము కలవాడు, రఘువంశసంజాతుడు అయిన ఈ రాముడు లక్ష్మణసహితు డై, విశ్వామిత్రుని వెంట యజ్ఞమును చూచుటకు వచ్చెను. ధర్మాత్ముడైన విశ్వామిత్రుడు, నా తండ్రి చేసిన పూజ నందుకొని సోదరు లైన ఆ రామలక్ష్మణులను గూర్చి అతనికి చెప్పెను.(44, 45)

"దశరథుని కుమారు లైన ఈ రామలక్ష్మణులు ధనుస్సును చూడగోరుచున్నారు. దేవతల ద్వారా లభించిన ఆ ధనుస్సును రాజపుత్రు డైన రామునకు చూపుము."(46)

విశ్వామిత్రుని మాటలు విని, మా తండ్రి ఆ ధనుస్సును తెప్పించగా మహాబలశాలీ, పరాక్రమవంతుడూ అయిన రాముడు రెప్పపాటుకాలములో దానిని వంచి నారి ఎక్కించి పూరించెను.(లాగెను.) రాముడు దానిని పూరించుచుండగా ఆ వేగమునకు అది మధ్యలో రెండు ముక్కలయ్యెను. అపుడు పిడుగు పడుచున్నపుడు వలె భయంకరమైన శబ్దము కలిగెను. సత్యప్రతిజ్ఞ గల నా తండ్రి నన్ను రామునకు ఇచ్చుటకై, జలకలశమును గ్రహించెను.(47-50)

అపుడు రాముడు తన తండ్రీ, ప్రభువూ అయిన దశరథమహారాజు అభిప్రాయము తెలుసుకొనకుండగా, నా తండ్రి ఇచ్చుచున్న నన్ను స్వీకరించ లేదు. పిమ్మట నా తండ్రి వృద్ధు డైన మామగారు దశరథమహారాజును పిలిపించి బుద్ధిమంతుడుగా ప్రసిద్ధు డైన రామునకు నన్ను ఇచ్చెను.(51, 52)

నా తండ్రి స్వయముగా నా సోదరి, ఉత్తమశీల, చూచుటకు ప్రియముగా నుండునది అయిన ఊర్మిళను లక్ష్మణునకు ఇచ్చి వివాహము చేసెను. నా తండ్రి అపుడు ఆ స్వయంవరము నందు, నన్ను రామునకు ఆ విధముగా ఇచ్చి వివాహము చేసెను. పరాక్రమవంతులలో శ్రేష్ఠు డైన భర్తపై ధర్మానుసారముగా అనురాగము కలదాన నై ఉన్నాను."(53, 54)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట పదునెనిమిదవ సర్గము సమాప్తము.

నూట పందొమ్మిదవ సర్గము

అనసూయ అజ్ఞాపించగా, సీత ఆమె యొసగిన వస్త్రాభరణములు దాల్చి రాముని చెంతకు వచ్చుట. రాముడు లా రాత్రి ఆశ్రమమున గడిపి ప్రాతఃకాలమున వేరొకచోటికి పోవుటకై ఋషులను సెలవడుగుట.

ధర్మజ్ఞురా లైన అనసూయ, పవిత్ర మైన ఆ కథను విని, సీతను శిరస్సు పై ఆఘ్రాణించి, బాహువులతో కౌగిలించుకొనెను.(1)

"నీవు అక్షరములు, పదములు స్పష్టముగా నుండునట్లు మధురముగా ఆశ్చర్యకర మైన రీతిలో మాటలాడినావు. నీ స్వయంవరము ఎట్లు జరిగినదో ఆ విషయము నంతను వింటిని. నీ కథ వినుటచే నాకు ఆనందము కలిగినది. రాత్రి దగ్గర పడు నట్లు చేసి, సూర్యుడు అస్తమించినాడు. ఆహారము కొరకై, పగలు సుదూరప్రదేశములకు వెళ్ళి సాయంకాలమునందు తమగూళ్లలో నిద్రకొరకై అణిగి ఉన్న పక్షుల ధ్వని వినబడుచున్నది. ఈ మునులు కూడ స్నానములు చేసి, జలపూర్ణము లైన కలశలను చేతులలో గ్రహించి, నీటితో తడిసిన నారచీరలతో గుంపులుగుంపులుగా వచ్చుచున్నారు.(2-5)

ఋషులు సాయంకాలము చేయవలసిన అగ్నిహోత్ర మను హోమము యథావిధిగా చేయగా, పావురము శరీరము రంగులో ఉన్న ధూమము గాలిచే ఎగురగొట్టబడి, కనబడుచున్నది. చుట్టుప్రక్కల ఉన్న స్వల్ప మైన ఆకులు గల చెట్లు కూడ దట్టముగా ఉన్నట్లు కనబడుచున్నవి. ఈ ప్రదేశమున ఇంద్రియములు (నేత్రములు) దుర్బలములుగా చేయబడుటచే దిక్కులు ప్రకాశించుటలేదు. రాత్రి సంచరించు జంతువులు నలువైపుల సంచరించుచున్నవి. ఈ తపోవనమృగములు వేదులయందు, తీర్థములందు శయనించుచున్నవి.(6-8)

ఓ సీతా! నక్షత్రములచే అలంకృత మై, రాత్రి ప్రారంభ మైనది. చంద్రుడు వెన్నెలను కప్పుకొని, ఆకాశమునందు ఉదయించినాడు. అనుజ్ఞ ఇచ్చుచున్నాను. ఇక నీవు రాముని వద్దకు వెళ్లుము. నీ ఘనమైన మాటలకు చాలా సంతోషించినాను. ఓ సీతా! నా యెదుటనే నీవు అలంకరించుకొనుము. దివ్యాభరణములచే శోభితురాల వై, నాకు ఆనందమును కల్గించుము."(9-11)

దేవకన్యతో సమానురా లైన ఆ సీత, అనసూయాదేవి కోరిక ప్రకారము అలంకరించుకొని, ఆమెకు శిరస్సు వంచి నమస్కరించి, రాముని వద్దకు వెళ్ళెను.

మాటలాడువారిలో శ్రేష్ఠ డైన రాముడు ఆ విధముగా అలంకరించుకొని వచ్చిన సీతను చూచి, అనసూయాదేవి ప్రేమపూర్వకముగా ఇచ్చిన ఉపాయమునకు సంతోషించెను. అనసూయాదేవి ప్రేమపూర్వముగా తన కిచ్చిన వస్త్రములను, అలంకారములను, పుష్పమాలలను, సీత రామునకు చూపించెను.(12-14)

మనుష్యులలో ఎవ్వరికిని లభింపజాలని, సీతకు జరిగిన సత్కారము చూచి, రాముడు, లక్ష్మణుడు సంతోషించిరి. రాముడు తపస్సిద్ధులైన మునీశ్వరుల ఆతిథ్యమును స్వీకరించి, సంతోషించి, పవిత్రమైన ఆ రాత్రిని అక్కడ గడపెను.(15,16)

ఆ రామలక్ష్మణులు రాత్రి గడచిన పిమ్మట, స్నానము చేసి, అగ్నిహోత్రమును పూర్తిచేసి, అగ్నిహోత్రమును పూర్తిచేసుకొని ఉన్న ఆ ఆశ్రమములో నివసించు మునులను వీడ్కొనిరి. వనములో నివసించుచు ధర్మాచరణము చేయుచున్న ఆ మునులు, ఆ వనములోని మార్గ మంతయు రాక్షసుల ఉపద్రవముతో కూడిన దని రామలక్ష్మణులకు చెప్పిరి.(17, 18)

రామా! ఈ మహారణ్యములో, పురుషులను భక్షించు, వివిధములైన రూపములు గల రాక్షసులూ, రక్తము త్రాగు క్రూరమృగములూ నివసించు చున్నవి. ఈ మహారణ్యములో, ఎవ్వ రైన ముని ఉచ్ఛిష్టుడుగా గాని, ఏమరుపాటుతో గాని, ఉన్నచో వానిని రాక్షసులు తినివేయుచుందురు. వారిని నివారింపుము.(వాళ్ళను తప్పించుకొని వెళ్లుము). ఫలములు తెచ్చుకొనుటకై అరణ్యములలోనికి వెళ్లు మహర్షులు ఈ మార్గమును ఉపయోగించుచుందురు. దుర్గమ మైన వనములోనికి నీవు ఈ మార్గమున ప్రవేశించినచో అనుకూలముగా ఉండును."(19-21)

సీతాలక్ష్మణ సమేతుడైన, శత్రుసంహారకుడైన ఆ రాముడు ఉత్తమమైన తపస్సు గల ఆ మునులు నమస్కరించుచు చేసిన స్వస్త్యయనమును స్వీకరించి సూర్యుడు మేఘమండలములో ప్రవేశించి నట్లు వనములో ప్రవేశించెను.(22)

శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండలోని నూట పందొమ్మిదవ సర్గము సమాప్తము.

అయోధ్యాకాండ సమాప్తము

సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మాశ్రితా సదా,
సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరం పదమ్.

(అయోధ్యాకాండ: సర్గ. 109. 13)

ఈ లోకములో సత్యమే ఈశ్వరుడు. లక్ష్మి ఎల్లప్పుడూ సత్యమునే ఆశ్రయించి ఉండును. అన్నిటికిని సత్యమే మూలము. సత్యమును మించిన ఉత్తమ ధర్మ మేదియును లేదు.

యన్మాతాపితరౌ వృత్తం తనయే కురుతః సదా,
న సుప్రతికరం తత్తు మాత్రా పిత్రా చ యత్కృతమ్.
యథాశక్తి ప్రదానేన స్వాపనోచ్ఛాదనేన చ,
నిత్యం చ ప్రియవాదేన తథా సంవర్ధనేన చ.

(అయోధ్యాకాండ: సర్గ. 111. 9, 10)

తల్లిదండ్రులు పుత్రుని విషయమున ఎల్లప్పుడూ ఏ విధముగా ప్రవర్తించుచుందురో దానికిని యథాశక్తిగా ఆ యా వస్తువులను ఇచ్చి, నిద్రపుచ్చుచు. స్నానాదులను చేయించుచు, నిత్యము మంచిమాటలు చెప్పుచు పెంచుచు ఏ ఉపకారము చేయుదురో దానికిని ప్రత్యుపకారము చేయుట (ఎవనికినీ) శక్యమైన పని కాదు.



TLP PUBLISHERS

9 788192 771519